

ఆంధ్రపత్రిక

ప్లవ ఉగాది సంచిక

వెల రు.2 1961 - '62

ప్రమాద రక్షణకు
ప్రశస్తమైనది
భీమా

ఎప్పుడే ప్రమాదం వచ్చేది, ఏ క్షణం ఎలావుండేదీ
తెలియని ఈ రోజులలో

అగ్ని ★ మోటార్ కారు ★ కార్మిక నష్ట పరిహారం
నౌకా ★ ఫయుడిలిటీ గ్యారంటీ ★ మొదలైన భీమాలకు

మాతో సంప్రదించండి:

యునైటెడ్ ఇండియా ఫైర్ అండ్
జనరల్ ఇన్సురెన్సు కంపెనీ లిమిటెడ్

"బాంబే లైఫ్ బిల్డింగ్సు"

బ్రాడ్వే - మద్రాసు

Telephone 21378 / 21379



Telegrams "UNIGEN"

బ్రాంచీలు:

విజయవాడ-బెంగుళూరు-బొంబాయి-కలకత్తా-న్యూఢిల్లీ-పాట్నా-కొలంబో-సింగపూర్.

ఆంధ్రపత్రిక

ప్లవ సంవత్సరాది సంచిక

[ఏబదిరెండవ సంచిక]

[1961-62]



సంపాదకుడు:

శివలెంక శంభుప్రసాద్



వెల: రూ. 2

ఆంధ్రపత్రికా కార్యాలయమున ముద్రితము

సంచిక 52	# ప్లవ సంవత్సరాది సంచిక	సంవత్సరము 1961-62

విషయానుక్రమణిక

త్రివర్ణ చిత్రాలు:

ADVERTISERS' INDEX

ఓమ్

ప్రస్తావన

శార్వరి సంవత్సరం వికారినాటి వికారాలను శర్వుని వలె సమయించి, ప్రపంచంలో నిర్వికారతను నెలకొల్పగలదనే ఆశలను అంతగా ఫలింపజేయలేదు సరి కదా, శర్వరివలె పెక్కు సమస్యలపై యింకా చీకటి పొరలను కప్పిపెట్టింది. జాతీయాంతర్జాతీయ సమస్యలు పెక్కు గొంగళి సామెతగానే ఉండిపోయాయి. పోరు ముసురుల కారుతనం కూడా కొరవడలేదు.

ఈ కదనభీతి కాదంబినిని కదల్చివేసి శాంతిని నెల కొల్పాలనే సంకల్పంతో ఐదేళ్లతర్వాత తొలిసారిగా పారిస్ నగరంలో జరిగిన అధినాయక సమావేశం పురిటి లోనే సంధి దెబ్బతిన్నది. దీనికి కారణం, సోవియట్ యూనియన్ ప్రధాని శ్రీ కృశ్చేవ్ వైఖరేనని పశ్చిమ రాజ్యాల నాయకులు విమర్శించగా, అమెరికా తన గూఢచారి విమానాలను రష్యా మీదికి పంపడంవంటి చర్యలేనని శ్రీ కృశ్చేవ్ ప్రతివిమర్శ చేశాడు. అటు తర్వాత జరిగిన ఐక్యరాజ్యసమితి సమావేశాలు కూడా ప్రపంచశాంతికి దారి చూపలేక పోయాయి. దీనికి హేతువుకూడా అమెరికా రష్యాల వైఖరిలో మార్పు లేక, మునుపటి ఆవేశకావేషాలు అణగారక పోవడమే. వీటి పరస్పర విద్వేషాన్ని తొలగించడానికి భారత ప్రధాని శ్రీ నెహ్రూచేసిన ప్రయత్నమూ విఫలమైంది. ఐక్యరాజ్య సమితిలో సభ్యత్వం గల దేశాలు 99 లోను ఆసియా, ఆఫ్రికా, మధ్యప్రాచ్యదేశాల సంఖ్యా బలం 54 అయినా, అగ్రరాజ్యాల పలుకుబడే హెచ్చు కావడం వల్ల రష్యా అమెరికాల సహకారం లేనిదే ప్రచ్ఛన్నయుద్ధం తొలగదు.

ఈ ప్రచ్ఛన్నయుద్ధం వెర్రితలలు వేసినదానికి తార్కాణ ఆఫ్రికా ఖండదేశాల పరిస్థితి. సామ్రాజ్య వాదుల చూపులో మార్పు పూర్తిగా రానందున అటు దక్షిణాఫ్రికాలో, ఇటు అల్జీరియాలో, మరొకవైపు కాంగోలో, వేరొకదిశ అంగోలాలో కల్లోలం, కుట్రలు ప్రబలినవి. కాంగోకు బెల్జియం ఒకచేత స్వాతంత్ర్యం ఇచ్చినట్టే యిచ్చి, మరొకచేత కుతంత్రాలు పన్నడం వల్ల, ప్రథమప్రధాని పాట్రిస్ లుముంబా తనసేనాని మొబుటూకే బందీఅయి, అతి రహస్యంగా హతు డయాడు. ఐక్యరాజ్య సమితి కూడా అతని ప్రాణాలు కాపాడలేకపోయింది. బెల్జియం భేదోపాయంలో బిగు సుకుపోయిన కాంగోనాయకులు ప్రపంచాభిప్రాయానికి కూడా వెరవక అత్యాచారాలు సాగించారు.

ఆఫ్రికాఖండంలోని మరొకదేశం సోమాలీ లాండ్ స్వతంత్రమైనా, ఘనా-గినీ-మాలీ యూనియన్ ఏర్పడినా, ఇథియోపియాలో కుట్రలు అణచివేయబడినా, ఆఫ్రికా ప్రజల సమైక్యానికి సహజమైన అవరోధాలు కొన్ని ఉన్నాయి. ఆఫ్రికాలో అరబ్ జాతి దేశాలకు, నీగ్రోతెగలకు సమానమైన ఉద్యమప్రాతిపదిక లేక పోవడమే అది. అలాటిది ఏర్పడిననాడు ఆఫ్రికాగడ్డపై విదేశీయు డెవడూ నిలువలేడనడం నిస్సంశయం.

సమీపంలోని సైప్రస్ స్వాతంత్ర్యం పొంది, ప్రజాస్వామ్య వ్యవస్థను చవిచూడ నుండగా, ప్రజా స్వామ్యం ఉన్న టర్కీలో హఠాత్తుగా సైనిక విప్లవం సంభవించి, జనరల్ గుర్సెల్ సైనికపరిపాలన స్థాపించడం వింతగా వుంది. మధ్యప్రాచ్యంలోని కొన్ని దేశాలు అటు రాజరికపు ఛాయ అయిన నియంతృత్వానికి, ప్రజాస్వామ్యానికి మధ్య ఊగిసలాడుతున్న వనడానికి ఇదొక నిదర్శనం.

ఇటు దూరప్రాచ్యంలో ఇండోచైనాలోని లావోస్‌లో అంతర్యుద్ధం ప్రారంభమైంది. వామపక్షాలకు చైనా రష్యాలు; దక్షిణ పక్షాలకు అమెరికా మద్దత్తు చేస్తున్నాయి. ఈ నిప్పు ఎంతమేర ఆక్రమించుకుంటుందో చెప్పలేము. చైనా ఉత్తర వియత్‌నాం గుండాను, పాకిస్తాన్ ఆగ్నేయాసియా రక్షణ వ్యవస్థ సాకుతోను జోక్యం చేసుకుంటే, భారతదేశం ముంగిటే రణరంగమని రక్షణమంత్రి శ్రీ కృష్ణమీనన్ అననే అన్నారు.

దక్షిణ కొరియాలో పుష్కరం పాటు ఏకచ్ఛత్రాధిపత్యం వహించిన డాక్టర్ సింగ్మన్ రీ జన వాక్యానికి తలఒగ్గి తన పదవికి రాజీనామా యిచ్చాడు.

జపాను అమెరికాతో చేసుకొన్న రక్షణసంధికి నిరసనగా జపాన్ అంతటా అల్లర్లు చెలరేగాయి. కిషీ ప్రభుత్వంరాజీనామా యివ్వాలని ప్రదర్శనాలు జరిగాయి. విద్యార్థులు కిషీ భవనం చుట్టుముట్టారు. ఎవరో అతనిని బాకుతో పొడిచారు కూడా. అతడు రాజీనామా యిచ్చాడు. కొత్త ఎన్నికల తర్వాత ఇకేడ ప్రధానిగా నూతన ప్రభుత్వం గద్దెకు వచ్చింది.

మన యిరుగు పొరుగు దేశాలలో, దక్షిణాన ఉన్నలంకలో ముఖ్యమంత్రి శ్రీ భండారనాయకే హత్య తర్వాత ఎన్నికలు జరిగాయి. శ్రీ భండారనాయకే సతీమణి శ్రీమతి సిరిమావో నాయకత్వాన శ్రీ లంక ఫ్రీడం పార్టీ గెలుపొందింది. ఆమె ప్రధానిగా నూతన ప్రభుత్వం ఏర్పడింది. మహిళ ప్రధాని కావడం ప్రపంచంలో ఇదే ప్రథమం.

ఉత్తరాన పాకిస్తాన్‌తో మనకు సరాసరి రైలు ప్రయాణాల ఒడంబడిక, సింధునదీ జలాలవినియోగంపై ఒప్పందం, పశ్చిమబెంగాల్‌లోని బెరూబారీ పాకిస్తాన్‌కు అప్పగింత జరిగినా, ప్రధానమైన కాశ్మీరు వివాదం పరిష్కారం కాలేదు.

ఈశాన్య దిక్కున మన సరిహద్దులపై చైనా చల్లగా చేతులు చాపడం మానలేదు. చైనా ప్రధాని చౌ ఎన్-లై శార్వరి ప్రారంభంలో భారతదేశానికి వచ్చి, శ్రీ నెహ్రూతో చర్చించినా ఫలితం శూన్యం. అధికారుల హోదాలో జరిగిన సమావేశమూ నిష్ప్రయోజనమైంది. చైనా లోంగ్జూ అనే ప్రాంతంనుంచి తన సైన్యాన్ని ఉపసంహరించుకున్నా, మెక్‌మాహన్ శ్రేణిని మాత్రం ససేమిరా గుర్తించనని భీష్మించుకొన్నది; మరొకవైపు సిక్కింలోను అక్రమంగా ప్రవేశిస్తున్నది; ఎవరెస్టు తనదేనని, అనడమే కాక, బదరీనాథాలయప్రాంతం కూడా తనదేనని ప్రచారానికి పూనడం ఆందోళన కలిగిస్తున్నది. ఇటీవల భూటాన్ మహారాజు మన రాజధానికి వచ్చి చైనా-భూటాన్-ఇండియా సరిహద్దులను గూర్చి మన ప్రధానితో చర్చించి నిర్ణయాలు జరుపడం గమనించ దగిన సంగతి.

నేపాల్‌లో విడ్డూరమొకటి జరిగింది. రాజు మహేంద్ర శ్రీ విశ్వేశ్వర ప్రసాద్ కోయిరాలా నాయకుడుగా ఏర్పడిన ప్రజాప్రభుత్వాన్ని బర్తరఫ్ చేసి, నూతన మంత్రివర్గం నియమించాడు. దీని పరిణామం ఏమిటో చెప్పలేము కాని, సావధానత అవసరమని మాత్రం అంగీకరించక తప్పదు.

ఇంతగా విశ్వాన్ని ఆవరించిన కారుచీకటిలోనూ కాంతిరేఖ కనిపించక పోలేదు. అమెరికా అధ్యక్షుడుగ డెమోక్రేట్ పార్టీ అభ్యర్థి జాన్ కెనెడీ ఎన్నిక కావడమే ఆ కాంతిరేఖ అని పెక్కు రాజ్యాలు భావిస్తున్నాయి. కెనెడీప్రభుత్వంతో సహకరించడానికి రష్యా కూడా సంసిద్ధత ప్రకటించింది.తనసద్భావానికిచిహ్నంగా కెనెడీ గూఢచారి విమానాల పర్యవేక్షణవంటివి ఆపివేశాడు. పటిష్ఠమైన సైనికశక్తి ఆధారంగా, రాయబారాల ద్వారా శాంతిని వ్యవస్థీకరించే విధానం అనుసరిస్తానని అతడు పదవీస్వీకరణ సందర్భంలో స్పష్టపరచాడు. ఈ భావాలు ఐక్యరాజ్య సమితి వైఖరినికూడా మార్చగలవనే ఆశ కలుగుతున్నది.

మరొక శుభ సూచన అంతర్జాతీయరంగంలో భారత ప్రతిష్ఠ పెరగడం. కాంగో కల్లోలాన్ని అణచివేయడానికి భారతదేశం తనసైన్యం పంపదలచడం ఈ ప్రతిష్ఠను ఇనుమడింపజేసింది.

బయట చుట్టూ ఇంతటి నిరాశాజనక పరిస్థితులున్నా, ఇంట దాదాపు ప్రతిరాష్ట్రంలోను-పంజాబులో పంజాబీ సూబా ఉద్యమం, ఉత్తరప్రదేశ్ లో కలహాలు, కాంగ్రెస్ వారిలో ముసలం పుట్టి సంపూర్ణానంద్ స్థానే గుప్తా ముఖ్యమంత్రి కావడం, మధ్యప్రదేశ్ లో అల్లర్లు, అస్సాం బెంగాలులలో భాషావివాదం, మైసూరు, ఆంధ్ర, ఒరిస్సా మంత్రి వర్గాలలో లుకలుకలు, కేంద్ర ప్రభుత్వోద్యోగుల సమ్మెలు వంటి-చిక్కులు ఏర్పడినా భారతదేశం ద్వితీయపంచవర్ష ప్రణాళికను సాధించింది; తృతీయ ప్రణాళికను పదివేలకోట్లకు పైబడిన పెట్టుబడితో అమలుజరుప నిశ్చయించింది. దీనివల్ల తను ఉద్దేశించిన పరిశ్రమాభివృద్ధి, సోషలిస్టు పద్ధతి సమాజ స్థాపన జరుగగలదనే కాంగ్రెస్ అభిప్రాయం. ఈ తృతీయ ప్రణాళికకు రష్యా 60 కోట్ల రూపాయలు సహాయం చేయనున్నది. పోలెండుతో దాదాపు 15 కోట్ల రూపాయల

అప్పుకు, ఇంగ్లండుతో 20 కోట్ల రూపాయల అప్పుకు ఒడంబడికలు కుదిరాయి. హంగేరితో కొత్త వ్యాపారపు ఒడంబడిక, అమెరికాతో ఇండియన్ ఇన్వెస్ట్‌మెంట్ సెంటర్ ఒప్పందం కుదిరాయి.

కాంబేలో, అంకాలేశ్వర్‌లో పెట్రోలు తియడానికి చేసిన ప్రయత్నం సఫలమైంది. అణుశక్తికేంద్రం తారాపూర్‌లో స్థాపించడానికి నిర్ణయమైంది. బొకారోక్, రాణీగంజ్‌లలో మూడు కొత్త బొగ్గుగనులు కనుగొనబడ్డాయి.

భాషా ప్రయుక్తరాష్ట్ర సిద్ధాంతం బొంబాయి రాష్ట్రం విభక్తమై మహారాష్ట్ర గుజరాత్‌లు ఏర్పడడంతో పూర్తయింది. కొహిమా పట్టణం రాజధానిగా ప్రత్యేక నాగరాష్ట్రం నెలకొల్పబడింది.

ఇక సాంస్కృతిక రంగంలో శార్వరిలో గొప్ప సంఘటనలు జరిగాయి. రాష్ట్రపతి రష్యాలో పర్యటించి వచ్చారు. దీనితో భారత రష్యా మైత్రి మరింత దృఢపడింది. బ్రిటిష్ రాణి, బ్రిటిష్ మాజీప్రధాని లార్డ్ అట్లీ భారత దేశంలో పర్యటించారు. శతవృద్ధు శ్రీ మోక్షగుండం విశ్వేశ్వరయ్యను భారత ప్రభుత్వం పెక్కురీతుల గౌరవించింది. రైల్వేబోర్డు 3, 4 తరగతుల రైల్వే ఉద్యోగుల జీతబత్యాలు హెచ్చించింది. దేశమంతటా జనాభాలెక్కల సేకరణ జరిగింది. విమానటపా శతవార్షికోత్సవం ప్రపంచంలో తొలిసారిగా మన దేశంలో జరిగింది.

దేశాన్ని ముసిరిన చిక్కుల నీడలు మన రాష్ట్రాన్ని కూడ చెనకకపోలేదు. అవి శార్వరి సంవత్సరారంభంలో పొడసూపినా, అంతంలో సులువుగా విచ్చిపోయాయి. ఏదో అనాహూతంగా పరిణమించగలదని భయపడిన రాష్ట్ర కాంగ్రెస్, మంత్రివర్గ కల్లోలం సుఖాంతనాటకమైంది. సమాజ వికాసపథకంలో మనది అగ్రస్థానమైంది. అధికార వికేంద్రీకరణం విషయంలోను మనదే ముందడుగు. జనాభా లెక్కలను - మూడు కోట్ల 60 లక్షలు - మొదట కేంద్రానికి అందజేసిన కీర్తి మనకే దక్కింది. వంశధార రిజర్వాయరును గొట్టవద్ద స్థాపించడానికి ఒరిస్సా అంగీకరించింది. ఎగువ సీలేరు విద్యుత్పథకం తొలిదశ కార్యక్రమం ప్రారంభమైంది. కొత్తగూడెంలోను, విశాఖపట్టణంలోను ఎరువుల ఫ్యాక్టరీలు నిర్మించడానికి కేంద్రం అంగీకరించింది.

దేశానికి కీర్తి ప్రతిష్ఠలు తెచ్చిన మహానాయకులు పండిట్ గోవిందవల్లభపంత్, డాక్టర్ శ్రీకృష్ణసిన్హా వంటివారు కాలధర్మం చెందడం విషాదకరం. ఈ విషాదం ఆంధ్రదేశాన్ని హెచ్చుగా ఈసారి పీడించింది. స్వాతంత్ర్య యోధుడు, వినయాశ్రమస్వామి అయిన శ్రీ గొల్లపూడి సీతారామశాస్త్రి, మహాప్రతిభావంతుడు మద్రాసు మాజీ ప్రధాన న్యాయమూర్తి సర్ ముత్తా వెంకటసుబ్బారావు, పత్రికా రచనా రంగంలో రారాజు శ్రీ కోటంరాజు రామారావు విద్యావేత్త, ఆర్థికశాస్త్ర నిపుణుడు, యూనివర్సిటీ గ్రాంట్స కమిషన్ అధ్యక్షుడు డాక్టర్ వి. ఎస్. కృష్ణ అస్తమించారు.

సాహిత్యరంగంలో ఈవిషాదం మరింతగా వ్యాపించింది. ఆస్థానకవి శ్రీ శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి, కథక చక్రవర్తి శ్రీ శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి, బాలసాహిత్య ప్రవర్తకుడు శ్రీ చింతా దీక్షితులు అస్తమించి తెలుగు సాహిత్యానికి తీరని లోటువాటిల్లజేశారు.

ఉన్న సమస్యలకు తోడు, క్రొత్త సమస్యలు కూడ పుట్టుకొని వచ్చాయి. కృష్ణా గోదావరి జలాల వినియోగంపై మహారాష్ట్ర మైసూరు రాష్ట్రాలతో వివాదం ఏర్పడింది. తిరుత్తని, ఆరణియార్ ప్రాంతాల కుందమార్పు జరిగినా సరిహద్దుసమస్య లింకా తీరవలసి వుంది. ఒక్క చెంగల్పట్టు జిల్లానుంచే మనకింకా 100 అప్పటమైన తెలుగు గ్రామాలు రావాలి. మహారాష్ట్ర మైసూరు సరిహద్దుల వివాదం ఇంకా బెల్గాంలో ప్రతిధ్వనిస్తూనే వుంది. గోవా, డయ్యూ, దామన్ల భవితవ్యం పరిష్కారం కావలసి వుంది.

అంతర్జాతీయ రంగంలోను కాంగో మొదలైన సమస్యలు తీరవలసివున్నవి. జాతి విద్వేషం మటుమాయం కావలసివుంది.

ఇవన్నీ ప్లవలో ఏలాటి ఉపప్లవం లేకుండా పరిష్కృతమై, మానవుని దృక్పథంలో, మనఃకుహారంలో విప్లవం ఏర్పడగలదని విశ్వసిస్తున్నాము.

కలకంఠము

శ్రీ మిరియాల రామకృష్ణ

చక్కని కొమ్మ పందిరుల చాయల నాకులఁ బెట్టు విందు లిం
పెక్క భుజించి, మద్దళ బహిర్గతపంచమరావముల్ వనీ
చిక్కణ దక్షిణానిలముచేఁ గొనియాడఁబడన్ హసించి పైఁ
గ్రక్కిన మేఘమత్సరత గాసిలి దూరము వోదు మౌనినై.

మూఁకలు మూఁకలై దరుల మూఁగిన కాకులు మామకీనమౌ
కాకలిలోని మాధురులఁ గన్గొని మచ్చరమెచ్చిపోవ "కా
ఖా కఖ" యంచు పైకెగిరి గంతులు వేయును; కాని మాధవ
శ్రీ కరుణాకటాక్షమున రేఁగవు నాయెద మౌనవేదనల్.

వచ్చిన చైత్రమే మరల వచ్చినయప్పుడు క్రొత్తక్రొత్తగా
విచ్చిన నాగళమ్ము గని వెక్కస మూనినవారి నోళులే
పుచ్చును నన్ను గెంటెడు విరోధుల కాకుల లెక్కలేదు నా
యిచ్చకు టెక్కులుం గలుగు నేనయి యెక్కెద నవ్యశాఖలన్.

పాయక యూఁపు కౌతుకము పండఁగ నీయదు నన్ను నంతర
స్నాయువులందు నుండి గళనాళము లోనికి నూఁదఁబడ్డ స
స్నాయిగ రాగరేఖ విడి నాయెద నిద్దుర నుండి లేపు నే
నో యిక గొంతునెత్త కెటులుందు నుగాదుల మేలుకొల్పులన్.

వేసవి సన్నగాలి పెదవిన్ గొను వేణుముఖమ్ము నాగళ
శ్రీసఖమౌచు మ్రోఁగ వనజీవన మాధురు లక్ష్యమై పురా
వాసనలెల్లఁ ద్రవ్వుకొనువానిని నన్ను విలాసరేఖలై
హాసమయూఖలై విరులనంటిన కొమ్మలు సూచు మెచ్చఁగన్.

లేశము నిల్వఁజాలను చలించెదు చిట్టిచివుళ్ళకెంపుపై
నాశలు వ్రాలునప్పుడు గళామృతవేణువు దివ్యనాద సం
దేశము నూఁదునప్పుడు మదిన్ వికసించెదు కౌతుకార్భటిన్
దేశములెల్ల మాధవుని దివ్యపదంబు గనన్ జరించెదన్.

నే నపుడీ యరణ్యమున నెట్టఁగఁబడ్డ విరాగివోలె నా
మౌనములోన నేనె పడి మానసమందునఁ జూతు నప్పుడే

యీ వనమోహనాకృతిగ నేర్పడి వచ్చిన రక్తపల్లవ
శ్రీ నను రాగకంఠరునిగఁ జేయును నాముఖమంటి చూపులన్.

నే నపుడీ మధూదయవనీ మధురాధర మట్టు లెట్టినో
దానిని మావిజొంపమును దాల్తును మోవికి మాధవార్పణం
బైన సుఖంబునన్ గళమహో యని విచ్చుచునుందు తత్కుహూ
స్వాన వికస్వరంబు ప్రసవంబు మధువ్రతుఁ బిల్చుచున్నటుల్.

ఆకృతి సూచి నన్నుఁగనవయ్యెడిఁగా దుదయప్రశాంత రే
ఖాకిరణంబు మీఁద వడిగాఁ బడు మబ్బును బోలె—పల్లవ
స్వీకృతి రాగ మబ్బఁగ వసించుచు వెల్తురులోన—నాకునే
నే కనిపించి దృశ్యము నదృశ్యముగా—కనరాకయుండెదన్.

ఉండిన నాల్గునాళ్ళు నొక యొప్పులకుప్పగ నుండు కోర్కెతో—
పిండిన వేదనాంబరము పీలికలెల్లను క్రొత్తయాకులో
పిండిన రంగుతోడ పెనవెట్టుచుఁ బాడెదు నాదు పాటలో
నుండిన తీపి తిన్నయవియో యనిపించును పండ్లు కొమ్మలన్.

ఓరగ నిల్చి కంటఁబడకుండఁగ జూచు నవోఢ వోలె స
న్నూర్చఁగజేసి యీగతి ముహుర్ముహురంతరజన్యమైన యీ
చీరెడు గొంతులోని యొక చెప్పఁగలేని తలంపు నా భవ
ద్వారమునందు నోరగిలి వాలి కనంబడకుండు ముగ్ధగన్.

ఈ వనజీవితానఁ గనిపింతురు నాయెద మెచ్చినట్టి మి
త్రావళి యిద్దరో ముగురో హాసము శబ్దము సానుభూతితో
నావృతమైన చూపు కలవై మదిలోపలి యేడ్పు కప్పికొం
చీవలికిన్ గనంబడుదు రెల్లరు కూరిమి గాటిపోవుచున్.

ఈ గోరవంక లీ శుకములీ మద బంభరముల్ వనిన్ సుధా
వాగతి సుందరార్థముల వానన లీనెడు సౌనునస్య రే
ఖాగళితార్ద్ర గీతముల గానము సేయఁగ నేను మాధవ
స్వాగత పల్లవంబులను—పాడెద నా పరమాత్మ తృప్తిగన్.

ఏ సడిలేని మాధవునికే బ్రదుకెల్ల సమర్పణంబుగాఁ
జేసిన నేను మత్సరముచేతను క్రోధముచే తమస్సుచే
గాసిలి సౌఖ్యభాస్యముల గర్జిలి నల్లఁదనాల నూని యే
వాసియు లేనివారి నెడఁబాసి ప్రవాసము సేయఁబోయెదన్.

ఆకుల చెక్కిళుల్ మెఱయ నామని పూవుల తెప్పమూతలో
భ్రూకుటి వంపులో కురులువోలిన తేఁటుల యాటలో సుధా
లోక మెదో సృజించుకొని లోపల చాయలు దీసి చూచు కొం
చీ కరణిన్ గృతుల్ తొలకరించెడుదాఁకను పాడ కెట్లగున్.

ఈ మెఱపట్టు దూది నునుమేకులఁ బోలిన యాకులన్ దరు
చ్ఛాయల రాగతంతువులు సన్నగ సన్నగ సాగి దీర్ఘమై
పోయెడుదాఁక తీయుపనిఁ బూనిన సన్నని యంబరమ్ము సం
దీయక యల్లు నేర్పున రహించెడు వాయువు సేరు నాశలన్.

నా చిఱుపాట నిండు పవనమ్ముల మెచ్చియొ మెచ్చకో యొకం
డేచిన కంఠమెత్తి నను హేళనమాడిన నేమిపోయె న
న్నూఁచిన కౌతుకంబు తెగ దొక్కవసంతము చాలు నాకు నే
నై చిఱుపాట పాడుకొనునట్టిది నిల్తు ననంత కాలమున్.

ఆమని నాకు నేను మఱి యామనికిన్ బ్రియమాట నాభవం
బే మధురంబు సంతత సుఖేచ్ఛ వహింతును కాని దానికై
కామిని గాను మాధవుని కారుణికత్వము లే ముహూర్త మే
యామిని దాటినంత విజయమ్మయి వచ్చునో నాఁడె వచ్చెదున్.

ఇచ్చ నొనర్తు మాధవున కేనయి తుష్టి నుగాదివేకువన్
విచ్చిన కంఠసీమ వనవీథుల మావుల నల్లిబిల్లిగా
గ్రుచ్చిన యాకుఁబొట్లములఁ గూడిన మొవ్వాఁ రేకులారఁగా
విచ్చిన పూర్వవాసనల వీడని మాధురి మెల్లఁ జల్లుచున్.

ఈయది నాకు వింత మెట
    కేగిన నచ్చట మాధవుండు నా
కీ మెఱ జీవితమ్ము రస
    హీనముగాఁ గనుపింప దెందఱో
నా యెదుటన్ విషాద కష
    ణమ్మున మూల్గుచునుందు రేమి వా
రీ యెదలో సువర్ణ ఖను
    లేల కదల్పరొకో సుఖప్రియుల్!

పదేళ్ల సాహిత్య వైఖరి

శ్రీ 'ఆరుద్ర'

పదేళ్ల కొకసారి జనాభా లెక్కలు తీసుకోడం పరిపాటి అదే మనం సాహిత్యానికి అన్వయిద్దాం డజను పైచిలుకు సంవత్సరాల సృజనాత్మక సాహిత్యంలో ఏ రచనలు సజీవంగా ఉన్నాయి, ఎక్కడ పుట్టాయి, ఎక్కడ నివసిస్తున్నాయి ఎట్సెట్రా ప్రశ్నలు కురిపించి సమాధానాల సారాంశం జాగ్రత్త చేద్దాం. (కొన్ని రచనలు చాందసత్వంలో జన్మించి భూతకాలంలోనూ సనాతనుల సంకుచిత హృదయాల్లోనే నివసిస్తాయి; మరికొన్ని ఆధునికుల ఆగ్రహంలోనూ, ఆవేదనలోనూ జన్మించి, అయ్యో, అకాల మరణం పాలౌతాయి; ఇంకొన్ని ప్రసాదగుణమున్న ప్రతిభకు జన్మించి ప్రతివాడి గుండెల్లోనూ నిండుగా జీవిస్తాయి)

స్వరాజ్య మొచ్చాక సాహిత్యం సర్వాంగసుందరంగా ఉంటుందని అందరం ఆశించాం; ఆమాటకొస్తే సాంఘిక జీవితం కూడా అలాగే శోభాయమానంగా ఉంటుం దనుకొన్నాం రెండూ ఒకలాగే ఉన్నాయి ఆశించినంత గొప్పగా ఆధునిక రచనలు ఎందు కుండడం లేదో విపులంగా కాకపోయినా వీలైనంత సంగ్రహంగానే చర్చించడం అన్నివిధాలా అవసరం "గతకాలము మేలు వచ్చు కాలము కంటెన్" అనే నిరాశా దృక్పథంతో కాక, నిష్పక్షపాతంగా చూసినా స్వరాజ్యం రాకముందు వచ్చిన రచనలే నేటి రచనలకన్నా మెరుగు అని యూనివర్సల్‌గా తోస్తుంది. ఎందుచేత ?

స్వరాజ్యం రాకముందూ పోరాట ముండేది (ఇప్పుడు ఆరాటం మాత్రమే ఉంది) ఈ పోరాటం రాజకీయంగానే కాదు, వేదాల వయస్సు నిర్ణయించడం దగ్గర నుంచి, వివిధ రంగాలలో మన తాతలు తాగిన నేతులు మనం త్రేన్చడం దాకా పర దేశీయులతో మనం ఆవేశంతో దెబ్బలాడుతూనే వచ్చాం. ఆవేశంలో గ్రహించిన సత్యాలు ఉత్తేజకరంగానే ఉంటాయి.

అప్పుడు మనకొక లక్ష్య ముండేది స్వరాజ్యం కావాలి, స్వరాజ్యం కావాలి. అవ్యక్తంగానో, వ్యక్తంగానో అందరికీ అదే ఆశయం వర్ణాశ్రమ ధర్మాలతో విరాజిల్లే వైదిక జీవితానికి దగ్గరగా భారతదేశాన్ని పట్టుకు పోవడానికి సనాతనులకూ, వర్గరహితమైన సమాజాన్ని సామ్యవాద సూత్రాలతో నిర్మించి రష్యా సరసన నిలబెట్టడానికి అతివాదులకూ, అందరికీ ఆనాడు కావలసినది స్వరాజ్యం. అప్పుడు మనది ముందు చూపు.

స్వాతంత్ర్యం కోసం సమరం చేశాం సిద్ధించింది ఆంధ్రరాష్ట్రం కావాలని అదే పనిగా పోరాడాం. అవతరించింది విశాలాంధ్ర ఏర్పడాలని వేనోళ్ల ఘోషించాం రూపొందింది. ఆశించినవన్నీ సమకూరాక సామాజిక జీవితం వడ్డించిన విస్తరి లాగ ఉంటుందని భ్రమపడితే అది కుక్క చింపిన విస్తరి లాగ ముక్కలు ముక్కలుగా మూర్తీభవించింది ఈ శోచనీయమైన సత్యాన్ని చూసి సమకాలిక సాహితీపరులు కళ్లు మూసుకోడం వల్లనే ఆధునిక సాహిత్యం అనుకున్నంత గొప్పగా లేకపోతున్నదని చెప్పొచ్చు

*　　　*　　　*

స్వరాజ్యం రాకముందూ పేరుపడ్డ రచయిత లెవరు ? వాళ్ల కావ్యవస్తువు లేమిటి ? చెప్పిన సంవిధానంలోని ప్రాశస్త్యం ఎంతవరకూ కారణం ? అని కొద్దిగా చర్చిస్తేనేగాని నేటి సాహిత్య పరిస్థితులను నాటి వాటితో పరిపోల్చి సమీక్షించడం వీలుపడదు

జవసత్వాలున్న రచయితల జాబితా తయారు చేయడం నా ఉద్దేశం కాదు. తరవాత వాళ్లమీద తమ ప్రభావాన్ని ముద్దర్లు వేసిన ముఖ్యులనే సమీక్షిస్తాను వాళ్ళ వేళ్లమీద లెక్కపెట్టదగ్గ వాళ్ళని నిర్మొహమాటంగా చెప్పాలంటే అయిదుగురు మాత్రమే.

1. కృష్ణశాస్త్రి.
2. విశ్వనాథ.
3 చలం.
4 శ్రీ శ్రీ.
5. కొడవటిగంటి

ఆ రోజుల్లో వీళ్లేది రాసినా అందరూ చదవడం, కొందరు అనుకరించడం జరిగేది. (అనుకరణ నోచుకోనిది అసలైన సాహిత్యం కాదు)

ఈ సిద్ధహస్తులూ, ప్రతిభావంతులూ విశిష్టమైన విప్లవకారులే గాని ఏ ఒక్కరూ నేల విడిచి సాము చేయలేదు వీళ్లు గరిడీ చేసిన గడ్డని అంతకుముందే కొంతవరకూ ఒకరిద్దరు చదును చేశారు గురజాడ స్పియర్ హెడ్; రాయప్రోలూ, రామకృష్ణరావు (అబ్బూరి) స్ప్రెడ్ వర్క్. అందుకే ఈ సిద్ధహస్తుల కృషి ఫలప్రదమైంది ఫ్యూడల్ వ్యవస్థ యొక్క అవసానదశలో నానారాజ సందర్శనం చేస్తూ రాజాశ్రయం వల్లనే దేహయాత్ర చేస్తున్న సాహిత్యానికి సామాన్యులలోనే సహృదయుల్ని సంపాదించి తిరుపతి కవులు ఇంకో మేలు కూడా చేశారు తానే పద్యం చెప్పి తానే అర్థం చెప్పవలసిన దుస్థితి తప్పాలంటే కవి తమంతట తామే అర్థమయ్యే పద్యాలు చెప్పాలని గుర్తించారు, సభారంజకత్వం సరళత్వానికి దారితీసింది.

క్రొత్త పరిస్థితులలో క్రొంగొత్త భావాలను కావ్యరూపంలో చెప్పాలంటే క్రొత్త చందస్సు కావాలి ఆంగ్లంలో హాప్కిన్సు, తెలుగులో గురజాడ ఈ అవసరాన్ని గుర్తించారు. అనువైనది చేపట్టారు (వాస్తవానికి గురజాడది సృష్టి కాదు, డిస్కవరీ. కందుకూరి రుద్రకవి సుగ్రీవ విజయంలో సలక్షణమైన "ముత్యాల సరాలు" ఉన్నాయి) అబ్బూరి రామకృష్ణరావుగారు ఇప్పటికీ కొత్త ఛందస్సుల అంట్లు కట్టడానికి పరిశోధనలు చేస్తూనే ఉన్నారు. (ఉదా. ఇటీవల ఆయన ఇంగ్లీషు సానెట్ ఛందస్సుని తెనిగించారు.)

గురజాడ అప్పారావుగారి మాదిరిగానే రాయప్రోలు సుబ్బారావుగారూ మాత్రా ఛందస్సుల అవసరాన్ని గుర్తించినవారే అయితే భావకవుల ఛందస్సు మాత్రం ముఖ్యంగా గీత పద్యం. తెలుగు కవిత్వానికి వృత్తం ఎంతమాత్రం పనికిరాదని నిష్కర్షగా చెప్పిన ఇటీవలి విమర్శకుడు శ్రీపాద గోపాల కృష్ణమూర్తిగారు

మహనీయులకు క్రియాసిద్ధి ఉపకరణాలవల్లకాక స్వప్రతిభవల్లనే అని వప్పుకొన్నా, ఆ ప్రతిభ మూలంగానే వాళ్ళు గడ్డిపోచలాంటి ఆయుధంతో కాకాసురుణ్ని జయించగలరు సాంప్రదాయికమైన ఉపవాసాలనీ, సర్వ సామాన్యమైన రాట్నాన్నీ ఉపయోగించి మహాత్ముడు రాజకీయచైతన్యం తెచ్చినట్లే మాత్రాచ్ఛందస్సులనీ, సౌలభ్యమున్న జాతులనీ వాడి స్వాతంత్ర్యం రాకపూర్వం కవులు సాహిత్య చైతన్యాన్ని కలిగించగలిగారు ఇక్కడ నన్నిచోడుడు ఎక్కువ కందాలనీ, పాల్కురికి సోమనాథుడు ద్విపదని, వేమన్న ఆట వెలదిని ఆదరించిన దెందుకో జ్ఞాపకం చేసుకొనడం అసందర్భంకాదు.

కవిత్వాన్ని సమకాలిక జీవితానికి చేరువగా తీసుకురావడానికి భావకవులు ప్రయత్నం చేస్తే శ్రీ శ్రీ కోవ కవులు చేరువగా తీసుకొచ్చారు. భావ కవు

లకు ఛందస్సు గీతపద్యమైతే రసం శృంగారం. అయినా ఈ శృంగార ప్రాబంధికం కాదు గాని, నాయిక స్వీయా కాదు, అందీ అందని వూహాసుందరి కనబడుతుంది, కలకపెడుతుంది, కలలు కనమంటుంది. ఆమె కమ్మని తేనె కార్చిచ్చుల కలగలుపు. ఒకవిధంగా ఇది దొరకని స్వాతంత్ర్యానికీ, సాధించదలచుకొన్న స్వప్నానికి సంకేతం

శ్రీ శ్రీ శృంగారాన్ని గద్దెమంచి దింపి, సమకాలిక జీవితంలోని బీభత్సాన్ని పట్టం కట్టుకోమన్నాడు అగ్గిపుల్లనూ, కుక్కపిల్లనూ కవితా వస్తువులు చేయదలిచాడు. ఇతడు 'కావాలోయ్ నవ కవనానికి' అని జాబితా వేసిన వస్తు సముదాయంలో ఆదినుంచి అంతందాకా అన్నీ ఎర్రరంగే! ఈయన 'ఎగరేసిన ఎర్రని జెండా, కలకత్తా కాళిక నాలుక', కావాలంటే, నారాయణ బాబు 'రక్తపతాకం, శక్తి నాలుక' మొదలైనవి ఉపమానాలుగా స్వీకరించాడు శ్రీ శ్రీ ని అనుకరించని చిన్న కవులు వానలో తడువనివారే!

శ్రీ శ్రీ విలక్షణత్వం, తిక్కనగారి విలక్షణత్వం లాంటిది. వసంతాన్ని వర్ణించడానికి నన్నయగారు లయగ్రాహిని ఉపయోగిస్తే అదే ఛందస్సులో తిక్కనగారు స్త్రీపర్వంలో యుద్ధభూమిలోని బీభత్సాన్ని వర్ణించాడు భావ కవులలాగే శ్రీ శ్రీ కూడా మలయ పవనాన్ని, మందహాసాన్నీ మంజుల గానాన్నీ వర్ణించగలడు. మాత్రా ఛందస్సులలో 'ప్రభాతవేళా శుభా నిలంలో పికాంగనా శ్రావ్య కూజితంలో' పంచదార రుచితో పలకగలిగిన కవి సమకాలిక బాధలకి స్వంత గొంతుక అంకితం చేయబట్టే ఉత్తేజకరమైన సాహిత్యం సృజించ గలిగాడు

కవితా, కథానికా సంవిధానంలోనూ, వస్తువులోనూ పొందిన మార్పులు ఒకలాంటివే. భావ కవులు చేపట్టినట్టే చలం కూడా శృంగారాన్నే చేపట్టాడు భావకవుల చందస్సులోనూ, చలం శైలిలోనూ సౌలభ్యం ఉంది చలం చేసిన తిరుగుబాటు చేయవలసిన తిరుగుబాటు. (ఈనాడు ద్రావిడ కజగం వాళ్ళ తమిళనాడులో పురాణేతిహాసాలకి చేస్తున్న వ్యాఖ్యానాలు ఆనాడు చలం భానుమతిలో, ముద్దుకృష్ణ అశోకంలో, కవిరాజు గారు ఖూనీలో చేశారు భావ కవుల నుండి శ్రీ శ్రీ విడిపోయి చేసిన మార్పులు కథకులలో, చలం నుండి దూరంగా జరిగి వెళ్ళిపోయిన కుటుంబరావు చేశాడు. కవులలో శ్రీ శ్రీ కున్నంత మంది అనుయాయులు కుటుంబరావుకీ ఉన్నారు.

భూతకాలాన్ని ప్రేమించిన వ్యక్తి వర్తమానంతో కాపురం చేయలేడు విశ్వనాథ సత్యనారాయణ ప్రతిభకు మైనారిటీ తీరకమందే వృద్ధాప్యం ప్రాప్తించింది. ఈయన పూరుని వంటివాడు సనాతన ధర్మాలనే యయాతికి తన యవ్వనాన్ని ఇచ్చేసి జరాభారాన్ని ధరించిన (Poor) పూరుడు. ఈ బరువుని లోకుల భుజాలమీదకి ఎక్కించడానికి విశ్వనాథ శిష్యులు ఇంకా ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు.

మారకముందూ విశ్వనాథ మనస్సుకి ఆహ్లాదం మెదడుకి ఉద్రేకం కలిగించినవాడే. వేగివాడు ముఖలింగం ఈయనచేత వేడి కన్నీళ్ళు రాల్చించాయి. అస్వతంత్రమైన బ్రతుకు అక్కర్లేదని పిల్లవాగులన్నీ పొంగి జలప్రళయం కావాలని కాంక్షించాడు. భావి స్వాతంత్ర్యం కోసం గత కాలాన్ని ఆరాధించి ఇన్స్పిరేషన్ తెచ్చుకొన్న ఈయన భూతకాలానికి తాకట్టు పడిపోయాడు. పురాతన భారతదేశం వజ్రాలగని కావచ్చును గనిలో పని చేసే కార్మికుడిమీద పొరంగం గోడలు కూలిపడిపోతే ఎంత ప్రమాదం భావ కవులు రోజుల్లో విశ్వనాథ ఉత్తేజకరమైన సాహితీస్రష్ట అని నిర్వివాదంగా వప్పుకోవాలి.

కవులలో విశ్వనాథ ఎలాంటివాడో కథకులలో మల్లాది రామకృష్ణ శాస్త్రిగారు అలాంటివారు వర్తమానకాలపు గొంతుకతో పురాతనత్వాన్ని విశ్వనాథ ఘోషించితే, రామకృష్ణ శాస్త్రిగారు వర్తమానకాలపు కథలని కూడా నిన్నటి నిజమైన తెలుగు భాషలో చెప్పగలరు, చెప్తున్నారు రామకృష్ణ శాస్త్రిగారి కథాసంవిధానంలోని చుక్కలూ, గీతలూ ముగ్గులు ముగ్గులుగా వాడే మాటలూ స్వాతంత్ర్యానికి పూర్వం కొంద రనుకరించిన ఫాషన్.

సమకాలికులపైనా, తరువాత తరంవారి పైనా ముద్రలు వేయ గలిగిన ముఖ్యుల ప్రతిభను చర్చించాక ముఖ్యంగా తేలిన దేమిటంటే భారతజాతి స్వాతంత్ర్యం కోసం పోరాటం సాగించే రోజుల్లో సాహితీవేత్తలు ఆ సంకేతానికి వివిధరూపాలైన చిహ్నాలనే రచించి చర్చించారన్న సత్యం

* * *

స్వరాజ్యం రాకముందూ, శిథిలాలను చూసి, పాత వైభవాన్ని తలచుకొని భవితవ్యం కోసం కలలు కన్న మనం, కావాలని పురాణాల కాడికి మన మెడ కట్టేసుకుంటున్నాం. ఇతిహాసపు ఇరుకులలోనే ఇమిడిపోవా లనుకుంటున్నాం పత్రికల ధర్మమా అని వివిధ పురాణేతిహాసాల సీరియల్సు అవ్యక్తంగా జాతి కళ్ళని వెనక్కి తిప్పడం జరుగుతుంది పిల్లలకోసం, రామాయణ, భారత భాగవతాల కథలు, బొమ్మలతో, పాటలతో ప్రచురించాం పెద్దకోసం, స్త్రీల కోసం వాడుక భాషలో వివిధ పురాణాలు వినికిడి చేస్తున్నాం. వ్యాస భారతాన్ని వ్యాఖ్యానం ఒకరు చేస్తున్నారు. మహాభారతాన్ని ఒక పత్రిక ప్రచురిస్తూఉంటే భాగవతాన్ని యింకొకరు, హరివంశాన్ని వేరొకరు ఇలాగ తండోపతండాలుగా తర్జుమాలు చేసి సదుద్దేశంతోనే అందిస్తున్నారు సృజనాత్మక రచనలకు కూడా సమకాలిక జీవితంలో కాక కర్పూర వసంతరాయలూ, విశ్వనాథ నాయకుడు మొదలైన నాయకులే గతి అయ్యారు

స్వాతంత్ర్యం రాకపూర్వం మాధవవర్మ న్యాయశీలతని చెప్పడం ఉత్తేజకరమేగాని స్వాతంత్ర్య మొచ్చాక వసంతరాయలి ధీర లలితశృంగారం ఎలాగ ఉత్తేజకరమవుతుంది ?

స్వాతంత్ర్యం రాకపూర్వం యువకులందరూ సామ్యవాదులు రష్యా శిష్యులు. ఇంగ్లండులోనూ, ఇక్కడా, ఎక్కడైనా ఇదే తీరు స్టాలిన్ చావుకు పూర్వం సామ్రాజ్యవాదుల ప్రచారం క్రింద జమకట్టిన చేదు సంగతులన్నీ స్టాలిన్ చావుతో దుర్భర సత్యాలైనవి. రష్యావేశంతో ప్రబలిన అభ్యుదయ కవితోద్యమానికి బాలారిష్ట దోషాలు సంభవించడంలో వింత లేదు. నవోదయానికి వైతాళికులు, దురదృష్టవశాత్తూ ఒక రాజకీయ పార్టీకి తాళికులు అయిపోవడం వల్ల రచనలలో విశ్వజనీనత లోపించక మానదు

భావకవులు భావం, భాష, సంవిధానం అనే మూడింటిలోనూ స్థితిమంతులు సిద్ధహస్తులు అభ్యుదయ కవులు భావాని కిచ్చే ప్రాముఖ్యం తక్కిన రెండింటికి యివ్వలేదనే చెప్పాలి. ఆ భావమైనా వినాదాల ప్రభావం వల్ల జనించినదే కనుక పైన చెప్పినట్టూ అందరికీ తియ్యగా ఉండలేదు.

తమకు ముందు ఛందస్సులో వచ్చిన మార్పులని భావకవులు బాగా అర్థం చేసుకున్నారు. అభ్యుదయ కవులకు కొద్ది సంవత్సరాలకు పూర్వం ''ఛందో బందోబస్తులు చట్‌ఫట్ మనిపించి గద్యానికి పద్యాన్నిచ్చి పెళ్ళి చేసిన'' అధివాస్తవికుల ఉద్యమంవల్ల సంవిధానం పట్ల శ్రద్ధ లోపించింది. గద్యానికి పద్యాన్నిచ్చి పెళ్ళి చేయవచ్చు కాని అది మనసులేని మనువులాగ మారడం ఎవ్వరికీ ఆనందదాయకం కాదు.

అయితే ఈ తరంలోనూ కవులు తమ సమకాలిక జీవితంలోని ఆవేశాన్ని తెలియజేయడానికి సరియైన ఛందస్సు ఏమిటో అన్వేషించి అందులోనే కవిత్వం రాయాలని ప్రయత్నిస్తూనే ఉన్నారు.

దాశరథి యిలా అన్నాడు :

విద్యుత్తులా వూహించగల మనకు
మద్యంలా పారే పాత ఛందస్సులో
పద్యం రచించడం పడదు. అందుకే ఇలా రాస్తున్నాం
ఇది విద్యుత్ ఛందస్సని అందరికీ తెలిసినదే
ఇందులోని ఎక్స్ కిరణం
హృదయాంతస్సుల్ని శోధిస్తుంది.

కొత్త చందస్సు కోసం ఈ తరం కవులు చేస్తున్న గవేషణ యిప్పటికీ ఫలప్రదం కాలేదనే చెప్పవచ్చు వచన పద్యా లనేవి, దురదృష్టవశాత్తు యింకా సర్వాంగసుందరం కాలేదు శ్రీ శ్రీ తన 'కవితా ఓ కవితా' అనే రచ

వలో వాడిన వచన పద్య సంవిధానాన్ని ఇంతవరకూ ఎవ్వరూ ఆకళించుకో లేదు

స్వాతంత్ర్యం రాకముందూ కవులు నవ కవిత్వానికి కావలసిన వస్తు సామగ్రిని జాబితా వేసినా అమ్మజూపినా అదే కవిత్వమైంది భావకవుల వస్తువుల్ని పింగళి—కాటూరి, విప్లవకవుల సామగ్రిని శ్రీశ్రీ వర్ణించి చెప్పారు. బాగానే ఉంది 'మరో ప్రపంచం' లో ఆశలు తీరుతాయని దూరపుకొండల నునుపుదనం చూపించితే ఉత్తేజకరంగానే ఉంది. స్వాతంత్ర్యం సిద్ధించాక భూతల స్వర్గాలను చూపించబోతే భూతాల స్వర్గంగా అది రూపొందుతుందనే భయం ఆదిలోనే కలుగుతుంది

భర్తృహరి పడ్డంత బాధ, ఈనాటి కవులూ పడుతున్నారు; 'జీర్ణమంగే సుభాషితం' అని చింతిస్తున్నారు. కొత్త రకం భావ ప్రకటన కొన్ని చోట్ల వింత భాషలాగ వినిపిస్తుంది. కవి వాడే భాషకీ, జనులు అర్థం చేసుకునే తీరుకీ మధ్య ఎక్కడా లంగ రందదు. ఈ సంగతినే ఈ వ్యాస రచయిత తన కావ్యంలో ఒకచోట యిలా చెప్పాడు.

నిర్దేశించిన భావాలను
వాక్యాలు బట్వాడా చేయవు
పదేపదే వాగిన గ్రామఫోను రికార్డుల మాదిరి
మాటలు అర్ధ ప్రేరణ చేయవు
.. ..
....
ఒక పదంలో ఇముడవలసిన అర్థం
కొన్ని వాక్యాల విస్తీర్ణతని దురాక్రమణ చేస్తుంది.
. ...
....
నిర్దేశించిన భావాల ఆడబొమ్మలకి
వాక్యాలు గెడ్డాలూ మీసాలూ పెడతాయి

అనుకున్నది చెప్పలేకపోతున్నామన్న బాధనే అబ్బూరి రామకృష్ణరావుగారు కూడా తమ కావ్యంలో ఒకచోట యిలా చెప్పారు :

మనసులోని యాలాపము
మాటలలో మారిపోవు
ఎత్తిన కవితా దీపము
వత్తి కుమిలి యారిపోవు.

ఇటువంటి పరిస్థితి నిజంగా శోచనీయమే. అయితే యిది కళ్ళు మూసుకుని గుర్తించడం మానెయ్యవలసినది కాదు. ఇతర భాషలలో ఆలోచనా, మాతృభాషలో రచనా కావడంవల్ల కవి ఆలోచించిన భాష రానివాళ్లకి కవిత కూడా బోధపడని పరిస్థితి అవుతుంది ఇతర భాష ఇంగ్లీషే కానక్కరలేదు "సేనా స్వీకృత భూత రాక్షస పిశాచీ ప్రేత !" అనే సంస్కృత సంబోధన తెలుగు పద్యంలో ఎలా విడమర్చి అర్థం చేసుకోవాలో అభ్యుదయ కవి రమణారెడ్డి 'చరిత్ర' చేత

"ఎన్నియెన్ని పోరాటపు ప్రోవులు నా గర్భంలో
ఎన్నియెన్ని ప్రజాబహుళ జయనాదా రెడందలో
నే నహో ఈ జనావళికి పత్నిని !"

అని చెప్పిస్తే చరిత్ర అందరికీ పెళ్లామని అపార్థం చేసుకోరాదు.

విద్యుత్ ఛందస్సూ దొరక్క, విశదమయ్యే మాటలూ దొరక్క రచన సాగినప్పుడు సమకాలిక సాహిత్యం ఎలా ఉత్తేజకరంగా ఉంటుంది?

చలి చీమలు

శ్రీ శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి

[సుప్రసిద్ధ కథకులు శ్రీ శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారు ఇటీవలే దివంగతులయారు. వీరు తమ పెక్కు రచనలతో ఆంధ్రపత్రిక ఉగాది సంచికను, భారతిని అలంకరించారు. ఇది వీరి చివరికథ. వీరు దివంగతులు కావడానికి తొమ్మిదినాళ్ల ముందు ఇది మా కార్యాలయం చేరింది.
—సంపాదకుడు]

"తిరగటి రాతిలా చదికిల బడ్డావు గానీ—కనపడదూ? గేటు తెరవ్వేం"

అంటూ ఉరిమాడు దివాంజీ సారథి కంగారుగా వెనక్కి విరగబడి కళ్లాలు బిగబట్టి, మేఘాల మీద యెగిరిపోతున్న గుర్రాల వడి తగ్గిస్తూ.

కాపలా మనిషి కదల్లేదు.

మాటే ఆడలేదు

ఇటయినా చూడలేదు.

"కోతిలాగ నాగలెక్కి యెగిసెగిసి పడుతున్నావు గానీ, వడి తగ్గించి పోటికి" అంటూ గదిమాడు కూడా పొణకబుట్టలా బవజవలాడిపోతూ.

కళ్లాలతో యెగబట్టుకున్న చేతు లెగబట్టుకునే వుండి "ఆ" అంటూ రంకె వేశాడు సారథి, పళ్ళు పటపటాడిస్తూ.

అతని కళ్లు జోతు లయిపోయాయి

బధిరాంధకం జమీందారీ పుట్టాక, దివాంజీసారటుకి, గవనిలోనే అటకాయింపు తటస్థపడడం నాలుగు శతాబ్దుల కిదే మొదటి మాటు

ఊహలకున్నూ అందని సన్నివేశం యిది

ముప్ఫయ్యేళ్లు నిండలే దింకా రంగరామానుజం బహద్దరుకి

చదవంటలేదు గాని పేషన్లు మాత్రం చాలా హెచ్చు అతనికి.

వేట—వెలది—వెల్లగుర్రం—ఇంతే అతని లోకం.

పోనీ అంటే, ఇరవై రెండేళ్లు పూర్తిగా నిండలేదు గాని వళ్లు మాలిన గుండెజబ్బు, మహారాణీ ప్రత్యూషరాణికి

కానయితే, ఎం. ఏ, పట్టం పుచ్చుకుం దామె, లండన్లో.

కాని వేసవి నాలుగు మాసాలూ నీలగిరీ, తక్కిన ఎనిమిది మాసాలూ బెంగుళూరూ—ఇవి తప్పిస్తే ప్రాణం నిలవ దామెకి

ఈ నీలగిరీ చాలక, ఈ బెంగుళూరూ చాలక సరాసరీ స్విట్జర్లాండుకే పరుగెత్తవలసిన అవస్థ పుడుతూ ఉంటుం దామెకి, ఏటా.

అయితే అయిందంటే, కోట విడిచే చాలా దినా లయింది డవేజరు మహారాణి బంగారయ్యాదేవి

యాభై యేళ్లకూ ఒకటో రెండో తక్కువే—అయినా, వెనకటి మహారాజు—తన మామగారు కోరి వేయించుకున్న పూల తోటలో—కొలని గట్టున ఉన్న పురాతనం బంగళా పడగొట్టించి అదివరకే ఉన్న రెండూ చాలక అద్భుతమైన కొత్త మేడ కట్టించుకుని అందులో ప్రవేశించి ఉం దామె.

తన భర్త చనిపోయిన యీ నాలుగై దేళ్ల నుంచీ హద్దూ పద్దూ లేని భక్తీ ప్రపత్తీనీ ఆమెకి

ఆ మేడకి వెడితే యే గుమ్మాన వెడితే యెక్కడికి వెడుతుందో యెవరూ తెలుసుకోలేరు.

ఎవరికోసం వెళ్లామో, వా రెక్కడ ఉన్నారో చెప్పగలవారు కూడా యెవరూ ఉండ రక్కడ

ఆ మేడలో యెన్నో అపురూప వస్తువు లున్నా యంటారు, వాటి స్వరూప స్వభావాలు చెప్పగలవా రెవరూ ఉండ రక్కడ.

అటు పేషనూ, యిటు భోజనమూ అయేదాకానూ, అయాకా గూడా, ఒళ్లు తెలియని గాఢనిద్ర ఆమెకి

సాయంత్రం యింక చీకటి పడుతుం దనగా జోడు గుర్రాల బగ్గీ మీద దేవాలయానికి వెళ్లడమూ, మదన గోపాలస్వామి ప్రసాదం నేతి గారెలు నాలుగై దారగించడమూ, బసకి వచ్చి తొమ్మి ద్దాటాక మళ్లీ స్నానంచేసి పడమటావు పాలు అర్ధశేరో ముప్పావు శేరో పుచ్చుకోడమూ,—అది మొదలు నూళ్లో రెండో ఆట సినిమాలో ఆటలు రెండు కూడా ముగిసేదాకా పురాణం కాలక్షేపమూ—ఇవి తప్పించి మరో వేలంబం కూడా లే దామెకి.

ఇలాంటి కారణాలవల్ల కోటలో, దివాంజీకి ఏమి టనడిగేవా డెవడూ లేడు

మహారాజు క్కావలసిన వస్తువు లెప్పటి కప్పుడు సమకూరుస్తూ ఉండడమూ, మహారాణీ తంతి కొడితే—డవేజరు మహారాణీ కూడా వర్తమానిస్తే ఇద్దరికీ కావలసినంతా డబ్బు పంపిస్తూ ఉండడమూ—ఇవి తప్పిస్తే, మునిగిపోయే మగేమీ లే వతనికి

బలవంతం చేసి—వంగోబెట్టించి వీపున పిడిగుద్దులు గుద్దించి—వొళ్లున్నూ వొలిపించి రైతులవల్ల పన్నులు వసూలు చెయ్యడం వెన్నతో పెట్టిన విద్య అతనికి

కలెక్టరు మొదలు గవర్నరు దాకా—అప్పుడూ అప్పుడూ గవర్నర జనరలు దాకా కూడా సర్కారు ఆఫీస ర్లందరూ కులదైవా లతనికి

డలాయతు మొదలు—పనిమనిషిన్నీ మొదలు మానేజరు దాకా సంస్థానం మనుష్యు లందరూ కుక్కిన పే లతనికి

ఇలాటి వాడికి,—పెద్ద కాసా లచ్చుబ్బాయి మాత్రం మెడమీద తలకాయ ఉన్న మనిషిలా కనబడుతున్నా డతనికి ఒకటి రెండేళ్లనుంచి.

లచ్చుబ్బాయి చిన్న చెల్లెలు డవేజరు మహారాణీకి ప్రీతిపాత్రురాలు కావడమూ,—అలా అయిన ఒక్క వారం దినాలకే మహారాజుకి భోగిని అయిపోడమూ—దీంతో దివాంజీకి బ్రేకుపడ్డ ట్టయింది

ఒక్కొక్కనాడు, దారీ తెన్నూ కనబడక—ఉపాయం తోచక—కుతకుత ఉడికిపోతాడు—గిజగిజ తన్నుకుంటాడు—లబో లబో మొత్తుకుంటాడు కూడా.

2

పక్కకి వాలి చూశాడు సారథి కాలిమీద కాలు వేసుక్కూచుని యేదో కాగితం చూసుకుంటున్నాడు దివాంజీ

ఎంతో ఆత్రంగా—ఏకాగ్రంగా చూసుకుంటున్నాడు కనక అతని ధోరణి తనకేసి తిప్పుకోవాలి అందుకోసం గంట గణగణ లాడించాడు

తానే వెళ్లి కొని పట్టుకువచ్చా డది, స్వయంగా బొంబాయి వెళ్లి.

రాజధాని చింతజువ్వలపాలెంలోనే కాక, చుట్టుపక్కల మరికొన్ని పల్లెల్లో కూడా మారుమోగి పోతుం దది కాలే మాత్రం అదివినా

పిడుగులు పడుతున్నట్టున్న ఆ గణగణకు ఉలిక్కిపడ్డాడు దివాంజీ

మొగం పైకెత్తి చూడగా, తాను చిరాకుపడే గవనిలోనే ఆగివుంది సారటు.

గేటు బార్లా తెరిచేవున్నా, ఏకబిగిని చర్రుమంటూ వెళ్లిపోడానికి వీలులేక ఎంత మందకొడి గుర్రాలూ కూడా మెల్లిగా నడవాలా మళుపు తిరిగేదాకా.

అంచేత ఆ స్థలం అంటే, మొదణ్ణుంచీ—ముఖ్యంగా తాను మానేజ రయినప్పణ్ణుంచీ చాలా నిరసన భావం ఏర్పడివుంది దివాంజీకి.

అక్కడ ఆగిపోయినందున ఒళ్లంతా చీమలూ, జెర్రెలూ పాకుతున్న ట్టనిపించింది అతనికి

కాగా "ఏమిరా ?" అంటూ రంకె వేశా డతను, ఓరగా చూస్తూ

"గేటు బిగించేశాడు, పొగాకు బొండం చుట్టుకున్నాడు, గంట కొట్టినా, పిలిచినా లేవడంలేదు బాబయ్యా, కాపలా మనిషి—"

"కునికిపాట్లు పడుతున్నాడా ?"

"కూని రాగాలు కూడా తీస్తున్నా డండి"

" . . నల్లనా అ అ డే, గొల్ల పిల్లనా ఆడే" అంటూ సన్నగా పాట వినపడింది దివాంజీకి

"బండిలో ఉన్నవా రెవరో తెలుసా ?"

"పెద్ద మహారాజులుంగారి తరవాత ఒక్క తమరు తప్ప యీ బ్రూహాం బండిలో మరెవరూ యెక్కరని తెలియనివా రెవరు బాబయ్యా, దివాణంలో?"

ఆలోచించాడు దివాంజీ

వంగిన్నీ చూశాడు పక్కకి.

మనిషే కనబడలే దక్కడికి.

"ఇప్పటికీ అలాగే ఉన్నాడా ?" అని మళ్లీ అడిగా డతను, చెవు లోర జేసుకుని.

"అలాగే ఉన్నాడు దొరగారూ."

"వొళ్ళు వొలిపించేస్తాను"

ఇలారా అంటూ వూగిపోయాడు దివాంజీ

బండికి బండి అంతా జవజవ లాడిపోయింది, దాంతో.

అది గుర్తించి, తాను బండి దిగివచ్చి తలుపు తెరిచి తావొక పక్కగా వొసరిల్లి నుంచున్నాడు సారథి

కన్నెత్తి చూడకపోవడం—

పిలిస్తే పలక్కపోడం—

చూడకేపోడం—

తలమునక లయిపోయిం దాగ్రహం దివాంజీకి

మహారాజుని తప్పించి మరెవణ్ణయినా, ఖరాగా నిలవబెట్టేస్తాడు తాను మరి, తనకూ అలాంటిదే తటస్థపడనా, తాను నిరసించే చోట ?

పరిపరి విధాల పోయింది దివాంజీ మనస్సు

తన స్థితి యెవరయినా చూస్తున్నారేమో ?

నవ్వుకుంటున్నారు కూడా నేమో ?

పత్రికల కెక్కిపోతుందేమో యీ వార్త సచిత్రంగా ?

అటూ యిటూ చూశాడు, దివాంజీ

వెనక్కిన్నీ చూశాడు తిరిగి

కోపాతిశయంతో వొణికిపోతూ పళ్ళు కొరుక్కుంటూ బండి దిగా డతను

3

పొగలు కక్కుతున్నాయి దివాంజీ కళ్లు.

నిటాగ్గా నుంచున్నాడు బండి దిగీ దిగడంతోనే, రెండు చేతులూ కోటు జేబుల్లో కుక్కుకుని

"ఎవడ్రా అక్కడా ?" అంటూ ఉరిమాడు కూడా సులోచనాల కిందుగా చూస్తూ.

మాటలో కూడా కనపడింది వొణుకు

తాను కూడా వొణికిపోతున్నట్టు గవనిలో ప్రతిధ్వనించింది ఉరుము.

"నేను కాకరపర్తి గద్దన్నని" అంటూ బదులు వచ్చిం దప్పటికి, విర్లక్ష్యంగా.

"దిక్కున్న చోట చెప్పుకో" అన్నట్టుంది ఆ జవాబు నవ్వడి.

నిలువునా మండిపోయాడు దివాంజీ

అధికార దర్పం బుస్సుమంది టీకెటిల్లోనుంచి ఆవిరితో పైకి చిమ్మే తుంపురు ల్లాగ.

"ఏం కొరడా దెబ్బలు కావాలా ?" అనడిగాడు దివాంజీ, గొంతు చించుకుంటూ.

క్రోధంతో స్తబ్ధం అయిపోయి, అక్షరాలు స్ఫుటంగా పలకలేక పోయింది, నాలుక, చివరికి.

ఇది చాల దన్నట్టు "హ—హ్హా—హ్హా" అంటూ వికటాట్టహాసం వినిపించింది గవను మళుపు తిరిగి వచ్చి.

"ఆ రోజులు వెళ్లిపోయాయి" అనిన్నీ మాట కూడా వచ్చింది, బహు కటువుగా, దాని వెంబడే

దివాంజీ నోరు తెరుచుకుంది, దాంతో.

"ఆ" అంటూ గదమాయింపున్నూ బయలుదేరిందా నోట గాలి అయిపోయి

సారథి వొణికిపోయాడు, సప్రయత్నంగా.

కళ్లు మూతలు పడ్డాయి దివాంజీకి

"కమ్యూనిస్టుల చేతుల్లో పడ్డా రా నౌకర్లు ?" అన్న అనుమానం వచ్చిం దతనికి, వెంటనే

మహారాజు తాగుమోత్తనం గుర్తించి సెంట్రల్ గవర్నమెంటు, మద్రాసు గవర్నమెంటు పరంగా హఠాత్తుగా వచ్చి, బధిరాంధకం జమీందారీ స్వాధీన పరుచుకుంటోందా ?" అని కంగారున్నూ పట్టుకుంది

మహారాజు సంగతి అంతా నిజమే, మరి, తన కుట్రలూ, తన దౌర్జన్యాలూ, తన బాధ్యతారాహిత్యమూ, తన అవినీతివో ?

పోనీ తన గతి యేమి టిక ?

మనస్సు క్రోధఘూర్మితం అయిపోడమే కాదు, ఇలా కూడా తపా తపా కొట్టుకుం దతని హృదయం

అయినా, వొళ్లు మాత్రం మండిపోతూనే వుం దతనికి

పెదవులున్నూ వొణికిపోతూనే ఉన్నాయి

ఏదయినా తాడుముక్క— పూతికపుల్ల—చింతబెత్తం దొరుకుతుం దేమో అని కళ్లు చికిలించుకుంటూ అటూ యిటూ చూడసాగాడు, దివాంజీ

సారథి కూడా వెదకసాగా డదీ గుర్తించి.

అప్పటి కరుగు దిగాడు, కాపలా మనిషి

పొగాడు బొండం చేతిలోనే వుంది, అక్కడే నిలవబడ్డాడు, గ్రీవా భంగాభిరామంగా చూస్తూ

వాడి సావధానత గమనించి "గేటు తెరువు" అన్నాడు సారథి, చించు కుంటూ

"ఏం, వినపడిందా ?" అన్నాడు కాపలా మనిషి నుద్దేశించి గొంతు చించుకుని దివాంజీ కూడా

"గేటు తెరవడానికి వల్లకాదు" అంటూ గదిమాడు, కాపలా మనిషి, తల యెగురవేసుకుంటూ

అంటూనే, చుట్ట నోట బెట్టి, మొన కొరికి దుపుక్కున ఉమ్మే శాడు కూడా, కరుగ్గా చూస్తూ

దాంతో చీకట్లు కమ్మేశాయి, దివాంజీ కళ్ళ.

తెల్లని అంచుల నల్లని కారుమబ్బు కమ్మేసిన నడిమింటి సూర్య బింబం అయిపోయిం దతని మొగం

చుంయి మనిపోయిన ట్టయిపోయిం దతని దర్పం, నీళ్ళు చల్లిన కొరకుంచులాగ

కాని, "ఏమిట్రా సంగతి ?" అని వొక ప్రశ్న వచ్చేసిం దతని నోట అప్రయత్నంగా.

అందుకే యెదురు చూస్తున్నట్టు "దేవిడీ మన్నా" అయిపో యింది, మరి" అంటూ తల జాడించుకున్నాడు కాపలా మనిషి.

అనేసి యెదురొమ్ము విరుచుకున్నాడు కూడా.

కొయ్యయిపోయాడు దివాంజీ.

4

బాగా వయను మళ్ళినవాడు దివాంజీ.

వెండితీగ లయిపోయి వున్నాయి, పల్చబడిన్నీ బుగ్గ మీసాలు.

వచ్చిదవడ లయిపోయి వుంది మొగం కూడా, కొంచెం

కాని, యెన్నో డక్కామొక్కాకీలకు తట్టుకుని నిలిచివున్నా డతను.

అతనికీ బాగా తెలును, అధికారం నివ్వరిముంటిమీద నిలిచి వుంటుందని.

అయితే, యెంతెంత తుఫానులకున్నా తట్టుకోగల దది

రెల్లుపువ్వుల్లాగ వూగిసలాడుతుందే గాని, విరిగి పడిపో దది సాధారణంగా.

అయితే ఆరోజు వచ్చిందా ?

ఆ క్షణమున్నా వచ్చిందా ?

కొన వూపిరే చాలు, విరిగి, తునిగి, యెగిసిన్నీ పడిపోడానికి

చూడ శక్యం కాకుండా వుంటుంది కళ్ళు పొడుస్తూ, వెయ్యివాట్ల బల్బు.

మరి, విద్యుత్తు కట్టుబడిపోతే ?

ఉరుకులు వేసుకుంటూ వచ్చి కమ్మేస్తుంది, అంధకారం.

కాటుకలా అలుముకునిన్నీ పోతుంది, ఆ బల్బునే.

అజాపజా లేకుండా చేస్తుంది కూడా.

అయితే, ఆ బల్బూ, అధికారం వూడిపోయిన అధికారి మొగమూ ఒకటే రాశి

కాని, కాచి దించేసిన పాలకుండ, దివాంజీ.

బుడగలు వస్తూనే వుంటా యాకుండలో.

స్వయంభువు అయిన దివాంజీ వ్యక్తిత్వం కొంచెం జాగృతం అయిందా సమయాన, అలాగ

వూగిపోయా డతను

తూలిపోయాడు కూడా.

ఆత్రంగా చూశాడు బ్రూహాం కనపడలేదు, తానే దిగింది

వెనక్కి తిరిగి బాగా పరకాయించగా, రౌతుని పడదోసి ఉరకలు పెడుతున్న మదగజంలా వెళ్ళిపోతోం దది

ఇందాకటి వాడే సారధి, గంట గణగణ లాడిస్తూ, కొరడా విసురుతున్నాడు నొగలెక్కి కూచుని.

అయితే వెల్లకితలా పడిపోయినా, ఆ క్షణాన రౌతు చూపు చాలా నిశితంగానే వుంటుంది

దెబ్బ మీద పడిపోతుందన్న కంగారు—అవమానాగ్నిజ్వాలల ఉరుకులు—అసహాయత—అయినా శౌర్యం పొంగు—పరాభవావేగం—ఇన్నిటితో కుమిలిపోతూ వుంటుం దా రౌతు మానసిక వ్యవస్థ

మొగం మరోవైపు తిప్పుకోగా, ఎక్కడికో పోతోం దొక వొంటెద్దు బండి ఆ సమయాన

కాళీగా వెడుతోంది

ఏకాంతం కావా లిప్పుడు దివాంజీకి.

నగుబాట్లు—జాలి—ఈసడింపులు—నిరసనబాణాలు—ఇలాంటివి తన మీద పడకుండా ఒక్క ప్రాకారం కావా లిప్పు డతనికి.

వీరాధివీరుల కుండవలసిన లక్షణాల్లో వేగం ఒక్కటి.

కత్తి దూసి మీది కురకడానికి లాగే, పోటు తప్పించుకుని మళ్ళీ విజృంభింపడానికైన్నీ అది వుండాలనీ వీరుడైనవాడికి

జాతి దురదృష్టవశాన, కత్తి ఝుళిపించడానికే అకాశావేష్యం అయిపోయాయి అతను పుట్టే టప్పటికే

విజాతీయుల ఆక్రమణలు వచ్చాక బుద్ధిబలానికే యెక్కువ చురుకుదనం అయింది మనవాళ్ళకి

శరీరదార్ఢ్యాని కింకా లోటు లేదు దివాంజీకి.

నరాల బింకమూ వుంది కలం పోటుకి బాగా అలవాటుపడి ఉన్నాడు కనక్కు అతను.

ఇప్పుడే నవనవోన్మేషంతో వుం దది

కాగా, యిటు తిరిగి వొక్కటే వురుకురికా డతను.

ఆ ఉరకడంలో ఆ వొంటెద్దు బండిలో పడ్డాడు, పడిసెలబెడ్డలాగ "మా యింటి" కంటూ

అంటూనే బోర్లా పడుకున్నాడు కాళ్ళు చాపేసి, మొగమున్నా తాటాకు చాపలో గుచ్చేసుకుని

ఆ పాటుతో చర్రున లేచిపోయింది, బండికాడి

పంతులు పిక్కలు దీర్ఘాలేమో పాపోసుకాళ్ళు రోడ్డుకి తగిలాయి.

తుళ్ళిపడ్డాడు ముందున్న బండిమనిషి.

మళ్ళీ కిరాయి యెక్కడ దొరుకుతుందా అన్న ఆందోళనలో వున్నా డతను.

టాపు తగిలి బోడితల టక్కుమం దతనికి

బల్ల చెక్కమీద యెగిసిపడ్డంలో పిర్రలు బాగా కమికాయి

ఎలాగో నిలవరించుకుని — పక్క తడిక పట్టుకుని వెనక్కి తిరిగి చూడగా—తన బండిలో ఆ చివరి నుంచి యీ చివరి కెవరో వొక మనిషి.

సరిగంచుల పాగాతో—బుగ్గమీసాలతో—అచ్చంగా దివాంజీ.

చలిచీమల నన్నట్టు, వందలకు వందలు—వేలకు వేలు—లక్షలకున్నా లక్షలకు లక్షలున్నా మనుషులను నేలను బెట్టి రాసేసిన బధిరాంధకం దివాణం దివాంజీ

కళ్ళు చెదిరిపోయా యా మనిషికి.

నోరు తెరుచుకుంది

గుండెలు పీచు పీచు మన్నాయి.

"ఏయ్, నిద్రపోతున్నావా ?" అంటూ బీటుకానిస్టేబులు గదిమే దాకా వొళ్ళే తెలియలే దతనికి

5

పరవళ్ళు తొక్కేశాడు కాపలా మనిషి గద్దన్న

చేతు లెగరవేసుకున్నాడు

కిలకిల్లాడిపోయాడు, యుద్ధరంగాన వీరవిహారం చేసే జాతి గుర్రం లాగ

తరవాత తెరిచేశాడు గేటు బార్లా, పరకాయించి చూస్తూ

రెండో గేటు మధ్య—అటువైపు గేటు మధ్య నుంచుని మళ్ళీ కిలకిల్లాడిపోయాడు, దివాంజీ వెళ్లిపోయినట్టు చెయ్యూపుతూ.

ఈ స్థితి తెలుసుకోడానికి—దేవిడీ యెదట కనిపెట్టుకునివున్న మనిషి కూడా దేవిడీకేసి తిరిగి చిందులు తొక్కేశాడు " "మహవా, నారంగా, వహవా, నారంగా" అంటూ

మండువా తెరపిలో నుంచుని చూస్తున్నాడు, పెద్ద కాసా ఉచ్చబ్బాయి.

క్షణాలు యుగాలుగా నుంచున్నా డాత్రపడుతూ.

ఈ చిందులు చూశా డతను

ఆవేశం పట్టలేక పోయాడు

"స్పెబాన్" అంటూ పెద్ద కేక వేసి, ఎడమకాలి మడమమీద గిరా—గిరా తిరిగేశాడు "నారంగా—నారంగా" అంటూ.

వెంటనే అట్నుంచి గుమాస్తాలూ, యిట్నుంచి రాణేదారులూ, అన్ని గదుల్లోంచీ సుబేదారులూ, సముద్దారులూ, మానేజరూ, నౌకర్లూ, సందులో నుంచి దాసీ సుందరీమణులూ వచ్చి చుట్టుకున్నా రతణ్ణి

వెంటనే పైకి చూశా డోమాటు, తలపాగా పడిపోకుండా చేత్తో అదుముకుని.

అక్కడ పిట్టగోడ ఆనుకుని వున్న ఒక జవరాలు, చెక్కిట చెయి చేర్చి, కళ్ళు మూసుకుని, తల వంచుకుంది, బాగా, నిద్ర అభినయిస్తూ

"మహా బాగా జరిగిపోయిం" దంటూ అందుకున్నాడు, ఉచ్చబ్బాయి ఆవేశంతో

"పాక్కిందంటే పీకలమీదికి వచ్చే వ్యవహారం యిది. గవ్‌చిప్ ! ఉచ్చబ్బాయి సెలవు లేకుండా యే మాటా దివాణంలోనుంచి బయటపడ్డానికి

వెళ్లకాదు. లచ్చబ్బాయి ఆజ్ఞ లేకుండా దివాణంలోకిన్నీ రావడానికి వల్ల కాదు

"దివాంజీమాట యెవరైనా అడిగితే యేమీ తెలియదని చెప్పండి. మహారాజే అడిగితే, నూటనాలుగు డిగ్రీల జ్వరం అని చెప్పండి. దివాంజీయే అడిగిస్తే డెవరినైనా పంపించి. తానే అడుగుతాడు ఇంటికి పిలిపించి. మహారాజుకి పడిశం పట్టిందని చెప్పాలి మెడ్రాసునుంచి యూరపియన్ డాక్టర్లు వచ్చారనీ, ఎవరితోనూ మాట్లాడవద్దన్నారనీ, ఎవరికీ కనపడవే వద్దన్నారనీ చెప్పాలి. ఎవరితో ఏమి మాట్లాడినా యిది మనసులో పెట్టుకునే ఉండాలి. ఇందుకు తగ్గట్టే మాట్లాడాలి నాదారు గాళ్ళందరూ "మాకేం తెలుస్తుంది బాబూ" అని యెదురడగడమే జవాబు. తరవాత ఏం జరగాలో అది లచ్చబ్బాయి చెబుతాడు నెమ్మదిమీద కబడ్దార్! ఏమండోయి మేనేజరుగారూ! లచ్చబ్బాయంటే ఎవరో తెలిసిందా మీ కిప్పుడు? జాగ్రత్త. మీతో సహా పరివారాని కంతకీ ఆరేసి నెలల జీతం బహుమతీ ప్రకటిస్తున్నాను ముందుగా. అందరూ దర్బారుహాల్లో చేరుకోండి ఒయ్యోయ్! రామస్వామీ, ఈపాటికి తయారయి ఉంటుంది, అందరికీ, పీకలమొయ్యా సేమ్యా పాయసం యిప్పించు ఓరి వెంకటస్వామీ, అత్తర్లు—గంధాలు—తాంబూలాలు—దండిగా సిగరెట్లూ—లంకాకు చుట్టలు—బీడీలు—సిద్ధం చేయించు. ఏమండోయ్ మానేజరుగారూ, తాంబూలా లంటే వొట్టి తాంబూలాలు కావు ఖజానా తెరిపించండి" అని చెప్పాడు దృఢంగా.

"నువ్వు మహా బాగా ఆడావు నాటకం" అంటూ కాకరపర్తి గడ్డన్నని బాగా నిమిరాడు.

"నీ అనుభవం అంతా కనపరిచేశావ్. చక్రవర్తుల దగ్గిర ఉండతగ్గ వాడవు నువ్వు" అంటూ సారథిని కూడా చాలా అగ్రించాడు.

6

మహారాజరాజశ్రీ శ్రీ రాజా భూపాలం సత్య శ్రీ వామదేవనాసక్బంద వీరవెంకట సూర్యనారాయణ జగన్నాథ రామభద్ర రాధా మాధవ నరసింహ చింతామణి మల్లికార్జున మహాదేవ పాండురంగ చాముండీశ్వర వీర హనుమంత హరనాథ సాయి లక్ష్మీనారాయణ బలదేవ అప్పల నరసింహ కుక్కుటేశ్వర పోతురాజు రంగ రామానుజం బహద్దరు అటు కళ్ళు తెరిచాప్పటికి, ఇటు గోడమీది గడియారం మధ్యాహ్నం నాలుక్కొట్టింది.

బంగరుసలాకలను మించిన యిద్దరు పడుచులు పొదివి పట్టుకొని లేవదీసి మంచంమీదే కూచోబెట్టా రతణ్ని. అతనే చేతు లందించగా.

మరో యువతి మంచంమీద, అతనికి వెనకగా కూచుంది అతణ్ని తన మీదికి వాల్చుకుని.

"బాగా నిద్రపట్టింది" అన్నా డతను, చేతులూ, కాళ్లూ బాగా పట్టు వదిలేసీ, కళ్ళు తెరుచుకునీ.

"మే మనుకుంటూనే ఉన్నాం, రాత్రి నిద్ర చాలింది కాదు మహాప్రభూ" అంది మరో పడుచు, ఎదుటికి వచ్చి, మొగాన మొగం పెట్టే, మీదిమీదికి వంగినీ

వెంటనే రెండు చేతులూ ఆమె మెడకి చుట్టవేశా డతను.

బాగా చూశాటప్పటికి ఆమెని పట్టుకుని అతనూ, అతణ్ని పట్టుకుని ఆమె లేచి నుంచున్నారు, మంచానికి చేరబడి

అప్పటి కప్పుడే మరో పడుచు వచ్చి కరిగిపోయిన కెంపు లన్నట్టున్న పానీయం ఒకటి అతని నోటి కందించింది

బాగా మెళుకువ వచ్చింది మహారాజుకి, దాంతో.

కళ్ళూ పూర్తిగా విడ్డాయి.

గ్రీష్మభానుని ప్రచండ కిరణాల్లా అతని చూపులు మిలమిల్లాడాయి.

"లచ్చబ్బాయ్" అన్నా డతను, యువతిని పొదువుకునే ఉండి, మొగం మాత్రం అటు తిప్పి

"హాజర్ మహాప్రభూ" అంటూ మొగం యెదటికి వచ్చాడు లచ్చబ్బాయి వంగి చేతులు నలుపుకుంటూ.

"దివాంజీ" అన్నాడు మహారాజు, రెప్పలార్చుకుంటూ.

"చిత్తం చిత్తం మహాప్రభూ" అన్నాడు లచ్చబ్బాయి, అంజలిబంధం వూపుకుంటూ

"మాట రాదేం?" అంటూ గదిమాడు మహారాజు కళ్ళు మూసుకునే ఉండి

"చిత్తం మహాప్రభూ, ఇంకా రాలే దివాళ"

"బుద్ధిలేదు నీకు" అని మళ్లీ గదిమాడు మహారాజు.

"అపరాధిని మహాప్రభూ?"

"ఎంత తొందరపనుందో తెలుసా?"

"కానలేకపోయాను ప్రభూ!"

"టైమెంత?"

"నాలుగు మహాప్రభూ!"

"ఇవాళ రానేలేదూ యింకా."

"చిత్తం దేవరా రాలేదు"

"కబురు పంపావా?"

"నాలుగుమాట్లు పంపాను దేవరా!"

"ఏమంటాడు?"

"నూటనాలుగు డిగ్రీల జ్వరంలో ఉన్నారు బాబయ్యా"

"శైడ తీసీ—మరి చెప్పావు కావేం?"

"మనవి చేసుకుంటాను బాబయ్యా!"

"ఎప్పుడు?"

"దివాణానికి బయలుదేరారంట బాబయ్యా పదింటికే బయలుదేరారంట. కాని, బండి యెక్కబోతూ తూలిపోయారంట. పక్కనే ఉన్న సారధి పొదివి పట్టుకున్నా డంట. "అబ్బా, తల నొప్పి" అంటూ వెనక్కి వెనక్కి వెళ్లి కుర్చీలో పడిపోయారంట"

"అదంతా జ్వరమే?"

"చిత్తం చిత్తం కళ్ళు విడ్డం లేదంట. శిరస్సున కట్టిన మంచుగడ్డ క్షణంలో వేడెక్కిపోయిందంట"

"డాక్టరేం చేస్తున్నాడు?"

"అక్కడే ఉండిపోయారు పడిపోయినప్పణ్ణుంచీని. అన్నరాత్రి అంతా అక్కడే ఉందంట"

"డాక్టరేమన్నాడు?"

"రెస్టు కావా లంట న్యూమోనియాలోకి దింపవచ్చునంట."

మహారాజు కళ్లు చిమచిమ లాడాయి

"ఇప్పు డేమిటి చెయ్యడం చాలా తొందరపనుందే?"

"చిత్తం చిత్తం తెల్లవారాటప్పటికి హాజరుపెడతాను, మమ్మేలినవారి పాదాల దగ్గిర"

"రాణ్ణమడుగు జవాబు వెళ్లిందా?"

"నిన్ననే వెళ్ళింది మహాప్రభూ" అందొక యువతి మహారాజు మొగాన మొగం పెట్టి.

"ఏమని?"

"రేపు పొద్దు గూకాటప్పటికి మనం మాటులో ఉంటామని."

"మహారాజు మొగం ప్రసన్నం అయింది.

"ఎవరది?" అని ప్రశ్నించాడు.

"నేను మెరుపుతీగను మహాప్రభూ"

"మీ అక్క కూడా వస్తోంది, తెలుసా?"

"చిత్తం చిత్తం"

"లచ్చబ్బాయ్"

"చిత్తం చిత్తం మహాప్రభూ!"

"మీ పెద్ద చెల్లెలు కూడా వస్తోంది. ఈవిధంగా మనకి సంబంధం కలిశాక అన్నయ్యగారు రావడం యిదే మొదటిమాటు"

"చిత్తం చిత్తం చాలా గొప్ప సన్నివేశం మహాప్రభూ."

"అన్నయ్యగా రొక్కరే అయితేనూ ఆ మాట."

"చిత్తం, బోధపడింది మహాప్రభూ."

"దివాంజీ మాకూడా ఉండాలి, తెల్లవారా టప్పటికి"

"ఉంటారు బాబయ్యా"

"ఏమాత్రం అశ్రద్ధ చేసినా మాటతక్కదని కబురు పంపు తొక్కరుకు"

"చెప్పే పంపాను" అంది మెరుపుతీగ.

మహారాజా మొగాన హాసరేఖ మెరిసింది.

"సరే" అన్నాడు కాలెత్తి

పదుచులు స్నానాలగదిలోకి అడుగు వేయించా రతణ్ణి.

7

కభురుమీద కభురు—నాలుక్కాభుర్ను రాగా, దివాంజీ చిన్నకూతురు పదేళ్లపిల్ల కూడా వచ్చి, ధరణా కూచోగా స్వయంగా కారు నడుపు కుంటూ బయలుదేరాడు లచ్చబ్బాయి

"తమరు రాకపోవడంవల్ల మామూలు పనంతా ఆగిపోయి—కాఫీ పుచ్చుకోడాని క్కూడా అవకాశం లేకుండా ఉంది తమరు కభురు చేయిం చాలా ? చివరికి చెల్లెమ్మగారిని కూడా పంపాలా ? ప్రభువు దేవిడీమన్నా ఆవేశారని తెలిసింది కుప్పగా కూలిపోయాను. 'తొరగా తొరగా' అంటూ తొందర చేశారు మేనేజరు నాకు ప్రపంచం తెలియలేదు ఎన్ని విధాల చూసినా ప్రభువుని విడిచిపెట్టడానికి వీల్లేకుండా ఉంది పది నిమిషాలు—తొక్కపెట్టి సెల విప్పించారు చివరకు" అంటూ యెదటికి వెళ్లగా "ఏమిటీ యీ ఉపద్రవం ?" అంటూ అడిగాడు దివాంజీ, లచ్చబ్బాయి నేకాంతానికి తీసుకు వెళ్లి.

"ఎప్పుడూ అనుకోలేదు అనుమానమే లేకపోయింది చివ్వర పిడుగులా వచ్చి పడింది మాట"

"పిడుగు కాక ? పూలదండా బాబయ్యా యిది ? నా కయినా కలి గిందా యేమాత్రం అయినా అనుమానం యెన్న డయినా ?

"కొంచెం చూచాయగా నైనా నీకు తెలిసివుండాలోయ్."

"శివశివా ! తమరు నమ్మరు"

"నమ్మ రంటే—నమ్మలేక—"

"అంతే అంతే బాబయ్యా ! తమరూ నమ్మలేరు ఎవరూ నమ్మలేరు. మహారాజయినా, దేవిడీమన్నా అనాలనుకునిన్నీ ఉండరు, నా మాట నమ్మండి దొరగారూ"

"అవునుగదా ? పోనీ నావల్ల తప్పు—"

"తప్పా ? తమ వల్లనా ? శ్రీహరీ, నోరు రాదు బాబయ్యా !"

"...........",

"రామా, రామా"

".............",

"తమవంటి దివాంజీ మరే మహారాజా దగ్గిర బాబయ్యా ?"

".. ...."

"తమరు గనక సరిపోయింది గానీ, ఈ గడ్డుదినాల్లో పాకేజీమీద పాకేజి తెప్పించడం మరే దివాంజీకి సాధ్యం బాబయ్యా ?

"నిన్న సాయంత్రానికి నాలుగు పాకేజీలు వచ్చి వుండాలి కదా ?"

"వచ్చాయి బాబయ్యా, వచ్చాయి కనకనే నా కీ ఖంగ !"

"నిమిష నిమిషానికీ నిషా ఉండాలి గదా ?"

"అదయినా వెల్లగుర్రమే కావాలి కదా ?"

"ఎప్పు డయినా నీమీద కోప్పడ్డా ననుకో—"

"కోప్పడితే ? అది నా మేలుకే గదా ? ఆమాత్రం అయినా వొళ్ళు తెలియడం లేదనా బాబయ్యా నాకు ?"

"హృదయం విప్పి చెప్పేస్తాను మెరుపుతీగ విషయం నేనేమి పతకం వేస్తున్నానో—"

"దానిమీద తమకున్న మమకారం నాకు తెలియనిదా ?"

"ఇంకేం మరీ ? నువ్వే కాదు మీ అమ్మా కనిపెట్టలేకపోయింది. చూడూ. ఇలాంటి సంగతులు పెదవి దాటితే పృథివి దాటుతాయి"

"అదీ చెప్పాలా బాబయ్యా ?"

"మహారాణీ యెలాగా సనిపెట్టదు మహారాజుని ఒక్క సంవత్సరం—తప్పితే రెండు అక్పటికి నీ చెల్లెలు ఎప్ ఏ అయిపోను చులాగ్గా."

"అదీ తెలుసు నాకు."

"తెలుసుండి యేమి ప్రయోజనం ?"

"నౌకరీవాళ్లం గదా బాబయ్యా ?"

"నా సంకల్పం—నా యెత్తుగడ—భగవంతుడిక్కూడా తెలియదు."

"సందేహమా ?"

"మహారాణీ విడాకుల ప్రయత్నంలో ఉంది."

"చిత్తం"

"రిజిస్టరు మారేజీ వద్దంటే—కొంచె మయినా గ్రహించగలిగారా మహారాజు ?"

"చిత్తం చిత్తం"

మెరుపుతీగ మహారాజుకి ఉంపుడుకత్తె కావడం మంచిదో మహా రాణీయే కావడం మంచిదో గుర్తించలేకపోయావు"

"ప్రస్తుతం సంగతి చూడాలి బాబయ్యా ! తమకు దేవిడీమన్నా అని విన్నది మొదలు గోల పెట్టేస్తున్నారు నౌకర్లు"

"అవును గదా ? అక్కర్లేదు పామ్మంటే యెంత బాగుండునూ ? మచ్చ గదా యిది ?"

"సందేహమా ?"

"అరవైయేళ్ల వయస్సులోనా యిది ? నలభైయేళ్ళుగా నా రక్తం అంతా ధారపోశాను గదా ?

"నే నెరగనా బాబయ్యా ?"

"అయితే మహారాజా అనుగ్రహం పూర్తిగా తప్పినట్టేనా ?"

"నా నమ్మకం మనవి చేసుకోమంటారా ?"

"చెప్పవోయ్."

"మహారాజా తమర్ని విడిచి వుండలేరు"

"నీకూ అలాగే తోచిందీ ?"

"తోచక ? ఎవరికి మాత్రం మరేమి తోస్తుంది బాబయ్యా ? ఎంత తాహతుగా దేవిడీమన్నా చెప్పారో అంత హఠాత్తుగానూ తమ పాదాలు—"

"పట్టుకుంటా రంటావు మహారాజు ?"

ఇలా అడిగినప్పుడు దివాంజీ మొగాన ఆత్మవిశ్వాసం గప్పుమంది.

"పట్టుకోక ? నే నొక్కటి చెబుతాను బాబయ్యా ?"

"ఏమంటావ్ ?"

"ఈవారం సరిపోతాయి నిన్న వచ్చిన పాకేజీలు. మరి తరవాత ?"

"నా నొసటనే పొడిచిందా పొద్దు ?"

"పొడిచాకా ఆ మాట."

"ఏమయినా, యిక మన కేమీ వద్దోయ్ ?"

"శివశివా !"

"అంతే అంతే. నువ్వేమీ చెప్పవద్దు గప్‌చిప్ ! ఏమంటావు ?"

"సెల విప్పించండి"

"తిన్న అన్నం వొంట బడుతోందా ఒకనా డయినా ? వేల్సు యువ రాజా మెచ్చుకున్న తెలివితేటలు బ్రాందీబుడ్ల సంపాదనకే గదా ఇక్కడ వినియోగం ?"

"అంత రాచకార్యా లేమి ఉన్నాయి బాబయ్యా మరోచోట మాత్రం?"

"నిజమే. ఇప్పటి ప్రభువులు—"

"మరి యిప్పటి దివాంజీలు ?—"

"హోహో, చాలా దూరం విసిరావు అంతే అనుకో. నా పారంసం మీదే విరక్తి పుడుతోంది నాకు"

"విద్వారాలు సెల విప్పిస్తున్నారు బాబయ్యా ?"

"లేదు లేదు నా కొక్కందుకే కించ. మరేంలేదు దేవిడీమన్నా అనక తల కొట్టించేస్తే మంచిది నమ్మినచోట. అందుకు బాధపడుతున్నాను"

"ఏమయినా బధిరాంధకం జమీందారీ తమ చేతిమీదుగా ఏలుబడి కావలసిందే"

"అది నీ కోరిక, నాకు తెలుసు."

"ఒక్కటి మనవిచేసుకో మంటారా ?"

"చెప్పవోయ్."

"పెద్ద మహారాజా చచ్చిపోయాక వాలుగేళ్ల యీమధ్యన విషాలేని నిమిషం—"

"ఎక్కడిదీ ? అది నీకు పూర్తిగా తెలుసు"

"అవును గదా ? కనక వారం తిరగదు బాబయ్యా."

"వారమే తిరగదూ ?"

"తిరగదండి."

"వాకు నమ్మకం లేదోయ్ నీకు సాధ్యం కానిది లేదనుకో"

"ఇంకే ? తమ రలా సెల విప్పించారు కనక, మళ్లీ తమరు దివాణంలో ప్రవేశించాకే నేను వచ్చి మంచినీళ్లయినా పుచ్చుకోడం"

"నువ్వనవలసిన మాటే అన్నావు అయితే, నిరాశ చేసుకోవద్దంటావు"

"వద్దు వద్దు. నౌకరీవాణ్ణి నా చేతిలో లేదనుకోండి కాని ఒక్కటే వారం"

"వారం అన్న వ్యవధి యేమిటీ ?"

"రాళ్లమడుగు బాబయ్య వేటకు దయచేస్తున్నారు"

"ఇక్కడికా, ఇద్దరూ కలిసి మరెక్కడి కయినానా ?"

"మరెక్కడికో అయితే నేను రావడాని కింత ఆలస్యం ఎందుకూ ?"

"ఎప్పుడు దయచేస్తారు ?"

"ఎప్పుడోనా ? ఈ రాత్రే కూచుంటారు మాటులో"

"అంత తొందర యేమి వచ్చింది ?"

"ప్రభువులకు తొందర అంటే ఏమిటి, నెమ్మది అంటే ఏమిటి ? బుద్ధిపుట్టింది, బయలుదేరారు"

"బయలుదేరారూ ?"

"మా పెద్ద చెల్లెలు కూడా—

"వస్తోందా ?"

"దాంతే యీ సరదా ?"

"సెబాస్ !"

"ఇక్కడ మా చిన్నచెల్లెలు మెరుపుతీగ కూడా"

"బయలుదేరుతుందా ?"

"ఆ"

దివాంజీ చూపు మారింది

మనస్సులో ఏదో వూహా—సంకల్పం పొటమరించింది.

అది కనిపెట్టాడు లచ్చబ్బాయి

"సెల విప్పించండి"

"పదపద నా కిది తెలియదు నిన్ను తొందరపెట్టాను"

గంభీరంగా చూస్తూ—వాలకం కనిపెడుతూ—వెనక్కి తిరిగాడు లచ్చబ్బాయి

"సరే పద"

రెండడుగులు వేశాడు, లచ్చబ్బాయి

అంతలో ఆగిపోయి "వేట కాగానే కలుసుకొందాం" అన్నాడు దివాంజీ

మొగం మాత్రం వెనక్కు తిప్పి "చెప్పాలా బాబయ్యా" అన్నాడు లచ్చబ్బాయి.

అతను కూడా మరో రెండడుగులు వేసి "సెలవు బాబయ్యా" అన్నాడు నేల అంటి కళ్ల కద్దుకుని

"ఏదో పతకం వేశాడు పంతులు. అక్కడ తానే కాళ్ళు పట్టుకుంటాడు" అనుకుని పెద్ద పెద్ద అంగలే వేశాడు అతను కూడా.

8

అనుకున్న సమయాన వేటకి బయలుదేరాడు, మహారాజా, రంగ రామానుజం బహద్దరు

ముదురాకుపచ్చ ట్వీడుసూటు ధరించివున్నా డతను

ఇటు సూటు రంగులోనూ, అటు సాయంకాలపు రంగులోనూ సమంగానే ముదురుతోంది నీలిమ

వేటకుక్కలొక వాను నిండా ఉన్నాయి, తొక్కుకుంటూనూ తోసుకుంటూనూ, కరుచుకుంటూనూ, గెంటుకుంటూనూ, మధ్యమధ్య ఒక్కొక్కటి మొరుగుతూనూ.

దానికీ, మహారాజుకోసం సిద్ధం చెయ్యబడివున్న కారుకీ హిల్‌మాన్‌కీ మధ్యగా పాతిక ముప్పయి మంది సంస్థానం వేటకా ళ్లున్నారు. చెరకాకు బల్లేలు ధరించి కొందరూ, ముకుందగిరి బల్లేలు ధరించి కొందరూ, శూలాలు ధరించి కొందరూ ఈటెలు ధరించి కొందరూ, ఎప్పుడెప్పు డన్నట్టు ఆత్రంగా చూస్తూ

వారి తరవాత జోడుగుళ్ల తుపాకీలు ధరించి కొందరూ పిచ్చుకత్తులూ, కటార్లూ, పుచ్చుకుని కొందరూ, మహారాజా సొంత వేటకాళ్ళున్నారు. శిరస్సులకు వేట టార్చిలు తగిలించుకుని

వారి తరవాత రాళ్లమడుగు వేటకాళ్లు నిలిచివున్నారు, చింతజువ్వల పాలెం వేటగాళ్ళ, శక్తిసామర్థ్య లంచనా వేసుకుంటూనూ, వారిని మించి పోవా లనుకుంటూనూ

కారుకి పక్కగా పట్టుతెరలు కప్పిన మేనా, సుసజ్జితం అయివుంది, దాసీ సుందరీమణులతో పరివేష్టితం అయి.

మేనాకి పక్కగా మహారాజా వేటగుర్రం, కళ్లెం కొరుక్కుంటూనూ, తల యెగరవేసుకుంటూనూ, ఉరుముతున్నట్టు మధ్య మధ్య సకిలిస్తూనూ ఖురఘట్టనతో రోడ్డు తవ్వుతూనూ, వెనక్కీ, ముందుకీ అడుగులు వేసుకుంటూనూ నుంచుని వుంది

రెండుపక్కలా ఎందరో గ్రామీణ బాలకులూ, బాలికలూ చెదరువాటుగా వృద్ధాంగనలూ, వూరి యువకులూ నుంచుని ఉన్నారు, ఏమి టేమిటో చర్చించుకుంటున్నా

వందా—వందయాభయి మంది చాకళ్ళు కాగడాలూ, నూనె సిద్దలూ పుచ్చుకుని తమలో తాము హెచ్చరించుకుంటూ అటూ యిటూ తిరుగుతున్నారు

లంతా సిద్ధం అయిందన్న సంగతి తెలుసుకుని హుస్సేను సాహెబు, వెన్ను విరుచుకుంటూ రీవిగా ముందుకి వెళ్ళి బాకా పట్టడానికి సిద్ధంగా నించుని ఉన్నాడు

వెంటనే పెట్రోమాక్సు లైట్లు వెలుగున కదన కుతూహల రాగం కీర్తన స్వరకల్పన చేసుకుంటూ సన్నాయిపాటగాళ్ళు వచ్చారు

వారి వెనకనే వచ్చారు చెయ్యీ, చెయ్యీ పట్టుకుని మెరుపుతీగ, మహారాజాను

వారి వెనకనే వచ్చాడు జోడుగుళ్ల గజబంధనం తుపాకీ మెడకి తగిలించుకుని లచ్చబ్బాయి

వెంటనే మెరుపుతీగా, మహారాజా కారెక్కి కూచున్నారు రాసుకుంటూ.

బాగా విప్పారి ఉన్నాయి, వారి మొగాలు

తమవంటి ఒక జంటనే కలుసుకోబోతున్నారు వారు

అందుకూ ఆ మెప్పుదల వారి మొగాల

విశేషించి తన అక్కని కలుసుకోబోతోంది మెరుపుతీగ.

చిన్ననాడు, మెరుపుతీగ కూడా తన అక్కలాగ, ఒక మహారాణీస్థానీయురా లవుతుందని యెవరూ అనుకోలేదు

తానూ అనుకోలేదు ఆ అక్క, తన చెల్లెలి జీవితం యేదారి పడుతుందో అని ఆందోళన పడిపోతూనే వుంది కూడా

పైగా ఆమె ఒక మహారాణీస్థానీయురా లయిన తరువాత కూడా యింతవరకూ చూసివుండలేదు మెరుపుతీగను.

మెరుపుతీగ ఉత్సాహం పూరికే కాదు, తన అక్కకి తీసిపోని దర్జాతోనే తా నామెని కలుసుకోబోతున్నందుకు

ఆమె ఉత్సాహం క్షణక్షణానికీ ఉత్తరంగితం అయిపోతోంది, తన మొగాన, ఒక్కొక్క గర్వరేఖ ముదిరినకొద్దీ

మహారాజు మొగమూ ఆనందతరంగితంగానే ఉంది కాని అతని ఆనందంలో విషమరేఖ అంకితం అయింది

అతని అనుచరులు కూడా అదేమా అనుకున్నారే గాని అదేమిటో గుర్తించుకోలేకపోయారు

ఈ స్థితిలో లచ్చబ్బాయి వచ్చి తన మెడలో ఉన్న జోడుగుళ్ళ తుపాకీ మహారాజు మెడకి తగిలించాడు

వెంటనే "గోన్" అన్నాడు మహారాజు.

కాని ఎవరూ కాలు కదపలేదు

"చెల్లీ, నువ్వు పాలకీలో కూచో అమ్మాయి యివ్వాళకి" అన్నాడు లచ్చబ్బాయి, మెల్లిగా

"అదేం?" అనబోయాడు మహారాజు, మెరుపుతీగను పొదివిపట్టుకునే ఉండి.

కాని మాట రాలే దతని నోట

లచ్చబ్బాయి తన వంశమర్యాద నిలవడానికే అలా అన్నా డనుకున్నాడు మహారాజు

ధర్మరక్షణకు కంకణం కట్టుకుని వుండాలి మహారాజయిన వ్యక్తి

ధర్మానికి సాయం అనూచాన సంపత్తికిక్కి లోబడి ఉండాలి మహారాజయిన వ్యక్తి.

కాని అది అలా ఉండడంలే దిప్పు డెక్కడా

మహారాజుకేసి పులుకూ, పులుకూ చూసింది మెరుపుతీగ.

మహారాజు కూడా అలాగే చూశాడు మెరుపుతీగకేసి

లచ్చబ్బాయయినా బదులు చెప్పలే దెవరికీ

అతని మొగం చాలా గాంభీర్యం వహించింది.

"ఇక్కడే కూచుంటాను బాబూ" అన్న సరదా కనపడింది మెరుపుతీగ మొగాన

"ఏమంటా ?" వన్న భావం కనపడింది మహారాజు మొగాన

"'ఇక్కడే కూచోనియ్యి" అన్న ప్రార్థనా కనపడింది

లచ్చబ్బాయి మాత్రం వల్లకా దన్నట్టు కరుగ్గా చూశాడు

"అప్పటికే ఆలస్యం అయింది" అన్న గదమాయింపున్నూ కనపడింది.

మహారాజు మొహం వంచుకున్నాడు

దానికి సాయం వెంటనే తలుపులు తెరిచాడు లచ్చబ్బాయి

వెంటనే మెల్లిగా కారు దిగి మెరుపులాగ వెళ్ళి పాలకీలో కూచుంది మెరుపుతీగ

పాలకీ యెత్తుకున్నారు బోయీలు, లచ్చబ్బాయి ఇంగితం కనిపెట్టి.

డ్రైవరు హారన్ వేశాడు

హుస్సేను సాహెబు ఉరుముతున్నట్టు బాకా పట్టాడు

వందా—వంద యా భై కాగడా లొక్కమాటు గప్పుమన్నాయి.

వెంటనే హారన్ నొక్కాడు లచ్చబ్బాయి, కారెక్కి మహారాజుకి తగలకుండా వంగి

వాన్ కదలడం చూసి వేటకుక్కలు మొరిగాయి

"కొట్టు" "పొడు" "కాల్చెయ్యి" అని బొబ్బలు పెట్టారు వేటకాళ్ళు.

డప్పులూ, తప్పెటలూ ఒక్కమాటు బోరుకలగేయి

ప్రస్థానం బయలుదేరింది

చోపుదారులున్నూ గుర్రా లెక్కారు, ప్రస్థాన సందర్భోచితంగా జయధ్వానాలు చేసుకుంటూ

కారున్నూ కదిలింది

కాని, పది గజాలు వెళ్ళాక రోడ్డునే—సూటిగా దూసుకు పోయింది.

పాలకీ, పరివారమూ, కాగడాలూ, వేటకాళ్ళూ మాత్రం అడ్డదారిన పడ్డారు

9

పూర్తిగా పొద్దు గూకింది.

చీకట్లు బలిశాయి.

జనసంచారం వుడిగింది.

ఘంటాపథాన రాతిపొరలు తగిలినప్పుడల్లా గుర్రపు డెక్కల తాకుళ్ళు ఆకాశం అంటుతున్నాయి

చూపు మందగించడంతో కళ్ళున్నూ మూసుకుని "ఎక్కడున్నాం యిప్పుడు ?" అనడిగాడు మహారాజు

"చిరాలగుంట చెరువు దాటాం మహాప్రభూ" అన్నాడు లచ్చబ్బాయి.

మలుపు తిరిగింది కారు

పక్కకి ఒరిగాడు మహారాజు అప్రయత్నంగా.

విసిరేసిన ట్టయింది

"ఇదేమి" అన్నాడు కళ్ళు తెరచి వ్యర్థంగా చూస్తూ.

"నక్కల కాలవ గట్టెక్కాం బాబూ" అన్నాడు డ్రయివరు.

"ఇంకా యిక్కడే ఉన్నామా ?" అనడిగాడు మహారాజు

ఆ మాటలో ఆత్రం స్ఫురించింది

"నిమిషం బాబూ" అంటూనే వడెక్కించాడు డ్రైవరు.

కారు శరవేగాన పోతోంది

వెనకనుంచి జీపొకటి తరుముకు వచ్చింది, రాకాసి లైట్లతో.

"అదేమిటి ?"

"దివాణం నౌకర్లు వస్తున్నారు బాబూ ఎందుకో" అన్నాడు లచ్చబ్బాయి

లైట్లు ఆర్పుకుని సమీపించింది జీపు

పక్కకి చూస్తూ వడి తగ్గించి కా రాపాడు డ్రైవరు.

జీపూ ఆగిపోయింది
హెడ్‌లైట్లు వేశాడు లచ్చబ్బాయి.
ఎదటికి మాత్రమే టార్చిన్నీ వేశాడు.
అప్పు డడిగాడు "ఏమిటి సంగతి?" అని మెల్లిగా
"దివాంజీవారు కాలం చేశారు బాబూ" అన్నాడు జీపులో వచ్చిన ఒక మనిషి
"చచ్చాడూ ?" అన్నాడు మహారాజా.
పళ్ళు కొరుకుతూ అన్నాడు.
చాలా విసుగ్గా ఉం దామాట
"సరే ఎవరది మానాజరుగారా ?"
"అవునోయ్"
"దరిద్రుడు ఆయన బతుకే అంత" అన్నాడు మహారాజా.
"ఎప్పుడూ మంచి సమయానే యిలా చేస్తూ వస్తున్నా డాయన యేదో" అనిన్నీ చెండుకున్నాడు
"వెనక్కి వెళ్లిపొండి బాబూ!" అన్నాడు లచ్చబ్బాయి.
కారు ముందు కురగ్గా, జీపు అలాగే ఉండిపోయింది
గాలి విసురు తట్టుకోలేకుండా ఉన్నాడు మహారాజు
ఎదట—జీబుగా పెరిగివున్న చెట్కున గప్పుమం దొక టార్చి.
"అదేమి" టన్నాడు మహారాజా, చకితుడయి
"కొరివిదయ్యం అయివుంటుంది వీరాధివీరా' అన్నాడు లచ్చబ్బాయి.
మహారాజు కొంచెం వణికాడు
"ఇక్కడ ఉన్నాయా అవిన్నీ" అనడిగాడు కూడా
"ఉన్నట్టే చెప్పుకుంటారు మహాప్రభూ, ప్రజలు" అన్నాడు లచ్చబ్బాయి, మహారాజు దగ్గిరగా డేకుతూ.
"ఏమి చేస్తా యవి ?"
"మనిషిని చుట్టుకుంటాయి. అధికంగా ఉంటే చుట్టుకుంటాయి భయపడితే చిందులు తొక్కుతాయి కేకలు, కూతలు ఒకటేమిటి, గందరగోళం చేసేస్తాయి బాబూ" అన్నాడు డ్రైవరు.
"చేసి ?"
మేకలాగ అరచింది తుప్పచాటున ఒక కొరివిదయ్యం లేచి.
గతుక్కుమన్నాడు మహారాజు
"మెరుపుతీగ ఉందిగదా ముందు ?"
ఇలా అడుగుతూ వణికిపోయాడు మహారాజు.
"భయంలేదు బాబూ, అడ్డదారిన వెళ్లాయి, పాలకీ, పరివారమూ, గుర్రాలూను" అన్నాడు డ్రైవరు
"ఆ దారిలో లేవు మహాప్రభూ, దయ్యాలు" అన్నాడు, లచ్చబ్బాయి.
"కారు మాత్రం యిలా యెందుకు రానిచ్చావు ?"
ఆత్రంగా అడిగాడు మహారాజా.
"తారువేసిన రోడ్డుకదా, త్వరగా వెళ్లవచ్చుగదా అని."
ఇలా అనడం తడవుగా అల్లంత దూరాన రోడ్డు కొక పక్కగా నుంచుంది ఒక కొరివిదయ్యం, పళ్ళికిలిస్తూ
గడగడలాడిపోయాడు మహారాజు
లచ్చబ్బాయి పొదివి పట్టుకున్నాడు మహారాజుని.
కాలవవైపుగా రెండు కొరివిదయ్యాలు లేచాయి, అటుతిరిగి, నక్కకూత కూస్తూ ఒకటీ, కుక్కలా మొరుగుతూ ఒకటిన్నీ
డ్రయివరు భుజం పట్టుకున్నాడు మహారాజు కళ్ళు మూసుకుని.
జీబుగా పెరిగివున్న చెట్టుకి దగ్గరగా నుంచునివున్నా డొక మనిషి
వెంటనే బాగా అదిమి పట్టుకున్నాడు లచ్చబ్బాయి మహారాజుని, వదలకుండా.

కారు లైట్ల వెలుగు తట్టుకోలేక అటు మొగంగా తిరిగా డా మనిషి.
అలా తిరగడంలో బుగ్గమీసాలు మెరిశాయి
వెంటనే పక్కనుంచి వచ్చి ఒక కొరివి దయ్యం అతని యెదుట నుంచుంది
పది పదిహేను దయ్యాలు చుట్టుకున్నాయి కూడా తుపాకీ గురికి ఎదంగా
మహారాజు ఎదటే కొరి వాడించిం దొక దయ్యం, పక్కగా నుంచుని.
గిజగిజలాడిపోయాడు మహారాజు
"భయంలేదు బాబూ" అంటూ మరింత గట్టిగా పట్టుకున్నాడు లచ్చబ్బాయి.
ఆ పట్టుకోడంలో తుపాకి ముందుకి గురిపెట్టాడు కూడా
"బాబూ, బాబూ" లంటూ కలియతొక్కుకోసాగాడు ఆ మనిషి.
"అదేవ ?" రన్నాడు మహారాజు
"ఎవరోకాదు మహాప్రభూ, దివాంజీవారు బ్రహ్మరాక్షసయి వచ్చారు బాబూ, పట్టుకుందామని" అన్నాడు లచ్చబ్బాయి
మహారాజు మరింత గట్టిగా పట్టుకున్నాడు "తుపాకీ సరీగా గురిపెట్టి, కాల్చండి బాబూ" అంటూ.
ఆ మనిషి చుట్టూ, బొబ్బలూ, చిందులూ [redacted]పెట్టాయి, కొరవి దయ్యాలు, మీదిమీదికి 'కొరవులు తిప్పుతూ.
మనిషి కంకాళాల్లా ఉన్నాయవి
"కాల్చెయ్యి" అనరిచాడు మహారాజా, రెండు చేతులా మొగం కప్పుకుని
తుపాకి ఢామ్మంది
కొరివిదయ్యాల బొబ్బల్లో హా అన్న మనిషి ఆర్తనాదం లీనం అయిపోయింది
మనిషి నేలగూలిన చప్పుడున్నూ అయింది
ఇంతలో కొరవులన్నీ ఆరిపోయాయి, కాలవవైపున తప్పుకుని.
పడిపోయిన మనిషి చేతి టార్చి పగిలిపోయి ఆరిపోయింది.
లచ్చబ్బాయే వేశాడు టార్చి
లది వూపాడు కూడా
ఒక కొరివి దయ్యం వచ్చి, పళ్లికిలిస్తూ తలుపు తీసింది.
దానిమీది కురుకుతున్నట్టు కారు దిగేశాడు లచ్చబ్బాయి, హుమ్మంటూ
ఝర్రుమంది కారు.
రెండు ఫర్లాంగుల దూరాన ఆగింది మళుపులో

* * *

క్షణంలో పది కొరవులు గప్పు మన్నాయి
వంగి పడిపోయిన మనిషి చెవిదగ్గర నోరు పెట్టాడు లచ్చబ్బాయి.
వూగిపోతూ ప్రారంభించాడు కూడా.

"బలవంతుడ నా కేమని
పలువురితో నిగ్రహించి పలుకుట మేహాలా
బలవంతమ్మైన సర్పము
చలిచీమల చే—హా—త జి—హిక్కి ఛావదే సుమతీ !"

అంటూ వూగిపోయాడు కూడా.
వూగుతూనే "గద్దన్నా" అన్నాడు.
కంకాళం డ్రెస్సు తీసేసుకుంటూ ఎదటికి వచ్చాడు గద్దన్న.
"బాగా విను" అన్నాడు లచ్చబ్బాయి.
"నక్కల కాలవ వూబిలో పాతిపెట్టెం ఈ మనిషిని. భద్రం గప్‌గప్" అనిన్నీ అన్నాడు
అన్నా డంతే. టార్చి వేసుకుని కారుకేసి పురకలు పెట్టేశాడు.

చతురస్రం

శ్రీ శ్రీరంగం శ్రీనివాసరావు

["చతురస్రం" నాటిక ఎప్పుడో నేను వ్రాయవలసింది. భగవంతుని గురించీ, మానవుని గురించీ నాకున్న అభిప్రాయాలను ఈ నాటిక ద్వారా కొంతలో కొంతయినా తెలియజేయగలిగానని నేననుకుంటున్నాను శ్రీశ్రీని నిరీశ్వరవాదిగా చిత్రించేవారు కొందరున్నారని నాకు తెలుసు అలాంటివారినే నేను ముఖ్యంగా ఈ నాటికను శ్రద్ధగా చదవండని కోరుతున్నాను

నేను మూడుసార్లు మృత్యువును జయించానని సవినయంగా మనవి చేస్తున్నాను. ఆ వివరాలను ఇంకోసారి—బహుశా కావ్యరూపంలో ప్రజల సమక్షంలో పెడతాను ప్రస్తుతం నేను చెప్పబోయే దేమిటంటే మరణమంటే నాకు భయం లేదనే ఎప్పటికైనా మానవుడు మరణంమీద విజయం సాధిస్తాడనే నమ్మకం నాకుంది ఆ నమ్మకమే ఈ నాటికా రచనకు ఆధారం.

"1962 ఫిబ్రవరి నెలలో ప్రళయం వచ్చి మద్రాసు మునిగిపోతుంది కాబట్టి ఆశ్రయం ఇస్తాను ఒక ఆశ్రమానికి రమ్మ"ని ఒకమహర్షి నాకు ఆహ్వానం అందజేస్తే నే నిచ్చిన జవాబు "మద్రాసు నగరం మునిగిపోయి ఇక్కడున్న లక్షలాది ప్రజలు చచ్చిపోతే వారితోబాటు నేనూ చస్తాను గాని ప్రమాదంనించి పారిపోయి బలుసాకు తినను" అన్నాను అలాగే ఒకప్పుడు రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో బాంబుల భయంవల్ల ప్రజలంతా మద్రాసునుంచి పారిపోతూ ఉన్నప్పుడు, నేను మాత్రం నా స్థలం వదలలేదు విశాలపట్టణంమీద జపాన్‌వారు బాంబులు వేసిననాడు మద్రాసులో సైరెన్ల కూత మోగినప్పుడు విశాలమైన డాబామీద నేను విశ్రాంతిగా నిద్రపోతున్నాను. ఇదంతా ఇప్పుడు ఎందుకు చెబుతున్నానంటే మరణానికి భయపడే మానవులకు ధైర్యం చెప్పడానికి

ఇక ఈ "చతురస్రం" గురించి ఒకటి రెండు మాటలు చతురస్రం అంటే నలుచదరం ఎ బి సి డి అనే చదరం ఈ చదరంలో అన్ని బాహువులూ సమానమైనవనే అనుకోకూడదు అలాగే ఇందులోను నలుగురు ముఖ్య పాత్రలూ, కథాకాలంనాటికి వేరు వేరు వయస్సులవారు అందులో ఏ జ్ఞానం అనే వైజ్ఞానికుడు ఆయన వయస్సు 70 ఏళ్ళు బి రాజ్యం అనే ఆవిడ ఆమె వయస్సు 50 ఏళ్ళు సి కళ అనే అమ్మాయి ఆ పిల్ల వయస్సు 10 ఏళ్ళు డి సిరి అనే కవి అతని వయస్సు 30 ఏళ్ళు

కథాకాలం అని కదూ అన్నాను ఆ కాలం ఏదో మరి చెప్పొద్దూ ఇది సుమారు ఒక గంటసేపు సాగే నాటకం కాని కథాక్రమం ప్రకారం ఒక ఉదయంనుంచి మరునాటి ఉదయంవరకు కథ సాగుతుంది ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం, అర్ధరాత్రి, ఉదయం అని మధ్య మధ్య కవి వచ్చి మీకు కాలాన్ని జ్ఞాపకం చేస్తూ ఉంటాడు 1999 వ సంవత్సరం డిసెంబరు 31 వ తేదీని ఈ కథ ప్రారంభమవుతుంది అప్పుడు చంద్రలోకంనుంచి మానవుడు అమృతం తెచ్చాడని ఐక్యరాజ్యసమితికి తెలుస్తుంది అమృతం పంచిపెడితే మానవులంతా ముప్పయ్యేళ్ళవాళ్ళయిపోతారు అప్పటికి మానవ కుటుంబమంతా రాజకీయ స్వాతంత్ర్యమూ, ఆర్థిక స్వాతంత్ర్యమూ అనుభవిస్తూ, మానసిక స్వాతంత్ర్యం సాధించడానికి ప్రయత్నిస్తున్నారు అమృతాన్ని అందరికీ పంచిపెడితే ఈ స్వాతంత్ర్యం సాధ్యమవుతుంది కాని సమితిలోనే కొందరు దీనికి అడ్డు చెబుతారు. అయితే ఆనాడు ప్రగతినికోరే దేశాలే ఐక్యరాజ్యసమితిలో అధిక సంఖ్యాకంగా ఉండడంవల్ల ఆఫ్రో—ఆసియన్ రాజ్యాల తరఫున కాంగో ప్రతినిధి లుముంబా జూనియర్ ప్రతిపాదించిన తీర్మానం నెగ్గుతుంది. ఆలస్యం అమృతం విషం. తక్షణమే అమృతాన్ని మానవ జాతికి పంచిపెట్టాలని ఆఫ్రో—ఆసియన్ తీర్మానం అది నెగ్గిన అరగంటలో ప్రపంచ మంతటా అమృతాన్ని అఖిలప్రపంచం ఆరోగ్య శాఖాసంస్థ ప్రజలకు అందజేస్తుంది మన చతురస్రంలోని నలుగురూ కూడా ముప్పయేళ్ల వాళ్ళయిపోతారు. 70 ఏళ్ళ జ్ఞానం, 50 ఏళ్ళ రాజ్యం, పదేళ్ల కళా. ఎటొచ్చీ కవిగారైన సిరిగారు మాత్రం నిన్న 30 ఏళ్లవాడే, నేడూ 30 ఏళ్లవాడే

ఇరవయ్యో శతాబ్దం అంతమవుతుంది ఇరవై ఒకటో శతాబ్దం ప్రవేశిస్తుంది ఆ ఉదయాన్ని వర్ణిస్తాడు కవి—తర్వాత

ఇలాగ కథంతా నేనే చెప్పేస్తే ఇక మీకు వినేందుకేమీ ఉండదు. కాబట్టి ఇక్కడితో నా ఘోష ఆపుతున్నాను

ఇక ప్రారంభందగ్గిర ప్రారంభిద్దాం.]

స్త్రీ : ఏదో జరగబోతోంది
ఏదో జగకబోతోంది.
ఏదో జరగతుం దిప్పుడు.

పురు : ఎవరో వస్తున్నారు.
ఎవరో వస్తున్నారు
ఎవరో వస్తున్నా రిట్టు (ఈల) ష్ ....

సిరి : నా పేరు సిరి

స్త్రీ . ఈయనొక కవి

పురు · ఇంటిపేరో మరి ?

సిరి . సరి—ఆసిరీ ఆ సంగతి అలా ఏసిరీ.

ఇది ఉదయం
నా హృదయం వయస్సు ముప్పయ్యేళ్ళు.
నా మనస్సు వయస్సు ముప్పయ్యేళ్ళు
నా వయస్సు ఈ ఉదయానికి సరిగ్గా ముప్పయ్యేళ్ళు.
ఇది ఉదయం.
నిద్రలో కరిగిపోయింది క్రితం రాత్రి
పక్షులూ, బస్సులూ పంపించేశాయి నిశ్శబ్దాన్ని.
పరుపులకిందకి చెట్లవేళ్ల సందుకి
ఆకాశపు అంచుకి
ప్రపంచం మేలుకొని ఆవలించింది లేదా ఆవలించి మేలుకొంది (మీ ఇష్టం ఎలా వీలైతే అలా, ఎలా సులువైతే అలా ఇటు మాట అటో అటు మాట ఇటో)
నిద్రపోయిన (కాదు వచ్చిన) ప్రపంచం నిన్నట్లోంచి నేట్లోకి దూకింది
సముద్రం లేచింది—అరణ్యం లేచింది.
గ్రామం లేచింది—పట్టణం లేచింది
నగరం లేచింది—మహా నగరం లేచింది.
నదులూ, నదుల్లో చేపలూ,
గనులూ, గనుల్లో సీసాలూ,
కనులూ, కనుల్లో నగలూ—మేలుకున్నాయి.
నే నింకా నిద్రపోతున్నాను
నే నింకా నిన్నట్లోనే నాన్నున్నాను
మసగ్గా ఉంది విసుగ్గా ఉంది
అలక అనుకున్న వేమీ కాకుండా ఉన్నాయని,
నిద్రయినా సరిగ్గా రాకుండా ఉందని
నాకు తెలుసు నాకు తెలియకుండా తెల్లవారిందని.
నాకు తెలుసు నాకు తెలిసినవన్నీ నాకు తెలుసునని.
పాలవాడు పాలు తెచ్చాడు.
పేపరువాడు పేపరిచ్చాడు

* * * *

న్యూస్ ఎనౌన్సర్ అఖిల ప్రపంచ తెలుగు రేడియో వార్తా సంస్థ, తెలుగులో వార్తలు చదువుతున్నది విశ్వం
సమయం —1999 డిసెంబర్ 31 వ తేదీ .....
స్థలం—ఆంధ్రప్రదేశంలో కొత్తగా నిర్మించిన అరవై అంతస్తుల ఐక్యరాజ్యసమితి భవనం

పండిట్ మన్‌హర్‌లాల్. ఇవ్వాళ్టి సుదినం పై మనం ఈ సమావేశం ఇప్పుడు ఇక్కడ చెయ్యడం బహుత్ బహుత్ ముదావహం ఐ ప్రపోజ్ మిస్టర్ శ్రీ రావ్ యాజ్ ప్రెసిడెంట్ డిలా కంకూర్స్ డె నసియోంస్వని.

శ్రీరావ్ · షుక్రియా పండిట్‌జీ
నేను తెలుగువాణ్ణి
నన్ను ఈనాటి ఈ సభకి అధ్యక్షుణ్ణిగా ఎన్నుకోవడం నాకూ, నా భాషకీ ప్రపంచం చేస్తున్న గౌరవం మర్సి, మర్సి బకూ.
పండిట్ మన్‌హర్‌లాల్ గుడ్‌మార్నింగ్ డెలిగేట్స్
ఇప్పుడూ ఐక్యరాజ్యసమితీ అధ్యక్షుడూ ప్రపంచ్ పరిస్థితిని పర్యాలోకన్ కరేంగే

శ్రీరావ్ . థ్యాంక్ యూ మిస్టర్ మనహర్
ఇవ్వాళతో ఇరవయ్యో శతాబ్దం ముగుస్తుంది ఒక కొత్త సంవత్సరంలో, ఒక కొత్త శతాబ్దంలో అడుగుపెడుతోందిమానవ జాతి 150 స్వతంత్ర దేశాలు సమావేశమైన మహాసభ ఇది ఈ దేశాలన్నింటిలోను ఒక్కొక్క యునైటెడ్ నేషన్స్ భవనం ఉంది తెలుగువాణ్ణి కాబట్టి తెలుగులో మాట్లాడుతున్నాను నాకు తెలుసు నా ప్రసంగం ఈ క్షణంలో ప్రపంచపు నలభై నాలుగు ప్రధాన భాషల్లోకి పరివర్తనం చెందుతోందని
ఐ సెల్యూట్ మై ఆఫ్రికన్ కామ్రేడ్స్
ఐ సెల్యూట్ మై ల్యాటిన్ అమెరికన్ కామ్రేడ్స్
ఐ సెల్యూట్ ఆల్ మాన్‌కైండ్
ఈదినం ప్రపంచంలో ఎక్కడా అస్వతంత్రరాజ్యం లేదు కాని ఒక పాతికేళ్ళ వెనక్కి తిరిగి చూడండి చరిత్ర మీకు తెలుసు వలస రాజ్యాలవాళ్ళు, కలవాళ్ళు వాళ్ళు ఎన్ని వలలు పన్ని ఎన్ని విధాలుగా తమ విధానాన్ని కొనసాగించుకోవా లనుకున్నారో కాని మేలుకున్న మానవ జాతి ముందడుగు వేసింది వలస విధానం నశించింది మనిషి రాజకీయంగా స్వతంత్రుడయ్యాడు అది పాతికేళ్ల కిందట.
ఆ మీదట —
ఐక్యరాజ్యసమితి యుద్ధాన్ని బహిష్కరించింది.
థ్యాంక్స్ టు యు. ఎస్ ఎస్ ఆర్.
థాంక్స్ టు యు ఎస్ ఏ
థ్యాంక్స్ టు ఎవ్విరిబడీ, ఎవ్విరివ్వేర్.
యుద్ధ రాక్షసికి అహింసాయుతంగా అంత్యక్రియలు జరిగాయి.
మానవ జాతి ఒకే కుటుంబం
అన్నమాటకి ప్రాణం వచ్చింది
హియర్, హియర్, హియర్. (చప్పట్లు)

శ్రీరావ్ : ఫ్రెండ్స్ రాజకీయ స్వాతంత్ర్యం సాధించిన మానవుడు ఆర్థిక స్వాతంత్ర్యంకోసం పోరాటం సాగించాడు మళ్లీఎన్నోఆటంకాలు మళ్లీ ఎన్నో అవాంతరాలు కలవాళ్లనీ, లేనివాళ్లనీ, వ్యత్యాసాలు లేకపోతే లేనివాళ్లకి లేనివాళ్ళ కానివాళ్ళు దయాధర్మభిక్షలూ, సాహాయ్య సానుభూతి సహకారాలూ చూపించడం పోతుంది అందువల్ల మానవుల్లోని మానవత్వం నశిస్తుంది అనే ఒక వింతవాదం వితండవాదం బయలుదేరింది మళ్లి యుద్ధ రాక్షసికి ఈ సమస్య ఆధారంగా ప్రాణ ప్రతిష్ఠ జరిగే ప్రమాదం, లోకాన్ని ఎదుర్కొంది ప్రశాంతంగా శాస్త్రీయ విజ్ఞాన పరిశోధనలు సాగిస్తున్నవారు, వివిధ కళలలో విశేష విజయాలు సాధిస్తున్న కళాకారులు, విద్యావేత్తలు మొదలైన మేధావు లంతా ఈ మన ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంక్రింద ప్రపంచం అంతటికీ . ఆర్థిక స్వాతంత్ర్యం సాధించారు యుద్ధ ప్రయత్నాలక్రింద ఖర్చవుతున్న కోటాను కోట్ల ధనం మానవుని ఆరోగ్యానికీ, విద్యకీ, ఆనందమయ జీవితానికీ వినియోగమవుతున్న స్థితిలో ఇప్పుడు మనం ఉన్నాము.
కాని .
రాజకీయ స్వాతంత్ర్యం వచ్చినా.
ఆర్థిక స్వాతంత్ర్యం వచ్చినా
మానవ జాతి కింకా మానసిక స్వాతంత్ర్యం ఏర్పడలేదు.
మన ఆలోచనలింకా అరాజక దశలోనే ఉన్నవి
అరణ్యాలు మన మనస్సులు
అగాధాలు అజ్ఞేయాలు మన మనోలోకపు భావనా విధానాలు.
మానసిక స్వాతంత్ర్యం సాధించడమే ఈనాటి మానవ సమస్య.

* * * *

కవి మధ్యాహ్నం అయింది డెలిగేట్లు లంచికి పోయారు కథలన్నీ కంచికి పోయాయి ఎంత వింతగా ఉంది ఈ మధ్యాహ్నం ఎంత హాయిగా ఉంది నా హృదయం ఎంత నిర్మలంగా ఉంది నా మనస్సు ఈర్ష్యల్లేని ద్వేషాలులేని ఈ మానవ జాతిని ఎంతగా ప్రేమిస్తున్నాను నేను.
ప్రేమ ప్రేమ . ప్రేమ

కళ · మామా మామా మామా .
సిరి కళా, కళా, కళా
ఎందుకొచ్చా విలా—స్కూలు లేదా?
కళ పరీక్షలు కాదూ అంచేత మధ్యాహ్నం సెలవు.
సిరి జాగ్రత్త పడగలవు ఏవిటా గంతులు
కళ నిన్న లెక్కల పరీక్షలో నాకు ఫస్టు మార్కొచ్చింది మామయ్యా.
సిరి అందుకా ఆ చిందులు మ రివాళ?
కళ చరిత్ర ప్రపంచ చరిత్ర.
సిరి · సరిగ్గా రాశావా?
కళ రాశాను కానీ .
సిరి · కాని?
కళ ఫస్టుమార్కు రాదేమో?
సిరి కళకి ప్రపంచ చరిత్రలో ఫస్టుమార్కు రాకపోవడం కవికే కళంకం.
కళ ఇవాళ నా పుట్టిన రోజు మావయ్యా
సిపి శుభం
కళ పదేళ్లువెళ్లి పదకొండోయేడొచ్చింది నాకు
సిరి సంతోషం
కళ మావా ఇవాళ మన వూళ్లో ఐక్యరాజ్యసమితి సమావేశం కదూ ...
సిరి అవును
కళ గొప్ప గొప్ప వాళ్లంతా వస్తారు కదూ?
సిరి వచ్చారు

* * * *

ఎనౌన్సర్ ఐక్యరాజ్యసమితి భవనం పదో అంతస్తులో భద్రతామండలి రహస్య సమావేశం జరుగుతోంది సింహళ ప్రతినిధి శ్రీమతి సిగీరియా యీ సభకు అధ్యక్షత వహించారు

సిలన్ మిత్రులారా! చంద్రమండలానికి వెళ్ళిన మన వైజ్ఞానిక బృందం ఇప్పుడే ఒక రిపోర్టు పంపింది దాని ప్రతులు మీ ముందర ఉన్నాయి. చంద్రమండలం చేరగానే వారిలో వచ్చిన మార్పులన్నీ వివరిస్తూ ఒక రహస్య నివేదికను, వెళ్లిన యాభైమంది వైజ్ఞానికుల తరఫునా వారినాయకుడు మనకు పంపించాడు బయలుదేరినప్పుడు వారివయస్సులు వేరు వేరు సుధానిధి అయినచంద్రునిలోని అమృతంవల్ల వెళ్లినవారంతా ముప్ఫయ్యేళ్ల వారయిపోయారు.
అనగా త్రిదశులయా రన్నమాట మానవులు దేవతలుగా మారగల అవకాశం ఇప్పుడు లభించింది ఈ సాయంత్రమే వైజ్ఞానిక బృందం న్యూఢిల్లీలో దిగుతుంది మానవజాతి అంతకీ సరిపోయే అమృతం వారు తీసుకొని వస్తున్నారు ప్రపంచ ఆరోగ్య సంస్థ ద్వారా వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ ద్వారా ఈ అమృతాన్ని అరగంటలో అన్ని ప్రాంతాలవారికి

అందజేయవచ్చును భద్రతామండలి యీ విషయమై నిర్ణయం చేయ వలసియున్నది ఇందులో రాజకీయా లేవీ లేవు అమృతం పంచిపెట్టాలా వద్దా, లేక వెంటనే పంచిపెట్టాలా, కొన్నాళ్లదాకా ఆగాలా అన్నదే ఇప్పుడు మనముందు వున్న సమస్య. దీన్నిగురించి మొట్టమొదట బ్రిటిష్ ప్రతినిధి సర్ జాన్ హైమన్ ప్రసంగిస్తారు.

*   *   *   *

హైమన్ థాంక్స్ మాడమ్ ప్రెసిడెంట్
అమృతం పంచిపెట్టాలా వద్దా అనే విషయమై రెండు అభిప్రాయా లెప్పుడూ ఉండవు. ఇప్పుడూ లేవు అయితే అకస్మాత్తుగా, తక్షణమే పంచ వలసిన అవసరం ఏం వచ్చిందని నే నడుగుతున్నాను మానవు లంతా ముప్ఫ య్యేళ్లవాళ్లయిపోయినంతమాత్రంచేత, వాళ్ల మనస్సులు, వాళ్ల ఆలో చనలూ ముప్ఫయేళ్లవాళ్లవే అవుతాయనుకోవడం పొరపాటు. ఈనాడు చంటిపిల్లలు మొదలు చనిపోవడానికి సిద్ధంగాఉన్న వృద్ధుల వరకూ ఎన్నో వయోవ్యత్యాసాలను ప్రదర్శిస్తోంది, మానవ జాతి. ఒక్క మందుతో ఈ ఎగుడు దిగుడులన్నీ సద్దుకొని చదునయిపోతాయా ఈ విష యమై ఈ సభకు వచ్చేముందుగా మా బ్రిటిష్ వైజ్ఞానిక నిపుణు లతో లంచి టేబిలువద్ద ఆషామాషీగా చర్చించాను అందరూ ఇంచు మించు ఒకే అభిప్రాయాన్ని ప్రకటించారు మందు తీసికొన్న మరు క్షణమేమనుష్యుల-మనస్సులుమారిపోవని మానవజాతి,మానసికస్వాతంత్ర్యం సాధించాలంటే కొంత కృషి, కొంత ప్రచారమూ, కొంత ప్రయత్నమూ అవసరం. ముందుగా మనం మానవులను మానసిక స్వాతంత్ర్యానికి సంసిద్ధుల్ని చెయ్యాలి తర్వాత మందియ్యాలి అందుచేత ఒక పది సంవత్స రాలదాకా, లేదా కనీసం ఐదు సంవత్సరాలదాకా ఈ అమృతం సమస్యకి వాయిదా వెయ్యాలని కోరుతున్నాను

భా ప్ర • అడ్డువచ్చినందుకు క్షమించాలి మాడమ్ ప్రెసిడెంట్, మీ అను జ్ఞతో

సిలన్ ఎవరు? భారతప్రతినిధిగారా! మాట్లాడవచ్చు

భా. ప్ర : ఇరవయ్యో శతాబ్దం అంతం కావస్తున్నా, ఇరవయ్యోశతాబ్దపు ప్రారంభంలో ఆ డి న లాం టి మా ట లే ఆడుతున్నాడు మన బ్రిటిష్ మిత్రుడు ఇప్పటికీ యీ బ్రిటిష్‌వారి మన స్తత్వం ప్రగతి నిరోధకభావాలనే ప్రసరిస్తున్నదని చెప్పడానికి చింతిస్తు న్నాను ఎప్పుడూ సమస్యలకు వాయిదా వెయ్యడం, జాప్యం చెయ్యడం తప్ప సూటిగా ఎదుర్కొని సులువుగా పరిష్కరించడం కనబడదు ఆనాడు ఇండియా స్వాతంత్ర్యానికి కూడా ఇలాగే వాయిదాలు వేశారు మొదటి ప్రపంచ యుద్ధం ముగిసిన వెంటనే భారతీయులకు స్వేచ్ఛ లభించి ఉండవలసింది—కాని అలా జరగలేదు తర్వాత పాతికేళ్ళకుపైగా గాంధి మహాత్ముని నాయకత్వంక్రింద భారతీయులు అహింసాయుతంగా గొప్ప పోరాటాలు సాగించిన మీదట కదా మేం స్వతంత్రుల మయ్యాము విప్ల వాలతోను, రక్తపాతాలతోను, ఇతర దేశాలకు స్వాతంత్ర్యం సిద్ధిస్తే, ఒక్క భారత దేశమే అహింసాయుతంగా, రక్తపాత రహితంగా···

హైమన్ పొరపాటు రక్తపాతం లేకుండా స్వరాజ్యం సంపాదించామని మన మిత్రుడు భారత ప్రతినిధి యీనాడు ప్రచారం చేసుకోవచ్చు నా అభ్యంతరం లేదు కాని చరిత్ర ఇస్తున్న సాక్ష్యం మాటేమిటి? ఇండి యాకు స్వాతంత్ర్యం రాకముందూ, వచ్చిన తర్వాత ఎన్ని లక్షల మంది హిందువులూ, ముస్లిములూ మరణించలేదు స్వరాజ్య ప్రదానానంతరం మీ గాంధీ మహాత్ముని రక్తాన్నే ఒక మత దురహంకారి మీ రాజధాని నగరంలో చిందించాడే

భా ప్ర ఐ అబ్జెక్ట్ మాడమ్ ప్రెసిడెంట్. స్వరాజ్య ప్రదానం అన్న మాటకి నేను అసమ్మతి తెలుపుతున్నాను స్వరాజ్యం మా కెవరూ దానంగా ఇవ్వ లేదు.

హైమన్ • అయితే నా మిత్రుడు భారత ప్రతినిధికి అసలు రహస్యం తెలియదన్న మాట ఇండియాకి స్వాతంత్ర్యం అహింసా యుద్ధాలవల్ల రాలేదు స్టాలిన్‌గ్రాడ్‌లో రష్యా గెలవడంవల్ల రాలేదు. నేతాజీ సుభాస్‌చంద్రబోస్ సేనలు నిర్మించడంవల్ల రాలేదు.

భా ప్ర అయితే మరెలా వచ్చిందంటారో అన్నీ తెలిసిన మన బ్రిటిష్‌మిత్రుడు?

హైమన్ : అన్నీ తెలిసిన వాణ్ణిగా అభినయించడం లేదు నేను ఇండియాకు స్వాతంత్ర్యం ఎలా వచ్చిందో నాకు తెలుసు బ్రిటిష్ రాజ కుటుంబమే ఇండియాకు స్వాతంత్ర్యం ఇచ్చింది ఆనాడు ఆరవ జార్జి చక్రవర్తికి ఎలిజబెత్ యువరాణి ఇచ్చిన సంహా వల్లనే ఇండియా స్వతంత్రరాజ్య మయింది దీనికి సంబంధించిన రహస్య పత్రాలు బకింగ్ హాం భవనపు పాత రికార్డుల గదిలో ఉన్నాయి

భా. ప్ర ఆ రహస్య పత్రాలేవో మేం చూడగల అవకాశం ఉందా?

హైమన్ అందరూచూసే అవకాశం ఉంటే అవి రహస్యపత్రా లెలా అవుతాయి.

భా. ప్ర నాకు తెలిసిన మట్టుకు బ్రిటన్‌లో పార్లమెంటు నిర్ణయాలు చేస్తు దనీ, లాంఛనప్రాయంగా దానికి రాజముద్ర లభిస్తుందనీ అనుకుంటు న్నానే

హైమన్ . బ్రిటిష్ పార్లమెంటు గురించి మాకన్న తనకే ఎక్కువ తెలుసునని కొంటున్న మన భారతీయ మిత్రుణ్ణి నేను అభినందించకుండా ఉండ లేకపోతున్నాను

భా. ప్ర : మీ అభినందనలోని అంతర్యానికి నేను ఆనందిస్తున్నాను.

సిలన్ . ఆర్డర్, ఆర్డర్ ఫ్రెండ్స్ మనం అసలు విషయం మరచిపోయి అనేక దశాబ్దాలనాటి సంగతులు చర్చిస్తున్నాం నేను మొదటే చెప్పాను. ఈనాడు ఈ సభ రాజకీయాలకి చర్చావేదిక కాదని మనముందున్న సమస్య విషయమే మాట్లాడుకుందాం సర్ జాన్ మీ రింకా ప్రసంగించదలచు కున్నారా?

హైమన్ నో మేడమ్ నేను చెప్పవలసిం దేదో చెప్పేశాను

సిలన్ ఇప్పుడు అమెరికా ప్రతినిధి మిస్టర్ శాంశ్సాన్ మాట్లాడుతారు.

శాంశ్సా నాది ప్రజా స్వామ్య దృక్పథం మెజారిటీ అభిప్రాయాన్నే ఆమోది స్తాను కాని నా వోటు మాత్రం బ్రిటిష్ ప్రతినిధి అభిప్రాయానికే.

సిలన్ : కాంగో ప్రతినిధి శ్రీ లుముంబా జూనియర్

లు. జూ. ఆలస్యం అమృతం విషం. ఆలస్యం చేయకుండా అమృతాన్ని పంచి పెట్టాలి అంతే

రష్యా . వెల్‌సెడ్ వెల్‌సెడ్.

సిలన్ ఎవరది, సోవియెట్ ప్రతినిధిగారా ? మైక్ దగ్గరికివచ్చి మాట్లాడ వచ్చునే

రష్యా నా సమయం వచ్చినప్పుడు నేను మాట్లాడుతాను

సిలన్ • సరే ఇప్పుడు ఫిలిప్పీన్స్ ప్రతినిధి డూమాడూగారు మాట్లాడుతారు.

ఫిలిప్పీన్స్ కాంగో ప్రతినిధి ముక్తసరిగా మూడు మాటల్లో సమస్యని పరిష్క రించివేశాడు కాని ఇది అనుకున్నంత సులువుగా అయ్యే పనికాదు నాగరిక తలో వెనుకపడిన దేశాలకు స్వతంత్ర రాజ్యాలతో సమాన ప్రతిపత్తి ఇస్తే ఇలాటి అనర్థాలే తటస్థిస్తాయి

లు : కాంగో వెనుకబడిన దేశం కాదు అన్ని రంగాలలోను పురోగమిస్తున్న శ్రేయో రాజ్యం అది

ఫిలిప్పీన్స్ అని మీరు అరుకుంటున్నారు నిజంగా ఎంతవరకు పురోగమించారు? ఇప్పటికి మీ కాంగోలో నరమాంసం భుజించేవాళ్ళున్నారు

లు : ఐ అబ్జెక్టు మాడమ్ ప్రెసిడెంట్ ఇది మా దేశపు ఆంతరంగిక వ్యవహా రాల్లో ప్రత్యక్షజోక్యం ఎవరో కొందరు పాత సంప్రదాయాలను వదలుకో లేని ఛాందసులు ఏడాది కొకమారు విందులో నరమాంసం—అదైనా కొద్దిగా తీసుకుంటారు ఘోరమైన ఈ ఆచారాన్ని ఆఫ్రికా ఖండ మంతా అస హ్యించుకుంటోంది నియంతృత్వ ధోరణితో నరమాంసభక్షణని నిషే ధించడం సులభమే కాని త్వరలోనే యీ దురాచారం తనంత తానే నమసిపోతుంది

ఫిలిప్పీన్స్ • కాని, ఈలోగా నరమాంస భక్షకుల నాగరికతను ఒకందుకు అభినం దించవలసిందే తింటున్నది నరమాంసమైనా నైఫులూ, ఫోర్కులూ ఉప యోగిస్తున్నారు

సిలన్ • ఆర్డర్. ఆర్డర్ మళ్లీ విషయానికి దూరమవుతున్నాం. ప్రస్తుత సమస్య మీద మాట్లాడాలని ఫిలిప్పీన్స్ ప్రతినిధిగారిని కోరుతున్నాను

ఫిలిప్పీన్స్ వాయిదా—వాయిదా అమృతం పంచిపెట్టడానికి ఆరు నెలలు వాయిదా.

సిలన్ : ఇప్పుడు సోవియెట్ ప్రతినిధి ప్రొఫెసర్ న్యాయకోవస్కీగారు మాట్లాడుతారు

రష్యా : పనీటా మాడమ్ ప్రెసిడెంట్ దోస్తులారా, నేస్తులారా ప్రపంచ చరిత్రలో ఒక ప్రధాన సంఘటన జరగబోతున్న సమయంలో మనం సమావేశం అవుతున్నాం మానవజాతి మరణాన్ని జయించే కాలం సన్నిహిత భావిలోనే ఉంది. చంద్రమండలానికి వెళ్లిన వైజ్ఞానికులలో చాలామంది రష్యావారే. అంతమాత్రంచేత మేము గర్వం ప్రకటించేది లేదు ఈ విజయం మానవజాతి సమష్టి విజయం అని అందరు భావించాలి అందుచేత అమృతాన్ని అందరికీ సమానంగా పంచిపెట్టాలి ఇది ఎంత శీఘ్రం జరిగితే అంత మంచిది. నేటితో ఇరవయ్యో శతాబ్దం అంతమవుతోంది. మానవులు మరో శతాబ్దంలో ప్రవేశిస్తున్నారు. మన మిత్రుడు బ్రిటిష్ ప్రతినిధి చెప్పినట్లు మన మనోభావాలలో ఎన్నో ఎగుడు దిగుడులూ, వ్యత్యాసాలూ ఉన్నమాట నిజమే. కాని ఇది యీనాటి నిజం ఈ వ్యత్యాసాలన్నీ ఇలాగే ఉంటాయా రేపు కూడా? ఈ సభనే చూడండి ఒక్కొక్క మహా దేశానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఒక్కొక్క ప్రముఖ వ్యక్తిలో సహా ఎంతెంత జాతి విద్వేషం ఎన్నెన్ని పాతభావాలూ ప్రదర్శించబడ్డాయో. వీటిని ప్రయత్నించి పారదోలాలి. అందుకే అమృత సేవనం మొదటిమెట్టు సృష్టి సమానాంతర రేఖలలో ప్రవహిస్తోందని నేటివైజ్ఞానికులలో కొందరంటున్నారు. ఇది ఐన్‌స్టీన్ సిద్ధాంతానికి విరుద్ధమని కొందరంటున్నారు ఇంకా ఖగోళాలకు సంబంధించిన భోగట్టా మరి కొంత తెలిసేదాకా దీని విషయము యిదమిత్థమని నిర్ణయింపలేము కాని ఒకటి నిశ్చయమనే చెప్పవచ్చును మానవ మనస్సులో అనేక చతురస్రాలున్నాయి రెండేసి రెండేసి సమానాంతర రేఖలు నిలువుగా ప్రవహిస్తున్నాయనుకోండి రెండేసి రెండేసి సమాంతర రేఖలు అడ్డంగా ప్రవహిస్తున్నాయనుకోండి అప్పుడు వాటిమధ్య ఎన్నోచతురస్రాలు ఏర్పడతాయి కదా అయితే ఇవి స్క్వేరులా రెక్టాంగిల్సా? సమబాహుచతురస్రాలా? విషమబాహు చతురస్రాలా? ఈ చతురస్రాలకి సంబంధించినసమస్యలను పరిష్కరించడానికికూడా ప్రజలందరికీ అమృతాన్ని పంచిపెట్టవలసిందే ప్రస్తుత ప్రపంచ స్థితిలో ఇవి రెక్టాంగిల్స్ అనే నే ననుకుంటున్నాను ప్రవహిస్తున్న అడ్డ నిలువు సమానాంతర రేఖలుగా కాలాన్ని నేను భావిస్తున్నాను మానవుడు టైమ్‌ని స్క్వేర్ చెయ్యాలి ఆఖరి మాట భద్రతామండలిలో కూడా యీనాడు ప్రగతిశీల రాజ్యాలదే మెజారిటీ మా ప్రతిపాదలను బ్రిటన్‌గాని, అమెరికాగాని వీటో చెయ్యడం ఎప్పుడో మానేశాయి అది వారి ప్రజాస్వామ్యదృక్పథానికి నిదర్శనం అందుకు వారిని అభినందిస్తున్నాను. కాని మానవజాతి భవిష్యత్తునే తీర్చి దిద్దగల ఈ మహత్తర విషయాన్ని జనరల్ అసెంబ్లీలోనే—బహిరంగ చర్చలోనే వోటుకు పెట్టాలని నేను సూచిస్తున్నాను (కరతాళ ధ్వనులు)

సిలన్ సాయంత్రం అయింది. ఈ సభకు వాయిదా వేస్తున్నాను.

* * *

కవి : సాయంకాలమయింది

కండలు తిరిగిన సాయంత్రం చండప్రచండంగా గర్జిస్తోంది
కండలుతిరిగిన సాయంత్రం కష్టాన్నీ సుఖాన్నీ మోస్తోంది కావడికుండల్లాగ.
కండలు తిరిగిన సాయంత్రం కవిత్వం మాట్లాడుతోంది.
గడ్డం మాసిన సాయంత్రం గాడిదకూత కూస్తోంది.
గడ్డంమాసిన సాయంత్రం కథలని దొంగిలిస్తోంది
గడ్డంమాసిన సాయంత్రం గాగరా ధరించి తిరుగుతోంది.
కొమ్ములు తిరిగిన సాయంత్రం రొమ్మువిరిచి నిలబడింది
కొమ్ములు తిరిగిన సాయంత్రం కోటలుదాటే మాటలాడుతోంది.
కొమ్ములు తిరిగిన సాయంత్రం కోటికి పడగెత్తుతోంది

జ్ఞానం : నడిసముద్రంలో సాయంత్రం గుడిలో దీర్ఘాలు తీస్తోంది.
ఇలాంటి కవిత్వం ఈజీ ఎవరైనా చెప్పగలరు.

సిరి : పగలరూ. గురూ, ఇలా వెంచేశారేం ఎద్దనేవేళ.

జ్ఞా : వేళాకోళాలేల

సి . కూర్చోండి తాతయ్యా.

జ్ఞా : కూర్చోడానికి వేళలేదు.

సి : అయితే నిలబడే మాట్లాడండి కాని జ్ఞానంగారి యెదుట కవిగారు కూర్చొని మాట్లాడకూడదు నేనూ నిలబడతాను.

జ్ఞా . నిలబడు దృఢంగా నిలబడు. సిద్ధంగా నిలబడు.
ఒరే సిరా

సిరి : సిరా కాదు సిరి

జ్ఞా సారీ సిరి ఇవాళ నాకో అనుమానం.

సిరి : ఏమి టది

జ్ఞా : మానవుడు జరామరణాలని జయిస్తాడు

సిరి కవులు తమ కవిత్వంలో అదే అనాటినుంచీ అన్నారు.

జ్ఞా కాని ఈనాడు అది సాధ్యం

సిరి ఏం మీకేదైనా రహస్య వర్తమానం తెలిసిందా ?

జ్ఞా . నేను వైజ్ఞానికుణ్ణి. ఆధారం లేనిదాన్ని నేను నమ్మను తెలుసా.

కవి . నేను కవిని ఆధారంలేందే ఆకాశంలో విహరించేవాణ్ణి.

జ్ఞా : ఏమిటి నీ అన్వేషణ

సిరి అమృతం

జ్ఞా అంటే?

కవి మానవుడికి మరణం లేకుండా చేసే మందు. అది చంద్రుడిలో కందు.

జ్ఞా నిజమా? కవిత్వమా?

కవి : నిజమే కవిత్వమే ఇవాళ మానవుడు అమరుడు కాబోతున్నాడు.

జ్ఞా : కవీ, నువ్వన్నమాట నిజం నిజంగానే ఇవాళ న్యూఢిల్లీలో చంద్రలోకానికి వెళ్లినడెలిగేట్లంతా అమృతంతో సహా దిగారు మా ఆఫీసుకి అధికార వార్త అందింది.

సిరి ఆ అయితే నా గెస్సు రైటే

జ్ఞా : అవునయ్యా కవీ అందుకే అంటారు కరెక్టుగా గెస్ చెయ్యడమే కవిత్వం అని

సిరి : కాని జ్ఞానం తాతయ్యా, నాకో అనుమానం ఈ రాజకీయ నేతలంతా కలిసి వారిలోవారు కొట్లాడుకొని మానవజాతికి అమృతం అందకుండా చేస్తారేమో.

జ్ఞా : ఇదే ఇవాళ ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీలో చర్చిస్తున్నారు. రేడియో వెయ్యి విందాం.

* * * *

ఎనౌన్సర్ ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో తక్షణమే అమృతాన్ని మానవులకు పంచాలన్న ఆఫ్రో—ఆషియన్ తీర్మానం నెగ్గింది 150 మంది ప్రతినిధులలో నూరుగురు అనుకూలంగాను, 30 మంది వ్యతిరేకంగాను వోటుచేశారు ఇరవై రాజ్యాలు తటస్థంగా ఉండిపోయాయి. ప్రపంచం అంతటా రాత్రి పండ్రెండు గంటలకి వరల్డ్‌హెల్త్ ఆర్గనైజేషన్ వారు ఇంజక్షన్ల ద్వారా గాని, మాత్రల ద్వారాగాని మానవులకు అమృతాన్ని ఇస్తారు

* * * *

జ్ఞా ఏం? రేడియో ఆపేశావేం? ఇంకా విందాం

కవి . ఇక వినడానికేముంది మానవుడు మరణాన్ని జయించాడు. నాకు మహదానందంగా ఉంది తాతయ్యా అనాటినుంచీ మనిషి కన్న కలలు నేటికి ఫలించాయి

జ్ఞా అబ్బ నీ గోల నీది అమృతం సేవిస్తే అంతమందీ ముప్ఫయేళ్లవాళ్లవుతారని మా కార్యాలయంలో లెక్క వేశారు. ఆ వివరంకూడా రేడియోలో చెబుతారేమో అని చూశాను

కవి : పోనిండి. మీ సెక్రటరీకి ఫోన్ చెయ్యండి.

జ్ఞా అవును బాగా చెప్పావు (ఫోనుతీసి డయల్ చేస్తాడు)
రాజ్యం? అవును. అబ్బ ఎప్పుడూ పెళ్లి సంగతేనా అవును. ప్రామిస్ చేశాను నిజమే. రేపేనా....అంత వ్యవధి లేకుండానా? సరే పీయిష్నమే

కానీ అవును సియిస్సమే కానీ . అవును ప్రామిస్ చేశాను. ఖరారుగా. రేపు ఉదయం వెళ్దాం, కాని—రాజ్యం, అమృతం సంగతి తెలిసిందా? అబ్బ ఏమిటలా కసిరావ్? ఆ. ఆ... సరే. రా.
సిరి ఏవిటి తాతయ్యా?
జ్ఞా : రాజ్యం యిక్కడికి వస్తానంటోంది.
సిరి · రానీండి. అమృతం విషయం ఏమంటుంది?
జ్ఞా : ఏవీ తెలియదట. రాజ్యానికి ఈ అమృతం విషంలో—కాదు అమృతం విషయంలో ఏమీ నమ్మకం లేదు. ఐక్యరాజ్యసమితిలో దీన్ని చర్చిస్తున్నారన్నా ఆ సొనిద్దురూ అంటుంది.
సిరి సరేగాని తాతయ్యా రాజ్యంగారిని పెళ్లి చేసుకుంటావా?
జ్ఞా అవునురా సిరీ తప్పేటట్టులేదు. మాట కూడ ఇచ్చేశాను
సిరి ఇప్పుడు మీకు పెళ్లేమిటి తాతయ్యా ఆవిడకి యాభై ఏళ్లూ, నీకు డెబ్భయ్యేళ్లూ.
జ్ఞా . అర్ధరాత్రి అయ్యేసరికి మనం అందరం ముప్ఫయ్యేళ్లవాళ్లం అయిపోతున్నాంకదూ. అవాలి మరి మా లెక్కల ప్రకారం. సిరీ, ఇప్పుడు టైమెంతయింది.

(12 గంటలు కొట్టిన చప్పుడు)

సిరి · అర్ధరాత్రి అయింది.
ఇరవయ్యో శతాబ్దపు చివరి రాత్రి ఇది ఇంకా మేలుకొనే ఉన్నాన్నేను.
జ్ఞా పాడు కానీ నీ కవిత్వం! అర్థంలేని అర్ధరాత్రి అమృతం పంచిపెడుతోంది. గాత్రంలేని రాత్రం నేడు మౌనంగా గానం చేస్తోంది
సిరి ఏమిటి తాతయ్యోవ్. కవిత్వం చెప్పేస్తున్నావ్
జ్ఞా . అవును రా. నీ మొగంచూస్తే దానంతట అదే కవిత్వం వచ్చేస్తోంది. చచ్చాను.
సి ఏమిటది?
జ్ఞా రాజ్యం వచ్చేస్తోందిట.
సిరి అయితే అంత హడలెందుకూ?
జ్ఞా పెళ్లని ప్రాణాలు తీస్తుంది—ప్రమాణం కూడా చేయించుకుంది
సిరి అయితే పెళ్లాడు దానికింత ఆలోచనెందుకు
రండి రాజ్యంగారూ.
రాజ్యం . మా ముసలాయన్ని చూదామని వచ్చాను. కవిగారూ, మీకు తెలుసునా నేను తెల్లారగానే శ్రీమాన్ జ్ఞానంగారిని పెళ్లిచేసుకుంటున్నాను
కవి వింటున్నాను.
జ్ఞానం రాజ్యం, నామాట విను. తలచినప్పుడే తాతకి పెళ్లేమిటి? నెల్లాళ్లాగ కూడదూ?
రాజ్యం · నెల్లాళ్లా నిమిషమైనా ఆగను. ఎందు కాగాలి అర్ధరాత్రయిపోయింది గాని లేకపోతే ఇప్పుడే రిజిస్ట్రాఫీసుకి ఈడ్చుకుపోయిందును మిమ్మల్ని
జ్ఞానం : అమృతం సంగతి నిజమే ఇవాళే ఎనౌన్స్‌మెంట్ వచ్చింది
రాజ్యం ఆ, ఎవరు నమ్ముతారండి ఈ గాలి కబుర్లు. మనకి అమృతం దొరికేదేమిటి. మళ్లీ యౌవనం వచ్చేదేమిటి
జ్ఞానం చెప్పాను కాదూ సిరీ. రాజ్యానికి విషయంలో ఏమీ నమ్మకం లేదు. రాజ్యం, మనం తప్పకుండా అమృతం పుచ్చుకుంటాం ఈపాటికి డబ్ల్యు హెచ్ ఓ డాక్టర్లిక్కడికి వచ్చేస్తూనే ఉంటారు నీకు ఇంజెక్షన్ కావాలా? మాత్ర కావాలా?
రాజ్యం · అవున్ను గ్లాసులో నీళ్ళు పోసుకుని మాత్ర కరిగించి మందులాగ తాగేస్తాను తక్షణం చచ్చిపోతాను
జ్ఞానం కాదు బతుకుతావు రాజ్యం
రా లేదు మీరు పెళ్లాడనంటే నిజంగానే చచ్చిపోతాను
జ్ఞా : పెళ్లాడనని నేనన్నానా? కాకపోతే కాసిన్ని రోజు లాగమన్నాను.
రా అవ్వపేరే ముసలమ్మ
జ్ఞా · ఆడుగడుక్కీ మన వయస్సులు జ్ఞాపకం చెయ్యకు రాజ్యం
రా మనస్సుకి వయస్సేమిటి మనది మనసులు కలిసిన ప్రేమని మీరేగా అన్నారు?
జ్ఞా అన్నాను
రా . ఎన్నిమార్లన్నారు.
జ్ఞా : 29 లక్షల ముప్ఫై తొమ్మిదివేలనలభై తొమ్మిదివందల యాభై తొమ్మిది మార్లని అన్నట్టు నా జ్ఞాపకం.
రా : మనది చాలా పవిత్రమైన ప్రేమని అన్నారు కాదూ మీరు.
జ్ఞా : అన్నాను
రా : ఇది దేహానికి సంబంధించినది కాదనీ, ఆధ్యాత్మిక ప్రేమ అనీ అన్నారు కాదూ మీరు.
జ్ఞా అన్నాను
సిరి : వృద్ధాప్యం మీదపడ్డాక ఆధ్యాత్మిక ప్రేమ కాకపోతే —
జ్ఞా · అదుగో ఆమాటే అనొద్దన్నాను. అమృతం సేవించబోతున్నాం మనం.
రా . ఆ గొప్ప సంబరం. ఆయనగారి మాటలు నమ్మకు బాబూ. అదంతా ఒక పిచ్చి
సిరి : ఫ్రెయిల్‌టీ దై నేమ్ ఇజ్ వుమన్ అన్నాడు షేక్స్‌పియర్ అవాడు. ప్రేయసీ నీ పేరు రాక్షసి అన్నాడు శ్రీశ్రీ ఈనాడు.
జ్ఞా నేను బయాలజిస్టుని, ఫిజియాలజిస్టుని, సైకాలజిస్టుని.
రా జిస్టుని, విస్టుని, కృస్టుని
కవి · వర్డిస్టుని. రోదిస్టుని
జ్ఞా : చాల్లే అదుగో డాక్టరుగారు. మాటల్లోనే వచ్చేశారు. నే చెప్పలేదూ.
డాక్ట : నేను ఐక్యరాజ్యసమితి తరఫున వచ్చాను. అమృతం ఇవ్వడానికి.
రా నిజంగానే? ఏవండి మీరన్నమాట నిజమేనండీ?
కవి జ్ఞానం మాట నిజం కాకపోతే అబద్ధమవుతుందా.
డాక్ట ఆ ఆ స్కీజ్ హర్రి అప్. నేనింకా చాలా చోట్లకి వెళ్లాలి. ఈ ఇంట్లో ఎంతమంది వున్నారు ?
కవి మేం ముగ్గురం అవతలి గదిలో మా మేనగోడలు కళ నిద్రపోతూంది.
డాక్ట . ఆవిడ నొక్కమాట లేపుతారా?
కవి ఆవిడ కాదండి అమ్మాయి పదేళ్ల పసికందు
డాక్ట అయితేనేం ఈ మందు తీసుకుంటే ముప్ఫయ్యేళ్లదవుతుంది. సరే, తాతగారూ మీకు టాబ్లెటియ్యనా
జ్ఞా · అక్కర్లేదు. ఇంజక్షన్ తీసుకుంటాను.
డాక్ట సరే
జ్ఞా . అ—మ్మ
డాక్ట : అమ్మా-మీరు ?
రా . మాత్ర ఇయ్యండి.
డాక్ట · ఇందండి
కవి ఇదుగోనండి కళ !
డాక్ట . అమ్మాయీ ఇంజక్షనిస్తే భయపడవు కదే
కళ నాకేం భయం? ఇయ్యి
డాక్ట ఏదీ చెయ్యి
కళ వ్
డాక్ట మరి మీరు ?
కవి ఇంజక్షనే ఇయ్యండి కాని ఏం లాభం. అమృతం తీసుకున్నా, తీసుకోకపోయినా నేను ముప్ఫయ్యేళ్ళవాడినే అబ్బాకసికొద్దీ పాడిచేశారేడాక్టరుగారూ.
డాక్ట ఇంజక్షన్లు తీసుకున్న ముగ్గురూ ఈ కాగితాలమీద సంతకం చెయ్యండి. అమ్మా, మీరు దీనిమీద థ్యాక్స్ నే వస్తా.
కవి వెళ్లి నిద్రపో కళా
కళ ఇదేవిటి మామయ్యా ఏవిటో ఒళ్లంతా—
కవి ఏం లేదులే వెళ్ళు బజ్జో. తెల్లారాక మాటాడుకుందాం.

* * * *

ఎనౌన్సర్ ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంక్రింద ప్రపంచం అంతటా ప్రజలందరికీ ఏక కాలంలో అమృతం పంచిపెట్టినట్లు కేంద్రకార్యాలయానికి రిపోర్టులు వచ్చాయి. ఎన్ని కోట్లమందికి అమృతం అందిందో ఆ వివరా లింకా తెలియలేదు నిన్నటి జనాభా లెక్కలనుబట్టి నేటి పరిస్థితిని అంచనా వెయ్యడానికి వీలులేదు ఎందుచేతనంటే అర్ధరాత్రి దాటేసరికి ప్రపంచంలో అనేక లక్షలమంది మరణించారు అనేక లక్షల మంది జన్మించారు. మరణించినవారికి కూడా మందియ్యడమైతే జరిగింది. కాని వాళ్ళ

బలికారో లేదో ఆ వివరాలు కూడా ఇంకా అందలేదు. ఉదయం కాగానే అదీ తెలుస్తుంది

* * * *

కవి : ఉదయం అయింది.
నవోదయం ఇది
మహోదయం ఇది
శుభోదయం.
స్వాగతం నూతన సంవత్సరానికి
స్వాగతం నూతన శతాబ్దానికి
ఉదయం
నిద్ర మేల్కొన్న రాత్రి నేటతో వికసించింది
విహంగాలూ విమానాలూ పంపించేశాయి నిశ్శబ్దాన్ని
వేళలోకి వేళాకోళంలోకి
వేళాగోళంలోకి

జ్ఞా : వేళ గోళంకాదు. సరళ రేఖ ఇది స్థలం అనే ఇంకో సరళరేఖకు సమాంతరంగా ప్రసరిస్తుంది.
రా : అబ్బ, ఎప్పుడూ మీ దొకటే గోల పదండి పెళ్లి రిజిస్ట్రారు దగ్గరికి.
జ్ఞా : ఉండు. ఏం తొందర.
రా : అవును. తొందరే తెల్లారగానే, బయల్దేరుతా నన్నారు.
జ్ఞా : నీ తెలివి తెల్లారినట్టే ఉంది. నిజం చెప్పమంటావా?
రా : చెప్పండి.
జ్ఞా : నిన్ను పెళ్లి చేసుకోను.
రా : ఏవిటీ.
జ్ఞా : నిన్ను పెళ్లాడాలనే ఉద్దేశం మార్చుకున్నాను.
రా : నిన్నటి వాగ్దానం నేడు మారిపోయిందా?
జ్ఞా : ఔను. నిన్నటి పరిస్థితి వేరు నేటి పరిస్థితి వేరు.
నిన్నటి శతాబ్దం వేరు. ఇవాళ శతాబ్దం వేరు
నిన్నటి నేను వేరు, నేటి నేను వేరు
నిన్న నా వయస్సు డెబ్బయ్యేళ్లు, ఇవాళ నా వయస్సు ముప్పయ్యేళ్లు.
రా : ఆఁ అదీ సంగతి ఆ కళ అనే అమ్మాయిని చూశారు కామవికారం బయల్దేరింది మనది పవిత్ర ప్రేమ అన్నారు మనస్సులు కలిసిన మనోహర ప్రేమ అన్నారు అయినా పదేళ్ల పిల్లతో ప్రణయకలాపా లేమిటండీ మీకు
జ్ఞా : అక్కడే పొరపడుతున్నావు ఇదిగో ఆ అమ్మాయి కూడా వచ్చేసింది. ఇవాళ కళ వయస్సు కూడా ముప్పయ్యేళ్లు
కళ : నమస్కారం జ్ఞానం తాతయ్యా
జ్ఞా : నన్ను తాతయ్యా అనకు నాకు కోపం వస్తుంది
కళ : ఎందుకూ కోపం, ఉన్నమాట అన్నందుకా
జ్ఞా : నేను తాతనన్నమాట నిజంకాదు నిన్ను పెళ్లిచేసుకుంటాను కళా.
కళ : ఆ?
కవి : ఏమండీ ఏమండీ ఏవిటా పేలాపన
ఆపండీ ఆపండీ చాలు మీ ఆలాపన
అమ్మాయీ, కళా ఇవతలకి పో.
జ్ఞా : కళా . కళా వెళ్లకు
సిరి . వెళ్ళిపోయింది కళ. నేనూ దానివెంటనే వెళ్ళుతున్నాను.
జ్ఞా . రాజ్యం నా మాట విను వెనుకటిలాగే మన మనసులు కలిసిన మైత్రి అచంచలంగా ఆకళంకలంగా సాగనీ
రా : ఇదంతా నా కనవసరం నన్ను పెళ్లిచేసుకుంటారా లేదా
జ్ఞా : యాభయి యేళ్లాయి పెళ్లిలేకుండా ఉన్నదానిని ఇవాళ పెళ్లికింత తాపత్రయం ఎందుకు రాజ్యం?
రా : చాల్లెండి. ఇప్పుడు నేను 50 ఏళ్ల దాన్నికాను నా వయస్సు కూడా 30 ఏళ్లే.
జ్ఞా : ఔను సుమా పరాకుపడ్డాను కాని నువ్వు నా కళ్ళకి యాభై యేళ్ల దానివి లాగే కనబడుతునవు
రా . కనబడనా మరి కళని చూసిన కళ్ళకి కావేర్లు కమ్మినట్లుంది.
కళ : మళ్లీ వచ్చాను తాతయ్యా
జ్ఞా : అదిగో ఆమాటే అనొద్దన్నాను
కవి నేను కళని పెళ్లిచేసుకోదలిచాను సార్. కళ కూడా అంగీకరించింది.
జ్ఞా ఏవిటీ నన్నడగకుండానా?
కవి ఎందుకూ మిమ్మల్నడగం?
జ్ఞా కళని నేను కళత్రంగా చేసుకోవాలనుకున్నానే?
రా ఇదుగోనండోయ్. ఏమండోయ్, ఏవిటా మాటలు? సిగ్గూ బిడియమూ లేవూ. ఏళ్లు రాగానే సరా?
జ్ఞా ఏవిటంటున్నావ్ ?
రా మీ కొచ్చిననన్నేళ్లు ఎవరి కొచ్చాయంటున్నాను
జ్ఞా . నాకేమీ ఏళ్లు రాలేదు పైగా పోయాయి నలభై ఏళ్లు పోయాయి. నా వయసిప్పుడు ముప్పయి తెలుసా
కళ . వయస్సు ముప్పయి అయినా ముసిలి భావాలు నీలో పోలేదు తాతయ్యా
జ్ఞా . అదుగో మళ్లీ నువ్వు పదేళ్ల పసిపిల్లలాగ మాటాడడం లేదూ. అయినా ఇప్పుడదంతా ఎందుకుగాని కళా కళా ..
కవి : జ్ఞానంగారూ మమ్మల్ని మీరు ఆశీర్వదించాలా.
జ్ఞా ఆశీర్వదించే స్థితిలో నేను లేను
కవి కళ మిమ్మల్ని పెళ్లాడే స్థితిలోలేదు.
జ్ఞా · ఎందుకు లేదు?
కవి నన్ను పెళ్లాడబోతోంది కనక.
రా లేదు సిరీ ఈ ముసిలాయనతో విసుగెత్తిపోయింది నాకు వేధించుకు తిన్నాడు ఇన్నాళ్లూ కావలిస్తే ఆయన్నే పెళ్లిచేసుకొమ్మను కళని. కో అంటే కోటి మంది ఉన్నారు. ఎవరో ఒకర్ని ఎన్నుకుంటాను.
కవి రాజ్యంగారూ .
రా అవును నా మనస్సు మారిపోయింది పరాభవంతో పరితపిస్తున్నాను
కళ . తాతయ్యా—
జ్ఞా : అదుగో ఆ మాటే అనొద్దన్నాను నా మనస్సు మారిపోయింది నిన్ను పెళ్లి చేసుకోను నేను
కళ చేసుకుంటానంటేమాత్రం ఒప్పుకునేవాళ్లెవరు ?
జ్ఞా : లక్షణంగా ఒప్పుకుంటావు. నాలాంటివారు నీకు దొరకడం ఎలాగ?
కవి : నేను దొరికేనుగా నన్ను కాదని కళ ఇంకొకణ్ణి ఎలా పెళ్లాడుతుందో నేనూ చూస్తాను
జ్ఞా : ఒరే సిరీ నువ్వూరికే మాట్లాడకు కళని నేను పెళ్లి చేసుకోవడం ఖాయమయిపోయింది కావలిస్తే నువ్వు రాజ్యా న్నేరుకో
కవి · హాస్యాని క్కూడా ఒక హద్దుంది. రాజ్యానికి నేను అర్హుణ్నికాను.
జ్ఞా : కాని రాజ్యం నిన్ను వరించింది ఆమె కళ్లలోని కాంతుల్ని చూడు నువ్వు సై అంటే ఆమె జై అంటుంది.
కవి నేను కై అని కూడా అనను
జ్ఞా : అబ్బాయీ సిరీ, మనం నలుగురం కూడ బలుక్కొని ఒక అంగీకారానికి రావాలి రాజ్యం ఏమంటావు నువ్వు. అంగీకారానికి వస్తానంటావా.
రా · రానంటాను. పెళ్లే చేసుకోనంటాను.
జ్ఞా ఒక వేళ నేను చేసుకుంటానంటే?
రా దాటిపోయిందా తరుణం
జ్ఞా · అయితే నా ఒట్టుతీసి గట్టుమీద పెట్టెయ్యవచ్చునా?
ఒక స్త్రీ కంఠం : వేసిన ఒట్టు తీస్తావురా రాస్కెల్
జ్ఞా : ఎవరు నువ్వు ?
స్త్రీ : తరువాత చెబుతా. ఈ విషమబాహు చతురస్రాన్ని ఎలా స్క్వేర్ చేస్తారు.
జ్ఞా : మా తరంకాదు.
కవి : నువ్వే చెప్పు. ఎవరివో నువ్వే చెప్పు.
జ్ఞా · మా సమస్యని నువ్వే పరిష్కరించు.
రా : ఎవరిని ప్రేమించాలి నేను.
కళ · ఎవరిని వరించాలి నేను.
జ్ఞా ఎవరిని పెళ్లాడాలి నేను.

శా : అసలీపెళ్ళి అవసరమా.
కవి : నువ్వే చెప్పు. నువ్వే చెప్పు.
జ్ఞా : ఎవరివి నువ్వు?

*　*　●　●

స్త్రీ :
నేను దైవాన్ని, నేను సత్యాన్ని
దైవాన్ని నేను మాట్లాడుతున్నాను (వినండి వినండి)
మానవుణ్ణి నేను సృష్టించలేదు
మానవుడే నన్ను సృష్టించాడు.
అతని మనస్సు నన్ను సృష్టించింది
నాకు ఆకారం లేదు, వయసు లేదు.
నేను ఆడా కాదు, మగా కాదు
నేను దైవాన్ని, నేనే కాలాన్ని, నేనే సత్యాన్ని.
మరణాన్ని మానవుడు జయిస్తే
కాలాన్ని మానవుడు జయిస్తే తప
మనస్సునే మానవుడు గెలిస్తే
అప్పుడు నేను లేను
ఇప్పుడున్నాను నేను
గెలవగలడా మానవుడు కాలాన్ని
గెలవగలడా మానవుడు మరణాన్ని
జయిస్తాడా మానవుడు మనస్సుని
మనస్సులోనివి ఆలోచనలు
వాటి స్వరూపం భాషలో నిరూపణం
అనేక భాషలు మాట్లాడే మానవుడు
ఒక్కభావాని కెప్పుడూ రాలేదు.
మానవుడు మానసిక సమానత్వం సాధించాలంటే
మారాలి మానవుల భాష
మాట్లాడాలి మానవు లంతా ఒకే భాష
అప్పుడే సాధ్యం మానవునికి మానసిక స్వాతంత్ర్యం
ఒక ఇంటిలోవున్న ఒక నలుగురికి
ఏకాభిప్రాయం లేకపోయిందే
ఇక సమస్త ప్రపంచానికీ ఏకాభిప్రాయం ఎప్పుడు?

కోరస్ : ఇప్పుడు—ఇప్పుడు—ఇప్పుడే
మరణాన్ని జయించాలన్న మా సంకల్పం మారదు.
కాలాన్ని జయించాలన్న మా నిర్ణయం మారదు
స్థలాన్ని జయిస్తే దైవాన్ని జయించినట్టే

స్త్రీ : ఎక్కడ—ఎక్కడ—ఎక్కడ

కోరస్ : ఇక్కడ—ఇక్కడ-ఇక్కడే

ఎనౌన్సర్ : మానవుడు మరణాన్ని జయించాడు చంద్రలోకంలోని సుధ జరా మరణాలకి విరుగుడు.

దైవం : కాలాన్ని కూడా జయిస్తావా మానవా?

జ్ఞా . అది నీ దయ దైవమా.

దైవం : కాలాన్ని నేను. న్యాయాన్ని నేను
సత్యాన్నినేను. దైవాన్నినేను
నేను దైవాన్ని మాట్లాడుతున్నాను
ఇన్నాళ్ళూ మహర్షుల ద్వారా మాట్లాడాను మహా పురుషుల ద్వారా మాట్లాడాను మహాకవుల ద్వారా మాట్లాడాను మహాభక్తుల ద్వారా మాట్లాడాను ఈనాడు నేనుస్వయంగా ఈసభకి అధ్యక్షతవహించిమాట్లాడుతున్నాను మరణాన్ని జయించిన మానవజాతితో మాట్లాడుతున్నాను.

స్త్రీ : ఎవరివి నువ్వు

సిరి . నేను మానవుణ్ణి

స్త్రీ : ఎవరిని నేను

సిరి : నీవు మానవుడివి మారువేషం వేసుకొచ్చిన మానవుడివి.
స్త్రీ అంటే నీవే.
సిరి : నేను
స్త్రీ : అయితే నేనే.
సిరి : నీవు
స్త్రీ : అంతే అంటావా మానవా ?
సిరి : అంతే అంటాను మాధవా.
స్త్రీ : అంతా ఒకటేనా?
సిరి : అవును.
స్త్రీ అంటే?
సిరి : $1+1=1$
స్త్రీ : ఒకటీ ఒకటీ రెండంటారే లెక్కలు నేర్పినవాళ్ళు
సిరి : అదే వాళ్ల గణితశాస్త్ర పాండిత్యం నీవూ నేనూ ఒకటే ఒకటీ ఒకటీ రెండే
స్త్రీ · నిజం చెప్పావు
సిరి . మాట తడబడింది మాధవా. గణితాని కతీతమైనభాషలో ఒకటీ ఒకటీ ఒకటే.
స్త్రీ · రెండు కాదంటావా?
సిరి రెండు కాదంటాను.
స్త్రీ ఒకటీ ఒకటీ ఒకటైతే రెండూ రెండూ రెండూ కాదూ?
సిరి రెండు రెండ్లు నాలుగే రెండు మూళ్ళు బారెడే.
స్త్రీ . మూళ్లంటే?
సిరి : మూరలు. రెండు మూరలు బారెడు.
స్త్రీ · మూడూ మూడూ
సిరి . కీడు
స్త్రీ : చూడూచూడూ పాడు
సిరి . నేను పాడలేనే
స్త్రీ : కవినంటావ్?
సిరి : ఒహో ! అయితే పాడుతా
స్త్రీ : దేన్ని గురించి?
సిరి : రెండు గురించి
స్త్రీ . రెండు ఇప్పుడెంత టైమయింది
సిరి కాలం ఆగిపోయింది చాలాకాల మయింది.
స్త్రీ చతురస్రం సమబాహువయిందా?
సిరి అయింది.
స్త్రీ అయితే చదువు నీ పద్యమో ఏదో
సిరి పద్యం కాదు, పాటే దాన్ని పాడను. అంటాను.
స్త్రీ అను.
సిరి : విను

రెండు ఖడ్గాలు
రెండు ఖంజరీటాలు
రెండు అగ్ని పర్వతాలు
రెండు ఆంజనేయ దండకాలు

జోజో జేజే.

రెండు కంకాళాల కార్తిక దీపాలు
రెండు రాబందుల రా (జా) జీ నామాలు
రెండు కళ్ళు తెరిచిన నాగళ్లు
రెండు పిడికిళ్లు బిగించిన కొడవళ్లు

హోహో హాహాహా

రెండు కళ్ళు
రెండు కళ్లజోళ్ళు
రెండు కళ్ళజోళ్ళ నోళ్లు
రెండు కళ్ల జోళ్ల నోళ్ల వాగుళ్లు

హిహి కికి

రెండు పెలిగ్రామ్య భాషలు
రెండు సమైక్యాంధ్ర ఘోషలు
రెండు నిండు కొబ్బరికాయలు
రెండు ఎండు నారింజకాయలు

బాబా బీబీ

రెండు చదువురాని విస్తరాకులు
రెండు దారితప్పిపోయిన కిరీటాలు
రెండు చీకట్లో రాకాసి కేకలు
రెండు నిలబడ్డ నిట్టూర్పు కొరడాలు

దాదా దీదీ

రెండు వేషాలువిప్పివేసిన తలగడాలకింద నిద్రమేల్కొన్న నక్షత్రాలు
రెండు నిశ్శబ్దాలు విసిరిన సరిగమపదనిశలమీద నడలు పరికింపి ...లో, కల్లోలాలు
రెండు యుగాంతాలనందున దిగంతాలమాటున వసంతా... ...నం తాలు

నేనే నానా

రెండు జగన్నాథ రథరథరథాధరథరాధర
రసాతల (జల) పాతాళాలు
రెండు స్వయం శ్యమంతకం ప్రకంపమాన
లోకాలోక విలోకనాలు
రెండు భ్రమాభ్రమర భ్రమణ భ్రమరణ భ్రమా
వరణ బ్రహ్మ వైరాస్వత మన్వంతరాలు
రెండు నవరత్న రంధ్ర రసప్రపంచ మహాప్రస్థానాలు
రెండు తృణావర్తాలు
రెండు విప్లవరాగాలు
రెండు చాలీచాలని కాలీకాలని లంగావంచాలు
రెండు ట్వింకిల్ ట్వింకిల్ లిటిల్ థియేటర్ స్టార్లు
రెండు అరుద్రాభిషేకాలు
రెండు రిక్షాపై మౌనశంఖాలు
రెండు విజయార్భాటాలు
రెండు హనుమంతాస్త్రాలు
రెండు సంపత్కుటుంబాలు
రెండు నమస్కరించదగిన విశ్వ నారాయణాస్త్రాలు
రెండు నామరహిత ఫిడేలు రాగాలాపాలు
రెండు గోరా వీ వినాయకారాణారాలు
రెండు పఠా పిఠా కణాశోరకురారాలు
రెండు తృవ్వట బాబా సిగపై పువ్వులు
రెండు సిరిసిరి మువ్వల నవ్వులు
రెండు చిరెండ వాసన ఒకట్లు
రెండు తురుఫాను కవిత్వాల రకట్లు
రెండు సిన్‌సిన్‌సిన్ కిన్‌కిన్‌కిన్ కోణాలు
రెండు ఖడ్గాల కంఖాణాలు
రెండు కళ్ల నోళ్లు
రెండు కళ్లు తెరిచినా పిడికిళ్లు బిగించిన
మానవ సరోవరంలో వికసించిన
మందారాక్షరాల మరలిపోలేని
మద్రాక్ష సముద్రాక్ష సరాలు.



ఆకాంక్ష

శ్రీ వేముగంటి నరసింహాచార్యులు

శైశిరాఘాత సంపాత సంకటమున
గడలుకొన్నట్టి జాడ్యము సడలిపోయి
మధురమధుమాస శోభారమావిలాస
మలరవలయును కాననప్రాంగణముల.

ప్రకృతి జనయిత్రి నిశ్వాసపవనపూరములకు గూడ నదింకక మూగవడిన శిలల గుండెలు శిల్పులత్మ్యపదాల పసిడిమువ్వల సవ్వడు లెసగవలయు.

గ్రీష్మలాలాటికా వహ్నికీలలంటి, శుష్కమై, మండు టిసుకల సుడివడిన స్రవంతికావళి విమలజీవనసమగ్ర వైభవాంచితముగ సాగవలయు నెపుడు.

కారుచీకటిరాతిరి కౌగిలింత నలసి, సొలసి, నిద్రాణమైనట్టి జగతి మేలుకొనవలె నవనవోన్మేషకలన ప్రత్యుషోరాగరేఖికా స్పర్శనొంది.

పులకరింపులు, నాగేలి గిలకరింపు లెడముగా బీడువారిన పుడమిపడతి ఒలుకవలె ధాన్యమాన్యతా కలితమైన పైరుపంటల పసిమి సింగారములను.

తుహినశీతలవాత విధూననమున కొంకరలు వోయి, విరవిరై, కొఱకుగట్టు ఉర్విజన రక్తనాళము లుజ్వలింప వేడి వాడిగ కైత విన్పింపవలయు.

మందమందరోచిర్ఘృణికందళముల ఎడదలోతుల కొడిగట్టి, అడజడిపడు దీపకళికలు, అవిరళోత్తేజనమున క్రొత్త వెలుగు టూపిరి పోసికొనగవలయు.

పగలు సెగలై పొగచూరి, వెగటుగొల్పు భావవీధుల స్నేహసుధావికాస ములముకొని, సొంపు పెంపారవలయు సౌఖ్యకారణమ్ములు, మంగళతోరణములు.

దీనభావము తార్కొని, తిగలు తెగి,
నీరసమ్మైన విశ్వమాణిక్యవీణ
కోమల గ్రామవైఖరుల్ కుదురుపరచి
పలుకవలయును శాంతిసౌభాగ్యగీతి!

ఇండియా ప్రెసిడెంట్ అధికారాలు

శ్రీ మామిడిపూడి వేంకటరంగయ్య

ఇండియా ప్రెసిడెంటుకు రాజ్యాంగ మూల శాసనం (ది కాన్‌స్టిట్యూషన్) ద్వారా సంక్రమించిన అధికారాలను గురించి ఇటీవల కొన్ని వాదోపవాదాలు జరుగుతూ ఉన్నవి అతనికి సంక్రమించిన అధికారాలు ఏలాటివి ? వాటిని అతడు స్వతంత్రించి చెలాయించుట చట్టసమ్మతమా? వాటిని చెలాయించుటలో మంత్రుల సభ యొక్క సలహాలను తప్పకుండ అతడు అనుసరించవలసి ఉన్నదా ? మంత్రుల సభ యొక్క సలహాలను అనుసరించని పక్షాన రాజ్యాంగ మూల శాసనాన్ని అతిక్రమించినవాడగుచున్నాడా ? అనే ప్రశ్నలు కొన్ని ఈ సందర్భంలో బయలుదేరినవి వాటికి సమాధానాలేవో తెలుసుకొనుటలో ఈ వ్యాసం కొంతవరకు తోడ్పడవచ్చు

1

ఈ సమాధానా లన్నిటికి ప్రధాన ఆధారం రాజ్యాంగ మూల శాసనంలోని 53, 74, 75, 78 సూత్రాలు వీటికి కొందరు ఒక విధంగాను, మరి కొందరు ఇంకొక విధంగాను వ్యాఖ్యానం చేయడం చేత ప్రెసిడెంటు అధికారాలను గురించి అభిప్రాయ భేదం ఏర్పడింది ఏది సరియైన వ్యాఖ్యానమో తెలుసుకొనడంలో రాజ్యాంగ మూల శాసనాన్ని రూపొందించడంలో ప్రముఖ పాత్రను వహించిన నెహ్రూ, అంబేడ్కరు, అల్లాడి కృష్ణస్వామయ్య, రాజేంద్రప్రసాద్ మొదలైనవారు రాజ్యాంగ పరిషత్తులో వ్యక్తపరచిన అభిప్రాయాలు, అటుతర్వాత కొన్ని సందర్భాలలో మహోన్నత న్యాయస్థానం (సుప్రీంకోర్టు) వ్యక్తపరచిన అభిప్రాయం, గత పది సంవత్సరాల మధ్య ప్రెసిడెంటు మంత్రుల సభల మధ్య ఏర్పడిన పరస్పర సంబంధం చాలవరకు సహాయపడగలవు

ఇండియాను పాలించుటకు కావలసిన పరిపాలన కార్య నిర్వహణాధికారము (ఎగ్జికూటివ్ పవర్) ప్రెసిడెంటునందు సంక్రమించి యున్నదనియు, దానిని అతడు స్వయముగా గాని, తనకు లోబడిన అధికారుల ద్వారా గాని మూల శాసనానుసారం చెలాయించవచ్చుననియు 53 వ సూత్రం విధిస్తున్నది దీనినిబట్టి కార్యనిర్వహణాధికార మంతా అతనిది అని స్పష్టం అవుతూ ఉంది పరిపాలనాధికారం అంతా అతనిదే అని చెప్పుటకు ఈ సూత్రం ఆధారం

ప్రెసిడెంటు తన విధులను (అధికారాలను) నిర్వహించుటలో అతనికి సహాయము చేయుటకున్నూ, సలహా యిచ్చుటకున్నూ తప్పనిసరిగా ప్రధాన మంత్రి నాయకత్వాన ఒక మంత్రుల సభ ఉండవలెనని 74 (1) వ సూత్రం విధిస్తున్నది అంటే, ఒక నిమిషము కూడా మంత్రుల సభ అనే సభ యొకటి లేకుండా ప్రెసిడెంటు తన పనులను నిర్వహించుట మూల శాసన విరుద్ధం సర్వకాల సర్వావస్థలందు ప్రధాన మంత్రి నాయకత్వాన ఒక మంత్రుల సభ ఉండి తీరవలెను అలాటి సభ లేకుండా స్వయంగా ప్రెసిడెంటు పరిపాలనను సాగించుట శాసన విరుద్ధం

ఈ సభయొక్క పని అతనికి సహాయం చేయడం, సలహాలను ఇవ్వడం పరిపాలనమునకు సంబంధించిన యావత్తు కార్య కలాపాలలో అతడు ఈ సభయొక్క సహాయాన్ని సలహాను కోరవలసి ఉంది. కొన్నిటిలో మాత్రమే కోరడం, తక్కిన వాటిలో కోరక పోవడం శాసన విరుద్ధం

75 (1) వ సూత్రం ప్రధాన మంత్రిని, తక్కిన మంత్రులను నియమించే అధికారాన్ని ప్రెసిడెంటుకు ఇస్తూ ఉంది. అయితే ఇక్కడ ఒక భేదం గమనించడం అవసరం. ప్రధాన మంత్రిని నియమించడంలో అతడు ఎవరి సలహాను కోరవలసిందీ లేదు తక్కిన మంత్రులను నియమించడంలో మాత్రం అతడు ప్రధాన మంత్రి యొక్క సలహాను కోరవలసి ఉన్నది అతడు ఎవరిని సూచిస్తే వారినే మంత్రులుగా నియమించడం అతని (ప్రెసిడెంటు యొక్క) విధి

కాని దీనినిబట్టి ఎవరి నంటే వారిని ప్రధాన మంత్రిగా నియమించే అధికారం ప్రెసిడెంటుకు ఉన్నట్లు భావించరాదు ఎందుకంటే 75 (3) వ సూత్రం మంత్రుల సభ సమష్టిగా లోక్ సభకు బాధ్యత వహించి ఉండవలెనని విధించడం చేత లోక్‌సభకు బాధ్యత వహించడం అంటే లోక్‌సభలో అధిక సంఖ్యాకుల (మెజారిటీ) విశ్వాసానికి పాత్రమై ఉండడం అని అర్థం దీనినిబట్టి ఎవరైతే అలాటి విశ్వాసానికి పాత్రమై ఉంటాడో అతనినే తప్పకుండా ప్రధాన మంత్రిగాను, అతని అనుచరులనే తక్కిన మంత్రులుగాను ప్రెసిడెంటు నియమించవలసి ఉంది ప్రధాన మంత్రి పదవి ఖాళీ అయినప్పుడు ఆ స్థానంలో ఎవరిని నియమించడం అనే ప్రశ్న బయలుదేరినప్పుడు లోక్‌సభలో ఎవడు అధిక సంఖ్యాకుల విశ్వాసానికి పాత్రుడై ఉన్నాడో తెలుసుకొని, అలాంటి వానినే ప్రధాన మంత్రిగా నియమించడమే ప్రెసిడెంటు చేయవలసిన పని

ఈ సందర్భంలో ఇంకొక విషయం కూడా గుర్తించడం అవసరం. ప్రస్తుత కాలంలో ఇతర ప్రజాస్వామ్యాలలో ఉన్నట్లే మన దేశంలో కూడా లోక్‌సభలోను, ఇతర శాసన సభలలోను సభ్యు లందరు (ఎవరో కొందరు స్వతంత్రులు తప్ప తక్కినవా రందరు) ఏదో ఒక రాజకీయ పక్షానికి—కాంగ్రెసు, ప్రజాసోషలిస్టు, కమ్యూనిస్టు—చెందిన వారుగా ఉంటున్నారు. ఏదైనా ఒక పక్షానికి అధిక సంఖ్యాబలం ఉన్నప్పుడు దానికి నాయకుడైన వానిని తప్పకుండా ప్రధాన మంత్రిగా ప్రెసిడెంటు నియమించడం తప్పదు గత పది సంవత్సరాలుగా లోక్‌సభలో కాంగ్రెసు పక్షం ఈలాటి స్థానంలో ఉండడంచేతను, దానికి పండిట్ నెహ్రూ నాయకుడు కావడం చేతను, విధిగా అతనినే ప్రధాన మంత్రిగా నియమించడం జరిగింది ఈలాటి పరిస్థితులలో ఎవరి నంటే వారిని ప్రధాన మంత్రిగా నియమించే అధికారం గాని, అవకాశం గాని ప్రెసిడెంటుకు లేదనే విషయాన్ని గుర్తించడం అవసరం ఏ పక్షానికీ అధిక సంఖ్యాబలం లేక, రెండు మూడు పక్షాలు కలిస్తేనే గాని అలాటి బలం చేకూరనప్పుడు ప్రధానిని నియమించడంలో కొంత స్వాతంత్ర్యం ప్రెసిడెంటుకు ఉంటే ఉండవచ్చు. అప్పుడు కూడా అది చాలా స్వల్పం కలియుటకు ఇష్టపడ్డ పక్షాల నాయకులే వారిలో ఎవరు ప్రధానిగా ఉండవలసింది ఏర్పరచుకొంటారు. ఆఏర్పాటు ప్రకారం ప్రెసిడెంటు నడవవలసిన వాడవుతాడు

కనుక ప్రధాన మంత్రిని గాని, తక్కిన మంత్రులనుగాని నియమించడంలో ప్రెసిడెంటుకు గల అధికారం కొన్ని పరిస్థితులలో లేనే లేదని మరికొన్నిటిలో చాలా స్వల్పమైనదనీ గ్రహించవలెను వ్యక్తిగతంగా తనకు ఇష్టంలేని వానిని ప్రధాన మంత్రిగా నియమించవలసిన అవసరం ప్రెసిడెంటుకు ఏర్పడవచ్చు. ప్రెసిడెంటు అధికారాలు ఏలాటివి అనే ప్రశ్నకు సమాధానం చెప్పడంలో ఈ విషయం గమనించతగ్గది.

అయితే యిక్కడ ఒక ఆక్షేపణ చేయవచ్చు 75 (2) వ సూత్రం ప్రెసిడెంటుకు ఇష్ట మున్నంతవరకు మంత్రులు (ప్రధాన మంత్రితో సహా)

ఉద్యోగమందు ఉండవలెనని చెప్పుతున్నది. మంత్రులు లోక్‌సభ విశ్వాసానికి పాత్రులైనా, అతని ఇష్టాన్ని కోల్పోయినప్పుడు ఉద్యోగాల నుండి తొలగి పోవలసి ఉంటుందని, మంత్రుల ఉద్యోగ కాలానికి అతని దయా ధర్మాలు ఆధారాలని 75 (2) వ సూత్రానికి వ్యాఖ్యానం చేయడం సరికాదు. లోక్ సభలో అధిక సంఖ్యాకుల విశ్వాసానికి పాత్రమైన మంత్రుల సభను తొలగించి, దానికి పాత్రము కాని మంత్రుల సభను ఉద్యోగంలోకి తేవడం వల్ల పరిపాలనలో ప్రతిష్టంభన ఏర్పడుతుంది. (ఏలాగు ఏర్పడుతుందో క్రమ క్రమంగా తర్వాత వివరింప బడుతుంది.) అందుచేత 75 (2)వ సూత్రాని కంటె 75 (3)వ సూత్రానికే ఎక్కువ బలం.

దీనికంటె భిన్నమైన పరిస్థితి ఇంకొకటి ఏర్పడవచ్చు. కొంతకాలం లోక్‌సభ విశ్వాసానికి పాత్రమై తర్వాత ఆ విశ్వాసాన్ని కోల్పోయిన మంత్రుల సభ ప్రెసిడెంటు ఇష్టపడితే అధికారంలో ఉండడం సాధ్యమా అనే ప్రశ్న కూడా ఒకటి ఉంది. పది సంవత్సరాలుగా నెహ్రూ మంత్రి వర్గం అధికారంలో ఉంది. కాని, ఏదైనా కొన్ని కారణాల మూలంగా లోక్ సభలో అధిక సంఖ్యాకులు ఆ మంత్రివర్గంపై తిరుగుబాటు చేసి, విశ్వాస రాహిత్య తీర్మానానికి (నో కాన్ఫిడెన్స్ మోషన్) ఆమోదం తెలిపి అలాటి తీర్మానం నెగ్గితే ప్రెసిడెంటు చేయతగిన పని ఏలాటిది ? ఆ మంత్రివర్గంపై ప్రెసిడెంటుకు ఇష్టం ఉన్నంత మాత్రంచేత దానిని అధికారం నుండి తొలగించక పోవడం శాసన సమ్మతం కాజాలదు. దానిని తొలగించకపోతే పరిపాలనలో ప్రతిష్టంభన ఏర్పడుతుంది. గనుక ఏవిధంగా చూచినా, మంత్రుల నియామకంలోనూ, వారిని తొలగించడంలోను ప్రెసిడెంటు యొక్క ఇష్టా నిష్టాలకు ఏలాటి అవకాశంలేదు. లోక్‌సభ యొక్క విశ్వాసాలకే ప్రసక్తి. వాటినిబట్టి ప్రెసిడెంటు ప్రవర్తించవలసి ఉంటుంది.

మంత్రులను నియమించే అధికారం గాని, తొలగించే అధికారం గాని ప్రెసిడెంటుకు ఎప్పుడైతే లేదో, పరిపాలన కార్య నిర్వహణలో అతనికి గల ఇతర అధికారాలు కూడా అతనికి లేవనీ, ఆ అధికారాలన్నీ అతనికి సలహా యిచ్చే మంత్రివర్గం యొక్క అధికారాలని చెప్పవలసి వస్తుంది.

ఈలాగు వ్యాఖ్యానించడానికి ఏమిటి కారణం ?

74 వ సూత్రంలో మంత్రుల సభ అతనికి సహాయం చేయవలె ననీ, అతనికి సలహా యియ్యవలెననీ ఉన్నదే గాని, ఆ సలహాను తప్పకుండా అతడు సీక్వరించవలెననిగాని, దానికి అన్యథాగా అతడు ప్రవర్తించరాదనిగాని లేదుగదా ? అలాంటప్పుడు అతడు వారి సలహాలోని మంచి చెడ్డలను స్వయంగా ఆలోచించి, సలహా మంచిదని తోచినప్పుడు దానిని అనుసరించడం, మంచిది కాదని తోచినప్పుడు దానిని తిరస్కరించి తనకు తోచినట్లు దేశాన్ని పాలించడం శాసన విరుద్ధం అవుతుందా ? అనే సందేహం కొందరికి కలగడం సహజమే. కొందరు వ్యాఖ్యాతలు ఇది శాసన విరుద్ధం అని; కొందరు కాదని చెప్తూ ఉన్నారు. కాని శాసన విరుద్ధం అనే వాదానికే ఎక్కువ బలం ఉన్నది.

ఎందుకంటే మంత్రులసభ యొక్క సలహాను తిరస్కరించి, తన ఇష్టానుసారం పరిపాలించ దలచే ప్రెసిడెంటు, పరిపాలనలో ప్రతిష్టంభన ఏర్పడే ప్రమాదాన్ని కల్పించడం తప్పదు. దేశాన్ని పాలించడానికి ఎన్నుకోబడ్డ ప్రెసిడెంటు పరిపాలనను స్తంభింప చేయడము మూల శాసన విరుద్ధం అవుతుంది. మూల శాసనాన్ని రక్షించేటట్లు, దానిని అతిక్రమించనట్లు, పదవీస్వీకరణ కాలంలో అతడు చేసే ప్రమాణానికి విరుద్ధం అవుతుంది. అట్టి సందర్భంలో అతడు 56 (1) సి, 61 సూత్రాల ప్రకారం (ఇంపీచ్ మెంట్) — పార్లమెంటులోని ఉభయ సభల విచారణ ద్వారా ఉద్యోగం నుండి తొలగింపబడే పరిస్థితి ఏర్పడుతుంది. లోక్ సభయొక్క విశ్వాసానికి పాత్రమైన మంత్రుల సభ యొక్క సలహాలను తిరస్కరించి నప్పుడు సంభవించే పరిణామాలు ఈలాటివి.

తమ సలహాలను తిరస్కరించినప్పుడు మంత్రుల సభ ఉద్యోగంలో ఉండడానికి ఇష్టపడదు. రాజీనామా చేస్తుంది. ప్రెసిడెంటు దాని స్థానే ఇంకొక మంత్రుల సభను, ఇదివర కుండిన ప్రధాన మంత్రి స్థానే ఇంకొక ప్రధాన మంత్రిని నియమించవలసి వస్తుంది. కాని ఈ నూతన ప్రధాన మంత్రి గాని, మంత్రుల సభ గాని పరిపాలనను సాగించే స్థితిలో ఉండదు. దేశాన్ని పాలించడంలో కార్య నిర్వహణ శాఖకు (ఎగ్జిక్యూటివ్) ఎంత ప్రాధాన్యం ఉన్నదో పార్లమెంటుకు కూడా (పార్లమెంట్ లెజిస్లేటర్) అంతటి ప్రాధాన్యం ఉంది. పార్లమెంటు ఆమోదం లేకుండా సాధారణ పరిస్థితులలో చట్టాలు చేయడం, పన్నులను విధించడం, ప్రభుత్వ ఆదాయాన్ని ఖర్చు పెట్టడం మూల శాసన విరుద్ధం. సాధారణంగా కొత్త కొత్త చట్టాలను ప్రతి పార్లమెంటు సమావేశంలో చేయడం మనం చూస్తూనే ఉన్నాం. ప్రాచీన కాలంలో పూర్వాచారాలను బట్టి అందరూ ప్రవర్తిస్తూ ఉండేవారు. ఇప్పుడు అలాగు జరుగడం లేదు. కొత్త శాసనాలు, చట్టాలు అవసరం. పన్నుల విషయంలోనూ, ఆదాయాన్ని ఖర్చు పెట్టే విషయంలోను ఎప్పటి కప్పుడు మార్పులు జరుగుతూ ఉండవలసి ఉంది. అందుచేత పార్లమెంటు సహకారం లేకుండా ప్రెసిడెంటుగాని, ప్రెసిడెంటు నియమించిన మంత్రులసభ గాని దేశాన్ని పాలించడం సాధ్యం కాని పని.

లోక్‌సభ యొక్క విశ్వాసానికి పాత్రమైన మంత్రుల సభ చేత రాజీనామా చేయించి, దాని స్థానే ప్రెసిడెంటు ఏర్పరచిన కొత్త మంత్రి వర్గానికి ఈలాటి సహకారం లభించదు. లోక్‌సభ సమావేశం కాగానే, కొత్త మంత్రివర్గంపై విశ్వాసరాహిత్య తీర్మానం చేయడం తప్పదు. అలాటి మంత్రివర్గం ప్రవేశపెట్టిన బిల్లులను, బడ్జెట్లను లోక్‌సభ ఆమోదించడం జరగదు. ఈ కారణంచేత పరిపాలన స్తంభించిపోతుంది.

ప్రజాస్వామ్యంలో ప్రజలు ఎన్నుకొన్న ప్రతినిధులతో కూడిన లోక్‌సభ యొక్కయు, లోక్‌సభ యొక్క విశ్వాసానికి పాత్రులైన ప్రధాన మంత్రి, తదితర మంత్రుల యొక్కయు సహకారం లేకుండా తనకు ఇష్టం వచ్చిన మంత్రుల సాధనాన ప్రెసిడెంటు దేశాన్ని పాలించడం సాధ్యం కాదని దీని మూలంగా స్పష్టం అవుతూ ఉంది. రాజ్యాంగ మూల శాసనం ప్రెసిడెంటుకు పరిపాలనాధి కారాలను ఇచ్చిన మాట సత్యమే. కాని ఈ అధికారాలను అతడు స్వతంత్రంగా చెలాయించడం మూల శాసనం అంగీకరించడం లేదు. మంత్రుల సభ యొక్క సలహాలను బట్టి అతడు ప్రవర్తించవలసి ఉంది. గనుక ఆ అధికారాలు పేరునకు ప్రెసిడెంటు అధికారాలనీ, వాస్తవానికి మంత్రుల సభ అధికారాలనీ గ్రహించడం అవసరం. అవి అన్ని తన స్వతంత్రాధి కారాలని ప్రెసిడెంటు భావించి, తదనుసారంగా ప్రవర్తిస్తే పరిపాలనలో ప్రతిష్టంభన తప్పదు.

కాని ఈ వ్యాఖ్యానానికి ఒక ఆక్షేపణ ఉన్నది.

మూలశాసనంలోని 123 వ సూత్రం ఆర్డినెన్సులను (ఆర్డినెంసెస్) అనగా తాత్కాలిక శాసనాలను—చేసే అధికారాన్ని ప్రెసిడెంటుకు ఇస్తూ ఉన్నది. పార్లమెంటు హాజరులో లేనప్పుడు, ఏవైన విపరీత పరిస్థితులు ఏర్పడినట్లు ప్రెసిడెంటుకు తోస్తే వాటిని ఎదుర్కొనడానికి అతడు శాసనాలను చేసి అమలులో పెట్టవచ్చునని ఈ సూత్రం అతనికి ఆధారం కల్పిస్తున్నది. పార్లమెంటును సమావేశ పరచడం, పరచక పోవడం, వాయిదా వేయడం అన్న అధికారాలు ప్రెసిడెంటుకు ఉన్నవి. కనుక అతడు పార్లమెంటును సమావేశపరచకుండా ఈలాటి ఆర్డినెన్సుల ద్వారా దేశాన్ని పాలించడం మూల శాసనానికి విరుద్ధం కాదని కొందరు చెప్పవచ్చు. కాని ఆర్డినెన్సుల మూలంగా కొంతకాలం మాత్రమే పరిపాలనను సాగించడానికి వీలవుతుంది. పార్లమెంటు హాజరులో లేనప్పుడు మాత్రమే ఆర్డినెన్సులను చేయడానికి ప్రెసిడెంటుకు అధికారం. అలాగు చేయబడ్డ ఆర్డినెన్సు తిరిగి పార్లమెంటు హాజరైన ఆరు వారాల వరకు మాత్రమే అమలులో ఉంటుంది. పార్లమెంటును సమావేశ పరచే అధికారం ప్రెసిడెంటుకు ఉన్నా, ఒక సమావేశానికి ఇంకొక సమావేశానికి మధ్య ఆరు నెలల కంటె ఎక్కువ వ్యవధి ఉండరాదని, 85 వ సూత్రం విధిస్తున్నది. పార్లమెంటును సమావేశ పరచకుండా ఆరు నెలలు మాత్రమే ప్రెసిడెంటు గడపవచ్చు. ఆరు

నెలల తర్వాత విధిగా దానిని సమావేశపరచవలసి ఉంది. ఆలాగు సమావేశమైన పార్లమెంటు ఆర్డినెన్సును ఆమోదిస్తే తప్ప దాని ఆయుస్సు ఆరు వారాలలో తీరిపోతుంది. కనుక ఏ ఆర్డినెన్సు కూడా 7½ నెలల కంటె ఎక్కువ కాలం పార్లమెంటు ఆమోదం లేకుండా అమలులో ఉండజాలదు. ఆర్డినెన్సుల ద్వారా ప్రెసిడెంటు దేశాన్ని పాలించడం కొన్ని నెలల పర్యంతం సాధ్యం అవుతుంది గాని శాశ్వతంగా చేయడం సాధ్యంకాదు. అందుచేత, లోక్ సభ విశ్వాసానికి పాత్రమైన మంత్రుల సభను కాదని దేశాన్ని ప్రెసిడెంటు పాలించడం సాధ్యంకాని పని. పరిపాలన ప్రతిష్టంభన అంటే ఇదే అర్థం.

మూల శాసన ద్వారా ప్రెసిడెంటుకు సంక్రమించిన అధికారాలు పేరునకు మాత్రమే అతనివి అనిన్నీ, వాస్తవంగా అవి మంత్రుల సభవి అనిన్నీ, మూల శాసనాన్ని రూపొందించిన ప్రముఖు లందరూ రాజ్యాంగ పరిషత్తులో స్పష్టం చేశారు.

పండిట్ నెహ్రూ ఈ విధంగా చెప్పారు : "ప్రభుత్వం మంత్రుల ద్వారా జరగవలసి ఉన్నదనే విషయాన్ని మేము నొక్కి చెప్పుచున్నాము. అధికారమంతా వాస్తవంగా మంత్రుల సభలోను, శాసన సభలోను (పార్లమెంటు) కేంద్రీకృతమై ఉన్నది. ప్రెసిడెంటుకు అలాట అధికారం లేదు .. వాస్తవాధికారం ఏదీ అతనికి లేకపోయినా, అతని పదవి గౌరవ ప్రతిష్ఠలతో కూడుకొన్నది" శ్రీ కె. ఎం. మున్షీ బ్రిటిష్ రాజ్యాంగ విధానం చాలా పటిష్టమైనదనీ, సందర్భానుసారంగా మార్పులు పొందకలిగినదనీ, మున్నైబ్బై సంవత్సరాలుగా మనము ఆ విధానానికి అలవాటు పడిన వారమని, అందుచేత ఆ విధానాన్నే మనం అనుసరించడం వాంఛనీయమని, ఆ విధానంలో రాజునకు (రాణికి) గల అధికారాలు నామమాత్రము లైనట్లు మన విధానంలో కూడ ప్రెసిడెంటుకు సంక్రమించిన అధికారాలు నామమాత్రములుగా ఉండేటట్లు మూల శాసనాన్ని రూపొందించినట్లు వ్యక్తం చేశాడు. వాస్తవాధికారాలతో కూడుకొన్న ప్రెసిడెంటుచే పాలింపబడే అమెరికా రాజ్యాంగ విధానాన్ని, దానికి భిన్నంగా ఉండే బ్రిటిష్ రాజ్యాంగ విధానాన్ని చక్కగా విమర్శించి, శాసన శాఖ కార్యవర్గ శాఖల మధ్య పరస్పర సహకారమును కల్పించు బ్రిటిష్ విధానమునే తాము వరించి, దానిని మన రాజ్యాంగములో ప్రవేశ పెట్టినట్లు శ్రీ అల్లాడి కృష్ణస్వామయ్య చెప్పినారు. పేరులో తప్ప మరి ఏ విషయములో కూడా మన ప్రెసిడెంటుకు, అమెరికా ప్రెసిడెంటుకు పోలిక లేదనీ, మన ప్రెసిడెంటు బ్రిటన్‌లోని రాజువలె దేశైక్యమునకు చిహ్నమైనవాడు మాత్రమే గాని దేశాన్ని పాలించేవాడు కాడని, దేశాన్ని పాలించే అధికారం బ్రిటన్‌లో మంత్రుల సభకు ఉన్నట్లు మన దేశంలో కూడా మంత్రుల సభకే ఉన్నదని, దానికి తగినట్లుగా మూల శాసన నిర్మాణం జరిగిందని డాక్టరు అంబేద్కరు స్పష్టం చేశాడు. డాక్టర్ రాజేంద్రప్రసాద్ చెప్పిన మాటలు "ఎన్నిక మూలంగా అధికారంలోకి వచ్చిన ప్రెసిడెంటు, ఎన్నికల మూలంగా అధికారంలోకి వచ్చిన శాసన సభ (పార్లమెంటు)—ఈ రెంటి మధ్య సామరస్యం కుదర్చడానికి మేము ప్రయత్నం చేశాము. ఈ ప్రయత్నంలో మన ప్రెసిడెంటుకు బ్రిటిష్ రాజ్యాంగంలో రాజుకు గల స్థానాన్ని కల్పించినాము. ప్రెసిడెంటు పదవి నియమబద్ధమైన (కాన్‌స్టిట్యూషనల్) అధ్యక్షపదవి. మంత్రు లన్ననో—వారు శాసనసభకు బాధ్యులై ప్రెసిడెంటుకు సలహాల నిచ్చేవారు. వారి సలహాను తప్పక అతడు అనుసరించవలెను. ఈవిధంగా విధించే సూత్రం ఏదీ మూల శాసనంలో లేకపోయినా బ్రిటన్‌లో సంప్రదాయానుసారంగా రాజు ఎల్లప్పుడు మంత్రుల సలహాను అనుసరించేటట్లు మన దేశంలో కూడా ఈలాటి సంప్రదాయం ఏర్పడగలదని ఆశిస్తున్నాను" అని వివరించారు.

1955 లో మహోన్నత న్యాయస్థానం (సుప్రీంకోర్టు) ఒకానొక సందర్భంలో తీర్పు చెప్తూ, మన రాజ్యాంగంలో "ప్రెసిడెంటుకు గల హోదా నియమబద్ధమైనది. వాస్తవాధికారాలు మంత్రులవి. ఇంగ్లండు నందు ఉన్నట్లే మన రాజ్యాంగంలో కూడా పార్లమెంటరీ కార్యనిర్వాహక వర్గ విధానమే ఉన్నది ......" అనే అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది.

గత పది సంవత్సరాల మధ్య కేంద్ర ప్రభుత్వం ఎన్నో ప్రధానమైన మార్పులు చేసింది. హిందూ కోడ్ బిల్లును గురించి పార్లమెంటు చర్చలు సాగించుచుండినప్పుడు (1951—52 లో) ఆ బిల్లులో తలపెట్టిన మార్పులు వ్యక్తిగతంగా తనకు ఇష్టం లేనివి అయినా వాటిని పార్లమెంటు ఆమోదించేపక్షాన తాను కూడా ఆమోదించడానికి సిద్ధంగా ఉన్నట్లు డాక్టర్ రాజేంద్రప్రసాదు తెలియబరచారు. రాజ్యాంగ మూల శాసనం తొమ్మిది పర్యాయాలు సవరించబడ్డది. రాష్ట్రాల పునర్నిర్మాణం జరిగింది. ఇవి అన్నీ కూడా మంత్రుల ఇష్టానిష్టాల బట్టి జరిగినవే కాని ప్రెసిడెంటు ఇష్టానిష్టాలబట్టి కాదు. "అధికారాలన్నీ నావి. నేను చెప్పినట్లు మంత్రులు నడుచుకొనవలసినదే కాని, వారు చెప్పినట్లు నేను నడుచుకోవలసినది లేదు" అని డాక్టరు రాజేంద్రప్రసాదు వాదించలేదు. మంత్రులసభ యొక్క సలహాలను అనుసరించే అతడు పరిపాలనను సాగించాడు.

పై వివరణను బట్టి మంత్రులసభయొక్క సలహాలను తప్పని సరిగా అనుసరించినప్పుడే మన రాజ్యాంగ మూలశాసనం రూపొందించిన సమష్టి బాధ్యతాయుత ప్రభుత్వం సాధ్యం అవుతుందనీ, దానికి భిన్నంగా ప్రెసిడెంటు ప్రవర్తిస్తే పరిపాలన ప్రతిష్టంభన తప్పదనీ, అలాగు ప్రవర్తించడం అధికారదుర్వినియోగం అవుతుందనీ, రాజ్యాంగ మూలశాసనాన్ని రూపొందించడంలో రాజ్యాంగ పరిషత్తులో ప్రధాన పాత్రను వహించిన ప్రముఖు లందరూ ప్రెసిడెంటు యొక్క అధికారాలు నామమాత్రాలనే అభిప్రాయాన్ని తెలిపినారనీ, ఉన్నత న్యాయస్థానం యొక్క అభిప్రాయం కూడా ఈలాటిదే అనీ, గత పది సంవత్సరాలుగా ఇదే సంప్రదాయంగాను, సదాచారంగాను ఏర్పడ్డదనీ స్పష్టం అవుతున్నది.

సిద్ధాంత దృష్ట్యా కూడా ఇదే ఉత్తమమైన విధానం. ద్వంద్వ ప్రభుత్వం సర్వదా ప్రమాదకరం. పరిపాలనాధికారం ఎవరో ఒకరిచేతులలో ఉండడం మంచిది. మన రాజ్యాంగాన్ని రూపొందించినవారు అది ప్రెసిడెంటు చేతులలో ఉండుట కంటె మంత్రుల సభ చేతులలో ఉండడం మంచిదని భావించారు. దానికి ప్రధాన కారణం మంత్రులు లోక్‌సభకు బాధ్యులుగా ఉండడం; ప్రెసిడెంటుకు అలాటి బాధ్యత లేకపోవడం. పరిపాలనలోని గుణదోషాలకు లోటుపాటులకు జబాబుదారీ వహించేవారు మంత్రులు. లోక్‌సభ సమావేశమైనప్పుడు వారు కూడా అందులో సమావేశమై, సభ్యులు వేసే ప్రశ్నలకు సమాధానాలు చెప్పవలసినవా రగుచున్నారు. సభ్యుల విమర్శలకు సంజాయిషీ చెప్పేవారు మంత్రులు. విశ్వాసరాహిత్య తీర్మానం ద్వారా మంత్రులను అధికారంలో నుండి తొలగించే అవకాశం ఉంది. ప్రెసిడెంటుపై లోక్ సభకు ఏలాటి అధికారం లేదు. అతనిని విమర్శించడానికిగాని, ఖండించడానికి తొలగించడానికి లోక్‌సభకు అవకాశం లేదు. జబాబు చెప్పవలసినవారికి అధికారం ఉండడం సబబు. అందుచేతనే మన రాజ్యాంగంలో అధికారాలు మంత్రులకు ఒప్పగించబడ్డవి.

2

మూలశాసనాన్ని రూపొందించిన అంబేద్కరు మొదలైనవారి ఉద్దేశం మంత్రులకే పరిపాలనాధికారం ఉండడం మంచిది అనేది అయినప్పుడు వారు ఆ మాటను మూలశాసనంలో ఎందుకు స్పష్టంగా చెప్పలేదు ? మంత్రుల సలహాలను తప్పకుండా ప్రెసిడెంటు అనుసరించవలెనని ఎందుకు విధించలేదు ? అనే ప్రశ్న ఒకటి ఉంది. దీనికి రెండు సమాధానాలు ఉన్నవి.

మొదటి సమాధానం ఏమిటి అంటె : కొన్ని అధికారాల విషయంలో ప్రెసిడెంటు మంత్రుల సలహాలను అనుసరించ వలసినది లేదనే అభిప్రాయం వారికి ఉండినది. వాటి సంఖ్య చాలా తక్కువ అయినా అలాటివి కొన్ని ఉండడంచేత, "అన్ని విషయాలలో ప్రెసిడెంటు మంత్రుల సలహాలను శిరసావహించవలె"నని విధించడం అనుచితంగా వారికి తోచింది. ఉదాహరణకు అలాటి విషయాలు కొన్నిటిని పేర్కొన వచ్చు. (1) 78 వ సూత్ర ప్రకారం పరిపాలన వ్యవహారాలకు సంబంధించిన యావత్తు భోగట్టా

(ఇన్‌ఫర్ మేషన్) ప్రెసిడెంటు ప్రధాన మంత్రి నుండి కోరవచ్చు; మంత్రులలో ఎవరైనా ఒకరు మాత్రము చేసిన నిర్ణయాలను మంత్రుల సభ సమష్టిగా పునరాలోచించ వలసినదని కోరవచ్చు. ఈలాగు కోరడంలో అతడు మంత్రుల సలహాలను అనుసరించడం అనుచితం. (2) లోక్‌సభ మంత్రివర్గంపైన విశ్వాసరాహిత్య తీర్మానం చేసినప్పుడు వారు రాజీనామా యిచ్చి ఉద్యోగాల నుండి తొలగడం మర్యాద. కాని వారు ఈలాగు చేయ నప్పుడు ప్రెసిడెంటు (వారి సలహాతో నిమిత్తం లేకుండా) వారిని తొల గించవలసి ఉంటుంది. (3) విశ్వాసం కోల్పోయిన మంత్రివర్గం లోక్‌సభను రద్దుచేసి తిరిగి ఎన్నికలు జరుపవలసినట్టుగా ప్రెసిడెంటుకు సలహా చెప్ప వచ్చును. కాని వారి స్థానే ఇంకొక మంత్రివర్గాన్ని నిర్మాణం చేసి పరి పాలనను సాగించే అవకాశం ఉన్నట్లు ప్రెసిడెంటుకు తోచవచ్చు. అలాటి సందర్భంలో వారి సలహాను తిరస్కరించే అధికారం అతనికి ఉండడం మంచిది. (4) లోక్‌సభలో అధికార పక్షానికి సంఖ్యాబలం ఉండవచ్చు; మంత్రి వర్గం దాని విశ్వాసానికి పాత్రమైనదిగా ఉండవచ్చు. కాని ఆ అధికార పక్షం ఆ మంత్రివర్గం అవినీతికి పాల్పడి దేశ హితానికి విరుద్ధంగా పరిపాల నను సాగిస్తూ ఉండవచ్చు. దానినంతా చూస్తూ ప్రెసిడెంటు పూరక ఉండవలసినదేనా ? ముక్తి మార్గం ఏమీ లేదా ? ఉన్నది. మంత్రుల సలహాతో నిమిత్తం లేకుండా లోక్‌సభను రద్దు చేసి, సాధారణ ఎన్నికలు జరిపించడమే ఆ మార్గం. ప్రజాస్వామ్యంలో ప్రజాభిప్రాయాన్నిబట్టి పరి పాలన సాగవలసి ఉంది. ఎన్నికలను జరిపించడం అంటే ప్రజాభిప్రాయాన్ని తెలుసుకొనడం. ఈలాగు దానిని తెలుసుకొనే అధికారం ప్రెసిడెంటుకు ఉండడం అవసరం.

రెండవ సమాధానం ఏమిటి అంటే—మంత్రుల ద్వారా పరిపాలన జరిగే బ్రిటిష్ రాజ్యాంగ విధానం చక్కగాను, పటిష్ఠంగాను జరుగడానికి కొన్ని అనుకూల పరిస్థితులు ఉండడం అవసరం దేశంలో ప్రధాన రాజ కీయ పక్షాలు రెండే ఉండడం, ఆ పక్షాల రెండూ ప్రజాస్వామ్యంలో విశ్వాసం కలవిగా ఉండడం, ప్రజలు ప్రజాస్వామ్యంలో విశ్వాసంకలవారై రాజకీయాలయందు ఉత్సాహం ప్రదర్శించేవారు కావడం మొదలైనవి ఈలాటి పరిస్థితులు. మన దేశంలో ఇవి ఎంతవరకు ఏర్పడగలవో చెప్పు టకు తగిన అవకాశం యింకా రాలేదు మనం రూపొందించిన విధానం దేశానికి, ప్రజలకూ క్రొత్త. ఎంతవరకు ఇది విజయవంతం కాగలదో మనం చెప్పలేము. మంత్రుల సలహాను అనుసరించి పరిపాలనను సాగించే ప్రెసిడెంటు ఉండడం వాంఛనీయమని ప్రస్తుతం మనం భావించినా, దానికి కావలసిన అనుకూల పరిస్థితులు ఏర్పడక పోవచ్చు ఆ కారణాన మనం ఏర్పరచుకొన్న రాజ్యాంగం మార్చవలసిన అవసరం కలగవచ్చు ఆ మార్పు విస్తార కష్టంతో కూడుకొన్నది కాకుండా ఉండడానికిగాను "మంత్రుల సలహాను ప్రెసిడెంటు తప్పకుండా అనుసరించవలెను" అనే విధిపూర్వక మైన మాత్రాన్ని ఒకదానిని మూలశాసనంలో చేర్చలేదు.

3

అధికారాలు విస్తారంలేని ఉత్సవ విగ్రహం మోస్తరుగా ఉండే ప్రెసి డెంటు మూలంగా దేశ పరిపాలనలో కలిగే ప్రయోజనం ఏమైనా ఉన్నదా ? అనే ప్రశ్న ఒకటి ఉన్నది. ప్రెసిడెంటు జీతం, తక్కిన అల వెన్సులు, సమస్త వైభవాలతో కూడుకొన్న అతని నివాసమైన రాష్ట్ర పతి భవనం, అతని పర్యటనలు మొదలైన వాటి క్రింద లక్షలాది ద్రవ్యం ఏటేట ఖర్చు అవుతూ ఉన్నది. ఇదంతా వ్యర్థమేనా ? ఈలాటి పదవికి రాజ్యాంగంలో ఏలాటి అవసరం ఉన్నది ? దీనికి కూడా కొన్ని సమాధానాలుఉన్నవి.

(1) పైన వివరించినట్లు ఇది పూర్తిగా అధికారాలు లేని పదవి కాదు. కొన్ని ప్రధానములైన అధికారాలతో కూడుకొన్నది. భవిష్యత్తులో మనకు ప్రస్తుతం గోచరించని పరిణామాలు సంభవించినప్పుడు దీని అవ సరం ఎక్కువ కావచ్చు (2) బాధ్యతాయుత మంత్రులతో కూడిన (పార్లిమెంటరీ ఎగ్జిక్యూటివ్) బ్రిటన్, హాలెండు, ఇటలీ, బెల్జియం, డెన్మార్కు, నార్వే, స్వీడన్, కెనడా, ఆస్ట్రేలియా, న్యూజిలెండ్ మొదలైన దేశా లన్నిటిలో ఈలాటి పదవి ఒకటి ఉన్నది దాని మూలంగా—రాజు, రాణి, గవర్నరు జనరలు, ప్రెసిడెంటు పదవి మూలంగా—కొన్ని అవస రాలు తీరడం చేతనే ఆ దేశాలలో ఈలాటి పదవి ఉండడం జరిగింది మన స్థితి కూడా ఈలాటిదే. (3) దేశైక్యానకి ఒక బాహ్యచిహ్నం ఉండడం అవసరం ప్రధాన మంత్రి ఏదో ఒక రాజకీయ పక్షానికి నాయకుడు కావడంచేత అతడు దేశైక్యానికి చిహ్నంగా పరిగణింపబడే అవకాశం లేదు. ప్రెసిడెంటు ఈలాటి వాడుగా ఉండవలసిన అవసరం లేదు అతడు ఏదో ఒక పార్టీకి చెందిన వాడుగా ఉండవలసింది లేదు. అంతే కాకుండా అతనిని కేంద్రంలోని పార్లమెంటు సభ్యులు మాత్రమే కాకుండా, రాష్ట్రాలలోని శాసనసభా సభ్యులు కూడా కలిసి ఎన్నుకొంటున్నారు ఎన్నిక విధానం దామాషా ఓటు (ప్రపోర్షనల్ రెప్రసెన్ టేషన్) విధానం కావడం చేత అన్ని రాజకీయ పక్షాల వారికి అందులో కొంత ప్రాధాన్యం లభిస్తూ ఉన్నది. ప్రెసిడెంటు అన్ని పక్షాల ఆమోదాన్ని పొందిన వాడని చెప్పు టకు తగినవాడు. ఈ కారణాలచేత అతడు దేశైక్యానికి బాహ్యచిహ్నంగా ఉంటున్నాడు (4) పరిపాలన విధానంలో అధికారం ఒకదానికే మాత్రమే ప్రాధాన్యం ఉన్నట్లు భావించరాదు పలుకుబడికి కూడా ఎంతో ప్రాధాన్యం ఉంది పలుకుబడిగల వారి మాటలను అధికారంలో ఉండేవారు సాధార ణంగా తోసివేయలేరు స్వరాజ్యం లభించిన తరువాత మహాత్మా గాంధికి అధికారం ఎలాటిదీ లేకపోయినా అధికారంలో ఉన్న నెహ్రూ, పటేలు మొదలైనవారు ఆయన మాటలను శిరసావహిస్తూ వచ్చారు అలాగే యోగ్యు డైనవాడు, అనుభవశాలి, పేరు ప్రఖ్యాతులు గలవాడు ప్రెసిడెంటు స్థానంలో ఉన్నప్పుడు ఆయన మాటలను ప్రధాన మంత్రి తప్పకుండా వింటాడు. విన్నా వినకపోయినా ప్రధాన మంత్రికి సలహా ఇయ్యగలవాడు ఒకడు దేశంలో ఉండడం అవసరం ప్రధాన మంత్రి గొప్ప మేధావి కావచ్చు; ప్రాజ్ఞుడు కావచ్చు కాని "ప్రమాదో ధీమతా మపి" అనే వాక్యం ఒకటి ఉన్నది కదా ? నెహ్రూ వంటి ప్రధాన మంత్రికి సలహా ఇయ్యగలవారు మంత్రివర్గంలో సాధారణంగా ఎవరూ లేరు తక్కిన మంత్రులు వారి ఉద్యోగాలకు అతనిపై ఆధారపడి ఉండేవారు కాని డాక్టరు రాజేంద్ర ప్రసాదు ఏలాటి జంకూ, సంకోచమూ లేకుండా అతనికి చెప్పవలసిన మాట లను చెప్పే స్థితిలో ఉన్నారు "నీవు అనుసరించే మార్గంలో చాలా లోపాలు ఉన్నవి దీని మూలంగా దేశానికి ప్రమాదం సంభవించవచ్చు. గనుక నీ మార్గాన్ని మార్చుకో పునరాలోచన చేసి చూడు" అని నిర్భ యంగా డాక్టరు రాజేంద్రప్రసాదు చెప్పగలవాడు ఇంగ్లండు మొదలైన దేశాలలోని రాజులు, రాణులు, ఈ పనిని చేస్తారు వీరి హెచ్చరిక మంత్రులకు, మంత్రుల ద్వారా దేశానికి, ఎంతో లాభంగా పరిగణింపబడుతూ ఉంది ప్రెసిడెంటు అలా హెచ్చరించగలవాడు సమష్టికుటుంబంలో పెద్ద కుమారుడు పెత్తనం చేసే వాడుగా ఉన్నా వృద్ధుడైన తండ్రి అతనికి సలహా ఇస్తూ ఉంటాడు ప్రెసి డెంటు ఈలాటి అవసరాన్ని తీరుస్తాడు. ఈ కారణాలన్నింటిచేత ప్రెసి డెంటుకు విస్తార అధికారం లేకపోయినా అతని మూలంగా కొన్ని లాభాలు చేకూరుతున్నవని స్పష్టం అవుతుంది.

నల్లజర్ల రోడ్డు....

శ్రీ బాలగంగాధర తిలక్

నల్లజర్ల అడవిమీద చంద్రుడు భయంకరంగా ఉదయించాడు. అవధానిగారు యీలాగ అనేటప్పటికి మేమందరం పక్కున నవ్వాం. కొవ్వొత్తి దీపపు వెలుతుర్లో ఆయన గడ్డంలోని తెల్ల వెంట్రుకలు వెండిదారాల్లా మెరిశాయి.

"చంద్రుడూ వెన్నెలా ఎప్పుడూ మనోల్లాసంగా హాయిగా ఉంటాయని మీ అభిప్రాయం కాని ఒక్కొక్క పరిస్థితిలో ఎంత భయపెడతాయో మీకు తెలియదు" అన్నారు మళ్ళీ.

"చెప్పండి. మీరేదో కథ చెపుతారని తెలుస్తూనే వుంది. వినటానికి సిద్ధంగా ఉన్నాం" అన్నాను నేను

"ఈ రాత్రికింక లైట్లు రావు ఎక్కడో తీగ తెగిపోయివుంటుంది" అన్నాడు నారాయణ.

"తోటఅంతా చీకటైపోయింది" అన్నాడు నెర్వస్‌గా ఆచారి అస్తిమితంగా చేతివేళ్లతో బల్లమీద ఆదితాళం వేస్తున్నాడు "ఇంకా కొవ్వొత్తులున్నాయాండి ?" అని అడిగాడు

అవధానిగారు తల వూపారు— ఉన్నాయన్నట్లు

"ఈ తోటా, తోటలో మీ బంగళా, మీరు చేసిన విందూ—ఓహ్! మరచిపోలేం" అన్నాడు నారాయణ

"వూరికి యింతదూరంగా యీ తోట వుండడమే అంత బాగా లేదు" అన్నాడాచారి

"చెప్పండి కథ" అన్నాను నేను

"కథా?" నిరసనగా చూశారు అవధానిగారు

"అదే అదే మీ చిన్నప్పుడు జరిగిన సంఘటన. .." అని సర్దుకున్నాను. అవధానిగారు కవికాదు; కథకుడూకాడు జీవితాన్ని నిండుగా నూటిగా జీవించిన మనిషి హృదయమూ చమత్కారమూ ఆలోచనా ఉన్నవాడు వీటికి తోడు విచిత్రంగా విరుద్ధంగా బాగా డబ్బున్నవాడు

ఆయన చెప్పడం మొదలుపెట్టారు

"ఏలూరులో చూసుకోవల్సిన పని అంతా అయిపోయింది ప్లీడరుగారు పక్కలు ఏర్పాటు చేయిస్తానన్నా వినక కారు స్టార్టు చేశాడు రామచంద్రం. పది గంటలు దాటింది రాత్రి నాగభూషణం మామయ్యా, నేనూ వెనకాల సీటులో కూర్చున్నాం ప్లీడరుగారు కారు దగ్గరకివచ్చి "నా మాట విన్నారు కాదు" అన్నారు "అబ్బే ఎంత సేపండీ సరిగ్గా తొక్కితే ఒక్క గంటన్నరలో తణుకులో పడతాం మీరేం యిదవకండి" అన్నాడు రామచంద్రం

"కలక్టరుగారి యింట్లో పెళ్లి సరిగా ఉదయం ఏడు గంటలకి? నా మీదా, రామంచద్రంమీదా భరోసా వేసుకుని కూర్చున్నారు కలక్టరుగారు అన్నాడు నాగభూషణం మామయ్య

"అమ్మమ్మ ఎంతమాట! కలక్టరుగారింట్లో శుభకార్యమంటే వేరే చెప్పాలా! అన్నారు ప్లీడరుగారు యావద్విషయాన్నీ గ్రహించినవారై

కారు సాగింది అప్పటికి నాకు పద్దెనిమిదేళ్లు అప్పటికి మీ రెవరూ పుట్టిఉండరు" అన్నారు అవధానిగారు మా అందరికేసీ చూసి

"అటువంటి ప్రమాదం సంభవించే సూచనలు కూడా వాతావరణంలో ఉండి ఉండవండి" అన్నాడు నారాయణ.

తోటలో గలగల చప్పుడయింది ఆచారి ఉలిక్కిపడి "దొంగలేమో" అన్నాడు

"పక్షులు చెట్లలో కదులుతున్నాయి అంతే" అన్నారు అవధానిగారు.

"కథలోకి రండి" అన్నాను నేను.

"అంటే.. . ?' కోపంగా చూశారు అవధానిగారు.

"అదేనండీ మీ చిన్నప్పటి . ."

అవధానిగారు చిన్నగా నవ్వి గడ్డం చేత్తో ఒకసారి సవరించుకున్నారు కొంచెం ముందుకువంగి యిలా చెప్పసాగారు

ఆరుమైళ్లు వచ్చేటప్పటికి కారు ఆగిపోయింది. రామచంద్రం దిగి బానెట్‌తీసి చూశాడు

"వెధవ కారులా వుంది నడచి వెనక్కి పోదాంపద. ఎందుకేనా మంచిది" అన్నాడు నాగభూషణం మామయ్య

"అర్జునుడు గాండీవాన్ని తిట్టినా సహిస్తాడేమోగాని యీ కారుని తిడితే మాత్రం నేనూరుకోను అసలీ యింజనులాంటిది యిండియాలో వుండదు" అన్నాడు రామచంద్రం.

"అందుకే ఆరుమైళ్లకే ఆగిపోయింది "మామయ్య వినుగ్గా అన్నాడు" డొక్కు కార్లు కొనకురా అంటే విన్నావ్! సెకండ్‌హాండ్‌వి కొనవల్సిన ఖర్మ నీకేమొచ్చింది? మన మాట ఎలాగున్నా వీణ్ణి కూడా మనతో తీసుకొచ్చాం కర్మ! వీడు ఎనిమిది గంటలకి పడుకోకపోతే మా అక్కయ్య ఎనిమిదిగురు డాక్టర్లని ఒకేసారి పిలిచి చూపెడుతుంది." అన్నాడు నన్నుద్దేశించి

"ఏం భయంలేదు మామయ్యా రాత్రిళ్ళు కార్లలో ప్రయాణం చెయ్యడం నాకు సరదా' అన్నాను నేను

రామచంద్రం మా వూళ్లో పెద్ద టెన్నిస్ ఛాంపియన్. పొడుగ్గా ఒలంగా హుషారుగా ఉంటాడు మా వూరి క్లబ్బుకి సహాయ కార్యదర్శి సేవా సదనానికి గౌరవాధ్యక్షుడు ఆ సదనం ఏమిటో ఏం చేసేదో యిప్పటికీ నాకు తెలియదు ఇటువంటి సంస్థల ప్రత్యేకత యిదే కాబోలు రామచంద్రానికి కాలవ ఒడ్డున పెద్ద మేడ వుంది. మేడలో అతనికొక భార్యా కుమారరత్నమూ కూడా ఉన్నారు అతను భార్య నెక్కువ ప్రేమిస్తాడో, భార్య పేర ఆమె తండ్రి వ్రాసి యిచ్చిన ముప్ఫైనాలుగెకరాల్ని ఎక్కువ ప్రేమిస్తాడో తెలియక, తేలక, జిజ్ఞాసువులు చాలామంది బాధపడేవారు పాపం మా నాగభూషణం మామయ్యకి వరుసకి బావ అవుతాడో బావమరది అవుతాడో—యిటువంటి భోగట్టా నాకు సరిగా తెలియదు మా ఆవిడకి తప్ప—అసలు నాగభూషణం నాకు వేలు విడిచిన మేనమామ అందరమూ ఒకే వూళ్లో వుండడమూ, రాక పోకలూ, శుభకార్యాలూ మంచీ చెడ్డలో ఒకరి నొకరు ఆదుకోవడమూ—యిలాంటి వాటివలన యీ కుటుంబాలన్నింటికీ చనువు, గాఢ స్నేహమూ ఏర్పడ్డాయి నాగభూషణం కూడా వూళ్లో చెప్పుకోదగినవాడు యం ఏ చదివాడు పెద్ద కలప వ్యాపారం నడుపుతున్నాడు. ప్రతీ ఏడాదీ భగవద్గీతమీదా, ఉపనిషత్తులమీదా పెద్దవాళ్ళని పిలిపించి ఉపన్యాసాలు యిప్పిస్తూంటాడు కట్టడం ఎప్పుడూ ఖద్దరేకాని, జిల్లాబోర్డు ప్రెసిడెంటు ఏ పార్టీ అయితే ఆ పార్టీనే బలపరుస్తాడు దివ్యజ్ఞాన సమాజానికి ఉపాధ్యక్షుడు. వూళ్ళోకి కలక్టరు వచ్చినా, మంత్రి వచ్చినా యితని యింట్లోనే మకాం."

"కారు బాగు పడిందాండి" అన్నాడు నారాయణ మధ్యలో అడ్డువచ్చి.

ఆ. రామచంద్రం కారు చుట్టూ రెండుసార్లు ప్రదక్షిణం చేశాడు కొంతసేపు గొణుక్కున్నాడు. కారుకిందా మీదా ఏవో పరీక్ష చేశాడు చివరికి ఆల్‌రైట్ అంటూ కారులో కూర్చున్నాడు. కారు సాగింది ఎర్రని పొడు గాటి రోడ్డుమీద కారు వెళుతూంటే చల్లని గాలి మొహానికి కొడుతోంది. ఇటూ అటూ పంట చేలు కారు లైట్ల కాంతిలో నెంబర్లు వేసిన మైలు రాళ్లు ఒకటొక్కటే జరిగి పోతున్నాయి నల్లని ఆకాశంమీద జ్వాలా పుష్పాల లాగ నక్షత్రాలు మెరుస్తున్నాయి మండుతున్నాయి. చీకటిలో ప్రకృతి గాంభీర్యం వహిస్తుంది. దేవుడులాంటి అనిర్వచనీయమైన శక్తి సన్నిహితంగా వున్నట్లు ఉంటుంది మామయ్య నన్ను బి. ఏ. ఎక్కడ చదువుతావని అడుగుతున్నాడు మద్రాసులో అని చెప్పాను లజా కార్నర్‌కి దగ్గర్లో అతనికో థియాసఫిస్టు మిత్రుడున్నాట్ట అతని దగ్గరవుండి చదువుకోమనీ, హాస్టల్సులోవుంటే పాడైపోతావనీ చెపుతున్నాడు రామచంద్రం మధ్య మధ్య రాజమండ్రీ శంకరం టెన్నీస్ ఆటలో వుండే లోపాన్ని గురించి చెపుతున్నాడు

"మిక్సెడ్ డబుల్స్ ఆడుతుందిట. ఆవిడెవరూ?' మామయ్య అడిగాడు

"మిస్ శర్మిష్ఠ"

"బాగుంటుందా?"

"ఆవిడా, ఆవిడ ఆటా!

"రెండూనూ" అంటూ మామయ్య నవ్వాడు.

"దోబిచెర్ల వస్తున్నాం" అన్నాడు రామచంద్రం.

అక్కడక్కడ రెండు మూడు పాకలూ, గుడిసెలూ చీకట్లో ముడుచుకుపోయివున్నాయి ఒక బండ దగ్గర యిద్దరు మనుష్యులు తలలకు పాగాలు చుట్టుకుని జమిలి దుప్పట్లు కప్పుకొని చుట్టలు కాల్చుకుంటూ కూర్చున్నారు వూరు ఎక్కడో లోపలకు వుంది ఇప్పటిలాగా అప్పటికి పల్లెటూళ్ళలోకి నాగరికత ప్రవేశించలేదు ఈ పాతికేళ్ళలో ఎంత అద్భుతమైన మార్పు వచ్చిందో మీకు తెలియదు మీకు ఆ రోజులు తెలియవు. విద్యుచ్ఛక్తి అంటే గ్రామీణులకు ఏమిటో తెలియదు ఏలూరునుంచి తణుకు వెళ్లే యీ రోడ్డుని గ్రాండ్ టంక్‌రోడ్డు అంటారు రాత్రి ఎనిమిది దాటాక యీ రోడ్డు సంరక్షితంకాదు నిర్జనంగా చీకట్లో నిశ్శబ్దంగా నిద్ర పోతూండేది ఇప్పుడు చూడండి. నిముష నిముషానికీ ఒక లారీ వస్తూ, వెళుతూ వుంటుంది ప్రతీ గ్రామంనుండీ కూరలు, పసుపూ, మిర్చీ మొదలైనవి ఎగుమతి అవుతున్నాయి ఈ దోబిచెర్లలో యిప్పుడొక డేరా సినిమా కూడా వుంది గ్రామీణులీనాడు చుట్టలకన్న సిగరెట్లు ఎక్కువ కాలుస్తున్నారు. మొన్న కార్లో వస్తూ చూశాను. వెంకట్రామన్నగూడెంలో బాడ్మింటన్ పోటీలు జరుగుతూన్నట్లు పెద్ద బోర్డు వ్రాసి వుంది పొడుగునా కాగితపు జెండాలు కట్టివేశారు అక్కడ రెండు న్యూమోడల్ కార్లు కూడా ఉన్నాయి.

పాతికేళ్ళక్రితం ఉన్న స్థితికీ యిప్పటికీ ఉన్న వ్యత్యాసం చాలా తీవ్రమైనది సాధరణంగా రెండు దశాబ్దాలలో యింత మార్పు ఎక్కడా చరిత్రలో జరగదు. కాని ఒక్కుమ్మడిగా భూస్వామ్య వ్యవస్థ మీదకు పారిశ్రామిక విప్లవమూ సైన్సు పరిణామ ప్రయోజనమూ దాడి చేసేటప్పటికి పాతని విచ్ఛిన్నం చేస్తూ నవలోకం కఠినంగా స్థిరపడుతోంది. ఈ తీవ్ర వేగానికి తట్టుకోలేక మనుష్యులూ సమాజమూ తమ చుట్టూ గోడలని కట్టుకుని లోపల దాక్కుంటారు. దేశానికేదో కీడు మూడిందని గోల పెడతారు.

"మీరు కధని ఆపు చేశారు" అని జ్ఞాపకం చేశాడు నారాయణ అవధానిగారి ఉపన్యాస ధోరణికి కొంచెం భయపడి

"అవును కథ ఆగిపోయింది ఎందుకంటే కారు కూడా సడెన్‌గా అక్కడ ఆగిపోయింది" అన్నారు అవధానిగారు చిన్నగా నవ్వుతూ

"కొవ్వొత్తి అయిపోతోందండోయ్" అన్నాడు ఆచారి వాడి చూపు దానిమీదే వుంది మొదటినుంచీ

అవధానిగారు సొరుగులోంచి ఒక కొవ్వొత్తి తీసి వెలిగించారు. "ఇంక ఒక్క కొవ్వొత్తి మాత్రం వుంది—యిది కాక" అన్నారు

"చచ్చాం" అన్నాడాచారి

"ఎందుకురా అంత భయం"—ప్రశ్నించాడు నారాయణ

"నాకు చీకటంటే పడదు" అన్నాడాచారి బిగులుగా తోటలో పేరుకుని ముద్ద కట్టిన చీకటిని చూసి

ఇంతలో ఏదో వికృతంగా సన్నగా కూత వినపడింది ఆచారి భయంతో చటుక్కునలేచి "ఏమిటది అవధానులు గారూ" అని అడిగాడు

"నక్కలు"

"మీ తోటలో కూడా నక్కలు కూడా వున్నాయాండీ."

"తోటలో కాదు శ్మశానంలో ఉంటాయి"

"శ్మశానమా" ఆచారి గొంతు తడబడింది వణకింది

"అవును తోటకి అవతల కాస్త దూరంలో వుంది"—అవధానిగారు తాపీగా, జాగ్రఫీ మేష్టారు తూర్పున బంగాళాఖాతమూ, దక్షిణమున హిందూ మహా సముద్రమూ ఉన్నవి అని చెపుతూన్నంత నిర్లిప్తతతో అన్నారు

"నోర్ముయ్యి ఆచారీ ఇంత వయసొచ్చి కూడా, యింతమంది ఉండగా యీ భయం ఏవిటీ నవ్వుతారెవరైనా వింటే" అన్నాడు నారాయణ కోపంగా

"నాకు దెయ్యాలంటే తెగ భయం అంతే హిహిహి'—నెర్వస్‌గా నవ్వాడు ఆచారి ఈసారి బల్లమీద ఆదితాళం తొందరగా వేస్తున్నాడు నక్కల కూతలు అప్పుడప్పుడు ఘోరంగా వినవడుతూనే ఉన్నాయి

"చెప్పండి" అన్నాను నేను అవధానిగారితో.

రామచంద్రం విసుగ్గా కార్లోంచి దిగాడు. "మొదటినుండి నువ్వు అపశకునం మాటలే మాట్లాడుతున్నావు అందుకే అభిమానవతి అయిన నా ఫోర్డు మారాం చేస్తోంది" అన్నాడు నాగభూషణంతో. బానెట్ తీసి పరీక్షించాడు "సరిగ్గా కనపడడంలేదు యీ గుడ్డి వెన్నెలలో" అన్నాడు అంత వరకూ వెన్నెల ఉన్నట్టు మాకు అనిపించలేదు ఆకాశంమీదకి చూశాను జేగురురంగుగాఉన్న చంద్రుడుమీద పల్చని మబ్బులు తారాడుతున్నాయి రామచంద్రం చుట్టలు కాల్చుకుంటూ కూర్చున్న ఆసామీలను పిలిచాడు "కొంచెం అగ్గిపుల్ల వేస్తారా! కారు ఆగిపోయింది" అని అడిగాడు వాళ్ళు కుతూహలంగా ఒక్కొక్కటే అగ్గిపుల్ల గీస్తోంటే ఆ వెలుగులో ఏదో మరమ్మతు చేశాడు రామచంద్రం "థాంక్సు" అంటూ కారు ఎక్కి కూర్చున్నాడు స్టీరింగ్ దగ్గర

"ఏవూ రెడుతున్నారు బాబూ" అన్నాడొక ఆసామీ.

"తణుకు" అన్నాడు నాగభూషణం

"శానాదూరం. జాగ్రత్త బాబూ. అడవిలో ఏదో చిరుత పులి కనపడిందని చెప్పుకుంటున్నారు"

"అలాగే అలాగే" అని కారు స్టార్టు చేశాడు రామచంద్రం. కారు సాగింది నాకు ఏదో భయంగా వుంది

"అడవి అంటే ఏ అడవి మామయ్యా?" అని అడిగాను

"అదేరా నల్లజర్ల అడవి. ఉదయం వస్తోంటే నీకు చూపించలేదూ! అన్నాడు మామయ్య.

అవును గూడెం దాటాక మైళ్ళకొద్దీ రోడ్డుకి రెండు వైపులా అడవి పరచుకునివుంది వందల కొలదీ కొండ ముచ్చులు రోడ్డు కడ్డంగా సభలు తీర్చి మా కారు సమీపించగానే కిచకిచలు చేస్తూ పరుగెత్తేవి పగటి వేళ సూర్యరశ్మిలో ఆ ఆకుపచ్చని అరణ్యం ఎంతో మనోహరంగా వుంది. నోరులేని, తెలివిలేని వృక్షకోటి మౌన సౌహార్దంతో హాయిగా గుబురుగా స్వేచ్ఛగా ఉన్నట్టున్నది

"అయితే చిరుత పులి ఉందంటావా మామయ్యా" అన్నాను నేను.

"ఆ! చిరుత పులీలేదు గిలీ లేదు. ఈ పల్లెటూరివాళ్ళు వూరికే యిలాగ పుకార్లు చేస్తుంటారు అబ్బాయ్! ఇది ఇంగ్లీషువాడి రాజ్యంరా వాడి తుపాకిముందు సింహాలూ, పులులూ నిలుస్తాయ్రా .." అంటూ రామచంద్రం ఏదో చెపుతున్నాడు కాని కారు యింజనులోంచి ఏదో పెద్ద ధ్వని బయలుదేరి రామచంద్రం గొంతును వినపడకుండా చేసింది

"ఇదేం జబ్బురా వెధవ కారుకి మళ్ళీ ఆగిపోతుందేమో!" అన్నాడు నాగభూషణం భయంగా

"ఇది మీ కాలంలోలాగే రెండెడ్లబండికాదురా భూషణం ఫోర్డు యింజను ఇలాగ చప్పుడైతే యింజన్ మాంచి బలంతో వుందన్నమాట" అంటూ రామచంద్రం ఏక్సిలరేటర్‌మీద కాలు నొక్కాడు కారు రయ్యిమని చీకట్లో దూసుకుపోతోంది నాకు ఏదో సరదాగా థ్రిల్లింగ్‌లా వుంది ఆ చిరుత పులి గొడవ మాత్రం మధ్య మధ్య భయపెడుతోంది తప్ప

"చూశావా ఒక్క పిట్టకూడా మైళ్ళకొద్దీ వెళ్ళినా కనపడదు ఈ చెట్లచాటున దొంగలు గుంపుగా దాంకుని పల్లెటూరి ప్రయాణీకుల్ని దోచుకునేవారు యిదివరలో" అన్నాడు మామయ్య

గత చరిత్ర నా కళ్ళముందు లీలగా ఆడింది ఇలాగ రోడ్లూ అవీ ఉండేవి కావు అక్కడక్కడ ఓ పల్లెటూరు వుండేది ఏ కాకతీయులో, చాళుక్యులో పరిపాలిస్తూ ఉండేవారు అప్పుడు దేశంలో వీరులూ, వీర వనితలూ, బందిపోటు దొంగలూ, మట్టి రోడ్లూ, పులులూ, ఎలుగుబంట్లూ స్థిరమైన నమ్మకాలూ, సంప్రదాయాలూ అన్నీ ఉండేవి ఇప్పుడు రోడ్లూ, టెలిగ్రాఫ్ తీగలూ, పోలీసులూ అన్నీ వచ్చి దొంగల్నీ క్రూరమృగాల్నీ నాశనం చేశాయి వాటితోపాటు వీరవరులూ, స్వధర్మ నిరతులూ కూడా మాయమైపోయారు.

"అడవి వచ్చేసింది ఇది దాటితే యింక పది హేను మైళ్ళు తణుకు." అన్నాడు రామచంద్ర

నాగ భూషణం జవాబివ్వలేదు. వెనక్కి జేర్లబడి నిద్దరోతున్నాడు.

"నువ్వూ నిద్రపోతున్నావా ఏవిటిరా" అన్నాడు రామచంద్రం నన్ను ఉద్దేశించి

"లేదు" అన్నాను నేను దట్టంగా అలుముకుపోయిన అడవిని చూస్తూ అడవి మధ్యనుండి రోడ్డు ఒక రాక్షస వనిత సీమంతంలాగా వుంది. అడవిలో అంతా కటికి చీకటిగా ఉన్నట్టుంది

ఇంజన్‌లో ఏదో 'రప్'మని పేలినట్టయింది. నాగభూషణం ఉలిక్కిపడ్డాడు కారు ఒక గంతువేసి ఆగిపోయింది

"ఏమయింది?" అన్నాడు నాగభూషణం

రామచంద్రం మాట్లాడకుండా దిగి యింజన్‌ని పరీక్ష చేశాడు. "సరీగా కనపడడంలేదు" అంటూనే పరీక్ష చేస్తున్నాడు కీచురాళ్ల కూతలు ఉచ్చస్వరంతో వి నపడుతున్నాయి నాగభూషణం కూడా దిగాడు. కంగారుగా అన్నాడు "ఏం బాగుపడుతుందా" అని అడిగాడు రామచంద్రం మాట్లాడకుండా వెనుకసీటుకిందినుంచి కొంత సామగ్రి తీసుకుని పనిలో పడ్డాడు.

"చిరుత పులి యీ అడవిలోనేనా వుందీ?" అన్నాను నేను

మామయ్య ఉలిక్కిపడి "ఎక్కడ?" అని ఒక "గంతు వేశాడు. వెధవాయ్ సడెన్‌గా అలా అన్నావేమిటిరా!" అన్నాడు కోపంగా.

రామచంద్రం పనిముట్ను టిక్‌టిక్‌మని చప్పుడు చేస్తున్నాడు శ్రమవలన అతని బరువైన వూపిరి చప్పుడు కూడా వినపడుతోంది మధ్య మధ్య ఎండుటాకులలో గలగలమని చప్పుడు పక్షి కూతలు కిచకిచలు.. ఇన్నింటినీమించిన భయంకరమైన నిశ్శబ్దం.

'తెలవారితే కలక్టరు గారింట్లో పెళ్లి......' స్వగతం చెప్పుకున్నాడు మామయ్య.

"నువ్వేం చదివిస్తున్నావ్" అన్నాడు రామచంద్రం

"మనం వెళ్ల లేకపోతే ఎంత అభాసు అవుతుంది!" అన్నాడు భూషణం.

"చిరుత పులి మనుష్యుల్ని తింటుందా మామయ్యా" చిన్న వాడినైన నాకు ఒక పక్క భయం, మరోపక్క కుతూహలం

"ప్లీడరుగారు పక్కాలు వేయిస్తానన్నారు వినలేదు ఖర్మం" మళ్లీ భూషణం మామయ్య స్వగతం. ఏదో చెప్పలేని భయం అందరిలో.

వెన్నెల మరి కాస్త వచ్చింది ఆకాశంమీద చంద్రుడు ఎర్రగా వున్నాడు అసహ్యంగా మానని పెద్ద వ్రణంలా ఉన్నాడు నోరూ చెక్కిళ్ళు పెరికి వేసిన శిరస్సులా ఉన్నాడు. వలయంలోంచి కొంత భాగం వూడిపోయి ఉన్నాడు నాకు చంద్రుణ్ణి చూడగానే మొదటిసారిగా భయం వేసింది అనంతమైన శూన్యంలో నీరవంగా నిగూఢంగాఉన్న అడవిమీద చంద్రుడు ఏదో విపత్తుకి సూచనలాగా దుశ్శకునంలాగా అనిపించాడు వెలవెలబోతూన్న వెన్నెల కూడా కాష్ఠభస్మంలాగ భయపెడుతోంది

అరగంట జరిగింది. రామచంద్రం పట్టుదలగా యింజన్‌తో తిప్పలు పడుతున్నాడు. "కారు బాగుపడదు. ఈ రాత్రి అంతా యిక్కడ బిక్కు బిక్కు మంటూ ఉండాల్సిందే" అన్నాడు నాగభూషణం

కాస్సేపాగి మళ్ళీ అన్నాడు. "వద్దురా యీ కార్లో ప్రయాణం అంటే విన్నావు కాదు. మా ప్రాణాలు తియ్యడానికి వచ్చింది ఖర్మ"

రామచంద్రం సహనం కోల్పోయి "అబ్బ చంపకు వెధవ గోలా నువ్వూ బాగుపడకపోతే నువ్వు కార్లోఎక్కి స్టీరింగ్ దగ్గర కూర్చో, నేను తాడేపల్లి గూడెం వచ్చేవరకూ తోస్తాను నీ ప్రాణానికి నా హామీ సరేనా " అని అరిచాడు

మనుష్యుల గొంతుకలకి రోడ్డు వారనున్న చెట్లలో కలకలం రేగింది. ఒక్క క్షణంలో సద్దు అణగింది రామచంద్రంలేచి రేగిన జుట్టుని వెనక్కి తోసుకుని "ఆఖరి ప్రయత్నం చేస్తాను ఒక లావుపాటి కర్రవుంటేచూడాలి. కారుని పైకి ఎత్తి పట్టుకోవాలి" అంటూ రోడ్డువారకుపోయి కర్రలకోసం వెదుకుతున్నాడు నేను భయంతో ఆకాశంకేసి చూశాను. తెలుపూ నలుపూ కలిసిన చిరుమబ్బులు చంద్రుణ్ణి కప్పి వేస్తున్నాయి చలి గాలి వీస్తోంది నాగభూషణం దిగులుగా కారు పక్కనే మంచున్నాడు రామచంద్రం కర్రకోసం వెదకుతూ పది గజాలదూరం ముందుకు నడిచాడు

రోడ్డు వారనే చింత చెట్లూ రావిచెట్లూ ఉన్నాయి ఎప్పటివో ముసలి చెట్లు శాఖోపశాఖలుగా అంతటా ఆక్రమించి వేశాయి ఒక పెద్ద మర్రి చెట్టు వూడలతో చీకట్లో అసహ్యంగా భయంకరంగా వుంది వూడలు చీకటి పేగులలాగా వేలాడుతున్నాయి చెట్టు చెట్టుకీ మధ్య యీత ముళ్ల పొదలు, బ్రహ్మచెముడు డొంకలు, రక రకాల తీగలూ అల్లి బిల్లిగా చుట్టుకున్నాయి. ఒక గుడ్లగూబ అరుస్తూ, ఒక చెట్టుమీదనుండి యింకో చెట్టుమీదకి ఎగిరింది. ఆ చప్పుడికి ఉడతలు కాబోలు కిచకిచమంటూ పరుగులెత్తాయి మనుష్యులకు నివాసంకాని యీ కీకారణ్యం జంతువులకి సహజమైన ఆవాసంగా వుంది ప్రకృతి శాసనం తప్ప వాటికి వేరే జీవన విధానమూ, నియమమూ నీతీ లేవు ప్రతీ ప్రాణీ యిక్కడ తనని తాను రక్షించుకుంటూ తనకన్న అల్పమైన దానిని భక్షిస్తూ, బతుకుతూంటుంది ఈ అడవిలాగ ఎన్ని మైళ్లు లోపలికి చొచ్చుకు పోయిందో! లోపల చిరుత పులులులేకాదు పెద్ద పులులూ, సింహాలూ ఉన్నా మాత్రం ఏం తెలుస్తుంది? అమాంతం మనిషి మీదపడి నోట కరుచుకుపోయి ఏ పొదలోనోదాగి ఒక్కొక్క అవయవాన్నే సావకాశంగా చీల్చి రుచిగా భక్షిస్తాయి కాబోలు ఈ అడవిమీద వెన్నెల అనవసరంగా, అసందర్భంగా వుంది, అందుకే అడవి కాచిన వెన్నెల అంటారు. అదేకాదు వెన్నెల సహజమైన సౌకుమార్యాన్నీ, హ్లాదత్వాన్నీ కోల్పోయి దుర్మార్గంగా దుస్సహంగా కూడా వుంది గుబురుగా ఉన్న ఆకుల మధ్యనుండి కొంచెం కొంచెం వెన్నెల నేలమీదకు జారి వందల కొలదీ కట్లపాములూ కొండ పాములూ పాకుతూన్నట్టుగా వుంది

"మరీ లోపలకు వెళ్లకు జాగర్తరోయ్" అంటూ భూషణం కేక వేశాడు

"కారు బాగు పడకపోతే రాత్రి అంతా యిక్కడ ఉండిపోవడమే!' అన్నాను నేను. నాకు భయంగా వుంది గొంతుక ఎండిపోతూన్నట్టు వుంది.

"మంచినీళ్ళు కావాలి" అన్నాను

"మంచినీళ్ళ! ఎక్కడ దొరుకుతాయి ఇదేం మీ యిల్లనుకున్నావా" విసుక్కున్నాడు నాగభూషణం

నిస్సహాయతవలన నాగభూషణానికి అసహనం ఎక్కువైపోతోంది నాకు ఎందుకో అమ్మా, మాయిల్లూ అన్నీ జ్ఞాపకం వచ్చాయి లోపల్లోపల చిరతపులి వచ్చి కరుచుకుపోతుందన్న భయం అవ్యక్తంగా పెరుగుతోంది కాబోలు నాకు ఏడుపు రాబోయింది నాగభూషణం నావళ్లు నిమురుతూ అన్నాడు "భయపడకురా అబ్బాయి ధైర్యం తెచ్చుకోవాలి పండ్రెండు గంటలయింది ఇంకో నాలుగైదు గంటలు వోపిక పట్టితే తెల్లవారిపోతుంది కారు బాగుపడిందా సమస్యే లేదు"

నేను మౌనంగా తలూపాను.

హఠాత్తుగా "భూషణం పాము పాము" అన్న భయ విహ్వలమైన కేక నిశ్శబ్దాన్ని కత్తిలా చీలుస్తూ వినపడింది నాగభూషణం రామచంద్రం వెళ్లిన వైపు నాలుగడుగులు ముందుకు వేశాడు దూరంగా రోడమీద్ను

ఒక వైపునుండి మరో వైపుకి పెద్ద పాము మెలికలు తిరుగుతూ గుడ్డి వెన్నెలలో మెరుస్తూ వెళ్ళిపోయింది "రామచంద్రం రామచంద్రం" అంటూ కేకలు వేస్తూ పరుగెత్తాడు భూషణం రామచంద్రం అక్కడ పొదల దగ్గరే కూలబడ్డాడు నా ప్రాణాలు బిగుసుకుపోయాయి నెత్తురు జిలజిలమంది

రెండు చేతులతోనూ పొదివి పట్టుకుని తనమీద ఆనుకున్న రామచంద్రాన్ని తీసుకువస్తున్నాడు భూషణం రామచంద్రం వణకిపోతున్నాడు "తలుపు తియ్యి" అన్నాడు భూషణం. కారు తలుపు తీశాను "పడుకో రామచంద్రం—యిలాగ పడుకో" లంటూ మెల్లగా రామచంద్రాన్ని వెనుక సీటులో పడుకోబెట్టాడు పై మీద కండువాతీసి కాలిమీద గట్టిగా బిగించి కట్టాడు "భయపడకు భయపడకు" అని హెచ్చరిస్తున్నాడు భూషణం గొంతులో ప్రాణం లేదు ఎండిపోయి చచ్చిపోయి వుంది

రామచంద్రం కళ్ళల్లో విపరీతమైన భయం సుళ్ళు తిరిగింది వెర్రిగా పరవళ్ళు తొక్కింది చావుకన్నా, దాన్ని గురించిన భయం భరింపలేనిది మనిషియొక్క ప్రాణం స్వరక్షణార్థం వెర్రిగా అరుస్తూ నరాలలో కళ్ళల్లో గుండెలలో పరుగులెత్తుతుంది ఆ ప్రాణంయొక్క ప్రథమ వివేకం "నేను" అన్న అహమిక నేను అనుకునే ఆ ప్రాణం ఏడుస్తుంది మొరపెట్టుకుంటుంది. మోదుకుంటుంది గిజగిజలాడుతుంది రామచంద్రం వణకిపోతున్నాడు రామచంద్రంలోని 'నేను' లుప్తమై పోతున్నాడు కరిగి పోతున్నాడు కోట్ల కొలదీ రక్త కణాల సైన్యాన్ని తన్ని తాను రక్షించుకుంటానికి యుద్ధానికి పంపిసిస్తున్నాడు కాని పాము విషంముందు యిత సైన్యమూ వోడిపోతోంది కాలకూట జ్వాల రక్తాన్నీ మాంసాన్నీ ధాతువునీ—అంతటా రూపహీనంగా పరచుకున్న ప్రాణాన్నీ కాల్చి వేస్తోంది "భూషణం నేను చచ్చిపోతాను. చచ్చిపోతున్నాను" అంటూ అరిచాడు రామచంద్రం, బొంగురుగా గాద్గదికంగా

భూషణం యిటూ అటూ చూశాడు ఎవరూలేరు చుట్టూ భయంకరమైన అడవి ప్రతీ నిముషమూ అమూల్యమైనది ఒక నిముషం గడచిందీ అంటే రామచంద్రం నివారింపలేని విపత్తులోకి జారిపోతున్నాడు. భూషణం కర్తవ్యతా విమూఢుడై పోయాడు ఏమీ చెయ్యలేని, ఏమి చెయ్యాలో తెలియని తన అవివేకం,తన అశక్తతలో తనే బంధింపబడి కొట్టుకుంటూ నీరసంగా "ఏం భయంలేదు భయంలేదు" అంటూ గుండెలు రాస్తున్నాడు

"నా భార్య—నా పిల్లలు రక్షించు భూషణం రక్షించు—" రామచంద్రం దీనంగా ఏడుస్తున్నాడు

నాకు కాళ్ళూ చేతులూ ఆడడంలేదు ఇంత భయంకరమైన అనుభవం నన్ను సంధులలో కూడా సళ్లించివేసింది బావురుమని ఏడవాలనీ, అక్కడనుంచి పారిపోవాలనీ వుంది కాని ఎక్కడికి పోను, ఎలా పోను ఆ అడవిలో—?

"గుండె బరువెక్కిపోతోంది భూషణం'—రామచంద్రం గొంతు క్షీణిస్తోంది అతని నుదుటిమీద మొహంమీద చెమట బిందువులు అంత చలిగాలిలో కూడా

"ఆపద్బాంధవా! జగద్రక్షకా! నా రామచంద్రాన్ని రక్షించు" తడబడుతూ భూషణం రెండు చేతులూ పైకెత్తి జోడించాడు

రామచంద్రం వగరుస్తున్నాడు అతని కళ్ళు పిచ్చిగా ఉన్నాయి పెదవుల చివరనుండి నురగ కక్కుతున్నాడు అది చూసిన నాగభూషణం "బాబోయ్" అని వెర్రికేక పెట్టాడు నిలువునా వణకిపోతున్నాడు "వీడి శవాన్ని యింటికి తీసుకువెళ్లి చెల్లెలికి ఎలా చూపించను రా!" అంటున్నాడు రామచంద్రం కళ్ళు తెరచి "నా పెళ్ళాం" అని అస్పష్టంగా అని నిస్ప్రుహలోకి జారిపోయాడు

అవధానిగారు ఆగారు గత స్మృతుల పునశ్చరణవలన ఆయన గొంతు ఉద్రేకంతో బాధతో నిండింది మేమందరం వూపిరాపి వింటున్నాం ఆచారి బల్లని రెండు చేతులతోనూ గట్టిగా పట్టుకుని పళ్ళు బిగించి వింటున్నాడు కొవ్వొత్తి జాలిగా రామచంద్రం ప్రాణంలాగా వెలుగుతోంది. తోటలో ఏమీ ఎరగనట్టు ఈ మాటలేవీ విననట్టు చెట్లు చీకటిలో నిశ్శబ్దంగా నుంచున్నాయి ఒక నిముషంఆగి అవధానిగారు చెప్పడం సాగించారు

భయంకరమైన మృత్యువు ఎదురుగా రామచంద్రం గుండెలమీద కూర్చుంది ఎవ్వరూ లేరు ఎవ్వరూ లేరు. అడవిలో మృత్యువులాంటి చీకటి. మృత్యుదేవత నవ్వులాంటి బూడిద రంగు వెన్నెల. నాగభూషణం రెండు చేతులతోనూ నమస్కరించి కళ్ళు మూసుకుని ప్రార్థిస్తున్నాడు. నేను కొయ్యబారిపోతున్నాను కాలం కదలడంలేదు తన యినుప పిడికిలితో మా తలలమీద నొక్కుతోంది కారులో మూడు ప్రాణాలు ఒక ప్రాణం కథావశిష్టంగా అయిపోతోంది తక్కిన రెండు ప్రాణాలూ నీరసించి అచేతన స్థితిలోకి జారి పోతున్నాయి అసలే అడవి—అందులో కాళ్లముందు శవం, శవప్రాయమైన రామచంద్రం. పట్టణంలో సుఖ జీవితానికీ, నౌకర్లకీ, అబద్ధాలకీ, భేషజాలకీ అలవాటైన కృత్రిమ సుకుమార జీవులకి యింతకన్న ఆపద ఏముంది? ఇంతలోకీ అడవిలో కాస్త దూరంలో ఒక చోట గప్పున మంట రేగింది బలహీనమైన నా మనస్సు యింక తట్టుకోలేకపోయింది. "బాబోయ్ దెయ్యం" అని అరచి వెనక్కిపడిపోయాను

బహుశా అయిదారు నిముషాలలోనే తెలివి వచ్చి ఉంటుంది కళ్ళు తెరచి చూశాను స్టీరింగ్‌కీ సీటుకీ మధ్యగావుంది నా తల. మెల్లగాలేచి భయంగా వెనుక సీటులోకి చూశాను నాగభూషణం సీటు వానుకుని వెక్కి వెక్కి ఏడుస్తున్నాడు

"మామయ్యా" అన్నాను నేను

భూషణంకి దుఃఖం పొరలు పొరలుగా వస్తోంది ఆడదానిలా ఏడ్చేస్తున్నాడు నాకేం తోచలేదు ఏదో చెప్పాలనుకున్నానుగాని నాకూ మాట పెకలి రావడంలేదు రామచంద్రం నోటి చివరలనుంచి నురగ వెన్నెలలో పొంగుతూన్న సోడాలాగ వుంది అతని తెల్లని అందమైన మొహంమీద వెన్నెలపడి ఏడుస్తూన్నట్టుంది బరువుగా తీసే వూపిరివలన అతని గుండెలు కిందకీ పైకీ లేస్తున్నాయి మృత్యువుతో ముఖాముఖి, ముష్టాముష్టి యుద్ధం చేస్తున్నాడు రామచంద్రం అవతలి ఒడ్డున, ఈ బ్రతుకికి యీ మిథ్యకి యీ రహస్యానికి అవతలి తీరాన

"మనం కూడా చచ్చిపోతాంరా ఈ అడవిలో దిక్కుమాలిన చావు చేస్తాంరా. మనకెంత గతి పట్టిందిరా" ఏడుస్తూనే అన్నాడు నాగభూషణం.

"పారిపోదాం మామయ్యా" అంతకంటె ఏడుస్తూ అన్నాను నేను.

"ఎక్కడికి?"

"పరుగెత్తుకు పోదాం. గూడెంవరకూ పరుగెత్తుకు పోదాం"

"రామచంద్రం?"

"వదిలేద్దాం ఎలాగూ చచ్చిపోతాడుగా"

నాగభూషణం ఆలోచనలో పడ్డాడు అవును చచ్చే రామచంద్రం కోసం యిద్దరు కూడా ఎందుకు చావాలి? అయితే పరుగెత్తగలమా, మాట రావడంలేదే, యింక కండలలోకి వోపిక ఎలా వస్తుంది. కొంతదూరం వెళ్లి ఆగిపోతే అక్కడ గతి ఏమిటి? ఈ కారు కూడా ఉండదే పడుకుని చావడానికి!

ఆ నిముషంలో స్వార్థంకన్న గొప్ప శక్తి ప్రపంచంలో లేదని తెలిసిపోయింది నాకు ఈ ఆదర్శాలూ, ఆశయాలూ అన్నీ ఆ ప్రాథమిక స్వార్థానికి అంతరాయాన్ని కలిగించలేనంత వరకే. ప్రతీ మనిషి లోపల్లోపల ఒక పాము!

"అయితే రోడ్డమ్మట పాములుంటాయి. ఎలాగ?" అన్నాడు నాగభూషణం

అవును అక్కడ ఉండలేం. అలాగని ఎక్కడికీ వెళ్లలేం. అరణ్యం మా చుట్టూ కనపడని ఉచ్చులు పన్ని వుంచింది. ఎన్నో మైళ్ళు పరుగెత్తితేకాని గూడెం రాదు భగవాన్, ఎందుకిలాగ బాధిస్తున్నావు? ఆశలేదు, ధైర్యంలేదు.

అక్కడ చెట్ల ఆకుల్ని తిని బతికే కీటకంకన్నా మానవుడు నికృష్టంగా అయిపోతున్నాడు నీచంగా దిక్కు లేకుండా చచ్చిపోతున్నాడు

రామచంద్రం కదలినట్లయింది "రామచంద్రం" అని పిలిచాడు భూషణం. రామచంద్రం మెలికలు తిరుగుతున్నాడు గుప్పిట మూస్తున్నాడు మళ్ళీ పిలిచాడు భూషణం. రామచంద్రం తెలివిలో లేడు అతని ప్రాణం విపరీతమైన బాధపడుతోంది అతని దేహం వంకరలు తిరుగుతోంది భూషణం చూడలేక కళ్ళు మూసుకున్నాడు "దేవుడా" అంటూ కాతరంగా ఆర్తనాదం చేశాడు అడవిఅంతా ప్రతి ధ్వనించినట్టయింది నాకు నాలిక పిడచ కట్టుకుపోతోంది. నాకు తెలుసును ఏ పామూ కరవకుండానే మేం యిద్దరమూ కూడా ఉదయానికల్లా యీ కార్లో చచ్చిపడిఉంటామని!

ఇంతలో ఏదో మువ్వల చప్పుడు వినిపించింది మా ప్రాణాలు మరీ పైకి పోయాయి. కర్ర నేలని తాటించిన చప్పుడుతో కలిసిన మువ్వల చప్పుడు క్రమంగా దగ్గరవుతూన్న చప్పుడు నేను భూషణాన్ని గట్టిగా కౌగలించుకున్నాను ఇది తప్పకుండా ఏదో దెయ్యమే అయివుంటుంది గజ్జెలు కట్టుకుని అడవుల్లో అర్ధరాత్రి పిశాచాలు నృత్యం చేస్తాయి కాబోలు మమ్మల్ని చూచివుంటుంది ఏదో దెయ్యం—తింటానికి యిటువైపే వస్తోంది

"ఎవరది బాబూ !"— మనిషి గొంతు మనిషి భాష!

చటుక్కున భూషణం నేనూ ఎగిరిపడ్డాం నా చెయ్యి రామచంద్రం పాదం మీద పడింది చల్లగా తగిలింది వెర్రికేక వేశాను పాపం రామచంద్రం భయపడేస్థితిలో లేడు

"ఎవరు బాబూ కేక వేసింది" మళ్ళీ మనిషి ప్రశ్న!

భూషణం కళ్ళు గట్టిగా మూసుకునే తడబడుతూ అన్నాడు "ఎ ఎ ఎవరది?"

"నేను మనిషినేనయ్యా భయపడకు"— ఆ మనిషి సమాధానం

కళ్ళు తెరచి చూశాం ఒక ముసలివాడు రోడ్డుమీదనున్న పొదల్ని తప్పించుకొని వస్తున్నాడు నల్లని వంగిపోయిన వళ్ళు తెల్లని నెరిసిన గుబురులాంటి చుట్టు మాకు నమ్మకం చిక్కలేదు పైగా అనుమానం యింకా దృఢమైంది

"ఎవరు నువ్వు ఈ అడవిలో ఎందుకున్నావు?" భూషణం ఎంత ధైర్యాన్ని కూడదీసుకుని ప్రశ్నించినా, కంఠ ధ్వనిలోని వణకూ, భయమూ తెలిసిపోతున్నాయి

"సిద్దయ్యని బాబూ పాముల వాణ్ణి" అన్నాడు ముసలివాడు.

"పాములవాడివా?"

"అవును బాబూ"

"ఇక్కడ ఎందుకున్నావు?"—భూషణం గొంతులో కొంచెం ధైర్యం కలుపించింది

"నల్లతాచు గరళం తియ్యాలి బాబూ"—జమీందారుగారు పురమాయించారు బాబయ్యా నేనూ, నా కూతురూ యీ అడవికి కూంత లోపల్నే పాక వేసుకున్నాం. ఈ రేతిరేల యిక్కడుండిపోయారేం బాబూ?" అన్నాడు సిద్దయ్య

మాకు కొంత ధైర్యం కలిగింది అంతవరకూఉన్న బ్రహ్మాండమైన ఒంటరితనమూ నిస్సహాయతా పోయినట్టనిపించింది భూషణంలో ఒక్కసారిగా వివేకమూ, ఓపికా కలిగాయి దైవ సంకల్పంవుంటేకాని యీ అడవిలో యిటువంటివేళ ఒక మనిషి, అందులో పాములవాడు కనుపించడం ఒక్క గంతులో కారులోంచి దూకాడు సిద్దయ్య రెండు చేతులూ పట్టుకున్నాడు. "చూడు సిద్దయ్యా నీకు మంత్రం వచ్చునా? మా వాడికి పాము కరచింది చచ్చిపోవడానికి సిద్దంగా ఉన్నాడు" అన్నాడు మినుకు మినుకుమనే ఆశ కలసిన భయంతో దుఃఖంతో పూడిపోయిన గొంతుకతో.

సిద్దయ్య రామచంద్రాన్ని పరీక్షగా చూశాడు "ఇంకా బతికే వున్నారు బాబయ్యా" అన్నాడు బాధతో తోక తెగిన బల్లిలా గిజగిజలాడుతూన్న ప్రాణిని చూసి

"రక్షించాలి సిద్దయ్యా దేవుడిలాగ వచ్చావు పెద్ద కుటుంబీకుడు. పాపం భార్యా పిల్లలూ వున్నవాడు మంత్రంవేసి బతికించావా సగం ఆస్తి నీకు రాయిస్తాను

సిద్దయ్య ఓ సెకను ఆలోచించాడు ఆకాశంకేసి చూశాడు నల్లని మేఘం చంద్రుణ్ణి కప్పివేస్తోంది. "అదృష్టంవుంటే బతకొచ్చును బాబయ్యా. అక్కడ పాకలోకి తీసుకురండి బాబూ. వేరు ముక్కతో మంత్రం వెయ్యాలి" అన్నాడు

"ఎలాగ తీసుకు రావడం?" భూషణం ప్రశ్నించాడు అయోమయంగా చూస్తూ

"ఇప్పటికే ఆలస్యం అయిపోయింది బాబయ్యా ఆలోచిస్తుంటే అపాయం మీ రిద్దరూ మోసుకురావాలి బాబూ"

"అడవి లోపలికే! పాములుంటాయేమో"— అంత ఆదుర్దాలోనూ జాగ్రత్త వహించడం భూషణానికి తెలుసును

"నేను ముందుండి దారి చేస్తుంటాను మువ్వల చప్పుడికి పురుగూ పుట్రా దూరంగా పోతయ్ బాబూ. రండి" అంటూ ముందుకువెళ్ళి రోడ్డు వారనున్న పొదల్ని పక్కకి వంచి పట్టుకున్నాడు

భూషణం మచంద్రం భుజాలకిందనుంచి చేతులు పోనిచ్చి పైకెత్తి పట్టుకున్నాడు నేను కాళ్ళు పట్టుకున్నాను అడవిలోపల చీకటి శవప్రాయమైన ఒక మనిషిని అంత చిన్న వయస్సులో మోయవలసి వచ్చిన భయంకరమైన అనుభవం నన్నిప్పటికీ తలచుకున్నప్పుడల్లా విచలితుణ్ణి చేస్తుంది. చంద్రుడు మబ్బుల చాటుకి పోవడం మూలాన ఉన్న వెన్నెల కూడా లేకుండా పోయింది కాళ్ళకి తగిలే ఎండుటాకులూ, విరిగిన రెమ్మలూ కూడా మమ్మల్ని పాముల్లాగ భయపెడుతున్నాయి గుండె దిటవు చేసుకుని సిద్దయ్య అడుగులో అడుగు వేసుకుని నడుస్తున్నాం చేతులు లాగుతున్నాయి భూషణం నేనూ వగరుస్తున్నాం ఏదేనా చిరుతపులి పక్కనున్న పొదలోంచి దూకుతూన్నట్టే అనిపించింది సిద్దయ్యతో చెప్పాలనుకున్నాను రాత్రి నిద్రలో పీడకలలో గొంతు నొక్కుకుపోయినట్టుగా మాట విడివడడంలేదు రెండు ఫర్లాంగులు నడచి వెళ్ళేటప్పటికి చెట్టూ చేమాలేని శూన్యప్రదేశం కనిపించింది ఎత్తయిన రాతి ప్రదేశంలాగా వుంది అక్కడనుంచి మినుకు మినుకుమని దీపపు వెలుతురు వస్తోంది

"కావొత్తి ఆఖరయిపోతోంది అవధానిగారూ" అని హారొత్తుగా అన్నాడు ఆచారి అవధానిగారి కథనానికి అంతరాయం కలిగిస్తూ

అవధానిగారు ఆచారికేసి నిరసనగా చూసి సొరుగులోంచి ఆఖరు కావొత్తితీసి వెలిగించారు ఒక్క మాట కూడా మాట్లాడకుండా ఆచారి పెదవులు వణకుతున్నాయి ఎప్పుడు నారాయణ దగ్గరికి చేరాడోకాని ఒక చేత్తో నారాయణ నడుముని గట్టిగా కౌగలించుకున్నాడు తోటలోంచి కీచురాళ్ళ మోత వినపడుతోంది అవధానిగారు మళ్ళీ ప్రారంభించారు

"ఇదే బాబయ్యా గుడిసె" అన్నాడు సిద్దయ్య

"ఇక్కడ అపాయం కదా నీకు! పురుగు పుట్రా "భూషణం ఆయాసపడుతున్నాడు

"మంత్రించిన యిసుకచుట్టూ జల్లుతాం బాబయ్యా పురుగు రావే రాదు"

సిద్దయ్య తలుపు తోసుకుని లోపలికి వెళ్ళాడు మేమూ వెళ్ళాం గుడిసెలో ఒక పక్కన కుండలూ, యిటుకలతో అమర్చిన పొయ్యి వున్నాయి. మరొక పక్కన దండెంమీద బట్టలూ అక్కడే ఒక నులక మంచమూ వున్నాయి. మంచంమీద సిద్దయ్య కూతురు కాబోలు పడుకుంది.

"సూరీడూ లే లే" అంటూ తట్టి లేపాడు సిద్దయ్య ఒక యువతి కళ్ళు తెరచి మమ్మల్నిచూసి గబుక్కున లేచింది ఆ వూపుకి ఆమె కొప్పు విడివడి వినీల జలపాతంలాగా ఆమె జుట్టు జర్రున జారి పిరుదుల్ని తాకింది.

సిద్దయ్య చెప్పిన ప్రకారం రామచంద్రాన్ని మంచంమీద పడుకోబెట్టాం. యువతి ఆశ్చర్యంగా, భయంగా చూస్తూ నిలుచుంది సిద్దయ్య తొందరగా రెండు మూడు సంచీలలో చెయ్యిపెట్టి వెదుకుతున్నాడు చివరికి కింద బోర్లించాడు పూసలు, పెంకులు, వేరు ముక్కలూ, రాళ్ళూ ఏవేవో వున్నాయి. కోడిగుడ్డు దీపం వెలుగులో దేనికోసమో చూస్తున్నాడు సిద్దయ్య

యువతి చటుక్కున ఆత్రుతతో "ఈ అయ్యకి పెదవులు నల్లపడి పోతున్నాయి బాబూ" అంది

భూషణం అదిరిపడ్డాడు. "సిద్దయ్యా త్వరగా మంత్రం వెయ్యి ఆలస్యం చెయ్యకు" అని కేక వేశాడు. సిద్దయ్య నిరుత్సాహంగా, విషాదంగా లేచినుంచున్నాడు "కావల్సిన వేరు ముక్క లేదు బాబూ ఉందనుకున్నాను" అన్నాడు

"అయితే యిప్పు డెలాగ ?" భూషణం భయంతో ప్రశ్నించాడు

"ఏం చెయ్యను బాబూ. లేదని తెలిస్తే ముందే తెచ్చి వుంచుకుందును దూరంగా వెలగచెట్టు అవతల పొదల కాడ యీ వేరుగల మొక్కలున్నాయి రాత్రి చీకట్లో అక్కడికి వెళ్లలేం పాము పుట్టలూ ముళ్ల పొదలూ జాస్తిగా ఉంటయ్ "

"ఎక్కడుంది వెలగచెట్టు ?"

"శానాదూరం బాబయ్యా రెండు మూడొందలు గజాలు పోవాలి "

"ఎలాగో వెళ్ళు సిద్దయ్యా నీ మేలు మరచిపోను నీ కాళ్ళ పట్టుకుంటాను "

"చెప్పాలా బాబయ్యా నిష్కారణంగా బాబు సచ్చిపోతూంటే వూరుకుంటానా! అందులో నాకు చీకటిపడితే చూపు ఆనదు సరిగా ఏది ఏమిటో తెలియదు గదా—ఈ చీకట్లో మొక్క ఆనవాలు ఎట్లా తెలుస్తుంది బాబయ్యా "

భూషణం జేబులోంచి పర్సు తీశాడు అందులోంచి రెండు వందల రూపాయల నోట్లూ, కొన్ని పదులూ, ఆయిదులూ పైకి తీసి" ఇదిగో సిద్దయ్యా ఇంకా యిస్తాను ఎంతైనా యిస్తాను నా రామచంద్రాన్ని రక్షించు నువ్వే ప్రాణ భిక్ష పెట్టాలి" అంటూ సిద్దయ్య ఒళ్లోపడేశాడు

సిద్దయ్య కంగారుగా పక్కకి తప్పుకున్నాడు నోట్లు చిందరవందరగా పడిపోయాయి

"ముందా డబ్బుతీసి లోపల పెట్టుకో బాబూ మీ డబ్బుకి ఆశపడ్డానా మంత్రం పని చెయ్యదు " సిద్దయ్య కఠినంగా అన్నాడు "తియ్యండి బాబూ తియ్యండి "

భూషణం విధిలేక నోట్లని ఏరి పర్సులో కుక్కి "ఇంక లాభంలేదా" అన్నాడు దిగులుగా

సిద్దయ్య లేదన్నట్టు తలవూపాడు భూషణం గుండెలు బాదుకుని "రామచంద్రం" అంటూ ఏడుస్తూ కూలబడ్డాడు అతనిలో యింతకు ముందు రేగిన ఆశ ఒక్కసారి గప్పున ఆరిపోవడంతో దుఃఖంతో విలవిలలాడిపోయాడు

"పోనీ నేను వెళ్లి తీసుకురానా బాబూ"—సూరీడు సన్నని గొంతు అదిరిపడి చూశాడు భూషణం

"నువ్వా!" కంగారుగా అన్నాడు సిద్దయ్య "వద్దు ప్రమాదం సూరీడూ అక్కడ పాము పుట్టలు. అమ్మో"

"ఈ అయ్య , చచ్చిపోతూంటే—పాపం "

"వద్దు వద్దు" అంటున్నాడు సిద్దయ్య.

"వెళ్లొస్తాను" సూరీడు గొంతులో నిశ్చయం జుట్టు ముడి వేసుకుని క్షణంలో గుడిసె అవతలకి దూసిన బాణంలా వెళ్లిపోయింది.

"వద్దు సూరీడూ. నా మాట విను. వెళ్లొద్దు" అంటూ సిద్దయ్య గట్టిగా కోపంగా అరుస్తూ వెనకాలే వెళ్లాడు. అప్పటికే సూరీడు దూరంగా వెళ్లి అడవిలో చీకట్లో కలసిపోయింది. సిద్దయ్య దిగులుపడి వెనక్కి తిరిగి వచ్చాడు. కోపంతో భయంతో వణకిపోతున్నాడు. గోడకి చేరగిలబడిపోయి, నీరసంగా "జీవలేని మనిషి బాబూ. విన్నది కాదు" అంటూ వణకే చేతులతో మొహం కప్పుకున్నాడు.

భూషణానికి ఏమనాలో తోచలేదు. సిద్దయ్య ప్రాణం బిగబట్టుకున్నట్టుగా కూర్చున్నాడు. ఏ చప్పుడైనా అదిరిపడి చూస్తున్నాడు అతని కనుతీపి అతనిది మంచంమీద రామచంద్రం చివరి ఘడియల్లో వున్నాడు ఒక పక్క కటిక చీకట్లో అడవిలో విపత్తుని కోరి తెచ్చుకుంటోంది వయస్సులో ఉన్న యువతి. ఇదంతా ఏమిటో, ఏ ప్రళయానికి దారి తీస్తుందో—వరదాక వీళ్లతో ప్రయాణం చేస్తూన్న నా గతి ఏమవుతుందో తెలియక ఒక్కక్షణం ముందుకు ఆలోచించే శక్తి కూడా లేక నిశ్చేష్టుడనై ఉన్నాను నేను మేకలు గుడిసె అవతల—సిద్దయ్యవి కాబోలు—అరుస్తున్నాయి మృత్యుచ్ఛాయలు వికటంగా గుడిసెలోకూడా పరచుకొన్నాయి. ఇదంతా నిజం కాదన్నంత అనుమానం కలిగింది.

ఒక్కొక్క నిముషమే బలవంతంగా గడుస్తోంది. ఎవరో పిస్తోలుని గుండెకి సూటిగాపెట్టి ట్రిగ్గర్‌మీద వేలు నొక్కుతూన్నట్టుంది సిద్దయ్య మెల్లగా లేచాడు. దీపం వెలుగులో అతని కళ్లు నిశ్చయంతో వెలిగాయి "పట్టిమంత్రమైనా యిలాగా వేస్తాను బాబూ" అన్నాడు. రామచంద్రాన్ని పరీక్షించాడు. చిటికెలు వేస్తూ, పెదవులు కదుపుతూ మంచంచుట్టూ తిరుగుతున్నాడు. మంత్రావేశంతో సిద్దయ్య చూపుకి శూలంవంటి నైశిత్యం కలిగినట్లనిపించింది. ఆ సమయంతో అతను ముసలివాడులా లేడు. శక్తివంతమైన ఒక విద్యుత్తులంలా వున్నాడు భూషణం ఏదో అనబోయి మాని వేశాడు సిద్దయ్య తదేకమైన తత్పరతలో గదిలోని నిశ్శబ్దం కూడా గంభీరమైన ఉద్రేకంలావుంది. భౌతికమైన ప్రపంచాన్ని శాసించే మనస్సుయొక్క శక్తిని నాకు చూపిస్తున్నట్లు అనిపించింది.

సూరీడు తలుపు తోసుకుని లోపలకు వచ్చింది మొహంమీద చేతులమీద గీరుకుపోయిన ఎరుపు చారలు—ఆయాసపడుతూ వుంది. "బాబూ తెచ్చాను" అంది. ఆమె చేతిలో అయిదారు మొక్కలున్నాయి సిద్దయ్య అదే చలించని చూపుతో సంజ్ఞ చేశారు. సూరీడు గబగబా వేరు అరగదీసి రామచంద్రం కంట్లోనూ నోట్లోనూ పెట్టింది. అతని అరిపాదాల్ని ఒళ్లో పెట్టుకుని చేతులతో రాస్తూంది.

అరగంట గడిచింది. సిద్దయ్య వేసిన మంత్రమే వేస్తూ మంచం చుట్టూ తిరుగుతున్నాడు. భూషణం తలపైకి రెండు చేతులూ ఎత్తి పట్టుకుని మౌనంగా దేవుళ్లని ప్రార్థిస్తున్నాడు. నేను రామచంద్రంకేసి ఆదుర్దాగా చూస్తున్నాను. క్రమంగా అతని మొహంలోని చావు నీడలు తప్పుకున్నాయి. జీవకళ కొంచెంగా తిరిగి వస్తోంది. శ్వాస తేలికగా యధాస్థితికి వస్తోంది సూరీడు నొసటని చిరు చెమట క్రమ్మింది, పరిశ్రమ వలన రామచంద్రం మొహం తేటపడింది. సూరీడు ఆనందంతో "బాబూ బతికాడు యీ అయ్య" అని కేక వేసింది. భూషణం "ఆ!" అంటూ లేచి రామచంద్రాన్ని చూసి వెర్రిగా అరచి నవ్వాడు. "ఇదంతా నీ చలవ సూరీడూ" అంటూ ఆమె కాళ్లమీద పడ్డాడు. సూరీడు సిగ్గు పడుతూ, "ఆదేవిటి. తప్పండి బాబూ" అంటూ లేచి దూరంగా వెళ్లింది. సిద్దయ్య మంత్రోచ్చారణ ఆపి ఒకసారి రామచంద్రాన్ని చూసి, నిట్టూర్చి, వెదురుగోడ నానుకునుంచున్నాడు అతను చాలా అలసిపోయినట్టున్నాడు. సూరీడు దగ్గరగా వెళ్లి తండ్రిని కౌగలించుకుని "నా మీద కోపం వచ్చిందా బాబూ" అంది సిద్దయ్య ప్రేమగా జాలిగా కూతురు తలనిమిరాడు. "వెర్రిపిల్లా!" అన్నాడు ఆప్యాయంగా గాద్గదికంగా.

దిక్కు లేకుండా అడవిలో చచ్చిపోతాననుకున్న యీ రాత్రి పాములవాడి గుడిసెలో అదృష్టవశాత్తూ సుఖాంతం అయింది బిగుసుకుపోయిన నరాలు ఒక్కసారిగా సళ్లి ఒక్కసారిగా ఒళ్లంతా తేలికైపోయినట్టనిపించింది. రామచంద్రం కళ్లు తెరచి సన్నగా మూలిగి పక్కకి చూశాడు. భూషణం దగ్గరగా వెళ్ళి వెర్రి ఆనందంతో జరిగిందంతా చెప్పేస్తున్నాడు. "బతికావురా రామచంద్రం ఇంక భయం లేదురా. దేవుడు మన పాలిట ఉన్నాడు. తెల్లారకుండా బస్సు వస్తుంది దానిలో వెళ్లితే కలక్టరుగారింట్లో పెళ్లి ముహూర్తానికి తప్పకుండా వెళ్లొచ్చును. అసలు నువ్వు లేకపోతే అక్కడ కథ లేదూ" అంటూ వాగేస్తున్నాడు. బరువుగా నీరసంగా ఉన్న రామచంద్రం కళ్ళల్లో చిన్న నవ్వు తాలూకు వెలుగు అలవోకగా మెదిలింది. అంతలోనే భూషణం మొహానికి చేతులు తగిలించి గబుక్కున ఏడ్చాడు "చచ ఇప్పు డేడుస్తా వేమిటీ. ప్రమాదం తప్పిపోయింది. పడుకో. పడుకో. మళ్లీ ఉదయం పెళ్లికి రెడీగా వుండాలి" అన్నాడు భూషణం. అతను బతకడంలోని పరమార్థం కలక్టరుగారింట్లో పెళ్లికి హాజరవడం కాబోలు అని కుర్రవాణ్ణి నా మనస్సుకి అనిపించకపోలేదు. అసలు పెద్ద ఉద్యోగస్థుల యిళ్లల్లో జరిగే శుభ కార్యాలకి యింతగా అవసరమైన పెద్ద మనుషులకి హఠాత్తుగా చచ్చిపోయే హక్కు 'లా' ప్రకారం వుండి వుండదు కూడా. సూరీడు నవ్వుతూ చేత్తో ఒక పాత్రని పట్టుకు వచ్చి "తప్పుకో బాబూ ఆయన్ని కొంచెం పడుకో నివ్వండి" అంటూ రామచంద్రం తలని ఒళ్లోకి తీసుకుని నోట్లో పాత్రలో ఉన్న పాలు పోసింది.

"ఏమిటిది?" అన్నాడు భూషణం

"మిరియప్పొడీ పాలూ—ధారకంగా వుంటది" అంది సూరీడు

"ఈ అడవిలో మీకు పాలు సప్లై అవుతాయా యేవిటీ" భయం పోగానే నాగభూషణం సహజమైన వివేకాన్ని విచక్షణనీ తిరిగి పొందాడు

సూరీడు పక్కున నవ్వింది 'మేక పాలు బాబూ" అంది

"రామ రామ. మేకపాలు తాగడమే! సరేసరే ఆపద్ధర్మం" అన్నాడు భూషణం

సిద్దయ్య రెండు చిరిగిన సంచుల్ని ఒకపక్కగా పరచి "కొంత సేపు పరుండండి బాబూ" అన్నాడు రామచంద్రం పాలు తాగి నిద్రపోయాడు

"అలసిపోయారు బాబుగారు రెండు జాంపళ్లు కోసి యివ్వనాండి" అంది సూరీడు

"నిజమే. ఏదేనా తినాలనిపిస్తోంది" అంటూ గోనెపట్టామీద చతికిలబడి "ఏం సిద్దయ్యా నీ అల్లుడేం చేస్తున్నాడు?" అన్నాడు భూషణం.

"మొగుణ్ణి ఒగ్గేసింది బాబూ మా సూరీడు."

"ఏం?" అన్నాడు ఉలిక్కిపడి భూషణం

"వాడంటే మొదటినుంచీ దీని కిష్టంలేదు బాబూ. వద్దు వద్దంటూంటే నేనే బలవంతాన పెళ్లి చేశాను" అన్నాడు సిద్దయ్య

"కట్టుకున్న మొగుణ్ణి వదిలెయ్యడమే!" ఆశ్చర్యంగా అన్నాడు భూషణం. "పాపం సుమీ సిద్దయ్యా"

"యిష్టంలేకపోతే కాపుర మెట్టా సెయ్యడం బాబూ నా కర్థంకాదు" అంది సూరీడు కోడిగుడ్డు దీపంముందు కూర్చుని చాకుతో జామి పళ్ళు ముక్కలకింద కోస్తోంది మధ్య మధ్య మొహంమీదపడే జుట్టుని చేత్తో వెనక్కి తోసుకుంటోంది చామనచాయ రంగైనా, నవలావణ్యంతో అంగ సౌష్ఠవంతో ఆమె ఆకర్షణీయంగా వుంది నుదుటిమీద గీరుకుపోయిన చార లేత ఎరుపుతో మెరుస్తోంది

"నాతోనే చాలాకాలం తిప్పుకున్నాను బాబూ మా సూరీడుని సికాకుళం సాలూరు బొబ్బిలి—యివన్నీ తిరిగొచ్చాం తాచునుపట్టి గరళం తీయడంలో నాదే పేరండి ఆ రోజుల్లో ఇప్పుడు శరీరంలో జవ పోయింది ముసలి వాణ్ణయిపోయాను. నా సూరీణ్ణి చూసుకునే బతుకుతున్నాను. దానికైనా

నేను తప్ప ఎవరూ లేరు సామీ చంద్రంబాబు ఎప్పుడొస్తాడో ఏమో .." అన్నాడు సిద్దయ్య

"అతనెవరు?" భూషణం ప్రశ్నించాడు

"నూజివీడులో సూరీడుకాబాబుతో సాహసం అయింది. ఒకరి కొకరు పడి చచ్చేవారు ఈ చంద్రంబాబు పెద్దింటి అబ్బాయి బాబూ సూరీడునే పెళ్లాడ తానన్నాడు తండ్రి కోపంవచ్చి యింట్లోంచి తగిలేశాడు. ఆపోకపోక ఎక్కడికిపోయినాడో సామీ ఉద్యోగం సంపాదించుకుని వస్తానని చెప్పిపోయాడు సూరీడుతో నాల్గు నెలలలాయె అతీగతీ లేదు సూరీడు కడుపులో బిడ్డ చంద్ర బాబు బిడ్డే బాబూ" అన్నాడు సిద్దయ్య "చంద్రంబాబు రాకపోతే దీని గతేంకానా అని బెంగ బాబూ! అతనివీదే ధ్యాస "

"తప్పకుండా వస్తాడు బాబూ ఎప్పటికైనా వస్తాడు ఎందుకు రాడు? నన్నిడిసి ఉండగలడా" సూరీడు కళ్లల్లో విశ్వాసం మెరుస్తోంది

"ఎన్నవ నెల నీ కూతురికి" అని అడిగాడు భూషణం.

"నాల్గో నెల బాబూ"

సూరీడు జామిపండు ముక్కల్ని తీసుకువచ్చి ఎదురుగా పెట్టింది నన్ను కూడా తీసుకోమన్నాడు భూషణం నాకు నిద్ర వచ్చేస్తోంది సిద్దయ్య లేచి "మేం కూడా కొంచెం నడ్డి వాలుస్తాం బాబూ కాసేపు పరుండండి" అన్నాడు.

"నీ మేలు మరచిపోను సిద్దయ్యా నీ రుణం ఎలా తీర్చుకుంటామో తెలియడంలేదు. డబ్బు తీసుకోనన్నావు

"డబ్బు ఎంత చేస్తుంది బాబూ మీ దయవుంటే చాలు బాబూ నేను గుడిసె అవతల పడుకుంటాను లోపల చోట లేదు అవసరమైతే పిలువండి" అన్నాడు సిద్దయ్య

"వద్దు బాబూ. చలి వేస్తది" అంది సూరీడు.

"చూరుకింద కంబళీ కప్పుకుని పడుకుంటాను నువ్వు పడుకో"

"సిద్దయ్యా ఆరు గంటలకి బస్సులో వెళ్లిపోతాం కలక్టరుగారింట్లో పెళ్లి సమయానికి వెళ్లాలి. ఇప్పుడు దాదాపు మూడు గంటలవుతుంది. ఒకవేళ మెలకువ రాకపోతే లేపు సుమీ" అన్నాడు నాగభూషణం ఆవలిస్తూ.

"చిత్తం" అని సిద్దయ్య కంబళీ తీసుకు వెళ్లాడు రామచంద్రం ప్రక్కగానే నేలమీద గుడ్డపరచి సూరీడు పడుకుంది భూషణం నా వైపు తిరిగి "పిళ్లకి నీతిలేదు ధర్మంలేదు చూశావా" అని మెల్లగా అన్నాడు. నాకు నిద్ర ముంచుకు వచ్చేస్తోంది. అడవిలోంచి అస్పష్టరవాలు ఏవో వినపడుతూనే ఉన్నాయి నాకు నిద్ర పట్టేసింది

సుమారు వోగంటకు నా పక్క నెవరో కదలినట్లనిపించింది కళ్లు తెరచి చూశాను భూషణం లేచి సూరీడు వంటిమీద చెయ్యివేసి లేపుతున్నాడు. సూరీడు లేచి "ఏవిటి బాబూ" అంది భూషణం జేబులోంచి డబ్బు తీశాడు. మెల్లగా అంటున్నాడు "నా మనసు తీర్చు—యిదిగో డబ్బు"

సూరీడు యిటూ అటూ చూసింది. చిన్నగా నవ్వింది "అందుకు డబ్బెందుకు బాబూ" అంది

"అయితే?"— ఆశగా అడిగాడు భూషణం.

"నే నలాంటిదాన్ని కాను. పోయి పడుకోఅయ్యా. నవ్వుతారు కూడా" అంటూ మరో వైపు తిరిగి పడుకుంది.

భూషణం అనుమానంగా చూస్తూ నా పక్కకి వచ్చి పడుకున్నాడు. రామచంద్రం గుర్రు బరుకు బరుకుమంటూ వినిపిస్తోంది నేను నవ్వాపుకుని పడుకున్నాను. గుడిసె బయట మేకపిల్ల అరుస్తోంది .

భూషణం నన్ను లేపుతున్నాడు. "లేరా లే—బస్సు వచ్చే వేళయింది" అంటున్నాడు ఉలిక్కిపడి లేచాను తెల్లారిపోతోంది గుడిసె చూరులోంచి చీకటి పలచబడిపోవడం కనిపిస్తోంది. రామచంద్రం అంటున్నాడు "ఇంత మొద్దు నిద్రపోయేవాడు పరీక్షలో ఏం చదువుతాడు?" మంచి గంభీరంగా ఉత్సాహంగా ఉంది రామచంద్రం గొంతు రాత్రి మేం పడిన బాధ భయమూ అంతా పీడకల ఏమో అనిపించినట్టుంది రామచంద్రం తీరు చూస్తే. రామచంద్రం మామూలు పెద్ద మనిషి, శ్రీమంతుడూ, టెన్నిస్ ఛాంపియనూ అయిపోయాడు

"నువ్వేం తీసుకోనన్నావుట సిద్దయ్యా నాకు తృప్తిగా లేదు" అన్నాడు రామచంద్రం.

"'మంత్రం పట్టేవ్వదు బాబూ. పైగా బెడిసి కొడుతుంది బాబూ. బస్సు వచ్చేస్తుంది" అన్నాడు సిద్దయ్య

"సిద్దయ్యా, కూతురూ ముందు నడుస్తూంటే వెనకాల మేం వెళ్లాం. అడవిఅంతా మేల్కొంది పక్షుల కిలకిలలతో కోలాహలంగా వుంది. కాళ్ళకి చల్లని గడ్డీ, ఆకులూ తగిలి జివ్వుమంటోంది. అర్థరాత్రి భయంకరంగా ఉన్న అడవి ప్రాతఃకాంతిలో పచ్చ పచ్చగా రీవిగా ఉంది. సూరీడు దారిలో తీగలు మా కాళ్లకి తగలకుండా పక్కకు వంచుతోంది. ఒడ్డూ పొడుగూ నల్లటి పెద్ద జుట్టూ ఉన్న ఆమె ఆ అడవిలాగ స్వచ్ఛంగా ప్రాకృతికంగా కనిపించింది

రోడ్డుమీదకివచ్చి నిలుచున్నాం. సిద్దయ్యా కూతురూ ఇంక మేం వెళ్లివస్తాం బాబయ్యా సెలవు తీసుకుంటాం" అన్నారు

"ఎప్పుడైనా మా వూరు వస్తే కనిపించు సిద్దయ్యా నీ కూతుర్ని కూడా తీసుకురా. బహుమతీ తీసుకుందువు గాని" అన్నాడు రామచంద్రం కృతజ్ఞతాభావం ఉట్టిపడేలాగ

"చిత్తం" అని వాళ్ళు వెళ్ళిపోయారు. ఇటూ అటూ చెట్లు బారులు తీరిన రోడ్డు లేత వెలుగులో" ఎంతో అందంగా వుంది చల్లని గాలి ఉత్సాహాన్ని రేకెత్తిస్తోంది "చిరుతపులులు యీ అడవిలో కనుపించవేం మామయ్యా" అన్నాను నేను,రాత్రి సంఘటనని తలచుకుంటూ.

"ఆగరా వెధవ పులులూ నువ్వూ కలక్టరు గారింటికి పెళ్ళివేళకు చేరుకోకపోతే—" భూషణం ఎంతో ఆతృతగా ఉన్నాడు. ఎన్నో బాధ్యతలూ గౌరవాలూ వహించవలసిన మామయ్య విద్యుక్తధర్మం మరచిపోడు

"పాపం వాళ్లేం తీసుకో లేదు" అన్నాడు రామచంద్రం తన ప్రాణదాతన్ని గురించి. "అన్నట్టు భూషణం—మన కారు!" అన్నాడు.

కారు దగ్గరికి వెళ్లాం. తడసిపోయివుంది మంచులో. తణుకు వెళ్లగానే దీన్ని తీసుకువచ్చే ఏర్పాటు చెయ్యాలని నిశ్చయించారు

"ఒరేయ్ రామచంద్రం ఈ వెధవ కారు అమ్మేసెయ్. ఇప్పటికైనా నా మాట విను" అన్నాడు భూషణం

"ఇలా అమ్మితే అంతా నష్టమే రిపెయిర్ చేయించి రంగు వేయించి కండిషన్‌లో పెట్టి అమ్ముతాను భూషణం—ఇన్ని సెకండ్‌హాండ్ కార్లు కొన్నాను ఒక్క దానిలో ఒక్కదానా" అన్నాడు రామచంద్రం గర్వంగా.

"బాబయ్యా" అని అడవిలోంచి కీచుగా కేక వినపడింది. అందరం అటు చూశాం సూరీడు పరుగెత్తుకు వస్తోంది.

"బాబూ. మా అయ్యని పాము కరచింది ఒక్కసారి రండి బాబూ రండి" వగరుస్తోంది సూరీడు. ఆమె కళ్ళల్లో భయం సుళ్ళు తిరుగుతోంది.

"అరెరెరె!"—అన్నాడు భూషణం. అందరం యీ దుర్వార్తకి స్తంభించిపోయాం

"రండి బాబూ సగందూరం వెళ్లగానే వేరు ముక్కకోసం పొదలో చెయ్యిపెట్టి మొక్క పీకబోయాడు బాబూ. బుస్సనిలేచి కాటు వేసింది తాచు బాబూ తాచు పాము" సూరీడు దీనంగా అడుగుతోంది

"ఎలాగ! ఈ బస్సు దాటిపోతే కలక్టరుగారింట్లో పెళ్ళికి ఎలాగ వెళ్లడం రిసెప్షన్ అంతా నేను చూసుకుంటానని మాట యిచ్చాను'—" అన్నాడు రామచంద్రం పెద్ద సమస్య వచ్చిపడింది రామచంద్రానికి

"అయినా మనం ఏమి చేయగలం?" భూషణం నిరీహుడై జాలిగా అన్నాడు

నేను వెర్రిగా సూరీడు కేసి చూస్తున్నాను "నే నొక్కతెను చూడలేను బాబూ మీరుంటే ధైర్యం బాబూ. రక్షించండి బాబూ!" ఏడుస్తోంది సూరీడు.

"అదిగో బస్సు వస్తోంది" అన్నాడు భూషణం. రామచంద్రం చెయ్యి ఎత్తి ఆపమని సంజ్ఞ చేశాడు

బస్సు ఆగింది. "త్వరగా ఎక్కండి బాబూ" అంటున్నాడు కండక్టరు. రామచంద్రం గబుక్కున రెండు పది రూపాయల నోట్లు జేబులోంచి తీసి సూరీడు చేతిలో పెట్టి "మేంవుండి మాత్రం ఏం చెయ్యగలం సూరీడూ. మంత్రం వచ్చునా తంత్రం వచ్చునా? అవతల కలక్టరుగారింట్లో పెళ్లి. ఈ డబ్బుతో ఎక్కడికేనా తీసుకెళ్లి చూపించు మీ బాబుని" అని కారు ఎక్కాడు. భూషణం నిశ్చేష్టుడై చూస్తూవున్న నన్ను జబ్బ పట్టుకుని కార్లోకి తోసి, తానూ ఎక్కాడు "సూరీడూ! ఏమనుకోకు కలెక్టరుగారింట్లో . . ." అంటున్నాడు కారు బర్రున సాగింది సూరీడు విచిత్రంగా నోరావలించి గుడ్లప్పగించి చూస్తూ నిలబడింది పది రూపాయల నోట్లు రెండూ ఉదయపు చల్లని గాలిలో పావురాలులా పల్టీలు కొట్టుతున్నాయి

కారు వేగంగా వెళ్లిపోతోంది పాపం మనం చెయ్యకలిగిం దేముంది?" అన్నాడు భూషణం యింకా జాలితో.

"అందులో కలక్టరు గారికి మాట యిచ్చా మాయె!" అన్నాడు రామచంద్రం—మాట యిచ్చి తప్పడంలోని అమానుషత్వాన్ని వూహించుకుని భయపడుతూ

ఇదీ నల్లజర్ల అడవిలో ఆనాటి రాత్రి సంఘటన—అని అవధానిగారు ఆగి మాకేసి చూశారు

"కొవ్వత్తి అయిపోతోంది. ఎలాగ" అన్నాడాచారి భయంగా

"డ్రైవరు, వంటవాడూ సినీమానుంచి యీ పాటికి వస్తూంటారు" అన్నాడు నారాయణ

"ఈ తోట లో పాము లున్నాయాండీ" అన్నాడాచారి

అవధానిగారు మాట్లాడలేదు. పాతిక సంవత్సరాల క్రితం జరిగిన యీ సంఘటనదగ్గరే వుంది యింకా ఆయన మనస్సు

"సిద్దయ్య చచ్చిపోయాడేమో" అన్నాను నేను

"మనకేం తెలుస్తుంది?" అన్నారు అవధానిగారు. "సూరీడు ఏమయిందో కూడా తెలియదు" అన్నారు బరువుగా

గబుక్కున లైట్లు వెలిగాయి. బంగళాఅంతా వెలుగుతో నిండిపోయింది. ఆచారి ఆనందంతో నవ్వుతున్నాడు. అవధానిగారు యింకా ఆలోచిస్తూనే ఉన్నారు. "డ్రైవరు రాగానే వెళ్లిపోదాం" అంటున్నాడు నారాయణ తోట అవతల నుంచి యింకా నక్కల కూతలు వినపడుతున్నాయి. కాని ఆచారి అంత భయపడలేదు.

నాగార్జునకొండ - ఇటీవలి విశేషాలు

శ్రీ కె. హెచ్. వి. శర్మ

గుంటూరు మండలములోని నాగార్జునకొండ లోయలో నిటీవల వెలువడిన పురాతనపు కట్టడములు, శిథిలములు, శాసనములు మున్నగు నవి దక్షిణ దేశమునే గాక యావద్భారత దేశమును గూడ మిక్కిలి ఆకర్షించిన వనుట కెట్టి సందియము లేదు కృష్ణానదీ జలప్రవాహములతోడ నచిర కాలమున నా ప్రాంతమంతయు పూర్తిగ మునిగిపోవు ప్రమాదము సంభవించుటచే కేంద్ర ప్రభుత్వ పురాతత్త్వశాఖవా రతి త్వరితముగ త్రవ్వకముల నారంభించి యందలి శిథిలములను చాలవరకు సంరక్షించి యున్నారు తత్ఫలితముగ నాంధ్రదేశ చరిత్ర సంస్కృతులకును, బౌద్ధ వైదిక మతములకును, ముఖ్యముగ నా ప్రాంతమును బాలించిన రాజవంశజులకు సంబంధించిన యనేక నూతనాంశములు దెలియవచ్చెను

తూర్పు కనుమలకు చెందినట్టియు, ప్రస్తుతము నల్లమల కొండ లనబడు రమణీయమైన పర్వతశ్రేణి మూడు దిశలను, నాల్గవ దిశను ఆ పర్వతముల మధ్యనుండి మధుర గంభీర ధ్వనితో ప్రవహించు కృష్ణానది తోడను పరివృతమైన ఆ లోయ ప్రకృతి సౌందర్యమున కాట పట్టని చెప్పక తప్పదు ఇట్టి నైసర్గిక స్వరూపము, ప్రశాంత వాతావరణమే ప్రాగైతిహాసిక, ఐతిహాసిక, నవీనజను లందరిని పరిపరి విధముల ఆకర్షించి దాని మహోన్నతికి కారణమైనది


ఇచ్చట ముఖ్యముగ మూడు పర్యాయములు ఖనన పరిశోధనలు జరిగి నవి మొదట ఎ హెచ్ లాంగ్ హర్స్టు దొరగారు 1926 నుండి 1931 వరకును, తర్వాత టి ఎన్ రామచంద్రన్ గారు 1938 నుండి 1940 వరకును, పిమ్మట 1954 నుండి 1961 వరకు డాక్టర్ ఆర్ సుబ్రహ్మణ్యము గారును త్రవ్వకములు సాగించిరి లాంగ్ హర్స్టు దొరగారు 'నాగార్జున కొండలోని బౌద్ధ శిథిలములు' (The Buddhist Antiquities in Nagarjunikonda) అనియు టి ఎన్. రామచంద్రన్‌గారు "1938 నాగార్జున కొండ" (Nagarjunakonda—1938) అని వారి వారి పరిశోధన ఫలితములను ప్రకటించి యున్నారు డాక్టర్ ఆర్. సుబ్రహ్మణ్యముగారి పర్యవేక్షణ క్రింద జరిగిన పరిశోధనఫలితములు గూడ నచిర కాలమున సమగ్రముగు గ్రంథ రూపమున వెలువడ గలవు ఇటీవల ఆ లోయలో దొరికిన కొన్ని ముఖ్య విశేషములను మాత్రము గూర్చి ఈ క్రింద తెల్పగలను

క్రీస్తుశకము మూడు, నాలుగు శతాబ్దములలోని మన ఆంధ్రుల చరిత్ర, అందును ముఖ్యముగ నీ ప్రాంతమును పాలించిన ఇక్ష్వాకు వంశజుల చరిత్ర అంతయు నాగార్జునకొండలోని బ్రాహ్మీలిపి శాసనములలో భద్రపరచబడి యున్నది పూర్వ మిచ్చట దొరికిన శాసనాధారములను బట్టి చాంతమూల, వీర పురుషదత్త, ఏహువల చాంతమూల అను ముగ్గురు ఇక్ష్వాకు రాజులను గూర్చియే తెలిసినది ప్రస్తుత ముపలబ్ధమైన శాసనములను బట్టి మరియిద్దరు రాజకుమారులు తెలియవచ్చిరి ప్రాకృతభాషలో తొమ్మిది పంక్తులలో విహారమునందలి స్తంభమున కొక్క శాసనము గలదు. దీనిపైన చక్కని శిల్పము గూడ నున్నది దానిలో ఉన్నతాసనముపై నాసీనురాలైన స్త్రీ యొకతె శిరోవేష్టన, స్తనాంశుకములను గల్గి, దీర్ఘమైన ఉత్తరీయమును కుడిచేతిలో దర్పణము నొకదానిని ధరించి, పాదముల వద్ద నొక పరిచారిక, ప్రక్కన వేరొకతెయు గల్గియున్నది ఇది మండన దృశ్యమును బోలి గాన్పించును ఈ శిల్పము క్రిందుగా నీ శాసన మున్నది. "మహారాజ చాంతమూలుని ప్రస్నుషయు, వీరపురుషదత్తుని స్నుషయు, ఏహువల చాంతమూలుని పత్నియు, ఇక్ష్వాకురాజైన వాసిష్ఠీపుత్ర రుద్ర పురుషదత్తుని మాతయైన మహాదేవి, మహాక్షత్రపుని కుమార్తె, బృహత్ఫలాయన సగోత్రియు, స్వర్గమును పొందిన శ్రీ వర్మ భట్టారిక ఛాయా స్తంభ" మని గలదు దీని కాలము రుద్రపురుషదత్తుని ఏకాదశ రాజ్య సంవత్సరము ఈ వర్మ భట్టారికయే పై శిల్పములో చెక్కబడినది ఈమె ఏహువల చాంతమూలుని రాణి యనియు, ఇక్ష్వాకు రుద్ర పురుషదత్తుని మాత యని పేర్కొనుటను బట్టి, ఈ రుద్ర పురుషదత్తుడు ఏహువల చాంతమూలుని పుత్రు డనియు, తండ్రి అనంతరము సింహాసనము నధిష్ఠించి, అధమము పదనొకండు సంవత్సరములు రాజ్య మేలెనని స్పష్టమగుచున్నది ఈతని నాల్గవ రాజ్య సంవత్సరమునాటి శాసన మొకటి వెనుక గురజాలలో దొరికినది శాసనములో నీతడు వాసిష్ఠీపుత్రుడని చెప్పుకొనుటచే బృహత్ఫలాయన సగోత్రి యగు వర్మభట్టారిక ఈతని కన్నతల్లి కాదు నవతితల్లి కావచ్చును ఈమె మహాక్షత్రపుని కుమార్తె యట. రెండవ ఇక్ష్వాకురాజైన మాఠరీపుత్రవీరపురుషదత్తుడు ఉజ్జయని రాజకుమార్తె రుద్రధరభట్టారికను వివాహ మాడినట్లు వెనుక దొరికిన శాసనమునుబట్టి విదిత మగుచున్నది ఆతని కుమారుడగు ఏహువల చాంతమూలుడు గూడ పశ్చిమ దేశమును బాలించిన ఈ మహాక్షత్రపుల యింటి ఆడుబిడ్డను గ్రహించి యుండును ఇట్లు ఆంధ్రదేశపు ఇక్ష్వాకు రాజులకు పశ్చిమదేశపు మహాక్షత్రపులతో సంబంధ బాంధవ్యము లుండెడివి పెట్లూరి పాలెములోని క్షత్రపుల నాణెములు, నాగార్జున కొండ శిల్పములలోని శకవీరులు గూడ ఈ యూహను మరింత నిర్ధారణ సేయుచున్నవి వర్మభట్టారిక తండ్రిపేరు తెలియదు, కాని ఆమె బృహత్ఫలాయన సగోత్రి యనుటచే పశ్చిమ దేశపు క్షత్రపులు బృహత్ఫలాయన గోత్రజులని నూతనముగా తెలియవచ్చెను ఇక్ష్వాకుల యనంతర మీ ప్రాంతమును గొంతకాలము బృహత్ఫలాయన గోత్రజుడైన జయవర్మ మహారాజు పాలించినట్లు కొండముది తామ్రశాసనమును బట్టి విశద మగుచున్నది ఈ బృహత్ఫలాయన గోత్రజులకు, వర్మభట్టారిక పుట్టినింటివారగు పశ్చిమ దేశపు మహాక్షత్రపులకు ఏమైన సంబంధ ముండెనేమో తెలియదు —

ఇక్ష్వాకు రాజన్యుడైన ఏహువలచాంతమూలుని పదునారవ రాజ్య సంవత్సరమునాటి శాసన మొకటి సంస్కృత భాషలో చక్కని గద్యలో పదకొండు పంక్తులలో నున్నది. "నమో భగవతే మహాదేవాయ పుష్పభద్రస్వామినే" యని ప్రారంభించుటచే నీ శాసనము దొరికిన ఆలయము మహాదేవుడగు పుష్పభద్రస్వామి ఆలయమని స్పష్టము తదుపరి "రాజ్ఞః వాసిష్ఠీపుత్రస్య అగ్నిష్టోమ వాజపేయాశ్వమేధ బహు సువర్ణక యాజిన నైకహిరణ్యకోటి ప్రదాతు గో శతసహస్ర హల శత సహస్ర ప్రదాతు స్వ వీర్యార్జిత విజయ కీర్తే ఇక్ష్వాకూణాం శ్రీ చాంతమూలస్య ప్రపౌత్రేణ మహారాజస్య మాఠరీపుత్రస్య ఇక్ష్వాకూణాం శ్రీ వీరపురుష దత్తస్య పుత్రేణ మహారాజస్య నగర దిలీ పాంబరీష యుధిష్ఠిర తుల్య ధర్మవిజయస్య రామస్యేవ సర్వజనాభిరామస్య ఇక్ష్వాకూణాం శ్రీ ఏహువల చాంతమూలస్య పుత్రేణ పుష్యకందీయానాం మహాతలవరస్య స్కందగోపస్య నప్త్ర్యా మహాతలవరస్య ఖందహాలస్య దుహిత్రా సేసెబమాగూరుక దౌహిత్ర్యా ఉత్తర మహాతలవర భాగినేయ్యా రాజ్ఞః శ్రీ ఏహువల చాంతమూలస్య మహిష్యా మహాదేవ్యాః కుపణశ్రియా పుత్రేణ మహారాజ కుమారేణ మహాసేనాపతినా హారితీపుత్రేణ ఇక్ష్వాకూణాం శ్రీ వీర పురుషదత్తేన మహారాజస్య మహాదేవ్యా

గోత్రస్య చ విజయ వైజయిక ఆయుర్వర్ధనే ద్వయోరపి చ మాతా పుత్రయో ధర్మఫలం భగవత పుష్పభద్రస్వామిన దేవకులం కారితం, ధ్వజ స్తంభశ్చ ప్రతిష్ఠాపిత గ్రామశ్చ పుడొంకెడం అక్షయనీవి దత్త "— అని యున్నది దీనినిబట్టి ఏహువల చాంతమూలునకు హారితి కృపణశ్రీ యందు వీరపురుషదత్తుడను నింకొక కుమారుడు గలడని తెలియుచున్నది. ఈతడు తాతపేరింటివాడు, పైన పేర్కొనిన వాసిష్ఠీపుత్రరుద్ర పురుషదత్తుని తమ్ముడు. ఈతని తల్లి కృపణశ్రీ వంశ మిందు పూర్తిగ వర్ణించబడినది. ఆమె పుష్యకందీయులగు మహాతలవరస్కందగోపుని పౌత్రి, మహాతలవర ఖందపాలుని పుత్రి, సేసెబమాగూరుకుని దౌహిత్రి, ఉత్తర మహా తలవసుని మేనగోడలని గలదు. ఇట్లు కృపణశ్రీ మాతృ, పితృ వంశముల వారందరు మహాతలవరులట మరియు పితృవంశమువా రగు పుష్యకందీయులు హారీత గోత్రజులు వీ రందరు మహా తలవరు లగుటచే ఇక్ష్వాక రాజుల సామంతులగు ఆంధ్ర దేశీయులే కావచ్చును ఈ రెండవ వీరపురుషదత్తుడు 'మహారాజకుమార, మహా సేనాపతి' యనుటచే తన తండ్రి ఏహువల చాంతమూలుని సైన్యమునకు తా నధిపతిగను, బహుశ అన్నయగు రుద్ర పురుషదత్తుడు యువరాజుగ నుండి యుండురు.

ఏహువల చాంతమూలుని పదమూడవ రాజ్యకాలమునాటి శాసన మొకదానిలో మాఠరీపుత్రవీరపురుషదత్తుని మహిషియగు జమహావలభికాయ ఖిలినికా పుత్రుడు, మహాసేనాపతి, కుమార ఏలిఏహువుల దాసంనకుడు పేర్కొనబడినాడు. ఆతని చిత్రమే ఆ శాసనస్తంభమునందు చెక్కబడినది కావచ్చును ఇది ఆతని జ్ఞాపకార్థము వేయించబడిన ఛాయాస్తంభ మగుటచే ఈ శాసన కాలమున కాతడు మృతినొంది యుండును దీనినిబట్టి మాఠరీ పుత్ర వీరపురుషదత్తునకు ఏహువల చాంతమూలుడు గాక, మరియొక పుత్రుడు గూడ గలడని తెలియుచున్నది. వీరపురుషదత్తునకు మహాదేవి వాసిష్ఠీ భటిదేవియందు చాంతమూలుడును, జమహావలభికాయఖిలినిక యందు ఈ ఏలి దాసంనకుడును జన్మించిరి కుమార ఏలిఏహువలదాసంనకుడు సేనాపతి అని పేర్కొనబడుటచే తన సవతి సోదరుడగు ఏహువల చాంతమూలుని వద్ద సైన్యాధ్యక్షుడుగ రెండవ వీరపురుషదత్తునకు పూర్వముండి యుండవలెను నాగార్జునకొండలోయ కెదురుగా కృష్ణానది యావలి యొడ్డున గల ఏలేశ్వరము ఈతని పేరనే నిర్మించబడి యందు ఏలేశ్వరుడు ప్రతిష్ఠించబడి యుండును ఇట్టి మూడు శాసనములను బట్టి ఇక్ష్వాక రాజ వంశములో మరి ముగ్గురు నూతన పురుషులు తెలియ వచ్చిరి ప్రస్తుతము వారి వంశము నీ క్రింది విధముగ చూపవచ్చును.




వీరుగాక చిన్నవి మరి రెండు శిథిల శాసనములలో కుమార వీర అరిభ . , కుమార కరదర అనువారలు పేర్కొనబడిరి 'కుమార' శబ్దముచే వీరు గూడ ఇక్ష్వాక రాజకుమారులే యని తలంచ వీలున్నది కాని, పై వంశవృక్షములోని రాజులకు వీరికిని గల సంబంధము మాత్రము తెలియుటలేదు.

ఏలిఏహువల దాసంనకుని తల్లియగు 'జమహావలభికాయఖిలినికా' యను పేరు చాల వింతగా నున్నది "అఖిలినికా" ఆమె పేరు. 'జమహావలభికా' అనున దామె ఏ దేశపు రాజకుమార్తెయో దెల్పునది కావచ్చును. పశ్చిమ హిందూదేశపు మైత్రకవలభీకులకు నీమెకు నేమైన సంబంధము గలదేమో తెలియదు

ఏహువల శ్రీ ఏకాదశ రాజ్య సంవత్సరమునాటి శాసన మొకదానిలో మాఘ శుక్ల ఏకాదశి పుణ్యకాలమందు సమరవిజయి, ఖ్యాతకీర్తి యగు సేనాపతి అణక్కి పౌత్రుడు, గాణ్ణి పుత్రుడు, తలవరశ్రేష్ఠుడు, హారవహ తనయుడగు కుమారస్వామి భక్తుడు, బుద్ధిమంతుడగు ఏలిశ్రీ అను నాతడు కార్తికేయానుగ్రహమున విశాలమైన సర్వదేవాధివాసమును చేయించెనని యున్నది.

"వర్షే ఏకాదశే రాజ్ఞ ప్రభో రేహువలశ్రియః"
శుక్లపక్షస్య మాఘస్య పుణ్య ఏకాదశేఽహని. 1

దేవే యస్యాతి భక్తి హార్ తవహ తనయే చండశక్తౌ కుమారే
పౌత్ర స్సేనాపతే ర్య స్సమరవిజయిన ఖ్యాతకీర్తే రణేక్కే,
ప్రాసాద ంగాణ్ణిపుత్ర స్స తలవరవర కార్తికేయ ప్రసాదాత్
ఏలిశ్రీ శ్రీవిశాలం శుభమతి రకరో త్సర్వ దేవాధివాసమ్ " 2



కృష్ణాతీరంలోని ఏలేశ్వరస్వామి దేవాలయం

ఇంత ప్రాచీన కాలమున నిర్దుష్టమైన చక్కని సంస్కృత శ్లోకములలో నుండు శాసనములు చాల అరుదు. అనుష్టుప్ శ్లోకము చిన్నదగుటచే సరిగా అర్ధమునకు, స్రగ్ధరావృత్తము నాల్గు పాదములుగను విభజింపబడి శాసన మంతయు మొత్తము ఆరు పంక్తులలో చెక్కబడినది. ఈ విధముగ పెద్ద వృత్తములను పాదములకు, చిన్న శ్లోకముల వర్ధమునకు విభజించి సరిగా చెక్కుట నాగార్జున కొండలోని తదితర శాసనములలో గూడ కాన్పించును.


సుమారు ఎనిమిది అడుగుల ఆరంగుళముల పొడవు గలిగిన శిల్పాలంకృత శిలాఫలకమున కొకదానికి ఒకే పంక్తిలో శాసనము గలదు. ఆ శిల్పములో బుద్ధుని జీవిత చరిత్రములోని నాల్గు ముఖ్య ఘట్టములు విరూపించబడి వాని మధ్యన ఐదు మధురమైన మిధునచిత్రములు చక్కగా చెక్కబడి యున్నవి నాగార్జున కొండలోని శిల్పములలో నొక ముఖ్యము, ప్రధానమైన విశేష శిల్పములవద్ద తరుచు ఈ సుందర మిధున మూర్తులు గాన్పించును. బహుశ ఆ ప్రధాన శిల్ప ఘట్టముల వద్దకు చూపరుల నాకర్షించుటకే యివి కల్పించబడి యుండును పై శిలాఫలకపు అధోభాగమున సంస్కృత భాషలో ఏహువలచాంతమూలుని 24 వ రాజ్య సంవత్సరమునాటి శాసనము గలదు. ఇరుసకకుల, భరణకీయ విభాగమునకు

చెందిన ఈశ్వరదత్తుని పుత్రుడు, స్కందకపర్వతశ్రేష్ఠియగు కుమారనంది భార్య (శ్రేష్ఠిని) తోను, పుత్రుడు ఈశ్వరబట్టితోడను, స్వజన సంబంధి వర్గముతో గూడ సర్వసత్వోత్తముడు, సర్వగుణపారమీప్రాప్తుడు, సమ్యక్సం బుద్ధుడు భగవంతుడగు బుద్ధుని శైలమయ ప్రతిమను శ్రీపర్వతము మీది విజయపురిలోని మహాదేవి పరివేణములో తనకు సర్వ సత్త్వములకు హితసుఖార్థము ప్రతిష్ఠించెనట. ఇందు బుద్ధునకు గల 'సమ్యక్సంబుద్ధ' సర్వసత్వోత్తమ, సర్వగుణ పారమీప్రాప్త' అను విశేషణములు గమనించ దగినవి. నేడు నల్లమలి కొండ లనబడు పర్వత పంక్తియే పూర్వపు శ్రీ పర్వతము, ప్రస్తుతము నాగార్జున కొండలోయలో బయల్పడిన మహా నగరమే నాటి ఇక్ష్వాకరాజధాని యగు విజయపురి 'పరివేణము'నగా బౌద్ధ విహారములో భిక్షులకై ప్రత్యేకించబడిన గది యనుట మహాదేవి పరివేణ మనుటచే ఇక్ష్వాకరాణిచే నిర్మించబడినది కావచ్చును కుమారనంది నివాస మగు స్కందకపర్వత మెచ్చటిదో తెలియదు బహుశః నాగార్జునకొండ సమీపముననే యుండవచ్చును అన్నిటికంటె విశేష మీ శాసనమున తరుచు తామ్ర శాసనములలో కాన్పించు వ్యాసగీతము వంటి చిన్న శ్లోక మొక దానితో అంతమైనది

"భవతి చాత్ర శ్లోక —
దేయ ధర్మ మిదం కృత్వా యత్పుణ్యం సముపార్జిత,
తేన పుణ్యేన లోకోఽయం నిర్వాణ మధిగచ్ఛతు."

ఈ దేయధర్మ పుణ్యఫలితముగ ఈ లోకములోని అందరు నిర్వాణ మును పొందుగాక అని మహాయాన బౌద్ధ మతములోని యొక విశిష్టత చూపించబడినది.

నాలుగు విభాగములుగ గల బౌద్ధవిహార మొకటి చైత్యగృహము, స్తూపము మున్నగువన్నిటితో బయల్పడినది దాని స్తూపమువద్ద బుద్ధుని పాద చిహ్నములతో గూడిన చక్కని శిలాఫలకము గలదు. ఇట్టి శిలా ఫలక ములు శాసనములతోను, శాసనము లేకుండను కూడ అమరావతి, నాగార్జున



నాగార్జున కొండ ప్రాంతంలోని ఒక ' రాకాసి గుళ్లు '

కొండలలోనే గాక తదితర స్థలములను చాల చోట్ల గలవు ప్రాచీన బౌద్ధ శిల్పమున బుద్ధుని పాదములను మాత్రము చిత్రించి వానిని పూజించుట యొక విశేషము శాసనములలో వీనిని గూర్చి "పతి పదా' (ప్రతి పదా), 'పదుకపట' (పాదుకా పట్ట) అని చెప్పబడినవి ప్రస్తుత శిలా ఫలకములోని పాదముల రెండింటిలోను మధ్యన పెద్ద చక్రములు, వాటి వెనుక అంకు శము, నాగముద్ర, త్రిరత్నముతో గూడిన చక్రము, మత్స్యముల జత గల శంఖము, ముందు భాగమున రెండు నాగముద్రలు, స్వస్తిక, శ్రీవత్సము, పూర్ణకుంభము, శంఖమును, కాలివ్రేళ్లలో స్తంభము, అంకుశము, అజ్ఞాత చిహ్నము, మత్స్యముల జంట, త్రిరత్నముతో గూడిన చక్రము వరుసగా గలవు పాదముల పార్శ్వమున బోధివృక్షమును నిలువున పట్టుకొనిన ఇద్దరు మనుష్యులు గలరు పాదములకు దిగువున 13 అంగుళముల పొడవున రెండంగుళముల వెడల్పున దీర్ఘచతురస్రాకారమున మూడు పంక్తులలో ప్రాకృతభాషలో శాసన మిట్లున్నది

1. "సిద్ధం ఆచరియనం థెరియానం విభజవాదానం కశ్మీర గంధార యవన వనవాస తంబపం నిదీపపసాదకనం
2. మహా విహార వాసినం నవంగ శథుశ నన అధవ్యజిన వినిచ్ఛయ విశరదనం అరియ వంశపవెని ధరనం
3. వహారే భగవతో పాద సంఘాడాని పతిఠపితో సవసతానం హితసుఖ థనా యతిటె "—

స్థవిర విభజ్య వాదాచార్యులు, కాశ్మీర, గాంధార, యవన, వనవాస, తామ్రపర్ణి ద్వీపవాస ప్రసాదకులు, మహా విహార నివాసులు, నవాంగశాస్త్ర శాసనార్థ వ్యంజన వినిశ్చయ విశారదులు, ఆర్యవంశ ప్రవేణీ ధరుల విహారము నందు భగవంతుడైన బుద్ధుని పాదసంఘాతము సర్వసత్త్వములకు హిత సుఖార్థము ప్రతిష్ఠించబడినవి వీనిని ప్రతిష్ఠించిన వాని పేరు శాసనములో లేదు. ఈ విహారమును, అందలి స్థవిరవాదాచార్యులను గూర్చి నాగార్జున కొండలోని మరియొక శాసనమున గూడ గలదు దానినిబట్టి బుద్ధ ఉపా సిక బోధిశ్రీ అనునామె శ్రీపర్వతముమీది విజయపురి పూర్వదిశా భాగ మందలి చులధర్మగిరిపైన విహారములో చైత్యగృహము మున్నగువాటిని కాశ్మీర గాంధార, చీన, కిరాత, తోసలి, అపరాంత, వంగ, వనవాసి, యవన, ద్రమిళ, పలుర, తామ్రపర్ణి ద్వీపవాసప్రసాదకులు, తామ్రపర్ణీయులు, స్థవిరవాదులు నగు, ఆచంతరాజాచార్యులకు సర్వ నియుక్తముగ చేయించెనని తెలియుచున్నది ప్రస్తుత శాసనములో ఐదు దేశములు మాత్రమే పేర్కొనబడినవి కాని రెండింటిలో చెప్పబడిన స్థవిరవాదులు ఒక్కరే యనుటకు సందియము లేదు ఈ బుద్ధుని పాదచిహ్నములను ప్రతి ష్ఠింపజేసినది కూడ ఉపాసికాబోధిశ్రీయే కావచ్చును స్థవిరవిభజ్యవాదు లకు గల 'నవాంగ శాస్త్ర శాసనార్థవ్యంజన నిశ్చయ విశారదులు, ఆర్య వంశ ప్రవేణీధరులను' రెండు విశేషణములును చాల ముఖ్యమైనవి. నవాం గశాస్త్రము లనగా బౌద్ధ మతమునకు చెందిన సూత్ర, గద్య, వ్యాకరణ, గాథా, ఉదాన, ఇతివృత్త, జాతక, అద్భుతధర్మ, వేదల్లములు ఈ తొమ్మిది శాస్త్రముల అర్థ, వ్యంజన వినిశ్చయ విశారదు లా ఆచార్యు లందరును, మరియు ఆర్యవంశ ప్రాచీనతను కంఠోక్తిగా తెలిసినవారు. దీనినిబట్టి ఆంధ్రదేశమున నిక్ష్వాకు రాజుల కాలమున నెటువంటి బౌద్ధ పండితులు గలరో స్పష్టమగు చున్నది ఈ స్థవిరవిభజ్యవాదు లందరు హీనయాన బౌద్ధమతమునకు చెందినవారు ప్రస్తుతము నల్లరాళ్లబోడని పిలువబడు గుట్టయే చులధర్మగిరి యనియు, నందలి విహారము సింహళదేశ నివాసులు, హీనయాన బౌద్ధమతాచార్యుల కొరకే కల్పించినట్లు గన్పట్టును ఇటు నాగార్జున కొండలోయలో నా కాలమున మహాయాన బౌద్ధముతోబాటు హీనయాన బౌద్ధ మతము గూడ వర్ధిల్లు చుండినట్లే శాసనములను బట్టియే విశద మగుచున్నది

ఆంటిక్విటీ విభాగమునకు ఈశాన్యముగ నూరు గజముల దూరమున గల నొక మండపములో ఏహువల చాంతమూలుని రాజ్యకాలమునాటి శాసన ములో 'ఆర్య భట్టారక, యతిశ్రమణ స్కంధీకృతుడైన కొడరకుడు పేర్కొనబడెను యతిశ్రమణ స్కంధీకృతు డగుటచే వైదిక, బౌద్ధమత ప్రవర్తకు లిరువురి చేతను సమానముగా మిక్కిలి గౌరవించబడు చుండెడి వాడని తెలియుచున్నది ఆ కాలమున నీత డొక గొప్ప మత ప్రవర్తకుడు గావచ్చును

బర్నింగ్‌ఘాట్ అనబడు స్థలము వద్ద నిడుపైన చలువరాతి స్తంభ మునకు ఎనిమిది పంక్తులలో ప్రాకృతభాషలో ఏహువల చాంతమూలుం శాసన మొకటి గలదు దీనిలో కాలము తరుచు ఇక్ష్వాకరాజుల తదితర శాసనములలో పేర్కొనబడినట్లు రాజ్య సంవత్సరమున గాక 'సంవచ్ఛరవి

విజయం' అని యున్నది. ఈతని తండ్రి వీరపురుషదత్తుని శాసన మొకదాని గూడ నిట్లే 'సంవచ్ఛరం విజయం' అని గలదు ఇది దక్షిణ దేశమున వాడుకలో నుండు ప్రభవాది సంవత్సరములలోని 'విజయ' సంవత్సరమే నని కొందరు చరిత్రకారు లూహించు చున్నారు. ఇంత ప్రాచీన కాలమున నాగార్జునకొండలో నితర శాసనములలోగాని, లేదా భారత దేశమున మరెచ్చటను గాని ప్రభవాది సంవత్సరములు పేర్కొనకుండుట, మరియు నీ రెండు శాసనముల గూడ 'విజయ' సంవత్సర మొక్కటియే యుండుట చాల వింతగా నున్నది ఈ విషయమును గూర్చి ముందు తెల్పగలము

ఏహువల చాంతమూలుని కాలమున భగవంతుడైన నొడగేశ్వర స్వామికి ఆలయాదులు నిర్మించబడి, కొన్ని దీనారములు కొంతమంది వర్తకుల వద్ద నుంచి దానినుండి వచ్చు వడ్డి ఆ స్వామికి అక్షయనీవి కొరకు వినియోగించవలసినదిగా అంతపుర మహాత్తరికా, శ్రేష్ఠిబాలికా మున్నగు స్త్రీలు తమ ఏలిక ఆయుర్వర్ధన, విజయ నిమిత్త మీ ధర్మకార్యము నాచరించిరట కృష్ణానది కావలి యొడ్డున గల ఏలేశ్వరములో ఇక్ష్వాక రాజకుమారుడైన ఏలి ఏహువలదాసంనకుని పేర ఏలేశ్వరు డెట్లు ప్రతిష్ఠింపబడెనో అట్లే ఈ 'నొడగేశ్వరస్వామి గూడ యెవ్వరి పేరనో ప్రతిష్ఠించబడి యుండును కాకతీయుల కాలమున ఆయా రాజుల పేర బేతేశ్వరుడు, ప్రోలేశ్వరుడు, రుద్రేశ్వరుడు అని ప్రతిష్ఠించుట గలదు శాసనము చివర తా మిచ్చిన ధర్మమును దేవాలయ ధర్మాచారకుడే సక్రమముగ నిర్వర్తించవలెను. లేనిచో శ్రేష్ఠి ప్రముఖులు దీనిని వశపరచుకొని సక్రమముగ నడుపునట్లు చేయగలవారని యున్నది శ్రేష్ఠి ప్రముఖు లనగా నగరశ్రేష్ఠి, సార్థవాహ, ప్రథమ కులిక, ప్రథమ కాయస్థులతో గూడిన ప్రస్తుత గ్రామ పంచాయితి వంటిది

ఏహువల చాంతమూలుని ఎనిమిదవ రాజ్య కాలమునాటి రెండు శాసనములలో నాగశ్రీ ప్రియ సోదరుడగు చంద్రశ్రీ అను ఉపాసకుడు శ్రీ పర్వతము మీది విజయపురిలోని అపరమహావినశైలియ మహానికాయము లోని ప్రత్యేక ఆర్య సంఘమునకు శైలమండపము, భండారశాల మున్నగు నవి కట్టించెను ఈత డింకను అనేక దానములు చేసినట్లు తెలియు చున్నది

పురాతత్వశాఖానిపుణులచే విశ్వవిద్యాలయ మనబడు స్థలమున నొక శిథిల స్తంభమునకు చక్కని సంస్కృత శ్లోకములలో నొక శాసన మున్నది శ్లోకములు 8, 9, 10 అని అంకెలుండుటచే మొత్త మా శాసనములో పది శ్లోకము లున్నవని తెలియును తరుచు నాగార్జునకొండలో దొరికిన సంస్కృత శాసనము లన్నియు వైదిక మతమునకు సంబంధించినవి, ప్రాకృత శాసనములు బౌద్ధమతమునకు చెందినవియే గాని ఈ శాసనము మాత్రము సంస్కృతములో నుండియు బౌద్ధవిహారమును గూర్చి వర్ణించు చున్నది శాసనము చాల భాగము విరిగిపోవుటచే నిందలి విషయ మేమియు స్పష్ట మగుటలేదు ఆఖరి శ్లోకమున 'శోభనే విహారముఖ్యే విగతరాలయే' అనియు 'నివేశితా విహారబాహ విపులార్థకాంక్షిణా' అనియు నున్నది దీనినిబట్టి ఆ శాసనము దొరకిన స్థలము 'విగతజ్వరాలయ' మని తెలియు చున్నది విగతజ్వరాలయ' మనగగా 'వైద్యశాల' అని కొందరు, ఆ విహారములో కొంతమంది బౌద్ధభిక్షుకులుండు నివాసము లేదా బుద్ధుని పూజించ స్థలమని మరికొందరు పరిపరి విధముల నూహించు చున్నారు

శ్రీపర్వతములోని విజయపురి పూర్వదిశాభాగమున గల చుళ ధర్మగిరి విహారములోని 'స్వకసమయ, పరసమయ సమ్యక్సారగులగు అచంత రాజాచార్యుల గూర్చి యొక శాసనములో తెల్పబడినది ప్రస్తుతము నల్లరాళ్లబోడని పిలువబడు గుట్టయే పూర్వపు చుళధర్మగిరి యనియు, నందలి విహారము కేవల హీనయాన బౌద్ధులకై నిర్మించబడినట్లు పైన వివరించడమైనది 'స్వకసమయ, పరసమయ' అనగా తమ మత సిద్ధాంతములను, పరుల మత సిద్ధాంతములను గూడ బాగుగా తెలిసినవారు రెండవ అమ్మరాజ కాలమునాటి తామ్ర శాసన మొకదానిలో జైన గురువును గూర్చి 'పరసముయపటు' వనియు కర్ణాట దేశములోని సుప్రసిద్ధ జైనాచార్యుడగు భట్ట అకలంకను గూర్చి 'స్వసమయ, పరసమయ పటు' వనియు వర్ణించబడెను. కాని ఇంత ప్రాచీనకాలమున నాగార్జున కొండ శాసనములో నివి పేర్కొనబడి యుండుట చాల ముఖ్యమైన విషయము

దుర్గపు తూర్పుద్వారపు వెలుపల ఎదు పంక్తులలో ప్రాకృత భాషలో పెద్ద అక్షరములలో నొక శాసనము దొరికినది. శిలాఫలకమునందు పద్మముల మధ్యన గల మత్తగజముపై సార్వభౌము డొక డాసీనుడై చేత గల అంకుశముతో నా గజమును పొడుచుచున్నట్లు, వాని ప్రక్కన ఛత్ర, చామరములు ధరించిన సేవకుడును చిత్రించబడిరి శాసనములో మహాసేనాపతి, అమిత్రజనదర్పదమనుడు, కుహస్తిగ్రాహకుడు, కులహాక కులోద్భవుడగు చాంతపులుని ఛాయాస్తంభ మని యున్నది. 'కులహాక' కులమును గూర్చి నాగార్జున కొండలో నితర శాసనములలో గూడ గలదు. పై శిల్పములో చిత్రించిన సార్వభౌముడే ఈ కులహాక చాంతపులు డనుకొనవచ్చును. ఈ శాసనములో కాలము లేదు; దీని లిపి, భాషయు ఇక్ష్వాక శాసనముల కంటె ప్రాచీనముగ గన్పట్టు చున్నవి ఈ చాంతపులుడు కులహాక కులోద్భవుడగుటచే మొదటి ఇక్ష్వాక రాజైన చాంతమూలుని కంటె భిన్న వ్యక్తి కావలెను. మహాసేనాపతి, అమిత్రజన దర్పదమనుడు, కుహస్తిగ్రాహకు డనుటచే బహుశ ఏదైన యుద్ధములో మరణించి యుండును. ఇక్ష్వాక రాజుల స్వాతంత్ర్య సమరములో పాల్గొనిన సామంతరాజు కావచ్చును. వీనికి ఇక్ష్వాక చాంతమూలున కేమైన సంబంధ బాంధవ్యము గలదేమో తెలియదు.

ఈ సందర్భమున మరికొన్ని చిన్న శాసనములను గూర్చి తెలుపవలసి యున్నది ఆ శాసనములు గల శిలాస్తంభములపై సాయుధులైన యోధులు, యుద్ధరంగము మున్నగు శిల్పములు చిత్రించబడి యున్నవి. ఇవి యన్నియు ప్రాకృత భాషలో గల చిన్న శాసనములు, ఒకేచోట గలవు. అన్నిట 'భడణం పడితనం ఛాయాథబో' (భటానాం పతితానాం ఛాయా స్తంభో' అని యున్నది దీనినిబట్టి అవి యన్నియు యుద్ధములో మరణించిన ఆ భటుల జ్ఞాపకార్థము యెత్తించబడిన ఛాయాస్తంభములని దెలియుచున్నది చాలమంది భటులకు ఒకే ఛాయా స్తంభము, అందు వారందరి పేర్లను బేర్కొనుటకు బదులు వారిలో ముఖ్యుని పేరు మాత్రమే శాసనములలో గలదు శాసనములపైన గల చిత్రములలో మృతి నొందిన భటులు చిత్రించబడిరి ఇందు చాలమంది 'మగలరణ' (మంగలారణ్య) వాస్తవ్యులట ఈ 'మగలరణ' మెచ్చటిదో గుర్తించ వీలు లేకున్నది. ఒక దానిలో 'పెర్మాడి భటుడు' పేర్కొన బడినాడు చాళుక్య విక్రమాదిత్యుడు, తదుపరి తూర్పు గాంగవంశజుల శాసనములలో 'గంగ పెర్మాడి' అని బిరుదములు గాన్పించును కాని నాగార్జునకొండ శాసనములలో నింత ప్రాచీన కాలమున 'పెర్మాడి' శబ్ద ముండుట చాల విశేషము వీరు ఏ యుద్ధములలో మరణించిరి, రా జెవ్వ రను విషయము లేమియు తెలియవు బహుశ ఈ శాసనము లన్నియు పడియుండిన స్థలమే రణరంగము. వారందరు ఇక్ష్వాక రాజుల తరఫున ప్రాణము లర్పించి యుండవచ్చును ఇవి యన్నియు వీరగల్లు (Hero stone) లనుట కెట్టి సందియమును లేదు ఇట్లు క్రీస్తు శకము మూడు, నాలుగు శతాబ్దములనే ఆంధ్ర దేశమున ఇక్ష్వాకు రాజుల కాలమున వీరగల్లులు గాన్పించుట మిక్కిలి విశేషమని చెప్పవలెను

ఇటీవల నాగార్జున కొండలో దొరకిన శాసనము లన్నిటిలో కడు ముఖ్యమైనది ఆభీరవసుషేణుని ముప్పదియవ రాజ్యకాలము నాటి శాసనము. ఈశాన్యముగ కృష్ణానది యొడ్డున మధ్య యుగమునకు చెందిన కొన్ని శిథిలములను తొలగించి లోపలి ఇక్ష్వాక కట్టడముల కొరకై త్రవ్వుచుండగా నిది బయల్పడినది దీనితోబాటు రెండు శంఖములు, పెద్ద బంగారపు రేకు గూడ దొరికినవి ఒక శంఖముపై 'అరభుజసామిస' (అష్టభుజ స్వామిన) అనియు, రెండవదానిపై 'దచ్చిన కనసర' అని పేర్లు చెక్కబడి యున్నవి మొదటి శంఖమునందు పీఠముపైన కాడతో గూడిన చక్రము, దాని ప్రక్కన అంకుశచ్ఛత్రములు గలవు శంఖముమీద, శాసనములోను అష్టభుజస్వామి పేర్కొనుటను బట్టి యివి పడియుండిన స్థలము అష్టభుజస్వామి ఆలయమని స్పష్టము. బంగారపు రేకున భక్తు డొకడు అంజలి

ఘటించి నిలుచుండిన ట్లున్నది అతడు అష్టభుజస్వామికి ఆ రేకును దాన మిచ్చిన వ్యక్తి కావచ్చును.

దీని లిపి సరిగా ఇక్ష్వాక రాజుల శాసనలిపినే బోలి యున్నది. భాష సంస్కృతము. ప్రాకృత ప్రభావము కూడ కొంత గలదు. ఆఖరున ఉపజాతి వృత్తములో చిన్న శ్లోక మున్నది 'నమో భగవతో దేవ పరమ దేవస్య పురాణ పురుషస్య నారాయణస్య' అని శాసన మారంభించ బడినది నారాయణుడే దేవదేవుడు, పురాణపురుషు డనుటలో నతి ప్రాచీనమైన శాసన ప్రామాణ్యమిదియే యని చెప్పవలెను తదుపరికాలము, రాజైన వాసిష్ఠీపుత్ర అభీర వసుషేణుని ముప్పదియవ రాజ్యకాలమని యున్నది నాగార్జున కొండలో దొరకిన తదితర శాసనము లన్నిట ఇక్ష్వాకరాజుల రాజ్య కాలమే పేర్కొనబడినది. ఇది యొక్కటి మాత్రము అభీర వసుషేణుని రాజ్య కాలములో నుండుట గమనించదగినది

శాసనములో మహాగ్రామిక, మహాతలవర, మహాచండనాయక, కౌశికస గోత్ర, పెరిబిదేహ శివసేపునిచేత, సంజయపురి యవనరాజులచేత, అవన్తికశక రుద్రదామునిచేత, వనవాసక విష్ణు రుద్రశివ లానంద శాతకర్ణి చేతను యుధాస్థానముననే ఈ భగవంతుడైన రుంబరభవ (ఉదుంబరభవ) అష్టభుజస్వామి శ్వేతగిరియందు స్థాపించబడెను మరియు ప్రాకారము కల్పించబడి, మహానందా అనువాపి యొకటి, శ్వేతగిరి, ముడేరాయుల రెండింటియందు రెండు తటాకములు, తాళవనము మున్నగునవి ప్రతిష్ఠించబడినవి. ఆంధ్రదేశమున కూప, తటాక, వనప్రతిష్ఠ లింత ప్రాచీన కాలమున శాసనములలో పేర్కొనబడి యుండుట చాల వింతగ నున్నది ఇట్టి శాసనమున నిక్ష్వాకరా జెవ్వడును గాక అభీరవసుషేణుడు మరి నల్వురు ఇతర దేశపు రాజులతో పేర్కొనబడి యుండుటచే నాత డా ప్రాంతమును జయించి తన విజయచిహ్నముగ దన సామంతు లందరితోడ నీ అష్టభుజస్వామిని ప్రతిష్ఠించి యుండును.

మొదటివాడగు శివసేపుడు మహాగ్రామిక, మహాతలవర, మహాదండనాయకు డనుటచే తొలుత నీతడు ఇక్ష్వాకరాజుల కొలువులో నుండెడివా డనియు, తర్వాత అభీరుని చేరియుండుననియు తోచును ఈతడు కౌశిక గోత్రుడు, పెరిబిదేహకులజుడట. క్రీస్తుశకము పది, పదునొకండవ శతాబ్దములలో సరిగా నీ ప్రాంతమునే పరిపాలించిన పరిచ్ఛేదులకు, నీ పరిబిదేహులకు నేమైన సంబంధ ముండునేమో ! ఎట్లయిన నీత డాంధ్ర దేశీయుడని తెలియుచున్నది. పేరును బట్టి ఈతడు శైవు డయ్యు వైష్ణవ విగ్రహ ప్రతిష్ఠలో సహకరించుట వింతగ నున్నది

రెండవవారు సంజయపుర యవన రాజులు. సంజయపురము ప్రస్తుతము బొంబాయి రాష్ట్రములోని ఠాణాజిల్లాలోని 'సంజాన్' కావచ్చును. మహాభారతము సహదేవుని దిగ్విజయ సందర్భమున 'నగరీం సంజయంతీంచ పాషండం కరహాటకం' అని బహుశః ఈ సంజయ 'నగరము' లేక 'పురి' ని గూర్చియే తెల్పియుండును. ప్రస్తుత శాసనమును బట్టి ఆ కాలమున యవనులు (ఇండో—గ్రీకులు) ఆ ప్రాంతమును పరిపాలించెడివారని స్పష్ట మగుచున్నది కాళిదాసు రఘువంశములో రఘు మహారాజు దక్షిణదేశ దిగ్విజయ సందర్భమున

'యవనీ ముఖ పద్మానాం సేహే మధు మదం న సః'
బాలాతప మివాబ్జానా మకాల జలదోదయ ''

అని ఈ యవనులను గూర్చియే తెల్పియుండవలెను.

మూడవవాడు అవన్తిపుర శకరుద్రదాముడు. అవంతీనగర మనగా పశ్చిమ మాళ్వ దేశములోని ఉజ్జయినీ నగరము, తత్ప్రాంతము ఆ కాలమున దానిని పాలించినవారిలో రుద్రదామ నామధేయు లిరువురు గలరు అందీతడు రెండవవాడు కావచ్చును. ఇక్ష్వాక వీరపురుషదత్త, ఏహువల చాంతమూలుల రాణు లిరువురు ఈ మహాక్షత్రపుల యింటి బిడ్డలే

నాల్గవవాడు వనవాసక విష్ణు రుద్ర శివలానంద శాతకర్ణి ప్రస్తుత ఉత్తర కనరా జిల్లాలోని 'బనవాసి' యే పూర్వపు వనవాసి వీరపురుషదత్తుని కుమార్తె 'కొడబలిసిరి' వనవాస మహారాజు మహాదేవి యని గలదు.

ఆఖరున భారద్వాజస గోత్రుడు, అమాత్య తిష్యశర్మను గూర్చి గలదు. అతడు విప్రులకొరకు, మిత్రులకొరకు ప్రాణములను గూడ లెక్కించనివాడనియు, సర్వాతిథి, సర్వసఖుడు, కృతజ్ఞుడు, సత్యవ్రతుడు, శత్రుగణావమర్ది, ఋజువర్తనుడు, ధార్మికుడు, సాధుజనాభినంది యని వర్ణించబడెను.

సర్వాతిథి సర్వసఖ కృతజ్ఞ సత్యవ్రత శత్రుగణావమర్ది,
ఋజార్వట న్యాసన ప్రేమ ని ష్ఠో యో ధార్మిక సాధుజనాభినందీ.

"స్వస్తి గోవ్రాతేభ్య"—అని ఈ శాసనము ముగియుచున్నది. వైదిక మతము, ముఖ్యముగ వైష్ణవమునకు సంబంధించిన శాసనములలో నిట్లు "స్వస్త్యస్తు గోబ్రాహ్మణ పురోగాభ్యా సర్వ ప్రజాభ్య, స్వస్త్యస్తు గోబ్రాహ్మణ లేఖక వాచక శ్రోత్రిభ్య"—అని యుండుట సహజము

అభీరవసుషేణుని శాసన మింతవర కుపలబ్ధమైన దిది యొక్కటియే. ఇదియు నాగార్జున కొండలోని నిక్ష్వాకురాజుల కాలమునాటి దగుటయే దీని ప్రాముఖ్యము ఇనుమడించినది దీనినిబట్టి నాగార్జున కొండలో అభీర రాజు పాలనము కొంతకాల ముండెనని మొట్టమొదటిసారి తెలియవచ్చెను. ఆభీర రాజైన మాఠరీపుత్ర ఈశ్వరసేనుని తొమ్మిదవ రాజ్య సంవత్సరము నాటి శాసన మొకటి నాసికలో దొరికినది ఆ శాసనమును బట్టి వా రా ప్రాంతమును పాలించు చుండినట్లు విశద మగుచున్నది ఈ ఆభీరవసుషేణుడు అతని సంతతివాడు, నాసిక ప్రాంతమువాడు కావచ్చును వసుషేణుడు తన ఇరుగుపొరుగువారగు సంజయపురి, అవన్తిక, వనవాసకరాజుల సహాయముతోడ నిక్ష్వాక రాజధానిపై దండెత్తి వశపరచుకొని యుండును కాని పైన జూపినట్లు ఇక్ష్వాకరాజులకు ఉజ్జయిని మహాక్షత్రపులతోడను, వనవాసి రాజులతోడను సంబంధబాంధవ్యములు గలవు అట్లయిన వీరందరు అభీరునితో గూడ తమ తమ స్నేహ బంధుత్వములను బురస్కరించుకొనియే నాగార్జునకొండ యాత్రార్థము వచ్చి యుండకూడదా అని శంకించ వీలున్నది శాసనములో ఇక్ష్వాక రాజుపేరు లేకుండుట, ఆభీర రాజ్య సంవత్సరములో కాల ముండుటనుబట్టి ఆ యూహ పొసగకున్నది. లేక ఇక్ష్వాకరాజులు తమ ఆధిపత్యమునకై కాంచీపుర పల్లవులతో పోరాడు తరుణము జూచుకొని అభీరుడు తన పొరుగురాజు లందరి సహాయము బడసి ఇక్ష్వాక రాజధాని యగు విజయపురిని ముట్టడించి తాత్కాలికముగ వశపరచుకొనెనేమో తెలియదు భావి పరిశోధనఫలితమున గాని యీ విషయమున నిదమిత్థమని నిర్ణయింప వీలుకాదు

ఈ ఆభీర వసుషేణుని శాసనమును, ఇక్ష్వాక రాజులగు వీరపురుషదత్త, ఏహువల చాంతమూలుల 'సంవచ్ఛరం విజయం' అని పేర్కొనబడిన రెండు శాసనములను బట్టి సుప్రసిద్ధ చారిత్రకులగు డాక్టర్ డి సి. సర్కారుగారు నూతన సిద్ధాంతము నొకదాని నాపాదించుచున్నారు దాని సారాంశ మిది "దక్కనునకు పశ్చిమోత్తరముగా గల త్రైకూటక, కలచుర్య మున్నగు రాజ వంశజుల శాసనము లన్నిట కాన్పించు రాజ్యకాలము ఆభీర రాజైన శివదత్తుని పుత్రుడగు మాఠరీపుత్ర ఈశ్వరసేనునిచే నారంభించబడిన ఆభీరశకమే అది క్రీస్తు శకము 248 లో ప్రారంభించబడినది ఈశ్వరసేనుని సంతతివాడు, ఆ ప్రాంతమునుండి దండెత్తి వచ్చిన ఆభీర వసుషేణుడు అచ్చటి వాడుకప్రకారము తన నాగార్జునకొండ శాసనములో గూడ ఆభీరశకమునే పేర్కొని యుండును అట్లయిన నాతని నాగార్జునకొండ శాసనము క్రీస్తుశకము 278—279 నాటి దగును.

"కృష్ణా గుంటూరు ప్రాంతమును శాతవాహనులు క్రీస్తుశకము మూడవ శతాబ్దపు మొదటి పాదమున పరిపాలించుచుండినట్లు తదుపరి ఇక్ష్వాక రాజు లా ప్రాంతమునకు స్వతంత్రు లైనట్లు తెలిసిన విషయమే. ఉపలబ్ధమైన ఇక్ష్వాక శాసనములను బట్టి నల్గురు రాజులు మాత్ర మా వంశమున వరుసగా పాలించినట్లు దెలియుచున్నది ఇప్పటికి దొరికిన వారివారి ఆఖరి రాజ్య సంవత్సరపు శాసనములను బట్టి రెండవవాడగు వీరపురుషదత్తుడు అధమ మిరువది సంవత్సరములు, అతని పుత్రుడు ఏహువల చాంతమూలుడు ఇరువది నాలుగు సంవత్సరములు, అతని పుత్రుడగు రుద్రపురుషదత్తుడు

పదకొండు సంవత్సరములును కనీసము రాజ్య మేలినట్లు విదిత మగుచున్నది. మొదటివాడగు చాంతమూలుని శాసనము లేమియు నింతవరకు బయల్పడ లేదు కాని పై ఆతని సంతతివారి శాసనములనుబట్టి అతడు దీర్ఘ కాలము పాలించి యుండవలెనని తోచుచున్నది.


"వీరపురుషదత్త, ఏహువల చాంతమూలుల శాసనములలో పేర్కొన బడిన 'సంవచ్ఛరం విజయం' అనునది దక్షిణ దేశమున వాడుకలో నుండు ప్రభవాది సంవత్సరములలోని 'విజయ' సంవత్సరమే గాని వేరొకటి గాదు ఇంత ప్రాచీనకాలమున 'విజయ' సంవత్సరమని యుండుట తదుపరి మరి ఏ ఇతర శాసనములలో కాన్పించకుండుట వింత గాకపోదు మరియు నీ రెండు శాసనములను 'విజయ' సంవత్సర మొకటియే దప్ప మరి యే యితర సంవత్సరము పేర్కొన కుండుటకు కారణ మేమై యుండును? వరాహమిహిరుని సిద్ధాంత ప్రకారము కలియుగము 'విజయ' సంవత్సర ముతో నారంభించ బడినది కావున విజయ సంవత్సరములో లిఖించబడిన వగుటచే నీ రెండు శాసనములను ఇక్ష్వాక రాజ్యపాలన సంవత్సరమునకు బదులు 'విజయ' సంవత్సరమని పేర్కొనబడి యుండును బాదామి చాళుక్య మంగళేశుని క్రీస్తుశకము 602—603 నాటి మహాకూటస్తంభ శాసన మున సిద్ధార్థి సంవత్సరము గలదు ప్రభవాది సంవత్సరములలో నొకదానిని పేర్కొనిన ప్రాచీనశాసన మింతవరకు నిదియే యని చరిత్రకారులు తలంచిరి ఇప్పు డీ రెండు ఇక్ష్వాక శాసనములను బట్టి క్రీస్తుశకము మూడు, నాలుగు శతాబ్దములలోనే ఆంధ్రదేశమున ప్రభవాది సంవత్సరములు వాడు కలో నుండినట్లు విశద మగుచున్నది

"వీరపురుషదత్తుడు సుమారు క్రీస్తు శకము మూడవ శతాబ్ది రెండవ పాదమున నుండుటచే ఆతని కాలమున విజయ సంవత్సరము క్రీ శ 273—274 నకును, ఆతని తర్వాత రాజ్యమునకు వచ్చిన ఆతని పుత్రు డగు ఏహువల చాంతమూలుని కాలమునాటి విజయ సంవత్సరము క్రీ శ 333—34 నకు సరిగా సరిపోవును కాని వీ రిద్దరికి గల యంతరము చాల యుండుటచే క్రీ శ 333—34 చాంతమూలుని ఆఖరి రాజ్య సంవత్స రములు కావచ్చును ఈతని తర్వాత ఈతని పుత్రుడగు రుద్రపురుష దత్తుడు పదునొకండు సంవత్సరములకు పైగా పరిపాలించుటచే అధమ మిక్ష్వాకు సామ్రాజ్యము క్రీస్తు శకము 350 వరకును గలదని చెప్ప వచ్చును పై మూడు శాసనములను బట్టి ఇక్ష్వాక రాజుల కాలనిర్ణ యము స్థూలముగ నిట్లు చేయగలము మొదటి చాంతమూలుడు క్రీస్తు శకము 225—250 వరకు, ఆతని పుత్రుడు వీరపురుషదత్తుడు క్రీ శ 250—75 వరకు, తదుపరి క్రీ శ 275—85 వరకు ఆభీర పాలనము, మరల క్రీ శ 285—334 ఇక్ష్వాక ఏహువల చాంతమూలుడు, క్రీ శ 334—345 ప్రాంతము వరకు రుద్రపురుషదత్తుడు పరిపాలించి యుండ వలెను" డాక్టర్ సర్కారుగారి ఈ సిద్ధాంతములోని యథార్థము భావి పరి శోధన ఫలితమున గాని నిర్ధారణ కాజాలదు

అనేక శాసనములలో ఆవేసిక మూలభూతి, ప్రావారిక కొడబుధి, పావక ముఖ్యుడు, వేశ్య కుసుమలతా మున్నగువారు చాలామంది గలరు వీ రందరూ ఇక్ష్వాక రాజుల కొలువులోనివారై యుందురు

దక్షిణముగ చలువరాతి స్తంభములతో నిర్మింపబడిన ముఖ మంటపమును, ఇటికతో గజపృష్ఠాకృతిని బోలు మూడు ఆలయములు గల దేవాయతన మొకటి బయల్పడినది ఈ యాలయ స్తంభముల మీద శంఖలిపి (Shell characters) తో చెక్కబడిన కొన్ని శాసనములు గలవు ఇట్టివి ఆంధ్ర దేశమున ఘంటశాల, జగ్గయ్యపేట, శాలిహుండము, ఏలేశ్వరములను, ఒరిస్సాలోని సీతాభింజ్, బొంబాయి రాష్ట్రములోని అజంతా, బీహారులోని బొంగాంగా మున్నగు ననేక ప్రదేశముల గలవు ఈ శాసనములలో నేమి గలదో నింకను యెవ్వరికిని దెలియదు బహుశ యాత్రికుల శాసన ములు కావచ్చునని తలంచుచున్నారు. దీనినిగూర్చి ఇంకను పరిశోధనలు జరుగవలసి యున్నది.

ఈ త్రవ్వకముల ఫలితముగ నాగార్జున కొండ లోయలో మొత్తము నాలుగు ప్రాకారపు కోటగోడలు కన్పడినవి మొదటిది తూర్పుగా ప్రస్తు తము మాచెర్లకు పోవు బాటలో లోయ ప్రారంభముననే గలదు ఇది ఇక్ష్వాక రాజధానీ నగరపు మొదటి ప్రాకారపు గోడ కావచ్చును. రెండవది రాజధాని విజయపురి చుట్టును గలదు ఇదియే ప్రధాన గిరిదుర్గము. దీని లోపలనే ఇక్ష్వాక రాజభవనములు, అశ్వమేధ యజ్ఞశాలలు, సైన్యము, దాసదాసీజనములు, సామాన్యప్రజలు నివసించుటకు గృహములు మున్నగున వన్నియు నున్నవి ఈ దుర్గమునకు తూర్పు పశ్చిమములకు రెండు ప్రధాన ద్వారములు, ఉత్తరముగ చిన్న రహస్యద్వార మొకటి యున్నవి. రహస్య ద్వారము యుద్ధ సమయములలో ఆత్మరక్షణార్థ ముపయోగించెడిది కావ చ్చును దుర్గము చుట్టును గల ప్రాకారపు గోడ రెండంతస్థులలో కట్ట బడినది మొదటిది పునాది వంటిది మట్టితోను, రెండవది సుమారు పదకొండు అడుగుల వెడల్పు గలిగి చక్కని ఇటిలతో కట్టబడినది ఈ



నాగార్జునకొండ ప్రాంతంలో త్రవ్వకాలు జరుగుతున్న ప్రదేశం

ఇటికగోడ నంటిపెట్టుకొని లోపల మరియొక చిన్న పిట్టగోడ దానిని సంరక్షించుట కున్నది మూడవ ప్రాకారపు కోట గోడ సిద్ధల్‌ధారి కొండపై నున్నది ఇదియు నిక్ష్వాక రాజుల కాలమునాటిదే నాల్గవ కోట మధ్యయుగమునకు సంబంధించినది, ప్రస్తుతము నాగార్జునుని గుట్టపై గలదు ఇది ఆరు ద్వారములు గల్గి మూడు పెద్ద భాగములుగ విభజింపబడినది ద్వారములనుండి క్రిందికి దిగుటకు సోపానములు మున్నగువాటితో కోట బాగుగా సంరక్షించబడి యున్నది ఇదియే కాకతి గణపతిదేవుని దుర్గి శాసనములలో 'నాగార్జునకోట' అని వ్యవహరించబడి నది, తదుపరి విజయనగర శ్రీ కృష్ణదేవరాయలచే భేదింపబడిన గిరిదుర్గము.

ఇక్ష్వాక రాజధాని విజయపురి ద్వితీయ ప్రాకారము లోపల తూర్పు ద్వారము వద్దను సైన్య ముండు స్థలము, గజాశ్వాది శాలలు, కృష్ణానదీ తీరమువైపు పశ్చిమ ద్వారమునకు సమీపమున అశ్వమేధాది యజ్ఞశాలలు, ఉత్తరముగా రహస్య ద్వారముగలవైపు ఇక్ష్వాక రాజభవనములు, పశ్చి మోత్తరముగా రాజ భవనములనుండి పెద్ద వెడల్పయిన ఇటిక గోడతో వేరుచేయబడిన దాస, దాసీజన, తదితర సామాన్యప్రజల గృహములు గలవు సామాన్య ప్రజల గృహము లన్నియు నొక వరండా, లోపలికి త్రోవ మూడు గదులతో నున్నవి ఈ భాగమున 25, 15, 8 అడుగుల వెడల్పు వరుసగా గల వీధులు, సందులు, గొందులు గలవు చాల గృహములలో వస్తువులు నిలువజేయుట కుపయోగించు పెద్ద పెద్ద జాడీలు దొరికి నవి ఒక గృహమున మట్టి మూసలు, ఇనుపకారు, శ్రావణము, మట్టివి, రాళ్లవి తూకపు రాళ్లు, గాజులు, కర్ణాభరణములు, వివిధ ఆభరణములు

చేయుట కనువగు మట్టిమూసలు మున్నగునవి బయల్పడినవి వీనినిబట్టి అది నాటి బంగారపుపనివాని గృహ మని గుర్తించబడినది అట్లే మరి యొక గృహమున పెద్ద పెద్ద జాడీల వరుస, చిన్న చిన్న పెక్కు రకము లైన కొలపాత్రలనుబట్టి అది వైశ్యుని గృహము లేదా అంగడి కావచ్చు నని తోచుచున్నది, అట్లే పేర్చి యుంచిన పాలరాతి పలకలు, వేర్వేరు శిలల యొక్క చెక్కడములు, అందలి పనిముట్లు మున్నగువానినిబట్టి అది శిల్పి కర్మాగారమని గుర్తించిరి

కృష్ణానదీతీరమువైపు కోటలో పశ్చిమభాగమున అశ్వమేధ యాగశాల, దానికి సంబంధించిన కూర్మాకారపు హోమగుండము, ఆహ వనీయాగ్ని కుపయోగించు కట్టడములు, అవభృథస్నానఘట్టములు, స్నానఘట్టమునుండి పోవు కాలువలు, ఉపసంవేశన స్థలము, యజ్ఞోప కరణముల నుంచు గృహము మున్నగు వైదిక కర్మకాండమున కనువగు నిర్మాణము లన్నియు గలవు వీ వన్నింటిలో అవభృథస్నానఘట్టము పెద్దది ఇది ఇరువది యేడడుగుల పొడవు వెడల్పు గల్గి చతురస్రముగ చిన్న కృత్రిమ సరస్సు వలె గాన్పించును నాలుగుదిశలనుండి, మధ్య గల పర్యవేక్షణ వేదిక ఇరువైపులనుండియు కూడ లోనికి దిగుటకు చక్కని మెట్లు గలవు దీనికి వాయువ్యముగ ఆరడుగుల ఎత్తున సరిగా పురుషప్రమాణమునకు నాపరాతితో తొలువబడిన తూము యొక టున్నది. యజమానులు స్నానము చేయుటకు వెచ్చగు జలము దీనిద్వారా బయటకు నదిలోనికిపోవును. అశ్వమును భూస్థాపన చేసిన ప్రదేశము కూర్మాకారపు హోమగుండమునకు దక్షిణముగ సుమారు ముప్పది యడుగుల దూరమున నున్నది అశ్వాస్థిపంజరమునకు దిగువను రెండు, మూడు మెట్లు గలవు. ఇవి పర్యవేక్షణవేదికగా నుప యోగించెడివి కావచ్చును. అశ్వాస్థిపంజరము విచిత్రాకృతిలో యెముకలట్లే గోడ కంటిపెట్టుకొని యున్నవి. ఆ ప్రదేశమున నింకను పలు రకములగు జంతువుల విచ్ఛిన్నమైన ఎముకలు గలవు దీనినిబట్టి అశ్వముతోబాటు పలురకము లైన జంతువులను గూడ భూస్థాపితము జేసియుండవచ్చునని తలంచ వీలున్నది. ఈ యాగమును చేసిన ప్రదేశ మంతయు బూడిద, కాలిన మేకులు, ఇనుపకత్తులు, చిన్న చిన్న పిడతలు, పలురకములైన పెంకు ముక్కలు మున్నగువానితో నిండియున్నది

స్థానికముగ ఫిరంగుల బోడని పిలువబడు గుట్ట ననుసరించి దిగువ త్రవ్విన త్రవ్వకములలో సుమారు 56 అడుగుల పొడవునను, 48 అడు గుల వెడల్పును గల్గి దీర్ఘచతురస్రాకారములో నొక ప్రాంగణము ప్రేక్ష కులు లేదా శ్రోతలు కూర్చుండుటకు వీలుగా నాలుగువైపుల నంతరు వులుగ నమర్చిన ఆసనముల యేర్పాటు గల్గినది బయటపడినది మత విష యాది ఉపన్యాస సమయములలో విద్యార్థులు, తదితర ప్రజలు సమావేశ మగు సభారంగ మిది కావచ్చును దీనికి నైఋతిమూలన నున్నతమైన శిలాపీఠ మొకటి ప్రధానవక్త లేదా సంఘారామములను సందర్శించ వచ్చిన గౌరవనీయ వ్యక్తుల నిమిత్తము యేర్పాటుచేయబడి యున్నది. ఇయ్యది ఆచ్ఛాదితము గాకయుండుటచే నిందు వర్షించిన జలము బయ టకు పోవుటకు గాను పెద్ద తూము గలదు ఈ దీర్ఘచతురస్ర ప్రాంగణ మధ్యమున నొక గుండ్రని స్తంభ సదృశ వేదిక యున్నది ఇది వక్త నిల బడి సభికుల కుపన్యసించునది గావచ్చును ఇందలి విశేష మేమన దీని మీదు నుండి వక్త ఉపన్యసించిన నాతని కంఠధ్వని సుమారు రెండు వందల అడుగుల దూరమును మించి సుస్పష్టముగ వినబడును మరియు ఎసన పంక్తి అంతకంత కెక్కువగు చున్న కొలది ఆతని ధ్వని మరింత స్పష్టము, స్పష్టతరము నగుచుండును తన కౌశలమునకుతోడు స్వాభావికమైన ఆ లోయ చుట్టుపట్ల పరిసరముల ఆధారమున తద్రంగ స్థల నిర్మాత యీ యద్భుత విషయమును సాధించగల్గెను

కృష్ణానదీతీర ప్రదేశమున సుమారు 346 అడుగుల పొడవును 32_2 అడుగుల వెడల్పును గల దీర్ఘ చతురస్రాకారమున నాలుగు వైపుల సోపాన

పంక్తుల వరున గల్గిన మరియొక పెద్ద పభారంగము వంటిది బయల్పడి నది దీని నిర్మాణము చూడ చాల సొంపుగ నున్నది. పశ్చిమదిశ నున్న సోపాన పంక్తుల మధ్యన యెత్తయిన మండపము వంటి దొకటి గలదు. ఇది ప్రాయశ చక్రవర్తి, తదితర ప్రముఖ రాజకీయోద్యోగులు, రాణివాసపు స్త్రీలు కూర్చుని వినోదములను తిలకించుటకు ప్రత్యేకించ బడినది కావచ్చును.

అన్నిటికంటె ముఖ్యమైనది ముప్పది అడుగుల వెడల్పు అరడుగుల లోతు గల్గి తూర్పు పశ్చిమములుగా దుర్గ ప్రాకారమున కావల సుమారు వెయ్యి అడుగుల పొడవు గల కాలువ కాన్పించినది ఇది బహుశ కొండల మీద వర్షించిన నీరు రాజధాని విజయపురిని ముంచివేయకుండ ఈ పెద్ద కాలువ ద్వారా కృష్ణానది లోనికి మళ్లించుటకు కావచ్చును.

దక్షిణముగా రెండు ఫర్లాంగుల దూరమున మరియొక స్తంభాలంకృత భవనము, శిలా విగ్రహములు, మొండెములు, కార్తికేయ విగ్రహము, శిరస్సు మున్నగునవి చాల దొరికినవి వీనిలో ఒక యడుగు పది అంగుళముల ఎత్తుత సమభంగములో నిలుచుండియున్న కార్తికేయ విగ్రహ మొకటి గలదు నదీతీర ప్రదేశమున కార్తికేయ ఆలయములు, విగ్రహములు విస్తారముగను, దుర్గా ప్రాకారములోపల గూడ కొన్ని కార్తికేయాలయములు మున్నగునవి గాన్పించుటచే నిక్ష్వాకుల కాలమున కార్తికేయారాధనము విశేషముగ నుండెడిదనియు, వారి శాసనములలో 'కార్తికేయ ప్రసాదాత్' అని 'విరూపాక్షపతి మహాసేన పరిగృహీత' అని యుండుటబట్టి ఇక్ష్వాక రాజులకు కార్తికేయస్వామి ముఖ్య దైవమని తలంచవచ్చును చలువ రాతిపై సమ భంగములో నిలుచుండిన, కుడి చేతిలో త్రిశూలము, కట్యవలంబిత వామహస్తమున ఖడ్గమును ధరించిన స్త్రీమూర్తి యొకటి చెక్కబడి యున్నది. ఆ విగ్రహమునకు కంఠాభరణములు, మేఖల మున్నగు వానికి తోడు ఛత్రము, మయూర ధ్వజము గలవు వీనిని బట్టి ఆమె కుమారస్వామి శక్తియగు 'కౌమారి' యని గుర్తించవచ్చును ఇదిగాక మరి కొన్ని దేవీ విగ్రహములు, మొండెములు కూడ దొరికినవి ఫిరంగుల బోడు గుట్ట మీద ముందునకు హారీతీ దేవాలయ మొకటి గలదు ఇక్ష్వాకుల తర్వాత కొంత కాలమునకు రాజ్యమునకు వచ్చిన చాళుక్యులు తమ శాసనము లన్నిటిలో 'హారీతి పుత్రాణాం, మాతృగణ పరిపాలితానాం, స్వామి మహాసేన పాదానుధ్యాతానాం'' అని చెప్పుకొనుటను బట్టి వారికి కూడ కార్తికేయుడే ముఖ్య దైవ మని తెలియు చున్నది చాళుక్యుల శాసనములు కొన్ని నాగార్జున కొండలో దొరకుటను బట్టి వారి తొలి కర్మ రంగము కూడ నాటి విజయపురియే యని స్పష్టము వీరు హారితి, కార్తికేయుడు, సప్త మాతృకలను పూజించుట ఇక్ష్వాక రాజుల నుండియే గ్రహించి యుండవలెను కర్నూలుజిల్లా, కర్నూలు తాలూకా చనగొండ్లలో నగేశ్వరాలయమని ప్రాచీన కార్తికేయాలయ మొకటి గలదు అచ్చటి శాసనమును బట్టి ఆ యాలయము రాష్ట్రకూటుల నాటిదని తెలియుచున్నది గుంటూరు మండలములోని చేబ్రోలు గ్రామములో నొక నాగేశ్వరస్వామి యాలయమున్నది ఇట్లు ఆంధ్రదేశమున నతి ప్రాచీనకాలమున తదుపరి గూడ కార్తికేయారాధన గలదు

కందక ప్రాకారావృతమైన విజయపురి నగరప్రదేశపు పశ్చిమ భాగమున, పశ్చిమోత్తరముగను కృష్ణానదీ తీరమున హారీతి, పుష్పభద్ర, సర్వదేవ, కార్తికేయ, అష్టభుజస్వామి, నొడగేశ్వరస్వామి, నవగ్రహములు మున్నగు ముఖ్య హిందూ దేవాలయము లన్నియు, అంతరాళ, ముఖ మండప, ధ్వజస్తంభాదులతో గూడి గజ పృష్ఠాకారమున నుండి వాస్తు శాస్త్రానుసారముగ సరిగా నిర్మించబడినవి. లోయలో తూర్పు, దక్షిణములకు నదీ తీరమునకు దూరముగ సుమారు ముప్పది బౌద్ధ విహారములు, చైత్య గృహములు, స్తూపములు మున్నగునవి గలవు భారతదేశ మంతటిలో నింతటి విస్తీర్ణమైన బౌద్ధక్షేత్రము మరెచ్చటను గానరాదు రాజకుమార వేషమున, ధనుష్పాణియై, అభంగముగ నిలుచుండిన బుద్ధుని కంచు విగ్రహ మొకటి దొరికినది. ఇది నాటి ఇక్ష్వాకు రాజపుత్రుల వేష, అలంకరణములను గూర్చి తెలుసుకొనుటకు మిక్కిలి ఉపయోగించును

లోయ కుత్తరపు వైపున శ్మశాన వాటిక, బహుశః ఇక్ష్వాకు రాజులదే కావచ్చును. యొకటి బయల్పడినది. ఇది మూడు విభాగములుగ నున్నది. మొదటి భాగము పెద్ద పెద్ద స్తంభములతో గూడిన గదులు, కూర్చుండుటకు వీలుగా నమర్చబడిన ఆసనములు, మూలలకు బాణ లింగములు నమర్చబడి యున్నవి ఇచ్చటి మండపము వద్ద గల శిల్ప మొక దానిలో స్త్రీ యొకతె నిచ్చెన మీద నుండి అగ్నిలోని కురుకుచున్నట్లు చిత్రించబడినది. ఇది సహగమన మొనరించు దృశ్యము దీనినిబట్టి ఇక్ష్వాకు రాణియో లేక మరి యెవ్వరో యిచ్చట సహగమన మొనరించినట్లు తలంచ నవకాశ మున్నది ఈ మొదటి భాగమునకు కొంచెము ఎత్తులో స్తంభములతో గూడిన గదులతో రెండవ భాగము గలదు ఇచ్చట అంత్యక్రియ లొనరించుట కనువైన పెద్ద పెద్ద కుండలను మోయుచున్న స్త్రీచిత్ర మొకటి చెక్కబడి యున్నది ఈ శిల్పము గూడ పై సహగమన దృశ్యమునకు చెందినదియే ఆంధ్రదేశమున నాగార్జున కొండలో నింత ప్రాచీన కాలమున వీర శిలా ఫలకములు (Hero stones), సతీ శిలాఫలకములు (Sati stones) గూడ చెక్కబడి యుండుట మిక్కిలి విశేషము. మూడవ భాగమున ముందర ధ్వజస్తంభముతో గూడిన శివాలయ మొకటి గలదు. అచ్చటి శాసనమును బట్టి అది ఏహువల చాంతమూలుని కాలము నాటిదని స్పష్టమగు చున్నది

నాగార్జున కొండలోని బౌద్ధ విహారపు స్తూపముల యందలి శిల్ప రచన యపారము. ఈ శిల్పములలో గాంధార, రోమక శిల్ప ప్రభావము గూడ గలదు. ముఖ్యముగ బుద్ధుని జీవిత విషయములకు, జాతక కథలకు, ఇతర జానపద గాథలకును సంబంధించిన చిత్రములు చాల గలవు. ఆయా

కథలను శిల్పి మొదట సంగ్రహ పరచి యందలి వివిధ భాగములను ఏక శిలాఫలకముననే సమకూర్చును ప్రస్తుత కాలమున బాలుర కుపయోగించుటకుగాను ప్రకటించు బొమ్మల కథల వలె నివి యున్నవి బుద్ధుని జీవిత చరిత్ర, ఆతని పూర్వ జన్మలకును సంబంధించిన ఈ కథ లన్నియు జాతకములు, నిదాన కథ, లలిత విస్తరము, మహా వస్తువు, అశ్వఘోషుని బుద్ధ చరిత్ర, సౌందర నందనముల, దివ్యావదానము, దమ్మపదము మీద బుద్ధ ఘోషుని వ్యాఖ్య, సక్కపన్న సుత్తాంత, దీ ఘనికాయ మందలి మహా పరినిబ్బాన సుత్తాంత, దీఘనికాయము మీది సుమంగల విలాసినీ వ్యాఖ్య మున్నగు ప్రాచీన బౌద్ధ గ్రంథముల నుండియే గాక చీనా, సింహళ దేశముల యందు వాడుకలో నుండిన బుద్ధ చరిత్ర నుండియు గ్రహింప బడినవి కొన్ని జంతువులు, పుష్పములను బోలిన రేఖా చిత్రములు గూడ చాల గలవు.

ప్రాచీన వస్తు సామగ్రికి చెందిన మిధునము, వైశ్రవణుడు, హారీతి, కార్తికేయుడు, దేవి, సింహము, ఏనుగు, గుర్రము, వృషభము, నంది, కోతి, మకర కుండలములు, ఉజ్జయిని, స్వస్తిక చిహ్నలు గల మట్టి, గచ్చు బొమ్మలు, వివిధమైన బంగారవు ఆభరణములు, గాజులు, పూసలు, రాగి, ఇనుప వస్తువులు, అనేక నాణెములు దొరికినవి నాణెములలో చాల భాగము శాతవాహన చక్రవర్తులగు పులోమావి, యజ్ఞశాతకర్ణులవి తర్వాత ఇక్ష్వాక రాజులగు చాంతమూల, వీరపురుషదత్తులవి ఇవి యన్నియు సీసపు నాణెములు బంగారు నాణెములు గూడ కొద్దిగా నున్నవి ఇక్ష్వాక శాసనములలో 'దీనారములు', 'దీనార మాష్క' ములని యీ బంగారు నాణెములను గూర్చియే పేర్కొనబడి యుండును కవిసార్వభౌముడగు శ్రీనాథుడు దీనారటంకములను బంగారు నాణెములతో స్వర్ణాభిషేకము నందినట్లు తెలుపుకొనినాడు రోమను చక్రవర్తుల నాణెములు రెండు గలవు వీనిలో నొకటి క్రీ శ 16 నుండి 37 వరకు పాలించిన టైబీరియస్ చక్రవర్తిది రెండవది క్రీ. శ. 141 తర్వాత చలామణికి వచ్చిన రెండవ ఫాస్టినాది మధ్యయుగమునకు చెందిన విజయనగర రెండవ హరిహరరాయుల నాణెము గండభేరుండ చిహ్నముతో గూడిన బహుశ. సాళువ నరసింహరాయుల నాణెము, గోల్కొండ కుతుబ్‌షాహి వంశమునకు సంబంధించిన నాణెములు గూడ కొన్ని దొరకినవి.

చారిత్రకయుగమునాటి ప్రాథమిక నాగరికతకు దోడు ఈ లోయలో ననేక ప్రదేశముల చరిత్రపూర్వయుగపు (Pre-historic) మానవుని శిథిల వస్తువిశేషములు కానవచ్చినవి. ప్రాచీన శిలాయుగపు పనిముట్లు కాలము గడచినకొలది ఏయే దశలలో నెటువంటి మార్పులు పొందుచు వచ్చినవో ఆయారకములన్నియు భూమి యుపరిభాగమున, కృష్ణానది గండ్లలోను దొరుకుచున్నవి. నూతన శిలాయుగపు సాధన సామగ్రి నునుపు చేసిన రాతి గొడ్డళ్ళు, ఉలులు, సూదిగా నుండు నితర రాతి పనిముట్లు, మెరుగు పెట్టిన కుండపెంకులు, శిశువును లోపల పెట్టి స్థాపితము చేసిన యెత్తయిన బాన, రాగిముక్కలు, బంకపూసలు, జంతువుల ఎముకలు, మున్నగునవి బయల్పడినవి. స్థానికముగ ఫిరంగులబోడు, యెద్దన బోడులను గుట్టల దిగువన చిన్న చిన్న శిలాయుగపు పనిముట్లు విశేషముగ దొరుకుటచే బహుశ ఆ పరిశ్రమ యిచ్చట అభివృద్ధిలో నుండెనని యూహించుట కవకాశ మున్నది

ఇచ్చట గాన్పించిన మహాశిలాసమాధులలో రెండు రకములు గలవు. మొదటిది గొయ్యి త్రవ్వి గోతిలో శవపేటిక నుంచు సమాధి రకము. రెండవది పెద్దపెద్ద గుండ్రాళ్లను గుండ్రముగా వలయాకారమున పేర్చిన రకము. దీనిని మనము సామాన్యముగ 'రాక్షసి గుళ్లని' వ్యవహరించెదము. మొదటిరకముధానిలో మట్టితో చేయబడిన పెద్ద శవ పేటికలలో ఆరు, ఏడు కపాలములు, ఇతర మానవాస్థికలు, బయట ఎరుపు, నలుపు గల కుండ సామగ్రి, ఇనుప పనిముట్లు మున్నగునవి లోయలో చాలచోట్ల బయల్పడినవి. ఒకదానిలో సుమారు 42 అంగుళముల పొడవు గల బల్లెము 28 కుండలు గలవు. మరియొకదానిలో సుమారు 5 అడుగుల రెండంగుళముల నిడుపు గల అస్థిపంజరము గలదు. దీనికి పుర్రె ప్రక్కన గుండ్రని బంగారపు కర్ణాభరణములు రెండును, కంఠభాగమున 35 బంగారవు పూసలు, 18 వెండి పూసలును పడియున్నవి. దీనినిబట్టి అది స్త్రీయొక్క సమాధి యని స్పష్టమగుచున్నది ఇట్టి సమాధులు సుమారు పండ్రెండు ఒకే గుంపువలె పైన వివరించిన ఇక్ష్వాకదుర్గమున కాగ్నేయముగ నున్నవి మరికొన్ని లోయలో నచ్చటచ్చట గాన్పించినవి. ఈ లోయ నైసర్గిక స్వరూపము, ముడిసామగ్రి విశేషముగ లభించుట చరిత్ర పూర్వయుగపు మానవుడు నివాసమున కర్హముగ తలంచియుండును.

ఈ లోయకు నాగార్జునకొండ యను పే రెప్పటినుండి వాడుకలో నుండెనో స్పష్టముగ దెలియుటలేదు. సుప్రసిద్ధ బౌద్ధాచార్యుడగు నాగార్జును డిందు నివసించుటను బట్టి దీని కా పేరు వచ్చె ననునది మాత్రము నిశ్చయము ఇక్ష్వాక రాజుల శాసనము లన్నిట నిది శ్రీపర్వతము, విజయపురి యనియే బేర్కొనబడినది కాకతి గణపతిదేవుని శక వర్షములు 1173 విరోధికృత్ (క్రీ శ 1251) సంవత్సరపు పల్నాడు తాలూకా, దుర్గి శాసనములో మొట్టమొదటిసారి 'నాగార్జున కోట' యని పేర్కొనబడినది తదుపరి రెడ్డిరాజులు, విజయనగర శ్రీ కృష్ణదేవరాయల శాసనములలో ననేకముగ 'నాగార్జున కొండ సీమ' అని గలదు బహుశ వెలనాటి చోళుల కాలమున కృష్ణా, గుంటూరు మండలములలో బౌద్ధమతము ప్రబలముగ నుండిన రోజులలో దీనిని సుప్రసిద్ధ నాగార్జునాచార్యుని పేరన 'నాగార్జున కొండ' యని వ్యవహరించియుండురని యూహింప నవకాశ మున్నది

నాగార్జునకొండలో దొరకిన విశేషములను గూర్చి దిఙ్మాత్రముగనే దెల్పితిని అందలి విశేషములనుగూర్చి ప్రత్యేకముగ కొన్ని గ్రంథములనే వ్రాయవచ్చును పై నుదాహరించిన విషయములనుబట్టి ఇప్పటికి సుమారు పదునేడు వందల సంవత్సరములకు పూర్వము ఇక్ష్వాక రాజుల కాలమున ఆంధ్రదేశమున రాజధాని నగర, విశ్వవిద్యాలయ, సభారంగ, సంఘారామ, బౌద్ధవిహార, దేవాలయ, గృహాదికముల నిర్మాణము, హీనయాన, మహాయాన బౌద్ధమతములు, వానికి సంబంధించిన వివిధశాఖలు, శైవ, వైష్ణవ మతములు, సర్వశాస్త్రప్రవీణులగు పండితులు, కవులు, కళాకారులు, వర్తకులు, వీరగల్లులు, సతీశాసనములు మున్నగు నెన్నియో విషయములు మన నాగరికతను వెయ్యినోళ్ల చాటుచున్నవి ఇట్లొకటిన్నర శతాబ్దముల కాలము మన సంస్కృతి, విజ్ఞానముల కాలవాలమై యీ భారత దేశమునకే గాక ఆసియాఖండ మంతటికిని విజ్ఞానభిక్ష పంచి పెట్టిన నాగార్జునకొండ లోయ నేడు లోక కల్యాణార్థము ఆంధ్రదేశమును సస్యశ్యామలము గావించుటకునై కృష్ణవేణమ్మ గర్భమున నంతర్హితము కానున్నది.

"క్షణదభ్ర విలాస చంచలా
నను లక్ష్మీ ఫల మానుషంగికం"

ఈ వ్యాసమును వ్రాయుటకు నాకు శ్రీ టి. ఎన్. రామచంద్రన్‌గారి గ్రంథము, డాక్టర్. డి. సి సర్కారుగారి అమూల్యమైన వ్యాసములు, డాక్టర్ ఆర్ సుబ్రహ్మణ్యముగారి పురాతత్త్వశాఖవారి తరఫున ప్రకటించిన నివేదికలు మిక్కిలి యుపకరించినవి గాన వారికి నా కృతజ్ఞతా వందనములు.

మల్లమదేవి కూతురు

శ్రీ శ్రీరంగం నారాయణబాబు

పాత్రలు

పురుషులు	స్త్రీలు
రంగారావు	మల్లమ్మదేవి
(బొబ్బిలి రాజు)	(బొబ్బిలి రాణి)
	మల్లమ్మదేవి కూతురు
రామారావు	వెంకమాంబ
(సైన్యంలో సైనికుడు)	(దాది)

(చాలాకాలం క్రిందట—అంటే సహాయ నిరాకరణోద్యమం రోజులలో బొబ్బిలి ప్రాంతంలో పర్యటించుట సంభవించినది. ఒకనాడు సాయంత్రం గ్రామాలు పర్యటించి బొబ్బిలి చేరుకుంటున్నాము. బొబ్బిలి వూరు అవతల ఒకానొక స్థలంలో కొంతమంది స్త్రీజనం చేరి దీపాల దగ్గర కూర్చొని బొబ్బిలి కథ పాటగా శ్రావ్య కంఠాలతో పాడుతున్నారు దగ్గిరగా పోయి చూద్దామని మేము ప్రయత్నం చేశాము కాని కొంతమంది పురుషులు మమ్మల్ని వెళ్ళకూడదని నివారించారు అందుకు కారణమేమని మే మడిగాము అందుకు సమాధానంగా వారేమన్నారంటే ఆ దీపాలు వెలుగుతున్న స్థలం మల్లమ్మదేవి కూతురు సమాధని, అక్కడ చేరిన వనితలు, ఈడొచ్చి యవ్వనవతులైన పెండ్లి కాని వెలమ పడుచులని వెలమవారికి ఘోషా వున్నదని అన్నారు పౌర్ణమి నాడు సాయంత్రం మల్లమ్మదేవి కూతురు సమాధిదగ్గర దీపారాధన చేసి, బొబ్బిలి పాటపాడి,మల్లమ్మదేవికూతుర్ని తలుచుకొని ప్రసాదం తింటే పెండ్లికాని పడుచులకు శీఘ్రకాలంలో పెండ్లవుతుందని, యదార్థమని చెప్పారు బొబ్బిలి ప్రాంతాల పల్లెటూళ్లలో కొందరి వృద్ధ ముత్తయిదువుల దగ్గర తెలుసుకున్న కథనే, ఈ నాటక ప్రయోగంకింద వినియోగించాను)

1

(బొబ్బిలి కోటలో జనానాలో రంగారావు, మల్లమ్మదేవి)

మల్ల :—ప్రభూ, మీరు పట్టపగలు జనానాలోకి రావడం యిది రెండవసారి. ఏదో అత్యంత ఆహ్లాదకరమైన విషయమైనా వుండాలి లేదా విషాదకరమైన వార్తయినా వుండాలి వెను కొకమారు మీరు, చిన రంగారావు జన్మవేళలో వచ్చారు; పట్టపగలు—మళ్ళా నేడు మీ దర్శనం కారణం సెలవియ్యండి

రంగా —ఏనాడో నీ వొస్తావని అనుకున్నాను దసరా ఉత్సవాలకైనా రాలేదు. ఉత్సవా లెంతో బాగుగా జరిగాయి నీవు లేకపోవడంనుంచి నా కానందం లేకపోయింది మా బావగారు పాపారాయుడుగారికి స్వస్థత చేకూరిందా ? ధృడంగా వున్నారా ?

మల్ల :—దసరా రోజుల్లో వంట్లో ఏమీ బాగులేకపోవడంనుంచి నన్ను వెళ్ళ వద్దని అన్నయ్యగారు మందలించబట్టే వుండి పోవలసి వచ్చింది. లేకపోతే దసరాకు రాకుండ వుంటానా ? ఉత్సవాలకు రాకుండ వుంటానా ? కాని మా అన్నయ్యగారు మీకొక మాట మనవి చేయమన్నారు.

రంగా :— ఏమిటది ?

మల్ల :— వారు బాగా ఆరోగ్యంగా వుండేవరకు, విజయనగరంవారు దండెత్తి రాకుండా, దౌత్య విధానా లవలంబించియైన, సాధ్యమైనంత కాలాన్ని పొడిగించమన్నారు.

రంగా :— అది దేవునికే తెలియాలి. ఎంతమంది వేగులవారిని పంపినా, విజయనగరంవారి గుట్టు కొంచెమైనా మనకు తెలియలేదు. వారు చాలా అప్రమత్తతతో వున్నారు. దానికేమిగాని, నేను నీతో ఒకప్పుడు వున్న బిడ్డ ఒకడేయైనా, అన్యులను పెంచుకోవద్దని చెప్పలేదా ? నా మాట విన్నావు గాదు.

మల్ల :— పెంచుకుంటే యిపుడొచ్చిన ప్రమాదమేమిటి ? మనకున్నవాడొక్కడు వరప్రసాది. వాడు కూడ అప్పటికి పుట్టలేదు. నా కాడపిల్లలంటే ఎంతో సరదా. ముద్దు ముచ్చటలతో పెంచుదామని, నా పుట్టింటికి చెందినది కదాయని, తలిదండ్రులు లేరని అనాథ బాలిక గదా యని పెంచి పెద్దదాన్ని చేశాను మాన మర్యాదలలో, సౌందర్యంలో విద్యాబుద్ధులలో నన్ను మించినది. రణ కౌశల్యంలో కూడా సాటి లేని మేటి అయింది ఇంతకన్న ఏమి కావాలి ?

రంగా :—పెంచి పెద్దదాన్ని చేసినందుకు నేనేమి అనలేదు. ఆనాడే నీతో ఆడదానికి అస్త్ర శస్త్ర విద్యలు చెప్పించవద్దని, చెవిన్నిల్లుగట్టుకుని చెప్పలేదా ? నా మాట పాటించావు గావు.

మల్ల :—ఇప్పుడొచ్చిన ప్రమాదమేమిటి ? అమ్మాయికి యుద్ధ నైపుణ్యం చెప్పించేందుకు ఒక కారణ ముంది. మా యన్నగారు నాకు ఆహవ నైపుణ్యం నేర్పిద్దామనుకున్నారు. కాని, నా వివాహమవటంచేత, మిమ్ములను వరించుటచేత, నా కోరిక ఫలించలేదు. అందుచేత అమ్మాయికి చెప్పించాను. అమ్మాయిని బోలినవారు యుద్ధ సామర్థ్యంలో ఆడవారిలోనేకాదు, మగవారిలో కూడా మృగ్యం.

రంగా :—నీకు తెలుసునా. వెలమవారికుండే ఘోషా పద్ధతి. పురుషునికంట బడితే మానభంగంకంటె అవమానంగా తలుస్తారని.

మల్ల :—నాకు తెలియకపోతే ఎవరికి తెలుస్తుంది ప్రభూ ? సంప్రదాయానికి, మానాభిమానాలకు వెలమవంగడాన వన్నె కెక్కిన దాన్ని. క్షమించండి అమ్మాయివల్ల ఏదైనా ఆపద సంభవించినదా ?

రంగా :—ఆపదంటే ఆపదకాదు. శిక్షాస్మృతి ప్రకారం ఎంత కఠిన దండనైన చేయవలసిన అవసరం కల్గినది కుటుంబ విషయం, నీకు వ్యధ కలిగించి నేను వ్యధ పడ్డం యిష్టంలేక, కోపాన్ని దిగమింగి, నిండు సభలో అమ్మాయి మారువేషంతో వచ్చినప్పుడు గుర్తించి కూడా ఏమీ తెలియనివానిలా అవజ్ఞతతో సంచరించాను. దానికి కారణం పెంచిన మమత కారణం గదా !

మల్ల :—నాతల తిరిగి పోతున్నది నాకేమీ అవగాహన కాలేదు. అమ్మాయేమిటి? నిండు సభ ఏమిటి ? మారు వేషంతో రావడమేమిటి ? నాకు వేగంగా చెప్పండి. నా హృదయంలో మంటలు రేగుతున్నాయి. వేగం చెప్పండి, జరిగిందేమిటో?

రంగా :—నా నోటితో నేను చెప్పను రాజుగా నాకు చిన్నతనం సంభవించినది. నేనే పూనుకుంటే నేరానికి కఠినశిక్ష విధించాలి. అందుకేమామకున్నాను.

నేను రాజాని నీవు రాణివి న్యాయా న్యాయాలు విచారించేందుకు నాకెంత అర్హతో నీకూ అంత అర్హతున్నది నేను చేయవలసిందే యీ పని అయినా కుటుంబ విషయం గాబట్టి, నీకు విడిచిపెడుతున్నాను నీవు తల్లివని మర్చిపోయి, 'రాణిగానే న్యాయ విచారణ చేసి, నీకేమి సబువనితోస్తే అది నీవు దైవముఖం చూసి చెయ్యి

మల్ల :—నేనెంత రాణినైనా తల్లిని అడుదాన్నెందుకు ఈ విషమ పరీక్షలో పెడతారు ? మీకు తోచిం దేదో మీరే చెయ్యలేకపోయారా ?

రంగా :—నేను పూనుకుంటే, నీ జీవితమంతా విషాదభూయిష్టమై, దుఃఖించేటట్టు చేయడం యిష్టంలేకే నీ కొదిలిపెడుతున్నాను.

మల్ల :—తక్షణం అమ్మాయికి మీరుండగానే కబురు పంపుతాను

రంగా :—వద్దు వద్దు ఆమె ముఖం నేను చూడను నీవే నీకు తోచినట్టు పరిష్కారం చెయ్యి నాకు రాచకార్యాలున్నాయి. నేను వెళ్ళాలి. ఒక్కటి నీ కాఖరి మాటగా చెబుతున్నాను మల్లమ్మదేవినుంచి బొబ్బిలిరాణికి కళంకం రాకూడదు. బొబ్బిలి రాణివల్ల, మల్లమ్మదేవి కడుపు తీపికి చేటు వాటిల్ల కూడదు. నీ వే మార్గాన్ననుసరిస్తావో నీకే వదిలిపెడుతున్నాను. నే వెళ్ళుతున్నాను

మల్ల :—విషయమేమిటో చెప్పకుండా నన్నెందుకు బాధ పెడతారు ? నేనీ అసిధారావ్రతంలో ఎలా వర్తించటమో తెలియకుండా ఉన్నది ప్రభూ.

రంగా :—ఈరాత్రి మన సైన్యంలో సైనికుడుగావున్న రామారావుకు కబురు పంపించి నిర్ధారణ చేసుకో కష్టకాలంలో మగవారికంటె, ఆడువారే ధైర్యంతో న్యాయమార్గాన సంచరిస్తారని, నా నమ్మకం నేనెడుతున్నాను

2

మల్ల :—వెంకుమాంబా వెంకుమాంబా ...

వెంకు —చిత్తం ఏమిటి శలవు ?

మల్ల :—నీవు పోయి రామారావు సైనికునితో నేను చెప్పమన్న మాట చెప్పావా? ఈ రాత్రి అతను ఎంత వేళకైనను మా దగ్గర హాజరు అవాలని చెప్పావా ?

వెంకు :—ఆ. .చెప్పానండి రాత్రి ఒంటి గంటవరకు సింహద్వారం దగ్గర కావలా చేయాలట పహరా దిగిన వెంటనే మీ దర్శనం చేసుకుని వెళ్తానన్నాడు అప్పుడే కోటలో 12 గంటలు కొట్టి చాలా సేపైనది ఘడియలోనో, క్షణంలోనో అతనొస్తాడు.

(కొంచెం విరామం)

వెంకు :—అదిగో వచ్చాడమ్మా

మల్ల —సరే నీవు వెళ్ళు.

రామారావు నీవు మా సైన్యంలో వున్నావటగా. సైనికుడుగా నీకు మంచి పేరుం దిటగా నేను కొన్ని విషయాలు మా దాదుల ద్వారా విన్నాను యదార్థమెంతో నీ ముఖస్థంగా విందామని నీకు కబురు పంపాను. ఈ ఏడు దసరా ఉత్సవాలు బాగా జరిగాయా ?

రామా :—ఓ .అమితోత్సాహంగా జరిగాయండి. మీరు గూడా అప్పుడొస్తారని ప్రజ లనుకొన్నారండి

మల్ల —అవును ఒద్దామనే అనుకున్నాను మా అన్నగారైన తాండ్రపాపారాయుడుగారు అస్వస్థతగ ఉండడంనుంచి ఆయన్ని విడిచి వచ్చేందుకు వీలులేకపోయింది. నేనే వచ్చుంటే కొన్ని విషయాలు జరిగుండకపోను రాలేదని ఇప్పుడు విచారపడుచున్నాను. ఆఁ. .... విజయదశమినాడు సైనిక విన్యాసాలు జరిగాయా ?

రామా —చాలా అద్భుతంగా జరిగాయండీ యీ ఏడు సైనికులలో ఉత్తమమైన వారిని ఎన్నుకొని వారిచేత విన్యాసాలు చేయించారండి. వారందరిలో మహోత్కృష్ట సాహసం, ప్రౌఢ అస్త్ర శస్త్ర విన్యాసం అమితమైన బలం ఎవరు చూపెడతారో వారిని గౌరవ సైన్యాధిపతిగా చేస్తామని ప్రభువుగారైన రంగారావుగారు చాటువేయించి చెప్పారండి.

మల్ల —మీ రందరు దాంట్లో పాల్గొన్నారా ? ఎవరి ధైర్య సాహసాలు మెచ్చుకొని ప్రభువువారు గౌరవ సైన్యాధిపత్యం ప్రసాదించారు ?

రామా :—మీ దయవల్ల, ఆ గోపాలకృష్ణుని కృపవలన నాకే ఆ అదృష్టం పట్టివుండునండి తలవెంట్రుకవాసిలో తప్పిపోయిందండి

మల్ల :—నీవు ఉత్తమ సైనికుడివని, నీ బలపరాక్రమము ప్రకటన జరిగి, నిన్నే సత్కరిద్దామనుకొన్నప్పుడు, నీ కెందుకు తప్పించారు ?

రామా :—నన్ను ఉత్తమ సైనికునిగా, తమ సైన్యంలో సాటిలేని మేటి సైనికునిగా నిర్ణయం చేసేవేళకు హఠాత్తుగా గుర్రమెక్కి గాలికన్నా జోరుగా, రణరంగ స్థలానికొచ్చి, తనొక అజ్ఞాత వీరున్నని, తాను కూడా బొబ్బిలి సైన్యానికే చెందిన వాడినేననిన్నీ, కారణాంతరాలవల్ల సమయానికి హాజరు కాలేకపోయాననిన్నీ, తన్ను ఓడించిన పిదపగానీ నాకు సన్మానార్హతలేదని గంభీరంగా గర్జించాడు. అందుకు ప్రభువువారు సమ్మతించి, యుద్ధంచేసి నన్నోడించమన్నారు

మల్ల :—అయితే అతను ఎవరు ? మనిషి ఎలాగుంటాడు ? పేరేమిటి ?

రామా :—ఎవరో తెలియదండి నఖశిఖ పర్యంతం కవచధారి అవటంచేత ముఖము కన్పించలేదండి మేము పోల్చలేకపోతిమండి. మేమిద్దరం యుద్ధం చేయుడం ప్రారంభించామండి

మల్ల :—మనిషి ఎవరో తెలియందే అనుజ్ఞ ఎలా గిచ్చారు ?

రామా :—ప్రభువుగారు మనిషి పేరుగాని, హోదాగాని అవసరంలేదు క్షాత్ర తేజమొక్కటే గణనకొస్తుందని, అతనితో నే పోరాడితీరాలని శలవిచ్చారు. నాకే ఆశ్చర్య మేస్తుందండి. ఆ రోజున ఎంతమంది సైనికులనో

త్వరలో !

వైజయంతీమాల.....
రాజేంద్రకుమార్...
...నటించిన...

ఆస్ క పంఛి

మ్యూజిక్: శంకర్ జైకిషన్. డైరక్షన్: మోహన్‌కుమార్.

రిలీజ్.... చౌదరి సినీ కార్పొరేషన్ (కాకినాడ). PRABHAKAR

రెప్పపాటుకాలంలో చిత్తుచేయగలిగాను కాని ఆ అజ్ఞాతవీరుని పరాక్రమమునకు తట్టుకోలేకపోయానండి. అతని కత్తి జళిపింపులకు మెరుపు తీగలు మిరిమిట్లుగొల్పాయండి. అతని బల్లెము పోట్లు ఉరుముల ధ్వనితో, నా ఇనుప కవచాన్నే తూట్లు చేశాయి. ఐదు నిమిషాలలో నన్ను ఓడించి, తనకు సత్కారము వలదని, వెలమ పౌరుషము చూపించుటకు వచ్చానని గర్జిస్తూ, గుర్రమెక్కి మాయమయ్యాడు. సభలో అందరు నిశ్చేష్టితులయ్యారండి నా దురదృష్టమండి.

మల్ల :—ఇదేదో కథలా కనిపిస్తున్నదే కాని విచారించకు నేను నీకెందుకు కబురు పంపించానో తెలుసునా ? నేను నీనుంచి ఒక రహస్యాన్ని తెలుసుకొనేందుకని. మాసైన్యంలోవుండి, మా అన్నం తిని, మా బట్టకట్టి బ్రతుకుతున్నావు మేము నిన్ను పోషించే ప్రభువులము మా దగ్గర నువ్వు అబద్ధమాడకూడదు సుమా.

రామా :—మీ రడుగకుండానే మీకు ఆ విషయాలు మనవి చేద్దామనుకుంటున్నాను. ఎందుచేతనంటే, ఆ విషయంలో అమృతం హాలాహలం కూడా నాకు గోచరిస్తున్నాయండి అమృతాస్వాదనకు నేను వ్యక్తిగతంగాఆశించానంటే మహారాజుల కీర్తిప్రతిష్ఠలు, వెలమకులానికి సంప్రదాయంగా సంక్రమిస్తున్న కుల గౌరవమే కూకటి వేళ్ళతో పోతుంది మీరు నన్ను అడిగివుండకపోతే బాధపడివుందును.

మల్ల :—అయితే ఆ రాత్రి ఆ అజ్ఞాతవీరుడు నిన్ను కలుసుకుని మాట్లాడ్డం నిజమే నన్నమాట.

రామా :—యదార్థమే కాకుండా, ఆమె కన్యకనని, పెండ్లికాలేదని, ఉత్తమ వెలమ కులానికి చెందినదానిననిన్నీ, నా యుద్ధ కౌశలం చూచాక, నాతో యుద్ధం చేసి, జయించినా, జయించలేకపోయినా, నన్నే వివాహం చేసుకుందామని ఉందని చెప్పిందండి

మల్ల :— నీవు వివాహం చేసుకుంటానని ఖరారు చేశావా ?

రామా :— లేదండి. స్త్రీ జాతిలోపుట్టి వెలమవారల తలదన్నే క్షాత్రతేజము చూపించి, ఈ పౌరుషము పురుషులకే హక్కుకాదు. అవకాశాలిస్తే స్త్రీలు కూడా ఉత్కృష్ట వీరవనితలు గాగలరని రుజావు చేసిన మాననీయ. మహిత లావణ్యవతిని, వివాహ మాడేందుకు వీలులేకపోయినా, ప్రేమపిపాసితుణ్ణయి ఆమెకే జీవితం అంకితంచేస్తానని మాటిచ్చానండి ఆమాటమాత్రం తప్పనండి ఆమె ప్రేమచిహ్నంగా ఈవుంగరాన్ని అనుగ్రహించిందండి కరవాలాన్ని ధరించే చేతికి ప్రేమ రక్షగా ఆజన్మాంతము ధరించమందండి ? తరువాత మీ చిత్తమండి

మల్ల :—రణమందు వీరులు అనేకమంది ఉద్భవించడం తెలుసును జీవిత రణరంగములో కూడ నీ వింత గొప్ప ధీరుడవని నేను నిన్ను ఆశీర్వదిస్తున్నాను. ఏదీ ఆ ఉంగరం చూస్తాను.

రామా :—(ఉంగరం ఇస్తాడు.)

మల్ల :—రామారావు నిన్ను నేనొక వర మడుగుతాను. మన వెలమ కులంలో స్త్రీజాతిలో పవిత్రతకు నా కన్న పేరు తెచ్చుకున్నవారు లేరు. మన మిద్దరం ఒక కులానికే చెందినవారము మానమర్యాదలకోసం జీవితాన్ని తృణప్రాయంగా యివ్వటానికి వెలమ కులంలో పుట్టిన పసిపిల్లలు కూడా వెనుకంజ వేయరు నీకు వ్యక్తిగత జీవన సౌఖ్యము ఘనమా ? చెప్పు. ఒకేమాటలో చెప్పు.

రామా :—మీ పాదాలు పట్టుకు చెబుతానండి కుల మర్యాదేనండి ఎక్కువ.

మల్ల :—నిజరంగా అంటున్నావా, ఆ మాట ?

రామా : ముమ్మాటికి

మల్ల :—నీకు కావలసినంత ధనం యీ పెట్టెలో వుంచాను. నీవు దాన్ని పరిగ్రహించి అజ్ఞాతంగా ఎక్కడికైనా వెళ్ళిపోయి, సుఖంగా జీవితం చెయ్యి నీవు వెళ్ళేది, ఎక్కడున్నది, ఎవరికి తెలియకూడదు. నీవు నేను బ్రతికుండగా బొబ్బిలి కోటలోనికి అడుగుపెట్టకూడదు. నా ఆజ్ఞను నీవు శిరసావహించాలి మాటిచ్చావు తప్పకూడదు సుమా !

రామా :—తల్లీ, మీరు చెప్పినది తప్పకుండ చేస్తాను కాని, ఈ ధనాన్నిమాత్రం స్వీకరించలేను. మనిషి లంచం కోరుతాడు. కులం లంచంకోరదు అభాగ్య వెలమ కులం యువకుల కోసం వినియోగించండి. నా కొక ఉపకారం చేయగలిగితే సంతోషిస్తాను. ధనమంతా కర్కశమైనది లోకంలోవుండే స్త్రీ హృదయం, మార్దవం, వీర వనితల వింత వెలుగులు, నా మనో జగత్తులో జాబిల్లికి పరివేషమైన ఆ ఉంగరమిస్తే నా కృతజ్ఞతకు మేరవుండదు

మల్ల :—పిచ్చివాడ ! పరివేషంకాదు పాశం! కాని, నీయందు నా కభిమానముంది. అందుకే నే నియ్యను మరు మాటాడకుండా వెళ్ళు.

3

(బొబ్బిలికోటలో ఘోషా స్త్రీలుండే ప్రదేశంలో మల్లమ్మదేవి కూతురు ఆసీనులైవుంటారు. మల్లమ్మదేవి విచారంగా ముఖం పెట్టుకు కూర్చుంటుంది)

కూతు :—ఏమమ్మా, విచారమంటే ఎరుగని మీముఖం చిన్నబోయింది ధైర్యానికి, పవిత్రతకు, ప్రఖ్యాతి వహించిన మీ కేమంత ఆపద సంభవించినది ? వెలమ కుల మర్యాదలకు లోటు వచ్చిందా ? లేక విజయనగరంవారు మనమీద దండెత్తుతారని వార్తలు వచ్చాయా ? ఎందుకమ్మా విచారం ?

మల్ల :—కుల మర్యాదలు కూలిపోకుండావుండే అందుకే నా చేజేతుల నా కూతురు సౌఖ్యానికి బుగ్గిజల్లించారు చేసిన దానికి విచారపడకుండా వుండడం మానవ స్వభావం గాదుకద

కూతు :—చిన్నప్పుడే తలిదండ్రులు మరణిస్తే నన్ను చేరదీసి, కూతురుగ పరిగ్రహించి, విద్యాబుద్ధులు చెప్పించి, యుద్ధ తంత్రంలో కడు నిపుణత వచ్చేటట్లుచేసి, సొంతకొడుకైన తమ్ముడు చిన రంగారావు కంటె నామీద మమకారం మీకు హెచ్చు నా తల్లి మల్లమ్మదేవి పరమ పవిత్రమూర్తి. నా కన్యాయం చేస్తుందంటే నేను నమ్మలేను

మల్ల :—చేశానమ్మా చేశాను. చేసినది పాతిత్యమని కూడా తెలుసును. నన్ను నీవు మన్నిస్తానంటె చెప్తాను

కూతు :—అమ్మా మిమ్ముల నేను మన్నించడమా ఎంతమాటన్నారు మీరేమి చేసిన, మంచిదనే తలంచుతాను. మీరు చేసినది అపకారమే అయిన పరిస్థితులు మీచేత చేయించాయనుకుంటాను. కాని మరొక రీతిని ఎంతమాత్రం తలంచను సెలవియ్యండి

మల్ల :—నేను నీకు యుద్ధ కౌశల్యం చెప్పిస్తున్నట్లుగా మీ నాన్న గారికి తెలును. నన్ను రెండు మూడు మారులు వద్దని వారించారు కాని నీకుండె బుద్ధి కుశలత, ధైర్య బలాలు, నన్ను హెచ్చరించడంచేత వారి మాటలు నేను పాటించలేదు పరిస్థితులింత విషమిస్తాయని తెలిస్తే నిన్నానాడే మాన్పించియుందును నీవు విజయదశమినాడు, అజ్ఞాత వీరుడుగా ప్రచ్ఛన్నంగావెళ్ళి, యుద్ధం చేయడం, ఆ వీరుని జయించడం, మీనాన్నగారు తెలుసుకున్నారు ఇంతకు నేను వూరులో లేకపోవడము, రాజాము వెళ్ళడము, గ్రహచారమనుకుంటాను నేనే వూళ్ళోవుంటే, ఈ సంఘటనలు జరిగియుండక పోవును

కూతు :—అమ్మో నాన్నగారు పోల్చేశారా! ఆయన ఆగ్రహానికి హద్దుండదు.

మల్ల :—వారు తమకు కలిగిన ఆగ్రహాన్ని ఉపశమించుకున్నారప్పటికి అందుకు కారణం నీవు చేసిన అపచారాన్నిగాని వెల్లడిచేస్తే, ఆయనే తండ్రి, రాజు అవడంనుంచి ఆయనలో వుండే తండ్రితనం ఆగ్రహాన్ని ఉపశ

మింపజేసింది. కాని నీమీద, రామారావుమీద, మీ వర్తన కనిపెట్టమని కొంతమంది వేగులవాళ్ళను నియమించారు. నీవు రాత్రివేళ రామారావుని కలిసి మాట్లాడ్డం గూఢచారులు కనిపెట్టి, మీ నాన్న గారికి తెలియజేశారు. ఉన్నమాటున నన్ను రమ్మనమని రాజాము కబురు చేశారు నేను వచ్చాను. నాతో అన్నీ పూసగుచ్చినట్లు చెప్పారు.

కూతు :—అమ్మా, నేను చేసినదాంట్లో అవినీతికరమైన దేమీ లేదు రామారావు పేద కుటుంబమునకు చెందిన అల్పమైన సైనికుడు కావచ్చును. ధైర్య పౌరుషాలకు, అస్త్ర విన్యాసాలకు అతనికి రాజాధిరాజులు కూడా సాటిరారు. అతను వీరుడు నేను వీరవనితను. అతను అవివాహితుడు. నేనా నిండుయౌవనపు పండు వెన్నెల, పాల వయస్సు పెండ్లీడు కొచ్చిన కన్యను. అతనిని వివాహమాడదామని అనుజ్ఞకోసం అతనిని అర్థించాను. అతను కూడ, ఉత్తమ సంజాతుడు కాబట్టి తారతమ్యాలు గుర్తెరిగి వివాహమాడతానని మాటివ్వలేదు కాని, ఆజన్మాంతం ప్రణయ సమాధిలోనుండి ప్రేమిస్తానని చెప్పాడు. పవిత్రతకు కూడ శిక్ష వుంటుందని నాకు తెలీదు నేను చేసినది నేరమనే మీరు తలిస్తే ఎంతటి శిక్షనైనా ముఖంగా అనుభవిస్తాను

మల్ల :—నేను స్త్రీగా, నీ తల్లి మలమ్మదేవిగా నీ హృదయాన్ని అర్థం చేసుకోగలను నీవు చేసిన పని త్రికరణ శుద్ధిగా అంగీకరిస్తాను కాని, మీ తండ్రిగారు ఆడుదానిగా, మల్లమ్మగా మర్చిపోయి, కఠోరమైన రాజ్యభారాన్ని వహిస్తున్న రాణిగా, న్యాయశాస్త్రమార్గంలో సాంఘిక దృక్పథంలో ఈ విషయాన్ని చక్కజేసి, మీ యిద్దరిని శిక్షించమన్నారు

కూతు —నాకు మరణదండన విధించినా నేను సరకు చేయను అతనికి మాత్రం నావల్ల ఎట్టి హాని చేయకూడదు ఇది నా కోరిక, నా ప్రార్థన

మల్ల —నీ శ్రేయస్సు, రామారావు శ్రేయస్సు అభిలషించి నిన్ను చిన్నప్పటి నుంచి చేతులారా పెంచిన చేతులతోనే నీకు శిక్ష విధించలేక చిక్కు విప్పేందుకు, ఒక ఉపాయాన్ని ఆశ్రయించవలసి వచ్చినది అది మీకు హితంగా వుండదు కాని అంతకంటె శ్రేయోమార్గం మీ యిద్దరికి మరోటి లేదు

కూతు —సరే మీ ఉపాయం మా ప్రేమకు ఉరితాడు, కాలపాశం

మల్ల —నీవు చేసినది దేవుని దృష్టిలో అపచారం కాకపోవచ్చును లోకంలో ఇతర జాతి స్త్రీలలో కూడ దానిని పాపంగా పరిగణించరు కాని పోతుటీగ జొరపడేందుకు వీలులేని, అసూర్యంపశ్యలైన వెలమ వనితాకులం మాత్రం సహించదు ఈ వార్తగాని పైకి పొక్కి అందరికి తెలిస్తే ప్రజల హృదయాలలో కోపమురేగి రాజవంశానికే ఆపద సంభవించవచ్చును. నేడో, రేపో విజయనగరంవారు మన మీద దండెత్తదలచిన ఈ గడ్డు రోజుల్లో ప్రజా హృదయాలలో అలజడి గలిగితే సంభవించే ప్రమాదం వూహా కతీతం తల్లీ

కూతు —మీరన్నది నిజం సంఘ శ్రేయస్సుకోసం, రాజులు రాజ్యాలకు వేసిన పునాదులు కదలకుండ వుండేందుకు, ఎంతమందో ఆహుతులివ్వాలి. రాజ్యంకోసం గాకపోయినను సంఘంకోసం మీరు వేసే శిక్ష నేను, అతను కూడా అనుభవించుటకు సిద్ధంగా వున్నాము.

మల్ల —చిట్టి తల్లీ, నేను శిక్ష విధించలేదమ్మా రామారావుతో మాట్లాడి మీ యిద్దరి ప్రేమకు ఆ జన్మాంతం వియోగం కల్పించాను అతను అంగీకరించాడు నీవు ఏమంటావు అమ్మా ?

కూతు .—ఏమంటానమ్మా ఈ లోకంలో ప్రేమ లేదనుకుంటాను నిర్దాక్షిణ్యమైన కఠోర రాజదండానికి మా ప్రేమ బలి అయిందను కుంటాను. ఒక్కమాటు మనకు ఇలువేల్పు అయిన వేణుగోపాలుని తల్చుకుంటాను.

మల్ల .—అమ్మా, వివాహవేదికమీద కళ్యాణసమయంలో నీచేత అతని కర్రకి పూజ చేయించి, నీ చేతి ఉంగరము అతని చేతికి పెట్టించే బాధ్యత వహించవలసిన నీ తల్లినైన నేను, నీవు ఏ ఉంగరాన్ని అతనికి ప్రేమ చిహ్నంగా యిచ్చావో, ఆ అంగులీకాన్ని, పిశాచినై, రాణినై అతని దగ్గరనుండి తీసుకున్నాను ఇదిగో తల్లీ నీ ఉంగరం జన్మ జన్మాలకి నా పాపంపోదు నే చేసిన దానికి శిక్ష మరో లోకంలో అనుభవిస్తానమ్మా మన్నించు ఈ ఉంగరాన్ని తీసుకో.. .(వెక్కి వెక్కి ఏడ్చును)

(తెరలో)

దండోరా :—విజయనగరంవారు బొబ్బిలి మీదకు బుస్సీ సహాయంతో, సైన్యాలతో, శతఘ్నులతో వచ్చి పడుతున్నారు కాబట్టి ప్రజలందరు మెలకువలో వుండమని యుద్ధ సన్నద్ధులు కమ్మనమని రాజ శాసనం... ఖబడదార్.... వెలమ పౌరుషానికి జై . జై ...జై ....

(విరామం)

4

(బొబ్బిలి యుద్ధం ముమ్మరంగా జరుగుతూ వుంది విజయ రామరాజు సైన్యాలు విజృంభించి బొబ్బిలి సైన్యాలను చెల్లాచెదురు చేస్తున్నాయి. బొబ్బిలి వెలమ వీరుల రణప్రతాపం మాత్రం రవి ప్రతాపంగా తీక్ష్ణంగా గోచరిస్తుంది బొబ్బిలివారికి అపజయం తప్పదనే అనుమానం అందరి మనసులలో రేకెత్తింది కోటలో అబాలగోపాలము పురుషులైతే చాలు యుద్ధానికి వెళ్ళిపోయారు కోటలో స్త్రీలు మాత్రమే ఉన్నారు వారంతా పరమేశ్వర ధ్యానంలో ఉన్నారు వెలమ వీరులకు జయం కలగాలని భగవంతుని ధ్యానిస్తున్నారు. రాత్రి ఒంటిగంట యుద్ధంలోని ఒక సైనికుడు కోటలోనికి ప్రవేశించి మల్లమ్మదేవిని చూసి అంటాడు)

సైని —అమ్మా, నమస్కారము ప్రభువువారి ఆజ్ఞచే నే నిప్పటికొచ్చాను. ఎంతటి పౌరుషం, వెలమవీరులు చూపిస్తున్న అపజయం తప్పేటట్టు కనబడలేదు పాపారాయుడుగారు రాజామునుండి రాలేదు. ఈ సాయంత్రానికి శత్రు సైన్యాలు మన కోటలో ప్రవేశిస్తాయని భయపడ్డాము కాని సాయంత్రంనుంచి మొక్కవోవని ధైర్యంతో శత్రు సైన్యాలను చీల్చి చెండాడుతూ, అకుంఠితమైన వీరావేశముతో యుద్ధభూమిలో స్వైర విహారం చేస్తున్నాడు ఒక అజ్ఞాత వీరుడు అతని శరీరం కూడా తూట్లు పడుతున్నది ఇక ఎంతసేపో అతను కూడా యుద్ధం చేయలేడు. రాజాజ్ఞ, స్త్రీలందరు తమ మానరక్షణకొరకు అగ్ని ముఖమున ప్రవేశించాలని ..హుకుమ్. నేను సెలవు తీసుకొంటున్నాను.

కూతు :—సైనికుడా, క్షణ మాగు. నేను నీతో రహస్యంగా మాట్లాడాలి (ఇద్దరు రహస్యంగా మాట్లాడుకుంటారు.)

మల్ల :—వెంకమాంబా, మా అందరికి, అంటే స్త్రీలు యావన్మందికీ, చితులు పేర్పించి, అగ్ని రగుల్కొల్పమని చెప్పు కళంకమెరుగని వెలమ వనితలు ఆచంద్రార్కం పేరు నిలబెట్టేటట్టుగా చితులెక్కి సంస్కారాన్నిపొంది మానాన్ని కాపాడుకొంటారు. వెంకమాంబా, నీవు మాత్రము పురుష వేషము వేసుకొని వంశాంకురమైన చిన రంగారావుని శత్రువులబారి పడకుండా, పామర్లకోట తీసుకొనివెళ్ళి ఒప్పచెప్పు. చినరంగారావుకి తలిదండ్రులు లేరు. నీవె తల్లివైన, తండ్రివైన

(లోపలినుండి కేకలు—మహా పతివ్రత మల్లమ్మదేవి చితుల మంటలు నిప్పులు గ్రక్కుచు ఉవ్వరాని కెగుస్తున్నాయి.)

మల్ల :—అంతమందీ పదండి ప్రాణాలు ఆహుతిచేసేటందుకు చితుల దగ్గరకు పదండి అమ్మాయి, ఏమి ఆలోచిస్తున్నావు ? పద నాపక్కనే చితి పేర్పించాను.

కూతు :—నేను రానమ్మా....నా కిష్టంలేదు.

మల్ల :—యుద్ధంలోకెళ్ళి యుద్ధం చేద్దామని వున్నదా ?

కూ :—యుద్ధానికి కూడ వెళ్ళేను.

మల్లి :—శత్రువులచేత మానభంగం చేయించుకోవాలని సరదాగావుందా? నీచు రాలా! ఏ పిట్ట ఆ పలుకు పలుకుతుంది నీవు నీచ కుటుంబానికి చెందిన దానవు ఉత్తమ కుల లక్షణాలు నీకెలాగొస్తాయిలే. నిన్ను పెంచానుగాని నా రక్తంలోనుంచి వచ్చిన దానవు గావు. నీచులను ఉత్తములను చేయలేము. ఉత్తములను నీచులను చేయలేము. నీ ముఖం చూస్తే సమస్త పాపాలు వస్తాయి. బాగా ఆలోచించుకో. నీవు రావన్నమాట? నేను వెడుతున్నా

కూతు :—అమ్మా. మల్లమ్మదేవి కూతురు, మల్లమ్మదేవికన్న పవిత్రురాలని లోకానికి రుజువు చేస్తాను దేవత నవుతాను శత్రువీరులకు చిక్కి హీనమానాలు పడేందుకు నా కరవాలమేవుంది అంతకంటె మృత్యువును సౌఖ్యముగా చేసే అందుకు నేను, నా ప్రేమ కానుకగా నా ప్రియుని కిచ్చిన ఉంగరాన్ని తిరిగి నాకిచ్చావు ఆ వజ్రపు టుంగరం, ఇహం నాకు ఇవ్వలేకపోయినా, పరాన్నిస్తుంది. ....సెలవు.

5

(తోటలోవున్న గోపాలస్వామి దేవాలయం దగ్గర విగ్రహాని కెదురుగా ఆసీనురాలై మల్లమ్మదేవి కూతురు.)

కూతు :—జగదాధారా. పరాత్పరా. కృష్ణా తరతరాలనుంచి మమ్ములను కాపాడుతున్నావు. నేటికి నీ కృప సన్నగిల్లిపోయింది ఈ కోటలో ఈ అర్ధరాత్రివేళ యావన్మంది పురుషులు యుద్ధానికెళ్ళిపోయారు స్త్రీలు యావన్మంది అపజయాన్ని సహించలేక తమ తమ మానాలు కాపాడుకొనేందుకు చితు లెక్కారు. నేను మాత్రం కన్యకగా ప్రాణం తీసుకొందుకు ఇష్టంలేక, శత్రు సైన్యాలు, మా పొలి మేరల దాటి రాకుండ, అఖండ తేజోనిధి అయి వీరావేశంతో పోరాడిన అజ్ఞాత వీరుని కళేబరంకోసం ఎదురు చూస్తున్నాను ఒకప్పుడు అతని శౌర్యాన్ని జూసి నే నాతనిని ప్రేమించాను మనిషిని గాదు నేను ప్రేమించినది. ప్రజల కోసం, దేశంకోసం పోరాడిన ఈ అజ్ఞాతవీరుడు నేను ప్రేమించిన వాడైన, కాకపోయిన ఆతన్ని వివాహమాడి, సహగమనము చేయ దలచివున్నాను ఇది నా ఆఖరి కోర్కె. మా అమ్మను నొప్పించాను. కొద్ది క్షణములలో ఆమెను చేరుకొని, నా భర్త నేను కూడా క్షమార్పణ వేడుకొంటాము నిజమైన ప్రేమ మృత్యువును కూడా అధిగమిస్తుంది పెండ్లి తరువాత నీ ఆశీర్వచనం వుండాలి కదా తండ్రీ. ఒక్క ప్రాణి కూడా లేదు ఈ అర్ధరాత్రివేళ పెండ్లి చేయించే వానివి నీవె. దీవించేవానివి నీవే ఆశలే తీరని కన్యక, సరికొత్త మగనితో, సహగమనం చేస్తే, దేవతగా, పేరంటాలుగా అవుతుందని మా అమ్మ చెప్పింది

(దూరమునుండి గుర్రపు డెక్కల చప్పుడు మల్లమ్మ కూతురు దగ్గరకు వస్తుంది సైనికుడు ఆ గుర్రంమీదినుండి దిగి)—

సైని :—తల్లీ, మీ ఆజ్ఞ ప్రకారం ప్రాణాలు విడిన అజ్ఞాత వీరుని మీరు కోరినట్లు దాఖలు చేసుకొంటున్నాను కోట సింహద్వారం కూడా పడిపోయింది మీ కర్తవ్యం

కూతు.—అదిగో. ఆ చితి నంటించు రాధా మనోహరా మా ఆలు మగలను దీవింపుము సెల విప్పించు ఇదే నాకడసారి నమస్కారం. యీ లోకంలో కాకపోయినా, వీరస్వర్గంలో ఒకరి ముఖం ఒకరు చూచుకుంటామని చెప్పు, నాన్నగారితో చెప్పు, పోయి, ఓయి సైనికుడా!

పిచ్చితల్లి

శ్రీ కొత్త సత్యనారాయణ చౌదరి

క్రూరా, మహాబంబా! నాగరక ప్రభావఫలితమా! యేమి! వివరింప వలనుపడదు!
ముప్పదేండ్లైన ముగియకమున్నె ఘోరసంగరం బొండు రెండవసారి సాగె.

దానితాకిడి భూనభోంతరము లూఁచముట్టుగా నుద్ధవడి నూఁగిపోయె నకట!
క్షామబాధలు పదపడి సార్వకాలికంబులై మారి గరళసకరణి బెరసె.

కడుపులో నీరు గదలని యడుగుదీసి యడుగుబెట్టని దూరప్రయాణములను
సుఖతరంబుగ సాగు నాజాకులెన్నొ మాయమై బన్నములు పెక్కులాయెఁ బ్రజకు.

జనము కిటకిటలాడి యుచ్ఛ్వాసమైన వెలువరింపఁబోదు-ప్రక్కల నిలిచి కత్తి
మీఁది సామును జేసెడి బాధలాదవె; రైళ్ళలో 'ఘోరకలి' చెప్పరాదు నిజము.

ఇట్టితఱిఁ జెన్నపట్టణ మేఁగు రైలుబండిలో ఘోరకృత్య మొక్కండు జరిగె;
మఱపునకురాని గాథయై పరఁగి మదిని నిలిచియుండుటఁజేసి వర్ణింతుఁ గొంత.

ఎక్కువారలు దిగువార లొక్కమొగిని బిక్కమొగములు వైచి తపించుచుండ—
బండిలోఁ జీమసైత మిబ్బందిపడెడి త్రొక్కటం బది మదికిఁ దుందుడు కొనర్చె.

పొగలు వదలుచు రైలు బెబ్బులివిధాన 'ధాముధూములు' చేసి యుద్ధవిడి దూఁకు
చుండె; రాఁబోవునదియు నెల్లూరు-దాని కీవలను దాఁటవలసిన యేఱు కలదు.

పెన్నయందురు; దాని పెం పెన్నఁదరము గాదు—వడి యింతయని చెప్పరాదు నీట;
దాని వంతెనపై రైలు దాఁటునపుడు బండిలో వస్తువులు తడఁబడుచునుండు.

ఆఁడువాండ్రకు నిర్ణయంబైన పెట్టిలోని జీవాలు గ్రుక్కిన పేనుపోలెఁ
గదలమెదలని దుర్దశగదిరి చేఁత లుడిగి కూర్చుండి; రందు వేఱొక్క ప్రక్క.

ఒక్క తురుష్కాంగన తన ప్రక్కనె తన పెట్టె, మూట పదిల పఱచియున్
జక్కఁగాఁ గూర్చుండెను నలుప్రక్కల యమ్మక్కలెంతొ బాధలు పడఁగా.

ఆబిడకుఁ గట్టెదుర నొక్కయతివవట్టిముగ్ధ 'హైందవ' కూర్చుండి పోరువెట్టు
బిడ్డ నోదార్చుకొనుచుండె; బీబి కడియు దుస్సహంబైన రొదగాఁగఁదోఁచి కసరి.

అదమఱచి నిద్రించు నా యాత్మజునకుఁ బెడకొలిమి పెట్టితివి: పాడు పిల్లవాఁడు
నోరు మూయఁడు ఛీయని నోరుచేసికొనియె నిర్దయమైన యా వనిత యపుడు.

బిడ్డ యేడ్పునకే గాదు బీబి సణుగు గొణఁగులకుమీఁదు మిక్కిలి కుతిలపడఁగఁ
దొడఁగె నాముద్దరా; లట్టి గొడవయెట్లొ కొంచెముగఁదగ్గి బిడ్డ నిద్రించెనంత.

వంతెనయు వచ్చె రైలొక వింత నడక నడువసాగెను; బదపడి బుడుత లిర్వు
రాదమఱచిరి తల్లు లా బాధ తలఁగి మెడలు ఱిక్కించిచూడఁగా దొడఁగిరేఱు.

నిండారఁ బాఱు నేఱు నఖండ జలం బాత్మకింపుఁ గావింపంగా
నుండిరి జన మందఱు నా బండియు నడతెంచె నడిమిభాగంబునకున్.

తుఱక యువతి కెదురుగఁ బైయఱలో నొకపెట్టె కదలి యతలకుతలమై
సరిగా నాబిడ యొడిలో గుఱిసూచినయట్లు పడెను గుఱ్ఱవి తలపై.

చివ్వనఁ దురుష్క లేచియుఁ గెవ్వున గగ్గోలు వెట్టి కినుకయుఁ దనుకన్
రవ్వంత కరుణ సూపక రివ్వున గట్టెదుటి బిడ్డక్రీఁగా లోలిన్.

పట్టి గిఱివాటు వెట్టి యా పట్టినపుడె పెన్నలోఁ బాఱవైచెనా యున్నయువతు
లందఱును నోరుదెఱచి యారా!యటంద్రు ఱొమ్ముతెగబాఁదుకొంద్రు లాభమ్ము లేదు

తల్లి యొడిలోన గుఱువెట్టు తనయు నిట్టు పాఱవైచుట క్షణమైనఁబట్టలేదు;
స్వయము కనులారఁ జూచుదృశ్యమున కడలి తల్లిగుండెయు వ్రీల్పడి డిల్లవోయె.

అమ్మో! బాబో! యని శోకమ్మున నాతల్లి బిడ్డకై యిరుగేలన్
ఱొమ్మును మోమును దెగఁబడి సొమ్మసిలన్ బాఁదుకొనయెఁ జూపఱు వగవన్.

చెదిరిపోయిన గుండెను గుదురు పఱుపనయితిగాక, యమాయిక యట్టెపట్టి
కోసమని యార్చి యేట దూఁకుటకు జూచెఁ, బట్టి పదిమంది యాపి రాపడతి నపుడు.

గొలుసులాగియుఁ బల్వురు గుములు గట్టి బూబు చేసినపనికి నబ్బురము వొడమి
కారణమెఱుఁగఁగోరి యాగ్రహము వీఱి చుట్టుముట్టిరి ప్రశ్నింపఁ జొచ్చి; రదియు

నదురు బెదరునులేక జనంబు నెదుర నిట్లు వాక్రుచ్చె—నాగోడు నెఱుఁగ రేల?
ఇదిగో! యీపెట్టె యీామెది; యిదియె నాదు బిడ్డప్రాణంబు దీసెఁ జూపింతు రండు;

అంచుఁదన కాళ్లక్రిందఁ గాన్పించుపెట్టె పట్టియెత్తంగ నక్రిందఁ బడ్డ బాలుఁ
డొడలు తెలియని నిదురలో నొదిగి చీకుచింత లెఱుఁగకయుండి యచ్చెరువు గొలిపె.

ఛీ! పాప కర్మరాలా! నీపాపఁడు చచ్చెనంచు నిలువున శిశువున్
రూపున్ మాపుదె? కరుణయుఁ జూపన్ వలదొసి? యనుచుఁ జురచులఁ జూడ్కుల్.

పఱపియుఁ బలువురు తిట్టిరి చెరచెర 'యధికారి' యొకనిచెంతకుఁ దఱకన్
దఱిమి కొనిపోయి పట్టించిరి; మఱి యా బిడ్డ యింకఁ జిక్కునె నీటన్?

బిడ్డపోయినమానె పైపెచ్చు తల్లిప్రాణమునకే విచిత్రదుర్దశ ఘటిల్లె
ఓరిబాబూ! యటంచు నోరారఁబిలిచి పిలిచి కానకగుండెలు వ్రీలి మదియు;

ఆపడి యడల్పడియును, జిరాకుఁ వెడఁగునవ్వు బఱపుచుఁదుదకు నున్మత్తయయ్యె
ఏక్షణమ్మున కేది యేయేవిధాన నెవ్వరికి సంభవించునో యేరి కెఱుక?

పాఠ్యగ్రంథాలు ఎలా ఉన్నాయి!

విద్యాభిమాని

ఇప్పుడు ఏదయినా ఉద్యోగం సంపాదించడానికికాని, జ్ఞానంలో ఒక పరిమాణాన్ని నిర్ణయించడానికికాని పరీక్షలే ప్రధానంగా పరిగణించబడుతూ ఉన్నవి ఆయా నిర్ణీత పరీక్షల్లో నెగ్గినవారికే జీవిక లభిస్తుంది ఆ కొలతబద్దను అనుసరించే వారివారికివుండే జ్ఞానమూ నిర్ణయించబడుతుంది. ఆ పరీక్షలకు వివిధ విషయాల్లో కొన్ని పాఠ్య గ్రంథాలు నిర్ణయించబడతాయి ఆ నిర్ణయించే అధికారం ప్రభుత్వ విద్యాశాఖవారిదే. ఆ విద్యాశాఖవారు నిర్ణయించిన పుస్తకాల్లోని విషయం ఎలాగువున్నా, అది సరియైనదే అని మనం భావించవలసి వుంటుంది వాటిలో అపసిద్ధాంతాలువున్నా అవి సుసిద్ధాంతాలుగానే శిరోధార్యాలు కావాలి!

ప్రభుత్వము నిర్ణయించే యీ పుస్తకాల జీవితం కొద్ది రోజులే! అంటే మూడేళ్లకుగాని, కొన్నిచోట్ల అయిదేళ్లకుగాని మించి ఆవే పుస్తకాలు వుండకూడదు వాటికి కాలదోషం పడుతుంది. కాలదోషం పట్టడానికి సిద్ధంగా వున్న ప్రామిసరీ నోట్లపైని వెల్లు వ్రాయించుకునేటట్లు, ఈ పుస్తకాలను కాస్త సంస్కరించి విద్యాశాఖకు దాఖలు చేసి, ఆ అధికారుల ఆమోద ముద్రను పొందాలి అలి పొందితేనే మరి కొంతకాలం వాటికి జీవం వుంటుంది. అంతేకాని, ఏ మంచి పుస్తకమయినా వారు నిర్ణయించిన గడువు దాటి కొంత కాలం పాటయినా ఉండడానికి అర్హం కాదు!

ప్రభుత్వవారూ, ఆపైని విశ్వ విద్యాలయాలయాలవారూ పరీక్షలను పెట్టక మునువు విద్యార్థులు జ్ఞానంకోసం కొన్ని కొన్ని గ్రంథాలను చదువుకొనేవారు అప్పట్లో 'ఈ వయస్సువారు—లేదా—ఈ తరగతివారు ఫలానా గ్రంథాలనే చదవాలి' అనే నియమం లేకపోయినా పెద్దల పరంపరను అనుసరించి వస్తూవున్న గ్రంథాలనే చదివేవారు సంస్కృత భాషను అభ్యసించేవారు. అమర నిఘంటువును కంఠస్థం చేస్తూ, శబ్ద మంజరిని ముగించి, తర్వాత బాల రామాయణంవంటి చిన్న చిన్న పుస్తకాలు ఒకటో, రెండో చదివి ఆ పిదప పంచ కావ్యాలూ చదివేవారు. తెలుగులో జ్ఞానం సంపాదించడానికి ఆంధ్రనామ సంగ్రహం కంఠస్థంచేసి మనుచరిత్ర, వసుచరిత్ర, భారత, భాగవత, రామాయణాలు చదివేవారు తర్వాత పాండిత్యాన్ని గట్టిపరుచుకొని, చమత్కారాలయిన అర్థాలను గ్రహించడానికి విజయవిలాసంవంటి గ్రంథాలను చదివేవారు. ఇదీ అప్పటి పద్ధతి! వారు వారు చదివే గ్రంథాలు ఆ యా వయసులకూ, గ్రహణశక్తికీ అనుకూలంగానేబుద్ధికి అందుబాటులోనే వుండేవి. కాని "ఇది యీ వయస్సు వారికి తగదు" అనే మాట కూడా వుండేదికాదు అప్పటివారు కేవలం భాషల్లోనే కృషి చేసినా, తక్కిన విషయాలలో కూడ మంచి జ్ఞానాన్ని ప్రత్యేక పాఠ్యగ్రంథాలు అక్కర లేకుండానే సంపాదించేవారు. ఆయా విషయాలలో ఆరితేరివున్నవారి శుశ్రూషచేసి రాజకీయాలు గణితం—శిల్పం—చరిత్ర మొదలయిన విషయాల్లోనూ చక్కని విజ్ఞానాన్ని సంపాదించేవారు

బ్రిటిష్ ప్రభుత్వపు పరిపాలనతో పరీక్షల పద్ధతి వచ్చినది దేశ భాషలకు ప్రాముఖ్యం తగ్గి ఇంగ్లీషు ప్రధానమై ఉండినది ఒక్క దేశ భాష మినహాగా తక్కిన విషయాలన్నీ రమారమీ పదిహేనేండ్లక్రిందటిదాకా ఆ భాషలోనే బోధించబడుతూ వచ్చాయి అప్పుడు దేశ భాషలకు ప్రాముఖ్యం లేకపోయినా అభ్యసనపద్ధతి సరియైనదిగా వుండడంవల్ల అప్పటివారికి భాషా జ్ఞానంలో కొరత ఉండేదికాదు

మన దేశానికి స్వాతంత్ర్యంవచ్చిన తర్వాత దేశ భాషలకు ప్రాముఖ్యం హెచ్చినది ఇంగ్లీషు, హిందీ మొదలయిన భాషా పాఠాలు తప్ప లెక్కలు, చరిత్ర, భూగోళం, రసాయనాది శాస్త్ర పాఠాలూ, దేశ భాషలలోనే బోధించబడుతూ వున్నవి అయినా భాషావిషయకంగా వెనుక ఉండిన జ్ఞానం కంటె ఇప్పటి విద్యార్థుల జ్ఞానం తగ్గుదలలోనే వుంటున్నది

ఇలా వుండడానికి కారణం ఏమిటి?

విద్యా విధానంలో ఆరితేరిన కొందరు వెనుకటి పద్ధతినే మార్చివేసి డైరెక్ట్ మెథడ్‌లు అనుసరించారు. ఓనమాలు వ్రాయించకుండా బొమ్మలను చూపి, వాటి పేర్లను చెప్పించి, ఆ పేర్లలో వచ్చే అక్షరాలనే ఒక్కటొక్కటిగా నేర్పుతున్నారు ఈ పద్ధతిని అనుసరించియే ప్రతి ఎలిమెంటరీ స్కూలులోనూ పిల్లలకు చదువు చెప్పబడుతున్నది అందువల్ల పెద్ద తరగతులకు వెళ్లినా, విద్యార్థులు క్రమంగా అక్షర సమామ్నాయాన్ని వ్రాయలేకుండా వున్నారు. అందుచేతనే క్రమంగా గుణింతం వ్రాయడంగాని, చెప్పడంగాని వాళ్లకు తెలియకపోవడంలో వింత లేదు ఈవిధంగా పునాది దిట్టంగా లేకపోవడంవల్లనే ఒత్తులేనిచోట ఒత్తులు పెట్టడమూ, ఉన్నచోట మానివెయ్యడమూ జరుగుతుంది ఇది పెద్దవారిలో కూడా సర్వసాధారణమైంది

ఒకప్పుడు ఒక విద్యాశాఖాధికారి ఒక పాఠశాలలో అయిదవ ఫారం విద్యార్థులను పరీక్షిస్తూ 'పటము' అనే పదాన్ని నల్లబల్లపైని వ్రాయమన్నాడు ఆ విద్యార్థి 'పటము' అని సరిగానే వ్రాశాడు కాని అది తప్పు అనే భావంతో మరొక విద్యార్థిని వ్రాయగోరగా, ఆ బాలుడు 'పఠము'అని వ్రాశాడు అప్పుడు అధికారి మొదటి బాలుడు వ్రాసినది తప్పనీ, రెండో విద్యార్థి వ్రాసినదే సరియైనపదమని, ఆ విధంగా సరిఅయిన పదాలను వ్రాయడం నేర్చుకోవాలన్నాడు నాకు చాలా ఆశ్చర్యం అనిపించింది సరిగా వ్రాసిన విద్యార్థి తెల్లబోయాడు! అప్పుడు నేను "అయ్యా! మొదటి విద్యార్థి వ్రాసినదే సరియైన పదం పఠం అని వ్రాయటమే తప్పు" అని చెప్పవలసి వచ్చింది ఆయన అభిప్రాయానికి వ్యతిరేకంగా చెప్పినందున అధికారికి కొంత కోపం వచ్చి వుండాలి! "నేను డిక్షనరీకి రిఫర్ చేస్తాను" అన్నాడు "మీ యిష్టం వచ్చిన నిఘంటువుకు రిఫర్ చెయ్యండి పటం అనేదే ఉండి తీరాలి. మనం వ్యావహారికంగా పటం అని అంటున్నాము" అన్నాను ఆమీద ఆ విషయమై మరి ఎట్టి చర్చా జరగలేదు

ఒకసారి ఒక సారస్వత సంఘ సమావేశంలో ఉపన్యసిస్తూ, ఒక కాలేజీ లెక్చరరు తన ప్రసంగంలో "విధ్య" అనే అనేకసార్లు వాడినాడు అట్టి విద్యావేత్త ఆ విధంగా అనడం వింతగానే ఉన్నది అక్కడ ఒత్తు లేదనీ, ఒత్తు పెట్టడం తప్పనీ ఎవ్వరు అనగలుగుతారు?

ఇట్టి సంఘటనలు జరగడానికి కారణం విద్యా ప్రణాళికలలోని లోపమే కాని మరొకటి కాదు ఇట్టి ప్రణాళికలను అనుసరించి ప్రభుత్వమువారు నియమించిన పద్ధతులలో వ్రాయబడిన పుస్తకాలు ఎలా వుంటాయో మనం వూహించుకోవచ్చును.

ప్రస్తుతం అమలులో ఉంటూవున్న పాఠ్యగ్రంథాలను రెండు రకాలుగా విభజించవచ్చును. అందులో కొన్ని ప్రభుత్వంవారి ఆమోదం పొందినవి, కొన్ని ప్రభుత్వంచేత నిర్ణయించబడినవి ప్రభుత్వపు ఆమోదాన్ని పొందిన పుస్తకాలను ఆ యా తరగతులకు సంబంధించిన వాటిని వేటినైనా విద్యాలయాలు పఠనీయాలుగా గ్రహించవచ్చును కాని గవర్నమెంటువారి పబ్లిక్ పరీక్షలకు మాత్రం వారు నిర్ణయించిన పుస్తకాలను తప్ప ఇతర పుస్తకాలను ఉపయోగించకూడదు

పై రీతిని ప్రభుత్వపు టామోదంగాని, ప్రభుత్వ నిర్ణయంగాని విద్యాశాఖవారు నిర్ణయించిన వివిధ విషయాలకూ (సబ్జెక్టులకు) వర్తిస్తూ

వుంటుంది. ప్రాంతీయాదిభాషలయొక్కయూ, గణితం, విజ్ఞానం, సాంఘికశాస్త్రం మొదలైన విషయాలయొక్కయూ బోధనకు ఆమోదముద్ర వేసుకున్న పుస్తకాలే వుండాలి! అట్టివాటిలో తెలుగుభాషకు సంబంధించినంతవరకూ ఇక్కడ కొంత వివరింపబడుతుంది ఆ తర్వాత విషయాంతరాలకు మచ్చుగా సాంఘిక శాస్త్రమును గురించి కొంత చర్చించబడుతుంది

మన తెలుగు పాఠ్య పుస్తకాలలో ఆ యా తరగతులకు తగినట్లుగా కొన్ని పద్యాలు వుండవలెననీ, కొన్ని పుటల వచనం వుండవలెననీ నియమం వున్నది. పాఠాలు విద్యార్థులకు వివిధ విషయాల పరిచయం కలగడానికని కొన్ని వేర్వేరు విషయాలూ సూచించబడుతవి పుస్తకాలను వ్రాసేవారు ఆ విషయాలను పుటల సంఖ్యనూ, పద్యాల సంఖ్యనూ ప్రధానంగా తీసుకుని పాఠాలు వ్రాయుడమో చేస్తారు. కాని తరగతిలో వుండే బాలుని మనస్సుల్లో వుంచుకోవడం చాలా అరుదు అందువల్ల మొదటిపాఠం మొదలుకొని ఆరవ పాఠం వరకూ ఒకే పాఠం వుండడం కద్దు. చిన్నయరిగారి నీతి చంద్రికలోని మిత్రలాభ పాఠంగాని మిత్ర భేదంపాఠంగాని, ఏదో ఒకపేరుతో ఇంచుమించుగా అన్నితరగతుల పుస్తకాలలోనూ, వివిధ రచయితలు కూర్చిన ప్రచురణలలోనూ, వుంటూనే ఉన్నవి. ఏనుగు లక్ష్మణకవి నీతిపద్యాలు "కుసుమ గుచ్ఛంబునకు బోలె" మొదలైన పద్యాలు అన్ని తరగతి పుస్తకాలలోనూ కానవస్తాయి పంచతంత్రమూ, కేయూర బాహుచరిత్రమూ, భారతమూ మొదలైన గ్రంథాలలోని పద్య—కథలూ, రామనూ, జగదీశచంద్రబోసూ, మార్కోనీ, న్యూటనూ, క్యూరీసలి మొదలైన విజ్ఞాన వేత్తల జీవితాలూ, తరగతుల భేదం లేకుండా అన్ని పుస్తకాలలోను వుండవలసినదే! అవి విద్యార్థులు అర్థం చేసుకోగలరా, లేరా?, అవి వారి తరగతికి తగినట్లున్నవా, లేవా? అనే ఆలోచన వుండడం చాలా మటుకు అరుదే! పుస్తకం వ్రాసేవారు తమ స్థాయికి విద్యార్థిని లాగుకొని రావడంకోసం ప్రయత్నించకుండా, తామే విద్యార్థి స్థాయికి దిగి, తామున్నూ, ఆ తరగతిలోని ఒక విద్యార్థిననే భావించుకొని, వ్రాయడమే ఎంతో మేలు! ఆవిధంగా తానూ ఆ తరగతిలోని విద్యార్థిననే భావనతో వున్నప్పుడు తయారుచేసే పాఠాలు ఆ తరగతిలోని బాలురకు అర్థం కాగలవో లేవో సులభంగా గ్రహించవచ్చును

ప్రభుత్వ విద్యాశాఖవారి ఆమోదం చాలమంది ప్రకాశకులు ప్రకటించిన పుస్తకాలకు లభించవచ్చును అందువల్ల ఆ యా విద్యా సంస్థలవారు ఆ ప్రకటిత వాచక పుస్తకాల్లోని మంచి వాటిని ఏర్చుకుని తమ విద్యార్థులకు పఠనీయాలుగా నిర్ణయించుకోవచ్చును. కాని ప్రభుత్వంవారు నిర్ణయించిన పుస్తకాలను కాదని తోసిరాజు చెయ్యడానికి మాత్రం సాధ్యంకాదు అవి యెలాగునవున్నా విద్యార్థులు వాటిని చదివి తీరవలసినదే!

ప్రభుత్వమువారూ. ఉన్నత పరీక్షలకు విశ్వ విద్యాలయాలవారూ నిర్ణయించే ప్రాచీన గ్రంథాలలోని పాఠ్యాలు సాధారణంగా చర్విత చర్వణంగానే వుంటాయి అంటే—పాతికేళ్లనుంచీ వస్తూవున్న పాఠ్యభాగాలను చూస్తే ఒకసారి నిర్ణయించబడిన పాఠ్యాలే పదేపదే వస్తూ వుండడం గోచరం అవుతుంది భారతం అయితే—శిశుపాలవధ, ఉత్తరకుమార ప్రజ్ఞలు, దుష్యంత చరిత్ర, సావిత్రీ చరిత్ర, సంజయు రాయబారం, శ్రీ కృష్ణుని రాయబారం ఘోష యాత్ర సామాన్యంగా వుంటాయి భాగవతంలో అయితే ప్రహ్లాద చరిత్ర, గజేంద్రమోక్షం, వామనావతారఘట్టం, రుక్మిణీ కల్యాణం, కుచేలోపాఖ్యం వుంటాయి శ్రీనాథుని గ్రంథాలలో అయితే హంస దౌత్యమూ, నల దౌత్యమూ, గుణనిధి కథా, వ్యాసుడు కాశిని శపించే ఘట్టమూ వుంటాయి మనుచరిత్రలో ప్రవరుని వృత్తాంతము, మనోరమా వృత్తాంతము, ధూర్జటి కవి తిన్నని చరిత్రా, కిరాతార్జునీయ ఘట్టమూ వుంటాయి

ఈ రీతిని వెనుక వుండిన పాఠ్య భాగాలనే మరల, మరల నిర్ణయిస్తూ వుండడానికి కారణం యేమిటో మీరు సులభంగానే గ్రహించగలరు

వెనుక వుండిన పాఠాలే మరల ,మరల రావడంలో అట్టే కష్టంలేదు కాని వెనుక అచ్చుపడినవానినే ఆ విధంగానే అచ్చు వెయ్యడంవల్లనే ఎక్కువ చిక్కు వస్తూ వున్నది ఇదివరలో ఎక్కడ, ఎలాటి తప్పులు వున్నవో, అవే ఆ విధంగానే తిరిగీ కాన వస్తూ వున్నవి దీన్నిబట్టి ఆ యా పుస్తకాలను సమకూర్చేవారు పాఠాలను ఒకసారి చదివే శ్రమ తీసికోకుండా వెనుకటి పాఠాలను యధాతధంగా అచ్చుకు ఇస్తూ, వున్నారని అనుకోవలసి వస్తున్నది. ఉదాహరణకు ఈ సంవత్సరం స్కూలు ఫైనలుకు వున్న (1961) తెలుగు పాఠ్య పుస్తకాన్ని తీసుకోవచ్చును. అందులో "ఉత్తర కుమార ప్రజ్ఞలు" అనే పాఠంలో ఉత్తర కుమారుడు విధిలేక బృహన్నల సారథ్యానికి అంగీకరించిన సందర్భంలో ఇట్లున్నది.

"మన మురియాడుచు నుండగ
దన కొరు లప్పటికి లేమి ధరణీశ్వర నం
దనుడు బృహన్నల బిలువం
బనుచుట కొడబడిన పలుకు పలుకుటయు దగన్.
సైరంధ్రి దెసగనుంగొని 'ఏనుబోయి తోడ్కొని వచ్చెద' నని పూని
మెరుగు మొగిలు సొచ్చు తెరగున నాట్య మం
దిరము సొచ్చి తనదు గురువుకడకు
నరిగి నెమ్మి నిట్టలను నింతి ప్రార్థనా
నయ సంభ్రమములు పెనగొనంగ" (పు 17)

ఉత్తర కుమారుడు బృహన్నల సారధ్యానికి సమ్మతించిన తర్వాత సైరంధ్రి దెస గనుంగొని "నేను తీసుకొని వస్తాను" అని చెప్పిన వారెవరు? ఇంతి! ఆయింతి సైరంధ్రి ఎంతమాత్రమూ కాదు ఉత్తరయే అయి తీరాలి. కాని ఆమె పేరు ఆ స్థలంలో కానరాదు ఆ పేరు లేకపోతే గ్రంధ సమన్వయం కాదు అందుచేత 'ఉత్తర సైరంధ్రి దెస గనుంగొని నేనుపోయి అతనిని తీసుకొని వస్తా'నని చెప్పినట్లు అనుకోవాలి తిక్కన యిక్కడ సమన్వయ రహితంగా వ్రాసివుంటాడని అనుకోలేము కదా! ఈ భారతంలో ఈ ఘట్టంలో 'ఏనుబోయి తోడ్కొని వచ్చెదనని పూని' అనే వచనానికి తర్వాత ఒక సీస పద్యం వున్నది దాని ఎత్తు గీతి చివర " ఉత్తర నర్తనశాల కరిగె" అని కలదు ఆ పద్యం వున్నప్పుడే సమన్వయం కుదురుతుంనే పాఠ్య పుస్తక సంపాదకులు

ఆ పద్యాన్ని తీసివేసినందున సమన్వయం కుదరకుండాపోయింది ఈ పాఠ్య భాగమే 18 ఏండ్ల క్రిందట వరసగా మూడేళ్లపాటు పయి పరీక్షలకు పఠనీయంగా వుండినది అప్పుడు కూడా ఈ మాదిరిగానేవుండి, సమన్వయం కాకపోయినది. సంపాదకులు ఆ పాఠ్యభాగానికి కాపీ వ్రాయించో, లేక ఆ భాగాన్ని సంపాదించో అచ్చుకు యిచ్చివుండాలి, తాము పాఠాన్ని చదివి సరిగా వున్నదని నిశ్చయించి మాత్రం అచ్చుకు ఇచ్చివుండరని అనుకోవలసివున్నది

మచ్చుకు ఈ ఉదాహరణం ఒక్కటే చాలును

ఇంక ప్రభుత్వం ఆమోదం పొందే పుస్తకాలను గురించి కొంచెం గమనిద్దాం. పుస్తకములను ప్రకటించేవారు ప్రభుత్వంవారు నిర్ణయించిన పద్ధతులను అనుసరించి రచయితలచే పుస్తకములు వ్రాయించి, ప్రభుత్వ నిర్ణీతమైన రుసుముతోపాటు ఆ పుస్తకములను ఆమోదించుటకై పంపుతూ వుండడం పరిపాటి గ్రంథములలోని బాగోగులను పరిశీలించి, అర్హతానర్హతలను నిర్ణయించడంలో దక్షులైనవారికి ఆ పుస్తకాలు పంపబడతాయి వారి నిర్ణయాన్ని అనుసరించే ప్రభుత్వం పాఠ్యాలుగా నిర్ణయించబడిన పుస్తకముల పట్టీని గెజెట్‌లో ప్రకటిస్తుంది. అయితే, ఆ గ్రంథ నిర్ణాయకులు ఎవరని అడగవచ్చు. వారి పేర్లు మాత్రం ప్రకటించబడవు కాని అవి బయట పడకుండా వుండవు కూడాను. ఆ పుస్తక నిర్ణాయక సమితిలో సభ్యులు సాధారణంగా ప్రభుత్వ విద్యాశాఖకు సంబంధించినవారూ, వారి కాలేజీల ప్రిన్సిపలులూ, ప్రొఫెసరులూ వుంటారు ఒకరిద్దరు ఇతరులు కూడా వుంటే వుండవచ్చు. తాము నిర్ణయించిన సభ్యులే ఆ యా విషయాల్లో తగినవారని ప్రభుత్వంవారు భావిస్తే భావించవచ్చును గాని, ప్రభుత్వంవారి ఆమోద ముద్ర వేసుకున్న పుస్తకాలను చూస్తే మాత్రం నిర్ణాయకులు ఆ యా విషయాల్లో సమర్థులైనట్లు చెప్పలేము

ఒకప్పుడు ఒక జిల్లా విద్యాశాఖాధికారి పయి సమితిలో సభ్యుడుగా వుండేవాడు. ఆయనే ప్రధాన సభ్యుడు కూడాను ఆయన ఒక పుస్తకంలోని "....చదువులొచ్చు" అనే వాక్య భాగాన్ని విమర్శిస్తూ "చదువులు వచ్చు' అని వుండాలిగాని చదువులు ఒచ్చు అని తప్పు పదంతో సంధిచేసి 'చదువులొచ్చు' అని చెప్పడం తప్పు ప్రకాశకులు యికమీద యిలాటి తప్పులు రాకుండా శ్రద్ధగాచూచి అచ్చు వేయించుకుంటూ ఉండాలి" అని హెచ్చరించారట! కాని, యథార్థాన్నిబట్టీ, అక్కడి సందర్భాన్నిబట్టీ చూచిన యెడల 'చదువు లోటు' అనే అర్థం కాని, చదువులు వచ్చుననే అభిప్రాయం ఎంతమాత్రమూ లేదు అది కుదురదు కూడా. ఆయన ఆ పుస్తకం చదివినా, కనీసం ఆ పుటనైనా పూర్తిగా చదివినా అలా అని వుండరు!

ఒకప్పుడు ఒక కళాశాలకు ప్రిన్సిపాలుగా ఉన్న విద్యావేత్త ఒక పుస్తకం పేరు చూచి, ఆ పేరు తనకు నచ్చకపోగా "ఇది బాగులేదు" అంతా పాత సరుకు అని పేరే చెప్తూ వున్నది. ఇది పాఠ్య పుస్తకంగా వుండకూడదు" అని తన తీర్పు ఇచ్చారట! నిజానికి ఆ పుస్తకం అందరి మన్ననలనూ పొందినది ఆ తర్వాత తర్వాత అందులోని భాగాలు గ్రంథాంతరాల్లో పాఠ్యభాగాలుగా స్వీకరించబడ్డాయి. దీనినిబట్టి చూడగా ఆ విద్యావేత్త ఆ పుస్తకంలోని కొన్ని పుటలనయినా చదవకుండానే తన అభిప్రాయాన్ని వెల్లడించినట్లు తెలుస్తుంది.

ఒకసారి ఒక పెద్ద విద్యాశాలలో ఉన్నత పదవిలో ఉండిన విద్యావేత్త యొకరు గ్రంథ నిర్ణాయక సమితిలో ముఖ్య సభ్యుడుగా ఉన్నారు ఆయన ఒక చిన్న వాచక పుస్తకాన్ని పరిశీలిస్తూ, అది పాఠ్యంగా ఉండడానికి తగదంటూ, ప్రభుత్వానికి తెలిపాడు. యిలా చెప్పడానికి ఆయన ఆ పుస్తకంలోని కొన్ని తప్పులను చూపించారు. 'ఆ తప్పులలో భాస్కరశతకంలోని "కొండొక కోతి చెట్టు—కొన కొమ్మను మండగ క్రింద గండభేరుండ మదేభ సింహ నికురుంబము లుండవె చేరి భాస్కరా!" అనే చోటగల గండభేరుండ పదానికి మృగం అని అర్థం చెప్పడం ఒకటి గండభేరుండం పక్షిగాని, మృగంకాదని ఆయన అభిప్రాయం ఆయన నిఘంటువునయినా దగ్గర వుంచుకుని పరిశీలిస్తే బాగుండేది. నిఘంటువులలో మృగం అనే అర్థం కూడా ఇయ్యబడి ఉన్నది ఇక్కడ పక్షి అనే అర్థం కుదరదు ఏనుగులతోనూ, సింహాలతోనూ కలిసి మెలిసివుండేది మృగం అవుతుందిగాని, పక్షికాదు. పక్షులు చెట్లమీద వుంటాయికాని, చెట్ల క్రింద కూర్చుని వుండవు.

అదే పుస్తకంలో చరిగొండ ధర్మన్న రచించిన చిత్రభారతంలోని పారిజాతాపహరణ కథను అనుసరించి వచనంలో ఒక పాఠం వున్నది. ఆ కథ ముక్కు తిమ్మన పారిజాతాపహరణ కథలాగు ఉండదు. శ్రీ కృష్ణుడు సత్యభామా సమేతంగా నరకాసుర వధానంతరం అదితికి ఆమె కుండలాలు ఇవ్వడానికి ఇంద్రలోకానికి వెళ్లగా శచీదేవి సత్యభామను అవమానించినట్లున్నూ, తర్వాత శ్రీ కృష్ణుడు పారిజాతాన్ని అపహరించినట్లున్నూ, అందులో ఉన్నది. ఆ పుస్తక నిర్ణాయక సమితికి చెందిన ఆ విద్యావేత్త చిత్రభారతాన్ని చూడనందువల్లనూ, ముక్కు తిమ్మనార్యుడు వ్రాసిన పారిజాతపహరణ కావ్య కథను మాత్రం ఎరిగి వున్నందువల్లనూ పాఠ్య పుస్తకంలోని కథ సరికాదని వివరించారు విద్యావేత్తలే యింత తేలికగా అభిప్రాయం యిస్తే కాదని ఎదురు తిరిగే సాహసం ఎవరికి వుంటుంది.

ఒకసారి ఒక ఉపవాచకంలో వసంతసేన కథ ఒక పాఠంగా ఇయ్యబడినది అది సంస్కృతంలోని మృచ్ఛకటికం అనే నాటకాన్ని అనుసరించినది. శకారుడనేవాడు ఆ కథలో వచ్చే పాత్రలలో ఒకడు శకారుడు ఎప్పుడూ అవకతవకగానూ, అసందర్భంగానూ మాటలాడుతూ వుంటాడు "రావణుడు కుంతిదేవిని స్వాధీనం చేసుకున్నట్లు నిన్ను స్వాధీనం చేసుకుంటాను" అని అతడు ఒకమాటు వసంతసేనను గురించి అంటాడు ఈ మాట ఆ పాత్ర అవ్యక్తతను వెల్లడిస్తూ, ఆ పాత్రను బాగా పోషిస్తూ వున్నది ఈ వాక్యాన్ని మాత్రం చూచిన పుస్తక నిర్ణాయక సమితి సభ్యుడు "రావణుడు కుంతిని వశపరచుకోవడ మేమిటి? ఇది చాలా అసందర్భం ఇలాంటి అసందర్భపు వాక్యాలువున్న పుస్తకం ఎంతమాత్రమూపాఠ్య గ్రంథంగా వుండకూడదు" అని గట్టిగానే ప్రతిఘటించాడు ఆ ప్రతిఘటనకు ఫలంగా—అప్పుడు ఆ పుస్తకం విద్యార్థులకు పాఠ్య గ్రంథంగా ఉండలేకపోయింది పాఠ్య నిర్ణాయక సభ్యులు చేసే యిట్టి నిర్ణయాలవల్ల గ్రంథ ప్రకాశకులు చాలా దెబ్బ తినవలసి వస్తున్నది

ప్రభుత్వంవారు స్వంతంగా ప్రకటించి నిర్ణయించిన పుస్తకాల దృష్ట్యా చూస్తే ప్రత్యేక సంస్థలు ప్రకటించే పుస్తకాలు కొంతవరకూ మెరుగే అని చెప్పాలి ప్రకాశకులు ఎక్కువ లాభాలు సంపాదిస్తున్నారనే భ్రాంతితోనూ, వారు ప్రకటించే పుస్తకాలకంటె తమ పుస్తకాలు ఎంతో మెరుగుగా వుంటాయనే దృఢ విశ్వాసంతోనూ యీమధ్య ఆంధ్ర ప్రభుత్వంవారూ, మద్రాసు ప్రభుత్వంవారూ కూడా స్వంతంగా పాఠ్య పుస్తకాల ప్రచురణకు పూనుకున్నారు ఆ ప్రచురణలు ఎంత అవక తవకగా వున్నదీ, పత్రికలవల్ల స్పష్టమయింది. మద్రాసు ప్రభుత్వంవారి "క్వెంటిన్ డర్వార్డు" ఆంగ్ల సంగ్రహమూ, ఆంధ్ర ప్రభుత్వంవారి తెలుగు అయిదవ వాచకమూ ప్రభుత్వ విద్యాశాఖవారి అసమర్థతకు మచ్చుతునక లయినవి! ఈ పద్ధతి ప్రారంభమయ్యేముందు అనుభవజ్ఞులగు తెలివిద్యావేత్తలు ప్రభుత్వాధికారులవద్దకు పోయి, పరిస్థితులను ఎంత వివరంగా తెలిపినా వారు పెడచెవిని పెట్టారట!

ఇక ప్రభుత్వ విద్యాశాఖ వారి ఆమోదాన్ని పొందిన ఇతర పఠనీయ పుస్తకాలను గురించి కొంచెం మనవి చేస్తాను. అందులో సోషల్‌స్టడీస్ అనబడే సాంఘిక శాస్త్రానికి సంబంధించిన—తొమ్మిదవ తరగతి పుస్తకాన్ని గురించి తెలుసుకుంటే—మిగిలిన తరగతులను గురించిన్నీ మిగిలిన విషయాలను గురించిన్నీ వేరే వివరంగా తెలుసుకొనే అవసరం వుండదు

ఒక సుప్రసిద్ధమైన ప్రకాశక సంస్థవారు ప్రకటించిన గ్రంథంలో ఎలా ఉన్నదో చూడండి

(1) "రూర్కేలా, భిలాయ్, దుర్గాపూరు మొదలైన ఇనుము—ఉక్కు పరిశ్రమ శాలలు—"

ఇక్కడ "రూర్కేలా (రౌర్కేలా—సరియైన పేరు) భిలాయ్, దుర్గాపూరు మొదలైన స్థలములలోగల—అని వుండవలెను. అవి వూళ్ల పేరులు. పయి వాక్యభాగాన్నిబట్టి అవి వూళ్లనే సంగతి విద్యార్థులకు తెలియదు. కంపెనీల పేర్లనే వారు అనుకుంటారు

(2) "ఈ నాయనార్లు తమ ఉద్యమములో అనేక భక్తిగీతములను రచించిరి వానిని తేవారము అందురు. ఆటువంటి కొన్ని తేవారముల కూర్పే తిరువాచకమనెడు ఉద్గ్రంథము......"

వాయునార్ల భక్తిగీతాలున్న గ్రంథం పేరు తేవారం! అంతేకాని, ఆ గీతాలకు తేవారములని పేరు లేదు తేవారం అనేది ఒక్కటే! ఎక్కువగా తేవారాలు ఉన్నవనడం సరికాదు. అంతేకాక తిరువాచకం వేరు తేవారంపేరు. ఆ రెండూ అభిన్నాలని వ్రాయడం చాలా వింత!

(3) "రామాయణ కాలములో ఒహు భార్యా వివాహము ఆచరణలో నుండినట్లు తెలియుచున్నది. దశరథునికి నలుగురు భార్యలుండిన సంగతియే దానికి ప్రబల నిదర్శనము "

దశరథ మహారాజునకు ముగ్గురు భార్యలు ఉండిరని ఇప్పటివరకూ వింటున్నాము. రచయిత నలుగురు భార్యలని ఎలా వ్రాశారో! ఆ మహారాజునకు నలుగురు కుమారు లుండడంవల్ల నలుగురు భార్య లుండివుండవచ్చునని అనుకున్నారేమో!

(4) "మొదటి మహేంద్రవర్మ సంస్కృతములో గట్టి పండితుడై యుండెను మత్తవిలాసప్రహసనమని ఒక కావ్యమును గూడ రచించెను "

మత్త విలాస ప్రహసనం ఆ పేరునుబట్టే హాస్య ప్రధానమైన ప్రహసనమని తెలుస్తూ వున్నది. అది కావ్యం కాదు

ఇంకా ఆ పుస్తకంలో "బౌద్ధమతం' అనడానికి బదులు 'బుద్ధమతము' అనీ, 'రాచరికం' అనడానికి మారుగా 'రాజరికం' అనీ, ఈ మొదలైన పదాలు మరికొన్ని ధారాళంగా ఉపయోగింపబడినవి

అయితే 'విషయం ప్రధానంగాని, యిలాంటి పుస్తకాలలో భాష ప్రధానం కాదు కదా!' అని కొందరు భావించవచ్చును కాని విషయంతోపాటు భాషను కూడా గమనించబడవలసినదే! కావ్యాలు విసంధిగావుంటే వుండవచ్చునుగాని, ప్రసిద్ధంగావున్న 'బౌద్ధమతం' మొదలైనవాటిని 'బుద్ధమతం' అనే రీతిని మార్చడం మాత్రం భావ్యం కాదు కదా! ఇలాటి వాటిలో భాష ప్రధానం కాదని అంటే, విద్యార్థులు వాక్యాలను సరిగా వ్రాయకపోయినా తప్పు పట్టడానికి వీలుండదు

ఇలాంటి వాటిని ఎన్నింటినైనా చూపవచ్చును కాని అలా చూపినందువల్ల ప్రయోజనం లేదు పయి విషయాలను పరిశీలించి చూడగా—ముము ముందు మన పాఠ్య పుస్తకాల విషయంలో ఏ రీతిని జాగ్రత్త వహించాలో గ్రహించ వీలవుతున్నది.

ఏ దేశంలోనయినా సరే, ప్రభుత్వానికి విద్యాశాఖ వ్యయశాఖేకాని ఆదాయ శాఖ కాదు ఇతర దేశాల్లో విద్యా విషయం ప్రధానంగా గ్రహించబడుతూ వుంటే, మనదేశంలో అప్రధానంగా చూడబడుతున్నది. విద్యా విషయంలో విద్యార్థుల ఉచిత విద్యకూ, నిర్బంధ విద్యకూ, మధ్యాహ్న భోజనాలకూ, వైదేశిక విద్యకూ, విశ్వవిద్యాలయాలకూ ఎక్కువ సొమ్ము ఖర్చవుతున్నది. కాని సామాన్య విద్యకు ఎక్కువ వ్యయం చెయ్యడంలేదని అభిజ్ఞుల అభిప్రాయం. ఆ సంగతి ఎలావున్నా, పుస్తకాలను ప్రచురణచేసి, అవే నిర్బంధంగా పఠనీయాలని నిర్ణయించి ధనం సంపాదించడం విద్యాశాఖ చెయ్యవలసిన పని కాదు. ప్రభుత్వం ప్రకాశ సంస్థలకు ప్రోత్సాహం యిచ్చి, అవి మంచి పుస్తకాలు ప్రచురించేటట్లు చూడాలి

విద్యాశాఖవారు భాషా వాచకాలనూ, వివిధ శాస్త్ర పుస్తకాలనూ, నిర్ణయించే సంఘంలో అధికార పదవులలో ఉన్న వారిని కాకుండా ఆ యా విషయాల్లో అనుభవమూ, సామర్థ్యమూ వున్న విద్యావేత్తలనే సభ్యులనుగా నిర్ణయించాలి. ప్రకాశకులు తయారుచేసిన ప్రతులనూ వ్రాతప్రతులనూ ఆమోదం కోసం పంపుటకు వీలుగా, వాటికి చెల్లించవలసిన రుసుమును తగ్గించాలి!

వారు ప్రకటించే పాఠప్రణాళిక ఆ యా తరగతుల విద్యార్థులు గ్రహించడానికీ, అధ్యాపకులు బోధించడానికీ అనుకూలమైన స్థితిలో వుండాలి.

భాషా పాఠ్య పుస్తకాలలో మాదిరిగానే ఇతర విషయాల పాఠ్య పుస్తకాలలో కూడ భాషకు కూడా ప్రాముఖ్యం ఇవ్వాలి అంటే—అట్టి పుస్తకాలను నిర్ణయించేటప్పుడు విషయంతోపాటు భాష కూడా చక్కగా వుండేటట్లు చూడాలి అలా వున్నప్పుడే దేశభాషలో విద్యాబోధనకు ప్రయోజనం

చరమాంకం

శ్రీ మధురాంతకం రాజారాం

సోమశేఖరంగారు యింటి దగ్గర బయల్దేరి నప్పుడు గంట పరిగ్గా అయిదున్నర ఆయన తిన్నగా మాదాగుడివీధి వెంబడి హైరోడ్డుదాకా నడిచి, బంకులో ఓ వారపత్రిక కొనుక్కొని దగ్గర్లో ఉన్న పార్కులోకి వెళ్ళి సిమెంటు బెంచిపైన కూర్చున్నారు

ఆకాశవాణి మనసు కందని మహోన్నత భావాలకు సంగీతానువాదం లాంటి ప్రఖ్యాత విద్వాంసుడి నాదస్వరకచ్చేరీని వినిపిస్తోంది. సంజకెంజాయల పసిడి వెలుగుల్లో పార్కు పార్కంతా ఒకే ఒక పూలగుత్తిలా కనిపిస్తోంది చింతలకూ, వంతలకూ చోటులేని ఆనందలోకాలకు ఏలికల్లాంటి కుర్రవాళ్ళు కొందరు పచ్చిక జొంపాలపైన బడి దొర్లుతున్నారు

సోమశేఖరంగారు ఆదినుంచీ చివరి వరకూ పత్రిక నొకసారి త్రిప్పి చూడదలుచుకున్నారు కానీ ఆ లోపలే పత్రిక ఆయన చేతిలోంచి జారిపోయింది ఒడ్డున పడివుండి తరంగం వెంట సముద్రంలోకి వెళ్ళిపోయే వస్తువులా మనసు సంగీతం వెంట కదలిపోవడంవల్లనైతేనేమి, సాయంకాలపు సహజసౌందర్యం తమ రసిక హృదయానికి గిలిగింతలు పెట్టడంవల్లనైతేనేమి, ఆయన అవశులై అరమోడ్పు కళ్ళతో అలాగే సిమెంటు బెంచీ కానుకొని కూర్చుండిపోయారు

కాలం గడిచిపోతోందన్న స్పృహైనా లేకుండా సోమశేఖరంగారలా కూర్చొని ఉండగానే సూర్యు డస్తమించాడు సంధ్య మంచులా కరిగిపోయిన కొద్దీ అంధకారం లోకంపైకి విజృంభించింది చీకటి రాకాసిపైకి మానవుడు ప్రేల్చిన మండుతున్న తూటాలకు మల్లే పట్టణ మంతటా విద్యుద్దీపాలు వెలిగాయి సోమశేఖరంగారు కళ్ళు తెరిచి మళ్ళీ ఈ లోకంలో పడేసరికి, నాదస్వరం పూర్తయి రేడియోలో గ్రామస్థుల కార్యక్రమం వినిపిస్తోంది అదీ, దాని తర్వాత దైనిక వార్తావిశేషాలు ప్రసారిత మయ్యేవరకూ పైకి లేవక పోవడం సోమశేఖరంగారి అలవాటు అప్పటికి గంట ఏడున్నర అవుతుంది అప్పుడు పైకి లేచి, వచ్చినదారివెంబడే గృహోన్ముఖులై ఇల్లు చేరుకునేసరికి ఎనిమిది గంటల సైరన్ మ్రోగుతుంది అది సోమశేఖరంగారి యింట్లో భోజనవేళ మనుమళ్ళు, మనుమరాళ్ళూ ఆయనకోసం ఎదురుచూస్తూ ఉంటారు. బుజ్జాయి, చిట్టిగాడూ, రమేషూ ఓ వైపున అమ్మణ్ణి, అరవింద, శారదా మరోవైపున కూర్చుంటే హారంలో నాయకమణిలా సోమశేఖరంగారు మధ్యలో కూర్చుంటారు. వడ్డించే వంతు రాజ్యలక్ష్మమ్మది! పిల్లల్లో ఆయనా ఒక్కరైపోయి భార్యకు వూపిరి సలుపకుండా పనులు పురమాయిస్తారు సోమశేఖరంగారు—"చిట్టిగాడికి మరి కొంచెం పచ్చడి వేయగూడదూ ? .... అమ్మణ్ణికి నెయ్యి వెయ్యనేలేదే ! . నా దగ్గర నీళ్ల గ్లాసేది ! ..."

మాటిమాటికీ గుంజిళ్ళు పెట్టలేక "మీరు మరీ కుర్రవాళ్లయిపోతున్నారండీ రాను రానూ" అంటూ విసుక్కుంటుంది రాజ్యలక్ష్మమ్మ.

"చూశావా రాజ్యం ! నేను ఉద్యోగం చేస్తున్న రోజుల్లో నువ్విలా విసుక్కునేదానివేనా ! అడుగులకు మడుగులొత్తే దానివి ఇప్పుడు నేనూ నీతోబాటు యింట్లో కూర్చోబట్టి యింతగా అలుసైపోయాను అందుకే మరి, ఉద్యోగం పురుషలక్షణం అన్నారు పెద్దలు "

"అబ్బే, మీ రిలా అనుకుంటారని తెలిస్తే, నే నామాట అనేదాన్నే కాదండీ ! " అంటూ నొచ్చుకుంటుంది రాజ్యలక్ష్మమ్మ అయినా ఈ భువనగారి దిలాంటి బేలమనసని ఆమెకు మాత్ర మేం తెలుసు ?

రిటయిర్డు డి. ఎస్. పి సోమశేఖరంగార పూర్వాశ్రమంలో బండరాతిలా కర్కశులని ప్రతీతి నిజమే ! ఆయన బూట్ల చప్పుడుకు భూమి కంపించేది పొగ చుట్ట కాలుస్తూ ఆయన రూక్షవీక్షణాలు బరపితే ఎదుట నిల్చున్న క్రింది ఉద్యోగి గడగడలాడిపోయేవాడు. ఉద్యోగజీవితంలోనే కాదు, ఆయన యించుమించు యింట్లో గూడా అలాగే సంచరించేవారు నేరం చేయగా పోలీసులు పట్టి తెచ్చిన నేరస్థుడిపట్ల ఎలాగైతే నిర్దాక్షిణ్యంగా ప్రవర్తించేవారో, అలాగే తప్పు చేసినప్పుడు తమ బిడ్డనైనా కఠినంగానే దండించేవారు కాని ఉద్యోగవిరమణతో బాటు, ఆయన తమ కర్తవ్యదీక్షను గూడా విస్మరించారేమో మరి ! ఇప్పు డాయన దుందుడుకులైన మనుమళ్లపైన, ఎంకు పట్టు పట్టే మనుమరాళ్లపైన తల్లిదండ్రులు చేయి చేసుకోడానికి వీల్లేకుండా కాపున్న అంగరక్షకుడు వాళ్ల ఆటలకు రెఫ్రీగా, పాటలకు ప్రధాన శ్రోతగా వ్యవహరించే వేడుకచెలికాడు ఇంకేముంది ! ఆయన నాలుగు కాళ్లతో గుర్రంలా తయారై ఏ చిట్టిగాడినో, ఏ అమ్మణ్ణినో వీపుపైన ఎక్కించుకుని, వేగంగా వెళ్లనందుకు వాళ్లచేత దెబ్బలు తినడ మొకటే తరువాయి

రేడియోలో గ్రామస్థుల కార్యక్రమం గూడా ముగిసింది

బెంచీలో చేరగిలబడి కూర్చున్న సోమశేఖరంగారు వార్తల్ని సావధానంగా వినడానికి వీలుగా సర్దుకుని కూర్చున్నారు అలా సర్దుకుంటూ ఉండగా కానుగచెట్టు నీడలో నిల్చుని తనవైపు చూస్తున్న ఆకారం ఒకటి ఆయనకు కనిపించింది కళ్లజోడు సవరించుకుంటూ ఆయన "ఎవరక్కడ ?" అన్నారు

"తెలియడంలేదా సోమశేఖరం ! ఎలా తెలుస్తుంది ? ఏండ్లూ, పూండ్లూ గడిచిపోయిన మాట నిజం ! బహుశా మరచిపోయి ఉంటావు "

నీడలోనుంచీ ఆ ఆకారం ఈవలికి వచ్చింది

ఇంత చనువుగా తనను పలకరిస్తున్న ఆ వ్యక్తికేసి చూస్తూ నివ్వెరపడిపోయారు సోమశేఖరంగారు అతగాడు ఆరడుగుల మనిషి తలపైన టోపీ పెట్టుకున్నాడు నల్లద్దాల కళ్లజోడులో కళ్లను పదిలపరచుకున్నాడు. ఏటవాలుగా క్రిందికి దిగి, చుబుకం దగ్గర కలుసుకుని 'V' ఆకారంలో అమరివున్న చెంపలమీద క్రొత్తగా గడ్డాన్ని సాగు చేస్తున్నాడు తొడుక్కున్నది పొడుగాటి సిల్కుజుబ్బా కానీ అది బాగా మాసిపోయినట్టుంది. చేతిలో ఒక తోలుసంచి తప్పితే అతడి వెంట సామాన్లేవీ లేవు. మనిషి మాత్రం క్రిక్కిరిసిన రైలుబండిలో వందలకొలది మైళ్ళు ప్రయాణం చేసి అలసిపోయినట్టున్నాడు ఇన్ని వివరాలూ ఒక్క చూపుతోనే తెలిసివచ్చాయి సోమశేఖరంగారికి ! కానీ ఈ వివరాలలోనుంచీ యితడెవరన్న ప్రశ్నకు సమాధానం మాత్రం లభించింది గాదు

"ఆశ్చర్య మేమిటంటే సోమశేఖరం, పదిహేనేళ్లకు మునుపు మనం చివరిసారి కలుసుకున్నప్పుడు నువ్వెలాగైతే ఉన్నావో, యిప్పుడూ అలాగే ఉన్నావు. కించిత్తు మార్పయినా లేదంటే నమ్ము ! అవును మరి నీడపాటున బతికినవాడివి తల్లిదండ్రుల మాట జవదాటని బుద్ధిమంతుడైన కుర్రవాడిలా హద్దులు దాటనివాడివి రాజవీధిలాంటి బ్రతుకుబాటను ఎన్నుకున్నవాడివి నీలో మార్పెందు కొస్తుంది ? అన్ని మార్పులకూ రంగస్థలం వంటి వాణ్ణి నేను ! లేకుంటే నాలుగైదేళ్లపాటు ఒకే తరగతిగదిలో కూర్చున్న సహపాఠకుడే నన్ను గుర్తు పట్టలేకపోయేవాడా సోమశేఖరం !"

సోమశేఖరంగారు అయోమయంలో పడిపోయారు ఐతే యితగాడు తనతో కలిసి చదువుకున్న వా డన్నమాట ! ఐనా అది ఏనాటి ముచ్చట !

అరవయ్యేళ్ల సోమశేఖరంగారి మనసులో నలభై అయిదేళ్లనాటి తరగతి గది ప్రత్యక్షమైంది సహపాఠకులు కొందరు మెరపుల్లా మెరసిపోసాగారు. చిలిపి కళ్ల రంగనాధం ఒకడు వాడు హైస్కూలు హెడ్మాస్టరుగా పనిచేసి, యిటీవలే రిటైరయ్యాడు మరొకడు చలపతి ఆర్మీలో ఉద్యోగం చేస్తూ ఏదో ప్రమాదంలో చనిపోయాడు వేరొకడు తారకం ఇంకొకడు కృష్ణమూర్తి. పాఠశాలనుంచి విడిపోయిన తరువాత గూడా ఈ నలుగురితో తనకు ఉత్తర ప్రత్యుత్తరాల సంబంధం ఉండేది ఇంతగా సన్నిహితం గాని మిత్రులు గూడా మరి కొంతమంది ఉండవచ్చు ఉదాహరణకు గు గు

సోమశేఖరంగారి కళ్లల్లో పూర్వస్మృతి ఒకటి తళుక్కున మెరిసింది ఆయన ఆగంతకుడి దగ్గరికి జరిగి "పట్టేశాను లేవోయ్! గుర్తు పట్టేశాను కావలిస్తే పందెం కట్టడానికి గూడా సిద్ధమే! సందేహం లేదు నువ్వు గురుమూర్తివి!" అన్నారు

"పందెం కట్టినట్టయితే నేను ను వ్వనుకుంటున్న గురుమూర్తిని కానని గూడా బుకాయించగలను సోమశేఖరం! అలా బుకాయించి నేను స్నేహితులనుంచీ పారిపోయిన ఘట్టాలు చాలా ఉన్నాయి " కళ్లజోడు చేతికి తీసుకుని మెల్లగా నవ్వుతూ చెప్పుకపోసాగాడు గురుమూర్తి "ఎందుకంటావేమో! వాళ్ల పరామర్శలకు తట్టుకోలేక! ఎక్కడున్నావు—మొదటి ప్రశ్న ఏం చేస్తున్నావు—రెండో ప్రశ్న బిడ్డ లెందరు—మూడో ప్రశ్న అక్షయ తూణీరంలో తీస్తున్నకొద్దీ బాణాలే! ఇక్కడ జవాబు చెబుతున్నకొద్దీ ప్రశ్నలే!"

బాల్యస్నేహితుడ ఎంతధోరణిక అంతరార్థ మేమిటో లీలగానైనా స్ఫురించక, సోమశేఖరంగారు విస్తుపోయిన మాట వాస్తవం చాలా కాలం తర్వాత మిత్రు లిద్దరు ఒకచోట తారసిల్లితే సాధారణంగా అలాగే పరామర్శించుకుంటారు తన ఆలోచన పారినంత వరకూ అందులో విడ్డూర మేమీ లేదు మానవ మాత్రు డంటూ ఒక డున్న తర్వాత అత డెక్కడో ఒకచోట నివసించక తప్పదు జీవనోపాధికి ఏదో ఒక వృత్తిని స్వీకరించక తప్పదు ఇక పెళ్లీ పెడాకులూ లేకుండా బ్రహ్మచారిగా కాలం గడపడమనేది ఎవడికో ఋషితుల్యుడికి గానీ సాధ్యంగాని పని పెళ్లి జరిగిన తర్వాత దంపతుల ఆరోగ్యంలో లోపం ఉంటే తప్ప, సంతానం కలగడం ఖాయం ఉద్యోగం, వివాహం, సంతానం యివన్నీ జీవిత యాత్రలో ప్రధాన ఘట్టాలు పోగా యివి మూకిట మూసి పెట్టుకోవలసిన అంతరంగిక షవియా లేమీ కావు వ్యక్తి సంఘంలో తానూ ఒక్కడుగా కలిసి మెలిసి తిరుగుతున్న కాలం వీటికి సంబంధించిన ప్రశ్నలకు జవా బివ్వకోక తప్పదు

గురుమూర్తి జేబులోనుంచీ రెండు పొగ చుట్టలు తీసి ఒకటి సోమశేఖరంగారి కిచ్చి, మరొకటి తను ముట్టించాడు లోపలా, బయటా గూడా వ్యాపించిన వెచ్చటి పొగలోనుంచీ ఉత్తేజాన్ని సమకూర్చు కున్నట్టుగా ఈసారి కాస్త ఉత్సాహంతో ప్రారంభించాడు

"కానీ యిప్పుడు నాకు నేనై నిన్ను వెదుక్కుంటూ వచ్చాను సోమశేఖరం! అంటే ఏమన్నమాట? నీ ప్రశ్నల కన్నింటికీ సదుత్తరా లివ్వడానికి సంసిద్ధంగా ఉన్నా నన్నమాట! ఒకవేళ నువ్వు నన్నేమీ అడక్కపోయినా సరే, నేను మాత్రం వూరుకో బోవడం లేదు "

నిజానికి గురుమూర్తి గత జీవితాన్ని గురించి తెలుసుకోవాలన్న కుతూహలం సోమశేఖరం గారికి లేకపోలేదు వీడు—గాలి తీసేసిన తోలు బొమ్మలా తయారైన యీ గురుమూర్తి—చిన్ననాటి తరగతి గదిలో వెనుక డస్కులో కూర్చొనేవాడు. ముఖ్యంగా అయ్యవార్లను ఏడిపించడం వీడి పని పాఠాలు వినిపించుకోడు శ్రద్ధగా చదవడు కాపీకొట్టి పరీక్ష పాసౌతాడు కానీ కొన్ని కొన్ని కార్యకలాపాల్లో వీడి సమర్థత మెచ్చుకో దగ్గది వక్తృత్వపు పోటీలో బహుమతి చెప్పి గెలుచుకునేవాడు విచిత్ర వేషధారణలో వీడికి వీడే సాటి ఇలాంటి గురుమూర్తి గవర్నమెంటు పరీక్షలో కాపీ కొట్టే వెసులుబాటు లేక ప్రతి పార్యభాగంలోనూ సింగిల్ డిజిట్ మార్కులు తెచ్చుకున్నాడు! ఆ తరువాత అత డేమయ్యాడో తనకు సరిగ్గా తెలియదు గడిచిపోయిన ... దశాబ్దాల్లో అతడు తనకు ఏ నాలుగైదు సార్లు మాత్రమో కనిపించాడు. ఒకసారి మదరాసు సెంట్రల్ స్టేషనులో ప్రత్యక్షమై ఏదో గడియారాల కంపెనీకి ఏజంటుగా తిరుగుతున్నా నన్నాడు మరొకసారి మైసూరు దసరా ఉత్సవాల్లో తటస్థపడి నీటి బుడగల్లాంటి మానవ జీవితాలను భీమా చేస్తున్నట్టు చెప్పాడు ఇంకొకసారి యీ తెలుగు దేశంలోనే ఓ థియేటరులో తారసిల్లి సినిమా అయిపోయేంత వరకూ తన దేశ పర్యటనానుభవాలను ఏకరువు పెట్టాడు అన్నింటికన్నా పదిహేనేళ్లకు మునుపు చివరి సారిగా అతణ్ణి కలుసుకున్న సంఘటన మరపురానిది ఓ మిత్రుడి ఆహ్వానాన్ని పురస్కరించుకుని నెల రోజులు సెలవు పెట్టి తను ఉదకమండలాలకు వెళ్లడం జరిగింది సమయానికి ఆ మిత్రుడు యింట్లో లేకపోవడంతో బాగా నిరుత్సాహ పడిపోయిన తనకు ఈ గురుమూర్తి వో పెద్ద రెస్టారెంటులో కనిపించాడు కనిపించినవాడు రెండు రోజుల పాటు తనను వదలిపెట్టాడు గాడు డబ్బును మంచి నీళ్లలా వ్యయం చేస్తూ, నీతికీ, అవినీతికీ మధ్య ఎర్ర సిరాతో గీత గీసి మడి బట్ట కట్టుకోకుండా స్వేచ్ఛగా, సంతోషంగా, బ్రతకటం, ఆనందాన్ని చుట్టుచూర లాడడానికే నన్నంత ఉల్లాసంగా ఆ రెండు రోజుల్లో అతడు తనకు కొత్త కొత్త అనుభవాల్ని రుచి చూపించబోయాడు కానీ ఎలాంటి పనికైనా తెగబడగల సాహసం తెచ్చి పెట్టుకుంటే వచ్చేది గాదన్న సత్యాన్ని రుజువు చేస్తూ ఈ స్నేహితుడి కొక 'గుడ్‌బై' చెప్పి, తను సెలవు తీసుకున్నాడు

"ఎలా మొదలెట్టాలో తోచడం లేదు సోమశేఖరం!" ప్రసంగానికి ఉపక్రమణికగా లోపలికి పీల్చుకున్న రెండు గుక్కల పొగను బయటికి వదలిపెట్టాడు గురుమూర్తి "పది పదిహేనేళ్లకు మును పొకసారి మనం కలుసుకున్నప్పుడు, సహజంగా ఎన్నో విషయాలను గురించి మాట్లాడుకుని ఉంటాము అప్పుడు నేను నా వ్యక్తిగత జీవితాన్ని గురించి ఏమైనా చెప్పి ఉంటే, ఆ చెప్పిన దాంట్లో నీ కింకా ఏ ఒక్కటీ అరా విషయమైనా జ్ఞప్తిలో ఉంటే, దాన్ని నువ్వీ క్షణాన మరచిపోవాలి ఎందుకంటే నేను స్వతహాగా ఆలోచించి మాట్లాడడానికి అలవాటు పడినవాణ్ణి గాను పైగా ఒక నిజం చెప్పి అందు మూలంగా ఎదుటి వాడికి కలిగే సందేహాల పరంపరకు సమాధానాలు చెబుతూ కూచోడమంటే నాకు చెప్పరానంత చిరాకు కలిగేది అంచేత ముక్తసరిగా వో అబద్ధం చెప్పి ఆ ప్రమాదంలో నుంచీ తప్పుకునేవాణ్ణి. మచ్చు కొక విషయం చెబుతాను నేను పెళ్లి చేసుకోలే దంటా ననుకో! ఎందుకు చేసుకోలే దన్నది వెను వెంటనే ఉద్భవించే ప్రశ్న కారణం గూడా చెబుతా ననుకో! ఊహూ, ఎదుటి వాడు చస్తే నమ్మడు వాడికి వెయ్యి అపోహలు! ప్రేమించిన అమ్మాయిని పెళ్లాడ్డానికి వీల్లేక పోయిందేమో! తనతోబాటు మరొక మనిషిని గూడా పోషించుకోగల తాహతు లేకపోయిందేమో! లేదా, పెళ్లయిన తర్వాత ఏవో కొన్ని కారణాలవల్ల ఆ పెళ్లాంతో కాపురం సాగింది కాదేమో! ఈ సందేహాల జల వట్టిపోయే దెప్పుడు? ఎందు కొచ్చిన గొడవని భార్యా బిడ్డలు వూళ్లో ఉన్నారని చెప్పేశేవాణ్ణి. ."

"ఐతే నీకు పెళ్లే కాలేదన్నమాట?" విస్మయంతో అడిగారు సోమశేఖరంగారు

"పెళ్లి కాలేదు అనడం కన్నా, కాకపోవడానికి బాధ్యతంతా నాదే గనుక చేసుకోలే దనడం సమంజసం! ఎందుకు చేసుకోలేదంటే, యిష్టంలేక! ఇష్టం లేకపోవడానికి గూడా కారణం చెబుతాను—ధనార్జన అన్నది నాకెన్నడూ ఒక సమస్యగా తోచలేదు నీళ్ళు త్రాగినంత సులభంగానూ, చుట్ట గాల్చినంత అశ్రమంగానూ నేను డబ్బు సంపాదించ గలిగాను నిరంతర చలనశీలం కలిగింది డబ్బు దాంతో ఎన్నెన్ని సౌఖ్యాలు పొంద వచ్చునో తెలిశాక, నా జీవితం గూడా అలాగే పరిణమించింది మనో దౌర్బల్యమను, చంచల స్వభావమను—నేను వాంఛల్ని చంపుకోలేదు అసలు చంపుకో దలచలేదు. జేబు నిండుకూ గలగల లాడుతున్న డబ్బుతో సందడి, సంరంభం చెలరేగుతున్న బజార్ల వెంట తిరుగుతూ ఏ వస్తువు కావలిస్తే ఆ వస్తువు కొనుక్కుంటూ, ఎక్కడ ఆకలైతే అక్కడ భోజనం చేస్తూ ప్రతి వినోదాన్నీ,

ప్రతి విలాసాన్నీ అందుబాటులోకి తెచ్చుకో గలుగుతున్నప్పుడు, మనసు పెళ్ళి మీదికి, సంసారం మీదికి మళ్ళక పోవడంలో ఆశ్చర్య మేమీ లేదు సంసార మంటే అది జీవితాన్ని ఒక పరిమిత వలయంలో బంధించే చట్రంగా భావించాను. బస్సు కంటే, రైలు కంటే, విమానం కంటే వడిగా పరుగెత్తే జీవితం కోసం తపించాను సంపాదించడానికీ, వ్యయం చేయడానికీ మధ్యనే నక్కే వ్యవధి పెంచుకోలేదు దేశంలో ఈ చివరి నుంచీ ఆ చివరి వరకూ నేను చూడని పట్టణం గానీ, రుచి చూడని సౌఖ్యానుభవం గానీ లేదని చెబితే చాలు, నా జీవిత గాధను సంగ్రహంగా ముగించిన ట్టవుతుంది. ఒకసారి సిలోన్ వెళ్ళాను రెండు సార్లు బర్మా వెళ్ళాను. కానీ ఏమాట కామాటే చెప్పుకోవాలి. ఈ అరవైయేళ్ళ జీవితంలో నేను నిస్సహాయ కరమైన పరిస్థితుల్లో పడిపోయిన సందర్భాలు సైతం లేకపోలేదు జబ్బుతో సతమత మవుతూ, పలుకరించే దిక్కు లేక, చేత పైసా లేక శారీరకంగానూ, మానసికంగానూ దుర్భరమైన యాతనకు గురైన ఘట్టాలు గూడా ఉన్నాయి. ఆ అనారోగ్యం నుంచి కోలుకుని మళ్ళీ నిల్రదొక్కుకోగానే లోకం పట్ల నాలో కక్షలాంటి భావం రగులు కునేది అంతటితో యినుమిక్కిలిగా సంపాదించడానికి పూనుకునేవాణ్ణి. అందినదంతా ఆహారించివేసే ఆకొన్న తోడేయిలా దేని కంటే దానికి డబ్బును వెదజల్లే వాణ్ణి ......"

కాల పురుషుని వేడి నిట్టూర్పు లాంటి సైరన్ మ్రోతతో గురుమూర్తి ప్రసంగం ఆగిపోయింది.

"వెళ్దామా గురుమూర్తీ! గంట ఎనిమి దైంది. ఈపాటికి యింటిల్లిపాదీ నా కోసం వేచి చూస్తూంటారు. భోజనమైన తర్వాత తీరిగ్గా మాట్లాడుకోవచ్చు ..."

"మాట్లాడుకోడాని కిం కేముంది సోమశేఖరం! లేదంటే ఓ చిన్న విషయం చెప్పాలి. నిన్ననే ఓ డాక్టరు గారిని కలుసుకున్నాను. ఆయన తిరగవలసిన తిరుగుళ్లన్నీ తిరిగేశాను గనుక యిక మీదట నాకు విశ్రాంతి అవసర మన్నాడు"

"విశ్రాంతి కేం గురుమూర్తీ! నా మట్టుకు నాకు విశ్రాంతి పుష్కలంగా లభిస్తోంది దాన్ని నువ్వూ కాస్త పంచుకుంటే నాకు మరికొంత కులాసాగా ప్రొద్దు పోతుంది"

మిత్రు లిద్దరూ పార్కు దాటుకుని, బాల్యస్మృతుల్లో మునిగి తేలుతూ మెల్లగా యింటి వైపు నడవసాగారు.

* * *

పడుకున్నారే గానీ సోమశేఖరం గారికి నిద్ర పట్టడం లేదు అవును మరి! తటాకంలో రాయి పడితే ఏమవుతుంది? అలలు పైకి లేచి విస్తరించుకుంటూ వెళ్ళి ఒడ్డుకు తాకి వెను దిరగడంతో బాటు క్రింది నుంచీ బుడగలు పైకొస్తాయి గురుమూర్తి రాకవల్ల అంత పనీ జరిగింది నిశ్చల కాసారం లాంటి సోమశేఖరం గారి మనసులోకి గండ శిలలా దొర్లుకుంటూ వచ్చాడు గురుమూర్తి!

నిద్ర రాక, పడక పొందక అటూ యిటూ ఒత్తిగిల్లి పడుకుంటూ జాగరణం సల్పుతున్న సోమశేఖరం గారి బుర్రలో ఆలోచనల తీవ్రత సుడిగాలిలా హోరెత్తి పోతోంది తనకు అరవైయ్యేళ్ళు నిండి పోయాయి. షష్టిపూర్తి సంబరాలు కూడా జరిగాయి కొడుకులూ, కోడళ్ళూ, కూతుళ్ళు అల్లుళ్ళూ, మనుమళ్ళూ మనుమరాళ్ళూ, తననూ, తన భార్యనూ మధ్యలో కూర్చో బెట్టుకుని గ్రూప్ ఫోటో తీయించుకున్నారు అప్పుడు తన కది గర్వకారణంగా కూడా భాసించింది అయ్యో, అవివేకం ఎంత చెడ్డది! దాని నిషాలో అంపశయ్య కూడా హంసతూలికా తల్పంలా కనిపిస్తుంది కాకపోతే ప్రపంచ జనాభా లెక్కలకు అదనంగా మరికొన్ని అంకెలను, ఆ అంకెల

గుణకారంతో మరికొన్ని సంఖ్యలను కలపడం కూడా ఒక గర్వకారణమేనా! జీవిత సార్థక్యాన్ని సంతాన సౌభాగ్యాన్నిబట్టి నిర్ణయించి నట్టయితే మానవుడి కంటే మరికొన్ని ప్రాణులు ఎంతో నయం! అంతే కాదు ఏవిధంగా చూచినా అడవులలో తిరిగే లేళ్ళూ, కుందేళ్ళూ, ఆకసంలో ఎగిరే పక్షులూ, సాగరంలో సంచరించే జలచరాలు తన కంటే మెరుగ్గానే బ్రతుకుతున్నాయి వాటికున్నంత స్వేచ్ఛ తన కెక్కడేడ్చింది? ఆరు దశాబ్దాల సుదీర్ఘ జీవితంలో తనొక గోడ గడియారంలా బ్రతికాడు తన దిన చర్యల్ని బట్టి ఎదుటివాడు టంచనుగా గంట చెప్పగలిగినంత యాంత్రికంగా బ్రతికాడు. ఐతే యంత్రానికీ, తనకూ ఒకటి రెండు విభేదాలు లేకపోలేదు యంత్రానికి కోరిక లుండవు తన కుండేవి కోరికలే లేవు గనుక వాటిని తీర్చుకునే ప్రసక్తి యంత్రానికి లేదు తను కోరికల్ని బలవంతంగా చంపుకున్నాడు!

వల్మీకంలో దాగి పడుకున్న భుజంగాలు ఒక్కొక్కటే మేలుకున్నట్టు, సోమశేఖరంగారి మనసులోపలి పొరల్ని చీల్చుకుని తీరని కోరికలు ఒక్కొక్కటిగా పైకి రాసాగాయి ఒకసారి దేశం నలు మూలలా తిరిగి రావాలన్నది తన చిరకాల వాంఛల్లో ఒకటి దేశాన్ని కాదుగదా, తను రాష్ట్రాన్ని గూడా చుట్టి రాలేక పోయాడు ఒకప్పుడు లీవు దొరికేది గాదు మరొకప్పుడు యింట్లో ఎవరికో ఒకరికి ఆరోగ్యం తిన్నగా ఉండేది కాదు లేదా సమయానికి చేతిలో కావలసినంత డబ్బు మెదిలేది కాదు కారణం ఏదైతే నేమి, గాటిలో కసువు తింటూ, కట్టు గూటం చుట్టూ తారట్లాడే దుక్కి టెద్దులా తాను సంసార కూపం నుంచీ ఈవల పడలేక పోయాడు ఇరవై యేళ్ల క్రితం జరిగిన సంఘటన అప్పుడు తనొకపేట కొంపలో ఇన్‌స్పెక్టరుగా పని చేస్తున్నాడు ఆ ప్రాంతంలోకల్లా శ్రీమంతుడైన ఒక పెద్ద మనిషి అతడిలాంటి పెద్దలకు కొందరికి విందు చేస్తూ అందుకు తనను గూడా ఆహ్వానించాడు నాలుకకు పట్టిన త్రుప్పును వదిలించిన విందు భోజనం తర్వాత, నాలుగైదు బుడ్లు టేబిలు పైకి వచ్చేశాయి ఆ అనుభవ మెలాంటిదో తేల్చుకోదగిన మహదవకాశాన్ని కేవలం మొహమాటంతో తను నిరాకరించేశాడు మళ్లీ ఒంటరిపాటున ఎప్పుడైనా ప్రయత్నించి చూడా లనిపించేది కానీ అందు క్కావలసిన తెంపు తనలో మృగ్యమై పోయింది పోగా 'పాపం, హేయం' అంటూ తన మనసే తనను బెదిరించడానికి పూనుకునేది అవును కోతకు వచ్చిన పొలం లాంటిది ఆనందం అందులో ఆంక్ష, మనిషి అని భ్రమించడానికి వీలుగా చేసిపెట్టిన గడ్డిబొమ్మ లాంటిది గడ్డిబొమ్మ కదలదు మెదలదు. నోరు తెరచి అరవదు అయినా దాన్ని చూస్తే భయ మెందుకో తన కర్థంకాదు ఈ తీరని కోరికల్లో మరీ తాలోత్తాలంగా కనిపించేది రాజేశ్వరి! ఆవిడ తనకోసం ఎదురు తెన్నులు చూస్తూ ద్వారం దగ్గర నిలబడి ఉండేది ఆమె కంటబడగానే తనొక పెద్ద శుకయోగీంద్రుడిలా తల వంచుకుని చరచరా వెళ్లిపోయేవాడు ఇంగితాన్ని గుర్తెరుగనట్టు నటించిన ఈ పాషాణ విగ్రహానికి ఆమె జాబులు గూడా వ్రాసి చూచింది ఐతే తను వాటిని చింపి బుట్టదాఖలు చేసి, భారీ ఎత్తున ఆత్మ నిగ్రహాన్ని ప్రకటించేశాడు అంతంత పెద్ద సంగతుల దాకా ఎందుకు? వూళ్ళో మంచి సినిమా ఆడుతున్నా తను వెళ్లలేక పోయేవాడు. ఫ్రీ పాసు వచ్చినా నాటకానికి పోలేక పోయేవాడు కర్తవ్య నిర్వహణ అన్న పేరుతో తన బ్రతుకంతా చాకిరీ చేయడంతో గడిచిపోయింది వీలైనంత వరకూ ప్రభుత్వం తనచేత చాకిరీ చేయించుకుంది మిగిలిన ఓపికను కుటుంబం హరించేసింది

ఐనా ఇంత కాలంగా తన కీ విషయం ఎందుకు తెలియక పోవాలి?— సోమశేఖరంగారి ఆలోచనా స్రవంతి యిక్కడ కాసేపాగి మరొక వైపుకు మలుపు తిరిగింది ఇప్పుడైనా ఈ ఆత్మ పరిశీలన అకారణంగా జరగడం లేదు ఇందుకు కారణం గురుమూర్తి రాక ఈ గురుమూర్తి ఎలాంటివాడు? కాళ్లకు సంసారపు సంకెళ్లు తగిలించుకుని బోర్లగిల పడనివాడు మాటిమాటికీ లోకం ఏమనుకుంటున్నదో నని వెనుదిరిగి చూడకుండా తన ముక్కుకు సూటిగా నడిచి పోగలిగినవాడు నీతులతో, నిషేధాలతో వేసిన అడు గడుక్కూ ప్రతిబంధకాలు కల్పించుకోకుండా తన స్వేచ్ఛకు విశాలమైన అవకాశాన్ని కల్పించుకున్నవాడు. అతడు చూడని దృశ్యాలు లేవు రుచి చూడని సుఖాలు లేవు. నిజంగా గురుమూర్తి చరితార్థుడు. అతడి జీవితం సార్థకం!

సోమశేఖరంగారు చిరాకుతో పైకి లేచి లైటు వేశారు. గ్లాసు నిండుకూ మంచినీళ్ళు త్రాగి వాలు కుర్చీలో పడుకున్నారు గోడకు వ్రేలాడుతున్న జేబు గడియారంలో చిన్న ముల్లు పన్నెండును సమీపిస్తోంది. సోమశేఖరం గారికి కాస్త ఆశ్చర్యం గూడా కలిగింది తన కెప్పుడూ పడుకున్న అరగంట సేపటికే బాగా నిద్ర పట్టేది. అలాంటిది ఈ రోజు కన్ను పొడుచుకున్నా కునుకు రావడం లేదు సామాన్యంగా నిద్ర పట్టక పోవడానికి కారణం అశాంతి అశాంతికి కారణం అసంతృప్తి అసంతృప్తి ఎందుకు కలుగుతుంది? మానని పుండ్ల లాంటి తీరని కోరికలు మనసును బాధించడం వల్ల! ఐతే మనిషి ఎంత త్వరగా నిద్ర పోగలడో, ఎంత గాఢంగా నిద్ర పోగలడో అంతగా అతడి మనసు చీకు చింతల నుండి విముక్తమై ఉంటుందన్నమాట! ఈ 'ధియరీ' ప్రకారం యిప్పుడు గురుమూర్తి గాఢంగా నిద్ర పోతుండాలి

విచిత్రమైన కోరికే మరి! తమ సిద్ధాంతంలోని నిజానిజాలను అప్పటి కప్పుడే తేల్చుకోవా లనుకున్నారు సోమశేఖరంగారు లేచి బయటికి వచ్చారు ఇటూ అటూ గదుల వరుస మధ్యలో చీకట్లు ముసలుతున్నదారి ... మెల్లగా నడచి సందు చివరిదాకా వెళ్లి కిటికీ దగ్గర నిల్చుని 'గురుమూర్తీ, గురుమూర్తీ'అంటూ సోమశేఖరంగారు మిత్రుణ్ణి రెండు సార్లు పలకరించారు

నిశ్శబ్దంలో తమ పిలుపులు తప్పితే మరొక అలికిడి వినిపించిందిగాదు.

తలుపుపైన చేయి వేశారు రెక్క తలుపు సవ్వడి లేకుండా లోపలికి తెరుచుకుంది గదిలో ప్రవేశించి సోమశేఖరంగారు లైటు వేశారు

మంచంపైన, దోమతెర లోపల నిశ్చలంగా నిద్రపోతున్నాడు గురుమూర్తి

తెర దగ్గరికి వెళ్లి సోమశేఖరంగారు ఒకటి రెండు సార్లు బిగ్గరగా పిలిచి చుచారు ఆ క్షణాన ఆయన చేస్తున్న పని ఆయనకే అసమంజసంగాను, హాస్యాస్పదంగానూ భాసించింది చింతలు లేకపోవడం వల్లనైతే నేమి, ఎడతెగని ప్రయాణాల బడలిక వల్లనైతేనేమి గురుమూర్తి ఒళ్ళు తెలియకుండా నిద్ర పోతున్నాడు తన సిద్ధాంతం మాట దేవు డెరుగు! ఇక్కడనుంచీ వెళ్లిపోవడం మంచిది

వెనుదిరిగి ద్వారం దగ్గిరికి వస్తుండగా టేబిలుపైన ఓ కవరు కనిపించింది.

పైన తమ చిరునామా కనిపించడంతో ఆయన అప్రయత్నంగా కవరు చేతికి తీసుకుని, అందులో నుంచీ జాబును పైకి తీశారు

నాలుగు మడుపులుగా మడిచి పెట్టిన కాగితాన్ని విప్పేసరికి 'ప్రియమైన సోమశేఖరం!'' అంటూ జాబు ప్రారంభమై పోయింది

సోమశేఖరంగారు ఒకసారి పడుకున్న గురుమూర్తి వైపు చూచారు. ఒకసారి చేతిలోని కాగితాన్ని చూచారు ఆ తరువాత విస్మయంతో చదువుకు పోసాగారు

''ఇది జాబు గూడా గాదు సంజాయిషి ఈ సంజాయిషీ ఎందుకో నీ కీ పాటికే తెలిసి ఉంటుంది లేదా మరికొంత సేపటికి తెలుస్తుంది

జాబనుకో, సంజాయిషి అనుకో, మొత్తంపైన దీన్ని నీ కొక రహస్యం తెల్పడాని కోసం ఉద్దేశిస్తున్నాను ఒక జీవిత కాలమంతా వ్యయించి తెలుసుకున్నకున్న రహస్యం—కళ్లెం వదలిపెట్టడంలో ఆనందం లేదు కళ్లెం బిగబట్టడంలోనే ఆనందం ఉంది ఇదే నేను తెలుసుకున్న రహస్యం

ఈరోజు సాయంత్రం పార్కులో నే నీ రహస్యాన్ని చెప్పివుండవలసింది కానీ నాలోని దురభిమానం చెప్పనిచ్చింది గాదు.

ఒక చిన్న ఉదాహరణ చెబుతాను—భోజనానంతరం తాంబూలం నమలడంలో లోకంలో పరిపాటి నే నొకప్పు డదే పనిగా నమిలేవాణ్ణి కానీ అందులో ప్రత్యేక తేమిటంటే నేను తడవ తడవకూ సున్నపు మోతాదు ఎక్కువ చేస్తూ వచ్చాను అందువల్ల ఏమైందో తెలుసా సోమశేఖరం? కొంత కాలానికి సున్నం నాలుకపైన పని చేయడం మానేసింది ఎంత సున్నం వేసినా తాంబూలం ఎరుపెక్కేది గాదు అమాంతంగా ఓ వెలగకాయంత సున్నం తినేయవచ్చు ననిపించేది. పోగా అంతటితో నాలుకకు మైమారు

పాకు, కారాబూందీ, కాకరకాయా అన్నీ ఒక్కలాగే రుచించేవి. తాంబూలంలో సున్నాని కున్నట్టే ఈ ప్రపంచంలో మానవుడి స్వేచ్ఛకు గూడా ఓ హద్దుంది ఆ హద్దు దాటిన స్వేచ్ఛ నిరుపయోగమే గాదు, అనారోగ్యకరం కూడా! సాధారణంగా ప్రతి మానవుడికీ ఆనందాన్ని సమకూర్చే వినోద ప్రదర్శనాలు, విలాస యాత్రలు, యాత్రాస్థల సందర్శనాలు, నాకు లేశమాత్రమైనా అహ్లాదాన్ని చేకూర్చలేక పోయాయి. రోజులు గడవనూ గడవనూ ఎంతవాన కురిసినా నీరు నిలువని యిసుక పర్రలా నాజీవితంబీడువడిపోతూవచ్చింది

ఆశ్చర్యంగా ఉందా సోమశేఖరం, అయితే మరి కొంచెం విశదీకరిస్తాను

నీకు తెలిసిన విషయమే ఆకలైతే అన్నం తినడం వేరు ఆకలైనా కాకపోయినా జిహ్వాలోలుపత్వానికి పరితర్పణగా అయిన ఖాద్య పదార్థాలన్నీ మెసవడం వేరు మొదటిది ఆరోగ్యానికి దోహదకరం రెండోది విధ్వంసకరం. సంసారంలో ఉన్న పరిమితమైన స్వేచ్ఛకు, సంసారానికి బయట లభ్యమయ్యే విశృంఖలమైన స్వేచ్ఛకూ ఉన్న విభేదం యిదే! తిండి మానేసి, చిరుతిండ్లకు అలవాటుపడి తిన్నదంతా వమనం చేసుకునే అజీర్ణ రోగిలా కాలక్రమాన నేను ప్రపంచంలోని ఏ సుఖాన్నీ ఆస్వాదించలేక పోయాను కోరికైతే కొండంత ఉండేది. డబ్బు కూడా సమస్య గాదు. కానీ చిల్లులు పడి నీళ్ళ లోపలికొస్తూన్న పడవను చుక్కాని, తెరచాప ఏం రక్షించ గలుగుతాయి ?

మరొక ముఖ్య విషయం చెప్పాలి సోమశేఖరం! ఎక్కడెక్కడ తిరిగినప్పటికీ గువ్వ కూడా సాయంత్ర మయ్యేసరికి తన గూడు చేరుకుంటుంది ఆ గూడే లేకపోతే గాలివానలో తన గతి అధోగతే నన్న విషయం దానికి బాగా తెలుసు గువ్వమాటేమిటి, గొప్ప గొప్ప గ్రహాలే నియమబద్ధంగా తిరుగుతున్నాయి మానవుడు ఏర్పరచుకున్న నియమానికి మరొక పేరే సంసారం తెలియమివల్ల ఆ నియమానికి లోబడి ఉండడం ఒక బాదర బందీగా భావించాను తెలిసి వచ్చేసరికి అంతా నా చేయి దాటిపోయింది అశాంతి చిమ్మచీకటిలో, నల్లటి కొండల మధ్య దారిగానని పథికునికి గలిగే అశాంతి ఎలాంటిది ? అలాటి అశాంతిలో అలమటించి పోయాను

తెలిసిందా సోమశేఖరం! ఆ అశాంతికి ఫలితమే నా యీ బాహ్య స్వరూపం చూశావు గదూ! ప్రొద్దు పడమటికి వాలి వాలక మునుపే జరాభారంతో వింటిదబ్బలా వంగిపోయాను భూమిలోపల వేళ్ళు శిథిలమైపోయి చిటారుకొమ్మ నుంచీ మొదలుపెట్టి ఎండిపోసాగిన చెట్టులా చివికిపోయాను వ్యాధుల పేరు చెప్పడ మెందుకు సోమశేఖరం! చెబితే నువ్వు భయపడవచ్చు అందుకనే సూచించాను.

ఇటీవల ఓడాక్టరుగారిని కలుసుకున్నానని చెప్పాను గదూ! ఆయన ఎవరోగానీ నిజాన్ని నిక్కచ్చిగా తేల్చి చెప్పేశాడు. ఒక ఊపిరితిత్తి చెడిపోయింది రెండోదాన్ని గూడా బాగుచేసే స్థితి దాటిపోయింది పరీక్షించి చూచిన తర్వాత డాక్టరుగారు ఒక క్షణంపాటు తనను తానే మరిచిపోయి యింత ఆలస్యంగా తన దగ్గరికి రావడం కంటే, నేరుగా 'మరొక చోటికి' వెళ్లడం అతనికీ, నాకూ గూడా శ్రేయస్కర మనేశాడు.

నే నిప్పుడు ఆ 'మరొక చోటుకే' పయనం కడుతున్నాను సోమశేఖరం! కానీ ఆత్మాభిమానం దొడ్డది. జీవం లేనిదే అవుగాక, నా యీ భౌతిక కాయాన్ని దిక్కులేని పీనుగగా చేయడం నా కిష్టం లేకపోయింది. నీలాంటి మిత్రుడికి లేనిపోని బాదరబందీ కలిగిస్తున్నందుకు చేతులు జోడించి క్షమించమని కోరడంకన్నా నేను చేయగలిగిం దేముంది సోమశేఖరం! ఐనా అనాథ ప్రేత సంస్కారం వూరికే పోదు. కోటి యజ్ఞాల ఫలం లభిస్తుంది "

కంపిస్తున్న చేతివ్రేళ్ళ మధ్య నుంచీ జాబు క్రిందికి జారిపోయింది. సోమశేఖరంగారు 'గురుమూర్తీ, గురుమూర్తీ' అని విలపిస్తూ మంచం దగ్గరికి పరుగెత్తి దోమతెర తొలగించారు అక్కడ గురుమూర్తి భౌతిక కాయం చల్లగా కట్టెలా పడిఉంది!

మంత్రశాస్త్రోద్ధారకుడు ఉడ్‌రఫ్

శ్రీ వాసిరెడ్డి పార్థసారథి

"హిరణ్మయేన పాత్రేణ, సత్య స్యాపిహితం ముఖం,
తత్ త్వం పూష న్నపావృణు, సత్య ధర్మాయ దృష్టయే !"

బుద్ధ భగవానుడు అవతరించిన తర్వాత పది వందల సంవత్సరాలు స్వర్ణ యుగం నడిచింది నాడు భారతభానుడు విను వీధి నడుమ దుర్నిరీక్ష్యుడై ప్రకాశించాడు నాడు ఆతని దివ్యజ్యోతి తొంగిచూడని దేశంలేదు. ఆ జ్యోతిచే ఆకర్షించబడ్డ ఎందిరికో ఈ దేశం జ్ఞానభూమి, యాత్రా స్థలం అయింది.

శ్రీ శంకర భగవానుడు అవతరించునాటికి భారత భానుడు పశ్చిమాకాశాన్ని అధిగమించి పడమటి సముద్రంలో క్రుంకులిడ్డాడు దేశంలో చీకటు లలముకున్నవి దేశం నిశాచరులపాలైంది సమస్తం దోచబడ్డది ఈ కాలమును చరిత్రకారులు చీకటియుగ మన్నారు జ్ఞాన నిలయములు కత్తికి నిప్పుకు పాలైనవి శాస్త్రములు, శాస్త్రజ్ఞులు దేశం విడిచి, పర దేశాల్లో తలదాచుకున్నారు దారిద్ర్యం అజ్ఞానం పరిపాలన చేసినవి అజ్ఞానుల హస్తములలో శాస్త్రములు భ్రష్టములైనవి శంకర భగవానులు అవతరించి దుర్మతములను ఖండించారు కాని రాజకీయ స్వాతంత్ర్యం లేనందున, వారి ప్రయత్నం అనుభవంలో నిలువలేదు కాళరాత్రి గడచి తొలి కోడి కూసింది పశ్చిమాద్రిలో కనుపించకుండా పోయిన భానుడు తిరిగి తూర్పుభాగముల మీదుగా తన కిరణములు వ్యాపింపజేశాడు. రామకృష్ణ పరమ హంస పుట్టాడు రాజా రామ మోహన్‌రాయ్, దయానంద సరస్వతి అవతరించారు. దివ్యజ్ఞాన సమాజం ఉదయించింది జాతీయతాభావాలు అంకురించినవి వీరివల్ల మన శాస్త్రములందు ఆవరించుకునివున్న తిమిరములు తొలగినవి మన శాస్త్రములలో అద్భుతమైన సత్యము లున్నవని ప్రపంచం గ్రహించింది ఈ బ్రహ్మాండమైన ఉద్యమములో పాల్గొన్న పుణ్య పురుషులలో సర్ జాన్ ఉడ్‌రఫ్‌గా రొకరు

హిందూమతం ముఖ్యంగా మూడు శాస్త్రములమీద ఆధారపడివుంది అవి వేదములు, పురాణములు, తంత్ర శాస్త్రములు ఇందులో తంత్రశాస్త్రము చాలా అపవాదులకు లోనైంది ముఖ్యంగా కొందరు పాశ్చాత్యులు దీనిని దేశ దిమ్మరుల మూఢ నమ్మకా లన్నారు ఈ శాస్త్రమునే సర్ జాన్ ఉడ్‌రఫ్ గారు ఏమన్నారో చదవండి "ఈ శాస్త్రమును కొందరు ఫూలిష్ అంటారు ఈ శాస్త్రంకాదు ఫూలిష్ ఫూలిష్ అనేవారే ఫూల్సు ! ఈ శాస్త్రమును వారు సరిగా అర్థం చేసుకోలేకపోయిన తెలివి తక్కువవారు కనుక వారే ఫూల్సు" ఇంతమాట అన్న ఎవరు వీరు ? పూర్తిగా తెలుసుకుని అన్నారా, తెలిసికోక అన్నారా ? ఇందుకు వీరు చెప్పిన కారణము లేమిటి ? వీరిని గురించి పెద్దల అభిప్రాయము లేమిటి ?

19 వ శతాబ్దంలో భారత దేశమును పాలించిన బ్రిటిష్ పాలకుల కుటుంబంలో జన్మించారు సర్ జాన్ ఉడ్‌రఫ్‌గారు వీరి జనకులు జేమ్సు టిన్‌డాల్ ఉడ్‌రఫ్‌గారు వీరు న్యాయశాస్త్ర పండితులు కొంతకాలము 20 వ శతాబ్దంలో వంగ రాష్ట్రంలో అడ్వకేటు జనరల్ ఉద్యోగం చేశారు. ఈ ఉద్యోగం తర్వాత ఇండియా ప్రభుత్వమునకు లీగల్ మెంబరుగా వున్నారు జాన్‌గారి జనని ఫ్లోరెన్సు ఈ సాధ్వి జేమ్సు హ్యూం తనయ జేమ్సు టిన్‌డాలు ఉడ్‌రఫ్ గార్కి ఫ్లోరెన్సుగారికి 1865 సంవత్సరము డిసెంబరునెల 15 వ తేదీన మొదటి కుమారుడు పుట్టాడు వీరికి జాన్ జార్జి ఉడ్‌రఫ్, అని నామకరణం చేశారు. జాన్ జార్జి ఉడ్‌రఫ్ జబర్నపార్కు స్కూల్లో విద్యాభ్యాసం ఆరంభించారు. తర్వాత, ఆక్సుఫర్డు యూనివర్శిటీ కాలేజిలో చదివారు ఇక్కడ న్యాయశాస్త్రంలో ద్వితీయ శ్రేణిలో ఉత్తీర్ణులై బి సి. ఎల్ డిగ్రీ పొందారు 1889వ సంవత్సరంలో ఇన్నరు టెంపిలుచేత బారుకు ఆహ్వానింబడ్డాడు 1890వ సంవత్సరంలో వంగ రాష్ట్రంను వచ్చారు. ఇక్కడ కలకత్తా హైకోర్టులో అడ్వకేటుగా చేరారు కష్టించి పని చేయుటంలోను న్యాయాన్యాయ విచక్షణలోను, బుద్ధి సూక్ష్మతలోను పేరు కాంచారు. వీటి ఫలితంగా కలకత్తా యూనివర్శిటీలో సభికుడై టాగూరు లా ప్రొఫెసరుగా నియమించబడ్డారు బ్రిటిష్ ఇండియాలో ప్రఖ్యాతిగన్న 'సివిల్ ప్రొసీజరు కోడ్సు ఇన్ బ్రిటిష్ ఇండియా' అను న్యాయ గ్రంథమును రచించుటలో అమీర్‌ఆలీగార్కి తోడ్పడ్డారు. తర్వాత 1902వ సంవత్సరంలో ఇండియా ప్రభుత్వంలో స్టాండింగ్ కౌన్సిలులో నియమించబడ్డారు ఎందులోవున్నా సాన పట్టిన వజ్రంవలె వారి బుద్ధి సూక్ష్మత ప్రకాసించింది వీరికి ప్రభుత్వం దృష్టి పడింది ప్రభుత్వంవారు వీరిని 1904వ సంవత్సరంలో వంగ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తిగా నియమించారు ఈ ఉన్నత పదవిని బహు దక్షతతో పద్దెనిమిది వర్షములు నిర్వహించారు ఈ ఉద్యోగం నిర్వహిస్తున్న కాలంలో 1915 సంవత్సరంలో బ్రిటిష్ ప్రభుత్వంవారు వీరికి సర్ బిరుదము నిచ్చి సన్మానించారు 1915 సంవత్సరంలోనే కలకత్తా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా వీరిని నియమించారు ఇది వీరి జీవితంలో చాలా విలువైన కాలం విశ్వ విఖ్యాతి పొందుటకు, సత్యాన్వేషణకు ఉపయోగపడ్డ కాలం ఇదే తీరిక దొరికిన ప్రతి నిమిషమును సంస్కృత భాష చదువు కొనుటకు వ్యయపరిచారు ఇప్పుడే తంత్ర శాస్త్ర అంబుధిని మథించి అందు అమృతమును సంపాదించారు అమృతజీవులైనారు 1922 సంవత్సరంలో ఈ పదవి నుండి విరమించి, వారి స్వదేశం బ్రిటన్‌కు వెళ్లారు పుట్టింది బ్రిటన్ అయినా ప్రేమించింది పవిత్ర భారత భూమినే వారి హృదయంలో భారత భూమే తన దేశం కోణార్కు దేవాలయములో తాను బ్రిటన్ వెళ్లిపోవునప్పుడు 1922 ఏప్రిల్ 22 వ తేదీన అన్న మాటలు చదవండి "ఈ దేశంలో నేను ఎంతో తెలిసికొన్నాను అనుభవించాను నేను చూస్తున్న ఈ పవిత్ర భూమిని చూడటం ఇది ఆఖరి చూపై వుండొచ్చు మంత్రించబడ్డ ఇంద్రజాలంవలె వున్న దీ పవిత్ర భూమి బరువైన హృదయంతో ఈ స్థలమువద్ద సెలవు తీసికుంటున్నాను" భారత భూమిని ఇంతగా ప్రేమించిన ధన్యజీవి వీరు. 1923 సంవత్సరంలో బ్రిటన్‌లో ఆక్సుఫర్డు యూనివర్శిటీలో ఇండియా లా రీడరుగా నియమించబడ్డారు ఈ ఉద్యోగమును సప్త వర్షములు నిర్వహించారు ఇదే వారు చేసిన చివరి ఉద్యోగం వారు భారత దేశంలోకాని, బ్రిటన్‌లో కాని ఉద్యోగం చేస్తూ, ఒక్క నిమిషం వూరుకోలేదు

వారు ఉద్యోగం చేసింది ఎక్కువ కాలము వంగ రాష్ట్రంలో. ఇది శాక్తేయమునకు పుట్టిల్లు ఇటువంటి స్థలంలో ఉద్యోగమునకు నియమించబడుట పూర్వజన్మ సంస్కారం ఇక్కడ వారి తీవ్రబుద్ధిని శాక్తేయము ఆకర్షించింది. అనేక గ్రంథ రాజములను వ్రాసి ధన్యులైనారు ఇంకా కొన్ని గ్రంథములు వ్రాయవలెనని ప్రయత్నించారు హిందూ కర్మకాండ, వేదాంతం మొదలైనవాటిని కూడా వ్రాయ సంకల్పించారు కాని కాలపురుషుడు వారిని 1936 సంవత్సరము జనవరినెల 18 వ తేదీన తనలోనికి తీసుకున్నాడు విదేహముక్తులైనారు వీరు 1930 సంవత్సరంనుండి ఏ ఉద్యోగం చేయక, ఈ కాలమున ముందు వారు వ్రాయవలెననుకున్న శాస్త్రగ్రంథ సంగ్రహమునకు ప్రయత్నించారు. వారు 70 సంవత్సరములు జీవించారు.

ఆంగ్లేయులు స్వభావంగా హేతువాద ప్రియులు. వీరి వంశం హేతువాదమునకు ఆటపట్టయిన న్యాయ శాస్త్రములో పండినది. ఇటువంటి వంశంలో పుట్టి పెరిగిన వీరు హేతువాదమంటే ప్రాణంతో సమంగా ఎంచేవారు. ఇటువంటి వీరు మూఢ నమ్మకాలని నెట్టివేయబడ్డ మంత్రశాస్త్రంలో మనస్సును ప్రవేశపెట్టుటకు ఏదో బలవత్కారణం వుండి వుండాలి. ఈ విషయమై ఒక కారణం ప్రచారంలో వుంది స్వభావసిద్ధంగా వారు శాక్తేయ పూజలంటే వ్యతిరేకులు మందులకు నయంకాని జబ్బు మంత్రముకు నయమవుట వీరు చూచారు. ఇది వారిలో బ్రహ్మాండమైన మార్పు తెచ్చింది. ఇంతవరకు మంత్రమంటె ప్రార్థన వంటిదని అభిప్రాయంతో వున్నారు. ఇప్పుడు వారు మంత్రమంటే ఒకశక్తి అని నమ్మారు. ఇట్టి నమ్మకం కల్గుటకు వారు "సర్పెంట్ పవర్" అను గ్రంథంలో కొన్ని అనభవము. అను వ్రాశారు. ఇవి వారి మనస్సును మార్చుటకు కారణమై వుంటవి. కనుక మనవి చేస్తాను

మేజరు జనరలు జే టి హారిస్ అనేవారు. 'ఇన్‌సిడెంట్‌కి ఇన్‌ది లైఫ్ ఆఫ్ ఎ ఇమ్యూటిపీ వెటెరన్' అను గ్రంథం వ్రాశారు. ఈ గ్రంథంలో వారి అనుభవాన్ని ఇట్లా వ్రాశారు. "మేజరు దగ్గర ఒక సాధువు నిలబడి వున్నాడు. సాధువు కాలివద్ద ఒక తేలు వుండటం మేజరు చూచాడు. కదలకు, నీ కాలివద్ద తేలు వుందని చెప్పాడు. సాధువు వంగి తేలునుచూచి తన వేలును తేలువంక చూపాడు. తేలు గజ గజ వణికి చచ్చిపోయింది ఇది చూచి మేజరు ఆశ్చర్యపోయినాడు. నీకు గొప్ప శక్తులు తెలుసునట్లున్నదని మేజరు అన్నాడు. ఇదొక లెక్కగాదన్నట్లు సాధువు నెట్టివేశాడు ఇంకొక అనుభవం కుశండికాహోమంలో ఒకరు నిప్పు లేకుండానే మంత్రం జపిస్తూ, పుల్లలకు నిప్పు పుట్టించారు. ఇంకా ఇటువంటి కొన్ని వారు 'సర్పెంట్ పవర్'లో వ్రాశారు ఇటువంటివే వారికి ఆశ్చర్యం కలిగించి వుంటాయి. తేలు, పాము మంత్రం మనకు పాత. వారికి, పాశ్చాత్యులకు కొత్త వారు ఇదివరకు చూచివుండరు కనుక ఇవి వారిలో మార్పు తెచ్చినవి మంత్ర శాస్త్రం సంస్కృత భాషలో వున్నది వారు సంస్కృతమును పండితులవద్ద అభ్యసించారు తర్వాత తంత్రశాస్త్రమును మహామహోపాధ్యాయులవద్ద చదివారు మంత్రశాస్త్రము రహస్యమైంది. వీరికి ఈ శాస్త్రం లభించుట చాలా కష్టమైంది. వ్యయ ప్రయాసలకులోనై, ఎంతో మంత్ర శాస్త్రమును సంపాదించి, గ్రంథ రచన చేశారు ఈ విషయంలో సర్ జాన్‌గారి సతీమణిని గురించి చెప్పక తప్పదు. ఈమె పేరు ఎల్లెన్ ఎలిజబెత్ ఈమె యస్ డి గ్రిసగన్‌గారి కుమార్తె. 1902 సంవత్సరంలో వీరిద్దరూ వివాహమాడారు ఈమె సర్ జాన్‌గారి అర్ధాంగి అన్న మాటను, సార్థకపరుచుకుంది మంత్రశాస్త్రంలో ఈ సాధ్వి భర్తకు వెలలేని సహాయం చేసింది వీరిద్దరకు ఒక కుమారుడు, ఒక కుమార్తై కలిగారు.

సర్ జాన్ గొప్ప వక్త అనేక సభలలో అనర్గళంగా ఉపన్యసించేవారు. కొందరు వారి వాగ్ధాటిని గ్రహించలేకపోయేవారు వారు ఉపన్యసించు విష

యమే చాలా కష్టమైంది వారు తీరికగా వున్న సమయాల్లో నారికేళపాకంలో వున్న ఈ తంత్ర శాస్త్రమును ఎంతో చక్కగా తెలియునట్లు విప్పి చెప్పేవారు వారి గ్రంథాలలో కొన్ని ఇట్లా సభలలో మాట్లాడిన ఉపన్యాసములే వారు పత్రికలకు వ్యాసములు వ్రాసేవారు వారి గ్రంథములు కొన్ని ఇట్లా వ్రాసి ప్రచురించిన వ్యాసరాజములే

మంత్రశక్తి భౌతికశక్తి వంటిదని తెలిసికున్నారు మంత్ర శాస్త్రమును మనసార అభిమానించారు మంత్ర శాస్త్రమునకు పుట్టినిల్లయిన భారత భూమి అన్నిటికన్న మిన్నగా హృదయ పూర్తిగా ప్రేమించి, ఆరాధించారు పాశ్చాత్యులు ఇట్టి పవిత్ర భూమిని ఆడి పోసికొనుట కష్టమనిపించింది వారికి ఇందుకు వారు భారతదేశము, మంత్ర శాస్త్రమును సరిగా అర్థం చేసికోలేకపోయినారని విచారించారు ప్రథమ ప్రపంచ యుద్ధం జరుగుతున్న కాలంలో విలియం ఆర్చర్ అనే ఆంగ్లేయులొకరు 'ఇండియా అండ్ ది ఫ్యూచర్' అనే గ్రంథమును వ్రాసి ప్రచురించారు వీరు పేరుపడ్డ సాహిత్య, నాటక కళా విమర్శకులు. భారతీయుల అజ్ఞానమునకు వీరు జాలి పడ్డారు. భారతీయులు తమ సంప్రదాయములు విడనాడి, ఆంగ్లేయుల సంప్రదాయములను ఆచరించమని బోధించారు వీరు ఈ గ్రంథంలో భారతీయులను గురించి అన్న వాక్యాలను మనవి చేస్తాను "(భారతీయులు) అజ్ఞానులు, అనాగరికులు, ఆటవికులు. నేను ఈ మాటలు వాడుతున్నందుకు విచారిస్తున్నాను. కాని నేటి పరిస్థితులు ఈ మూలమునే సూచిస్తున్నవి వీరిలో అజ్ఞానావరణనుండి బైటికి వచ్చినవారు కొన్ని వేలమంది ఉండవచ్చు సామాన్యంగా భారతీయ జనాభా గురించి సత్య మేమనగా, బీదవారే కాకుండా భారతీయులంతా నాగరీకులేమీ కాదు ప్రపంచదేశాలలో సత్యద్రష్టయిన దేశం భారత దేశము ఆధ్యాత్మిక సత్యమును ప్రపంచమునకు బోధించవలసిన మహత్కార్యం భారతదేశం మీదే వుంది" అని సర్ జాన్ ఉడ్‌రఫ్ గారు నమ్మారు పై ఆర్చరు వాక్యములు సర్ జాన్ గార్కి హృదయ భేద్యములైనవి ఇందుకు న్యాయంగా భారతీయులు జవాబు చెప్పవలసి వుంది ఈ కార్యమును సర్ జాన్‌గారే చేపట్టారు 'ఈజ్ ఇండియా సివిలైజ్‌డ్' అనే గంథ్రమును వీరు వ్రాసి, 1918 సంవత్సరంలో ప్రచురించారు ఇండియా నాగరికమైనదేనా అన్న వివాదమునకు న్యాయమూర్తి వ్రాసిన తీర్పువంటి దీ గ్రంథం ఈ గ్రంథంలో వారి హృదయమంతా తెలిసిపోతుంది వారి సూక్ష్మ శరీరమునకు ఈ గ్రంథం అద్దం వంటిది వారిని పూర్తిగా అర్థం చేసికొనుటకు, ఈ గ్రంథంలోని వారి భావములను క్లుప్తంగా మనవి చేస్తాను ఈ క్రింది భావములన్నీ సర్ జాన్ గారివే.

"హిందూమతము క్రీస్తుమతములకు చాలా పోలిక లున్నవి అటువంటప్పుడు హిందూమతాన్ని విమర్శించుటకు కారణం నాకు కనుపించదు పాశ్చాత్యులు హిందూమతాన్ని సరిగ్గా అర్థం చేసికోలేదనే నా బాధ హిందూమతంలో హేతువాదం లేదంటారు ఇది పొరపాటు హేతువాదమును హిందూమతం చేపట్టినంత ఏ మతాలూ పట్టలేదు

అనాగరికులైన హిందువుల మతము సత్యంమీద ఆధారపడివుంది వారికి సత్యమే దేవుడు సత్యమే జయించేది వారికి పరోపకారమే ధర్మం బైబిలుసి పొరుగు వానిని ప్రేమించమని చెబుతుంది కాని ఎందుకు ప్రేమించాలో హేతువును చెప్పదు హేతువును చెప్పింది హిందూమతమే ఇందుకు హేతువు "తత్వ మసి" అని చెప్పింది అదే నీవు అని అర్థం. దీని భావం ఇది సమస్త ప్రపంచం ఈశ్వరునిస్వరూపమూ నీరూపముగా అన్నిట నీవు వున్నావు, ఈశ్వరుడున్నాడు ఇతరులను ప్రేమించుటే ఈశ్వరుని, నిన్ను నీవు ప్రేమించుట అని హేతువు చెబుతుంది ప్రపంచమును దేవుడు సృష్టించాడని బైబిలు చెప్తుంది దేనినుండి దేవుడు ఈ ప్రపంచాన్ని నిర్మించాడో హేతువు చెప్పదు కనీసం దేవుడు తననుండైనా ఈ విశ్వమును సృష్టించాడనీ చెప్పదు ఈ హేతువును షడ్దర్శనములు చెప్తున్నవి స్వేచ్ఛాలోచన హిందూమతంలో వున్నట్లు ఎందులోనూ లేదు అక్కడ నాస్తిక మతములు కూడా వెలసినవి అప్పు చేసి పప్పుకూడు తిని, సుఖించు అని చెప్పు చార్వాకమతం వంటిది కూడా పుట్టింది. కామశాస్త్రంవంటివి అక్కడపుట్టి వృద్ధయినవి ఇట్టి స్థితిలో క్రిష్టియన్ మతాలవారు జీతములిచ్చి మతప్రచారం చేయిస్తారు కారణం తెలియదు. హిందూమతం ఇట్టి పని చేయుటంలేదు.

"హిందువులు స్త్రీని చాలా తక్కువగా చూస్తారని అంటారు పరదా పద్ధతి హిందూమతంలోనిది కాదు. మహమ్మదీయుల దండయాత్రప్పుడు ప్రవేశించింది హిందువులు స్త్రీని గృహలక్ష్మిగా చూస్తారు ఆమె అర్ధాంగి తంత్రశాస్త్రంలో స్త్రీకి వున్న స్థానం ఎక్కడా లేదు. క్రీస్తుమతస్థులు స్త్రీని హీనంగా భావించారు. ఆగస్టయిన్ ఋషి 'పాపమున కంతటికి కారణం స్త్రీయే' అని అన్నారు బైబిలు స్త్రీ ఆదాం పక్క ఎముకనుండి పుట్టిందని తెలుపుతుంది స్త్రీ పురుషునిలో అర్ధాంగికాదు అక్కడ మధ్యయుగంలో క్రీస్తులోకం స్త్రీని నానాహింసలు పెట్టింది 1865 వరకు స్త్రీకి ఆస్తి హక్కు, విద్య హక్కు లేదు భారతదేశంలో స్త్రీ ఒక దేవతగా పరిగణించబడుతుంది. గార్గి మైత్రేయివంటి బ్రహ్మజ్ఞానులు పుట్టారు తపస్సుచేత శరీరాన్ని హింసిస్తారని అంటారు. ఇది అపార్థము తపస్సు గమ్యం ఆనందము క్రిష్టియన్ మతంలో ఎన్నో బాధకరమైనవి వున్నవి. షైడాం పట్నంలో లిడ్‌వైన్ అను సాధకురా లుండేది. ఈమె కుష్ఠురోగుల, బాధితుల పాదాలు కడిగి చీము నెత్తురు కలిసిన ఆ నీటిని త్రాగేది సైమన్ స్టయిలిటిస్ ఒక స్తంభంపీద నిలబడి వుండేవాడు హెయికేరిస్ సుజో సంవత్సరమల్లా శరీరాన్ని హింసిస్తుండేవాడు ఇహమును, పరమును సమంగా సమన్వయించింది హిందూమతము

"సముద్రయానం పాపమంటారని అంటారు పూర్వం భారతదేశానికి గొప్ప నావికదళం వుండేది వర్తక వ్యాపారాలు అన్ని దేశాలకన్నా ఎక్కువగా చేశారు నాగరికత, సంస్కృతి, మతమును ఎన్నిదేశములకో వారు నేర్పారు ఈనాటివలె వారి మతం సంకరం అవుతుందని, ఈమధ్య తలవి ఇట్టిది చేసి వుంటారు

"నాగరికత అనగా ఏమిటి ? అభివృద్ధి అనగా ఏమిటి ? మానవుడనగా ఈ శరీరం మాత్రమేకాదు శరీరము, మనస్సు, ఆత్మ కలసి మానవుడవుతున్నాడు ఈ మూటి వికాసమే అభివృద్ధిగాని, లేక నాగరికతగాని అవుతుంది ఆత్మ క్రిందిజన్మలనుండి తన స్థానమునకు చేరు పోరాటమే జీవితము ఆత్మ రాతి నుండి చెట్టులోనికి చెట్టునుండి పశువునుండి మానవునిలోనికి మానవుని నుండి తన స్థానమునకు చేరు వ్యాపారమే ఇది శరీరమన ఆత్మలలో ఏది నష్టపడ్డా, అభివృద్ధి కుంటుపడుతుంది శరీరం బాగా వుండి మనస్సు అనారోగ్యంగావున్నా అభివృద్ధిలేదు శరీర మనస్సులు బాగుండి ఆత్మను కోల్పోయినప్పుడు మానవుడు పశుప్రాయుడవుతాడు భారతీయులు నిరాశావాదులు, ఇహమునకు వారు ప్రాముఖ్యమివ్వరు అంటారు పాశ్చాత్యులు అనగా శరీర సుఖములను వారు ఏమీ లక్ష్యపెట్టరని వారి భావం శరీరమున ఆత్మల సమన్వయం భారతీయులు చేసినట్లు ఏమతం చేయలేదు హిందూమత లక్ష్యమును పురుషార్థము లంటారు ఏ పూజ ప్రార్థన చేసినా, వారు కోరేది ఈ పురుషార్థములనే ఇవి నాలుగు ధర్మం, అర్థం, కామం, మోక్షము ఇందులో అర్థ కామములు శరీర సంబంధమైనవి శరీర కామమును, ధనమును వారు కోరుతారు అయితే ఇవి ధర్మబద్ధమై వుండాలి ధర్మము మోక్షమునకు అనుకూలంగా వుండాలి అర్థకామములు శరీరం ఆశించేవి మోక్షం ఆత్మ ఆశించేది ధర్మం శరీర ఆత్మల సంబంధించింది శరీరసుఖం వుండి, మన స్వాతంత్ర్యం లేనినాడు మానవుడు వృద్ధి కాలేడు నేటి యూరపు దేశంలో మన స్వాతంత్ర్యం ఎంత వుంది ? పాశ్చాత్యదేశం లక్ష్యం అర్థమో కామమో వారు ధర్మమోక్షాలను అలక్ష్యం చేస్తున్నారు ఇందువల్ల జీవిత లక్ష్యమే చెదిరి పోతుంది ఆత్మ మనో వికాసము మతం, వేదాంతం, సాహిత్యం, శాస్త్రం, కళలు, సాంఘిక ధర్మములలో ప్రతిబింబిస్తుంది మనో ఆత్మలు వికసించినప్పుడు ఇవీ వృద్ధవుతవి లేనప్పుడు నశించి పోతవి కనుక శరీర స్వాతంత్ర్యంతోపాటు, మన ఆత్మ స్వాతంత్ర్యా లుండాలి. శరీర స్వాతంత్ర్యంకన్న మన ఆత్మల స్వాతంత్ర్యా లుండాలి. శరీర స్వాతంత్ర్యం కన్న మన ఆత్మల స్వాతంత్ర్యం చాలా ముఖ్యమైంది. ఆత్మ జయించబడ్డప్పుడు సమస్తం జయించబడ్డట్లే. ఇదే వివేకానందస్వామి అన్నారు ఆత్మను కోల్పోయిననాడు సర్వం పోయినట్లే.

"భారతదేశంలో శరీర స్వాతంత్రం ఎప్పుడో పోయింది ఇప్పుడు మన ఆత్మల స్వాతంత్రం కూడా పోనున్నవి. ఇప్పుడు జరుగుతున్న పని అదే

దీనిలో ముఖ్యాయుధము భాష మనస్సుయొక్క ప్రతిబింబమే భాష. ఒక్కో భావాలు ఆలోచనలు తెలుపగల శక్తి ఒక్కో భాషకే వుంటుంది ఆయా జాతి సంస్కృతి ఆ భాషలో వుంటుంది అది ఆ జాతి తరతరాలనుండి ఆర్జించిన ధనం ఇట్టి భాషను పోగొట్టుకున్ననాడు తనను తాను పోగొట్టుకున్నట్లే ఆ జాతి అదృశ్యం అవుతుంది దీని పరిణామంవల్ల ఇందుకే ప్రపంచంలో కొన్ని జాతులు వారి భాషను ఇతరులమీద రుద్ద యత్నించుట. జర్మనీవారు పోలిషువారిమీద వారి భాషను రుద్ద యత్నించారు ఇట్లే దక్షిణాఫ్రికావారిమీద డచ్చివారు బ్రిటిష్ కెనడాలో ఫ్రెంచి భాషను బోధించుట ఇందువల్లే నేరంగా ఎంచి శిక్షిస్తున్నారు. భారతదేశంలో ఆంగ్ల భాషను బోధిస్తున్నారు ఇప్పుడు. దీని ఫలితం ఘోరంగా వుంటుంది

"భాషతోపాటు ఆంగ్లేయుల అలవాట్లు నేర్పుతున్నారు. కాఫీ, మోటార్లు మాట్లు వంటివి నేర్పుతున్నారు వీటివల్ల పాలకులు ఎంతో లాభపడుతున్నారు. భారతీయులు ఖర్చు లెక్కువై కూలిపోతున్నారు పల్లెటూళ్లలో వర్ణాశ్రమ ధర్మం, సమిష్టి కుటుంబం, వ్యవసాయం నశించిపోతున్నవి నేను వర్ణాశ్రమ ధర్మం దివ్యమైన ఏర్పాటు అనగా, ఎందరో నన్ను భారతదేశ శత్రువని దూషించారు. బ్రాహ్మణులు తతిమ్మా వర్ణముల వారిని తొక్కివేస్తున్నారని విమర్శిస్తున్నారు ప్రపంచంలో ముఖ్యమైన ధనమును బ్రాహ్మణులు కోరలేదు పైగా వారు నియమములు తతిమ్మా వర్ణములవారికన్న ఎన్నో ఆచరిస్తున్నారు. సమంగా పంచబడ్డ వ్యవస్థ వర్ణాశ్రమము జ్ఞానమును, బ్రాహ్మణులకు, శక్తిని (బలమును) క్షత్రియులకు, ధనమును వైశ్యులకు పంచారు ఇందులో ఎవరూ ఎక్కువగా తీసికున్నదిలేదు. దేశమునకు ఉపద్రవం వచ్చినప్పుడు బ్రాహ్మణులు ఆయుధములను పట్టుకున్నారు భారత యుద్ధంలో. వ్యవసాయం లాభించనందున ప్రజలు పల్లెపట్టులను వీడి బస్తీలకు ఎగపోతతున్నారు పల్లెలు క్షీణించిపోతున్నవి బస్తీల్లో ఆంగ్లం చదివి, ఆంగ్లేయుల వలె తయారవుతున్నారు కొందరు ఫలితంగా నీతి, మర్యాద, దేవుడూ లేకుండా పోయినవి తాత్కాలిక సుఖమే వారు కోరేది అప్పుడు భారత సంస్కారం నశిస్తుంది

"హిందూ సిద్ధాంతం ప్రకారం ఒక శిశువు జన్మించినప్పుడు, అతనిలో అతని గత జన్మల సంస్కారము లుంటవి ఆత్మ గతజన్మలలో అనేక భావాలు అలవాట్లు కలిగి వుంటుంది ఇవి ఆ ఆత్మను అనుసరించి వుంటవి అతని భవిష్యత్తులోని జన్మకు ఇవి మూల కారణము లవుతవి మనిషికి సంస్కారము లున్నట్లే జాతికి కూడా సంస్కారము లున్నవి ఒక్కో జాతివానిని చూడటంతోనే, ఆతను ఏ జాతివాడో చెప్పొచ్చు ఈ సంస్కారములే మానవుని జాతి బీజములు ఈ బీజములు నశించిననాడు ఆ మనిషి, జాతి నశించినట్లే ఈ సంస్కారములు మనిషి కట్టుబాట్లు, భాష, మతం, వేదాంతం, సాహిత్యం, కళ, సంఘంలో ప్రతిబింబిస్తవి నూతనంగా బస్తీల్లో పుట్టిన ఆంగ్ల మానస పుత్రులవల్ల ఇవన్నీ ఇక నుండవు హిందూ సంస్కారమునకు ప్రత్యేకత వుంది హిందూ నాగరికత ఆధ్యాత్మిక శీలము కలది చాంద్యోగ్యోపనిషత్తు మనిషి ఎట్లా భావిస్తే అట్లా అవుతాడంటున్నది ? భారతీయులు ఆంగ్లేయుల భాష మాట్లాడి, వారివలె ఆలోచించునాడు ఫలితం ఘోరంగా వుంటుంది

"మంచిని తీసికోవద్దని నే ననను తీసుకుని దానిని జీర్ణించుకుని, తన ప్రకృతికి తగ్గట్లుగా తనదిగా రూపొందించుకోవాలి అనుకరణ మాత్రం

చేయకూడదు గ్రీకువారు ఈజిప్ట్సువారినుండి కళను నేర్చుకున్నారు. కాని గ్రీకువారు వారి స్వభావముకు తగ్గట్టుగా దానిని మార్చుకున్నారు

"అర్బరు సలహా భారతదేశమునకు లాభించదు భారతీయులకు కావలసింది స్వధర్మం తన ప్రకృతికి తాను విధేయుడై వుండుట పరమ ధర్మం. ఇదే భగవద్గీత తెల్పిన 'స్వధర్మేనిధనం శ్రేయ పరధర్మో భయావహ' అన్న సూత్రం నీటే వేదాంతి ఈ విధంగా చెప్పాడు. 'నీ అంత కరణ ఏమి చెప్తుంది ? నీవు కాని దానిని, నీవు కాబోకు నీ ప్రకృతికి మించిన ధర్మం చేయబోకు' భారత దేశం తన ప్రకృతి ననుసరించాలి నీ శరీర, మనో ఆత్మలచేత నీవు పాలించ బడాలి నీఒక్క శరీరంచేతనేకాదు నీవు పాలించబడుట నీ మనస్సుచేత, ఆత్మ చేతలతో కూడా పాలించబడాలి ఇదే స్వరాజ్యపూర్ణ అర్థం శరీర స్వాతంత్రం వున్నా, మన ఆత్మలు ఇతరుల వైనప్పుడు అభివృద్ధి వుండదు నీ శరీర మన ఆత్మలచేతనే నీ శరీర మన ఆత్మలు పాలించబడాలి కృష్ణభగవానుడు భగవద్గీతలో చెప్పిన స్వధర్మం ఇదే"

పాశ్చాత్యులు మంత్ర శాస్త్రమును అపార్థం చేసికున్నంతగా, ఏ శాస్త్రాన్ని అపార్థం చేసికోలేదు వారు మంత్రశాస్త్రము సరిగ్గా అర్థం చేసికోలేక పోయినారు మంత్రశాస్త్రము ఒక మహత్తరమైన శాస్త్రీయమైన శాస్త్రం అందులో ఎంతో శక్తి జ్ఞానములున్నవని తెలిపిన పాశ్చాత్యుడు సర్ జాన్ ఉడ్‌రఫ్ మంత్రం ప్రార్థన వంటిదని తలుస్తున్నారు పాశ్చాత్యులు ఇది పూర్తిగా తప్పు అభిప్రాయం మంత్రమనగా ప్రార్థనకాదు అదొక శబ్ద శక్తి భౌతిక శక్తి వంటిదే అదొక సూక్ష్మ శక్తి. భారతీయులు ఈ శక్తిని తెలిసికొన్నారు దీనికి శాస్త్రీయమైన శాస్త్రం ఎంతో వుంది శబ్దం ఉత్పత్తి గురించి భారతీయులు ఎంతో పరిశోధనలు చేశారు ఇందులో ఎంతో సత్యం వుంది మంత్ర శాస్త్రములోవున్న సత్యమును ప్రపంచమునకు తెలుపుటకు అనేక గ్రంథాలు రచించారు సర్ జాన్ మంత్రశాస్త్ర రచనలో న్యాయా న్యాయములను వాదించుటలో తన న్యాయవాద శక్తిని, న్యాయమును తేల్చుటకు తన న్యాయ మూర్తి బుద్ధిని వినియోగించారు వారు మంత్ర శాస్త్రమును గురించి వ్రాసిన వాదము తెలిసికో తగ్గది క్లుప్తంగా మనవి చేస్తాను

"మంత్ర ఈ రెండు అక్షరములు కలిసి మంత్రశబ్ద మవుతుంది త్ర అనగా తరించే జ్ఞానము మం అనగా మననం చేయుట మంత్రమనగా తరించే జ్ఞానమును మననం చేయుట అని అర్థము ఇంకో అర్థము మ అనగా మనిషిని, త్ర అనగా తరింపచేసేదని వుంది మననం చేయుటలో మంత్రంలో శక్తి చైతన్యవంత మవును మననముచేత శక్తి ఉత్పన్నమవుతుంది ఈ పని నేడు యూరపు, అమెరికా దేశాల్లో చేస్తున్నారు వారు చేయు హిప్నాటిజం, మెస్మరిజం' ఆలోచనలను తెలిసికొనుట, ఆలోచనలను పంపుటలు అన్నీ మంత్ర శక్తి వంటివే ఈ పనిని భారతీయులు ఏనాడో చేశారు ఈ శాస్త్రమును తంత్ర శాస్త్రములో చూడొచ్చు తంత్ర శాస్త్రమన్నా మంత్రశాస్త్రమన్నా ఒకటే మంత్రశక్తిని దురుపయోగం చేస్తారనే భయంచేత ఆ శాస్త్రమును రహస్యంగా వుంచారు

"మంత్రము శబ్దబ్రహ్మనుండి పుట్టుతుంది శబ్ద మనగా బ్రహ్మమనగా ఏమిటో తెలుపుతుంది మంత్రశాస్త్రము శబ్దమ గా ఏమి ? మంత్రశాస్త్రం శబ్దము విషయంలో మీమాంస సిద్ధాంతమును తీసికుంటుంది పంచ భూతాల్లో ఒకటైన ఆకాశ భూత గుణము శబ్దము శబ్దము రెండు విధాలు (1) వర్ణాత్మకము, (2) ధ్వన్యాత్మకము రెండు వస్తువులు ఒకదానితో ఒకటి కొట్టుకున్నప్పుడు కల్గిన శబ్దమును వర్ణాత్మకమంటారు రెండు వస్తువులు లేకుండా పుట్టిన శబ్దమును ధ్వన్యాత్మకమంటారు ధ్వన్యాత్మక శబ్దమును అనాహత శబ్దమంటారు ఇది శాశ్వతమైంది వర్ణాత్మక శబ్దము అక్షరాలు, మాటలు, వాక్యాలచేత పొందుపరచబడ్డది దీనికి అర్థం వుంది శబ్దము మాటలుగా ప్రత్యక్షమైనప్పుడు శాశ్వతమైంది అంటుంది శాస్త్రం కాని ఈ సిద్ధాంతమును నైయ్యాయికులు ఒప్పుకోరు మాట ఉచ్చరించబడుతుంది, తర్వాత పోతుంది కనుక ఇదీ క్షణ భంగురమే నంటారు వారు

"శబ్దమును గురించి తెలిసికోకపూర్వం హిందూ మానసిక శాస్త్రం అర్థం చేసికోవాలి ఒక వస్తువు (అర్థము) మనోనేత్రం ముందుకువచ్చినప్పుడు మనస్సు తనముందున్న వస్తురూపంలోనికి మార్పు చెందుతుంది దీనిని శాస్త్రం వృత్తులంటుంది. మనస్సు మార్పు చెందిన ప్రథమ దశను సూక్ష్మ—అర్థం అంటారు. ఇది తాను పొందు స్థూల—అర్థమునకు ప్రతియై వుంటుంది మనస్సు తాను చూచిన వస్తురూపం తాలుస్తుంది దీనికన్న మనస్సుకు ఇంకో ముఖ్య గుణం వుంది మనసు వస్తువుగా మారుటేగాక తాను వస్తువును చూస్తుంది ఈ విధంగా మనస్సు ఒకే సమయంలోచూడ బడేది, చూచేదిగా వుంటుంది ఇదే గ్రాహ్యము, గ్రాహకము, ప్రకాశ్యము, ప్రకాశకము, వాచ్య వాచకము ఇప్పుడు తెలిసికొనే అవస్థను శబ్దం లేక నామం అంటారు తెలిసికోబడ్డ అవస్థను లర్థములేక రూపం అంటారు ప్రపంచమంతా ఈ నామ రూపాలతోనే వున్నది శివశక్తుల సంయోగంవల్ల స్పందనం కలిగి నాదం ఉత్పత్తవుతుంది ఈ నాద బ్రహ్మమునే శబ్దబ్రహ్మ అని అంటారు.

"శబ్ద బ్రహ్మమైన ఆదిమ శబ్దము అనేక మార్పులు పొందుతుంది. ఇవి నాలుగు అవి పర, పశ్యంతి, మధ్యమ, వైఖరీ శబ్దములు మొదటి దశను పర అంటారు మానవ శరీరంలో వెన్నెముకక్రిందవున్న మూలాధార చక్రంలో పరశబ్దం వుంటుంది శబ్దమునకు ఇక్కడ కారణం ఏర్పడుతుంది శబ్దమునకు ఇక్కడ చలనం కలగలేదు ఇట్లా ప్రత్యక్షంగాని, పరాశబ్దమే కుండలినీ శక్తి కొందరు కారణం సహస్రారంలో కలుగుతుందంటారు రెండో దశ పశ్యంతి ఇందు శబ్దమునకు చలనం ఏర్పడుతుంది కాని ఇది అభేదమైన సామాన్య చలనం మానవ శరీరంలో మూలాధార చక్రం నాభివద్దవున్న మణిపూర చక్రంమధ్య పశ్యంతి శబ్దం రూపొందుతుంది మూడవ అవస్థ మధ్యమము. ఇక్కడ సూక్ష్మ నామరూపాలు ఏర్పడుతవి ఇక్కడ మనస్సు తెలిసికొనేది తెలిసికొనబడే రూపాలుతాలుస్తుంది ఈ శబ్దమును హిరణ్య గర్భ శబ్దం అని అంటారు ఇది మానవశరీరంలో మణిపూరచక్రం హృదయ చక్రం మధ్య వుంటుంది నాల్గవది, చివరిది వైఖరీ శబ్దము ఇంతవరకు సూక్ష్మరూపంలోవున్న మధ్యమ శబ్దము స్థూలరూపం తాలుస్తుంది దీనిని విరాట్ శబ్దం అంటారు మానవ శరీరం

కంఠంనుండి ఇది ఉచ్చరించబడుతుంది. సృష్టిలో ముందు కనుపించేది మధ్యమ శబ్దము అప్పుడు దానికి ఇంకా బహిర్రూపంలేదు తర్వాత ఇది పైకి నెట్టబడి ఇంద్రియానుభవములకు వైఖరీ శబ్ద రూపం దాలుస్తుంది ఈ వైఖరీ శబ్దమే భాష ఇది వర్ణాత్మక శబ్దము వైఖరీశబ్దము స్థూల శరీరం సంబంధించినది మధ్యమ శబ్దము మానసిక శరీరం సంబంధించింది

"శక్తి భావ మవునప్పుడు పరావాక్కు ఇది సృష్టికి పూర్వరూపం తర్వాతది పశ్యంతి వాక్కు ఇక్కడ ఇచ్ఛాశక్తి పత్యక్షమవుతుంది మూడవది మధ్యమ వాక్కు. ఇక్కడ జ్ఞానశక్తి ప్రత్యక్ష మవుతుంది ఇక్కడ శబ్దము మాతృక రూపం దాలుస్తుంది ఇక్కడ ప్రత్యేకమైన చలనం రూపొందుతుంది చివరిది వైఖరీవాక్కు ఇక్కడ క్రియాశక్తి స్థూల అక్షరములను రూపొందిస్తుంది లోపల కలిగిన భావము ఇన్ని రూపాలు దాల్చి నోటిమాటగా వెలువడుతుంది శబ్దబ్రహ్మరూపమే నోటినుండి వచ్చు మాట కనుక మాట బ్రహ్మస్వరూపమే

"రెండు పెదిమలు కలవగా శబ్దము పుట్టును ఒక పెదిమ శివుడు, రెండవది శక్తి ఈ రెండు పెదిమల కలయికే శివశక్తుల సంయోగం శివశక్తుల మైథునంనుండి నాదం బిందువు ఉత్పన్నమవును బిందువే బీజం దీనినుండే మంత్రదేవత పుట్టును ।

"మంత్రమును తెలిసీతెలియక జపించినందువల్ల అది నిరుపయోగమవుతుంది ఇందువల్ల మంత్రశాస్త్రము అపవాదులపాలవుతుంది ఇందులో ముఖ్యమైనది, సరైన గురువువద్ద మంత్రం పొందాలి మంత్ర అర్థం తెలిసి జపించాలి తెలియక యెంత జపించినా వ్యర్థమే అర్థం తెలియక జపించినప్పుడు మంత్రశక్తి మేల్కొనదు తెలిసి జపించినప్పుడు మంత్రశక్తి దేవతారూపం దాల్చి సాధకునకు దర్శన మిస్తుంది దీనినే మంత్రచైతన్యం అంటారు మంత్రం, దేవతా ఒక్కటే మంత్రం శబ్దమైతే, దేవత రూపమవుతుంది మంత్రశక్తి నిద్రితావస్థలో వుంటుంది మంత్రమును జపించుటనగా, నిద్రిస్తున్న మంత్రశక్తిని వూపి మేల్కొల్పుటే నిద్రిస్తున్న మనిషిని, వూపి మేల్కొలుపుట వంటిది ఇందులో రెండు శక్తు లున్నవి ఒకటి మంత్రశక్తి. రెండోది సాధనాశక్తి ఈ రెండు శక్తులు కలిసినప్పుడు సిద్ధి కల్గుతుంది"

"శివశక్తుల మైథునంవల్ల బిందు ఉత్పత్తి అవుతుంది బిందుదే ఈశ్వరుడు సమస్త దేవతానీకం రహస్యంగా పూజించేది ఈ బిందువునే దీనినే పౌరాణికులు మహావిష్ణు వన్నారు ఇతరులు బ్రహ్మపురుషు డన్నారు సహస్రారపద్మంలోవున్న సత్యలోకమే ఈ బిందువు పరబిందువులో శివశక్తులు అభేదంతో వున్నారు ఇది వికసించినప్పుడు, మూడు రూపాలు పొందుతుంది శివుడు బిందువవుతాడు శక్తి బీజ మవుతుంది వీరిద్దరి మైథునంవల్ల నాదం పుట్టుతుంది బిందువు బీజం నాదం మూడు కలిసి త్రికోణాకారం అవుతుంది ఈ త్రికోణాకారమే కామకల ఇది మంత్రశాస్త్రమునకు తల్లి వంటిది, ముఖ్యమైంది. కామ మనగా సృష్టినిర్మాణమునకు కలిగిన కోరిక త్రికోణాకారం మూడువైపులనుండి, మూడేసి గుణాలు, శక్తులు, దేవతలు, అక్షరములు పుట్టాయి ఈ మూడువైపులనుండి చంద్ర, అగ్ని సూర్యులూ, ఇచ్ఛాజ్ఞాన క్రియాశక్తులు, సత్వరజస్తమోగుణాలు, బ్రహ్మవిష్ణురుద్రులు, వామజ్యేష రౌద్రీశక్తులూ పుట్టారు కామకల ఇన్ని రూపాలలో వుంది వామశక్తినుండి చంద్రకళలుగల అ మొదలు 16 అక్షరములు, జ్యేష్ఠశక్తి నుండి సూర్యకళలుగల క అక్షరమునుండి 16 అక్షరములు, రౌద్రికశక్తి నుండి అగ్ని కళలుగల త అక్షరమునుండి 16 అక్షరములు పుట్టినవి మూడు కోణాల నుండి మూడు అక్షరాలు హ ళ క్ష లు పుట్టినవి ఈ విధంగా సమస్త అక్షరములు 51 పుట్టినవి. ఈ త్రికోణాకారమును మంత్రశాస్త్రంలో యోని అంటారు మంత్రసాధనకు యంత్రము కూడా ఉపయోగిస్తారు యంత్రం శరీరం వంటిది ఇది చిత్రశక్తి. మంత్రం ప్రాణం వంటిది ఇది శబ్దశక్తి మంత్రాక్షరములను యంత్రంలో చేర్చినప్పుడు అది ప్రాణవంత మవును. ప్రథమంలో విగ్రహమందు, తర్వాత యంత్రమందు మంత్ర జపం చేస్తారు.

"ప్రథమంలో పుట్టిన నాదమే ఓంకారము. దీనినుండి సమస్త మంత్రాలు, సంగీతము, సాహిత్యం పుట్టినవి మంత్రమునకు అంగములు ఋషి, ఛందస్సు, బీజం, శక్తి, కీలకం వున్నవి బీజమంత్రం చాలా శక్తివంతమైంది దీనివల్ల, మంత్రమునకు విశేష శక్తి ఒనగూడును ఒక్కొక్క కావ్యమునకు ఒక్కొక్క మంత్రం వుంది మానవుని వెన్నెముకలో చక్రా లున్నవి వీటికి దళము లున్నవి దళములలో ఒక్కొక్క మంత్ర అక్షరం వుంటుంది చక్రములలో ఒక్కొక్క దేవత బీజాక్షరము లున్నవి ఒక్కొక్క అక్షరమును జపించినప్పుడు దానికి సంబంధించిన చక్రం, దాని దళం వికసించి శక్తివంతమవును అప్పుడు సాధకునికి కొన్ని సిద్ధులు కలుగును ప్రతి శబ్దమునకు ఆకారము, రంగు లున్నవి నేటి మానసిక శాస్త్రజ్ఞులు కూడా దీనిని రుజువు చేస్తున్నారు ఇట్టి సమయంలో ఆ మంత్రశబ్దమునుండి రంగు గల ఆకారము పుట్టును ఇదే దేవత అని మంత్రశాస్త్రం అంటుంది

"కుండలినీశక్తికి రెండు రూపా లున్నవి జ్యోతిరూపం, మంత్ర రూపం మొదటిది సూక్ష్మరూపం, రెండోది స్థూలరూపం మంత్రములన్నిటిలో గాయత్రీ మంత్రము గొప్పది అన్ని దేవతలకు పురుషు డుంటారు రాధకు కృష్ణు డున్నాడు గాయత్రికి అట్లు గాక అది ఒక్కటే అది పూర్ణ శక్తి గాయత్రియే బ్రహ్మశక్తి గాయత్రి ఉపాసన చేసినవారు మూలాధారచక్రంనుండి సాధన ఆరంభించపనిలేదు ఆజ్ఞాచక్రంనుండి ఆరంభించినవారికి త్వరగా సిద్ధి కల్గును. మూలాధార, స్వాధిష్ఠాన, మణిపూర చక్రాల్లో లోభ మోహ కోపా లున్నవి గాయత్రి ఉపాసకుల కివి జయించబడివుంటవి ఇవి జయించబడినిది పైకి పోలేడు సాధకుడు వీటిని జయించుటకే ఇతరులు మూలాధార చక్రంనుండి ఆరంభించుట

"మంత్రసిద్ధితో కలిగిన సమాధిని మహాభావమంటారు రామకృష్ణ పరమ హంస పొందారీ భావాన్ని కనుక వారు తంత్ర సాధనలు కిందనుండి చేయునవసరం కలుగలేదు

ఈవిషయం పూర్తిచేయునప్పుడు ముఖ్యమైన రెండు విషయాలు చెప్పాలి మంత్రశాస్త్రము వారు చదివి తెలిసికున్నదేనా, లేక అనుభవం కూడా వున్నదేనా ? అనుభవంవున్న జ్ఞానం వేరు, కంఠతా పట్టిన జ్ఞానం వేరు అనుభవంవున్న జ్ఞానం సత్యమైంది అవుతుంది వీరిలో అవ్యక్తమైన ఏదో మహత్తర శక్తి వుంటేనే కాని, ఇంత బ్రహ్మాండమైన శాస్త్రమును ఇంతగా వ్రాయలేరని నా అభిప్రాయం సర్ జాన్‌గారు కాశీలో గురువువద్ద దీక్ష పొందారు. గురువువద్ద ఉపనయన దీక్షపొంది, గాయత్రీ మంత్రోపదేశం పొందారు ఈ ఉపనయన కర్మకాండ అంతా అక్షరాల ఆచరించి, ఉపవీతమును గూడా ధరించారు ఈ విషయము దేశంలో చెప్పుకునే వాడుకమాటలని, యం పి పండిట్‌గారు వారు వ్రాసిన కుండలినీ యోగమనే గ్రంథంలో వ్రాశారు. ఇది వాడుక మాట కాదు ఇది సత్యమని నా అభిప్రాయం వారు బ్రహ్మశక్తిని దర్శనం చేసుకుని, బ్రహ్మజ్ఞులై, బ్రహ్మజ్ఞాన గ్రంథరాజములను రచించారు లేనియెడల ఇంతపని వారు చేయలేరు భారతమును తెలిగించుటకు నన్నయాదులు యజ్ఞములు చేసి బ్రహ్మజ్ఞులైనారు

రెండో విషయంవారి అర్ధాంగి వీరు మంత్రశాస్త్రమును గురించి గార్లెండ్ ఆఫ్ లెటర్స్, కామ కలావిలాస, అనందలహరి మొదలైన గ్రంథాలు వ్రాశారు ఈ గ్రంథంలో వారికి తోడైన దివ్యశక్తి వారి భార్య ఎల్లెన్ ఉడ్‌రఫ్‌గారు ఈమె కూడా సంస్కృతం చదివి, మంత్రయోగ శాస్త్రము గ్రహించిన మహిళ ఈమె గార్గి మైత్రేయి వంటి వనిత మన కవులు, గ్రంథకర్తలు ఎవరూ వారి జీవిత గ్రంథాలు వ్రాసికోలేదు వారు రచించిన గ్రంథములే వారి జీవిత చరిత్రలని భావించారు వారు నిష్కాములు. సర్ జాన్ గారు కూడా ఇట్లే భావించి, ఇట్లే తనను గురించి ఏమి వ్రాసికోలేదు. వర్ణమాల అను గ్రంథంలోమటుకు వారి సతీమణిని గురించి వ్రాశారు ఈమె తనకు గొప్ప సహాయం చేసిందని వ్రాశారు ఎల్లెన్ ఉడ్‌రఫ్ సతి కూడా భారతీయ శాస్త్రములకు వెలలేని సహాయం చేసింది సర్ జాన్ గారితోపాటు ఈమె సంస్మరణీయురాలే మంత్రశక్తియే కుండలినీ శక్తి మంత్ర శాస్త్రమును చివరంటా తెలిసికోవలెనంటే కుండలినీ శక్తిని కూడా తెలిసికోవాలి

సర్ జాన్‌గారు రచించిన గ్రంథములలో ఎక్కువగా ప్రఖ్యాతిగాంచిన గ్రంథము "సర్పెంట్ పవర్" ఇప్పుడు వెలువడ్డ గొప్ప గ్రంథాలలో ఇదొకటని యం. పి పండిట్‌గారు వ్రాశారు ఈ గ్రంథములను 1918 లో ప్రచురించారు నేడు ఇది 6 వ ప్రచురణైంది మద్రాసు గణేసు పుస్తకాల కంపెనీవారు సర్ జాన్‌గారి గ్రంథముల విజయమునకు ఒక విధమైన కారకులైనారు. ఇందు షట్చక్ర నిరూపణ, పాదుకాపంచకమనే సంస్కృత గ్రంథము లున్నవి ఈ గ్రంథములను, వీటికి చక్కని అర్థము, వివరణలను సర్ జాన్‌గారు వ్రాశారు. ఇందులో వారు వ్రాసింది ముఖ్యమైంది ఉపోద్ఘాతము ఇది మూడు వందల పుటలుపైగా వున్నవి. వారు కుండలినీ శక్తిని గురించి, పునాదులనుండి వ్రాశారు జ్ఞానము శక్తి వాటి పరిణామాలు. విషయం యెంతో ముఖ్యమైనవి. ఈ గ్రంథంలోనివారి భావములను, విజ్ఞానము మనవి చేస్తాను

షట్చక్ర నిరూపణము, పాదుకా పంచక గ్రంథములు చాలా శ్రేష్ఠమైనవి అనుభవజ్ఞులు వ్రాసినవి షట్చక్ర నిరూపణను వ్రాసింది పూర్ణానందస్వామి పాదుకా పంచకం శివుడు పార్వతికి చెప్పింది గ్రంథకర్త పేరు లేదు. పూర్ణానందస్వామి వంగ దేశంలో పుట్టిన శాక్తేయ అనుభవజ్ఞులలో ముఖ్యులు పూర్ణానందస్వామి రాఢీ బ్రాహ్మణ వంశంలో పుట్టారు. వీరిది కశ్యప గోత్రం వీరి పూర్వులు శాక్తేయ సిద్ధులని పేరు పడ్డారు. వీరు ఇద్దరు సోదరులు సంపూర్ణానందుడు, పూర్ణానందుడు పూర్ణానందుని అసలు పేరు జగదానందుడు వీరు బ్రహ్మానంద సరస్వతీ స్వామి శిష్యులు ఈ సరస్వతీ స్వాములు ప్రఖ్యాతమైన అద్వైత సిద్ధి అను గ్రంథమునకు వ్యాఖ్య వ్రాసిన ఘటికుడు ఇందులో వేదాంత తంత్ర శాస్త్రమును 'సమన్వయం చేశారు జగదానందుడు దీక్ష పొందిన తర్వాత పూర్ణానందస్వామియయినారు. వీరు 1577 సంవత్సరంలో శ్రీతత్వచింతామణి అను ఉద్గ్రంథం 26 ప్రకరణములతో రచించారు. ఈ గ్రంథము తంత్ర శాస్త్రమునకు 'ఎన్సైక్లోపీడియా'వంటి గ్రంథం శాక్తేయం విషయంలో కావలసిన ప్రతి విషయం ఈ గ్రంథంలో వుంది షట్చక్రనిరూపణము, శ్రీతత్వ చింతామణి గ్రంథంలో, 6 వ ప్రకాశము పూర్ణానందస్వామి తర్వాత కామ రూప (అసాం) దేశం వెళ్ళి అక్కడ వున్నారు అక్కడ శ్యామా రహస్యం, శాక్తక్రమం, తత్వానందతరంగిణి, యోగ సారము అనే గ్రంథాలు వ్రాశారు సాధకులకు అనుభవసిద్ధములైన గ్రంథాలివి

వీరి తర్వాత రెండు వందల సంవత్సరాలు గడచిన తర్వాత, కాళీచరణ సిద్ధాంతి పై గ్రంథాలకు వ్యాఖ్య వ్రాశారు వీరి రచనలు చాలా కనుపించవు షట్చక్రనిరూపణకు వ్రాసింది మాత్రం వుంది. కాళీచరణుని వ్యాఖ్యలనే సర్ జాన్‌గారు గ్రహించారు

మానవుని నిర్మాణమునకు వెన్నెముక చాలా ముఖ్యమైంది. దీనిని తంత్ర శాస్త్రంలో వీణాదండం అంటారు దీనిలో క్రిందినుండి పైదాకా వెంట్రుక కన్నా సన్నని దారి వుంది దీని వెంబడి క్రిందనుండి పైవరకు ఆరు చక్రాలున్నవి ఇవి జ్ఞాన స్థానములు జ్ఞానము ఆరు రూపాలుగా, ఈ చక్రాల్లో వుంది. బ్రహ్మరంధ్రంనుండి శివుడు శక్తి ప్రవేశించారు శివుడు శిరస్సులో వున్న సహస్రారంలో వుండిపోయినాడు. శక్తి క్రిందికి దిగివచ్చి, క్రిందవున్న మూలాధారచక్రంలో వుంది మలమూత్రవిసర్జనస్థానం, పురుషేంద్రియం మధ్య మూలాధారచక్రం వుంది ఈ చక్రంలో శక్తి $3\frac{1}{2}$ చుట్టలు చుట్టుకుని వుంది పురుషేంద్రియంవద్ద స్వాధిష్ఠానచక్రం, నాభివద్ద మణి పూర చక్రం, హృదయంవద్ద అనాహతచక్రం, కంఠంవద్ద స్వాధిష్ఠానచక్రం, భ్రూకుటివద్ద ఆజ్ఞాచక్రం వుంది ప్రతి చక్రమునకు కొన్ని అక్షరములు, దేవతలు, వాహనాలు, శక్తులు, రంగులు, ఆకారములు, భూతములులోకం వుంటాయి శిరస్సులో సహస్రారచక్రం వుంది క్రిందిచక్రంలో త్రికోణాకారం వుంది. దీనిలో స్వయంభూలింగం వుంది ఈ లింగాన్ని $3\frac{1}{2}$ చుట్టలు చుట్టుకుని, తల సుషుమ్నా నాడిలో వుంచుకుని నిద్రిస్తుంది వెన్నెముకలో క్రిందినుండి సహస్రారంవరకు వున్న దారి నాడిని సుషుమ్నా నాడి అంటారు దీనికి రెండువైపుల వున్న నాడులను ఇడ పింగళ నాడు లంటారు. ఇవి క్రిందినుండి భ్రూవులవరకే వున్నవి కుండలినీశక్తి శబ్దబ్రహ్మయి వుంది ఈమె పంచ భూతాలు మనస్సుగా రూపొంది, షట్చక్రాలులో వుంది. ఈమే మంత్రము, బీజాక్షరములు, దేవతలుగా మారి పైచక్రాలలో వుంది. ప్రాణాయామం, ముద్రలు, బంధాలు, మంత్రాలవల్ల ఈ నిద్రించుశక్తిని లేపవచ్చు అప్పుడు ఈ శక్తి క్రిందిచక్రాల్లోవున్న పంచభూతాలు, మొదలైనవి, ఆజ్ఞాచక్రంలో వున్న మనస్సును తనలో లయించుకుని సహస్రారం చేరి, అందున్న పరశివునితో కలియును ఇది లయకర్మ అంటారు మళ్ళీ తిరిగి క్రిందికి తన స్థానంకు తిరిగి వచ్చును. దీనిని సృష్టికర్మ అంటారు. భూతాలను శుద్ధి చేయును, కనుక భూతశుద్ధి అని కూడా అంటారు నా ఉద్దేశ్యంలో కుండలినీశక్తి, కాళికాదేవి, శ్రీకృష్ణుడు, ఓంకారము, గణేశ్వరుడు, శబ్దబ్రహ్మ ఒక్క స్వరూపులై వున్నారు కుండలినీశక్తి $3\frac{1}{2}$ చుట్టలు చుట్టుకునివుంది. ఓంకారము $3\frac{1}{2}$ మాత్రలు కలిగి వుంది శ్రీ కృష్ణుడు త్రిభంగి కలవాడు కాళీదేవి మెడలో 51 పుర్రెలు, 51 మాతృకలుగా వున్నవి వినాయకుడు ప్రణవ స్వరూపి కనుక వీరంతా శబ్దబ్రహ్మలు కుండలినీశక్తి మేల్కొని తన భక్తులకు విద్యాదానం చేస్తుంది కాళీదేవి కాళిదాసుకు దర్శనం ఇచ్చి జ్ఞానదానం చేసింది శ్రీకృష్ణుడు అర్జునునికి విశ్వరూపదర్శనం ఇచ్చి, కింకర్తవ్యతామూఢుడై వున్నవానికి జ్ఞానమును ఉపదేశించాడు. కృష్ణుడు శబ్దబ్రహ్మ అను సంకేతము వారి చేతిలోని మురళి. మురళి అనగా నాదము ఇదే శబ్దబ్రహ్మ పరబ్రహ్మకు మార్పు వుండదు. కనుక ఆ వస్తువుకు అవతారం లేదు అందువల్లే దానిని తత్ అన్నారు

కుండలినీయోగము యోగములకు చక్రవర్తి వంటిది ధ్యానయోగంలోకుండలినీశక్తిని మేల్కొల్పుట వుండదు కుండలినీ శక్తి నిద్రిస్తున్నప్పుడు మనిషి బైటి ప్రపంచజ్ఞానం కలిగివుండును. ఆ శక్తి మేల్కొన్నప్పుడు బైటిప్రపంచ వాకిళ్ళు మూయబడి, లోప్రపంచం వాకిళ్ళు తెరవబడును అతనికి అనేక సిద్ధులు లభిం

షుము. శివశక్తుల సంయోగం కల్గును. బ్రహ్మానందం పొందును. ధ్యాన యోగంలో కుండలినీశక్తి మేల్కొనుట, సిద్ధులు కలుగుట వుండదు. కుండలినీయోగంవల్ల ఇహపరసుఖాలు కలుగును. భుక్తిముక్తులు లభించును కనుక కుండలినీయోగమును పూర్ణయోగ మన్నారు

కుండలినీశక్తి అనుభవ పూర్వకమైనదేనా, అది పూహాప్రపంచంలోనిదా అని నన్ను కొందరు ప్రశ్నించారు. సర్ జాన్ కుండలినీశక్తిని గురించి వ్రాశాడు అది పుస్తకాల్లోని శాస్త్రమేనా, లేక అతను అనుభవంలో తెలిసికున్న సత్యమా అని కూడా ప్రశ్నించారు. సర్ జాన్‌గార్ని గురించి వ్రాసేటప్పుడు, సామాన్యంగా వచ్చే ప్రశ్నలివ్వి. చదివిన శాస్త్రం వేరు, అనుభవజ్ఞానం వేరు. ఆధ్యాత్మిక రచనలను చూడటంతోనే గ్రంథకర్త గ్రంథగ్రంధియో అనుభవగ్రంధియో తెలిసిపోతుంది. అనుభవంలేనివారు, నిస్సందేహంగా తెగగొట్టి వ్రాయలేరు సర్ జాన్‌గారి గ్రంథములు చూడగా వీరు ఆర్యఋషివంటివారని అనిపించింది ఋషులు మంత్రద్రష్టలు. వీరూ మంత్రద్రష్ట, కుండలినీశక్తి ద్రష్ట అని నేను నమ్ముతున్నాను. వీరు నిష్కామ యోగి. అహం అను వాసన వారి ఏ గ్రంథాలలోనూ కనుపించదు. కనుక బ్రహ్మదర్శనం పొందినా ఆ విషయం ఎక్కడా వ్రాయలేదు. సాధనలేనివారు ఇంత శాస్త్రం చదవరు సాధకులే సాధనకొరకు ఎన్ని కష్టములు కల్గినా లెక్కించక చదవ కల్గుతారు. ఇది ముఖ్య రహస్యం. వారు 'సర్పెంట్ పవర్' గ్రంథం, ఉపోద్ఘాతములో కుండలినీ శక్తి అనుభవములను గురించి వ్రాశారు ఒక యూరోపుదేశీయుడు కుండలినీదర్శనం కాగా, హిందూ శాస్త్రములు సత్యములని నమ్మి సాధనలు చేశాడని వ్రాశారు. ఈ ఒక యూరోపు దేశీయుడు, ఎవరో కాదు సర్ జాన్ ఉడ్‌రఫ్ గారే అని నా నమ్మకము ఆ వ్యక్తిపేరు వ్రాయలేదు కనుక ఆ వ్యక్తి సర్ జాన్ అనే ధ్రువపడుతుంది ఆ కుండలినీ అనుభవము తెలిసికో తగినది మనవి చేస్తాను. ఒక పాశ్చాత్య వ్యక్తి సంస్కృతమునుండి ఆంగ్లంలోనికి తర్జుమా వేయబడ్డ యోగగ్రంథం చూడటం తటస్థించింది. గ్రంథంలో తాను చూచిన సాధన చేశాడు అదృష్టవశాత్తు కుండలినీశక్తి మేల్కొన్నది. అప్పుడు ఇతను కొన్ని దర్శనములను ఈ విధంగా చూచాడు. ఇడా పింగళనాడులు కనుపించినవి మధ్యనాడియైన సుషుమ్న నాడి క్రిందినుండి గులాబి తెలుపు వెలుగుతో మొదటికి వెళ్ళటం కనుపించింది ఇది శిరస్సుకు రెండువైపుల రెండురెక్కలవలె ప్రకాశించింది వెలుగు క్రిందిచక్రంనుండి పైచక్రమునకు అతి వేగంగా పరుగిడింది ఈ వేగంవల్ల దానిని సరిగ్గా చూడలేకపోయినాడు. ఇడానాడియందున్న ప్రకాశం వెన్నెలవలె కనుపించింది. పింగళనాడి యందున్న ప్రకాశం ఎర్రగా కనుపించింది కుండలినీశక్తి చుట్టలు చుట్టుకుని తీవ్రమైన బంగారువర్ణం తెలుపు కలిసిన నిప్పువలె కనుపించింది. ఒకనాటిరేయి, అతను కామక్రోధ విసర్జితుడైవున్న కాలంలో కుండలినీ శక్తి తన చుట్టలు విప్పుకుని పైకిపోవుట కనుపించింది అప్పుడు అతను నిప్పులలో వున్నట్లు గ్రహించాడు అగ్ని తన రెక్కలు విప్పుకుని తనను ఆక్రమిస్తున్నట్లు తెలిసికున్నాడు అప్పుడు తాళములు వాయించగా తప్పు సంగీతధ్వనిని విన్నాడు ఏదో శక్తి తనను నెట్టి వూపుతున్నట్లు అనుభవించాడు ఏదో శక్తి తనను ఆక్రమించి మింగివేస్తున్నట్లు గ్రహించి, చెప్పలేని భయము అనుభవించాడు ఈ భయంవల్ల తాను దర్శించిన దానిని సమగ్రంగా చూచుటకు వీలుపడలేదు తనకు లభించిన ఒక అవకాశమును చక్కగా వినియోగించుకోలేకపోయినాడు కాని తాను దర్శించిన ఈ అనుభవము, హిందూమత శాస్త్రములు చెప్పినవి, యదార్థములని గట్టి నమ్మకం పొందాడు. ఇది సర్ జాన్‌గారు లేక ఇంకేవ్యక్తి దర్శించినా కుండలినీశక్తి యధార్థమైందని సాక్ష్యం ఇస్తుంది. సర్ జాన్‌గారు యోగసాధన ఎరుగుదురని తెలుపు ఇంకొక్క విషయం మనవి చేస్తాను అది 1922 సంవత్సరము ఏప్రిల్ 22 వ తారీఖు స్థలము ఉత్తర ఒరిస్సా రాష్ట్రంలో కోణార్క దేవాలయం. వారు ఇక్కడ విన్న అనాహతశబ్దమును గురించి వారు వ్రాసిన వర్ణమాల అను మంత్రశాస్త్రం పీఠిక చివర ఇట్లా వ్రాశారు "ఈ ఉపోద్ఘాతం, కోణార్క దేవాలయంలో నేను వ్రాసే సమయంలో దూరంనుండి సుళ్ళు తిరుగుతున్న ఎడతెగని, హోరు శబ్దం విన్నాను. ఇది మహా మంత్రమైన ఓంకారనాదంవలె వినిపించింది. ఇట్టి నాదమునే "హెమియంగ్ని" మఠంలో చాలా సంవత్సరాల పూర్వం విన్నాను అప్పుడు కొన్ని వందల బౌద్ధ సన్యాసుల కంఠములనుండి వచ్చిన ఓంకారనాదము సముద్రఘోషను తలపించింది. ఇప్పుడు నేను వింటున్న ఈ నాదము ఆ సన్యాసుల కంఠముల నుండి వెలువడిన మహా మంత్రనాదంవలె వుంది ఈ దేవాలయం చుట్టూ వికసించిన మల్లెపొదలు, గులాబిపొద లున్నవి వీటి చుట్టూ కంటికందని విశాల భూమి, దాని అవతల అంతులేని సముద్రం వుంది. ఈ చోటు నాకు బాగా తెలిసింది ఎంతోకాలం ఆనందమును అనుభవించిన చోటు ప్రీతికరమైన ఈ పుణ్య భూమిని చూడటం ఇదే ఆఖరిదై వుండవచ్చు ? కోణార్క దేవాలయంలో వారి అనుభవము ననుసరించియైనా, సర్ జాన్‌గారు కుండలినీ యోగ సాధకులు, అనుభవజ్ఞులని తెలుస్తుంది ఇట్టి అనుభవం పొందిన వారు ఎందరో వున్నారు పూర్వం అద్వైత మతస్థాపకులు, గౌడపాదులు జగద్గురు శ్రీ శంకరస్వామి, జ్ఞానేశ్వరుడు, రామకృష్ణ పరమహంస, వివేకానందస్వామి, అరవిందయోగి మొదలైనవారు వారు నిష్కామయోగులు, సన్యాసులు. మన నుండి వారు ఆశించేది ఏదీలేదు అనృతం చెప్పవలసినంత బాధ వారికి లేదు వారు చూచింది చూచినట్లు చెప్పారు కనుక కుండలినీ శక్తి యధార్థం.

కుండలినీశక్తి ప్రాణాగ్ని. ఈ శక్తిని మేల్కొల్పగా అది పైకి వెళ్ళుతూ క్రింది చక్రములలోవున్న స్థూల భూతములను మారుస్తుంది ఆజ్ఞాచక్రంలో వున్న మనోశ్శక్తిని కూడా తాను తీసికొని సహస్రారచక్రం చేరుతుంది సహస్రార చక్రం మొదటివద్ద వుంది సూక్ష్మ, కారణ రూపం తాల్చిన ఈ ప్రాణాగ్ని మెదటి వద్దకు వెళ్తుంది ఫలితంగా మెదడులో కొన్ని పరిణామములు జరుగును ఇందువల్ల సాధకునికి బుద్ధిసూక్ష్మత కల్గును నేటి మానసిక పండితులు దీనిని పరీక్షించవచ్చు లేనియెడల చదువురాని రామకృష్ణుడు బ్రహ్మజ్ఞానమును ఎట్లా పొందివుంటారు బ్రహ్మాండమైన 'గాస్పెల్ ఆఫ్ శ్రీ రామక్రిష్ణపరమహంస' గ్రంధమును ఎట్లా చెప్ప కలిగి వుంటారు 30 సంవత్సరములకే వివేకానందస్వామి ప్రపంచమంతా రామకృష్ణ అమృతమును వెదచల్లి, బ్రహ్మాండమైన రామకృష్ణమిషన్‌ను, బేలూరు మఠమును ఎలా స్థాపించకల్గుతారు ? అన్నిటిలోకన్న గొప్ప విచిత్రము జగద్గురువు ఆది శంకరస్వామి 30 ఏండ్లకే వేద శాస్త్రము అన్నిటిని చదివి, వాటికి భాష్యంవ్రాసి, భారతదేశం అంతా సంచారంచేసి, విమతాలను ఖండించి, అద్వైత మత స్థాపన చేసి, దిగ్విజయం చేశారు ఏ శక్తిలేనిది ఇంతకార్యము 30 ఏండ్లకే సాధ్యంకాదు వారు వ్రాసిన భాష్యం చక్కగా గ్రహించవలెనంటె 30 సంవత్సరములు వచ్చునప్పటికి కూడా చేతకాదనుకుంటాను వీరూ గంగానది ఒడ్డున కుండలినీ శక్తిని మేల్కొల్పి, బ్రహ్మ శక్తి దర్శనం పొందారు వారు పొందిన అనుభవమునే సౌందర్యలహరిగా చెప్పారు వారి గురువు గౌడపాదాచార్యులు కూడా కుండలినీ శక్తి దర్శనం పొందారు గౌడ పాదాచార్యులు 52 శ్లోకములతో "సుభగోదయ"మను గ్రంధములో వారి అనుభవములను చెప్పారు శంకరస్వామి గురువువద్ద ప్రత్యేక శిక్షణ పొందారు—శంకరస్వామి తాను పొందిన అనుభవములను నూరు శ్లోకములతో సౌందర్య లహరి అను గ్రంధమును చెప్పారు ఇది ప్రఖ్యాతిగన్న మంత్ర శాస్త్రం ఇందులో మొదటి 41 శ్లోకములను ఆనందలహరి అని అంటారు దేవి అందమును శిరస్సునుండి పాదాలవరకు వర్ణించారు ఆనందలహరి సమయాచారుల సారాంశమై వుంది కుండలినీ సాధకులకు ఇది అతి ముఖ్య గ్రంధము ఇందులో శంకరస్వామి తన అనుభవాలు చెప్పినందున శంకరస్వామి దీనికి మంత్రద్రష్ట కనుక ఇది శివుడు చెప్పాడు శంకరస్వామి గ్రంధకర్త కాదని కొందరంటారు ఈ గ్రంధమునకు ముప్పది ఆరుగురు వ్యాఖ్యలు వ్రాశారు దీనిమూలంగా ఈ గ్రంథ గొప్పతనం తెలుస్తుంది 'ఆనందలహరి' గ్రంధమును సర్ జాన్‌గారు వ్రాశారు దీనికి దీర్ఘమైన, ఉపయోగమైన ఉపోద్ఘాతం వ్రాశారు సంస్కృత మూలమునిచ్చి దానికి అర్థం వ్యాఖ్య, వివరణలు వ్రాశారు ఆనందలహరి శ్లోకముల సంఖ్యలో కొందరకు అభిప్రాయభేదం వుంది సర్ జాన్‌గారు గ్రంథంలో మొదటి 4 శ్లోకములను ఇచ్చారు తతిమ్మా శ్లోకములన్నీ మంత్రప్రయోగములై వున్నవి 13, 18, 19 శ్లోకములు మదన ప్రయోగమునకు సంబంధించినవి అనగా చతుర్విధ పురుషార్థములలో మూడవదైన కామమునకు సంబంధించింది. గౌడపాదులు వ్రాసిన సుభగోదయమునకు

వ్రాసిన విస్తరణగ్రంథ మంటారు. ఈ గ్రంథమును. ఆనంద లహరి వ్యాఖ్య లన్నిటిలో లక్ష్మీధరుని వ్యాఖ్య శ్రేష్టమైంది ఇందులో అన్ని మతాల సమ న్వయం వుంది ఇతను దక్షిణాదివాడు. ఆటవేలివాడే. ఇతను సుభ గోద యమునకు కూడా వ్యాఖ్య వ్రాశాడు వంగీయులు లచ్యుతానందుని వ్యాఖ్యను ప్రేమిస్తారు ప్రయోగం విషయంలో నాలుగు గ్రంథాలున్నవి కంచిలో వ్రాసింది ముఖ్యమైంది కంచి గ్రంథంలో మంత్రములకు యంత్రములు కూడా వ్రాయబడివున్నవి. కుండలినీ శక్తి, చక్రములు. మంత్రములు, బీజా క్షరములు, యంత్రములు పుజా విధానములు, ప్రయోగ రహస్యములు ఇందులో వున్నవి

వేదములు పురాణములుండగా ఈ తంత్ర శాస్త్రం ఎందుకు వచ్చింది? దీనిని కనిపెట్టిన వారెవరు? ఎప్పుడు కనిపెట్టారు అనే ప్రశ్నలకు అనేక అభిప్రాయ భేదములున్నవి. సర్ జాన్‌గారు చెప్పింది చాల హేతుయుక్తం గాను, శాస్త్రోక్తంగాను వుంది ఈ విషయాలను గురించి వారు రచించిన "శక్తి శక్త" గ్రంథంలోనూ, "మహా నిర్వాణ తంత్ర" గ్రంథములలోనూ ఎక్కువగా వర్ణించారు

భారత యుద్ధమైన కురుక్షేత్ర సంగ్రామం మనదేశమునకు చాలా అప కారం చేసిందని సర్ జాన్‌గారు అభిప్రాయపడ్డారు. ఆ యుద్ధంలో భారత భూమిలోవున్న క్షత్రియ వీరులు, బ్రాహ్మణ శాస్త్రజ్ఞులు నశించారు దేశంలో అనాచారికం ప్రబలి, సర్వం నశించిందని అభిప్రాయపడ్డారు

ఈ విషయమై "శక్తి శక్త" గ్రంథంలో వారు రచించిన వాక్య ములు మనవి చేస్తాను

"చాలా మంది పండితులు హిందూ తంత్ర శాస్త్రము, బౌద్ధతంత్ర శాస్త్రంనుండి పుట్టిందని అభిప్రాయపడుతున్నారు బౌద్ధుల మహాయా నంలో వజ్రయానమనే తంత్ర శాస్త్రం వుంది ఈ వజ్రయానంనుండే హిందువులు తంత్ర శాస్త్రమును గ్రహించారని అంటారు కొందరు తంత్ర సాధనలు అనార్యులైన ఆటవికులనుండి తీసికున్నారని అంటారు ఇది ఎక్కడి నుండి వచ్చినా, తంతశాస్త్రమునకు బీజములు వేదములలోనే వున్నవి వేదము లలో వున్న వాటిని విస్తరించి చెప్పింది తంత్ర శాస్త్రము వినాశకరమైన భారత యుద్ధము వేదమతంమీద గట్టి దెబ్బ కొట్టింది ప్రజలలో మార్పు వచ్చింది విమతాలు పుట్టి వృద్ధి కాంచినవి వేదమతం ఆచరించలేని హీన స్థితికి వచ్చింది ఇందుకు ఉపాయమును కనిపెట్టారు ఆర్య ఋషులు వేద యజ్ఞములను చేయగల రాజులు, చేయించగల బ్రాహ్మణులు నాడు లేరు వేదమతమునకు అపాయ స్థితి వచ్చింది వేదయజ్ఞాలు ఆగిన సమయమే కలి ప్రవేశం ఋషులు దీని ప్రత్యామ్నాయముగా జ్ఞానకాండను చెప్పారు ఇవే ఉపనిషత్తులు ఉపనిషత్తులకు సాధన శాస్త్రం తంత్రశాస్త్రము కర్మ కాండలోవున్న అగ్ని, ఇంద్రుడు, సూర్యుడు మొదలైన దేవతలు తంత్ర శాస్త్రములో ఇంకో రూపంలో ప్రవేశించారు వేద మంత్రాలు, బీజాక్ష రములకు ప్రతిగా, తంత్ర మంత్రాలు బీజాక్షరములు పుట్టినవి వేదముల లోని పంచ ఉపాసనలు, తంత్రశాస్త్రంలోని పంచ ఉపాసన లైనవి ఈ విధంగా వేదమతం అపాయంనుండి తెలివిగా తప్పుకుంది ఫలితంగా శాక్తేయ, సౌర, భాగవత, శైవ, గాణాపత్య మతాలు వెలసినవి వేదమతమును కబళించు టకు బౌద్ధమతం పుట్టింది అట్టి బౌద్ధమునే వేదమతం కబళించింది'

బౌద్ధము తంత్ర శాస్త్రమును అవలంబించుటకు కారణములను "శక్తి శక్త" గ్రంథంలో సర్ జాన్ వ్రాశారు మనవి చేస్తాను

"వేదమతంలోని కర్మకాండను నిరసించుటకు బౌద్ధమతం పుట్టింది కొంతకాలం గడచిన తర్వాత ద్ధమతంలో బోధలు, అష్టవిధ మార్గాల చేత ప్రజలలో తృప్తిలేకపోయింది ఏవో అనుభవాలు, శీఘ్రఫలితాలు కావలసి వచ్చింది పర్యవసానంగా మహాయానం జనించింది దీని సిద్ధాంతమును చెప్పిన మహా పురుషుడు నాగార్జునాచార్యులు శరీర, మానసిక, ఆత్మ శక్తులను అనుభవం లోనికి తెచ్చుటకు విధానం కనిపెట్టబడ్డది దీని ఫలితమే యోగ శాస్త్రము. బౌద్ధమతంలో యోగాచార సంప్రదాయం అడుగిడింది. బౌద్ధులు నిరసించిన కర్మకాండ, విగ్రహారాధన వచ్చినవి. శక్తి పూజలు బైలుదేరినవి. మంత్రయాన, వజ్రయానములు బౌద్ధమతంలో చోటు చేసుకున్నవి."

తంత్ర పూజలను గురించి "శక్తి శక్త" గ్రంథంలో సర్ జాన్‌గారు ఇంకొక చోట ఇట్లా వ్రాశారు

"కనుపించని శక్తులున్నవి. ఇట్టి శక్తుల సహాయంపొంది సిద్ధి పొంద వచ్చని నాగార్జునాచార్యులు తలచారు ఇందుకై పూజలు, మంత్రాలు, యంత్రాలు, వశీకరణలు, రక్షాబంధాలు, కవచం, మాల, అంగన్యాస, కర న్యాసము, విగ్రహ పూజ, దేవాలయములు, రసాయన క్రియలు చెప్పారు. ఇవి చీనా టిబెట్టు దేశములకు తీసుకుపోబడ్డవి. చీనా దేశంనుండి ఆ సాధనలే తిరిగి ఈ దేశం వచ్చినవి వీటనే చీనాచారము లన్నారు ఇట్టి సాధనములకు బౌద్ధుల మఠములలో స్త్రీలను చేర్చారు. (ఆంధ్రదేశంలో లంజదిబ్బలు ఇట్టివే) దీనితో బౌద్ధమతం నశించింది'

',శక్తి పూజలు, చరిత్రకు పూర్వంనుండి వున్నవని సర్ జాన్ అభిప్రాయం. ఇట్టివి దక్షిణ అమెరికాలోనూ, గ్రీసు, ఈజిప్టు దేశాలలో వున్నవి. ఈ దేశాలలో ఏనాటినుండో లింగ పూజలున్నవి. ఇటువంటి దేవతలు, సాధనలు ఆ దేశాల వున్నవి. మహంజోదరో నాటికే ఈ సాధనలున్నట్లు అక్కడ దొరికిన సాక్ష్యంవల్ల తెలుస్తుంది. వేదములలో కూడా ఇట్టివి బీజరూపంగా వున్నవి. పశుబలి, స్త్రీ పూజ, సోమపానములు అందున్నవి. రామాయణంలో రామునికి బల, అతిబల విద్యలు చెప్పినట్లుంది. పరశురాముడు, వశిష్ఠుడు, కృష్ణుడు తంత్ర సాధకులే బ్రహ్మాండ పురాణంలో విష్ణు అంశమైన హయగ్రీవుడు ఈ విద్యను వశిష్ఠునకు చెప్పినట్లుంది బ్రహ్మ కుమారుడైన వశిష్ఠుడు ఎన్ని సంవత్సరములు తపస్సు చేసినా ఫలితం కనుపించలేదు అప్పుడు దేవి ప్రత్యక్షమై తన్ను పూజించిన శీఘ్ర సిద్ధి కల్గుతుందని ఆనతి ఇచ్చింది. ఇది వశిష్ఠుడు ఆచరించగా సిద్ధి కల్గింది అప్పటినుండి శక్తి పూజలు వచ్చినవి.'

"మహా నిర్వాణ తంత్ర గ్రంధంలో, తంత్రశాస్త్రం పుట్టు పూర్వోత్తరాలను గురించి కొన్ని విషయా లున్నవి. వాటిని సర్ జాన్‌గారు తను వ్రాసిన గ్రంథంలో ఇట్లా వ్రాశారు

"మహా నిర్వాణ తంత్రపు జన్మస్థానము హిమాలయ పర్వతాల్లో. హిమాలయ పర్వతాల్లో సప్తకుల పర్వతా లున్నవి. ఇవే ఆర్య జాతికి వారి శాస్త్రములకు మాతృ భూమి. ఇక్కడే గంగానది జన్మస్థానము భారతంలో చెప్పబడ్డ పాండవులు విశ్రమించిన గుహలు ఇక్కడే వున్నవి. ఇక్కడే హిందువుల పవిత్ర క్షేత్రములైన గంగోత్రి, కేదారనాథ, బదరినాథ మొదలైనవి వున్నవి. శివుని నివాస స్థానమైన కైలాసపర్వతం ఇక్కడే వుంది కైలాస పర్వతమునకు ఇంకో పేరు గణపర్వతం ఇదే దేవయోని మహా నిర్వాతంత్ర గ్రంథంలో దేవయోనిని గురించి చెప్పబడ్డది ఈ స్థలము మందారపుష్ప సౌరభంతో ఎంతో ఆహ్లాదకరంగా వుంటుంది. స్కంద పురాణంలో హిమాచలమును దర్శించ నవసరం లేకుండానే స్మరించినంత మాత్రాన కాశీలో అన్ని పూజలు చేసినీ దానికన్న ఎక్కువగా పుణ్యం కల్గునని వ్రాయబడివుంది ఉదయభానుని కిరణాలవల్ల హిమం ఎట్లా కరిగిపోతుందో, హిమాలయమును దర్శించుటచేత ఆ విధంగా పాపం కరిగిపోతుంది. ఆర్య ఋషులు తపస్సు చేసిన పావన భూమి ఇది. ఇక్కడే శివుడు పార్వతికి ఈ శాస్త్రమును చెప్పాడు—తంత్ర శాస్త్రమును గురించి, గా య త్రి తం త్ర శాస్త్రంలో ఇట్లా వ్రాయబడివుంది శివుడు ఈ శాస్త్రమును గణేశునకు చెప్పాడు. గణేశుడు ఈ శాస్త్రమును కైలాస పర్వతంమీద దేవయానికి చెప్పాడు బైటవున్న ప్రపంచము మానవునిలోనూ వుంది. ఈ కైలాస పర్వతము మానవునిలో సహస్రార పద్మం కైలాసపర్వతం వద్ద మానస సరోవరం వుంది. ఈ మానస సరోవరమే సహస్రారంలోవున్న సుధాసింధు '

మహానిర్వాణతంత్ర గ్రంధంలో శివుని, పార్వతి వేదములుండగా తంత్ర శాస్త్రం ఎందుకని ప్రశ్నించింది? 'ఇందుకు సమాధానం ఈవిధంగా చెప్పాడు శివుడు, "కలిమానవులు దుర్బలులై దురలవాటులు కలవారై వుంటారు వేద కాలపు మానవులవలె బలవంతులుకాక పాపులై వుంటారు సులభంగా ఆచరించుటకు, శీఘ్రంగా ఫలించుటకు భుక్తిముక్తులు రెండూ ఒక సాధనలోనే దొరుకుటకు వీలైన సాధనలు అవసరమైనవి ఈ కాలంలో కొన్ని విమతాలు ప్రబలినవి. వీటిలో స్త్రీ శూద్రులకు సమానత్వం వుంది వేదములలో లేదు ఇది ఇన్ని అవసరములు తీర్చుటకు తంత్ర శాస్త్రమును చెప్పారు ఆర్య ఋషులు. తంత్ర శాస్త్రములో అన్ని రకాల వారికి సావకాశములున్నవి మధువు సేవించు వారికి కూడా ఇందులో అవకాశం వుంది మధువును దేవికి అర్పించి, దేవి ప్రసాదంగా తాగవచ్చు. అప్పుడు సాధకునిలో పవిత్ర వాతావరణం ఏర్పడి, సన్మార్గగామియౌను. ఇందుకు 'భోగేయోగేత్' అన్న సూత్రం చెప్పారు "

ఈ విషయమై కులార్ణవతంత్రంలో ఈవిధంగా వ్రాయబడివుంది. భూమిమీద పడ్డవాడు భూమిని ఆధారంగా చేసికుని పైకి లేవాలి
బౌద్ధుల సుభాషిత సంగ్రహంలో ఈ విధంగా వ్రాయబడి వుంది కాలిలో విరిగిన ముల్లును తీయుటకు ముల్లునే ఉపయోగించాలి

పంచ మకారములను గురించి మహా నిర్వాణ తంత్రశాస్త్రంలో ఇట్లా వ్రాయబడివుంది శక్తి పూజకు పంచతత్వములు అవసరములైవున్నవి ఇవి లేకుండా శక్తిపూజ లేదు. శక్తి అనగా జగదంబ జగత్తును కన్న జననియే ఈ శక్తి. కనుక జగత్తే ఈమె జగత్తు అనగా పంచభూతాలు పంచభూతములను పంచమకారము లంటారు ఈ శాస్త్రంలో పంచ మకారములను జగదంబకు సమర్పించుటనగా, ప్రపంచ మంతటినీ ఆ జననికి సమర్పించుటే

చతుర్విధ పురుషార్థములు పొందుటకు శాక్తేయులలో మూడు విధము లున్నవి. (1) కౌల ఆగమము. వీరు బహిర్ముఖులు బైట పూజలు చేస్తారు. శాస్త్రమునకు ప్రత్యక్ష అర్థమునే స్వీకరిస్తారు యోని అన్నప్పుడు ప్రత్యక్ష యోనినే పూజించేది. వీరు కోరేది ఈ ప్రపంచ సుఖములే కనుక అర్థ కామములు వీరి కామ్యాలు (2) మిశ్రమ ఆగమం క్రియ, ఉపాసన ఇందులో కలిసి వున్నవి కనుక మిశ్రమ ఆగమం అన్నారు వీరు కోరేది పురుషార్థములలోని మొదటి దైవ ధర్మమును. మానవుని నైతికశక్తియే వీరికి ప్రధానం. (3)సమయ ఆగ

మము. వీరు అంతర్ముఖులు. వీరు చేసే సాధన మానవుని ఆంతర్యంలోనే. వీరి లక్ష్యం పురుషార్థములలోని చివరిదైన మోక్షము. నా ఉద్దేశ్యం—వీరు పూజించేది ఆంతర్య యోని త్రిభుకుటితో పురుష యోని వుంది రామకృష్ణ పరమ హంస అద్వైత సాధనకు కూర్చోగా, అద్వైత భావన రాలేదు. అప్పుడు గురువు ఒక పెంకు తీసికుని ఈ త్రిభుకుటిలోని యోనిమీద ఒక్క పోటు పొడిచాడు అప్పుడు అద్వైత సిద్ధి కల్గింది.

సర్ జాన్‌గారు వ్రాసిన మంత్ర గ్రంథములలో 'మహా నిర్వాణ తంత్ర' గ్రంథం గొప్పది మోక్ష సిద్ధికి ఇందులో తంత్ర సాధనలు చెప్పబడ్డవి. ఇందులో అనేక మంత్రరాజము లున్నవి ఇట్టి గ్రంథము సర్ జాన్‌గారికి, చాలా కష్టంతోగాని దొరకలేదు. ఎందరో ఇది రహస్య గ్రంథమని వారికి చూపించలేదు ఒక నేపాలు మిత్రునివద్ద ఈ గ్రంథం వుంది. ఈ గ్రంథమును ప్రచురించుటకు సర్ జాన్‌గారు అడిగారు "ఇది మంత్రశాస్త్రం ఇందులో సత్కర్మలున్నవి. ఇవి కొందరు దురుపయోగం చేయువచ్చు ఈ మంత్రములు అచ్చు వేయకూడదు అందువల్ల ఇవ్వ"నన్నాడు ఆ మంత్ర అర్థములను మాత్రం ఉపయోగించుటకు ఒప్పుకున్నాడు ఇది సర్ జాన్‌గారికి చాలా కష్టమనిపించింది. కాని మంత్రశాస్త్రమును రహస్యంగావుంచే విధిని ఆ మిత్రుడు అక్షరాల ఆచరించినందుకు అతనిని అభినందించారు.

బ్రహ్మ సమాజ స్థాపకులు, సంఘసేవకులైన రాజా రామమోహన్‌రాయ్ గారికి మహా నిర్వాణ తంత్రమంటే యెంతో అభిమానము ఈ విషయమును సర్ జాన్‌గారు ఎంతో అభినందించారు. ఈ విషయము గురించి వారు వ్రాసిన మహా నిర్వాణ తంత్ర గ్రంథంలో బైటపెట్టారు ఈ విధంగా

"మహానిర్వాణ తంత్ర గ్రంథమును మొదటగా అచ్చు వేయించింది ఆది బ్రహ్మ సమాజమువారు 1798 సంవత్సరంలో ఈ గ్రంథంలో శ్రీమత్ హరిహరానంద భారతి, మహా నిర్వాణ తంత్ర గ్రంథమునకు వ్రాసిన వ్యాఖ్య కూడా అచ్చు వేశారు. ఈ భారతిగారు రాజా రామమోహన్‌రాయ్‌గారి గురువుల గురువుగారు వ్రాసిన గ్రంథమునంతా రాజా రామ మోహన్‌రాయ్‌గారు తన చేతితో వ్రాశారు వ్యాఖ్య ప్రతి ప్రకరణం ఆరంభంలో " ఓం నమో బ్రహ్మణే' అను మంత్రమును వ్రాశారు మొదటి తొమ్మిది ప్రకరణముల ఆరంభములో "శ్రీ శ్రీనాధపదాంభోజే నియుతం మతి రస్తు మే?" అను ధ్యాన శ్లోకం కూడా రాజాగారు వ్రాశారు ఈ శ్లోకము రాజాగారి మనస్సును గురించి తెలుపుతుంది రాజాగారు తమ మనస్సును ఎప్పుడూ గురుపాద పద్మములమీదనే వుండాలని కోరుతుండేవారు రాజాగారు తమ గురువుచేత పునశ్చరణ చేయించుకుని ఉపదేశం పొందారు తమ ఉపవీతమును ఎన్నడూ వీడ లేదు ఆంగ్లదేశంలో బ్రిస్టల్‌పట్నంలో రాజాగారు విదేహముక్తులైనప్పుడు కూడా వారి ఒంటిమీద ఉపవీతం ఉంది. ఈ విషయములు రాజా రామ్ మోహన్‌గారు తంత్ర సాధకులని తెలుపుతుంది ఈ ఉదంతమును వ్రాయటంలో సర్ జాన్‌గారికి ఉపవీతమంటే ఎంత శ్రద్ధ వుందో తెలుస్తుంది

మహా నిర్వాణ తంత్ర గ్రంథమును అప్పటివారి అవసరాలకు హరిహరానంద భారతి వ్రాశాడని అపవా దుంది ఇది చాలా అసంగతము దీనిని భారతి వ్రాయలేదని ఖండించారు సర్ జాన్‌గారు. తాను నేపాలు మిత్రునివద్ద చూచిన మహా నిర్వాణ తంత్రము ఇప్పటికి అయిదు వందల సంవత్సరాలకు పూర్వమే వ్రాయబడ్డదని వ్రాశారు భారతిగారు ప్రచురించిన గ్రంథంలో 14 ప్రకరణ లున్నవి నేపాలు గ్రంథంలో ఇంతకు రెట్టింపు వుందని వ్రాశారు 1913 సంవత్సరంలో సర్ జాన్‌గారు మహా నిర్వాణ తంత్ర గ్రంధాన్ని ప్రచురించారు దీనికి వ్యాఖ్య స్వయంగానే వ్రాశారు కాని అది హరిహరానంద భారతి వ్యాఖ్యానమును అనుసరించి వుంది ఈ గ్రంథమునకు అనేకులు వ్యాఖ్యలు వ్రాసి ప్రచురించారు కాని ఇవి ఈ గ్రంథమును గందరగోళములోనికి దింపినవి. సర్ జాన్‌గారు బుద్ధి కుశలతతో ఈ వ్యాఖ్య వ్రాసి, ఆ గందరగోళము, చిక్కులను తీర్చి, అందరికి అర్థం అవునట్లు వ్రాశారు వారు వ్రాసిన ఉపోద్ఘాతము, వివరణలు ఎంతో విలువ కలవి ఇందులో సాధకునికి ఉపయోగించు అనేక విషయాలున్నవి పరజీవితము, అజ్ఞానమునుండి ముక్తి, బ్రహ్మపూజ, మంత్రం, స్తోత్రం, కర్మకాండ, ధర్మం, సంస్కారం, ప్రాయశ్చిత్తం, కులాలు, ఆశ్రమాలు, అవధూతలు, దేవతా పూజలు, లోకములు, వ్యక్తి, ప్రపంచం, చతుర్విధ పురుషార్థములు, గుణాలు, సాధనలు, గురువు, శిష్యుడు, ఉపదేశము, వేద మంత్రముల భేదం మొదలైనవి వున్నవి

సర్ జాన్‌గారు తంత్ర రహస్యములు తెలుపు గ్రంథముల నెన్నిటినో సంపాదించారు. ప్రచురించారు. కాని అచ్చుకాక, దొరకని గ్రంథాలు ఇంకా వున్నవి మహాకాళ సంహిత అను గ్రంథ ముంది. దీనిలో అక్షరాల యిరవై అయిదువేల శ్లోకాలున్నవి. శాక్తేయులకు ఇది అధికార గ్రంథము ఇందులో ఎన్నో రహస్య సాధనలున్నవి ఇది అచ్చు కాలేదు. ఇట్టివి కొన్ని చెదలకు ఆహారమై, నిరుపయోగమై కాలపురుషునిలో లీనమైపోతున్నవి సర్ జాన్‌గారు ముప్పది సంవత్సరములున్నారు భారత భూమిలో వారు చేసిన గొప్ప పని తంత్ర శాస్త్రంలో చేసికున్న అపార్థములను ఎత్తిచూపుట. కొన్ని ఉదాహరణలను మనవి చేస్తాను

Hyman to Kalı (కాళీ స్తోత్రము) గ్రంథమును ప్రచురించారు సర్ జాన్‌గారు. ఇందుకు వారు మంచి ఉపోద్ఘాతం వ్రాశారు శాక్తేయ సాధనలు చాలా రహస్యమైనవి అందువల్ల ఆ గ్రంథములను సంకేత భాషలో వ్రాశారు ఈ భాషను సంధ్యా భాష అన్నారు ఈ శాస్త్రజ్ఞులు సంధ్యలో దివారాత్రములు రెండున్నట్లు. ఈ భాషలో రెండు అర్థము లుంటవి కాళీ స్తోత్రంలో బలిని గురించి 19 వ శ్లోకములో వ్రాయబడివుంది ఇందులో దేవికి వివిధ పశువులను బలి ఇవ్వవలెనని వుంది శాస్త్రకారుని అభిప్రాయం ఆ పశువులను కాదు బలిచ్చేది, ఆ పశు సంబంధమై మానవునిలోవున్న గుణమునే బలి ఇవ్వవలసి వుంటుందని సర్ జాన్‌గారు వ్రాశారు తంత్ర శాస్త్రమునకు త్రివిధ అర్థము లున్నవని వ్రాశారు ఇవి (1) పర, (2) సూక్ష్మ, (3) స్థూల అర్థములు స్తోత్రంలోని జంతువులకు ఈ విధంగా అర్థం చెప్పారు బలి ఇవ్వమన్న మేక అనగా కామం, గేదె అనగా కోపం, పిల్లి అనగా లోభం, గొర్రె అనగా భ్రాంతి, ఒంటె అనగా అసూయ, మనిషి అనగా గర్వమని సంకేత అర్థం చెప్పారు

తంత్రసాధనలో లతాసాధన అనే పదం వుంది ఇదీ అపార్థమునకు పాలైంది లత అంటే స్త్రీ లతా సాధన అనగా మైథునము అన్నారు మైథునమును గురించి శివుడు చెప్పిన శ్లోకం చదవండి · "మైథునేన మహాయోగీ మమ తుల్యోన సంశయ " దీని ప్రత్యక్ష అర్థం ఇది: "మహా యోగి మైథునమ్ము వల్ల నాతో సమానమవును ఇందుకు సంశయంలేదు " ఇదే నిజమైన అర. మైనయెడల ఇది చాలా అసంగతం, అసందర్భమైంది మైథునము మహాయోగికి చెప్పుటే అసందర్భం మైథునం వలన శివునంతటివాడౌట ఇంకా అసంగతం దీని అసలు అర్థములో స్త్రీ అనబడు కుండలినీ శక్తిని తీసుకువెళ్లి సహస్రారంలోని శివునితో సంయోగ పరచుట కుండలినీ శక్తిని మేల్కొల్పువాడు మహాయోగి ఇతను కుండలినీకాంతను తీసుకువెళ్లి సహస్రారంలోని శివునితో కలుపుటే మైథునము ఇట్లా మైథునం చేసిన మహాయోగి శివుని అంతటివాడవును. ఇది అసలు అర్థము

"మహా నిర్వాణతంత్రం"లో ఈ శ్లోకం చదవండి "మాతృయోనౌ క్షిపేల్లింగం, భగిన్యాఃస్తనమర్దనం! గురోర్మూర్ధ్నిపాదం దత్వా, పునర్జన్మ నవిద్యతే" దీని మాటకు మాట అర్థం ఇది తల్లితోడ బుట్టువులతో వ్యభిచరించి, గురువు నెత్తిని పాదంవుంచినవానికి పునర్జన్మలేదు ఈ అర్థము ఎంత అసందర్భం, ఎంత ఘోరంగావుందో చూడండి ఈ శ్లోకమునకు అసలు అర్థం వుంది అది ఈ శాస్త్రం తెలిసికొన్న వారికిగాని అర్థంకాదు మూలాధారంలో త్రికోణాకారం వుంది త్రికోణాకారమునకు యోని అను సంకేతార్థం వుంది మూలాధారంలోవున్న త్రికోణాకారమును మాతృయోని అంటారు ఈ యోనిలో స్వయంభూలింగం వుంది ఈ లింగమే జీవాత్మ ఈ లింగమునకు 3½ చుట్టలు చుట్టుకుని కుండలినీ శక్తి వుంది. త్రికోణాకారంలో ఒక్కచోట వున్నవి కుండలిని, స్వయంభూలింగం కనుక ఇద్దరూ తోబుట్టువులు మాతృ యోనిలో లింగమనగా మూలాధార చక్రంలోవున్న మాతృయోని అను చెప్పబడు త్రికోణాకారములో యోగ సాధకుడు స్వయంగా భూలింగమును ధ్యానించుట సోదరి స్తనమర్దన అనగా, సోదరియైన కుండలినీదేవిని ఒత్తిడి చేయుట, కుండలినీ శక్తిని మేల్కొల్పుటకు, ఈ మూలాధార స్థలమును కుంచించి వదలుట,

ప్రాణాగ్నిచేత, హంస మంత్రంచేత అక్కడ ఒత్తిడిని చెస్తారు ఇదే స్తన మర్దనం కుండలినీ శక్తిని మేల్కొల్పి సహస్రారపద్మంవద్దకు తీసుకు వెళ్లాలి సహస్రారపద్మం క్రింద, ద్వాదశ దళపద్మం వుంది ఈ క్రిందవున్న ద్వాదశ దళపద్మంలో గురువు వున్నాడు సహస్రారపద్మంలో వుండుటవగా, గురువు వెళ్ళిన వున్నట్లే. అది గురువు నెళ్ళిన పాదము లుంచుటకు అర్థం అప్పుడు గురు శిష్య న్యాయంపోయి, అభేదం కల్గుతుంది, ఇది అద్వైత సిద్ధి దీనివల్ల అతనికి పునర్జన్మ వుండదు ఇదీ తంత్ర శాస్త్రజ్ఞులు చెప్పదలచిన అర్థము ఇట్టివి అనేకార్థములపాలై తంత్ర శాస్త్రమే రాహుగ్రస్తమైంది రాహు విమోచన చేసినవారు సర్ జాన్ ఉడ్‌రఫ్ వీరు కారణజన్ములు ఇందుకై అవత రించిన భారతీయ ఋషి వీరి శరీరము పాశ్చాత్య దేశీయమైనా, ప్రాణమనో బుద్ధ్యాత్మలు భారతీయములే. వీరిలో తూర్పు పడమరలు రెండూ కలిసినవి. ఇది లోక కల్యాణార్థం జరిగిన కార్యం భారతదేశము తంత్ర శాస్త్రమునకు ఎంతో ఋణపడివుందని సర్ జాన్ అన్నారు తంత్ర శాస్త్రంవల్ల భారత దేశంలో ఆధ్యాత్మిక శాస్త్రం, ఆయుర్వేదం, న్యాయశాస్త్రం, జ్యోతిషం, రసా యనములెన్నో వృద్ధయినవని వ్రాశారు ఇంత అభివృద్ధి పరచిన తంత్ర శాస్త్రమును సర్ జాన్‌గారు పునరుద్ధరించారు కనుక భారతీయులు, ప్రపంచం సర్ జాన్‌గారికి ఎంతో ఋణపడివున్నారని నా అభిప్రాయం

ఇందుకై వారు వెతకని, చూడని గ్రంథాలు లేవు ఉపయోగమైన వాటి నన్నిటిని వారు ప్రచురించారు వారు ప్రచురించిన గ్రంథాలు కొన్ని ఇపడు దొరుకుతున్నాయి మద్రాను గణేశ కంపెనీవారు సర్ జాన్‌గారి కొన్ని గ్రంథవ్ర లను చక్కగా ప్రచురించి, లోకమునకు మంచి మేలును చేస్తున్నారు ఇప్పుడు దొరకని వారి గ్రంథ ప్రచురణ చాలా అవసరమైన పని వారి గ్రంథ ముల జాబితానిచ్చుట అప్రస్తుతం కాదనుకుంటాను వారు ఏపని చేసినా అహం కార వివర్జితులై, నిష్కామ సేవ చేశారు వారు కొన్ని గ్రంథముల రచనలలో ఇతర పండితుల సహాయం తీసుకున్నారు కొన్ని స్వయంగా వ్రాశారు ఇతరుల సహాయంతో వ్రాసిన గ్రంథంలో తన పేరు సర్ జాన్ ఉడ్‌రఫ్ వ్రాసికోలేదు దీని బదులు Arthur Avalan అను మారుపేరుతో వ్రాసుకున్నారు పూర్వ కాలంలో బ్రిటన్ దేశంలోని వీరులను Arthur, Avalon అని పిలిచే వారు ఈ పేరునే వీరు వాడుకున్నారు వారుఎట్లాగూ సర్ బిరుద్దాంకితులుగదా!

వారి పుస్తకాల జాపితా —(1) Bharata Sakti—భారత శక్తి—సర్ జాన్ ఉడ్‌ఫ్, (2) Is India Civilized—ఇండియా నాగరికమైనదేశమా? సర్ జాన్ ఉడ్‌రఫ్ (3) Sakti and Sakta శక్తి, శక్త (వ్యాసముల, ఉపన్యాసముల సంపుటి—సర్ జాన్ ఉడ్‌రఫ్, (4) Tantra of great liberation-మహానిర్వాణతంత్రశాస్త్రంఆర్థరుఅవలాన్‌ఉపోద్ఘాతం వ్యాఖ్య, వివరణ, (5) Hymns to Kali—కాళీ స్తోత్రములు—శంకరా చార్యుని స్తోత్రంనుండి ఆంగ్ల తర్జుమా, ఉపోద్ఘాతము, వ్యాఖ్యకర్తలు అర్థరు అవలాన్ (భార్య) ఎలెన్ అవలాన్, (6) Principles of Tantra Part I తంత్రశాస్త్రమూలసూత్రములు—శ్రీయుక్త శివచంద్ర విద్యార్ణవ భట్టాచార్య మహోదయ గ్రంథకర్త—అర్థరు అవలాన్ ఉపోద్ఘాతము, వ్యాఖ్య, వివరణలు వ్రాశాడు (7) Part II రెండవ భాగము, పై గ్రంథకర్తె శ్రీయుక్త బరదకాంతమజుందారు వ్రాసిన ఉపోద్ఘాతము అర్థర్ అవలాన్ సంపాదకత్వం (8) Wave of bliss—ఆనంద లహరి — శంకరస్వామి గ్రంథకర్త, అర్థరు అవలాన్ ఉపోద్ఘాతము, వ్యాఖ్య వివరణములు, శ్లోకాల తర్జుమాలు ఆంగ్ల భాషలో

(9) Greatness of Siva శివమహిమ స్తోత్రం—పుష్ప దంతుడు. జగన్నాథ చక్రవర్తి సంస్కృత వ్యాఖ్య అర్థరు అవలాన్ ఆంగ్లేయ తర్జుమా, వాఖ్య

(10) Origin of VajrayanaDevato's వజ్రయాన దేవతల ఉత్పత్తి అర్థరు అవలాన్

(11) Studies in Mantra Sastra మంత్రశాస్త్ర పరిశీలనము Part I ప్రథమ భాగము—అర్థర్ అవలాన్ Causal Shaktis of the Pranava ప్రణవముయొక్క హేత్వర్థకమైన శక్తులు (2) Kalas of Shaktis శక్తి కళలు (3) The Tattvas తత్వములు.

Part II 2వ భాగము. 1. Shakti శక్తి, 2. Nada వాదం 3. Bindu బిందువు—అర్థర్ అవలాన్

Part III 3వ భాగము Maya మాయ, Kanchuka కంచుకము, Hamsa హంస—అర్థర్ అవలాన్

Part IV నాల్గవ భాగము—Kamakala కామకల Asuddha Tattva అశుద్ధతత్వం, Varnamala వర్ణమాల—అర్థర్ అవలాన్

(12) Quelques concepts—ఫ్రెంచి గ్రంథం—అర్థరుఅవలాన్.

(13) Tantrabhidhana తంత్రాభిధానము—తాంత్రిక నిఘంటు. (బీజ, ముద్ర నిఘంటు) తంత్రనాథ విద్యారత్న సంపాతము అర్థరు అవలాన్ ఉపోద్ఘాతము

(14) Kularnavatantra కులార్ణవ తంత్రము — తంత్ర నాథ విద్యారత్న సంపాదితము అర్థరు అవలాన్ ఉపోద్ఘాతం

(15) Kalivilasa Tantra కాళీ విలాస తంత్రము—పార్వతీ చరణ తర్క తీర్థుల సంపాదకత్వం, అర్థర్ అవలాన్ ఉపోద్ఘాతము

(16) Serpant Powr కుండలినీ శక్తి—షట్చక్ర నిరూపణము, పాదుకా పంచకము కాళీ చరణుని వ్యాఖ్య, అర్థర్ అవలాన్ ఉపోద్ఘాతము 312 పేజీలు ఆంగ్ల తర్జుమా, అర్థము, వివరణ, షట్చక్రముల, ఆసన బంధముల పటములు

(17) Prapanchasartantra ప్రపంచ సార తంత్రము—తంత్రనాథ విద్యా రత్న సంపాదకము అర్థర్ అవలాన్ ఉపోద్ఘాతం

(18) Srichakrasambhara శ్రీ చక్ర సంభారము—బౌద్ధుల తంత్ర శాస్త్రం కాజీ దౌశం దూప్ సంపాదకము వజ్రయానంమీద అర్థర్ అవలాన్ పరిచయము

(19) Kamakala vilasa కామకలావిలాసము కాశ్మీరు శాఖీ యుల తంత్ర ప్రకరణము కర్త పుణ్యానందం అనంతనాథుని వ్యాఖ్య—అర్థర్ అవలాన్ తర్జుమా, వ్యాఖ్య, ఉపోద్ఘాతము, వివరణలు

(20) Advaitabhavopanishad, Kalyupanishad, Taropanishad Kaulopanishad — అద్వైతభావోపనిషత్తు, కల్యుపనిషత్తు, తారోపనిషత్తు, కౌలోపనిషత్తు—అర్థర్ అవలాన్‌ఉపోద్ఘాతము

(21) Introduction to Tantrasastra—తంత్రశాస్త్ర ఉపో ద్ఘాతము తంత్ర సాహిత్యం.

(22) Garland of letters వర్ణమాల మంత్రశాస్త్రం సర్ జాన్ ఉడ్‌రఫ్

(23) Tantraraja తంత్రరాజము, కాదిమాత, మహామహోపాధ్యాయ లక్ష్మణశాస్త్రీ ద్రావిడ సంపాదకత్వము—అర్థర్ అవలాన్

(24) The world of Power, Reality, life, mind, matter, casuality and continuay శక్తి రూపంలో ప్రపంచము—సర్ జాన్ ఉడ్‌రఫ్

(25) Mahamaya—మహామాయ—సర్ జాన్ ఉడ్‌రఫ్

(26) Isopanishad ఈశోపనిషత్తు సంస్కృత మంత్రములు. ఉపోద్ఘాతము, తర్జుమా, వ్యాఖ్య, వివరణలు

(27) Kulachudamaninigama కుల చూడామణి నిగమ. అర్థర్ అవలాన్ వ్యాఖ్య, వివరణలు,ఉపోద్ఘాతము గిరీషచంద్రవేదాంత తీర్థ సంపా దకత్వము

పై జాబితా సర్ జాన్‌గారి విశాల శాస్త్ర విజ్ఞానం తెలుపుతుంది. వారు నీ ఏ వంగీయ శాక్తేయ మహా పండితులతో కలిసి పని చేసింది తెలుపు తుంది ఎందరో మహా పండిత గురువుల సేవచేసి, వారివద్ద తంత్ర విద్యను ఆర్జించారు ముఖ్యంగా తంత్ర విద్య గురువు సహాయం లేకుండా ఎందుకూ కొర గాదని పదే పదే చెప్పారు తంత్ర శాస్త్రంపై అపవాదు సరైన గురువు లేనందువల్ల వస్తుందని అభిప్రాయపడ్డారు

ఒక జీవితము విజయవంతమైనదా లేదా అవి తెలిసికొనుటకు ఆ జీవితఫలితము బట్టి తెలుస్తుంది సర్ జాన్‌గారి జీవితంవల్ల ఎట్టిఫలితాలు కల్గినవి? సర్ జాన్ గారి జీవితంలో రెండుభాగాలున్నవి ఒకటి న్యాయవాద, న్యాయమూర్తి ఉద్యోగము.

రెండోది వారు గ్రహించిన విద్య, వ్రాసినశాస్త్రములు. ఉద్యోగము తాత్కాలికమైనది కనుక దాని విలువ కట్ట వీలుపడదు .వారు వ్రాసిన గ్రంథాలు శాశ్వతమైనవి. గ్రంథములకు ఉద్యోగములకు సంబంధం లేకపోలేదు, వుంది వారి జీవితము గడుచుటకు ఉద్యోగం ఉపయోగించింది. ఉద్యోగమును ఆధారం చేసుకునే ఈ గ్రంథ రచనకు ఉపక్రమించారు భారతదేశంలో ఉండగలిగారు. ఉద్యోగము కారణమైతే, గ్రంథాలు కార్యమైనవి. ఈ గ్రంథములు ప్రజలకు ఎట్లు వుపయోగపడ్డవన్నదే వారి జీవిత ఫలితం

ధర్మం లుప్తమైనప్పుడు అనేక మంది మహా పురుషులు జన్మించి, ధర్మ ప్రచారం చేశారు భరతుడు, వ్యాసుడు, దత్తాత్రేయులు, వశిష్ఠుడు, పరశురాముడు, కృష్ణుడు, శంకరుడు, పుణ్యానందస్వామి, రామప్రసాదు, రామకృష్ణ పరమహంస, అరవిందయోగివంటివారు పుట్టి మతమును నిలబెట్టారు ఈ విధంగా జన్మించిన మహనీయుడే సర్ జాన్ ఉడ్‌రఫ్ మహమ్మదీయుల దండయాత్రలు, ఆంగ్లేయులపాలన, మతమును చికాకు పరిచినవి ఇది యంత్రయుగము ఈ యుగ శక్తి కూడా మతంయొక్క వెన్నెముకను విరుగ కొట్టింది భారతజాతియొక్క వెన్నెముక, ముఖ్య సంస్కృతి ఆధ్యాత్మిక విద్య 19 వ శతాబ్దంలో అసలుకే మోసం దాపురించింది. ఈ అపాయమునుండి రక్షించినవారిలో రామకృష్ణపరమహంస, సర్ జాన్ ఉడ్‌రఫ్‌లు పరమ హంస చెప్పిన "సందేశం" వారి మిషన్ ప్రపంచంలో ఎంతో ప్రచారంచేసి, మతాన్ని నిలబెట్టింది తంత్రసాధన చేసి, దానివల్ల ఫలితం కల్గుతుందని రుజువు చేసినవాడు పరమ హంస ఈ తంత్ర శాస్త్రమును వ్యాఖ్యానించి, ఈనాటి వారికి తెలియునట్లు చక్కగా హేతు యుక్తంగా రచించినవాడు సర్ జాన్‌గారు నేడు వారి గ్రంథములకున్న గిరాకే వారి జీ వి త ఫ లి త ము ను చె ప్తు ం ది పై గ్రంథములు సర్ జాన్‌గారి జీవితం ఎంత విజయం పొందిందో అను ప్రశ్నకు జవాబును ప్రపంచమునకే వదులుతున్నాను పెద్దలు, పత్రికలు వారిని గురించి చెప్పిన అభిప్రాయములు తెలిసికో తగ్గవి.

'యోగి దత్తాత్రేయ' గ్రంథ రచయితైన మహా రాజ చామరాజ ఒడయారు వ్రాసిన మాటలు చదవండి "సర్ జాన్ జగ మెరిగిన బ్రాహ్మణుడు భారతీయుల మనస్సును తంత్ర శాస్త్రంలో ప్రవేశించునట్లు చేసినవాడు అతని సేవ విలువ కట్టలేనిది అతనికి భారతీయులు ఎంతో ఋణపడి వున్నారు

" డాక్టర్ సి పి రామస్వామిఅయ్యరు చెప్పిన మాటలు చదవండి 'మనం మన శాస్త్రముల ప్రాముఖ్యమును మరచి, విదేశీయులుగా మారుతున్న మనకు ఒక పాశ్చాత్యుడు మన నాగరికతను, శాస్త్రమును జ్ఞాపకమునకు తెచ్చాడు "

గురుదత్తుగారు చెప్పింది చదవండి "శాక్తేయ శాస్త్రమును, ప్రపంచమంతా తెలియునట్లు ఆంగ్ల భాషలో వ్రాసి, ఎంతో సేవ చేశాడు ఇంతవరకు అస్పృశ్యులుగా చూడబడుచున్న మనయొక్క శాస్త్ర ఔన్నత్యమును ప్రపంచమునకు చూపించి, తన వారిలో తాను అస్పృశ్యుడైనాడు "

'ప్రభుద్ధ భారతి' సర్ జాన్ పరమపదించినప్పుడు ఇట్లా వ్రాసింది "హిందూమతమునకు దేశీయులలోగాని, విదేశీయులలోగాని, వివేకానందస్వామి తర్వాత సర్ జాన్‌గారు చేసినంత సేవ ఇంకొకరు చేయలేదు 'మాడరన్ రివ్యూ' వీరిని నిజమైన ముని అని వర్ణిస్తూ ఇట్లా వ్రాసింది 'వీరి గ్రంథాలు ప్రతి వారి హస్తములలో వుండతగ్గవి " "అమృత బజారు పత్రిక" ఇట్లా వ్రాసింది "సర్ జాన్ మూలద్రవ్యం లేనిది, ఏదీ చెప్పలేదు అతని పాండిత్యం లోతైంది, నిర్భయమైంది ఆతను మన సంస్కృతిని చక్కగా అర్థం చేసుకున్నాడు " 'సెర్చి లైటు' పత్రిక ఆంగ్లమును చదువుకున్నవారు ఈ గ్రంథమును చదవవలెనని కోరుతాము' అని వ్రాసింది 'ఉత్సవ' పత్రిక ఇట్లా వ్రాసింది 'సర్ జాన్ భారత దేశమును ప్రేమించినట్లు ప్రేమించిన ఇతరులను మేము చూడలేదు భారత సేవయే భగవాన్ సేవ అన్న వారి మాటలలో ఎంతో గొప్పతనం వుంది' 'ప్రభుద్ధ భారతి' పత్రిక, ఈజ్ ఇండియా సివిలైజ్‌డ్ అన్న గ్రంథంమీద ఇట్లా వ్రాసింది "ఈ గ్రంథంనిండా వెలకట్టరాని వజ్రములవంటి భావములు, సత్యములు ఉన్నవి' హిందూ పత్రిక వారు పరమ పదించినప్పుడు ఈ విధంగా వ్రాసింది. 'ఆర్థర్ అవలాన్ తన భార్యతో కలిసి తాంత్రిక సాహిత్యంలోవున్న మహత్తర సత్యములను ప్రచారం చేయుట, ఆ శాస్త్రంమీదవున్న అజ్ఞాన మేఘములను తొలగించుట తన జీవిత కార్యం చేసుకున్నాడు. భారత దేశమును తన ఔన్నత్య అవస్థకు మేల్కొల్పిన వారిలో గౌరవ ప్రతిష్ఠలు గలవారి స్థానంలో సర్ జాన్ ఆక్రమించాండు "

'లండన్ టైమ్సు' సర్ జాన్‌గారు పరమ పదించినప్పుడు వారినిగురించి ఇట్లా వ్రాసింది. "తన న్యాయ నిర్వహణ ఉద్యోగ కాలంలో దొరికిన కాలమును, సంస్కృతం, హిందూ వేదాంతమును చదువుకొనుటకు వినియోగించాడు. శాక్తేయంలో ప్రత్యేక పరిశ్రమ చేసిన బ్రిటిష్‌వారిలో ఇతనికి సముజ్జైనవాడెవరూ లేరు."

సర్ జాన్‌గారు తంత్ర శాస్త్రమునకేకాక, భారత జాతికి కూడా ఎంతో సేవ చేశాడు. తనవారు తనను ఎంతో నిందించి విమర్శించినా లెక్క చేయులేదు భారతీయుల స్థితి ఏమిటో వారికి తెలియ చెప్పాడు. ప్రపంచమునకు భారతదేశం ఆధ్యాత్మిక సందేశం ఇవ్వవలసిన పని యెంతో వుందని చెప్పారు

సర్ జాన్‌గారి జీవితము పూర్తి చేయక మునుపు ఒక పుణ్య పురుషుని సంస్మరించుట అప్రస్తుతంకాదు బ్రహ్మస్థితిజ్ఞులు కాశీనాధుని నాగేశ్వరరావుగారే వారు నేను రాయవేలూరు జైలులో ఆసన ప్రాణాయామములను అభ్యసిస్తున్నాను వీటిని గురించి వున్న పుస్తకం ఏదన్నా ఇవ్వమని విశ్వదాతను అడిగాను సర్ జాన్‌గారు వ్రాసిన 'సర్పెంట్‌పవర్' గ్రంథం ఇచ్చారు. ఈ గ్రంథం నా జీవితములో ముఖ్యమైన మార్పును తెచ్చింది. ఫలితంగా నాగేశ్వరరావుగారి భారతి పత్రికలకు ఆ గ్రంథ విషయాలే కుండలినీ శక్తి, తంత్ర శాస్త్రమును గురించి వ్యాసములను సమర్పించుకున్నాను నేడు ఆ పుస్తక గ్రంథ కర్త సర్ జాన్ జీవితం వ్రాస్తున్నాను ఈ నాటకం వెనుక ఒక అవ్యక్త శక్తి హస్తం నాకు స్ఫురిస్తుంది ఆ గ్రంథమును నాగేశ్వరరావు నాకు ఎందుకిచ్చారు? దీనికీ కారణం వుంది నా పెద్దలు వాశిరెడ్డి వెంకటాద్రినాయుడుగారు వారి గురువు, కాళీ ఉపాసకులు, మలుగు పాపయారాధ్యులు నాయుడుగారికి వీరు శక్తి పాతమును ప్రసాదించారు దేవీ భాగవతమును వ్రాసి ఇచ్చారు. పాపయారాధ్యుల చిన్న కుమార్తె సావిత్రీదేవిని, శివలెంకవారి కిచ్చి వివాహం చేశారు ఈవిధంగా శివలెంకవారు కాశీ నాధునివారు నా గురుకోటిలోనివారు. వా రిచ్చిన శక్తియే మా వంశంలో ఇంతవరకూ వుంది అట్టి వా రి చే తి తో 'స ర్పె ం ట్ ప వ రు' ను ఇచ్చుట, నాకు శక్తినే ప్రసాదించారని భావిస్తున్నాను వ్యక్తి శక్తి నాచేత ఇవి వ్రాయించింది గొప్ప చదువులులేని ఒక సామాన్యుడు ఇట్టి రచనలను వ్రాయుటం తగని పని ఇది విశ్వదాత ప్రసాదమని నమ్ముతున్నాను

బహిర్ముఖుడైన ఒక పాశ్చాత్యుడు, అంతర్ముఖ విద్యయైన భారతీయ జ్ఞానమును అభిమానించుట కూడా ఆ జగదీశ్వరి చిద్విలాసమే. ఆ జగదంబయే వీరిని సాధనభూతం చేసుకుంది ఉపనిషత్తులో ఈ విషయమై ఇట్లా వుంది : "బ్రహ్మమును సాధకుడు వెతుకుతాడని మనం అనుకుంటాము ఇది యదార్థంకాదు బ్రహ్మమే సాధకుని, తనకు తగిన వానిని వెతుకుంటూ వస్తుంది. అది అతని వశం చేసుకుని, తన పనిముట్టుగా ఉపయోగించుకుంటుంది. అతనిద్వారా అది ప్రపంచంలో తన పనిని నిర్వర్తిస్తుంది" ఈ విషయాన్నే రామకృష్ణ పరమహంస ఇట్లా అన్నారు "బ్రహ్మము మనిషిని పట్టుకుంటే, ఇక అతని వదలదు పిశాచం పట్టుకున్నట్లు అతనిని పట్టుకుంటుంది "పై ఉపనిషత్తులోని విషయమునే పరమహంస అనుభవంలో చెప్పారు పరాశక్తియే ఆంగ్ల జాతీయుని ఆవహించి, ఆంగ్లభాషలో ఇంతింతల బ్రహ్మజ్ఞాన సంపన్నమైన గ్రంథ రచనలు చేయించింది ఈ శాస్త్రంలో ఒక్కొక్కచోట భారతీయుడినైన నాకే ఒకో సందేహం కలుగుతుండేది కాని సర్ జాన్ ఉడ్‌రఫ్‌గారు తంత్రశాస్త్రంలోవున్న సమస్తము యదార్థ సత్యములని విశ్వసించారు. మన ఆర్యఋషియే ఇట్లా అవతారమునకు వచ్చారని భావిస్తున్నాను బ్రహ్మజ్ఞానియైన వశిష్ఠ మహాఋషి వారి అర్ధాంగి అరుంధతి ఈనాడు సర్ జాన్ ఉడ్‌రఫ్‌గా, వారి సహధర్మిణి ఎలెన్‌గా జన్మించి, మరుగున పడివున్న మంత్ర శాస్త్ర సత్యమును ప్రచురించి, ఉద్ధరించారని నమ్ముతున్నాను.

ఆశయాలకు సంకెళ్లు

శ్రీ గొల్లపూడి మారుతీరావు

పాత్రలు

బెనర్జీ ప్రకాశం కృష్ణమూర్తి
గౌరీపతి బోయ్

[ఒంరి హెచ్చుగా డబ్బు ఖర్చుచేయకుండా హంగు అన్నీ అమర్చాడు హోటల్ మేనేజరు 'హోటల్' అనొచ్చు దాన్ని. మరీ ఎత్తుగా నున్న రెండు మడతమంచాలు, బల్లమీద పాత టేబిల్ లైటు నాలుగురోజుల క్రిందటి తేదీ చూపే కేలండరు. భగవద్గీత చదువుకునే మహాత్మాగాంధి ఫోటో ఓమూల లైటు బ్రాకెట్టు చిన్న అగ్గిపెట్టెలా ఉంది గది. కోటు స్టాండు కొమ్ములు రెండు విరిగి పోయాయి

ఎదురుగా ద్వారం ఉంది. చవకబారు కర్టెనులు వేశారు ఓ తలుపు తెరిచే ఉంది. తెర లేచేసరికి ప్రేక్షకులకు ఎడమ వైపు మంచంమీద బెడ్డింగు పరచి ద్వారం వేపు తిరిగి 'కృష్ణమూర్తి' కూర్చున్నాడు (మంచం ఏటవాలుగా వేసి వుంది) పేక పరచి 'పేషన్సు' ఆడుకుంటున్నాడు బల్ల ద్వారానికి కుడివేపు ఉంది ముందు నున్న కుర్చీమీద పెద్ద పుస్తకాల దొంతర. ఆ ప్రక్కనే మరో కుర్చీ ......

ప్రక్కగదిలో ఎవరో 'బోయ్'' అని పిల్చారు ''వస్తున్నాను సార్'' అన్న కేక ఎక్కడో దూరంగా వినిపించింది. ఎడమవేపునుంచి కుడివేపుకు ఓ కుర్రాడు పరుగెత్తడం తెరచిఉన్న ద్వారంలోంచి కనిపిస్తుంది కుర్రాడు హుషారుగా ఏదో హిందీ పాట—మరీ పాతది—గొణుగుతున్నాడు ''మాంచి స్వీటు తయారయింది సార్'' అంటున్నాడు ప్రక్క గదిలో—తర్వాత మాటలు వినిపించలేదు—''సరే సార్'' అని తిరిగి వస్తూ యీ గది డోర్ కర్టెన్ తీసి ఉండడం చూసి లోపలకు అడుగుపెట్టి నవరించాడు. 'పేషన్సు' ఆడుకుంటున్న కృష్ణమూర్తిని ఓ క్షణం చూశాడు — పాట ఆపి మంచి స్వీటు తయారయింది సార్ అన్నాడు (జవాబు వస్తుందేమోనని ఆగాడు) కృష్ణమూర్తి యింకా ఆడుతున్నాడు (మౌనం అంగీకార మను కుని) సరే తెస్తానుసార్'' అన్నాడు—(కృష్ణమూర్తి యిప్పుడు కదిలాడు. తల యెత్తకుండానే)

కృష్ణ ఒద్దులే (బోయ్ ఆగి —విచిత్రంగా చూసి టేబుల్ మీద లైటు సరిగా లేకపోవడం గమనించి సరి చేశాడు)

బోయ్. సరేసార్! (వెళ్లబోతే—)

కృష్ణ చూడు (బోయ్ తిరిగాడు)—ఈ గది అద్దె ఎంతన్నావ్?

బోయ్: యిది 'డబుల్ రూమ్' సార్! ఉన్న గదులు ప్రొద్దుటకే నిండి పోయాయి. అసలు ఆదివారాలు కాళీయే ఉండదండి ఓసారిలాగే—

కృష్ణ: అద్దె చెప్పవోయ్!

బోయ్: చెప్పాను గా సార్! డబుల్ రూమ్ 'టూ రుపీస్'—

కృష్ణ: (తల యెత్తి) అంత ఖరీదు వద్దని చెప్పానుగా.

బోయ్ (కుర్చీమీద కూర్చొని) 'వాటీస్ దిస్ సార్!' మంచి అమ్మాయి లతో వచ్చే కాలేజీ కుర్రాళ్ల—కంపెనీ ఏజెంట్లు, మీలాంటి కవులూ—

కృష: నేను కవినని నీకెలా తెలుసింది?

బోయ్. (నవ్వి) 'వాట్ యూజ్ దిస్ సార్!' నేను చూడగానే పోల్చేస్తా నండి ఆ లాల్చీ—పుస్తకాలు—అసలు మీకోసమే నండి 'డబుల్ రూమ్స్' ..

కృష్ణ (ఆట్ట ఆడుతూనే బోయ్ మాటలు విని నవ్వాడు) అంత ఇవ్వలేను నేను.

బోయ్. 'వాటీజ్ ... (కృష్ణమూర్తి తల ఎత్తితే ఆగిపోయాడు) పోనీ ఓ పని చేయండి సార్! ఇంకోకర్ని ఎవర్నయినా యీ గదికి తీసు కొచ్చేదా సార్! అప్పుడు మీకు సగమే అవుతుంది

కృష్ణ: (ఆలోచించి) మంచి ఆలోచనే!—ఎలాంటి మనిషిని తెస్తావ్?

బోయ్: నేనేం చూశానా సార్! మంచి మనిషినే రప్పిస్తాను.

కృష్ణ అలాగే కానీయ్.

బోయ్ మాంచి స్వీటు తయారయింది సార్!

కృష్ణ వద్దులే

బోయ్ సరేసార్! (వెళ్లిపోయాడు—మళ్లీ పాట).

(కృష్ణమూర్తి లేచి ఒళ్ళు విరుచుకుని కుర్చీమీద పుస్తకాలు బల్లమీద ఉంచాడు పరుపు పూర్తిగా విప్పి తలగడను ప్రక్కకు లాగి ముక్కలు వేస్తున్నాడు—ఓ క్షణం తర్వాత)

తెల్లని బట్టలతో ఉన్న వ్యక్తి ద్వారం ముందు వచ్చి ఆగాడు. చేతిలో నీలిరంగు హేండ్‌బ్యాగ్ బాగా మురిసి దయింది—వెనుక నుంచి 'యిదే సార్' అంటున్నాడు 'బోయ్' వ్యక్తి కాసేపు ఆగి లోపలకు నడిచాడు—చామనచాయగా అయిదున్నర అడుగుల విగ్రహం—తెల్లని బట్టలు బాగా మాసి మట్టిరంగులోకి వచ్చాయి. మనిషిలో ఉగ్రత కాస్త తక్కువే—అయితే బీదవాడేం కాదు నిర్లక్ష్యం మాత్రం కనుపిస్తోంది—వెడల్పు అద్దాల కళ్లజోడు మనిషికి ఓ హుందా నిచ్చింది మనిషి చాలా చురుకు—సన్నగా నిటారుగా రివటలాగ ఉండడంవల్ల తెలియకనే చేతులూ, కాళ్లూ కదులుతున్నట్లు అతని చలనానికి అతనితో సంబంధం లేనట్లు అవుపిస్తుంది—కళ్లల్లో నైశిత్యం, ఆశ్చర్యం కలిగించేదిగా ఉంది—ప్రతి చిన్న విషయానికి నవ్వడానికి సిద్ధపడేట్టున్న పెదాలు ఓ జేబులో చెయ్యి ఉంచుకుని అడుగులో అడుగు వేసుకుంటూ గది మధ్యకు వచ్చాడు—నోటిలో థర్మామీటరు ఉంది—బోయ్ హడావుడిగా ఓ పెద్ద బెడ్డింగు, పెట్టె మోసుకు వచ్చాడు. బెడ్డింగు చాలా పాతది. సౌంజ్ఞతోనే కుడివేపు మంచంమీద ఉంచమని సూచించాడు వ్యక్తి. పేరు 'బెనర్జీ.'—

బోయ్ మీకు చాలా లక్కీసార్! అసలు మీకు 'రూమ్' దొరక్కపోయేదే—నేను స్పెషల్‌గా యెరేంజ్ .

(ఆగమని ఆపుచేశాడు బెనర్జీ—టక్కున మిలిటరీ సెల్యూట్ చేసి ఆగిపోయాడు బోయ్. ''ఇదిగో సార్ మీ '' రెండు శాల్తీలను వేరు వేరుగా చూపించాడు బెనర్జీ చేతిలో ఉన్న కోటులో నుంచి రెండు అణాలు తీసి యిచ్చాడు—వెళ్లిపోవచ్చునని సౌంజ్ఞ చేశాడు—బోయ్ ఏదో చెప్పబోయి కృష్ణమూర్తివైపుచూడబోతూనే వెళ్లి పోయాడు. కోటు మంచంమీద పడేసి, కుర్చీ కాళ్ల దగ్గరకు లాక్కొని బల్లమీద కూర్చొన్నాడు వ్యక్తి. కృష్ణమూర్తి యిదంతా దిగ్భ్రమతో చూస్తూవున్నాడు థర్మామీటరు తియ్యకుండానే కళ్లతో నవ్వుతూ పలకరించాడు 'బెనర్జీ'. ఇంకా కృష్ణమూర్తి స్తబ్దుగా ఉండిపోవడం

చూసి 'ఆట కానివ్వండి' అని సుచించాడు. కృష్ణమూర్తి కాసేపు తటపటాయించి ఆట ప్రారంభించాడు మళ్ళీ—నూతన వ్యక్తి మంచి తనంమీద సుళువుగా, నమ్మకం కలగనట్టుంది బహుశా—

బల్లమీంచి దిగి బెడ్డింగు మంచంమీద విప్పా డతను. ఒక హేంగరు తీసి కోటు దానికి తగిలించాడు. 'స్టాండు' కోసం గదంతా వెతికి ఎడమవేపు ఎదురుగా గోడమీద ఉన్నదాన్ని చూశాడు అక్కడకు వెళ్ళి తగిలించాడు. 'టేబుల్' మీద ఉన్న గడియారం తీసి తన చేతివాచీతో సరిచేశాడు. కేలండర్ తేదీ మార్చాడు.

ఈసారి ఎవరో యువకుడు బయట నుంచి వచ్చాడు. స్టూడెంట్‌లా ఉన్నాడు)

కుర్రాడు . 'యక్స్క్యూజ్ మీ !' యిప్పుడు టైమెంతయిందో చెప్తారా ?

(బెనర్జీ మాటాడకుండా టేబుల్‌మీద గడియారం ఎత్తి చూపించాడు "థాంక్స్" అంటూ అతను వెళ్ళిపోయాడు—కృష్ణమూర్తి ఖళ్ళీ ఆట ప్రారంభించాడు వెనక్కి వచ్చి బెనర్జీ ఆట ఓచూస్తున్నాడు. కాలు మంచంమీద మోపాడు. ఇప్పుడు ధర్మామీటరు తీసి—)

బెనర్జీ · రైట్ ! మూడు క్రింద పెట్టండి, ఆ నాలుగుని ... (కృష మూర్తి ఆశ్చర్యంగా చూశాడు కాని బెనర్జీ ధర్మామీటరు చూస్తూ కుడివేపు నడిచాడు)

బెనర్జీ "పేషన్సు" మీకు అలవాటు లేనట్టుంది అందువల్లే ఆట పట్టుతప్పుతోంది అసలు ఆడేవాడి క్కాదు, చూసేవాడికి 'పేషన్సు' తప్పాలని నా ఉద్దేశం పేకాట ఆడటం—స్త్రీతో మాట్లాడ్డం కొందరికే మినహాయిస్తే బావుణ్ణు దేవుడు—ఏమంటారు ?

కృష్ణ · మీరు . ?

బెనర్జీ ఓ ! సారీ ! పరిచయాలతో కాని ప్రారంభం కాదు, ఇరవయ్యో శతాబ్దపు బంధుత్వం పేరు బెనర్జీ—మా నాన్న స్వాతంత్ర్యోద్యమంలో తిరిగే రోజుల్లో పుట్టా న్నేను ఆయన జైలు లాటీ దెబ్బలకు చిహ్నంగా నన్ను చూచుకునేవాడు (ప్రేమతో కాదనుకోండి) ఉద్యోగం అన్న పదానికి అర్థం నా డిక్షనరీలో లేదు సుఖంగా బ్రతకటం మన ఉద్యోగం మనకు గతం లేదు గతాన్ని స్వగతంగా చెప్పుకుని వర్తమానంలో బ్రతకడం మన పంథా. ఇక మీరు కానివ్వండి.

కృష్ణ నాపేరు కృష్ణమూర్తి. విజయవాడ నుంచి ....

బెనర్జీ . 'జస్ట్ ఎ మినిట్' నిన్న రాత్రి నుంచి టెంపరేచరు తగులుతున్నట్టుంది ఈ డాక్టర్లంటే నాకు భయమండీ చెయ్యి చూడమంటే వెయ్యి ప్రశ్నలతో చంపుతారు మన సుఖాన్నంతా వాళ్ల చేతుల్లో పెట్టేశామనుకుని నానా హంగామా చేసి ప్రాణం తీస్తారు. నిన్న రాత్రి నూట నాలుగు డిగ్రీలు ఇప్పుడు (ధర్మా మీటరు చూసి) డావ్ ! నూట రెండు.

కృష్ణ : నూటరెండు డిగ్రీల జ్వరమే !

బెనర్జీ : "క్వయిట్ కాజువల్" సార్ ! నాకు సంతోషంగా ఉన్నప్పుడల్లా జ్వరం వస్తుంది. ప్రతీ వాడికి రెండు నెలల కో సారైనా జ్వరం రావా లంటాను. జ్వరాన్ని అనుభవించడంలో కాదు; పోగొట్టుకోడానికి చేసే ప్రయత్నంలో సుఖం ఉంది మీ పేరు, విషయం చెప్పండి—

కృష్ణ : కృష్ణమూర్తి నా పేరు

బెనర్జీ మిగతా విషయం నన్ను వూహించనివ్వండి. మీ బెడ్డింగు, పుస్తకాలు, రెండు శతాబ్దాల క్రిందటి పేక, అమాయకత్వం—అవును మీరు రచయితలో, నటకులో, కళాకారులో, అదీ యిదీ కాకపోతే వెలిసిపోయిన ప్రేమికులో ...

కృష్ణ : (నవ్వి) బాగా కనిపెట్టారే !

బెనర్జీ · ఏదీ, ప్రేమికులేనా ?

కృష్ణ లేదండి నేను; రచయితని.

బెనర్జీ : 'వండర్‌ఫుల్'! ముఖం చూసి మాటల్లో చెప్పగలగడం నా అదృష్టం. వెనుకటికి నా ఫ్రెండ్ ఉండేవాడు. రచయిత సౌందర్యంతో, స్త్రీ కళ్ళతో, రాజకీయ నాయకుడి నోటితో తమ గొప్పతనాన్ని చెప్పుకుంటూ రనేవాడు (నేను రాజకీయ నాయకుడు కానండోయ్!) వాళ్ళ వాలా కావాలంటే అయిదేళ్ళ నా బూట్లు పాలిష్ చెయ్యాలి—అరే! కాఫీ మాటే మర్చిపోయాను. (బోయ్ అని పిల్చాడు)—మీ రేం త్రాగుతారు .... .

కృష్ణ : నా కేమీ వద్దండి చిన్న పని ......

బెనర్జీ కాఫీలకు, పనులకి లంకేమిటండీ—ప్రేమకీ పెళ్ళికీ లాగ—కాఫీకి కడుపులో వేరే కంపార్టుమెంటు ఉందిలెండి మీ చెయ్యి యిలా యివ్వండి ?

కృష్ణ : ఎందుకూ—?

బెనర్జీ : మీకూ ఒక్కొక్కప్పుడు మీకు తెలియకుండానే చిన్న జ్వరం ఉంటూ ఉంటుంది అదీకాక నాతో యింతసేపు మాట్లాడాక మీకు కాస్తంత జ్వరం వచ్చిఉండాలే ? నాడిచూని 'వండర్‌ఫుల్!' మీకు వన్ నాట్ వన్ ఉంటుంది నిజం.' నా మాట అబద్ధ మనిపిస్తే థర్మామీటరు యిచ్చేదా ?

కృష్ణ : వద్దులెండి

బోయ్ : (వచ్చాడు) ఏం సార్!

బెనర్జీ : నీపే రేంటోయ్ ?

బోయ్ : భద్రం.

బెనర్జీ : చ—నీ పేరు 'కిక్కూ'. 'బ్రీవ్' గా ఉండాలి చూడు ఆయనకు జ్వరం వన్ నాట్ వన్ ఉంది అందుకని మంచి బోర్నవిటా తీసుకురా—నాకు నూటరెండు డిగ్రీల జ్వరం ఉంది నా కేం తెస్తావ్ ?

బోయ్ డాక్టర్ని తెస్తాను సార్!

బెనర్జీ : (నవ్వి) వీడికీ కాస్త 'ఒరిజినాలిటీ' ఉందండి. (బోయ్‌తో) డాక్టరు చేత నీకు మందు వేయించుకుని, నాకు 'ఐస్‌క్రీం' పట్టుకురా ఏం?

బోయ్ : సరే సార్! (వెళ్ళాడు)

(చిన్న విరామం).

బెనర్జీ : పదేళ్ల క్రితం రూర్కేలాలో పని చేస్తుండగా "హార్టు ఎటాక్" వచ్చిందండీ.

కృష్ణ మీకే—?

బెనర్జీ : నాకు కాదు, నా కుక్కకి. మూడు రోజులు తిరక్కుండా చచ్చిపోయింది తర్వాత మరి మూడు రోజులకు నాకు వచ్చింది—ఆశ్చర్యంగా లేదూ ?

కృష్ణ . నిజమేనా—?

బెనర్జీ : ఆ మాట మన డిక్షనరీలో లేదు నే నెప్పుడూ అబద్ధం చెప్పను—ఒక్క ఆడవాళ్లతో తప్ప. ఏం చెప్తున్నాను 'హార్టు ఎటాక్' తర్వాత 'బ్లడ్‌ప్రెషర్'

కృష్ణ చాల పెద్ద రోగమే!

బెనర్జీ : 'వెరీ చార్మింగ్ డిసీజ్! అంత అందమైన రోగం మరోటి ఉండదని నా ఉద్దేశ్యం. నేను 'బ్లడ్ ప్రషర్'ని ప్రేమించానో లేక అదే నన్ను ప్రేమించిందో తెలియదు ఇంతవరకూ నన్నది వదల్లేదు అప్పుడప్పుడు మంచి స్నేహితుల్తో మాట్లాడినా, మంచి డిన్నరుకు వెళ్లినా అది జ్ఞాపకం చేస్తూ ఉంటుంది (బోయ్ బోర్నవిటా, ఐస్‌క్రీం తెచ్చాడు)

బోయ్ మంచి స్వీటు తయారయింది సార్!

కృష్ణ ఇందాకనే అన్నావు తయారయిందని

బెనర్జీ స్వీట్సు—అబ్బాయిలూ, ఆడవాళ్లూ తినడానికోయ్ వీధిలో నిలబడి పోలీసు లందరికి పంచిపెట్టమను మీ మేనేజర్ని రేపటికి మీకు కావలిసినంత మంచి గిరాకీ—(బోయ్ వెళ్తాడు)

తింటున్నారు యిద్దరూ—చిన్న విరామం)—

కృష్ణ . ఇక్కడకు వచ్చానే గాని ఏం తోచడంలేదు. మీరు వచ్చారు సమస్య తీరిపోయింది

బెనర్జీ పెద్ద 'ఐరనీ' విసురుతున్నారు నా మీద .. .

కృష్ణ అబ్బెబ్బే! అలా అనుకోకండి. నిజంగానే అనుకొంటున్నాను. ఇక్కడ నా కో పబ్లిషరుతో పని ఉంది. ఓ పుస్తకానికి 'టరవ్సు' మాట్లాడాలి ఈ రోజంతా ఒంటరిగా గడపాలంటే ఒక్కడికీ కష్టమే.

బెనర్జీ . ఇహ మీ కా బాధ లేదు. 'సబ్జక్టు' యిచ్చి వదిలేస్తే సవా లక్ష సందర్భాలు 'కోట్' చేస్తూ మాట్లాడుతాను చూడండి మీరు భోజనమూ, బోర్నవిటా తింటూ బ్రతుకుతారు. నేను మాటల్ని మంచితనాన్ని, యింత స్నేహాన్ని తిని బ్రతుకుతాను ఈ నలభై ఏళ్ల జీవితంలో బంధువు లెవరూ కలవలేదు అంతా స్నేహితులే తప్ప.

కృష్ణ ఏం పనిమీద వచ్చా రిక్కడికి ?

బెనర్జీ పనా ? 'డామ్' "ఇక్కడికి వచ్చేక ఏం పని చెయ్యా లనుకుంటున్నారు మీరు" అని అడగాలి ఓ ప్రేమ వ్యవహారానికి స్వస్తి చెప్పాలని బయలుదేరాను తీరా మరొక సమస్య కాలికి చుట్టుకొంది

కృష్ణ అదేమిటి ?

బెనర్జీ అవును అసలు నేను ప్రేమించగలనా అన్నది సమస్య—ప్రేమ నన్నెప్పుడూ ప్రేమించలేదు అసలు ప్రేమకు మంచి డెఫినిషన్ చెప్పమంటారా ?—20 వ శతాబ్దపు మానవుడు అర్థం తెలియని ఓ వింత రోగానికి అదే పనిగా వాడుతున్న 'హా' 'చీప్' టానిక్. అదీ ప్రేమకు అర్థం

కృష్ణ (నవ్వి) ఇంత తెలిసీ ప్రేమలో పడ్డారా ? అదీ మీ కిష్టంలేని ప్రేమలో—

బెనర్జీ అక్కడే ఉంది తమాషా అసలు నన్నడిగితే తెలియక చేసే తప్పు ప్రేమించడం తెలిసి చేసే తప్పు పెళ్లి చేసుకోడం అంటాను. ఇక్కడ ఇప్పుడే మీ కళ్లముందే రెండు కథల్ని నడిపి చూపిస్తాను. నన్ను మీ కథలో పాత్రగా తీసుకోండి

కృష్ణ ఇప్పటికే నా కలాన్ని మించి పెరిగిపోయారు మీరు—

బెనర్జీ (అంతలో షాక్ తిని) కొంపతీసి నేను పిచ్చివాణ్ణనుకుంటున్నా రేమిటి మీారు—?

కృష్ణ అబ్బెబ్బే! అలా కాదు "మీ సెన్స్ ఆఫ్ హ్యూమర్", జీవితం పట్ల నిర్లక్ష్యం .

బెనర్జీ . అలాంటివాటి గురించి ఆలోచించనండీ నేను —

కృష్ణ అదే నిర్లక్ష్య మంటే—అది అందరికీ సాధ్యం కాదు ఉదాహరణకు నన్ను తీసుకోండి అంతదూరంనుంచి ఎందుకు వచ్చా నంటారు ?

బెనర్జీ పిల్లలా మీకు ?

కృష్ణ నలుగురు. ఈ వ్యాసంగం కాక కలెక్టరాఫీసులో గుమాస్తా గిరీ

బెనర్జీ . శేష్! ప్రపంచానికి మీరు చాలా బాకీ పడిపోయారు పిల్లల్ని కని, ప్రభుత్వానికి లెక్కలు వ్రాసి మెల్లగా ఋణం తీర్చుకుంటున్నారు

కృష్ణ మరేం చెయ్యమంటారు ?

బెనర్జీ ఆ ప్రశ్నను చంపేసుకో మంటాను ఏం చెయ్యాలని ఆలోచించుకో నక్కరలేదు ఏదో ఒకటి చేస్తూనే ఉన్నాం అయితే చేసేది మంచిదా ? చెడ్డదా ? అన్న ప్రశ్న వేసుకుంటే చాలు ఆకలి వేస్తే మీరు బోర్నవిటా త్రాగారు మూడు రోజులు, స్నేహితుడి కోసం నా మనస్సు ఆకలితో అరిచింది ఈ వేళ ఆ ఆకలి తీరింది.

కృష్ణ మూడు రోజుల క్రిందట ఎక్కడ ఉన్నారు ?

బెనర్జీ యు పి లో సాగర్ యూనివర్శిటీ హాస్టల్లో ఓ పాత స్నేహితుడి కొడుకు ఆత్మహత్య చేసుకో దలుచుకొన్నానని ఉత్తరం వ్రాశాడు.

నాకేం భయం వెయ్యలేదు "చేసుకున్నాక ఉత్తరం వ్రాయి" అని కార్డు వ్రాసి పడేశాను కాని వాళ్ల నాన్న (మా మిత్రుడు) ఏడుస్తూ పది పేజీల ఉత్తరం వ్రాసుకున్నాడు ఇక వెళ్లక తప్పిందికాదు

కృష్ణ కుర్రాడు బ్రతికాడా ?

బెనర్జీ బ్రతక్క ఏమవుతాడండీ. జీవితమంటే బొంగరం విసిరి జాటీ లాగిన ట్లనుకుంటారు. ఈ "ముష్టి ఫిఫ్టీ యంగ్ బేబీస్" ఎవర్తైనా ప్రేమించాడట అది మరెవర్నో పెళ్లి చేసుకుంటే వీడు ఫస్ట్ క్లాసయిన ఉరిత్రాడు కొనితెచ్చుకున్నాడు. "అసలు నువ్వు ప్రేమించావా?" అన్నాను. "ప్రేమించానని" గోడనిండా గీసిన పిచ్చి బొమ్మలు, చిరిగిపోయిన చొక్కాలు, రెండు గేయాలు, నిదర్శనంగా చూపాడు ఏడు నెలలు ఆ అమ్మాయి చెప్పులు మోస్తూ తిరిగి ఎప్పుడన్నా నీవేవు చూస్తే ఆ కళ్లను పాల్ష్ చేయడం నేర్చుకో ప్రేమలో వెయ్యో వంతన్నా అర్థమవుతుందేమో—అన్నా—ఉరిత్రాడు బెడ్డింగుకి కట్టించి వాళ్ల నాన్న దగ్గరకు పంపించి వచ్చాను.

కృష్ణ కుర్రాడు ప్రేమించలేదంటారా ?

బెనర్జీ ప్రేమ 'ట్రాష్' ప్రేమ అన్న వాళ్లను దేశం నుంచి బహిష్కరించాలండి—ప్రభుత్వమో. ప్రజలో స్త్రీని గాక ప్రేమించే 'సర్టిఫికెట్' కోసం ప్రేమిస్తారు ఈ కుర్రకారంతా సినిమాలు, జువెనైల్ డెలింక్వెన్సీలో పిల్లి మొగ్గలు వేసే భావకవులు వీళ్లకి 'ఐడియల్స్ పూర్ డర్టీఫోక్

కృష్ణ సరే, సాగర్‌నుంచి తిన్నగా యిక్కడకు వచ్చేశారేం ?

బెనర్జీ మన పాత స్నేహితురాలి దగ్గర్నుంచి ఉత్తరం వచ్చింది ఎప్పుడో నేను చిన్నతనంలో ఆమెకు వ్రాసిన ప్రేమలేఖ భర్తకంట పడిందట దాన్ని వాడు "పబ్లిక్ స్కాండల్" లాగ పరం కట్టించుకు తిరిగి నానా గొడవా చేస్తున్నాడట

కృష్ణ అరెరే! అయితే మీ చిన్ననాటి ప్రేమ వ్యవహారానికి యిది ప్రస్తావనన్నమాట

బెనర్జీ ప్రేమా ? నా విషయంలో కూడా ప్రేమ పదాన్ని వాడుతున్నారు మీరు చూడండి మనస్సు ఓ చిన్న సైజు యంత్రం లాంటిది. ఏ వయస్సు పనులను ఆ వయస్సుకి మనం చెప్పకుండానే చేసుకుపోతుంది చిన్నప్పుడు బటానీల కోసం యేడ్చే మనస్సు కాస్తంత యెదిగి బాదం హల్వాకోసం, తర్వాత పసందైన అమ్మాయి కళ్ల క్రాసువర్డు ఫజిల్స్ కోసం, తర్వాత పిల్లల కోసం, ఆ తర్వాత యిల్లు, అటుపైని షష్టిపూర్తి ముగిశాక చావుకోసం తపన పడుతూంటుంది "ది వేరియస్ స్టేజస్ ఆఫ్ ఎవెల్యూషన్ ఆఫ్ డిజైర్"—

కృష్ణ పెద్ద సిద్ధాంతం సిద్ధం చేశారే జీవితంమీద—

బెనర్జీ నేను చెయ్యడం కాదండీ, జీవితమే చేయించింది 16, 20 మధ్య ఓ స్వర్ణయుగం గడిచిపోయింది నా జీవితంలో. అప్పట్లో యీ ప్రేమ, వెన్నెల, కోరిక, ఆశ యివన్నీ మనస్సుకి సంకెళ్లు తగిలించి ఆ అమ్మాయి ముందు పడేశాంు

కృష్ణ ఏ అమ్మాయి ?

బెనర్జీ (నవ్వి) ఎడ్రస్ లేదు ఏ అమ్మాయి అని ఆలోచించవలసిన పనిలేదు అందరికీ ప్రేమించే గుణం సాధారణం మొదట పురుషుణ్ణి ప్రేమించిన తరువాత ప్రేమను ప్రేమిస్తారు ఆడవారు అందువల్లనే వాళ్లెప్పుడూ ప్రేమిస్తూనే ఉంటారు కాని మన ప్రేమకు రేషన్—

కృష్ణ ఎందు కంటారు ?

బెనర్జీ మనం ప్రేమను ప్రేమించడంతో ప్రారంభించి స్త్రీని ప్రేమించడంతో అన్నీ మర్చిపోతాం

కృష్ణ తర్వా తేం జరిగిందీ చెప్పండి ?

బెనర్జీ ప్రేమ కథలకు ఒకటే ముగింపు సార్ ప్రేమ సఫలమైందా స్త్రీకి మతి పోతుంది. విఫలమైందా మగాడికి పోతుంది. కాని నాకు మతి పోలేదు.

కృష్ణ అంటే ?

బెనర్జీ మీ కర్థం కాలేదు, నా సిమిలీస్ వివరిస్తాను చూడండి. ఆ అమ్మాయి కులం వేరు ఇది వినగానే మా మామయ్య గుండె పగిలిపోయింది. అప్పట్లో అతనే నా గార్డియన్—

కృష్ణ · అయితే ఏం చేశారు ?

బెనర్జీ · ఏం చేస్తాను ? పెళ్లి వీల్లేదని పూరి మునసబు గొంతు చించుకుంటే మెడ పట్టుకుని— "గట్టిగా అరుస్తే రాత్రి యింటికి నిప్పంటిస్తాను" అన్నాను. నిజంగా బెదిరిపోయాడు 'హార్డ్ క్రూక్'—కాని మామయ్య పూర్తిగా మెతక. భయపడి గోడకేసి తల బాదుకుంటే. ఏమీ చేయలేక యేడ్చాను—(నవ్వి) జీవితంలో మొదటిసారి చివరిసారీను—

కృష్ణ . తర్వాత ?

బెనర్జీ : ఇక్కడకు వస్తే ఈవిడ ఏడ్పు—మీరైతే ఏం చేస్తారు ఆ సంఘర్షణలో—

కృష్ణ : ఊహించలేను.

బెనర్జీ హామ్లెట్‌కీ, గిరీశానికీ వచ్చిన సమస్యే మళ్లీ యీ బెనర్జీకి వచ్చింది ఆ రోజున పోనీ, మీ కథానాయకుడు యిట్లాంటి యిరకాటంలో పడితే ఏం చేస్తారు ?—ఏమీ చెయ్యలేరు. నాకు తెలుసు. పంఘం మీద పది పేజీలు ఏడిపించి నో అర్ధరాత్రి ఉరితీస్తారు. "జువెనైల్ డెలింక్వెన్సీ!" డామ్! ఇంకా ఆంధ్రదేశానికి తగినంత ధైర్యాన్ని పంచిపెట్టగల రచయితలు పుట్టలేదు. (మీ సంగతి నాకు తెలిదనుకోండి) నాకే అధికారం యిస్తే ఈ కవి నామధేయుల పుస్తకాలన్నింటినీ మిఠాయి కొట్టుకు అమ్మేసి, తలా ఒక జత గాజులు తొడిగించి బజారు అమ్మాయిచేత భరతం పట్టించేవాణ్ణి. ఇది ఇప్పటి

మాట. అప్పట్లో నేను యింత ధైర్యవంతుణ్ని కాను నే నేం చేశానో తెలుసా ?

కృష్ణ : ....

బెనర్జీ · అప్పట్లో నా పరిస్థితి ఆలోచించండి సంఘానికి ఎదురు తిరిగేంత పెరగలేదు నేన ఓ ప్రక్క యీసంప్రదాయాలు, మరో ప్రక్క ప్రేమ —వినుగేసింది మనస్సుకు వయస్సు రాకపోతే మతి చెడుతుంది అప్పు డలాగే అయింది. అన్నీ మర్చిపోయి ఒక్కసారి ఆచిక్కు నుంచి దాటిపోవా లనిపించింది—అంతే, ఎక్కడికో పారిపోయాను.

కృష్ణ · పారిపోయారా ?

బెనర్జీ : అవును. అప్పటికి నా కంతే తోచింది.

కృష్ణ : ....

బెనర్జీ : తప్పు చేశాను కదూ ?

కృష్ణ : అవును బెనర్జీగారూ—ఆ అమ్మాయి ఏమై ఉంటుందో ఆలోచించ లేదా మరి ?

బెనర్జీ . అప్పు డాలోచించలేదు ఇప్పు డాలోచిస్తే నవ్వు వస్తుంది అప్పుడు నే నెందు కంత పిరికివాడి నయ్యానా అని

కృష్ణ అందుకు ఒకటే జవాబు "సంఘం"

బెనర్జీ : నిజమే ఇప్పటికాలపు మనుష్యుల బలహీనతకు వో మంచి పేరు పెట్టుకున్నారు అదీ సంఘ మంటే అప్పుడు నేను పిరికివాడ్ని కాని అనుభవం చాలా పాఠాలు నేర్పింది ఇవాళ నా సుఖం కోసం నేను హత్య చెయ్యడానికైనా వెనుదీయను

కృష ఆమె గురించి మీ రెప్పుడు ఆలోచించలేదా మరి ?

బెనర్జీ . ఆలోచించా లనిపించలేదు ఆలోచించినానంటే మనస్సుకు మళ్ళా పని ఈ 20 ఏళ్లలో మనస్సు ఎక్కడో పారేసుకున్నాను నాకు మనస్సు లేదు సుఖంగా బ్రతకాలని కోరిక తప్పించి

కృష్ణ . (అతని వ్యక్తిత్వం అంత త్వరగా అర్థం కావటం లేదు (క్షణం నివ్వెర పోతాడు) విచిత్రమైన మనిషి మీరు అంతగా అన్నిటినీ మరచి పోయి బ్రతకవచ్చు నన్నది నేను వూహించలేని విషయం

బెనర్జీ అస లింతకీ యివ్వాళ యిక్కడి కెందు కొచ్చానో చెప్పలేదు మీకు.

కృష్ణ . ఎందు కంటారు ?

బెనర్జీ : వారం క్రింద ఆమెకో ఉత్తరం వ్రాసింది

కృష్ణ : ఎవరు ?

బెనర్జీ : పేరు చెప్పేదా ? (హేంగరుకు వున్న కోటులోంచి ఉత్తరం తీసి) వసంత ! ఇదీ పేరు (ఉత్తరం కృష్ణమూర్తికి యిచ్చి) చదవండి (సంశయిస్తూంటే) వూ ! చదవండి

కృష్ణ : (తీసుకుని చదువుతాడు) "18 యేండ్లు పైగా గడిచిపోయిందేమో మనం కలిసి—ఈ ప్రాంతాలకు వచ్చారని ఈ మధ్యే తెలిసింది మీ కసలు ఉత్తరం వ్రాసేదాన్నే కాదు, అబ్బాయి కోసం కాకపోతే— హైస్కూల్లో చదువు పూర్తయి కాలేజీలో చేరాలంటే డబ్బు లేదు. మీకు తెలీదేమో ? పెళ్లయిన ఏడాదిలో మీరు అప్పట్లో వ్రాసిన పాత ఉత్తరం ఒకటి ఆయన కంట పడింది. ఆ తర్వాత నన్నొదిలి పోయా రాయన—నవ్వు వస్తుంది, ఆ కథలన్నీ ఆలోచిస్తే. సరే పోనీయండి—అబ్బాయి కాలేజీలో చేరాలంటున్నాడు. డబ్బులేదు— "వసంత"

మరో విషయం — "ఆయన కూడా ఈ ప్రాంతాల్లోనే ఉన్నా రట వివరాలు తెలీవు. ఏదో రంగుల కంపెనీలో పనిచేసేవారు. ఇప్పు డెక్కడో తెలీదు"

(ఉత్తరం కవర్లో ఉంచుతూ) విచిత్రంగా ఉందే ఉత్తరం !

బెనర్జీ మీరు పొరపాటు పడుతున్నారు. ఉత్తరం విచిత్రంగా లేదు. ఆ స్త్రీ విచిత్రంగా ఉం దనండి.

కృష్ణ . ఎలాగైనా ఆడవాళ్లు మగవాళ్ల కంటే కాస్త ధైర్యవంతులే మరి—

బెనర్జీ : అందులోను యిది స్పుత్నిక్ యుగం. యురేనియం నుంచి ఆటం బాంబు తయారు చేశారు కాని, స్త్రీ నుంచి తయారుచేస్తే యింకా చురుగ్గా వుండేదని నా ఉద్దేశ్యం

కృష్ణ అయితే ఇప్పు డేం చేస్తారు ?

బెనర్జీ : ఏం చేశారని అడగండి. వసంత భర్తని వెతకి పట్టుకున్నాను 'షాలీ మార్' కంపెనీలో అకౌంటెంట్. మళ్లీ పెళ్లి చేసుకునే ప్రయత్నంలో ఉన్నాడని తెలిసింది (కృష్ణమూర్తి ఆశ్చర్యంగా చూస్తే నవ్వేడు బెనర్జీ)- "పెళ్లి" అనేది ఓ పెద్ద నవలట దాంట్లో మొదటి అధ్యాయంలోనే మొగాడు చచ్చిపోతాడు— అని ఇంగ్లీషులో ఓ వాక్యం ఉంది.

కృష్ణ ఇప్పు డాయన ......

బెనర్జీ పేరు 'గౌరీపతి' ఇక్కడకు రమ్మన్నాను.

కృష్ణ : ఇక్కడికా ?

బెనర్జీ : అవును ఇప్పుడు పదీ పది కదూ ? మరో అయిదు నిమిషాల్లో ఇక్కడ . (బయట అడుగుల చప్పుడు) అదుగో ఎవరో వచ్చారు చూడండి (మొదటిసారి వచ్చిన యువకుడు మళ్లా వచ్చాడు)

యువ . 'యక్స్యూస్ మీ !' ఇప్పుడు టైమెం తయిందో చెప్తారా ?

కృష్ణ : పదీ పది నిముషాలు—

యువ : "థ్యాంక్స్" (వెళ్లిపోతాడు)

కృష్ణ · ఎవరో స్టూడెంట్‌లా ఉన్నాడు (విరామం) గౌరీపతి యిక్కడకు వస్తే ఏం చేస్తారు ?

బెనర్జీ · (నవ్వి) మొదట నాకు బ్లడ్ ప్రెషర్ ఉన్న విషయం గుర్తు చేస్తాను. వదిలేసిన పెళ్లాన్ని అప్పుడే మర్చిపోయుంటాడు బహుశా. అయినా గుర్తుచేస్తే రక్తం పరవళ్లు త్రొక్కవచ్చు నన్ను చంప డానికి కత్తులూ, పిస్తోళ్లూ అక్కరలే దంటాను

కృష్ణ · అదేమిటి ?

బెనర్జీ . సెంటిమెంటల్ క్యూర్ ! ఎంత హంతకుడైనా హత్య చెయ్యడాన్ని ఆలోచించ గలడే కాని పర్యవసానం ఆలోచిస్తే అంతపని చెయ్య లేడని నా మతం—నడపబోయే కథ చెప్తే 'టెంపో' ఉండదు. వెయిట్ అండ్ సీ

కృష్ణ · మరి కుర్రాడి విషయం ఏం చేశారు ?

బెనర్జీ : ఎవరు ? ఓహో ! వసంత కొడుకు సంగతా ? అస లా ఉత్తరం ఉద్దేశమంతా ఆ కుర్రాడి కాలేజి చదువుకు నేను సహాయం చెయ్యా లని—నేనేం అనాథ శరణాలయం పెట్టుకు కూర్చోలేదని

కృష్ణ · రాశారా కొంపదీసి ?

బెనర్జీ · రాసేవాణ్నే అయినా కుర్రవాడ్ని చూస్తే బావుణ్ననిపించింది నిజా నికి ఆవిణ్ణి చూడాలని ఉంది. కాని భయం. ఆడవాళ్ల కళ్లమీద నాకు నమ్మకం తక్కువ

కృష్ణ : మరి ?

బెనర్జీ : ఆ కుర్రాణ్నే యిక్కడకు రమ్మన్నాను.

కృష్ణ : ఇక్కడికా ?

బెనర్జీ · వూఁ !

కృష్ణ : అయితే తండ్రీ కొడుకూ యిక్కడ కలుస్తా రన్నమాట ?

బెర్జీ : ఎవరి సంగతి మీ రనేది ?

కృష్ణ గౌరీపతీ . . కొడుకూ—

బెనర్జీ (ఆలోచించి) వండర్‌ఫుల్ ! నా కా సంగతి తోచలేదు మొదట. కృష్ణమూర్తిగారూ ! కథ క్లయిమాక్సును మరో స్థాయి పెంచుదాం.

కృష్ణ . అయితే వాళ్లిద్దరూ ఒకరి నొకరు గుర్తు పట్టగలరా అన్నది ప్రశ్న.

బెనర్జీ · అదీ ఒక్క నిముషంలోనే తేలిపోతుందిగా. మరో అరగంటలో అతనూ రానే వస్తాడు

కృష్ణ · మరి నే నుండడం మీ కభ్యంతరమైతే ......

బెనర్జీ · డామ్! యిదేం నాటకమా ? ఒక పాత్ర వచ్చేసరికి మరొకటి విశ్రమించడానికి. అయినా జీవితంలోంచి పాత్రలు వెతుక్కోండి మీరు. ఎంతకాలం మీ మెదడే పిల్లల్ని పెడుతూ కూర్చొంటోంది నాకేం రహస్యాలు లేవు పెళ్ళాన్ని వదలి పెళ్ళికి సిద్ధమవుతున్న యీ ప్రబుద్ధుణ్ణి మాటల్తో హత్యచేసే ఘట్టం మాత్రం జాగ్రత్తగా గమనించండి. నా అంత గొప్ప మాట్లాడేవాడు లేడని నా కో పెద్ద గర్వం.

కృష్ణ : మాటలవల్ల కాకపోతే నన్నింత మీరు ఆకర్షించేవారు కారు.

బెనర్జీ · బ్రతకడానికి ఏదో ఒక పెద్ద ఆయుధం ఉండాలండి స్త్రీకి కళ్ల లాగు, రాజకీయ నాయకునకు మోనంలాగు మీకు కలం ఉంది, నాకు నోరు—ఓ పదునైన ఆయుధాల్ని దగ్గర పెట్టుకుంటే దాని అవసరాన్ని అదే వెతుక్కుంటుంది—నే నెప్పుడూ కోపం తెచ్చుకోను కాని కోపం తెచ్చుకోనిదే ఏ పనీ జరుగదు—అదే విచిత్రం మంచి తనం మనస్సుల్లోనే కాని మాటల్లో పనికిరాదు సార్! ఇదీ స్పుట్నిక్ యుగం ఫిలాసఫీ—

బోయ్ (వచ్చాడు) సార్!

బెనర్జీ : క్యా హై ?

బోయ్. ఎవరో వచ్చారు సార్!

బెనర్జీ చూశారా ? ఇదే ఉత్తరాది వాడికీ దక్షిణాది వాడికీ తేడా—యిదే కాని బెంగాలీ కుర్రాడైతే—ఆ విజిటర్ ప్రాణాలు కొరుక్కుతినేసి పేరూ, వూరూ, పనీ . (ద్వారం దగ్గిర వ్యక్తిని చూసి హఠాత్తుగా ఆగిపోతాడు క్షణం నిశ్శబ్దం—ఉన్నట్టుండి బోయ్ వేపు తిరిగి) సరే నువ్వు వెళ్ళు

(ఇవతల తలుపు తెరచి బోయ్ మెల్లిగా వెళ్లిపోయాడు. కర్టెన్ వేసివుంది అవతలి మనిషి ఛాయ లీలగా తెలుస్తున్నది—కృష్ణమూర్తి వేపు నవ్వుతూ చూసి వెళ్లి బెనర్జీ కర్టెను తెరచి గుమ్మంమీద కాలేసి ఓ తలుపు రెక్క పట్టుకు నిలబడ్డాడు. అవతలి వ్యక్తి యిప్పుడు స్పష్టంగా కనిపిస్తున్నాడు వయస్సు దాదాపు బెనర్జీ అంతే ఉంటుంది తెల్లగా, మరీ తెల్లగా దొరలా ఉన్నాడు. చేతిలో హేట్, బ్రేస్‌లేట్స్ ఉన్న వెడల్పాటి పాంటూ—నల్లటి బూటూ—

గౌరీపతి· (ఎలా మాట్లాడాలో తెలియక మొదట తడబడ్డాడు) నమస్కారం· నా పేరు ...

బెనర్జీ · గుమ్మంలోనే ఆగిపోయేపని కాదు. లోపలకు రండి ఇదేం పులి బోను కాదు (వచ్చాడు) ఇది మీ కుర్చీ (కాలుతో ముందుకు త్రోసాడు—గౌరీపతి కూర్చున్నాడు. ఇప్పుడు రెండోకుర్చీ కృష్ణమూర్తివేపు లాక్కొని, గౌరీపతి కేసి మాటలు ప్రారంభించాడు.) రూర్‌కేలాలో ఓ రష్యన్ మెకానిక్ ఉండేవాడు వాడికి సుఖంగా ఉండాలంటే భయం. రోజంతా ఫ్యాక్టరీలో పనిచేసి యింటి కెళ్ళి మొక్కలకు నీళ్ళు తోడేవాడు. "మనిషికి మరీ సుఖం ఉండ కూడదు ఆనందం ఉండకూడదు—ఉంటే పొగరెక్కుతుంది" అనేటర్జినీవ్ వాక్యం గుర్తుకు తెచ్చేవాడు. కాని ఆశ్చర్యమే మిటంటే వా డెప్పుడూ కష్టంలో కరిగి పోవడం నేను చూడలేదు (మామూలుగా యిటు గౌరీపతి వేపు తిరిగి) బైదిబై నేను 'బ్లడ్ ప్రెషర్' పేషంటుని—ఎందుకయినా మంచిది. గుర్తుంచుకోండి.

గౌరీ (వింతగా చూశాడు) అదెందుకూ యిప్పుడు ?

బెనర్జీ ఇక్కడ నుంచి వెళ్లేలోపల ఆ విషయం అవసరం ఉంటుందిలే!

గౌరీ . నా పేరు ....

బెనర్జీ పే రెవరిక్కావాలి ? అదేదో ప్రపంచానికి పెద్ద సమస్యలా చెబుతున్నారు. మీ పేరు గౌరీపతి—అంతేనా మీరు చెప్పబోయేది ?

గౌరీ · (ఆశ్చర్యంగా లేవబోతే)

బెనర్జీ · (ఆపి) మరీ హెచ్చు మర్యాదలకు పోకండి కాళ్ళు నొప్పి చేస్తాయ్· నా పేరు మీ ఉత్తరంలో వ్రాయటం మరచిపోయానని పోస్టు చేశాక జ్ఞాపకం వచ్చింది అన్నట్టు "మీరు" అనేదా మిమ్మల్ని. (ఆగి—ఒకసారి అతన్ని పరికించి) అనేవాణ్నే కాని మీ పాత జీవితం తెలిసిపోయింది నాకు. (గౌరీపతి ఉలిక్కిపడ్డాడు) బెదరిపోకండి. వయస్సులోనే కాకుండా, మనస్సులో కూడా పెద్దవాళ్ళు కారని అర్థమైంది. (కృష్ణమూర్తిని చూపుతూ) ఈయన రచయిత ఆమాత్రం చాలు ఆయన అడ్రస్. నా పేరు చెప్పలేదు కదా ? బెనర్జీ ఏం ? ఏమైనా విషయాలు జ్ఞాపక మొస్తున్నాయా ఇప్పుడు ?

గౌరీ (లేవబోయి) ఓహో 18 ఏళ్ళ క్రిందట ......

బెనర్జీ బాగా జ్ఞాపకమే మీకు ?

గౌరీ : మిమ్మల్ని చూడలేదు పేరు గుర్తుంది అయినా అంత త్వరగా ఎలా మర్చిపోతాను మిమ్మల్ని (వ్యంగ్యంగా)

బెనర్జీ : ఏం అంత గుర్తా నా పేరు ?

గౌరీ · (మాటలో కరుకుదనం, హేళన) మీ పేరు కాదు అప్పట్లో నవంతకు మీరు రాసిన ఉత్తరాలు.

బెనర్జీ · గౌరీపతీ! (అంతలో ఆవేశం తగ్గించుకు నవ్వేశాడు) అరే అంతలో కోపం తెప్పించావే నాకు! —నాకు సుళువుగా కోపం రాదు

గౌరీ కాని ప్రేమించడం చేతనవును ఆడవాళ్ళకు ఉత్తరాలు వ్రాయడమన్నా—అన్నట్లు పెళ్లిలో గ్రీటింగ్స్ పంపారు కదూ ? ఎవరో కవు లనుకున్నాను

బెనర్జీ కవులను గురించి తెలుసుకోడానికి మరో జీవితం గడపాలి నువ్వు.

గౌరీ . (విసుగ్గా) ఎందుకు పిలిపించా రిక్కడికి ?

బెనర్జీ నిన్ను చూడా లనిపించింది—నిన్ను చూస్తే నిజంగా నాకు జాలేస్తుంది ఒక్క ఉత్తరం—పెళ్లికి పంపిన గ్రీటింగ్స్ చూసి 18 ఏళ్ల జీవితాన్ని—అంతకుమించి పెళ్ళాన్ని, వదులుకున్నావే ? ఇంత నీ సమర్థతని చూసి ఈపాటికి ప్రపంచం నీకు వూరేగింపులు చేయిలచి, జాతరలు ఎందుకు చెయ్యలేదా అని ఆశ్చర్యం!

గౌరీ : బెనర్జీగారూ !

బెనర్జీ (హఠాత్తుగా ఆగి) పెళ్ళాన్ని వదలిపోవటమే ననుకున్నాను. కోపం తెచ్చుకోవడం కూడా తెలుసే నీకు ?

గౌరీ . అది నా స్వవిషయం. చాలాదూరం పోతున్నారు

బెనర్జీ · (ఒక్కసారి కోపంతో ఏదో అనబోయాడు గుండెనొప్పి వచ్చింది. పెదాలు బిగబట్టి ఆపుకున్నాడు అంతలో కోపంతో వణుకుతున్న గౌరీపతిని చూసి నవ్వేస్తాడు ఇటు కృష్ణమూర్తివేపు తిరిగి) కృష్ణమూర్తిగారూ !

కృష్ణ : చెప్పండి ?

బెనర్జీ : బ్లడ్‌ప్రెషర్ చాలా అందమైన జబ్బన్నాము కదూ ? చాలా అవసరమైనదని కూడ అనిపిస్తుంది ఈ కోపం అనవసరంగా వస్తుంది. ఎందుకనో (బల్లకు చేరబడి మంచంమీద కూర్చొని ఓ క్షణం కళ్ళు మూసుకున్నాడు. గుండె నొప్పి కొద్దిగా తగ్గినట్టుంది కళ్ళు విప్పి కృష్ణమూర్తి కళ్లలో ఆశ్చర్యాన్ని చూసి నవ్వాడు మంచం దగ్గరకు వచ్చి పేక తీసి(రెండు ట్రిక్కులు చేసి చూపించేడు ? ఇదంతా చూసి విసిగిపోయాడు గౌరీపతి లేచి వెళ్లబోయాడు. అప్రయత్నంగా—గౌరీపతిని చూసి మాట్లాడుతూ) కూచో గౌరీపతీ! నిన్ను హత్యచేస్తానేమో నని భయపడి నన్ను నేను కూడ దీసుకుంటున్నాను. నేను చస్తే ఎవ్వరూ ఏడవరు. కాని నువ్వు

పోతే పాపం, నీకు అక్కరలేని పాత భార్య, నువ్వు వూహించలేని కొడుకూ, పిళ్లంతా . .....

గౌరి · కొడుకు !

బెనర్జీ నీకు తెనియదు కాగితాలు గాలిలో ఎగిరివచ్చుంటాడు బహుశా. నిన్ను నువ్వు నమ్మలేనంతగా చచ్చిపొయ్యావన్నమాట ఈ 18 ఏళ్లలో.

గౌరి : (కోపం వచ్చింది) బెనర్జీ గారూ ! మరోసారి చెప్తున్నాను మీరు నాటకాలు ఆడతలుచుకుంటే రోడ్డుమీద ఎవరినన్నా పోగుచేసు కోండి కాని మీ చుట్టూ నిలబడేవాళ్లంతా వెధవలనీ, మీరు చెప్పే పురాణాలు వినడమే వారి ధ్యేయమనీ అభిప్రాయపడకండి వస్తా. (టోపీ తీసుకు వెళ్లబోయాడు)

బెనర్జీ · (అటు చూడకుండానే నవ్వి, కృష్ణమూర్తితో) కొందరిలో కోపం బావుండదు సార్ ! అయినా దొంగతనానికీ, కోపానికీ స్నేహమేమో ననిపిస్తుంది

గౌరి . (ఆగాడు) అదిగో మళ్లీ !

బెనర్జీ · అవును, నీ గురించే మాట్లాడుతున్నాను ఈ ముక్కలు పరచడం అయిపోనీ ఈలోగా నీ భార్య విషయం, కొడుకు విషయం ఏమైనా గుర్తు కొస్తున్నాయో ఆలోచించుకో

గౌరి · (కోపంగా ముందుకు వచ్చి) ఒక్కమాట చెప్పండి నన్ను బ్లాక్ మెయిల్ చెయ్యా లనుకుంటున్నారా మీరు ?

బెనర్జీ . (నవ్వి) చాలా పెద్దమాట తెలుసు నీకు—చేసి నీ దగ్గర్నుంచి ఏం సంపాదించుకోవాలి నేను ? కనీసం నీ అంతట నువ్వు సుఖంగా బ్రతక గల మంచితనమన్నా లేదు నీ దగ్గర డబ్బా ? కావాలనుకుంటే నీ జీవితమంతా పదేళ్ల క్రిందటే కొనేసేవాణ్ని డబ్బుతో అయినా నువ్వు ఒక్కడివే కాదు నాకు ప్రపంచం—ఇన్నాళ్లైనా యింతకాలం నీ గురించి ఖర్చు చేస్తున్నానంటే నీ మీద గౌరవంతో కాదు—ఆడది రాసిన ఓ ఉత్తరానికి—అదీ నా బలహీనతకి అనవసరంగా శిక్ష ననుభ వించే ఆడదానిమీద సానుభూతితో కాకపోతే ఇవాళ నీ ముఖం చూసేవాడినే కాదు

గౌరి · (హుందాగా) ఎవరా ఆడది ?

బెనర్జీ తెలుసుకోవాలని ఉందా ? (స్టాండు దగ్గరకు వెళ్లి కోటు తీసి గౌరీపతి మీదికి విసిరాడు) జేబులోనుంచి ఉత్తరం తీసి చదువుకో (గౌరీపతి బెనర్జీ వేపు విచిత్రంగా చూస్తూ జేబులో చెయ్యి పెట్టాడు పిస్తోలు వచ్చింది తుళ్లిపడ్డాడు బెనర్జీ నవ్వాడు) దానిలో సరిగ్గా రెండు గుళ్లున్నాయ్ దగ్గర ఉంచు కావలసి వచ్చి నప్పుడు ఉపయోగించవచ్చు కాని ఉపయోగించేముందు రెండవది నీకు రిజర్వు చేసుకోవాలి ఉత్తరం చదువు (ఇటు తిరిగి) వినండి కృష్ణమూర్తిగారూ ! ఈ పెద్దమనిషికి ఓ పెద్ద హాబీ ఆడవాళ్ల జీవితంతో ఆటలు ఆడటం—

గౌరి . (ఉత్తరం చదువుతూ) వసంత !

బెనర్జీ : అవును వసంతే ! వసంత లప్పట్లో చేసిన పాపమల్లా నాకు ఉత్తరాలు వ్రాయటం ఉత్తరాలు వ్రాయడం తప్పే ఒప్పు కుంటాను కాని మనిషిలో మార్పు గుర్తించకపోతే ఎట్లా ? తమ నీచత్వాన్ని చూసి కాదు తమ నీచత్వానికి ఒదిగి బతకని ఆడవాళ్ల స్వేచ్ఛను చూసి ఏడుస్తారు వీళ్లు వసంత కాదు స్వర్గం నుంచి ఏ గొప్ప దేవతని తీసుకువచ్చి వీళ్ళముందుంచినా యింతే !

గౌరి : (ఉత్తరం మడిచి కోటు జేబులో ఉంచి బెనర్జీ మీదకు విసరేస్తూ) మీరేం లోకాన్ని ఉద్ధరించడానికి కంకణం కట్టుకోలేదు మా బ్రతు కులు మాకు తెలుసు మీ సహాయానికి "థాంక్స్" (వెళ్లబోతూంటే స్టూడెంటు ఇప్పుడు మళ్లీ వచ్చాడు)

యువ ఎక్స్క్యూస్‌మీ ! టైమెంతయు ఉంటుందంటారు ?

గౌరి : (అతన్ని విచిత్రంగా చూసి వాచీ చూసుకుని) పదిన్నర.

యువ 'థాంక్స్' (వెళ్లిపోయాడు. ఈసారి గౌరీపతి వెళ్లబోతే బోయ్ అడ్డంగా వచ్చాడు)

బోయ్ మంచి స్వీటు కావాలా సార్ !

బెనర్జీ ఆయనకు కావాలేమో అడుగు. పోనీ కాఫీ తీసుకురా ఈయ నిప్పు డెక్కడికీ వెళ్లరు బయట తలుపు గడియవేసి వెళ్లు (గౌరీ పతితో) ఇంకా నీకు చెప్పవలసినది చాలా మిగిలిపోయింది గౌరీపతీ— కూర్చో (కాసేపు గుంజాటన పడి గౌరీపతి కూర్చుంటాడు. బెనర్జీ కాసేపు ఆగి దగ్గరకు వచ్చాడు) నువ్వు చాలా అదృష్టవంతుడివి. మరో గంటలో బాగుపడబోతున్నావ్.

గౌరి (అతన్ని చూచి హేళనగా నవ్వాడు) అయితే మీ మంచితనంమీద మీకు చాలా నమ్మకమేనే ?

బెనర్జీ నిజమే చెప్పావు. నీ దగ్గర పిస్తోలే ఉంది నా దగ్గర యింకా పదునైన ఆయుధా లున్నాయి (ఆగి) నీకంటే నేను గొప్పవాణ్నేమీ కాదు. నువ్వు తప్పు చేశావు నేనూ చేశాను కాని ఆ తప్పు దిద్దు కునేందుకు హెచ్చు కాలం వృధా చేయలేదు నేను నీకు 18 ఏళ్లు కూడ చాలలేదు

గౌరి ఏమిటా ఉపన్యాసం ?

బెనర్జీ (దగ్గరకు వచ్చి రహస్యంగా) మళ్లీ పెళ్లి చేసుకుంటున్నావటగా ?

గౌరి బెనర్జీ గారూ !

బెనర్జీ అరవటం కాదు సమాధానం చెప్పు ?

గౌరి : . .

బెనర్జీ పెళ్లిలో నీ క్రొత్త భార్యకి యిచ్చే మంచి కట్నం చూపించేదా ?

గౌరి మిమ్మల్ని మీరు మరిచిపోతున్నారు

బెనర్జీ నువ్వు జ్ఞాపకం చేస్తూవుండు (బెడ్డింగులో నుంచి ఒక ఉత్త రాల బంగీ తీశాడు) ఇదిగో ఇదే నీ క్రొత్త భార్యకు బహుమానం (గౌరీపతి మాట్లాడడు దగ్గరకు నడిచాడు బెనర్జీ) ఏమిటని అడుగు

గౌరి (బెనర్జీ ముఖం చూశాడు)

బెనర్జీ · (నవ్వి) మీ ఆవిడ ప్రేమలేఖలు

గౌరి బెనర్జీగారూ !

బెనర్జీ · (వెనక్కి తిరిగి) అరిస్తే మళ్లీ పిస్తోలు కాల్చే వోపిక ఉండదు. నీతో పెళ్లయ్యాక రెండు, మూడు ఉత్తరాలు మాత్రం వ్రాసింది వసంత (ఆగి ఎటువేపో చూస్తూ) నువ్వు చాలా మంచివాడవట. నిన్ను పెళ్లి చేసుకోవడం తన అదృష్ట మంది బాగా చదువు కున్నారు మనిషిని అర్థం చెసుకోగలరని కూడా వ్రాసింది

గౌరి మీరు ఈర్ష్యతో తల బ్రద్దలు కొట్టుకొని ఉంటారు అవునా ?

బెనర్జీ · అదొక్కటే నీ దగ్గర్నుంచి నేర్చుకోవాలి ! నేను ఆ తర్వాత మరి ఉత్తరం వ్రాయలేదు అదే నే నామెకు చేసే సహాయ మనుకున్నాను.

గౌరి (నవ్వి) విన్నారా ? రచయితగారూ ! దొలిగుంటలో పడుకున్నాక కుక్క మంచి బ్రతుగ్గరించే కలలు కంటుందట. ఓ తప్పు చేశాక అందరూ గొప్పవారే—ఆయన ఉత్తరాలు వ్రాసి తప్పు చేశాడు నేను పెళ్ళాన్ని వదులుకున్నాను

బెనర్జీ (నవ్వి) కుక్కలా బ్రతకడం మనిషికి చాతనయి ఉంటే ప్రపంచం పెద్ద యుటోపియాలా ఉండేది నువ్వు చేసిన పని తప్పని ఒప్పు కున్నావుగా ? మరేం చేశావు ? నా తప్పు తెలుసుకుని ఉత్తరాలు వ్రాయటం మానేశాను కానీ నీ తప్పుకు శిక్షను ఇంకా ఆవిడ ఇప్పటికీ అనుభవిస్తూనే ఉంది

గౌరి మరి యిప్పటి ఈ ఉత్తరం మాటేమిటి ? ఉత్తరాలు వ్రాయడం మానేసిం దన్నారుగా ?

బెనర్జీ ఇన్నాళ్ళ తర్వాత నీ కోసం—నీ కోసం కాక తన కొడుకు కోసం వ్రాసింది

గౌరి కొడుకు !

బెనర్జీ : అవును. నీ కొడుకే !

గౌరి (విపరీతంగా నవ్వి హేళనగా) నాకు నవ్వు వస్తోంది. భలే! దగ్గరకు వచ్చి) మీకు ఆడవాళ్లమీద ఎంత నమ్మకమా అని ఆశ్చర్యపోతున్నాను (నవ్వి) కొడుకు !

బెనర్జీ (ఈ మాటల్తో యిక ఆగలేక పోయాడు బెనర్జీ ఒక్కసారి అతన్ని రెండు చేతుల్తోనూ పట్టుకుని వూపుగా కొట్టాడు కృష్ణమూర్తి హఠాత్తుగా కల్పించుకుని ఆపాడు అంతా క్షణంలో జరిగింది గౌరీపతి మొదట నివ్వెరపోయాడు.)

కృష్ణ బెనర్జీగారూ! మరీ వశం తప్పుతున్నారు ఛీ! ఏంపని చేశారు ?

గౌరి (మనస్సు కూడదీసుకుని నవ్వి) ఏదో బాధ దాచుకుందుకు కొట్టారు లెండి. కొట్టినందుకు కాదు విచారం ఆయనంత దిగజారిపోయారే అని

బెనర్జీ (ఆవేశంతో నరాలు పట్టు తప్పాయి విపరీతంగా ఆఽసట వచ్చింది మంచంమీద కూర్చొని స్వాస్థ్యం కోసం పెనుగులాడుతున్నాడు ముఖం ఎర్రబడింది మెల్లగా కాస్సేపటికి మాట్లాడ గలిగాడు) గౌరీపతీ! మనిషి వనుకుని పిలిచాను కాని చచ్చిపోయావు నువ్వు నిన్ను నువ్వు నమ్మలేనంతగా పతన మయావు నీతో యింకా మాట్లాడితే యింతకాలం వృధా చేసినందుకు తర్వాత విచారించాలి నేను. మరో మంచిపని ఆగిపోతుంది నిన్ను కొట్టినందుకు క్షమించు రోడ్డు ప్రక్క నిలబడే కుక్క దగ్గర నుంచి ఇంకా చాలా పాఠాలు నేర్చుకోవాలి నువ్వు వెళ్ళు—

గౌరి (నిర్విణ్ణుడై టేబిల్‌మీద టోపీ తీసుకు వెళ్ళబోతే)

బెనర్జీ ఉండు వో క్షణం (లేచి ఉత్తరాలు యిస్తాడు) ఈ ఉత్తరాల తీసుకో ఎప్పుడన్నా తీరుబాటుగా చదువుకోవచ్చు (గౌరీపతి ఆశ్చర్య పోయాడు) అంతగా తెల్లబోకు అవి చదివితే స్త్రీ ఎంతగా ప్రేమించగలదో అర్ధమవుతుంది నీకు ఇంతవరకు ఆమె శరీరమే తెలుసు నీకు మనస్సు తెలీదు ఆ మందు యిస్తున్నాను తీసుకువెళ్ళు. (ఉత్తరాలు టేబుల్‌మీద పడేశాడు)

(గౌరీపతి క్షణం స్తబ్ధుడై వాటిని తీయబోయేసరికి బెనర్జీ ముందుకు కుర్చీ మీదకు వంగాడు)

బెనర్జీ గుండె ఈర్ష్యలో, నా మీద కోపంతో దహించుక పోతుంది కదూ కదూ ? ఈ పీనల్‌కోడూ, ఈ పోలీసులూ, యీ సంఘం, యివన్నీ లేకపోతే ఒక్కసారిగా నా పీక నులిమి చంపేసి, చాతనైతే ఒక్క రాత్రిలో నీ భార్యను నామరూపాలు లేకుండా చేసి, యింకా చాతనైతే ఆ పేరు తెలియని కొడుకుని ....

గౌరి బెనర్జీగారూ !

బెనర్జీ వయస్సు ఎంత విచిత్రమైనదోనని ప్రయోగాలు చేస్తున్నాను గౌరీపతీ—ఇంతగా నేను ప్రయత్నించినా నువ్వు చలించలేదంటే నీ మనస్సు ఎంత పెద్ద ప్రళయానికైనా ఎదురు నిలుస్తుంది ఇక వెళ్ళు (గుమ్మం దగ్గరకు వెళ్ళబోతూ ఉంటే దగ్గరకు వచ్చి) మళ్ళీ పెళ్లి చేసుకుంటే నన్ను తప్పకుండా పిలుస్తావ్ కదూ ? మరచిపోకు తప్పకుండా వస్తాను (ఉన్నట్టుండి బోయ్ తలుపు తెరిచాడు కాఫీ తెచ్చాడు)

బెనర్జీ ఏం ?

బోయ్. ఎవరో కుర్రాడు ప్రొద్దుటి నుంచి ఎదురుచూస్తున్నాడండి.

కృష్ణ ఎవరతను ?

బెనర్జీ (నవ్వాడు) వూ !

బోయ్: పదకొండు గంటలకు ఎవరో వస్తారని మొదట చెప్పాడు. పేరడిగితే యిప్పుడు చెప్పాడు మీ కోసమే కూర్చొన్నాడు సార్ !

బెనర్జీ సరే! ఒక్క క్షణం ఆగి లోపలకు రమ్మను కొంత విశ్రాంతి కావాలి నాకు ఆ కాఫీ ఇలా తే (తీసుకున్నాడు. గౌరీపతి వెళ్ళబోతే) చూడు గౌరీపతీ! వెళ్ళబోయేముందు ఒకక్కమాట. హోటలు బైట మా స్నేహితు డొకాయన కూర్చొన్నాడు. పరిచయం చేసుకు మరీ వెళ్లు. మాంచి నేస్తం. పెళ్లికి ఇన్విటేషన్ పంపితే తప్పక వస్తాడు. (గౌరీపతి ఆగి వెళ్లిపోయాడు)

కృష్ణ: (ఆతృతగా) బెనర్జీగారూ! గౌరీపతి కుర్రవాణ్ణి గుర్తుపడితే కొంప మునిగిపోతుంది

బెనర్జీ: ఏమీ అవదు కృష్ణమూర్తిగారూ! గుర్తుపడితే మన అవసరమే ఉండదు. అక్కడనుంచే ఇద్దరూ కలిసి వెళ్తారు అందుకనే కొన్ని నిముషాలు టైమ్ యిచ్చాను కొంచం కాఫీ తీసుకోండి (సౌనరుతో యిచ్చాడు)

కృష్ణ (తీసుకుంటూ) గౌరీపతి నిజంగా మనస్సు మార్చుకుంటాడంటారా?

బెనర్జీ. నేనే వోడిపోయాను కృష్ణమూర్తిగారూ! నేనూ వో తప్పు చేయడం నన్ను బలహీనుణ్ణి చేసింది అయినా వీళ్ళు నా మాటలకు బెదరి మనస్సు మార్చుకుంటున్నారా ? తమ చేతల్లో తప్పు గ్రహించి బాగుపడుతున్నారా ? అన్న విషయం అర్ధంకాదు ఒక్కొక్కప్పుడు నా మాటల మీద నాకే విసుగేస్తుంది (ఆగి) అసలు ప్రేమ, స్నేహం, మంచితనం యివన్నీ మనిషికి బలహీనతలండీ! వీటిలో ఏది తక్కువైనా ప్రళయం తప్పదు వీటిమీద 'సంసారం' అన్న బురఖా తొడుగుతుంది సంఘం ఇవన్నీ ఉండకూడదు ఉన్నట్లు కనిపించాలి

కృష్ణ: (నవ్వుతాడు) అంత తెగించి మీరు ప్రపంచానికి దూరంగా ఎక్కడికి పోలేరు బెనర్జీగారూ! మీరు బ్రతకాలి ఈ సంఘంలోనే బ్రతకాలి. అంతకన్నా మరో గత్యంతరం లేదు

బెనర్జీ నాలో, Finer corners) ని కదుపుతున్నారు మీరు ఈ విషయాలు మాట్లాడితే ఒళ్ళు తెలీదు నాకు—ప్రపంచం అంటారే ? కుక్క అది అంతే అంతకంటే ఎక్కువ విలువ లేదండీ సంఘానికి నిజం నేను చెప్పేమాట—రొట్టె విసిరి మెడ పట్టుకోవడం నేర్చుకుంటేనే మీ బ్రతుకులో వెయ్యి వసంతాలు లేకపోతే మీరు సరి—(నవ్వాడు కృష్ణమూర్తి) నవ్వుతారు మీరు నేను గొప్పవాడ్నని బోర్డు కట్టని ఏ రచయితనైనా చూపించండంఢీ ఈ ఆంధ్రదేశం ? మీరలా చూస్తుండండి రేపే గదికి 'కవి సమ్రాట్' బోర్డు తగిలిస్తే, కాబోలనుకుని కనకాభిషేకం చేస్తారు మీకు రెండు నిలువుల ఎత్తున మీ విగ్రహం స్థాపిస్తారు ఇదీ వీళ్ల విజ్ఞతకి 'ఏంబార్గో'

కృష్ణ మీకు ప్రపంచంమీద చాలా కోపం ఉన్నట్టుంది ?

బెనర్జీ · ప్రపంచంమీద కాదు ప్రపంచాన్ని ఎదిరించలేని వీళ్ల బలహీనత మీద వాళ్లంతటవాళ్ళు సుఖంగా బ్రతకడం తెలీదు ఇంకోళ్ళు బ్రతికితే అర్థం చేసుకోరు వీళ్ల మనస్సులో ఏదో భాగం చెడిపోయింది దానికి మరమ్మతు కావాలి

కృష్ణ .... .

బెనర్జీ. మీకు నోరు లేదు—నాకు నోరు ఉంది కాని పట్టుదల లేదు. అందువల్లనే ఈ హోటల్లో కాఫీ త్రాగుతూ యిట్లా బ్రతుకుతున్నాం మనం

(ఈసారి కుర్రాడు వచ్చాడు ఇదివరకు ఒకటి, రెండు సార్లు వచ్చిన స్టూడెంటు ఇతనే పేరు ప్రకాశరావు)

ప్రకా 'ఎక్స్‌క్యూస్ మీ'—ఇక్కడ బెనర్జీ అనే ఆయన ....

బెనర్జీ నేనే బెనర్జీ

కృష్ణ ఇందాక రెండు మూడు సార్లు ఇక్కడికి టైం కోసం వచ్చారు కదూ ?

ప్రకా అవునండి! గంట క్రితమే వచ్చాను సరిగ్గా 11 కి రమ్మన్నారాయన అయినా వెళ్ళమని మా అమ్మ ఒకటే తొందర చేసింది.

బెనర్జీ హోటల్ ద్వారం దగ్గర ఎవరన్నా కలిశారా నిన్ను ?

ప్రకా ఎవరో నన్ను చూసి ఆగారండి! పేరడిగారు—

బెనర్జీ. చెప్పావా ?

ప్రకా : ఊఁ!—

బెనర్జీ : ఇంకేమన్నా అడిగారా ?

ప్రకా : పేరు వినగానే ఏదో గుర్తు చేసుకోవడానికి ప్రయత్నించారు. మళ్ళీ నన్ను చూశారు కాని ఏమనుకున్నారో ఏమో, మెట్లుదిగి వెళ్ళి పోయారు. అంతా ఒక్క రెండు క్షణాలు మాత్రం—

బెనర్జీ : (కృష్ణమూర్తి వేపు తిరిగి నవ్వాడు) ఆ రెండు క్షణాలే గౌరీపతి జీవితంలో సరిగా ఖర్చయాయి.

ప్రకా : ఎవరండీ గౌరీపతి ?

బెనర్జీ : ఎవరైతేనేంలే. అలా కూర్చో ముందు

ప్రకా : మీరు అమ్మకు వ్రాసిన ఉత్తరం చూశాను.

బెనర్జీ : అలాగా ? నీ పేరు ?

ప్రకా : ప్రకాశరావు

కృష్ణ : ఏం చదువుతున్నారు ?

ప్రకా : మీరు ?—

బెనర్జీ : రచయిత—మా నేస్తం. అదీ ఇప్పటికి ఎడ్రస్

ప్రకా : (కృష్ణమూర్తితో) హైస్కూల్ చదువు పూర్తయిందండి

బెనర్జీ : కాలేజీలో చేరాలని ఆశగా ఉందా ?

ప్రకా : ఆశంలేదు ఎందుకు చదవాలో అర్థంకాదు.

కృష్ణ : అదేమిటి ?

ప్రకా : అవునండీ ! అమ్మ ఎప్పుడూ దిగులుగా ఉంటుంది అన్నిటికీ భయం ఏం చదువుకున్నా నో లక్ష్యం ఉండాలి. కాని నాకే లక్ష్యం లేనప్పుడు ఇక ఈ చదు వెందుకా అనిపిస్తుంది—

బెనర్జీ : చూశారా కృష్ణమూర్తిగారూ ! మనిషి పెరగడానికి మంచి వాతావరణం అవసర మంటా రిందుకే ఆడవాళ్ల అసహాయత్వం—కొందరు జీవితాలమీదే విపరీత ఫలితా న్నిస్తుంది ఈ కుర్రాడ్ని చదువు మానిపించి రెండేళ్ళు టెన్నిస్ ఆట ఆడించాలి. అప్పటికి మెదడులో రక్తం కదలటం ప్రారంభిస్తుంది—

ప్రకా : మీరు భలేగా మాట్లాడుతారే ?

బెనర్జీ : పరిహాసం కాదు నీ మనస్సు అప్పుడే అరవైయేళ్ల ముసలిదై పోయింది నీ వయస్సులో ఒక్క సాయంకాలంలో ముగ్గుర్ని హత్య చేసి మెరీనా బీచ్‌లో బటాణీలు తింటూ షికారు చెయ్యగలగాలి—'డావ్ డర్టీ'—చదువుకోనం—ఎవరి కోసం ? ఎందుకు ? అని వెయ్యి ప్రశ్నలు వేసుక్కూర్చున్నావు—నాతో వస్తావా ?

ప్రకా : ఎక్కడికి ?

బెనర్జీ : ఆ ప్రశ్న లేదు రెండేళ్లలో బ్రతకాలన్న ఆశను మాత్రం కలిగించగలననే హామీ యిస్తాను

ప్రకా : అమ్మను అడగాలి—

బెనర్జీ : 'వండర్‌ఫుల్'—మీ కథలకు పనికివచ్చే పాత్ర సార్ ! ఏమంటారు?

కృష్ణ : (నవ్వుతాడు) పుట్టుక మంచి ఆలోచనకు అవకాశం యివ్వలేదు ఎవరూను. అందుకని అన్నిటికీ సంశయం అలవా టయింది పాపం.

ప్రకా : ఎందుకు పిల్చారు నన్ను ?

బెనర్జీ : నిన్ను చూడాలనిపించి—

ప్రకా : నన్నా ?

బెనర్జీ : అవును నిన్నే. అమ్మ నీకు చాలా మంచి గుణాలు నేర్పింది కాని ప్రపంచంలో బ్రతకడం నేర్పలేదు ఎగ్జిబిషన్‌లో బొమ్మలాగ తయారయ్యావు నువ్వు నీకు చాల అన్యాయం జరిగిపోయింది

ప్రకా : (బెంగగా) అమ్మ ఏమీ చెయ్యలేదు, నాకు తెలుసు—గట్టిగా ఎదురు తిరిగి ఏమన్నా అడిగితే ఏడుస్తుంది

బెనర్జీ : ఎందుకని ?

ప్రకా : ఏమో తెలియదు. నాకు తెలీని విషయాలు చాలా ఉండిపోయాయి. నేను మా నాన్నను ఎప్పుడూ చూడలేదు

బెనర్జీ : విన్నారా ? కృష్ణమూర్తిగారూ !

కృష్ణ : ఊఁ! ఎప్పుడూ ఆ ప్రశ్న మీరు అడగలేదా మరి ?

ప్రకా : అడిగానండి కాని జవాబు చెప్పలేదు అన్నట్టు (బెనర్జీ వేపు తిరిగి) మీ కో ఉత్తరం యిచ్చింది.

బెనర్జీ : (తీసుకుంటూ) మీ నాన్నను చూడాలని ఉందా నీకు ?

ప్రకా : నాన్ననా ?

బెనర్జీ : అవును ఏం ?

ప్రకా : ఏమీ లేదు. ఇక్కడే ఉన్నా డంటారా ?

బెనర్జీ : ఇక్కడ కాదు. చూడాలనిపిస్తే ....

ప్రకా : అదేమిటండీ అట్లా అడుగుతారు ? తప్పక చెప్పండి.

బెనర్జీ : ఏం కృష్ణమూర్తిగారూ ?

కృష్ణ : మరోసారి ఆలోచించండి ?

ప్రకా : దీనికి ఆలోచన ఎందుకండి ? మా నాన్న గురించి నాకు చెప్పడం తప్పా ? అతను కనిపిస్తే మళ్ళీ అమ్మ కోలుకుంటుందన్న ఆశ ఉంది

బెనర్జీ : ఇప్పుడు గుమ్మం దగ్గర ఓ వ్యక్తిని కలిశావు గుర్తుందా ?

ప్రకా : అవును ?

బెనర్జీ : అతన్ని సరిగ్గా చూశావా ?

ప్రకా : లేదు అతను . . . . . .

బెనర్జీ అతనే—

ప్రకా : అరే ! వింతగా ఉందే ! నిజంగానా ?

కృష : అవునండి, అతనే సందేహంలేదు.

(ప్రకాశరావు (ఓ క్షణం దిమ్మెరపోయి అలాగే నిలబడిపోయాడు—అంతలో బెనర్జీ రెండు చేతులు పట్టుకుని "థాంక్సు" అని వూపలాగ బయటకు పరుగెత్తాడు)

కృష : చూడండి ? (ఆపబోయాడు కృష్ణమూర్తిని ఆపాడు బెనర్జీ).

బెనర్జీ వెళ్లనివ్వండి. ఇది చివర ప్రయత్నం. కొడుకుని చూశాకైనా గౌరీపతి మనస్సు మారకపోతే ఇంకేం మార్గంలేదు వసంత కోరినట్టు కుర్రాడి చదువుకి నే నెలాగూ డబ్బు యివ్వలేను నేను చేయగలిగిందల్లా అతని తండ్రిని చూపించగలగడం. బోయ్ ! (పిలిచాడు)

కృష్ణ అంతా సరిగా ముగుస్తుం దంటారా ?

బెనర్జీ సందేహంలేదు—

కృష్ణ (బెనర్జీ చేతుల్లో ఉత్తరాన్ని చూసి(మీ చేతిలోది ఏమిటి ?

బెనర్జీ (ఇప్పుడు చూసుకున్నాడు) ఓహో ! ఇదా ? వసంత రాసిన ఉత్తరం పాపం కొడుక్కి తప్పకుండా సహాయం చెయ్యమని ప్రాధేయపడి ఉంటుంది చదవండి విందాం ?

కృష్ణ (తీసుకుని కవరు చించి చదివాడు) బెనర్జీగారూ ! (హఠాత్తుగా)

బెనర్జీ అలా నివ్వెరపోతారేం ? చదవండి ?

కృష్ణ : చాలా పొరపాటు జరిగిపోయిందండి

బెనర్జీ . ఏం ?

కృష : వినండి (ఉత్తరం చదివాడు) "అబ్బాయిని పంపిస్తున్నాను కాని ఇన్నాళ్ళూ మీకో విషయం చెప్పకుండా దాచాను కాని ఈవేళ ఇక ఆగలేక పోతున్నాను. అదీకాక 18 ఏళ్ళ తర్వాత మొదటిసారిగా వాడ్ని కలిశాక కూడా ఆ విషయం దాచడం మంచిది కాదనిపిస్తుంది

బెనర్జీ ఏ విషయం ? (కృష్ణమూర్తి తలెత్తి ఆగాడు)

కృష్ణ : (చదివాడు) "ప్రకాశం మీ కొడుకు—పాత జీవితం గుర్తుకు తెచ్చుకోండి మీకో విషయం ఎట్లా చెప్పాలా అని అప్పట్లో సతమతమయ్యేదాన్ని కాని ఓరోజు మీరు ఉన్నట్టుండి హఠాత్తుగా మాయమయ్యారు భయపడ్డాను—కాని మా నాన్న తప్పనిసరిగా సహాయం చేశాడు మద్రాసు వెళ్లిపోయాం—తర్వాత ఎలాగో బ్రతుకుతున్నాను."

బెనర్జీ (సిగరెట్టు కాలుస్తున్నవాడల్లా ఆగి) కృష్ణమూర్తిగారూ ! (లేచాడు) అయితే అతను . . . . . ?

కృష్ణ 'మీ అబ్బాయే'—! అనుమానంలేదు మొదటే మీ రీ ఉత్తరం చదివి వుండవలసింది

బెనర్జీ ఒక్కొక్కసారి మనం వూహించని విషయాలు—(ఆగి) ఏదీ ఉత్తరం (చదివి) సందేహంలేదు (ఏదో ఆలోచిస్తున్నాడు)

కృష్ణ . మొదట మనస్సు చిక్కబట్టుకోండి—ఇప్పుడు ప్రకాశం గౌరీపతి, కలిసి వస్తే . . . (ఇద్దరూ వచ్చారు)

ప్రకా . వచ్చేశామండి బెనర్జీగారూ ! మీకు చాలా 'థాంక్సు'. ఈవేళ మరో గొప్ప సహాయం చేశారు—

గౌరీ . అవునండి మొదట నాకు నమ్మకం చాల్లేదు కాని అబ్బాయిని చూశాక నా బాధ్యత పెరిగిన ట్టనిపించింది ఇంత కొడుకుని ఒక్కసారి చూసినప్పటి సంతోషం మీ కర్థం కాదు ఒక్కసారిగా నేను బ్రతకాలన్న ఆశ . నా కోసం కాకపోయినా . . . .

బెనర్జీ : నువ్వు చాలా అదృష్టవంతుడివి గౌరీపతీ !

ప్రకా : మీ సహాయం చాలా గొప్పది.

కృష్ణ : కాని ఓ పొరపాటు జరిగిపోయింది గౌరీపతిగారూ ?

గౌరీ : ఏమిటది ?

కృష్ణ : (సంకోచంతో బెనర్జీ ముఖం చూశాడు—బెనర్జీ ఆలోచిస్తున్నాడు).

గౌరీ : (గ్రహించి) ఓహో ! నే విందాకనే ప్రకాశాన్ని తెలుసుకోవలసింది—అదేనా మీ రనేది ? అవును—ఎందుకో వరాగ్గా ఉన్నాను అదీగాక నా కిక్క డేదో అపకారం జరిగిపోతుందన్న భయం న న్నాలోచించనివ్వలేదు బెనర్జీగారూ !

బెనర్జీ : ఓ !

గౌరీ : నాకు మళ్లీ క్రొత్త బ్రతుకు నిచ్చారు.

ప్రకా : నిజం నేనూ మీ దగ్గర ఈ కొద్ది సేపట్లో చాలా నేర్చుకున్నాను.

కృష్ణ : బెనర్జీగారూ ! ఇక దాచకండి చెప్పేయండి.

ప్రకా : ఏమిటది ?

బెనర్జీ : (తేరుకుని) ఏమీలేదు. నువ్వు మనస్సు మార్చుకోవడం చాలా సంతోషంగా ఉంది గౌరీపతి నిజంగా . . . .

కృష్ణ : (దిగ్భ్రమతో) బెనర్జీగారూ—?

బెనర్జీ : (నవ్వి) నిజం కృష్ణమూర్తిగారూ ! అంత కొడుకును చూస్తే, కలిగే ఆనందం నేను వూహించలేను.

ప్రకా మరి మమ్మల్ని వెళ్లమంటారా ?

బెనర్జీ తప్పకుండా—చూడు ప్రకాశం ఇంతకన్న నేనేం సహాయం చెయ్యలేకపోయానని చెప్పు మీ అమ్మతో—

ప్రకా : నిజానికి ఇదే చాలా పెద్ద సహాయం—నే నెప్పటికీ ఈ విషయం మర్చిపోను—

బెనర్జీ (నవ్వి) ఇక వెళ్లిరండి

గౌ నే వెళ్లేదా ?

బెనర్జీ : (భుజం తట్టి) నువ్వు చాలా అదృష్టవంతుడివి గౌరీపతీ ! అంతకన్నా ఏమీ చెప్పలేనిప్పుడు ఎప్పుడున్నా నీ విషయం తెలియజేస్తూ వుండు—(ఇద్దరూ వెళ్లారు) (తలుపు దగ్గరకేసి కృష్ణమూర్తి వెనక్కు వచ్చాడు.)

కృష్ణ : బెనర్జీగారూ ! ఏమి టలా చేశారు ?

బెనర్జీ : అంతా సరిగానే జరిగింది కృష్ణమూర్తిగారూ ! నే నెవరో ఇంత జరిగాక చెప్పడం అనవసరం—

కృష్ణ : మరి . . . . . .

బెనర్జీ : ఈ కథకు మరి లేదు ఎప్పుడో ఎవరో ఎక్కడో తప్పుచేస్తే మరొకడు శిక్ష అనుభవిస్తాడు ఇదీ జీవితానికి పెద్ద "థీసిస్" (అగ్గిపుల్ల తీసి ఉత్తరాన్ని కాల్చేస్తూ) ఇన్నాళ్లకు నేను ఓ మంచి పని చెయ్యగలిగాను

కృష్ణ : (ఇంకా ఆశ్చర్యంతో చూస్తున్నాడు) కాని ఇది చాలా ఘోరం బెనర్జీగారూ ! ఆవిడ విషయం ఆలోచించండి

బెనర్జీ : లోకం ఆవిడ గురించి ఆలోచిస్తే, నేనూ నా కొడుకు గురించి ఆలోచిస్తున్నాను. చూశారా అప్పుడే స్వార్థం (ఆగి సిగరెట్టు వెలిగించాడు అంతలో గుండెనొప్పి బయలుదేరిన ట్టనిపించింది—గుండె పట్టుకున్నాడు)ఆశయాలు ఉండాలి కాని మరీ మనల్ని మించి పెరిగిపోకూడదండి. ఒక్క రెండు క్షణాల్లో పదేళ్ల ముసలివాడి నయ్యా ననిపిస్తోంది. ఒక్క క్షణం క్రిందటే నాకూ బాధ్యతలు ఉన్న విషయం అర్థమయింది నేను చచ్చిపోకూడదు మళ్లీ గుండెలో నొప్పి లేచే టట్టుంది. 'ప్లీజ్' ఒక్కసారి డాక్టర్ని పిలుస్తారా ?

(మెల్లగా మంచం దగ్గరకు వచ్చి కూర్చున్నాడు— కృష్ణమూర్తి ఆశ్చర్యంగా చూసి బయటకు తొందరగా వెళ్లాడు)

[తెర]

సర్వతోముఖము

శ్రీ వఝ్ఝల కాళిదాసు

కకు బంతమ్ములలో, మహోదధుల, నాకాశంబునన్, జంద్రతా
రకలన్, మేఘములన్,దటిల్లతల, నిర్హ్రాదమ్ములన్, ధారుణిన్
సకలప్రాణులఁ, బూవులన్, లతల నానాజాతివృక్షంబులన్
బ్రకటింపంబడు విశ్వతోముఖముగాఁ బాధస్సహస్రాకృతుల్ !

నీరము, సర్వలోకజననీ హృదయోద్గత మాధురీ మయ
క్షీరము, శారదేందుకర శీతలసారము, పుష్పపత్రవి
స్ఫార మధూర్మికానికర వాసిత శీకరపూర, మంగనా
స్మేరమయాధరాధరరుచిప్రణయార్ద్ర సుధాప్రసారమున్ !

జనని యెడందలోతులు విశాలములై నిజసంతతిన్ బునః
పునరభిమానముల్ వెలయఁ బొంగు నురమ్మునఁ జిమ్ముపాలతోఁ
దనుపు విధమ్మునన్ బుడమి తల్లి తపించెడి జీవకోటికిన్
ఘన కుధర స్తన స్రవ దఖండ పయస్సుల నిచ్చు నిచ్చలున్ !

గాసిలి యేడ్చు సానువుల కన్నెల కన్నులఁ గ్రమ్ము నీట, సం
తోసము పట్టలేక వలితోయముతో సరసమ్ములాడు సూ
నాసవధారలన్, మలయు నార్ద్రిత లన్నియుఁ గూర్చుకొన్నవో
యీ సెలయేటి యూట లోలయించు రహో మధురానుషంగముల్ !

చిన్న చిన్న తరగచేతుల నీసెల చక్కిలిగిలి వెట్ట, స్తన్యమాన
బిడ్డ తడవు లాడ వికసించు తల్లిగుండెల విధాన, మలలు పులకరించు.

కొండ కోనలందుఁ గోకిల పాటలు సానువులను మెల్ల జాలువారి
తడులు, చుక్క, లలలు నొడగూర్చు కొని సెలయేరు లగుచు నిట్లు పారునేమొ ?

పల్ల మించుక వచ్చినఁ బరుగు వెట్టు తగిలెనా సుంతమెత్తు కొండలము నందు
సమతలమ్ములయందు విశ్రాంతి కాగు చిన్న పసిపాప కరణి నీ చిరుతవాక !

కిన్నెర వీణమీటు లాలికించు స్వరమ్ముల మార్దవమ్ములున్,
గ్రొన్నన రేకులందుఁ గులుకుల్ తులకించెడి తేనియల్, విని
ర్భిన్న కురంగనాభు లలరించు పరీమళ సంపదల్, రసో
త్పన్న గతుల్ వెలార్చును గదా పసిపిల్లల రీతి నీసెలల్ !

శృంగములనుండి మెల్లనఁ జెంగులిడుచు నేలకున్ బారు సెలయేటి నీటి పాయ
లందు, గిరికన్య ప్రావృషమందు స్నానమాడి కురు లారబెట్టిన యంద మమరు !

ప్రాంతములు మరుభూములన్ వారినిధుల మథన మొనరించి కుధరముల్ మధురసాంకు
నిధులయిన సెలయేరులన్ సుధలఁ దీసి పంచియిచ్చును ప్రకృతి ప్రపంచమునకు!

శరవేగంబునఁ బోవుచోఁ దరులతా సంతానమున్ బట్టి చె
చ్చెర ప్రేళ్లంటఁ బెకల్చుచున్, శిలల విచ్ఛిన్నంబు గావించుచున్,
గురుశైలాగ్రమునుండి క్రేళ్లురుకుచున్, గూలంకషప్రజ్ఞ ను
ర్వర ఘోషించుచుఁ బారుచున్నవి మహాంభఃపూర కల్లోలినుల్!

మునుకొను చున్న ప్రేముడి సముద్రుని పజ్జలఁ జేరు వేడుకల్
పెనగొనఁ బోవు నీ నదులు వింతగ నైజగతిన్ వధూ ప్రవ
ర్తనములఁ జూపుచున్నయవి—తక్కుచుఁ దారుచు మెల్ల మెల్లనన్
జను నొకకొన్ని, తీవ్రగమనమ్ములఁ బారును కొన్ని—నెచ్చెలీ!

చలదూర్మి ప్రకర ప్రభూతరుతి కాశాభిత్తికల్ ప్రీల ని
స్తులవేగోద్గతి మీరగా శివజటాజూటమ్ముల న్వీడి యా
యాకాశమునుండి గంగ ధృతిమై నేతెంచు చందంబులన్
దలపించున్ గిరిశృంగజాతజలపాతమ్ముల్ మరుద్ధూతముల్!

నేఁకీ జలపాతమ్ము కూలినంతఁ బుడమి జర్ఝరీభూతమైన వడకి పోవు;
తద్బలాఘాతమున నఖాతమ్మునుండి యాకసముదాక త్రుల్లును శీకరములు.

వారిపాతజాత భయద ఘోషణముల దూరమందుఁ బారు నీరుఁ ద్రావ
వచ్చియున్న హరిణి భ్రాంతమై విను సింహగర్జనమ్ము లనుచుఁ గనులు బెదర!

స్వచ్ఛమైన యాకాశాన బహుళ సుధలు, నిండగాఁ దేజరిల్లు చంద్రుండు నాగ
గట్లపై మొలకెత్తిన కనవు పచ్చదనముమధ్యమం దీ కుముద్వతి యొసంగు!

విరిసిన సూర్యకాంతి నరవింద దళమ్ములు నవ్వులూర బం
భరములు ఝుమ్మటంచు మధుపానము సేయగఁ జేరఁ, దమ్ముల
బ్బురముగఁ జీకటుల్ మరల మూగుచు నున్నవియేమొ యంచుఁ ద
త్తరపడినట్లు తెమ్మెరలతాకున కంపమునందు నియ్యెడన్.

అన్ని దిక్కుల బంధితమయ్యు చెరువు కలత యావంతమైననుఁ గనబరచదు;
నియమబద్ధ జీవితమందె నిశ్చయముగ శాంతి చేకూరును స్వతంత్రశక్తి మించు!

ఎండిపోయిన యీనదీ హృదయసీమ, బీటగిలిన సరసిమొద, బీడుపోయి
శుష్కవాంఛలు దళిత ప్రసూనదళములై నిరాశా జరారేఖలై కనబడు!

కార్మికజగత్తు కార్చిన ఘర్మజలము
ఆర్తలోకమ్ము కురిసిన యశ్రువారి
యవని జుట్టివైచినవి మహాబ్ధులగుచు
ఘోరగతుల నిండిన తరంగముల గముల
రొదల రోదసి మెల్ల మ్రార్మోగి పోవ!

మన కథల్లో సహజత్వం

శ్రీ 'ధనిష్ఠ', శ్రీ సత్యం

మన సాహిత్యంలో కథల కథ "తాతలు నేతులు తాగిన" పాత కథ ఆది నుండీ కథలంటే మానవునికి విపరీతమైన ఇష్టం నాగరికతా సంస్కృతులు వృద్ధిపొందుతూన్నకొద్దీ కథా స్వరూపాలూ మారుతూ వచ్చాయి ఆంధ్ర గుణాఢ్య పండితుని "బృహత్కథ" నుండి పురాణ గాథలు, ప్రబంధాల దశను దాటి నేటి రూపానికి పయనించిం దీ కథ బుర్రకథలూ, పంబకథలూ, తోలు బొమ్మలూ మొన్నటివరకూ పామరులవి ; నేడు సాంస్కృతిక పరిశోధకులవి, విదేశాల్లోని ఇండాలజిష్టులవి

ఒకప్పుడు స్వర్గీయ అడవి బాపిరాజు గారన్నట్లు "కథానిక సాహిత్యంలో ఉత్తమ స్థానం చేకూర్చుకొని ఈనాడు తక్కిన సాహిత్య స్వరూపాలకంటె ముందంజవేసి రసిక మనోరంజనం కల్పిస్తున్న"దంటే అది అర్ధ సత్యమే అంటారు సాలుకు ఇంచుమించు మూడు వేల కథలు సాహిత్య స్రవంతిలో ప్రవేశించినా అంతగా పోషణ జరగటంలేదని పెద్దల అభిప్రాయం. ఈ మధ్య పద్మరాజు, కుటుంబరావుగార్లు తమ రేడియో చర్చలో చెప్పుకోదగ్గ కథలు కనీసం ఏభై అయినా ఉండటం లేదన్నారు కథల సంఖ్య విపరీతంగా పెరిగిపోయి నాణ్యం క్రమంగా నీరసిస్తోందని పలువురి అభిప్రాయం "గుణం గణం"ల విలోమ సంబంధమిందుకు కారణమని గణితంలో చమత్కరించవచ్చు అయినా నేటి కథల్లో చాలా భాగం ఇలా రెటీనా బొమ్మలాగ "పుబ్బలోపుట్టి మఖలో మాడడానికీ "చదివిన వెంటనే మరపు వచ్చేయడానికీ గల కారణాలు వెదకడం ఉజ్వల భవిష్యత్తు నాశించే రచయితల తక్షణ కర్తవ్యం తను వ్రాసింది వెంటనే కాలగర్భంలో కలసిపోతే ఏ రచయితా సంతోషించడు పది కాలాల పాటు నిలబడాలనే అందరి అభీష్టమున్నూ

అయితే నేడు వస్తూన్న వేలకొద్దీ కథలు, ఇంత పేలవంగా, నిర్జీవంగావుండి ఆయు క్షీణం పొందుతున్నాయేమని మన ప్రశ్న. "కాదేదీ కవిత కనర్హం" అని ఒక ఆధునిక కవి అంటే మన యువ రచయితలు "కాదేదీ కథల కనర్హం" అని అన్వయించుకుని మరో మెట్టెక్కి ఏ విషయం ఏ విధంగా వ్రాసినా పరవాలేదనుకుంటోన్నట్లు స్ఫురిస్తుంది కొందరు కవిత్వం అగ్గిపుల్లమీదైనా బాగా వ్రాశారు కుక్కపిల్లైనా రసలోపం లేదు కాని నేటి రచయితలు పుష్టిలేని ఇతివృత్తాలతో నీరసంగా కథ అల్లితే చెప్పుకోతగ్గది గజిబిజి తప్ప మరేముంటుంది ? కేవలం వర్తమాన సంఘటన లాధారంగా రచనలు సాగిస్తే భవిష్యత్తులో ప్రధాన్యం కోల్పోతాయి ఈనాడు స్త్రీ పునర్వివాహం, అంతర్వర్ణ వివాహాలు, అస్పృశ్యత మునుపటంత ప్రధాన సమస్యలు కావు వాటిపై పూర్వం వ్రాసిన కథలు నేడు మనల్నంతగా కదిలించలేవు నేడు గురజాడవారి "కన్యాశుల్కం"లో రచనా శిల్పంలోని విశిష్టత, విమర్శనాత్మకమైన హాస్యం ఆకర్షించినంతగా సంస్కార భావాలు ఆకర్షించవు అలాగే నేటి "విదేశ విధానం"మీదో, పంచాయతీ ఎన్నికలమీదో, ప్రొహిబిషన్‌మీదో కథ వ్రాస్తే భవిష్యత్తులో కేవలం చారిత్రకాభిరుచి మాత్రమే మిగులుతుంది కథ పది కాలాలపాటు మనగలగాలంటే వస్తు ప్రాధాన్యం త్వరలో హరించిపోకూడదు

అయితే, సాహిత్య సృష్టి వ్యాపారస్థాయినందుకొన్న ఈ రోజులలో చిరంజీవత్వంకోసం ఎవరూ ప్రాకులాడటం లేదనిపిస్తోంది. కేవలం పత్రికల అమ్మకాలు పెరగటానికి కావలసిన ఆకర్షణ మాత్రమే కథ లివ్వగలుగుతున్నాయి ఉన్నతస్థాయి ప్రమాణాల ప్రసక్తే లేదు కథా సాహిత్యం ప్రజలకు మార్గదర్శి కావడానికి బదులు వారి లభిరుచుల కనుగుణంగా సాగిపోతోంది "రొమాంటిక్" యుగంనాటి భావౌన్నత్యమేనా లేకుండా ప్రేమకథ లల్లితే కేవలం అమ్మాయి, అబ్బాయిల కథలు ఒకే మూసలోంచి మళ్ళీ కొల్లలుగా వెలిశాయి కుక్కగొడుగుల్లాగ అది రైల్లో కావచ్చు, బస్సులో కావచ్చు, సినిమాహాల్లో, లేకపోతే నడివీధిలో, కాలేజీ దార్లో, తొలి చూపు, వలపు మురిపెం; విరహం, పార్కుల్లో, బీచిల్లో సమావేశం; ముగింపు వివాహం ఎక్కడో మొదలెట్టి కొంత ముందు వెనుకలకు గమనం సాగించి చివరికీ రహదారి చేరుకోవడం నేడు సామాన్యంగా కథల్లో కనబడే ఇతివృత్తం. ఇది చాలనట్లు అసంఖ్యాకంగా బయలుదేరిన నేటి యువ రచయితల్లో పరస్పరానుకరణ మరో ప్రత్యేకత ఒకరకమయిన కథని పాఠకులు మెచ్చుకున్నారనగానే అటువంటి కథల తయారీ మొదలెడతాడు మరో రచయిత అసలు కథలో మద్రాసు నుండి బెజవాడవరకూ సెకండ్‌క్లాస్ లేడీస్ కంపార్టుమెంటులో మెయిల్లో (చాలా అదృష్టవంతురాలు) అందమైన లమ్మాయి రైలు కదిలేముందు పొరబాటున హఠాత్తుగా తలుపు తెరుచుకొని జొరబడతాడో ఉంగరాల జుత్తు యువకుడు. చేతులో గోల్డ్‌ఫ్లేక్ సిగరట్టు టిన్నూ, పార్కరు పెన్నూ, టెరిలీను షర్టూ ఉన్నత కుటుంబాన్ని సూచిస్తాయి అవివాహితుడని వేరే పేర్కొనపనిలేదు. అక్కణ్ణించి పరస్పరం ఆకర్షించుకోవడంకోసం సాగించే కర్మకాండ మేగజైనులు (వీలైతే ఆ కథ ఏ పత్రికలో పడుతుందని ఆశ పడతారో అదే) ఇచ్చి పుచ్చుకోవడాలూ, వగైరాలు, దాంతోబాటే సినీ పరిభాషలో మది యెద దోచుకోవడాలూ తరువాత కొంత అద్భుతరసం. Pleasant surprise ఇద్దరినీ పెళ్ళి చూపులకని పెద్ద వాళ్ళు బలవంతపెడతారు వారు మథనపడతారు తీరా కన్నెత్తి చూసేసరికి తా మనుకున్న ఆప్తులే "ఆనంద మానంద మాయెనే " ఇక మిగతా కథలూ ఆ నమూనాలే వస్తాయి కాకుంటే కలకత్తా బస్‌స్టాప్, లేకుంటే షాపింగ్‌సెంటర్. అసలు కథలో నాయికా నాయకులు వేరుశనగలుతింటే వీరు పీచిమల్బా అథవా రసగుల్లా పందెపు గుర్రాల్లాగ పరుగు పరుగు వచ్చే, ఇటువంటి కథా శతాల్ని సహస్ర పత్రికాధిపతులు ప్రచురించి భుజం తడతారు అసలు కథలే అంతంత మాత్రమైనప్పుడు, నకిలీ వాటి మాట వేరే చెప్పాలా!

పైగా ప్రజాదరణకోసం ఇటువంటి రచనలు తప్ప మరోదారి కనబడటంలేదని పెద్దలు సైతం పెదవి విరుస్తున్నారు పూర్వం సాహిత్య కర్తలు కృతిభర్తలైన ధరణీపతుల ఆదరణ కోసం శృంగారం గుప్పిస్తే ఈనాడు సామాన్య మానవుని తృప్తిపరచడంకోసం ఈ సరళ పథం తొక్కడం సబబేనని ఒక సంతృప్తి అయితే పాఠకు లిటువంటి వాటిమీద ఎందుకు మోజు చూపుతున్నారనే విషయం ఆలోచించాలి పూర్వంనుండీ సాహిత్యం మానవుని కో విలాస వస్తువు ఇప్పుడిప్పుడే అందరికీ అందుబాటులోకి వస్తోంది. పూర్వం ధన ధాన్య సమృద్ధిగల పెద్దలు, బుద్ధిమంతులు, సాహిత్యప్రియులు చేరితాళ్ళలాంటి సమాసాలను విరుచుకుంటూ, ప్రబంధ కావ్యాదుల్లోని రసాన్నాస్వాదిస్తూండేవారు ఆ సావకాశం, రసికత్వం నేటి సామాన్య మానవునికి దుర్లభాలు అడుగడుగునా నిత్యావసరాలు సమకూర్చుకోవడం నిమిత్తమే హెచ్చు కాలం వెచ్చించవలసి వస్తూన్న ఈ కాలంలో విశ్రాంతి క్రమంగా సన్నగిల్లుతోంది ఉనికికై పోరాటం తీవ్రతర మవుతోంది తక్షణ సమస్యలు పరిష్కరించుకోవడానికే సమయం చాలడంలేదు ఇక సాహిత్య విషయాల్లో తల దూర్చి, ఆలోచించి, విమర్శించగల్గడం అతి కష్టం ఉన్న కాస్త వ్యవధిలోనూ అట్టే మానసిక శక్తిని ఖర్చు పెట్టకుండా ఏదో ఉల్లాసాన్నిచ్చే కథలను చదవగలడు కాని ఎక్కువగా మానసిక పరిశ్రమతో కూడిన వాదోపవాదాలు ఇతర విషయాలతో నిండిన నవలల జోలికి పోలేడు అతనికి కావలసింది కాస్తంత వినోదం. అది అందిస్తే సంతసిస్తాడు. వారికి తృప్తినీయడమే

రచయిత పవిత్రాశయమైతే ఆ మేరకు అతడు కృతార్థుడైనట్లే తనతో బాటు పత్రికాధిపతులను సైతం తరింపజేస్తాడు. కాని అతను మామూలు విలేఖరులస్థాయినుండి పైకి వెళ్లలేడు అతనిలోని సృజనాత్మకశక్తికి పరిధు లేర్పడతాయి ఏమంటే వార్తం రచనలో రసమయ కావ్యసృష్టి జరగదు. "ఇండో చైనా" యుద్ధం గురించి ఎంత బాగా వర్ణించినా మర్నాడు దాన్ని చదవరు పాత పేపరు విలువ వీశల్లోనే; కాకుంటే కిలోగ్రాముల్లో అలాగే తాత్కాలికమైన వినోదాన్నియడం కథలు కూడా ఆ పత్రికలకంటె త్వరగా పాత బడిపోతాయి అటువంటి కథల్నన్నింటినీ లెక్కగట్టి వాటిలో చెప్పుకోదగ్గవి ఏమీ లేవని విచారించడం ఇన్నేసి పేజీల న్యూస్ పేపర్లలో ఒక్క షేక్స్పియర్ సానెట్టైనా లేదని వాపోవడంలాంటిదేమో అని నా అనుమానం

అయితే కేవలం వినోదం కోసమే కాకుండా, దాంతోబాటు కొంచెం విజ్ఞానం కూడా అందించాలనీ, పాఠకుని సాంస్కృతిక చింతనా స్థాయులను పెంచాలనీ లభిలాషవుంటే, రచనలు కొంచెం భిన్నంగా వుండాలి అంతవరకు వెళ్లకపోయినా తమ రచనలు మామూలుకంటే మరో మెట్టు పైనుండాలన్నా కొంత విశిష్టతి ప్రదర్శించాలి దానికో మహదాశయం, భావోద్వేగం, ఆవేదన వుండాలి తనకి నచ్చినవి పదిమందికీ చెప్పి వారిని తన మార్గంలోకి తిప్పుకోవాలనే ఆకాంక్ష వుండాలి తను నమ్మిన సూత్రాలపై అచంచల విశ్వాసముండి వాటి ప్రచారానికై కంకణం కట్టినప్పుడే అందుకోసం ఉత్తమ సాహిత్యాన్ని సృష్టించగల్గుతాడు లేదా ఏదో ఒక విధమైన మానసిక ప్రేరణవల్ల అద్భుతంగా వ్రాయగలడు అటువంటి ఉన్నతాశయాలుకాని, ప్రేరణకాని లేకుండా కేవలం పత్రికల్లో పడటమే పరమావధిగా పెట్టుకున్న రచనలు అందుకు తగ్గట్టుగానే వుంటాయి ఏదో వ్రాసి పేరు తెచ్చుకుని, రచయితగా గుర్తించబడాలనే ఉబలాటంతో మాత్రమే వ్రాయడానికి పూనుకుంటే, ప్రచురణావకాశాలను గురించీ, ప్రచురణ కర్తలను మెప్పించే విధానాల గురించీ వూహాగానం చేస్తూంటే మంచి కథలను వ్రాయడ మెలా? అడ్డదారికై తహతహలాడేవారు "బహు దొడ్డ" రచనలెలా చేయగలరు?

ఈనాటి మన కథా సాహిత్యంలో కేవలం ఇటువంటి కీర్తి కండూతి మాత్రమే ప్రదర్శితమవుతోందంటే సహృదయతతో క్షమిస్తారని తలుస్తాను. క్రిందటి దశాబ్దంలోని రచయితలకున్న భావ బలం, ఆత్మ విశ్వాసం, సమాజాన్ని మార్చాలనే సంస్కార సంకల్పం నేటి రచయితల్లో కనిపించడంలేదు. పాతవారు, పెద్ద రచయితలు సైతం, ఒక విధమైన "సన్యస్త విధానం" కనబరుస్తున్నారు. సాహిత్య సృష్టిలో వా రందుకున్న ఉన్నత శిఖరాలకు ప్రతిఫలంగా సమాజంలో కొంచెం సౌఖ్యవంతమైన జీవితం ఉద్యోగాదులు లభించాయి కాకపోతే కొందరు "కాలం"లు నింపడానికి వ్రాయవలసి వచ్చి వ్రాసినా వాటి స్థాయిని గురించి ఎవరూ అంతగా పట్టించుకోరు. శ్రీ శ్రీ వ్రాసే డబ్బింగ్ పాటల్లో "మహాప్రస్థానం"తో తులతూగే ఉత్తమ సాహిత్యాన్నాశించం. అందుకే కృష్ణశాస్త్రిగారన్నారు చమత్కారంగా. "పూర్వం సాహిత్యం కొండల్లాగ పైకెదుగుతే ఈవాడు పైరుపొలాల్లాగ బల్ల పరుపుగా ప్రాకుతోం"దని,

ఆయనే అన్నట్టు జ్ఞాపకం—ఉత్తమ కావ్యానికి, కాల్పనికావేశం,. సాంస్కృతికత, సహజత్వం సరియైన పాళాల్లో వుండాలని ఏది హద్దుమీరినా అవకరంగానే వుంటుంది కాల్పనికత్వం శ్రుతిమించితే అగమ్యగోచరమవుతుంది సాంస్కృతికత తెగ లాగితే శిలానియమ శృంఖలాల్లో ప్రాణం పోతుంది. కేవలం సహజత్వంకోసమే ప్రాకులాడితే, రంగూ, రుచీ, వాసనా పోయి నిర్గుణమవుతుంది. కథల విషయంలో కూడా ఇదే నిజమేమో ! రసభరితమైన ఇతివృత్తం, భావావేశం, రచనలో నూతనత్వం, విలక్షణత, సహజత్వం, కథాస్థాయిని పెంచుతాయి కథావస్తువు సర్వకాల సర్వజనీనమైతే కథ కలకాలం నిలుస్తుంది రచనలో నూతనత్వం, విలక్షణత చదివేవారి నాకర్షిస్తాయి; మనస్సుల్లోనాటుకొంటాయి దీనికితోడు శిల్ప చాతుర్య ముంటే జనాదరణ లభిస్తుంది "ముళ్లపూడివారి "బుడుగు" వింత శైలి ప్రజానురాగాన్ని చూరగొంది అయితే ఈ ప్రజాభిమత ప్రభావంవల్ల అసలు రచన లొకోమారు పొడిగించబడతాయి డిటెక్టివ్ కథల ఉత్కంఠను మోహించిన ప్రజలు చనిపోయిన షెర్లాక్ హోమ్సు మళ్లీ బ్రతికేవరకూ కానన్‌డాయిల్‌ని వదలలేదు.

అటువంటి రచనల్లో సహజత్వంకోసం అన్వేషించరు చిన్న పిల్లలనువలె చాలా మంది పెద్దల్ని కూడా అద్భుత సాహసరసాలు, మంచి ఉత్సాహాన్నిచ్చి, ఎక్కువగా ఆకర్షిస్తాయి పెద్దలు సైతం పిల్లల్లాగ కార్టూన్ చిత్రాలూ, సాహస యాత్రలూ చప్పట్లు కొడుతూ చూస్తారు చదువుతారు కూడాను. అందులోని అభిమానపాత్రుడైన కథా నాయకుడు, జీవితంలోని అడ్డులన్నీ ఎదుర్కొని జయిస్తుంటే తమ దైనందిన జీవితంలోని పరాభవాల్ని, పరాజయాల్ని మరిచిపోయి ఆనందిస్తుంటారు వారి ఎస్కేపిజానికి కృత్రిమానందం ఒక ప్రత్యేకానుభూతి అందుకే కాశీ మజిలీ కథలూ, ఇతర జానపదాలూ ఈ నాటికీ ప్రజాదరణ పొందుతున్నాయి, సహజంగా ఉండకపోయినా. అలాగే సైన్స్‌ఫిక్షన్‌లలో కూడా సహజత్వానికి తావుండదు. శాస్త్రాభివృద్ధి అంతగా లేని పూర్వపు రోజుల్లోనే పాశ్చాత్యులు ఫ్రాంకెన్‌స్టీన్; ఇన్‌విసిబిల్ మాన్‌ల లాంటి రచనలను మెచ్చుకున్నారు ఇక రాకెట్లు, స్పుత్నిక్కుల ధర్మమాని అని దేన్నీ అభూతకల్పన క్రింద జమకట్టలేని ఈ రోజుల్లో వాటికి సహజంగా ప్రజాదరణ లభిస్తుంది ఉటోపియా రచనలు సహజంగా భావగర్భితాలు సంభావ్యతావకాశం కూడా ఉంటే వాటి మాట చెప్పనే అక్కర్లేదు

ఐతే ఇటువంటి ప్రత్యేక రచనల్లో సహజత్వం అంత అవసరంకాకపోయినా, సహజత్వపు ప్రాముఖ్యం తగ్గిపోదు వంద మాటల్లో వివరించి చెప్పలేనిది ఒకసారి చూపిస్తే అవగాహన అవుతుంది కళ్ళకు కట్టేలా ఉన్నది ఏదైనా మెదడులో పదికాలాలపాటు మనుతుంది ఒక రచనలోని సంఘటనలు మన ఎదురుగుండా జరుగుతున్నవనే అనుభూతి కలుగుతే అటువంటి రచన ప్రభావం మనమీదెంతో వుంటుంది దాన్ని మనం సులభంగా మర్చిపోలేం సహజమైన వాతావరణం, సహజమైన మనస్తత్వాలుగల పాత్రలతో, అటువంటి భావాన్ని కలగజేయడం సులభం ఎవరూ చూసిఉండని వాతావరణాన్ని సృష్టించినా, ఎవరికీ తటస్థపడని పాత్రలని చిత్రీకరించినా, అవి పాఠకుల వూహ కందవు వాటిలో సహజత్వం లోపించి అవి రాణించవు కాని సహజత్వం నిర్దిష్టంగా వుండదు దేశకాలానుసారం సహజత్వ స్వరూపం మారుతూంటుంది వాతావరణంలోని మార్పులవల్ల సహజత్వా సహజత్వాల మధ్య సరిహద్దు జరుగుతూ వుంటుంది మన నడవడి, మనస్తత్వాలలో వచ్చే మార్పులవల్ల ఒకనాడసహజంగా కనిపించే విషయాలు నేడు సహజంగానే కనిపిస్తాయి ఒక శతాబ్దం క్రితం విధవా వివాహాల ప్రసక్తి అసహజంగానూ, హేయంగానూ కనిపించివుండేది నేడది మామూలు విషయం అలాగే నీతి నియమాల విషయాల్లోనూ పూర్వమున్న పట్టింపులు నేడు లేవు నేరస్తునిపై కసి దీర్చుకునేబదులు నేడు నేరస్తుణ్ని ఓ వ్యాధిగ్రస్తునిగా చూసి, అతనిపై సాసానుభూతి చూపగల్గుతున్నాం అటువంటి రచనలు పూర్వం ప్రజాదరణ పొందకపోయినా నేడు ప్రజాభిమానాన్ని పొందగలవు అంతేకాకుండా కేవలం జరిగే సంఘటనలు చిత్రించినంతమాత్రాన సహజత్వం సిద్ధించదు జరిగే సంఘటన లనేకం చూడ్డానికి అసహజంగా వుంటాయి పైగా వాటిలో రసోత్పత్తికి తావు లేదు వాటి చిత్రణ ఎల్లవేళలా పొసగదు రచనంటేనే కొన్ని చిలవలూ పలవలూ కూర్చాలి అందువల్ల సహజత్వ నిర్వచనం కొంత విస్తృతపరిచి చదివినంతసేపూ అది జరిగివుండవచ్చుననే భ్రమ కలిగిస్తే సహజత్వం సమకూరిందనుకోవచ్చు అటువంటి చిత్రణ జరిగితే పాఠకుడు కథలో తాదాత్మ్యం పొందుతాడు అటువంటి కథ పాఠకుని మెదడులో కలకాలం నిలుస్తుంది.

ప్రతి రచయిత, సాహిత్యానికున్న సాంఘిక ప్రయోజనం గుర్తించి, తన భావ ప్రచారానికి సాధనగా రచనల నుపయోగిస్తే, మంచి రచనలు వస్తాయని నా నమ్మకం అంటే కేవలం కులాసాకోసం కాకుండా రచనలు కొంతవరకు ప్రబోధాత్మకంగా వుండాలి ఐతే కొన్ని సమస్యలనెంచుకుని వాటికి తమ పరిష్కారమార్గాలు సూచించేప్పుడు, అందుకనుకూలంగా కొన్ని దుష్టపాత్రలు సృష్టించి కొన్ని పాత్రలలో మంచినలంతా కేంద్రీకరించడం జరుగు జరుగుతుంది. ఇది పాత పద్ధతి తరచి చూస్తే కొంత అసహజత్వం గోచరిస్తుంది కూడా కాని ఆ సమస్యల నన్నిదృక్పథాలనుండీ తర్కించి, పరిష్కారమార్గం పాఠకుల మస్తిష్కానికి వదలివేయడం అధునాతన పద్ధతి రచయిత నిష్పాక్షికదృష్టి నవలంబించడంతో సహజత్వం పోషించబడుతుంది కాని రచనలోని ప్రయోజనం జీవిత సమస్యల ఉనికినిగూర్చి పాఠకుల్ని హెచ్చరించడంవరకే పరిమితమవుతుంది పాఠకునిలోని చింతనాశక్తిని అభివృద్ధిపరచి అతని ఆలోచనా విధానాల్లో చైతన్యంతెచ్చే ఇటువంటి రచనలు ఎక్కువ సాంఘిక ప్రయోజనాన్ని సాధిస్తాయి అయితే ప్రస్తుత తత్వాలకు రుచించని భావాలను ప్రచారం చేయడానికి రచయిత ఒక విలక్షణమైన ప్రత్యేక శిల్పం వాడాలి లేదా ఏదో ప్రత్యేకాకర్షణ వుండాలి అటువంటి రచనలు చక్కెర అద్దిన చేదు మాత్రలు. వాటిలోని ప్రత్యేకత ప్రస్ఫుటంగా వుంటుంది. తమ భావాలన్నీ హాస్యంలో వ్యంగ్యంలో గుచ్చిఎత్తేవారు కొందరు వాటిని మొదట్లో మైకంలోవలె మన్ని చూసి మనమే నవ్వుకుంటూ ఆహ్వానించి రాను రాను ఆలోచించడం మొదలెడతాము మామూలుగా చెబితే వెగటుగావుండే అతని భావాలకు మన సానుభూతి లభిస్తుంది, సహకారం లేకపోయినా.

కాని ప్రతి కొత్త రచయిత మొదట్లోనే తన స్వతంత్రాభిప్రాయాలూ, విలక్షణభావాలూ ప్రజల కందించడానికి భయపడతాడు ఒక 'నావ్స్—కే—వాస్తే' తన భావాల్ని వెదజల్లితే, అవి ఎంత మంచివైనా, తమకు నచ్చకపోతే, ప్రజలు నిర్లక్ష్యం చూపెడతారు అందుకని మొదట్లో గణ్యత సంపాదించుకోవడానికి ప్రజలను దువ్వుతూ రచన సాగించాలి వారి అభిరుచుల కనుగుణంగా నడవాలి అప్పటికీ ఆ నడకలో తన ప్రతాపం చూపెడుతూనే ఉండాలి ఆ విధంగా ప్రజల సానుభూతి, సహకారాలకోసం వారికి నచ్చే విధంగా రచనలు సాగిస్తే రచయితగా ఒక స్థానం సంపాదించుకుంటాడు ఆ తరువాత తన పీఠంనుండి తన ఇష్టానుసారం ఏ రకం ప్రబోధం చేసినా అందరూ సగౌరవంగా వింటారు చేతనైతే విమర్శిస్తారు. లేకపోతే ఆదరిస్తారు నేటి యువ రచయితల పేలవ సాహిత్యమంతా భావి మహాప్రబోధాలకు నాంది మాత్రమే అయితే మనం అంతగా విచారించక్కర్లేదు అయితే ఈ రచనల్లో అలవడిన ప్రత్యేక శిల్పం, శైలి, తరవాత అవసరమున్నా లేకపోయినా ముమ్ముందు కూడా వెన్నంటుతూ వుంటే సహజత్వం దెబ్బతింటుందని కొందరి భయం లయితే చెప్పే విషయం ప్రకృతానికి విరుద్ధంగావుంటే సహజత్వానికి తావుండదు ఉదాహరణకు ఒక రచయిత ప్రస్తుతం పాషాణాల్లావున్న నీతి నియమ నిబంధాలను తెంచాలని నిర్ణయించుకున్నాడనుకోండి ఆ విషయంమీద అతనికి అచంచల విశ్వాసం ఉందనుకోండి అతనొక అపూర్వ పాత్రను సృష్టిస్తాడు అది నీతినియమాలందు నమ్మకం లేకపోవడంతప్ప మిగతా విషయాల్లో ఉన్నత శిఖరా ల్నందుకొని పాఠకుల సానుభూతి సంపాదించుకుంటుంది. ఆ పాత్ర నైతికపు నమ్మకాల్నంతగా ఖాతరు చేయకపోవడం చదువరు లలవర్చుకుంటారు అయితే ఆ విషయంలో ఆ పాత్ర చర్యలు ప్రస్తుతానికి విరుద్ధంగా అసహజంగానే వుంటాయి అయినా చిత్రణ పటిష్ఠంగా వుంటే అసహజత్వం అంత పెద్ద దోషంగా కనిపించదు

అయితే నేటి ఆషామాషి కథాసాగరంలో మహదాశయంతో సత్సంకల్పంతో పాఠకుల పురోభివృద్ధికోసం, వారి మానసిక పరిధుల్ని విస్తృతపరిచే ఆశాజ్యోతులనదగ్గ కథలు కొన్ని ప్రచురితం కాకలేదు ఆధునిక కథా సాహిత్యంలో కొన్ని కొంత ఔన్నత్యా న్నందుకొని పాఠకుల మనస్సుల్లో చెరగని ముద్ర వేసుకోగల్గాయి వాటిలో కృష్ణంరాజుగారి "మహారాజయోగం"లాంటి విషాద భరితాలు కొన్ని ఎక్కణ్ణించో వచ్చిన అనాథ బాలుడు విద్యార్థుల ప్రైవేట్‌మెస్సులో అందరికీ తల్లో నాలికగా మసలుతూ వుంటాడు పాము పడగబట్టడం చూసి అతడో గొప్ప అదృష్ట జాతకు డనుకుంటూంటారు. అంతలో మాయమవుతాడు చివరకు కారుక్రింద పడి చనిపోతాడు ఇది "మహారాజయోగ"పు విషాదాంతం కరుణరసం కన్నీరు జలజలా రాలిస్తుంది పాఠకుణ్ని కలవరపెడుతుంది "అదృష్టం తట్టిన తలుపు" మరో రకం విషాదాంతం. నాయకుడొక సామాన్య ఉద్యోగి ఒక ఇంట్లో కొత్తగా దిగుతాడు ఆ రాత్రి అతని తలుపు చాలా మంది తడతారు వచ్చిన వాళ్లంతా అతని గొప్పతనాన్ని, సాహిత్య సేవనీ పొగిడి ఉక్కిరిబిక్కిరి చేస్తారు తెల్లారితే తనో మహాపురుషుడుగా మారిపోతానని కలలు కంటూంటాడు. తీరా ఉదయం లేచేసరికి

"వేదు నిజం" ప్రత్యక్షమవుతుంది ఆ రాత్రి తన ఆత్మీయులనుకొన్న పెద్ద మనుషులంతా వచ్చింది తన కోసం కాదనీ, అంతకుముందు ఆ యింట్లోవున్న వెలయాలికోసమనీను తమ దౌర్బల్యాన్ని కప్పిపుచ్చుకోవడంకోసం వారతన్ని పలకరించి లేని ఆశల్ని పెంచుతారు. "మధుర స్మృతి" మరో విలక్షణమైన అమ్మాయి, అబ్బాయిల కథ మామూలుగానే భగ్నప్రేమికు లవుతారు. ఐనా ఒత్తిడికి తట్టుకొని అమ్మమ్మ, తాతయ్య లవుతారు. కాశీలో మళ్ళీ కలుసుకుంటారు తాతయ్య తనతో ఉండిపొమ్మంటాడు. అమ్మమ్మని, తన నిర్మోహపు ప్రేమని సూచిస్తూ అమ్మమ్మ వారిస్తుంది "జీవితంలో చాలా భాగం ఎలాగూ మచ్చ లేకుండా గడిపేశాం ఈ కాస్తలోను మన బ్రతుకులు కుక్కా ముట్టుకు పోవాలా" అని. చివరకు ఇద్దరూ వియ్యమందుతారు అచ్యుత తల్లిగారి "వర్షం వచ్చిన రోజుల్లో" ప్రాసాదాల్లో నివసించే ధనికుల మానసిక సమస్యలూ, వాటి ప్రక్కే నివసించే పూరిపాకల్లోని పేదల నిత్యజీవిత సమస్యలూ ప్రత్యేక నైపుణ్యంతో చిత్రీకరించబడ్డాయి ఇటువంటివి పాఠకుల్లో హృదయస్పందనం కలిగించే కథలు అప్పుడప్పుడు ప్రచురిత మవుతున్నాయి వాటిలో ఈమధ్యే ప్రచురితమైన, ఆశాజీవి, జీవాతువు కొన్ని దైనందిన జీవితంలో స్త్రీ లెదుర్కొనే నైరాశ్యము, దగాలు వీటిలో హృదయంగమంగా వర్ణించబడ్డాయి. ఐతే వాటిలో కొంత శిల్పలోపం, భావోన్నతిలో పరిధులూ పనిపిస్తాయి. శిల్ప నైపుణ్యం ప్రస్ఫుటంగా వుండే రచనల్లో భావావేశం కొరత పడుతోంది బుచ్చిబాబుగారి "నా గాజు మేడ"లో అందరు మహాపురుషులూ, శిల్పులూ, చిత్రకారులూ అన్ని విలువైన వస్తువులూ కేటలాగులోలాగ పొందుబరచడంతో అసలు కథలోని వేదాంతలతలు సిడబారిపోయాయి ఇక పది కాలాలు పచ్చగా నిల్పే, హితశ్రీగారి "ఆలో—అనుభూతి", శ్రీవిదే గారి "జ్వరపీడితులు" మొదటి కథలో మానవుడు, తను వినేదాంట్లోనూ, చూసేదాంట్లోనూ ఆదర్శాన్నెంతగానో ఆకాంక్షించినా, మామూలు ప్రవర్తన నేలబారుగానే వుంటుందని వర్ణించబడింది. ఇదొక వెగటు నిజం ప్రతివారూ మనమీదేనని భుజాలు తడుముకుంటారు. రెండవదాంట్లో నిరాశతో క్రుంగిపోయేవారికి, జీవితంలో లోపమేదీ కనిపించకపోయినా, బరువుగానైనా బ్రతికి తీరాలనే ఉద్బోధ—ఒడి దుడుకులకు తట్టుకోలేక నిష్క్రమింప సంకల్పించేవారికి ఇందులోని కామేశ్వరమ్మ జీవితంతో పోల్చి చూసుకుంటే వోదార్పు దొరుకుతుంది ఆణిముత్యాలనదగ్గ కథలింకా ఎన్నెన్నో వున్నాయి, చదివినవీ, చదవనివీను.

అంతర్జాతీయ సాహిత్యంలో తెలుగు కథకు ప్రత్యేకస్థానా న్నేర్పర్చిన పద్మరాజుగారి "గాలి వాన" విననివా రుండరు పేదరాశి పెద్దమ్మ కథలంటే తెలుగుసీమకు ప్రత్యేకాభిమానం ప్రాచీన సత్సాంప్రదాయాలూ, చరిత్ర మన వెనుక నున్నాయి అటువంటప్పుడు కేవలం పాఠకుల అభిరుచులకు అనుగుణంగా వున్నాయంటూ, వారి దౌర్బల్యాల్ని ఆసరాగా తీసుకుని, వారిలో ఉద్రేకాల్ని, ఇతర ప్రవృత్తుల్ని ప్రేరేపించి పబ్బంగడుపుకుపోవడంకంటె, సమాజాని కగ్రగామిగా వుండవలసిన రచయిత, మంచి కథలతో ప్రజల్లో నవచైతన్యం పెంచి, ప్రబోధాత్మకంగా కృషి చేస్తాడని అభివృద్ధి కాముకులంతా ఆశించవచ్చు.

అలరాస పుట్టిళ్లు

శ్రీమతి ఎన్. కల్యాణసుందరి జగన్నాథ్

అమ్మవారి గుడి పాడుపడివుంది తలవాకిళ్ళు దుమ్ము సాలీళ్ళు.

మునసబుగారి లోగిలి అరుగులు విరిగి, రాళ్ళు బయటబడ్డాయి. అరుగుమీద స్తంభంలోనించి కూడా రాళ్ళు వూడిపోయినాయి లోగిలి సింహ ద్వారంవద్ద మెట్లు గచ్చుపోయి, రాళ్ళు పెళ్ళగిలిన చోట్లల్లో రావిమొక్కలు చిన్నగడ్డి పరకలా మొల్చుకొచ్చినయి మేడమీద వేసిన కిటికీలకి సాలీడు పట్టింది భవంతి, గోడలన్నీ నల్లబడిపోయి, అక్కడక్కడా పెచ్చులు రాల్తూ, బీటలు కూడా పడ్డాయి లోగిలి పెరట్లో ఒక్క నూతిచుట్టూ తప్ప అంతా నిలువెత్తు గడ్డి పెరిగివుంది. నుయ్యి ఒక వేపు కూలింది. ఖాళీ ధాన్యపు గాదులన్నీ పందికొక్కుల కన్నాలు

లోగిలికి ప్రక్కగా, వీధి కటుప్రక్కవున్న పెద్ద దొడ్డిలో గడ్డి వాములువున్న చోట వరిగడ్డి కుళ్ళి మోకాటి లోతున పడివుంది సగం విరిగిన చావిడిలో, ఒక మూలన నులక మంచాలూ, విరిగిన గోనె మడత మంచాలు మేటగా పడివున్నాయి మరో వేపున తుప్పు పట్టిన నాగటిక్రరులూ, కొడవళ్ళూ, గొడ్డళ్ళూ విరిగిన నాగలి కొయ్యలూ, చీకిపోతున్న గోనెలు, పలుపులూ యేటిగా పడివున్నాయి. కట్టుకొయ్యలన్నీ ఖాళీ పై కప్పుమీద పెంకులు లేచిపోయినయి చాలా చోట్ల పెద్ద గాలి వానకి విరిగిన కొబ్బరిచెట్లు, బాదం చెట్లూ పడినవి పడినట్టే ఎండిపోయినయి. సగం విరిగిన కమ్మరేగు చెట్లు రెండూ విరిగినంతవరకూ తల్లిచెట్టునించీ వ్రేళ్లాడుతూ, అల్లాగే ఎండిపోయినయి. కుంకుడు బూరగచెట్లక్రింద పండాకులు మోకాళ్ల ఎత్తున రాలివున్నాయి. చుట్టూ ఉమ్మెత్త, జిల్లేడి చెట్ల మయం —గడ్డిలో

చిన్నయ్యచెరువు పామంచాలు విరిగి చెరువులోకి ఒరిగి వున్నాయి వాట్లల్లో కొన్ని పెద్ద రాళ్ళు మాత్రం కొంచెం దూరంగా పడేసి వూరువాళ్ళ బట్టలు ఉతుక్కుంటున్నారు. పొలంలోవున్న పున్నయ్య చిన్నాయమ్మగారి సమాధుల సున్నం నల్లబడిపోయింది. చుట్టూ గడ్డి మొలిచి సమాధుల్ని కప్పుతూంది—సమాధులమీద రాళ్ళు రెండు మూడు చోట్ల వూడివచ్చేసినయి

తాడిచెట్లమీద కాకులు గుంపులు గుంపులుగా కూచుని 'కావు కావు' మని న్తున్నాయి లోగిలి వెనకవేపునించీ తుమ్మచెట్లమీదుగా సూర్యుడు అస్తమిస్తున్నాడు ఆ సాయంత్రపు ఎర్రటి ఆకాశంముందు నల్లగా నిటారుగా మొండి తాడిచెట్టు ఒకటి నించునివుంది దానికీ తామర గుంటకీ మధ్యవున్న మంటిదారిలోనించి రిక్షా ఒకటి వస్తూంది తామరగుంట అంతా నాచుతో నిండివుంది చుట్టూ బురద పాములు వరసగా తలలు మాత్రమే నీళ్లలోనించీ బయటికి పెట్టి గాలి పీల్చుకుంటున్నాయి

ఆ రిక్షా లోగిలి సింహద్వారం దగ్గర ఆగింది దానిలోనించీ ఒక వృద్ధాప్యం సమీపిస్తున్న ఆవిడ దిగింది, చేతిలో ఒక సంచి పట్టుకుని. లోపలినించీ అడుగుల చప్పుడు ఖాళీ భవంతిలో ప్రతిధ్వనించింది ఈవిడకంటె మరి కాస్త పెద్ద వయస్సుగల మరో ఆవిడ లోపలినుంచీ వచ్చింది—ఎండలో వెలిసి, వానల్లో తడిసిన ముఖం ఈవేళ, ఆ ముఖం దుఃఖంగా కూడా వుంది "వచ్చేశారు గదా, అక్కమ్మగారూ! మీరు అందుకోలేరేవో అనుకున్నానండి" అంది అక్కమ్మ పవిటకొంగు ముడి విప్పి చిల్లరతీసి రిక్షావాడి కిస్తూంటే క్రింద పెట్టివున్న సంచీ పట్టుకుని చంద్రమ్మ ముందూ, అక్కమ్మ వెనక ఆ శిథిల సోపానాలు ఎక్కి ఆ నిశ్శబ్దాలలోకి వెళ్లారు. వీధి అరుగుమీద నిశ్చలంగా పడుకునివున్న మేకపిల్ల బేబే అని అరచి, ప్రక్కనించీ దూకి పారిపోయింది. ఈ మాత్రము అలజడికే.

లోపల కెళుతూంటే, లోపల గుమ్మంలోనించి వ్రేళ్లాడుతూన్న సాలీడు అక్కమ్మ ముఖానికి చుట్టుకుంది "ఇల్లంతా తుడిశానుమ్మా. ఇంకా బూజు ఇక్కడ వుండిపోయిందన్నమాట. ఈ పెద్ద గవిడి కూడా నేను వచ్చాక తెరిశానుండి, నాలుగు రోజులే అయింది. ఆరూ ఈరూ రావాలిగిందా ఇక ఉప్పుడు అని తెలిపి తెరిసేశాను" అంది చంద్రమ్మ, అక్కమ్మ సాలీడు తుడుచుకుంటూంటే ఎత్తయిన స్తంభాల మధ్య చంద్రమ్మ గొంతు 'బొంయ్ బొంయ్' మని మారుమ్రోగింది ముందర మండువాలో గచ్చు వూడిపోయిన చోటూ, బీటలు వారినచోటా గడ్డి మొలిచింది మండువా వసారా అంచులలోనించీ రావి మొక్కలూ, మర్రిమొక్కలూ మొల్చుకొచ్చినయి. మండువాలో అడ్డంగా ఒక తొండ ప్రాకుకుంటూ వెళ్లిపోయింది "ఏమన్నా ధారకం దిగుతూందా?" అంది అక్కమ్మ నడుస్తూనే విచారంగా, నిమ్మళంగా "కొంచం గంజి" అంది చంద్రమ్మ "ఈ పాటికి వాళ్ళందరికీ ఉత్తరాలు అందేవుండాలి. వచ్చే సమయం అయింది" అంది అక్కమ్మ రెండో మండువా దాటుతూ ఆ మండువా వెనక వసారాలో నులక మంచంమీద ఒక వృద్ధుడు పడుకుని వున్నాడు పైన మెడవరకూ బూర్నీసు కప్పి ఉంది నేల అంతా అక్కడక్కడ గోతులుపడి వుంది మంచానికి కొంచెం దూరంలో ప్రక్కవసారాలో పాతదై, తుప్పు పట్టి వూడిపోతున్న ఒక చిలక పంజరం వ్రేళ్లాడుతూంది అక్కమ్మ మంచం దగ్గర కొంచెంవంగి "అన్నా!" అని నిమ్మళంగా పిల్చింది వృద్ధుడు పలకలే. "ఒక అరగంటనించీ కొంచం నెమ్మదిగా వుండారుమ్మ మూలుగుడూ అదీ లేదు" అంది చంద్రమ్మ

లోపలి గదిలోనించీ సుబ్బారాయుడు భార్య వచ్చింది అడుగులు పట్టి వేసుకుండా "డాక్టరు ఏమన్నాడు వదినా?" అంది అక్కమ్మ "వచ్చావా అమ్మా కాళ్ళు కడుక్కున్నావా? ఎవ్వ రేమంటారు? ఏం లాభం లేదంట. పేరంటాలయ్య కొడుకు అన్నాడు" అంది "తెల్ల వైద్యం తెలిసిన వాళ్ళని పిలవకపోయావా?" అంది అక్కమ్మ "సరే! మందూవద్దు, మాకూ వద్దు. డాక్టరు అసలే వద్దని ఎంత పట్టుపట్టారో చంద్రాయి నడుగు అసలే పట్టుదల మనిషాయె" అంది సుబ్బారాయుడి భార్య "అసలు ఆయన బ్రతుకులో మందెప్పుడైనా తిన్నారేంటుండి?" అంది చంద్రమ్మ అంతలో లోపలి గదుల్లోనించీ ఒక చూరు గబ్బిలాయి, గది కడ్డంగా ఎగురుతూవచ్చి రోగి మంచమూ, ఆడవాళ్ళనీ దాటి, ఇవతల గదుల్లోపలికి వెళ్లిపోయింది శబ్దం లేకుండా క్రింద పడివున్న విసనకర్ర అందుకుని కాస్సేపు రోగికి విసిరింది అక్కమ్మ నించుని. "నేను వంట చేస్తాను నువ్వు కాస్సేపు గాలికి బైటకూచుని, వీధి అరుగుమీద. లోపల మరీ ఒంటరిగా వుంటూంది" అంది సుబ్బరాయుడు భార్య. "ఎందుకొదినా, నేను చేస్తానులే, ని వ్వన్న దగ్గర కూచో" అంది అక్కమ్మ. "రేపణ్ణించీ ఎల్లాగా చాకిరీ తప్పదు గదమ్మా నీకు" అంది ఆమె "ఉప్పుడెట్లాగా నిద్రోతుండారుగిందా అయ్య మీరూ అల్చిపోయారు గిందా కాళ్ళు కడుక్కోండి, బయట కూకుందాం" అంది చంద్రమ్మ

బయటగోడ నానుకుని అరుగుమీద కూచుంది లక్కమ్మ చంద్రమ్మ స్థంభాన్ని అనుకుని కూచుంది దూరంగా ఎక్కడనుంచో ఆవు 'అంబా' అని అరిచింది "ఎసువంటి మాతాజు! ఎంత మెత్తని గుండెకాయ! ఏ కథ లే" అంది చంద్రమ్మ తలవంచుకుని "ఒకప్పుడూ మా ఇంటి మడిశి" అని తల ఎత్తుతూ చెప్పసాగింది "నన్ను బాదాడు ఒక్క పరుగుచ్చుకుని ఇక్కడ కొచ్చిపడ్డా ఈ మా రాజు కూసోని ఉండాడు. నా కింకేం తోసలే ఆయన రెండు పాదాలు పట్టుకున్నా మా ఇంటోడు నా యనకాల్తే వచ్చేశాడు బడితుచ్చుకుని ఈ బాబు లేపి ఓక్క టుచ్చుకున్నాడు శంపమీద, ఆ మడిశి ఇంతంతే! రొండుశేతులూ

మొకంమీద అదిమి పెట్టుకున్నాడు కళ్ళలో నీళ్ళు తిరిగినయి అత గాడికి నా కడుపొగలే, మళ్లా కాళ్ళచ్చుకున్న 'బాబయ్య బాబయ్య కొట్టబోకుండి ఒదిలెయ్యండి' అని ఏడిశా ఆయన నా మాట ఇన్నాడో లేదోగాని జేబులో సెయ్యెట్టి, శేతికొచ్చిన రూపాయలు లిచ్చేశారు మావోడి దోసిట్లో మావోడు అన్నాడు గిందా "నేను ఉత్తినే కొట్టానావుండి అయగారూ, నేను గొడ్డెల్లి కష్టపడి ఇంటికొచ్చేతలికి ఇది కూడు ఒండకుండా ఆ కన్నిగాడితో మాట్టాడతా కూకుంది ఆడేంటేంటో గట్టిగా సెప్పా—ఇది గంటే పడీ పడీ నవ్వా" అన్నాడు. అయ్యగారి కళ్ల శింత నుప్పు లయినయి. 'ఈసారి కన్నిగాడితో మాట్లాడితే, దీన్ని ఒక్క ఏటున నరికెయ్యరా' అన్నారు మా మడిశితో ఆయన ముఖం సూత్తే అంత బయ్యం ఏసిందినాకు—అబయ్యం ఉప్పుడికి వదలలే నాకు. మా నీతిమంతుడుండి ఆయన! కోపంఉంటే ఉండాదిగానీ, అంతా కనికారం ఆయన ఇచ్చిన రూపాయలు పెట్టుకుని కడుపారా, ఇందు చేసుకు తిన్నాం మావోళ్ళ శానా మంది ఇంకా నిలకడ లేకుండా కుప్పలూగ(ట్టా నలుపుకుతింటా, దొంగతనాలే గిందా! ఇంకా కులవృత్తే గిందా! ఈ మా రాజు మమ్మల్ని పిల్సి పున్నయ్య సెరువుమీద కావిలిగా పెట్టి ఇల్లూ వాకిలీ ఇచ్చే మా రాజుకి పువ్వుల ఇమానం వత్తాది, ఎల్లేటప్పుడు . ఆ సెరువు కూడా ఈరితాతగారు తొవ్వించిందేనంటుంది. ఆ తాతగారియేనంటగా ఆ సమాదులు" అంది కాస్సేపు నిశ్శబ్దం—అంతా

ఎదురుంగా తామర గుంట గట్టుమీదనించీ కప్పలు బెకబెకమని అరుస్తున్నయి చుట్టూ కీచురాళ్ళు కూస్తున్నయి. కను చీకటి పడుతూంది "ఈ జబ్బు ఫలానా అని తేల్చిన వైద్యులు లేరు గదా, ఇన్నేళ్ళన్నా!" అం దక్కమ్మ "అస లే వైద్దుగులతో పలకరిచ్చారు ఆయన? అసలు ఒకళ్ళతో మాట్లాడారా, ఇన్నేళ్ళా? ఏదో గట్టికాయం గనక ఇట్టా గెంట్టుకొచ్చారు గానుండీ!" అంది చంద్రమ్మ అక్కమ్మకి, ఈలోగిలిలో తను గడిపిన బాల్యం అన్నీ మనస్సులో కొస్తున్నాయి "ఈ ఇంటి సిరి సంపద లేమయి పోయినయ్యో చంద్రా! రోజు లెట్లా మారిపోయినయ్యో" అంది అక్కమ్మ నిమ్మళంగా "ఎందుకు సెపుతారమ్మా ఆ సత్తవతమ్మగారి పెళ్లి అయింది లచ్చిమి తొలి గిందే ఒకేల యేమన్నా శాతమా గిట్ట వోళ్ళు యామన్నా, సేసారా అనిపిత్తాది నాకు" అంది చంద్రమ్మ

సత్యవతి పేరు ఎత్తేటప్పటికి అక్కమ్మకి మనస్సు బరువెక్కింది సత్యవతీ అక్కమ్మ కలిసి పెరిగారు దూరపు బంధువులు చిన్న (బతుకు (బతకడంవల్ల అక్కమ్మ తం(డి వీరయ్య,సుబ్బారాయుడు తం(డి మునసబుగారిని ఆ(శయించి లోగిట్లోనే ఉండిపోయాడు సకుటుంబంగా తల్లిలేని సత్యవతికి పాలిచ్చింది అక్కమ్మతల్లి (బతికి ఉన్నన్నాళ్ళా లోగిలి నువ్వారాలన్నీ ఆవిడే నిర్వహించింది అక్కమ్మకీ, సత్యవతికి బలీయమైన స్నేహం, ఇద్దరికీ మరుగులు లేవు. (ప్రాణ స్నేహితురాళ్ళు కూడాను

చం(ద్రమ్మ లాంతరు వెలిగించుకు రావడానికి లోపలికెళ్లింది అక్కమ్మ మనస్సులో జ్ఞాపకాలు కదిలినయి బాధతో సుమారు నలభై ఏండ్ల(క్రితం జరిగిన గాథ అదంతా

సుబ్బారాయుడు తరుణ(ప్రాయంలో అది నెల పొడిచింది —రా(త్రి రెండు జాములయింది (ప్రపంచం పగటి వేసవి తాపం అంతా మరచి ని(ద్ర పోతూంది

తన మామూలు (ప్రకారం లేచి చేతిలో హరికేనులాంతరు పట్టుకుని గొడ్ల చావిడి అంతా కలియచూచి, ధాన్యపు కొట్ల తాళాలు లాగి చూచి, వాకిట్లో ధాన్యంగరిసెలచుట్టూ తిరిగి వచ్చి, చెప్పులు వదలి మండువాలో మంచం మీద పండుకోబోతున్నాడు సుబ్బారాయుడు ముందరి వాకిట్లో ధాన్యంపాతర మీద వరి గడ్డిమీద చాపలు పరిచి పండుకున్న చింతాలూ, నల్లిగాడూ పెట్టే గు(ర్రు తప్ప అంతా నిశ్శబ్దం ఒక్కసారి చిన్న గాలి గట్టిగా విసిరింది—ఇంటి ముందర తామర గుంటమీదనించీ పెద్ద గుమ్మానికి కట్టివున్న కొంచంగా ఎండిన మామిడాకుల తోరణాలు ఆ చిరుగాలికి 'గలగల' మన్నయి ఎక్కడో చిన్న అడుగుల చప్పుడైంది. పండుకోబోయే సుబ్బరాయుడు తిరిగి లేచి కూచున్నాడు మరి కాస్త ఆలకించాడు అవును అడుగులే! అడుగులు ముందరి వాకిట్లోకి వస్తున్నాయి—ధాన్యం పాతర వద్దకే లాగుంది. గరిసెల సుమారున

అగినట్టుగ వున్నాయి వూళ్లో దొంగల ముఠాలు తిరుగుతున్నట్టా వినికిడి సుబ్బారాయుడు బస్తాలమీదవున్న వెండి పొన్నుకర్ర చేతపట్టుకుని తెరిచివున్న తలుపులోంచి బయట కొచ్చాడు గరిసె దగ్గర ఎవ్వరూ లేరు

ఒక్కసారి గొంతు సవరించుకుని "ఎవ్వ రదీ?" అన్నాడు దృఢంగా ఎవ్వరూ పలకలే మళ్లీ పిలిచాడు అంతా నిశ్శబ్దం కాని గరిసెకి అవతల ప్రక్కగా, గాలికి బట్ట రెపరెప కొట్టుకుంది సుబ్బారాయుడు ధైర్యం చేసుకుని గరిసెకి అవతల ప్రక్కగా వెళ్లాడు "ఎవ్వరది?" వాడిన పువ్వుల వాసన కొట్టింది ఆప్రక్క వేపచెట్టు నీడ బడుతూంది ఆ నీడలో మసక వెన్నెలలో ఒక స్త్రీ రెండు చేతులతోనూ ముఖం అంతా కప్పుకుని వుంది ఈసారి "ఎవరు నీవు" అని గర్జించాడు బదులు లేదు కాని ఆ అరుపుకి, ఇంటికి దూరంగా మొండి తాడిచెట్టుకి రెండు పలుపులతో కట్టేసిన కారుదున్న ఒకటి తలకాయ క్రిందకి చాపి హా! హు! అని అరిచి ముందరి కాలుతో కోపంగా నేలని వెనక్కి త్రవ్వింది, నాలుగైదు సార్లు. బండెడు దుమ్ము లేచింది. పలుపు తెంపుకోడానికి ప్రయత్నించింది. సుబ్బారాయుడు అక్కడే ఆగాడు—ఒక్క క్షణం. ఆ స్త్రీని పరకాయించి చూచాడు ఆవిడ తల్లోవాడిన ఎర్ర బంతి పువ్వు, బొగడ చెండూ ఆ మసక వెన్నెలలో కొంచెం నల్లగా కనిపించినయి ఇంకా దగ్గరగా వచ్చాడు సుబ్బారాయుడికి అనేక తలంపులు ఒక్కసారిగా వచ్చాయి

"సత్యవతీ!" అన్నాడు

"అన్నా! నేనే" సత్యవతి దీనస్వరం వినేటప్పటికి సుబ్బారాయుడికి, మనస్సు కరిగిపోయింది వెంటనే భయం కూడా కలిగింది

"కూడా వచ్చిం దెవరు?" లన్నాడు సత్యవతి మాట్లాడలేదు ఇంత అర్ధరాత్రి సత్యవతి ఎందుకొచ్చింది? ఎల్లా వచ్చింది? ఏ మాపద కలిగిందో? ఏ మాపద కలుగుతుంది?

పెండ్లిఅయ్యి రెండువారాలే గదా అయింది పందిరైనా విప్పలేదే! ఎంత ఆపద అయితే మాత్రం అర్ధరాత్రిపూట, ఆడకూతురు ఇల్లు విడిచి నడిచి రావడమా—ఇంత దూరం! అందులోనూ అత్తవారిల్లు విడిచి పుట్టింటికి ఏమి అఘాయిత్యం! భూమి పుట్టి నప్పటినించీ ఈ ఇంట్లో ఆడవాళ్లు ఇట్లా చేశారా? అట్లాని ప్రపంచంలో ఎవ్వరైనా విన్నారా! రేపు ప్రొద్దున్న నలుగురిలో తలఎత్తుకోడం ఎట్లాగ! సుబ్బారాయుడు కోపం ఆపుకుని "లోపలికి రా" అన్నాడు అన్నా చెల్లెలూ ఎదురుపడి మాట్లాడుకోడం అరుదు—అందులోనూ అతను పెద్ద వాడైన తరువాత అసలు ఆ మాటకొస్తే, పెద్దన్న గారితో అతని ఆరుగురు తమ్ముళ్లూ బదులు మాట్లాడరు పిలవకుండా ఎదురుగా రారు అతను చావిట్లో వున్నంతసేపూ ఆడపిల్లల గొంతులు బయట ఆ ప్రాంతాల్లో వినిపించవు పైగా పెద్దబ్బాయంటే తండ్రి మునసబు గారికే, అదొక మోస్తరు

సత్యవతి ఆడవాళ్లంతా పడుక్కున్న రెండో మండువాలోకి వెళ్లింది మండువాలో తూర్పున వసారాలో సత్యవతి గదిముందు వ్రేళ్లాడగట్టిన పంజరంలోనించీ చిలుక సత్యవతిని చూడంగానే పాట మొదలెట్టింది, కీచు గొంతులో—

"వచ్చేవు పోయేవు ఓ రామ చిలుకా
అలరాస పుట్టిళ్లలా వార్త లేమి?
పట్టు చీరలు కొన్నారు వణతి మీ యన్నలు
వనిత మీ యన్నలూ వచ్చుచున్నారు"

నడిరేయి ఈ సందడికి పండుకున్న వదినెలు లేచారు "ఇదేమి ఆగడమమ్మా! ఎప్పుడూ ఎరగం ఈ విచిత్రం పేరూ, ప్రతిష్ఠలూ మన్ను గలిశాయి" అన్నారు "నలుగురు నోళ్ళల్లో వేస్తావుంది నాయనా ఈ ఇంటిని మిగత ఆడపిల్లలికి పెళ్ళిళ్లు ఎట్లా అవుతయి ఇక?" అంది సత్యవతి మారుతల్లి ప్రక్కమీదలేచి కూచుని విసెన కర్ర చేత్తో అందుకుంటూ ఈ మాటలకి మారుటి చెల్లెళ్లు నలుగురూ లేచారు, ఆవిలిస్తూ, విరుచుకుంటూను సవితి తల్లి చావిట్లో పెద్ద మంచంమీద పండుకున్న మునసబుగారి చెవిలో, అప్పటి కప్పుడే వెళ్లి వూదేసింది ఆయన ప్రక్కగానే మడత మంచంమీద పండుకున్న వీరయ్యా లేచాడు దిగ్గున ప్రక్కనవున్న తువ్వాలుతో మెడ చెమట తుడుచుకుంటూ పై మేడమీద పండుకున్న మునసబుగారి కొడుకులందరికీ కూడా తెలిసింది ఆ రాత్రి మునసబుగారి ఇం ఎవ్వరూ నిద్రపోలేదు

అక్కమ్మ వచ్చింది సత్యవతి గదిలోకి అక్కమ్మని చూచి కళ్లు తుడుచుకుంది సత్యవతి. అక్కమ్మ తలుపు జారగిలవేసి దగ్గిరగా వచ్చి కూచుంది. "బయటదారులన్నీ దొంగలు తిరుగుతున్నారంట ఎట్టా రాగలిగేవు సత్యవతీ?" అంది "ఇవిగో అందెలూ, కడియాలూ దారాలతో కట్టాను మోగకుండా. మిగతా నగలన్నీ తీసేసి వాళ్లింట్లోనే పారేశాను" అంది సత్యవతి తలవంచుకుని కొంచెంసేపు ఇద్దరూ మౌనం "ఏమయింది?" అడిగింది అక్కమ్మ. సత్యవతి ఇంకా తలవంచుకుంది "నిన్న సాయంత్రం నన్ను బలవంతంగా ముస్తాబు చేశారు పడకింటివేపు తొంగిచూడనైనా చూడకుండా నేను పారిపోయి వచ్చేశాను. అక్కమ్మ, తన పవిట కొంగుతో సత్యవతి కళ్లు అద్దింది, "యేటికి ఎదురీదడం కష్టం సత్యవతీ" అంటూ

మరునాడు మధ్యాహ్నంవేళకల్లా అత్తవారి పాలేరు వచ్చాడు

చింతాలు సవ్వారి బండి కట్టాడు వీరయ్య, అక్కమ్మా సత్యవతి కూడా దిగబెట్టడానికి బయలుదేరారు అత్తవారి ఇంటో

"అసలు ఆడదానికి ఇష్టమూ, అయిష్టమూ ఏంటి?" అంది సవితి తల్లి "పరువు ప్రతిష్ఠలుగల కొంప బయటి కీడ్చకు తల్లీ" అన్నారు మునసబుగారు, నిమ్మళంగా దగ్గుతూ "తిరిగి వచ్చావా, గడప కడ్డంగా నరికేస్తాను" అన్నాడు కోపంగా సుబ్బారాయుడు

బండిలో ఎవ్వరూ పైకి మాట్లాడలేదు తన కష్టాలన్నీ మనస్సులో తలపోసుకుంది సత్యవతి ఒక వారం దినాలకిముందు ఇల్లాగే చడీ చప్పుడూ లేకుండా అత్తవారి ఇంట్లోంచీ చీకటి కడ్డం పడ్డది. ఎక్కడా మనుష్య సంచారం లేదు పండిన చేల ప్రక్కనించీ బళ్లదారిని నడిచింది కొంతదూరం వచ్చేసరికి వెన్నెల వచ్చింది ఎంతదూరం చూచినా వెన్నెల వెలుగులో అనంతంగా పొలాలు తప్ప మానవుడు కనిపించలే పొలాల్లో ఎక్కడో ఒక నక్క అరుస్తూ, పరుగెట్టింది తన కాళ్ళ అడుగుల చప్పుడు తనకే పెద్దగా వినిపించి, అఖరుకి గోనలేరు, దగ్గరికివచ్చింది—అడ్డు ఉరిని వేసవిలో ఏరు ఎండి నీళ్ళు నడుము వరకే వస్తాయి ఏరు శాంతంగా ప్రవహిస్తూంది అలలమీద చంద్రుడు మెరుస్తున్నాడు కాని వెంటనే భయం వేసింది నీళ్లలో కాలుపెట్ట బుద్ధి కాలేదు—ఒంటరిగా తన చిన్న తనపు భయం ఇంకా వుండిపోయింది ఈ గోనలేట్లోనే చాలా భయపడ్డది ఒకసారి బాల్యంలో మూడు రోజులు జ్వరం కూడా వచ్చింది అప్పుడు ఒకనాడు రోహిణి కార్తె ఎండలకి, భూమి మాడి మాడి వుంది ఆనాడు మృగశిర కార్తె వచ్చిన క్రొత్త కాలవలు వదిలే రోజులు ఎవ్వరూ చూడకుండా అక్కమ్మా తనూ ఆ యేట్లో దిగారు, ఒడ్డున ఆడుకోడానికి ఇంకా దిగువని, ప్రక్కవూరి పిల్లలు, తడి ఇసక ముద్దలు మీదజల్లుకుంటూ ఆడుకుంటూన్నారు కాలువకి ఎగువనించీ క్రొత్త నీళ్ళు వస్తున్నాయి వీళ్లు ఎవ్వళ్లూ చూడలేదు నీళ్లు చిక్కగా ఎర్రగా బురదతో నురగలతో పొర్లుకుంటూ వస్తూన్నాయి వీళ్ళని దాటుకుంటూ పోతూన్నాయి పిల్లలు కాస్త ఇంకా ఒడ్డుకి తప్పుకున్నారు చెట్లమొద్దులూ, విరిగిన పచ్చి చెట్ల కొమ్మలూ అన్నీ నీళ్లలో కొట్టుకొస్తూన్నాయి ఒడ్డుకి తప్పుకోబోతున్న సత్యవతికి ఒక ముళ్ళకంప నీళ్లలో గీచుకుపోయింది ఆ గాయాలు తడుముకుని, తల పైకెత్తే లోపుగా నీళ్లలో ఒక ఆడమనిషి చెయ్యి కనిపించింది గాజులతో సహా ఆచేతి ప్రక్కనే నల్లటి జుట్టూ నీళ్లమీద సగం మునిగీ సగంతేలీ చేతితోసహా ప్రవాహవేగంలో, యేటి మధ్యనుంచీ వెళ్లిపోయింది క్షణంలో కళ్ళముందు ఆశవం ప్రవాహవేగమూ, ఇప్పుడు జ్ఞాపకంవచ్చి ముచ్చెమటలు పోసినయి కాళ్లు శక్తిహీనమై మడతలు బడ్డాయి ఒక నిమిషానికి ధైర్యం తెచ్చుకుని, కాళ్లు నిలద్రొక్కుకుని వచ్చిన దారినే వెనకకి తిరిగింది—వెనక్కి తిరిగి చూడకుండా గబగబా నడిచింది అత్తగారు అప్పుడే లేచి పెరట్లోకి వెళ్లి వస్తూందనుకుని "ఒంటరిగా ఎందుకు లేచి వెళ్లా"వంది.

ఈ ఆలోచనలూ, భయాలతో అత్తవారిల్లు సమీపిస్తూంది—బండికీ, బండిలో సత్యవతికీ

ఇక్కడ పాలూరులో బండి వెళ్తున్న దారే చూస్తూ నిలబడ్డాడు సుబ్బారాయుడు బండి పది బారలు పోయాక వెనక్కి తిరిగాడు—లోగిలి వేపు అరుగుమీద కూచుని అరుగు క్రిందవున్న పెంపుడు లేళ్ళు గౌరీ, రాజాలకి మేత గడ్డి మేపుతున్నాడు లోపలినించీ కొండలయ్య వచ్చాడు. అమ్మవారి కొలువుల ఖర్చుల వివరాలకి, ఉత్సవాలకి ప్రభలకీ అయ్యే రొక్కం విషయం అంతా మాట్లాడి, ఇనపపెట్టె తాళం తీసుకుని లోపలికి వెళ్ళాడు కొండ లయ్య దూరపు మేనల్లుడు, ఆశ్రితుడు కూడాను, మునసబుగారికి ఈ వ్యవహారాలన్నీ చూచే బాధ్యత ఈ మధ్యనే సుబ్బారాయుడు తలమీద పడ్డది. మునసబుగారి వయస్సు క్రుంగిన తరువాత ఈ నిర్వహణ అంతా చెంగల్వరాయుడు మోశాడు అతని పేరు జ్ఞాపకం రాంగానే కొంచెం కళ్ళెర్రనైనాయి ఏమి అభిమానం! "వెళ్ళేటప్పుడు డబ్బిస్తే పుచ్చుకోలే! వద్దంట!" ఇంకా ఇంట్లోనే వుంటే ఇంకా ముదురును వ్యవహారం. ఎందుకైనా మంచిది పంపించెయ్యడం! ఇంకా నయం ఇంతగల ఇంటికి ఎంత అప్రతిష్ఠ బయట ఎక్కడైనా ఏమన్నా మాట పుట్టుకొచ్చిందంటే! ఇక చావాలిసిందే!

చేతిలో గడ్డి అయిపోయింది. అరుగుదూకి చావిట్లోకివెళ్ళి కొయ్య పడక కుర్చీలో కూచుని లంకపుగాకు చుట్ట చుట్టుకుంటున్నాడు కొంచెం మనస్సు నెమ్మదిగా గుమ్మం ముందరనించీ గవిడిపోతుల్ని బీడుకి తీసుకెళుతున్నాడు నల్లిగాడు సుబ్బారాయుడు "ఒరే నల్లిగా నెమళ్ళకి మేతపెట్టావుట్రా?" అని అరిచాడు అతని గొంతు వినగానే, జతలో ఒక కారుదున్న హు! హు! అని కొమ్ములు పైకిపెట్టి, తల నేలకి వంచి, ముందర కాళ్ళతో వెనక్కి నేల దువ్వడం ఆరంభించింది—పలుపులు త్రెంచుకోడానికి ప్రయత్నిస్తూ మిగత పాలేళ్ళు కూడా పరుగెత్తుకుంటూవచ్చి, పలుపులు బలంగా లాగి తీసుకుపోయారు మేతకి నల్లిగాడివల్ల ఒక్కడివల్ల కాలేదు దున్నపోతుని ఆపడం అతను ఉన్నంత కాలమూ, అతను ఒక్కడు ఆదున్నను అదుపులో పెట్టగలిగేవాడే, ఇప్పుడు నలుగురు కావలసి వచ్చారు తిరిగి చెంగల్వరాయుడే గుర్తుకొచ్చాడు సుబ్బారాయుడికి మనిషి ఏమంత వీళ్ళందరికంటె బాలాఢ్యుడేమీ కాదు కాని అదేమి మాయో "దా దా" అంటూ అతను దగ్గర వెళ్ళేసరికల్లా ఆ పాపిష్టి దున్న తల పైకెత్తి కాళ్ళ దువ్వటం ఆపేసి పసిపిల్ల చూచినట్టూ చూచేది

సుబ్బారాయుడులేచి, గొడ్లచావిడిఉన్న పెద్ద దొడ్లోకి వెళ్ళాడు. దొడ్లో వరిగడ్డ మేటుల్లో గడ్డి మీదేసుకుని ఆటలాడుకుంటున్న పాలేళ్ళ పిల్లలందరూ ఎక్కడ వాళ్ళక్కడ మీదవున్న వరిగడ్డి కదల నీయకుండా గప్‌చిప్‌గా ఉండి పోయారు సుబ్బారాయుడు వెనక చేతులు కట్టుకుని తలవంచుకుని ఆలోచనగా, నిమ్మళంగా అడుగులు వేస్తూ, ఇంకా దొడ్డి లోకలికి వెళ్ళాడు. పందెపు కోడిపుంజులకి తవుడు కలిపిపెడుతున్న చిన్న పాలేళ్ళ లేచి నుంచున్నారు కాని సుబ్బారాయుడు అక్కడ కూడా ఆగకుండా ఇంకా వెళ్ళాడు చిన్న చావిట్లో ఏడు సంవత్సరాలు చెంగల్వరాయుడు పండుకున్న మడత మంచం జార వేసివుంది చావిట్లో ఒక ప్రక్క కప్పుకంటుకుంటూ పేర్చిన తుమ్మ మొద్దులు పరుకు మొద్దులుఉన్నాయి, సువ్వారాలకి పెద్ద గొడ్ల చావిట్లో ఆరు లేగలు మూతులకి చిక్కాలు కట్టుకుని పండుకుని వున్నాయి నాలుగు మునలి యెద్దులు కట్టు కొయ్యలవద్ద పండుకుని నిమ్మళంగా నెమరు వేస్తున్నాయి—లేవలేక రోజులు లెక్కపెట్టుకుంటున్నట్టుగా పెద్దయెద్దు వీపుమీద జోరీగని చేత్తో కొట్టేశాడు ఎద్దు తృప్తిగా ఎత్తలేక ఎత్తలేక తల పైకెత్తి చూచింది ఆ కట్టు కొయ్యల దగ్గిరినించీ, పావురాయి గూళ్ళ దగ్గిరకెళ్ళి పావురాలుని బయటకితీసి, ఒక్కొక్కటే ఎగరవేశాడు పావురాలు కాళ్ళ అందెల రవళితో "గలగల మంటూ ఆకాశంలోకిగుంపుగా ఎగిరి మొగ్గలేస్తున్నాయి" సుబ్బారాయుడు ఒక తుమ్మ మొద్దుమీద కాళ్ళు దగ్గరగా తీసుకుని కూచున్నాడు, తృప్తిగా చుట్ట పీలుస్తూ పాలేరు ఒకడు బుట్టెడు పెసలు పావురాల మేతకోసం తెచ్చి అతనికాళ్ళవద్ద పెట్టి వెళ్ళిపోయాడు "ఛఛ పేరూ ప్రతిష్ఠ! ఈసారి తిరిగి రానియ్యి చెప్తుతా!" అన్నాడు తనకు తానే పండ్లు బిగించి, కనుబొమ్మలు చిట్లించి.

* * *

అక్కమ్మ మనస్సులో ఈ గాథ ఇంకా నడుస్తూనే వుంది. పైకి మాత్రం ఏమీ మాటాడడంలేదు చంద్రమ్మ కూడా మాట్లాడకుండా కూచునేవుంది. ఇద్దరి మధ్యా లాంతరు వెలుగుతూంది దూరాన్న కుక్కలు మొరిగినయి తామర గుంటలో కప్పలు ఇంకా పెద్దగా అరుస్తున్నయి. ఇంకో రిక్షావచ్చి ఆగింది గుమ్మంముందు సుబ్బారాయుడి మూడో తమ్ముడూ, అతని భార్య, మను మడూ వచ్చారు వాళ్ళని తీసుకుని లాంతరు చూపిస్తూ, అక్కమ్మ చంద్రమ్మా లోపలికి వెళ్ళారు

"అన్నా అన్నా ఇదిగో చూడు. కళ్ళు తెరువు. చిన్నన్న వచ్చాడు" అంది అక్కమ్మ సుబ్బారాయుడు నుదురుమీద చెయ్యి వేస్తూ. "ఎవరు నువ్వు? సత్యవతా? ఆ!" అంటూ కళ్ళు కొంచెం తెరిచిచూచి "నీవా అక్కమ్మా వచ్చావా?" అన్నాడు "అ వచ్చానన్నా". "సత్యవతి ఏదీ? ఇంకా రాలే" కొంచం ఆయాసంగా అడిగాడు అక్కమ్మ కళ్ళు తుడుచుకుంటూ, ఒక చాప పరిచింది, వచ్చిన వదినగారిని కూచోమంటూ. చంద్రమ్మ గోడకి ఆనించి వున్న బెంచీమీద, దుమ్ము దులిపి, చిన్నన్నగార్ని మనుమణ్ణీ కూచోబెట్టింది.

మళ్ళా బయట కొస్తూంటే మండువా వసారాలో తగిలించివున్న పాత చిలక పంజరం, అక్కమ్మతలకి తగిలింది. చిలుకలేదు. పంజరము మాత్రమే ఉంది. ఆ చిలుకమీద చెంగల్వరాయుడు జ్ఞాపకం వచ్చాడు తిరిగివచ్చి బయట అరుగుమీద కూచునివున్న అక్కమ్మకు. పంజరాన్ని చూడకపోయినా జ్ఞాపకం రాక తప్పదు. అతను పుట్టిందెక్కడ! వచ్చిందెక్కడికి? ఈలోగిలి సిరిసంపద లతో, అతని బ్రతుకు పెనవేసుకుపోయింది. విధి నిర్ణయాలు, భగవల్లీలలు, ఎంత విచిత్రం! "ఆ చెంగయ్య ఎక్కడున్నాడో పాపం! సత్తవతమ్మగారిని తల్చుకొంటే ఆయన మతి కొత్తారుండి .ఆయనా మా దొడ్డ మడిశుండి వూరంతా అట్టుడికినట్టూ ఉడికిందిగిందా!" అంది చంద్రమ్మ సగంపైకి వినబడుతూ సగం తనలో తానే ఎదురుగా స్తంభాన్ని ఆనుకుని కూచుని తల గోడకి జేరవేసి కూచున్న అక్కమ్మకి మరికొన్ని గడచిన దృశ్యాలు మనసులో మెదిలాయి

*　　　　*　　　　*

అప్పుడు సుబ్బారాయుడికి మంచి ప్రాయం. సత్యవత్తి గాలిలో వువ్వు ఎగిరినట్టూ, బంగారు జడ కుచ్చులతో కాళ్ళ గజ్జెల తోడాలతో, చేతి కంక ణాలతో, లోగిలి ఆవరణంతా ఎగిరి, ఆడుతుండేది—ఎనిమిది సంవత్సరాల వయస్సు

చెంగల్వరాయుడు వచ్చింది ఒక ఉదయం. చేతిమీద బాగా గీచుకు పోయిన గాయాలున్నాయి. పచ్చిరక్తం చారికలున్నయి చేతిమీద. చెయ్యి కొంచెం పైకి ఎత్తి పెట్టుకున్నాడు ప్రక్కన ఇంకా బండ్లవాళ్ళు నించుని వున్నారు మనసబుగారి చావిట్లో మునసబుగారు మంచంమీద కూచుని వున్నారు. సుబ్బా రాయుడు వచ్చి పడక కుర్చీలో కూచున్నాడు ఒక బండీవాడు చెబుతూ వున్నాడు "ఇందాకుండీ పొద్దుటేల చెరువు ప్రక్కనుండీ, ఈయనగారు చెట్టె క్కాడుండీ, వణ్ణం చేసుకోటానికి—ఎండు కొమ్మలగ పడతా వుండాయి పైన. ఆయనేమో చెరువులో తపేలాతో నీలు ముంచాడుండీ, ఈయనగారి తండ్రి మా ముసిలాయనలెండి. ఒడ్డుకు చేరాడుండి. అంతే! "రామా" అన్నాడుం నేలమీద కూలబడిపోయాడు మరి ఏమన్నా వురుగే కుట్టిందో ఏమోనుండి. మేమంతా దగ్గిరికి, లగెత్తేతలిక, ఈయనగారు చెట్టుమీదనించి కిందకి గాబ రాగా దూకబోయాడండి చెట్టుమీద ఎండిన కొమ్మ ఒకటి ఇరిగి చేతి అద్ద మీదనించీ దూసుకుపోయిందండీ సూడండి ఈనెత్తురు మామంచోరుండీ ఇదుగో ప్రక్క ఇంటోరిని అడిగాముండీ కామందులుపొలంలోకెల్లారుకాస్తఆగమన్నారుండి. తవురుదయచేయించాలుండి తెచ్చినదాన్నంతెచ్చినట్టుగానేఉండాది.రొక్కంలేకపాయె. ఏదోఇంటికోపువ్వేత్తే ఈస్పరుడికి ఒకమాలన్నారు కదాండి" అంతవరకూమౌనంగా వున్న సుబ్బారాయుడు "అట్టాంటిదేమీ అక్కరలేదు. అంతా మేమే చూస్తాం ఇంకొకళ్ల ప్రసక్తి ఏంటి. అక్కర్లేదు. మనకి అలవాటూ లేదు" అన్నాడు కఠినంగా.

అంతవరకూ ఏదో మైకంలోవున్న చెంగల్వరాయుడు "ధాన్యం ఏదో ధరకట్టి మీరే తీసుకోండి" అన్నాడు సుబ్బారాయుణ్ణి. సుబ్బారాయుడు కొంచెం వెటకారంగా చిరునవ్వు నవ్వాడు చిన్నగా "నీ పేరబ్బాయి?" అడిగారు మున సబుగారు. "ఇనుగంటి చెంగల్వరాయుడండి" "ఇనుగంటా?" అన్నారు మున సబుగారు తిరిగి ప్రశ్నార్థకంగా "మా వూళ్లో ఈఊరిని ఎరగనోళ్లంటూ లేరుండి బాగా బతికిన వోమారాజులేనుండీ తమురికేమన్నా బందుగులేవోనుండీ, సుట్టరికాలు తిరగెత్తే." అన్నాడు కూడా వున్న బండివాడు "కాదు కాదు" అన్నాడు, పడక కుర్చీలోనించి సుబ్బారాయుడు—కత్తిలా. చెంగల్వరాయుడు చటుక్కున తల పైకెత్తాడు నల్లటి గిరజాలు ముందర కళ్లల్లోనించీ. వెనక్కి చెదిరినయి "ఇనుగంటారు అన్న పేరు ఎక్కడో విన్నట్టుగావుంటే" అన్నారు మునసబుగారు. లోపలినుంచీ ఆటల్లో వగర్చుకుంటూ, అప్పుడే గుమ్మంలోకి వచ్చిన సత్యవతి అతన్నిచూచి అట్టే ఆగిపోయింది. మౌనంలో మాటలాగు అతని ముఖంలో ఆగివున్న దుఃఖాన్ని చూచి, చైతన్యం లేనట్టూ అయిపోయింది. చంగల్వరాయుడు ఒక్క క్షణం సజీవంగా చూచాడు—సత్య వతి కేసి

"తోబుట్టువులూ, అన్నదమ్ములూ ఎంతమంది?" అన్నారు మునసబు గారు. "ఈయన ఒక్కడే సంతుండి కొండ్ర గట్రా ఏమీ లేదు ఉప్పుడు అంత పోయింది, ఒట్టి కొళ్లకే చేత్తావుండారు ఇటుపక్క బత్తిలో, మరి కాసిన రాళ్లు గిట్టుబాటు అవుతయ్యన్నారు. అందుకని మాతోపాటు ఆయనా బండి కట్టుకొచ్చారుండి" అన్నాడు వెంటవున్న మరొక బండివాడు ఈలోపుగా సత్య వతి తడిసిన గుడ్డ ఒకటి తీసుకొచ్చి గుమ్మంలోనించి చెయ్యి చాపింది. ఎవ్వరూ అందుకోలే సుబ్బారాయుడు "సత్యవతీ! ఏంటది!" అని గర్జిం చాడు. గుమ్మంమీదనే ఆ గుడ్డపెట్టి సత్యవతి వెనక్కి పారిపోయింది రెండంగ లలో చెంగల్వరాయుడు ఆ గుడ్డ అందుకుని, చేతినున్న రక్తపు చారికలు తుడుచుకున్నాడు.

తబిశీళ్లన్నీ తెలుసుకున్నమీదట "ఇక్కడే ఉండిపో అబ్బాయీ పాపం! మంచీ చెడ్డా అంతా మేమే చూస్తాంలే భయంలేదు" అన్నారు మునసబు గారు.

చనిపోయిన తన తండ్రికి దహన సంస్కారాలు అన్నీ మునసబుగారే చేయించారు, లోగిట్లో. ఆ ధాన్యం అమ్మించి, ఆ రొక్కం దగ్గరే ఉంచుకో మన్నారు చెంగల్వరాయుణ్ణి

ఆనాటినుంచీ మునసబుగారికి కుడి భుజంలాగ మునసబుగారి లోగిట్లోనే ఉండిపోయాడు చెంగల్వరాయుడు

చెంగల్వరాయుణ్ణి చూచినప్పటినుంచీ సత్యవతికి కన్నతల్లి తిరిగి లేచి వచ్చినట్టుండేది. పొలంవెళ్లినా, బయటికెళ్లినా సత్యవతి కిష్టమైనదేదైనా ఒకటి తెచ్చి ఇచ్చేవాడు, చెంగల్వరాయుడు సత్యవతి జ్వరం పడి లేస్తే సోలెడు గుమ్మపాలు తెచ్చి సత్యవతి మంచందగ్గర స్వయంగా పెట్టేవాడు ఎవ్వరైనా అడిగితే, గుమ్మపాలు వంటికి మంచిదమ్మా అని సమాధానం ఇచ్చేవాడు రోజులు గడుస్తున్నాయి.

సత్యవతి పెద్దదయింది. గడప దాటనివ్వడంలేదు. ఇంటో పెద్ద వాళ్ళూ, సంప్రదాయమున్నూ కాని సత్యవతికి మాత్రం చెంగల్వరాయుణ్ణి తల్చినంతనే దేవగానం వినిపించినట్టుండేది అతను ఎదుట ఉన్నంతసే పూ తవముఖానికి వన్నెలు వచ్చేవి

ఒకనాడు చెంగల్వరాయుడు ఎప్పట్లాగు పొలంలో పాలకోడు ఒడ్డుగా పెరిగిన పెద్ద పెద్ద మల్లిపొదలలోనించీ, దోసెడు మల్లిమొగ్గలు తెచ్చాడు ఉత్త రీయంలో. "ఆ దుబ్బుల్లో పాము వుందంట ఎందు కక్కడికి పోతావు? ఈ పువ్వులు లేకపోతే పోయిందిలే వెళ్లొద్దు" అంది పువ్వు లందుకుంటూ సత్యవతి. "నన్నేపాముా ఏమీ చెయ్యదు నీవు నా ప్రక్క చూస్తావున్నన్నాళ్లూ" అన్నాడు కళ్లు నేలకి వాల్చి. నిండు చంద్రుణ్ణి చూచి సముద్రం పొంగినట్టూ పొంగింది సత్యవతి హృదయం.

రోజులు గడుస్తూనే వున్నయి మరొకనాడు పొలంనించీ వస్తూంటే మొండి తాడిచెట్టుక్రింద ఎగరలేక పడిపోయిన చిలక పిల్ల కనిపించింది.. ఆ చెట్టు ప్రానిలో దాని గూడులోనించీ పడ్డది దాన్ని తను సత్యవతి కిచ్చాడు. ఆ ఇచ్చిన చిలుకని ఒక బుట్టలో పెట్టి అరటిపండ్లు పెట్టింది సత్యవతి.

ఆ సాయంత్రం ఇంటి ఖర్చులకిగాను చెంగల్వరాయుడు బండి కట్టుకుని సంతకి వెళ్తున్నాడు. అతను ఎప్పుడు, ఎందుకు కట్టినా తన స్వంత బండి స్వంత ఎడ్లనీ కడతాడు. కొంతదూరం వెళ్ళేటప్పటికి సత్యవతి దారి కడ్డంగా నించుంది, ప్రక్కనించీ చెట్టుకిందనించీ దూకివచ్చి. ముందర రోజు వర్షానికి రోడ్డు అంతా తడిసి పారాణి పూసుకున్నట్టుగా వుంది సత్యవతిని చూచి చెంగల్వరాయుడు నిర్ఘాంతపోయాడు "ఎందుకొచ్చావు ఇంతదూరం? తిరిగి నిన్ను ఎట్లా తీసుకెళ్ళడం ఇంటికి?" అన్నాడు, చిరునవ్వు, భయం కలిసి. "ఏం భయం లేదులే నన్నెవ్వరూ ఈ చుట్టుపట్ల ఏం చెయ్యలేరు నే నందరికీ తెలుసుగా ఇక్కడ నీవు మాత్రం భద్రంగా వెళ్లిరా" అంటూ తన తలలో వాడిపోయిన మల్లెపూలచెండ్లు తీసి ఎడ్ల కొమ్ములకి కట్టింది "ఇదిగో అమ్మవారి కుంకం" అని చెంగుముడిలోవున్న కుంకం తీసి నించునివున్న అతనికి బొట్టుపెడుతూ "నీకూడా నే నుండనుగా సంతలో అమ్మవారే కాపాడుతుందిలే అందుకనే ఇది" అంది చెంగల్వరాయుడు హృదయంలో పువ్వులు వికసించి, కళ్లలో తేనె లొలికినయి

ఆ సాయంత్రం, తిరిగి వచ్చేటప్పుడు, చిలకకి ఒక పంజరమూ, గోధుమ పూసలూ తెచ్చాడు సత్యవతికి. ఈ పెరుగుతున్న మైత్రి సుబ్బారాయుడికి అంత నచ్చలేదు. కళ్లు చిట్లించాడు వదినలు 'రుస రుస' లాడారు.


మరో సంవత్సరం పైబడుతూంది ఒకనాడు రవికె అంచులకి చెంగల్వరాయుడు తెచ్చిన గోధుమపూసలు కుట్టుకుంటూ, చిలకకి పాటలు నేర్పుతూంది, సత్యవతి. మధ్యాహ్నం ఎండకి నిద్రపోతున్న సుబ్బారాయుడు త్రుళ్ళిపడి లేచాడు "ఏం సత్యవతీ, ఏంటీ శని! ఈ చిలుకని ఎప్పుడో పీక పిసికేస్తాను. ఏం గోల నిద్ర లేకుండా!" అని అరిచి ఛటాలునలేచి బయట కెళ్లిపోయాడు క్రొత్తగా కొన్న కారెదున్నల జతని కట్టేస్తున్నాడు చింతాలు దున్నపోతులు గున్న ఏనుగులలా గున్నయి—ముక్కులు కుట్టారు చింతాలుని ముప్పతిప్పలు పెడుతూన్నయి ఇంట్లోకోపంమీద చావిట్లోకి వచ్చిన సుబ్బారాయుడు చెట్టుకు నిలబడివున్న దుక్కి కర్రతీసి, దున్నల్ని ఒక్క పెద్ద దెబ్బ వేశాడు జతలో ఒకపోతుకి నడుంమీద పడ్డది దెబ్బ దున్న దద్దరిల్లిపోయింది అప్పటినించీ, ఆ దున్న మరీ పొగరుమోతు అయింది సుబ్బారాయుడుగొంతు వినిపించినా, నీడ మీదపడినా అతన్ని చిరెయ్యడానికి చూస్తోంది పగపట్టింది, అతనిమీద

"దోసెడు ముత్యాల్లోనూ, దోసెడు రత్నాలలోనూ పుట్టావు నువ్వు నేనంటే, ఎందు కిట్లా నీకు?" అన్నాడు చెంగల్వరాయుడు ఒకనాడు—పై కొమ్మలనించీ ఎర్ర మందారపువ్వులు కోస్తూ పువ్వులకోసం దోసిలి పట్టి పైకి చూస్తూ, ప్రతిమలా నించుంది సత్యవతి

"నా పుట్టుక మాటకేంగాని, నాకు నివ్వే పుట్టెడు బంగారం" అంది కొంచెం కొంటెగా "నేనూ ఆలోచిస్తూవుండా నాకు చిన్న తాత కొడుకు వుండాడు—నాకు పినతండ్రి, ఆయనతో నీకోసం అడిగిద్దామని. ఎట్లొచ్చి డబ్బు సంపాదించాలి అదే చిక్కు" అన్నాడు విచారంగా

ఒకనాడు సుబ్బారాయుడుతో "వయస్సువచ్చిన పిల్ల అతగాడితో ఈ సఖ్యం ఏంటండీ?" అంది ఆయన భార్య అతను ఉలిక్కిపడ్డాడు కోపంగా చూచి వూరుకున్నాడు కాస్త ఆగి "ఏం ఎవరన్నా ఏవన్నా అన్నారా ఊళ్లో?" అన్నాడు

తన మేడమీద గదిలో ఒక్కడే పచారుచేస్తున్నాడు. ఆనాడు ఆ నగల మూటవిషయమూ అంతేగా, ఈ పేరుప్రతిష్ఠల కోసమేగా అంత భయపడ్డది? ఆ రోజు ఎవ్వరూ వెళ్లని, ఆ మల్లిదుబ్బల దగ్గరకి ఎందుకు వెళ్లడం? ఆ చెంగల్వరాయుడు—దానికి పువ్వులకి అంటే, ఆ సత్యవతికి. ఎవ్వరో దొంగాళ్లు దాచిపెట్టుకున్న ఆ నల్లగుడ్డమూట వాడి కంటబడ్డది.. అనుకుంటూ తిరిగాడు తనలో తాను ఆనాడు ఆ మూట దొరికిందని మల్లిపొదలో పెట్టారనీ, వచ్చి సుబ్బారాయుడితో చెప్పాడు—చెంగల్వరాయుడు సుబ్బారాయుడు వళ్లంతా వణకిపోయింది "మన పంట బోదెలోనా? మన పొలంలోనా? దొంగల సొమ్ము! రెండోకంటివాడికి తెలియనివ్వద్దు" అని



అమూట మోయించుకెళ్లి గోవలేట్లో వదిలేయించేశాడు లోకనింద ఏదైనా ఎట్లాగ భరించడం? ఎందుకైనా మంచిది, ఈ చెంగల్వరాయుణ్ణి వదుల్చుకోడం మంచిది కిటికీలోనుంచీ చూస్తూ నిలబడ్డాడు. ఎదురుగా తామర గుంటలోనించీ మునసబుగారి గూసుబాతులు ఈదుకుంటూ ఒడ్డు చేరుతున్నాయి. గట్టుమీద వెళ్తున్నవాళ్ళని పొడవడానికి మెడలు బారెడేసి చాచుకుంటూ మునసబుగారి రాశికావలి కుక్కలు, చెరువు గట్టుమీద తోకలమీద కూచుని నీళ్ళ చూస్తూ ఈగల్ని నాలికతో పడుతున్నాయి. చుట్టూ పచ్చ చేలన్నీ పసిరి కప్పినట్టున్నాయి

ఆ రాత్రి పొలంలోనించీ రాంగానే వీరయ్య చెప్పాడు, రమ్మన్నారని చెంగల్వరాయుడు లోపలికెళ్ళాడు, సుబ్బారాయుడి గదిలోకి

ఒక అరగంట అయ్యాక, మేడమీద మంచినీళ్ళ పెడుతూ అక్కమ్మ చూచింది. చెంగల్వరాయుడు, సుబ్బారాయుడు గదిలోనించీ బయటకొస్తూ, అతని పలుచటి, తెల్లటి ఉత్తరీయంతో కళ్ళ తడుచుకున్నాడు గుమ్మం బయట

మరునాడు ఉదయం—తెల్లవారకముందర్నించీ సత్యవతి తన గదిలో లేదు అక్కమ్మ చూచేటప్పటికి చెంగల్వరాయుడు తన బండి కట్టుకుని వెళ్లిపోయిన దారినే నడుచుకుంటూ, వెతుక్కుంటూ వెళ్లింది అక్కమ్మ కొంత దూరంలో పున్నయ్యకోనేటి ప్రక్కన, పున్నయ్యగారి సమాధుల కెదురుగా, ఒక చెట్టుకింద, ఒకప్రక్కగా ఒరిగి ముడుచుకొని పండుకుని ఉంది, సత్యవతి కౌగిట్లో ఒక తెల్లటి ఉత్తరీయం వుంది నిన్నరాత్రి చెంగల్వరాయుడు వేసుకున్నదే అది ఉత్తరీయం కొంచెం ఒక చోట తడిగా వుంది గడ్డం క్రింద మొఖం అంతా కన్నీళ్ళుజారిన ఆనవాళ్ళున్నాయి కనురెప్పలు ఇంకా వాచి, తడిగానే ఉన్నయి అప్పుడే నిద్రపట్టినట్లుగా వుంది సత్యవతికి తెలియకుండా ఆ ఉత్తరీయం లాగుకుని, మరుగుగా ఒళ్లో పెట్టుకుని దాచింది, అక్కమ్మ, ఎవ్వరికీ కనబడకుండాను రోడ్డుమీదనించీ, చెట్టువరకూ ఉన్న పల్లంలో సన్న మన్నుమీద రెండు జతల అడుగులు కనిపించినయి ఒకటి చిన్నది, ఇంకొకటి పెద్దది అక్కమ్మ అడుగుజాడలు చేత్తో తుడిపేసింది

ఆ ఎండల్లో ముహూర్తాలరోజుల్లోనే సత్యవతికి పెండ్లి అయింది.

పక్షం తిరగకముందే పుట్టింటికి పారిపోయిరావడమూ, అక్కమ్మ, వీరయ్య తిరిగి తీసికెళ్ళడమున్నూ

మరో వారం పోయాక, జుట్టు విరియబోసుకుని మునసబుగారి అమ్మాయి పొలాల్లో తిరుగుతూందనీ, ఎక్కడో తూముమీద కూచునివుందనీ రక రకాల వార్తలు చేరినయ్యి, పాలూరు గ్రామానికి ఊళ్లో అమ్మలక్కలు చెప్పుకోసాగారు: "అదేంటి, ఆ అన్నల్నిచూస్తే మనలాంటివాళ్లకే బయ్యం. ఆ పిల్లదేమి రాతిగుండెమ్మా! బయమే లేదు గదా!" అంది ఒకావిడ. "ఏమీ ఎరగనట్టే ఉంటాది ఎంత జాణాతనము, జెట్టీల్లాంటి అన్నలుండంగా ఇట్లా కాపరం ఎగెయ్యటం!" అంది రెండవ ఆవిడ బిందె తోముతూ, నీళ్లాట రేవుతో "కాపరంమీద ఎట్లా వుంటాది?" అన్నాడు ఒక అతను ఎడ్లని కడుగుతూ "ఆ! ఆ చెంగల్వరాయుణ్ణి ఇన్నాళ్ళ ఇంట్లో గట్టా ఉంచుకో కూడదు—ఆడపిల్లలుండా ఇంట్లో. ఇట్లాగే అవుతాయి" అంది మరో వేదాంతి—బిందె భుజంమీద పెట్టుకుంటూ అన్ని వార్తలూ, సేవకుల ద్వారా మనసబుగారి కోడళ్లకి తెలుస్తున్నయి సుబ్బారాయుడు వినక తప్పిందిగాదు పిచ్చివాడిలా కోపం తెచ్చుకున్నాడు పండ్లు పటపట కొరికాడు, పరవళు త్రొక్కుతున్నాడు

మునసబుగారి ఒత్తిడివల్ల సత్యవతిని భూతవైద్యం చేయించడానికి పుట్టింటికి తీసుకొచ్చారు నిశ్చయంగా, సత్యవతికి దయ్యంపట్టింది అన్నాడు వైద్యుడు పేరంటాలయ్య అక్కమ్మ మరిది, రంగంనించి వుత్తరం వ్రాశాడు చెంగల్వరాయుడు రంగంలో వున్నాడనీ, రెండు సంవత్సరాలు రంగూన్‌లోనే వుంటానన్నాడనీన్నీ. అక్కమ్మ సత్యవతితో చెప్పింది "అవును డబ్బు సంపాదించుకుని వస్తానన్నాడు" అంది సత్యవతి, విచారంతో. "ఏం లాభం సత్యవతీ, ఇక ఇప్పుడు?" అంది అక్కమ్మ సత్యవతి ముఖం కప్పుకుంది చేతులతో, చిన్నగా వెక్కివెక్కి ఏడ్చింది—ఆపుకుంటూ

సత్యవతిని తిరిగి పంపించేరోజున, సుబ్బారాయుడు అగ్నిపర్వతంలా బుస్సలాడిలాడు. మొండి తాడికి కచ్చేసిన కారుదున్న ఇంకా బుస్స కొట్టింది ఇంకా పగ పట్టేవుంది.

రోజులు గడుస్తున్నయి తొలకరి వచ్చింది రాత్రుళ్లంతా తామర గుంటలో కప్పలు బెకబెక మంటున్నయి పున్నయ్యచెరువులోనూ, తామర గుంటలోనూ, తామరపువ్వులు వర్షానికి నగిలిపోయినయి మొండితాడిమీద చంద్రుడుదయించాడు పౌర్ణమి చంద్రుడు ఎర్రగా—నిశాదేవి కుంకుమ బొట్టులా రాత్రి గడిచినకొద్దీ పున్నమనెల తెల్లబారింది భోజనాలవేళకి సత్యవతి వచ్చింది—ఈసారి నగలు తీయాలన్న స్పృహ కూడా లేదు. తిరిగి సత్యవతిని చూచేటప్పటికి, పంజరంలో చిలక "కిలకిల"లాడింది. రెక్కలు "రెపరెప" కొట్టుకుంటూ, పాట మొదలెట్టింది ఆ గోలకి పెంపుడు కుక్కని పరీక్షిస్తున్న సుబ్బారాయుడు, తల పైకెత్తి చూచాడు కళ్ళు ఎర్రబారినయి. పళ్లు పణికింది, కోపంతో "ఈ గడప తొక్కొద్దు అనలే? ఈశని ఇంకా మాకు విరగడకాలే? తల ఎక్కుతుని బ్రతకనివ్వదల్లే వుంది!" అంటూ అంగల మీద లేచి, చావిట్లో చిలకకొయ్యకివున్న ఉత్తరీయం మీద వేసుకుని, చెప్పుల్లో కాళ్లు పెడుతూ "వచ్చినదారినే నడు!" అన్నాడు సత్యవతి వెనక్కి వెనక్కి చూచింది వెళ్లబోతూ. తనకేసే చూస్తూ గూట్లో చిలక పాట పాడుతూనే వుంది

"పరువుగల అన్నలూ పయనమైనారా?
రాకాసి వదినలూ, రానివ్వరేమో"

మండువాలోకి వచ్చిన పెద్దవదిన "తెల్లారాక తీసికెళ్లండి అంది" "ఎవ్వళ్ళన్నా చూస్తే తిరిగి వచ్చేసినట్టా?" అంటూ అతను ముందూ, సత్యవతి వెనకా, నడిచి పోతూనే వున్నారు దారిలో తుమ్మ మానులు నల్లగా నించుని వున్నాయి నేవళంగా, పచ్చగా పెరిగివున్న చెట్లన్నీ పూర్తిగా, విభూదిలో ముంచెత్తినట్టు వున్నయి—ఆ పున్నమ వెలుగులో. అతని కిర్రుచెప్పుల చప్పుడికి, దారికి అడ్డంగావున్న ఒక పెద్దపాము ప్రక్కగా తప్పుకుపోయింది దారిప్రక్కన, మళ్లల్లో నీళ్ళు తళతళలాడుతున్నయి

సుబ్బారాయుడు ఇంటికి తిరిగి వచ్చేటప్పటికి చుక్క పొడిచింది, "వాళ్ల గుమ్మంవరకూ పంపించి వచ్చాను లోపలికి వెళ్ళడానికి నాకు ముఖం చెల్లలేదు" అన్నాడు భార్య అడుగగా

తిరిగి మరునాడు వాళ్ల అత్తవారి మనుష్యులు వచ్చారు—వెతుక్కుంటూ అన్నగారి ముఖం వెనక్కి తిరగంగానే, ఇంట్లోకి వెళ్ళకుండా ఎక్కడికో పారిపోయింది నూతులూ, గోతులూ దేవించారు చెరువులు గాలించారు ఆ చుట్టుపట్ల ఎక్కడా సత్యవతి జాడ కనపడలేదు

వెతికి వెతికి వేసారిపోయి, మునసబుగారు మంచం ఎక్కారు చేతి మున్న షాహుకారు మురుగు అరిచేతిలో పడుతూవుంది క్షీణించిపోయి మూడు నెలలు తిరగకముందే కాలం చేశారు.

సుబ్బారాయుడు, ఇంటి విషయం, ఆస్తి విషయం ఏమీ శ్రద్ధ పట్టుకోడంలేదు ఎప్పుడూ ఏదో ఆలోచిస్తూ చావిట్లోనే కూచుని వుంటాడు సత్యవతి పరారి అయిపోయిన సంవత్సరంలోనే గమిడిపోతుల జత అమ్మేశారు వెంట వెంటనే దుక్కిటెడ్లు పాడిపశువులూ అన్నీ అమ్ముడుపోయినయి. సుబ్బారాయుడు తన పట్టెమంచం పడక మానేశాడు. చావిట్లో ఒక నులక మంచం వేసుకున్నాడు భోజనం, పడక అన్నీ అక్కడే ఒమ్మవారి గుడి ముఖం చూడడం మానేశాడు. సత్తెమ్మ సంబరాలు ఆగిపోయినయి ఆస్తి క్షీణించ సాగింది ఆశ్రితసేవక వర్గం లోగిలి విడిచిపోయారు క్రమంగా ఏదో తగుపాటి సంబంధాలకి ఆడపిల్లల్ని ఇచ్చేసారు "ఎంత పౌరుషవంతుడు! ఆ సంబంధాలు ఎట్లా అందాడో! ఏదో మతిపోయిం దతనికి, చెల్లెలు తెచ్చిపెట్టిన తలవంపులకి" అని అందరూ వుసూరుమన్నారు ఆస్తి ఆఖరుకి అంతా పోయింది ఆ లోగిలి ఒక్కటి నిల్చింది. దానికోసం రక్షణలేదు. దానిమీదా అప్పు లవుతున్నాయి

సుబ్బారాయుడు అకాలంలోనే వృద్ధుడయ్యాడు ముఖం అంతా తీరని భారంతో ముడతలు పడ్డది—మండు టెండలకి తన పొలంలో నల్లరేగడి బీటలారినట్టు

అతన్ని చూడంగానే పంజరంలో చిలక భయపడి రెక్కలు 'టపటప'లాడించి బయటికి ఎగిరిపోవడానికి ప్రయత్నించేది సుబ్బారాయుడు చిలక మీద కోపం కూడా తెచ్చుకోడంలేదు సత్యవతి వెళ్ళిపోయినదగ్గరనించీ చిలక తిండి తీర్థాలు మానేసింది—అక్కమ్మ పెట్టినా తినకుండా ముక్కు రెక్కలలో పెట్టుకుని అలాగే పడివుండేది

రంగూనునించీ వచ్చిన మరిది చెంగల్వరాయుడు జ్వరంపడి రంగూనులోనే పోయాడని అక్కమ్మతో చెప్పాడు అక్కమ్మ గుండెలో బరువుతో వెళ్లి చిలక పంజరం తెరిచి చిలకని వదిలేసింది

పేదరికం భరించలేకనూ, పువ్వులమ్మిన వూళ్లో కట్టెలమ్మడం కష్టమయిన్నీ, తమ్ములందరూ తలకొకదారిని బస్తీలు పట్టారు—వాళ్ల వాళ్ళ కుటుంబాలతో, దుకాణాలు పెట్టుకుని, గుమాస్తాగిరులు సంపాదించుకుని చిన్న బ్రతుకులు బ్రతుకుతున్నారు

జరిగిన ఈ గాథఅంతా ఈ లోగిలి విచిత్ర పరిణామం అంతా ఆ అరుగుమీద కూచున్న అక్కమ్మ తలపోసుకుంది

ఆ రాత్రంతా వచ్చిన కొద్దిమంది బంధువులూ, అందరూ సుబ్బారాయుడు మంచం చుట్టూ జాగారం చేశారు మధ్య రాత్రికి వృద్ధుడికి మళ్లా మెళుకువ వచ్చింది "ఇంకా రాలేదూ? సత్యవతి?" అన్నాడు "లేదన్నా" అంది అక్కమ్మ "అక్కమ్మా ఇంకమీదట సత్తెమ్మ సంబరాలు చేయిస్తావా? ఆయమ్మపేరే సత్యవతిది" అన్నాడు ఆగి ఆగి కొంచెం ఆయాసంతో "అట్లాగే అన్నా, తప్పకుండా చేయిస్తాం" అంది నుదురుమీద చెయ్యి వేస్తూ

రోగికి కాస్త ఆయాసం ఎక్కువయింది బయటనించీ తొలకరి గాలులు చల్లగా వీస్తున్నాయి ఆ చిన్న గాలిలో ఆ పాత చిలక పంజరం కొంచెం వూగిసలాడింది వెలిమబ్బు చాటునించీ చంద్రుడుదయించాడు—నీళ్లల్లో వజ్రంలా నడిరాత్రి గడిచిపోయింది

మలి కోడి కూసేటప్పటికి "సత్యవతీ సత్యవతీ!" అని గట్టిగా అరిచాడు "అన్నా అన్నా ఇంకా రాలేదు" అంది అక్కమ్మ "ఆ! ఆ! గోనలేరు పొంగింది అదిగో నురగలు కన్నయ్యలేడూ?" అన్నాడు ఆగుతూ ఆయాసంతో కొంచెం ఆగాడు "బల్లకట్టు కన్నయ్య లేడే అక్కమ్మా లేడు నేనే బల్లకట్టు వేసానే! అక్కమ్మా నేనే! ఎక్క నందే బల్లకట్టు చెత్తోలాగి బల్లకట్టుమీద పడేశానే అక్కమ్మా అంతే!" అన్నాడు అంతా నిశ్శబ్దం మళ్లీ "సత్యవతి?" అనేకేక "వస్తాదిలే పడుకో అన్నా" అంది అక్కమ్మ మృదువుగా. సుబ్బారాయుడు కండ్లు ఇంకా కొంచెం తెరిచాడు "ఎర్రిదానా! సత్యవతి రాదు! గోనలేరు మింగేసింది బల్లకట్టుమీదనించీ నీళ్లలోకి పోయింది . అదిగో అదిగో—నేనే నాచేతులారా ." సగం తెరిచిన కళ్ళ మూతలు బడ్డాయి.

గదిలో చుట్టూ వస్తున్న కన్నీళ్లన్నీ గడ్డలు కట్టాయి. శ్వాస వినబడడం ఆగింది—రోగిది.

నిడలా ప్రమిద వెలిగించి, గాలికి చెయ్యి అడ్డం పెట్టుకుని, దీపానికి, లోపల్నించి వచ్చింది—చంద్రమ్మ—తల దగ్గర పెట్టడానికి.

చారిత్రక నవలలు: వాని ప్రామాణికత

శ్రీ కొడాలి దామోదరయ్య

ఆంధ్రదేశమంత పురాతనమైనదిగాదు ఆంధ్ర వాఙ్మయము అందునా చారిత్రక నవలా సాహిత్యము యింకనూ అధునాతనము అట్టి రచనలు తీవ్ర శోధనలకు పాల్పడవలసి యున్నవి కడచిన మూడు నాలుగు దశాబ్దములనుండి మన మిత్రులు కొందరు చరిత్రాత్మక నవలలను వ్రాయుచుండిరి వీరి రచనా విధానమును పరిశీలించుటయే యీ వ్యాసములో నా యాశయము ఈ వ్యాసమున చరిత్రాత్మక నవలల యావశ్యకత, వాని యుత్పత్తి క్రమము, వాని యభివృద్ధి, వాని లక్షణములు, వాని ప్రస్తుత పరిస్థితి, వానిని సకల జనాదరణీయములుగ జేయుటకై చేయవలసిన ప్రయత్నములు మున్నగు వానిని గూర్చి రేఖామాత్రముగ చిత్రించెదను

ప్రపంచ సారస్వతమున చారిత్రక నవలా వాఙ్మయ మొక చిన్న శాఖ ఒక జాతి యౌన్నత్యమునకు హేతుభూతమగు కారణ జాలములలో యీ సారస్వత మొకటి యనుటకు సాహసించుచున్నాను. జాతీయ భావములను పెంపొందింపజేయుటకు యీ సారస్వత మొక సాధనము చదువరుల మనములందు దేశభక్తి, వీర రసము, రగుల్కొల్పజేయుట కివి సాధనములు. ప్రతి వ్యక్తి తన జాతియొక్కయు, దేశముయొక్కయు, పూర్వ వీరులయొక్కయు చరిత్రను తెలిసికొనుట కువ్విళ్ళూరును అందులకై నీరసముగ వ్రాసిన చరిత్ర గ్రంథములు చదువుట దుర్లభము చదివినను ఆ యా ఘటనలను స్మృతిపథమునందుంచుకొనుట మరింత దుస్సాధ్యము చరిత్ర గరపుటయం దట్టి శ్రమను తగ్గించుటకే నవలారూప మొక సాధనమైనది వయస్సులు, విజ్ఞానములు తారతమ్యము లేకుండా చదువరులు కథలచే నాకర్షింపబడుదురు నవల యనగా నొక పెద్ద కథయే గదా! అట్టి కథ ద్వారా చరిత్రను గరపినచో అయ్యది చిరస్మరణీయముగా నుండితీరును తేనెతో రంగరించినగాని మందును మ్రింగని పసిగందులవలె, స్థాయిలేని మన చదువరులు కథలో గలిపినగాని చరిత్ర నేర్వరు అందులకే చారిత్రక నవలలు ముఖ్య సాధనములై యున్నవి.

ఇట్టి నవలల కొక ప్రత్యేకత గలదు. నవలా రచన మెంత యున్నత స్థాయిలో నున్ననూ, చారిత్రాంశములు ఉండియుండవలెను నవల యనగా కల్పితము. చరిత్ర యనగా వాస్తవము ఈ రెంటికి సమన్వయ మెంత చక్కగ జరిగిన చారిత్రక నవల లంత ప్రశంసనీయము లగును. దురదృష్టవశాత్తు మన చరిత్ర కాధారములు చాల తక్కువ ఎడనెడ కొన్ని యాధారములు లభించిననూ, అడుగడుగునకు సంశయాస్పదములే అందుచే మన చరిత్ర తీరుతెన్నులు లేక వివాదగ్రస్తమైన యంశములతో గూడియున్నది. శాసనములు నాణెములు, విగ్రహములు ఆధారమైన చోట్ల కొంత మెరుగు వాఙ్మయ మాధారమైనచోట్ల మిక్కిలి ప్రమాదభరితముగానున్నది మనవారి వాఙ్మయరచన అతిశయోక్తుల పుట్ట స్వీయాభిలాషల కట్ట అట్టి చరిత్రను గమనించు టెట్లు? "దేశముయొక్క పురోభివృద్ధికి ప్రబల శత్రువై, జన సామాన్యము నావహించియుండిన దురభిమాన పిశాచమును బోద్రోలి ప్రజలను నీతి వర్ధిష్ణువులుగాను చేసి, భావికాల పరంపరాభివృద్ధి భవనమునకు మూలబంధమై యొప్పునది క చరిత్ర" అని చిలుకూరి వీరభద్రరావుగారు తమ ఆంధ్రుల చరిత్రలో వ్రాసియున్నారు. అట్టి ఉత్తమచారిత్రకరచనలు మనకు చాలతక్కువ

ఆంధ్ర చరిత్ర రచనలో ఈస్టిండియా వర్తక సంఘమున పని చేసిన "మెకంజీ", 'కెన్నతే" యనువారు కొంద రాంధ్రపండితుల సహాయమున కొంతవరకు కృషి చేసిరి. తరువాత వీరేశలింగంగారు, చిలుకూరి వీరభద్రరావుగారు కొంత యత్నము సలిపిరి కొమర్రాజు లక్ష్మణరావుగారు కొంత పరిశోధించిరి. వేటూరి ప్రభాకరశాస్త్రి, మల్లంపల్లి సోమశేఖరశర్మ, నేలటూరి వేంకటరమణయ్య, భావరాజు వెంకట కృష్ణారావు, రాళబండి సుబ్బారావు, మారేమండరామారావు, పుట్టపర్తి శ్రీనివాసాచార్యులు, గిడుగు సీతాపతి, చిలుకూరి నారాయణరావుగార్లు కొంతవరకు ప్రయత్నము చేసిరి శ్రీ ఏటుకూరి బలరామమూర్తిగారు యీ రచనలో మరొక మైలురాయి జేరిరి ఇంకనూ పరిశోధించవలసిన వెన్నో కలవు

ఇట్టి సందర్భమున మన చరిత్రాత్మక నవలల పరికింతము సుప్రసిద్ధమైన కొన్నిటిని మినహాయించి, ఎక్కువ భాగము నవలలో చరిత్ర నేతిబీరకాయలోని నేతికంటె కొంచె మెక్కుడుగ నున్నది ధర్మానుప్రతిలోని ధర్మముతో సమానస్థాయిలో నిందలి చరిత్ర యుండవచ్చును వీరిలో పెక్కుమంది విద్యార్థుల ఉపయోగమునకై యిట్టి నవలలు వ్రాసిరి ఏదోయొక వీరఘటనను పురస్కరించుకొని వీరీ నవలలు వ్రాసిరి ఆ ఘటన మాత్రము వాస్తవమే దానిచుట్టూనున్న తీగలన్నియూ కల్పితములే వ్రాతలన్నియూ నతిశయోక్తులే కొందరు యితరులు వ్రాసిన చరిత్రాంశముల ననుసరించుట లజ్జాకరమని కాబోలు వారే వారికి కావలసిన చరిత్రను సృష్టించుకొనిరి వారి కభిమానములగు విషయములను స్వర్గతుల్యముగా చిత్రించుట, వారికిష్టములేని యదార్థములను అసలే చిత్రింపకపోవుట, వీరి లక్షణములు ఇట్లనుటలో ఆ యా రచయితలు నన్ను దూరవచ్చును అయిననూ వాస్తవమ నెట్లు వ్రాయకుందును? కొందరు మాత్రము వారి నవలలో చరిత్రను తమకు తెలిసినంత వరకు నిష్పక్షపాతముగనే వ్రాసిరి ఆట్టివా రల్పసంఖ్యాకులు వారికి నా నమోనాకములు

అశోక చక్రవర్తి తన కాల్సి (12 వ) శిలా శాసనమున చెప్పిన సూక్తిని చూడుడు

"తశు చు ఇనం ములే అవచగుతి కితితి
అతపశడ వాపుజా వా పలపాశండగలహో
వనో శయా అపకలనశి లహకా వాశియా
తగిశశి పకలనశి"

అనగా "దానికి మూలమిది ఏదియనగా ఆకాలమందు ఒకశాఖవారు తమ శాఖలను పొగడుకొనుటయు, ఇతర శాఖలను నిందించుటయు జేయక మాట్లాడునపుడు వాఙ్నిగ్రహము గలిగి యా వాక్కును రక్షించుకొనవలెను" యని యర్థము ఎప్పుడో క్రీస్తుపూర్వమే మనవారినిగూర్చి ఆశోకు డట్టి హెచ్చరిక జేయవలసి వచ్చెను నేటికివి చారిత్రక నవలలను కొన్నిటిని చదివిన పిమ్మట అట్టి హెచ్చరిక అసందర్భము కానేరదు విద్యార్థుల నుద్దేశించి వ్రాసినవారు ఏదో యొక వీర కార్యము నాదర్శముగా దీసికొని వ్రాసియున్నారు వీరు నియమము ప్రకారము గ్రాంథిక భాషనే వ్రాసిరి కాని ఏలనో కఠినాతికఠినమైన భాషను వాడిరి విద్యార్థులే కాదు పండితులు సైత మీ నవలలు చదువుట కష్టతరము ఇటీవల విశ్వ కళా పరిషత్తువారు కొందరకు బహుమతులీయదలంచి కొన్ని చారిత్రక నవలలను వ్రాయించిరి ఇవియును కఠిన భాషతో కూడినవై యున్నవి. ఈ నవలలో పదిపేజీలు చదివిన తరువాత నొకసారి మొదటి పేజీకి వచ్చి యన్వయము మననము చేసుకొనుచుండవలెను ఇట్టి రచయితలొక్క విషయమును మరచుచున్నారు ఈ నవలలన్నియు పాఠశాలలలోను, కళాశాలలలోను ఉపవాచకములుగా మాత్రమే వాడబడుచున్నవి వీటిని, ఉపాధ్యాయులు వివరముగ చెప్పరు విద్యార్థు లసలే చదువరు. చదువుదమన్నను వారి కర్థము కానేరదు ఆ యా రచయితలే మరల వాటికి గైడులు తయారు చేయవలసి వచ్చుచున్నది కాన ఆ యా తరగతుల విద్యార్థు

లకు తగిన భాష వాడుటలో గల కష్టమేమియో నాకు బోధపడకున్నది. ఈ రకపు నవలలను ప్రజలు సర్వ సాధారణముగా చదువరు. విద్యావంతులు సైతము యిట్టి నవలల పఠించు సమయమున అమృతాంజనమును వాడి తీరుదు రనుటలో సంశయము లేదు

ఈ రచనలలో యించుమించు మొదటిదియు, ఉన్నతమైనదియునైన నవల శ్రీ దుగ్గిరాల రాఘవ చంద్రయ్యగారు వ్రాసిన "విజయ నగర సామ్రాజ్యము". మొదటి ప్రపంచ సంగ్రామ సమయమున నిది వ్రాయబడినది నవలా రూపమున విజయనగర సామ్రాజ్య వైభవము, నాటి మహమ్మదీయ రాజుల కుతంత్రములు, విజయసింహుడు, బుద్ధిసాగరుడు మున్నగు వీరుల సాహసోపేత గాథలు చదువరుల కెరింగించుట యీ రచయిత ముఖ్యోద్దేశముగ గన్పించుచున్నది. సన్నివేశములను కండ్లకు కట్టునట్లు చిత్రించి దేశభక్తి నుద్దీపింపజేయుట కీ నవల మిక్కిలిగా నుపకరించును పాఠకులను తనతో తోడ్కొనిపోగల సమర్థుడీ రచయిత. ఇతని ప్రయత్నము సఫలీకృతమైనదనుటలో సందియములేదు.

మరొక ముఖ్య నవల "నాయకురాలి దర్పము". ఇది 1930 లో ప్రకటింపబడినది. స్వర్గీయ చిలుకూరి వీరభద్రరావుగారు దీనిని వ్రాసిరి ఇయ్యది ఆంధ్ర దేశ చరిత్రాత్మకమైన నవలా రాజము. చరిత్ర పరిశోధకుడుగా పేరొందిన యీ రచయిత యీ నవలయందు పల్నాటి వీర చరిత్రను చక్కగా చిత్రించెను. వీరారాధనకు పాఠకుల పురికొల్పుట వీరి యుద్దేశము. బాల చంద్రుని యుద్ధ కౌశలము, బ్రహ్మనాయని పరాక్రమమును చిత్రించి త దాశయమును సాధించెను. రాజ్యాంగతంత్రమును గూడ చూచుట కీ నవల తగినది నాయకురాలి రాజనీతి యిందు ప్రస్ఫుటముగా గానవచ్చును. మహాభారతము నన్ని విధముల పోలియున్న యీ కథావస్తువును నవలా రూపమున చిత్రించిన యీ రచయిత ఆంధ్రుల మన్నన లందెననుటలో సందియములేదు.

1948 లో పండిత సత్యనారాయణరాజుగారు వ్రాసిన "గోరువంక" యను నవల ప్రకటింపబడెను. త్రిలోచన పల్లవునిచే ఆంధ్ర చాళుక్యరాజైన విజయాదిత్యుడు చంపబడుటయు, గర్భిణిగా నున్న రాణి విష్ణుసోమయాజులను బ్రాహ్మణుని ప్రాపున జీవించి విష్ణువర్ధనుని కనుటయు, అతడు మరల రాజ్యమును జయించుటయు యిందలి ఇతి వృత్తము. చరిత్రాంశములను కొంతవరకు రచయిత తెలుపగల్గెను

ఈకాలముననే, చిత్తూరు దుర్గమను చరిత్రాత్మక నవల యొకటి వెలువడినది. మొగలు ప్రభుత్వమునాటి దేశచరిత్రయందు గానగును. ఇందలి పాత్రలు చాలవరకు కల్పితములు. చరిత్రయు నింతియే.

1949 లో చెళ్లపిళ్ల బంగారేశ్వరశర్మ గారు వ్రాసిన "రెడ్డి రాజ్య సంస్థాపము", అడివి బాపిరాజుగారు వ్రాసిన "గోన గన్నారెడ్డి", నోరి నరసింహశాస్త్రిగారు వ్రాసిన "నారాయణ భట్టు" వెలువడినవి. బంగారేశ్వర శర్మగారి నవలలో అద్దంకి రాజధానిగా రెడ్డి రాజ్యమును స్థాపించిన ప్రోలయ వేమారెడ్డి చరిత్ర గలదు ఆనాటి సాంఘిక పరిస్థితులను గూడ తెలుపుట కాయన ప్రయత్నించెను కొద్ది మేరకు కృతకృత్యుడు కాగల్గెను. బాపిరాజుగారి గోన గన్నారెడ్డి నేటి కమ్మ, రెడ్డి, కాపు, వెలమ కులపు వీరులకు మూలమైన ఆంధ్ర క్షత్రియుడట! అదేమోనే నెరుంగను అతడు కాకతీయ వీరరాణి రుద్రమదేవికి సామంతుడు మహామాండలిక ప్రభువు పశ్చిమాంధ్ర పురము నేలెను వర్ధమానపురము అతని రాజధాని. ఇట్టి చరిత్రాంశము లనేకము బాపిరాజుగారు చెప్పియున్నారు. నవలా రచనలో సిద్ధహస్తులైన బాపిరాజుగారిచేత నీ నవల పరుగులు తీసినది ఇందలి నవలా భాగము ప్రశంసనీయము ఇదే కాలమున నోరి నరసింహశాస్త్రిగారి "నారాయణ భట్టు" ఆంధ్రదేశమునకు వచ్చినాడు ఆది కవియైన నన్నయ చరిత్రను చూపుట వీరి ముఖ్యోద్దేశము వీరికి నూత నిచ్చిన చారిత్రకాధారములు నాకు సంశయాస్పదములు. వాఙ్మయాధారములోని అతిశయోక్తులకు నే వెపుడు ప్రాధాన్య మీయజాలను వీరి రచన సుగమము ఈ నవలలోని నన్నయారాధన గమనార్హము రచయిత ఇందు కృతకృత్యులైరని చెప్పక తప్పదు. ఇట్లే వీరు కవిత్రయములోని మిగిలిన యిద్దరి చరిత్రలు తెలుపు నవలలు వ్రాసియున్నారు 1954 లో రుద్రమదేవి యను చరిత్రాత్మక నవల ద్వారా కవిబ్రహ్మ తిక్కన చరితము, 1958 లో 'మల్లారెడ్డి' యను నవల ద్వారా ఎర్రన చరితమును మన కెరింగించి పుణ్యము కట్టుకొనిరి రుద్రమ్మ రాజ్యమునకు వచ్చిన మొదటి దశలో కుట్రలుపన్ని యనేక శాత్రవులు గావించి యుద్ధములు, అందామె చూపిన యసమాన శౌర్యపటిమ వీరి 'రుద్రమదేవి' యందు కన్పించును ఇందే తిక్కన కవి మనకు ప్రత్యక్షమగును. పదునైదు పర్వముల భారతమును మన కందించిన తిక్కన దర్శన మేరూపముననైన చదువరులానందింపకపోరుగదా! తలవని తలంపుగ నిచట కన్పించిన కవి బ్రహ్మ కివే నా జోహారులు వీరి 'మల్లారెడ్డి' వీరుడైన వేమారెడ్డి సోదరుడు 14 వ శతాబ్ది మొదటి దశలో ఢిల్లీ సేనల నెదిరించి మోటుపల్లి నాక్రమించిన మొనగాడు. ఈ నవల మనకు ప్రబంధ పరమేశ్వరుడైన 'ఎర్రన'ను జూపును. ఈ రీతిగ మూడు నవలలలో ముప్వరు ప్రముఖ కవులజూపు నాదర్శమున కిదియే ప్రథమ ప్రయత్నము. నరసింహశాస్త్రిగారికలమిందు స్వేచ్ఛగ పరుగులుదీసి ఆంధ్ర పాఠకలోకమున కెవ్వదగిన సేవ జేసినది.

1950 లో 'వీర కంకణ' మను చిన్న నవల జన్మించినది. దండిపల్లి వేంకట సుబ్బశాస్త్రిగారే దీని జనకులు అనేక గ్రంథములు వ్రాసిన పండిత రాయల చరిత్రను నవలా రూపమున చిత్రించుట కీ రచయిత ప్రయత్నించెను. కథతోపాటు చరిత్ర, సంస్కృతి, సంప్రదాయముల దెలియజేయుట రచయిత అభిమతము మొగలు దర్బారున పాదుషాలచే సత్కరింపబడిన యాంధ్ర కవి పుంగవుని చరిత్ర యిందు గలదు రచయిత తన ప్రయత్నమున కొంత వరకు కృతకృత్యుడయ్యెను. వీరి చారిత్రకాధారములు వివాదగ్రస్తములు.

1951 లో శేషాద్రి రమణ కవుల 'కొండపల్లి ముట్టడి' ఆంధ్ర పాఠక లోకమునకు సమర్పింపబడినది ఆంధ్ర విక్రమము నొకతూరి స్ఫుర

ణకు దెచ్చుటయే యీ గ్రంథ రచనకు కారణమని చెప్పబడినది చిన్నమదేవి కరగ్రహణమునకై రాయలవారి కొండపల్లి ముట్టడి యిందలి కథావస్తువు అందు రాయలవారికి సాయము జేయుటకై యనేకులు గావించిన వీర కృత్యములు వర్ణింపబడినవి మారు వేషములతో పగతుర నెట్లు సాధింతురో తెలుపబడినది. నారీమణులు గూడ వీరత్వమును జూపి పాతివ్రత్యము నెట్లు కాపాడుకొందురో చూపబడినది ఈ రచయితలు తమ ప్రయత్నమున కనువగు వస్తువును సేకరించిరి. తదాశయమున కృతకృత్యులైరని చెప్పవచ్చును 1952 లో పిలకా గణపతిశాస్త్రిగారి 'అశోక వర్ధనుడు' ఉద్భవించెను ఇయ్యది నిర్వివాదమైన చారిత్రకాంశము ఈ వస్తువున కనేక చారిత్రకాధారములు,గలవు అశోకుని కళింగ విజయ వృత్తాంత మిందలి వస్తువు అశోకుని మానసమున నాటిన శ్రమణకుని బోధలు, వాటి ప్రభావము ఇందు చూపబడినది కళింగ యుద్ధము వివరింపబడినది ఇందే యశోకునకు నాగావళి పత్నిగా లభ్యమయ్యెను. ఈ రచయిత తన కార్యమున సఫలీకృతుడయ్యెను 1952 లో కొండూరి నరసింహంగారు వ్రాసిన 'తానాజీ' గలదు చదువరులచే వీరారాధన గావించుట వీరి యభిమతమని చెప్పబడినది సింహగడమును జయించిన శివాజీ సేనాని తానాజీ ప్రభు భక్తిని యీ నవల ప్రస్ఫుటముగా చాటుచున్నది. నాటి మహారాష్ట్ర చరిత్రను గూడ యీ రచయిత సందర్భానుసారముగా చెప్పియున్నాడు తానాజీ స్వార్థత్యాగము, వీరత్వము, అతని ప్రభుభక్తి, దేశభక్తి కొనియాడదగినవి ద్రోహి యగు ఉదయభానుని జంపిన పిమ్మటనే తన ప్రాణములను వీడిన తానాజీ వీరగాథ విద్యార్థుల కెంతయో యాదర్శప్రాయము రచయిత తన యాశయమును చాలవరకు సాధింపగల్గెనుటలో సందేహములేదు ఇదే కాలమున ఆంధ్ర విశ్వ కళా పరిషత్తువారి యాదేశానుసారముగ మల్లాది వసుంధరాదేవిగారిచే వ్రాయబడిన 'తంజావూరు పతనము' కళాశాల విద్యార్థుల హస్తముల నలంకరించినది విజయరాఘవ నాయకులవారి కాలమున తంజావూరెట్లు విలసిల్లినదో, తుదకెట్లు పతనమైనదో యిందు వ్రాయబడినది ఇందు రచనా ప్రావీణ్య మధికము.

1954 లో యస్ యస్ వి సోమయాజులు ఆనువారు 'తుక్కాంబ'ను వ్రాసిరి ఎవ రీ తుక్కాంబ? శ్రీ కృష్ణదేవరాయలవారి దేవేరియట కాని పాపం రాయలవా రీమెకు విడాకు లొసంగిరట ఈమె కంభంలో కాపురముండె నట దీని కాధారం 'తుక్కాపంచకం' ఇందలి సత్యా సత్యములు పాఠకులకే వదలుచున్నాను.

ఇదే కాలమున కేతవరపు రామకృష్ణశాస్త్రిగారిచే విరచితమైన 'వీర ఛత్రసాల్' వెలువడినాడు ఆతడు ప్రతాపరుద్రుని వంశీయుడైన చంపత రాయుని కుమారుడు ఇత డౌరంగజేబునుండి బుందేలు ఖండమునకు స్వాతంత్ర్యమును గుంజుకొనెను ఇందలి శైలి హృద్యంగమముగ నున్నది నవలా రచనా విధానము ప్రశంసాపాత్రమే చారిత్రాంశమునే యింకనూ పరిశీలన చేయవలసియున్నది.

ఇటీవల ఎన్నతగిన నవలలో 1956 లో వెలువడిన 'ప్రతాపరుద్రీయ' మొకటి దీనిని శ్రీ పొన్నలూరి రాధాకృష్ణమూర్తిగారు వ్రాసిరి ఇందు ప్రతాప రుద్రుని మంత్రి అన్నయదేవుడు ఢిల్లి సుల్తానుల నెదిరించుటకై చేసిన వ్యర్థ ప్రయత్నము చూపబడెను ఇందు మతముకంటె జాతి ముఖ్యమనే మాత్రముతో ప్రజా సమీకరణ జరిగింది రచయిత ఈ ప్రయత్నమున చాల వరకు, కృతకృత్యులైరి 1958 లో అడివివారి "అడవి శాంతిశ్రీ" బయల్వడినది ఇందు ఫూంగియ మహారాణి శాంతిశ్రీ దేవి చరిత్ర వ్రాయబడినది ఇందలి చారిత్రకాంశములు నిర్వివాదములు, నిస్సంశయాస్పదములు కానేరవు వీరి శైలి మాత్రము ఎన్నతగినది వీరి చరిత్రాత్మక నవలలు ఆంధ్ర పాఠక లోకమునకు కానుకలు మొదలిడినవారు చివరివరకు చదివి తీరుదురు

రచన వేరం గెరింగించుట కీ యుదాహరణములు చాలు నని కొందును ఇంచుమించు అందరును ఏదియో యొక వీరకృత్యమును తీసికొని దాని చుట్టును పరిభ్రమించిరి. దుర్గముల ముట్టడులను, అప్పట్లు అ యోధులు గావించిన వీర కృత్యములను పెక్కురు గైకొనిరి విజయనగర సామ్రాజ్య వైభవమును కొందరు దీసికొనిరి. సేనాధిపతులకు కొందరు వీర పూజ సల్పిరి. ఇట్లేవరికి దోచిన చరిత్రాంశములను వారు గైకొని వ్రాసిరి మొదటినుండి నేటి వరకు యీ రచనా విధానములో గమనించదగిన మార్పులేమియు రాలేదు అందరొక పక్కనే యవలంబించిరి వీరిలో ననేకులు పండితులేగాని చరిత్రకారులు గాదు వీరి నవలలలో పాండిత్యపు పాలు హెచ్చు

"History is indeed little more than the register of the crimes, follies and misfortunes of mankind"

అని గిబ్బన్ మహాశయుడు చెప్పియున్నాడు అనగా "మానవుల నేరములు, తప్పులు, దురదృష్టాలుగల రిజిష్టరుకంటె చరిత్ర కొంచె మెక్కువ"యని కాని చరిత్రకు నేడు భావం మారింది తాజమహల్ కట్టించిన పాదుషాను వీడి కట్టిన కూలీల సంగతిని నేటి చరిత్రకారు లాలోచించుచున్నారు అందు చేత నేటి చరిత్ర రచనా విధానమే మారుచున్నది రాజ్యాభిషేకం, యుద్ధం, మరణం తేదీలతోనే యింతవరకు చరిత్ర సాగింది ప్రజల ఆచార వ్యవహారములు, జీవన విధానము మున్నగు విషయములపై నేడుదృష్టి కేంద్రీకరింపబడుచున్నవి. చారిత్రక నవలా రచయితలు గూడ యీ మార్పును గుర్తించవలెను ఒక కోట ముట్టడి ప్రధానము గాదు; నాటి ప్రజల జీవితం ప్రదానం. వీరకృత్యములే ప్రధానముగాదు; సామాన్య ఘటనలకు కూడ ప్రాధాన్య మున్నది.

కాన ప్రజా బాహుళ్యానికి చరిత్రాత్మక నవలలను తీసుకొని వెళ్ళవలెనన్నచో యీ క్రింది ముఖ్యమైన విషయములను గమనింపవలెను కఠినమైన భాషను, గ్రాంథిక భాషను విడనాడి సుగమమగు వాడుక భాషను రచయితలు వాడవలెను చరిత్రలో వివాదగ్రస్తములుగాని, సందేహాస్పదముగాని సంఘటనలనే తీసుకొనవలెను వారు తీసికొన్న చారిత్రకాధారములను పీఠికలో చూపవలెను ఎల్లప్పుడు చర్వితచర్వణమైన యంశములనేగాక, క్రొత్త వాటిని గ్రహించి నూతనపథను జూపవలెను వర్తమాన చరిత్రలేక యిటీవలి చరిత్రలోని యంశములను గైకొన్నచో చదువరులకు మరింత యుత్సాహము కలుగును భారత జాతీయోద్యమములో కథ లెన్నో గలవు. ఆంధ్ర రాష్ట్రోద్యమమున ఘటన లెన్నో గలవు అట్టి యంశముల స్వీకరించినచో యీ నవలలు మరింత ప్రోత్సహింపబడును

ఆంధ్రసాహిత్యమున నవలావాఙ్మయము పేరెన్నిక గన్నది అసంఖ్యాకములైన నవలలు వెలువడుచున్నవి సంవత్సరమునకు కొన్నివందలనవలలు వచ్చుచున్నవి పాఠకులువాటిని తప్పనిసరిగా చదువుచున్నారు ఇందెక్కుడు భాగము డిటెక్టివు నవలలు. తరువాత సాంఘిక నవలలు తృతీయ స్థానము రాజకీయ నవలలది చరిత్రాత్మక నవలలది కడగొట్టు స్థానము. సంవత్సరమున కొకటి రెండు మాత్రమే వచ్చుచున్నవి అవియును పాఠశాలలుదాటి బయటకు వచ్చుటలేదు ఇది శుభ సూచన కానేరదు మన జాతి చరిత్రను ప్రజా బాహుళ్యములోనికి తీసుకొనిపోవుట నవలా రచయితల కర్తవ్యము మనము చరిత్రహీనులము కాదుకదా! మనకెంతో చరిత్ర గలదు గర్వింపదగిన చరిత్ర మనది అట్టి చరిత్రను మన కందించలేకపోయినందులకు వెనుకటి రచయితలను మనము దూరుచున్నాము. మనమును నట్లే యొనర్చిన ముందుతరములవారు మనల దూరుదురు. కాన తెలుగులో మరిన్ని చారిత్రక నవలలు వ్రాయబడవలెను ఇంచుమించు ప్రతి ఘట్టమునకొక నవల యుండితీరవలెను రచయితలు మరింత పూనికతో ముందునకు వచ్చెదురుగాత!

ముగింపు మాట! చరిత్రాత్మక నవలలన్నిటిని నేనీ వ్యాసమున ప్రస్తావించలేకపోయితిని కొన్ని నాకు లభ్యము కాలేదు కొన్ని నాకు తెలియనే తెలియక పోవచ్చును. కొన్నిటిని ముఖ్యములు కానేరవని వదలియుంటిని ఇందలి కొన్ని పలుకులు కొంత మందికి రుచింపక పోవచ్చును గూడ. అట్టి వారు నాపై కినియకుందురు గాక!

కర్ణుని భ్రాతృవాత్సల్యము

శ్రీ దీపాల పిచ్చయ్యశాస్త్రి

స్వామి ద్రోహులు ద్రోణ భీష్ము లను దుర్భావంబు పుట్టించి నీ
వేమో స్వామికి మేలుగూర్పుటకుఁగానే పూనియున్నట్టు లి
య్యా మార్తాండకుమార! రాజునెడ సౌహార్దంబు నొల్కించి, మి
థ్యా మైత్రిన్ నటియించినావు కద! సి యాంతర్య మే మింకకున్?

కాదయ్యా, కురురాజు నీదు చెలిమిం గాంక్షించి, పోషించి, యా
పై దేశాధిపతిం బొనర్చి కడు సంభావించుటే గాక నీ
యాందేశంబులకే పిధేయుఁడయి నిన్నర్పించెనే, దాని కీ
వేకీ చేసిన మేలు! వాకొనుము శ్రోతృ శ్రోత్రపేయంబుగా.

తండ్రిమాట వినక, తాతను గైకోక, గురులబుద్ధి లెక్కగొనక యతఁడు
కార్యఖడ్గమునకుఁ గాలువాఁడనని నిన్ను నమ్మి కట్టె పెత్తనమ్ము నీకు.

మొదటినుండి తుట్టతుదిదాఁక నతనికి మనసు పట్టియాక మభ్యపెట్టి
తగని కృత్యములకుఁ దార్చి యాతని పైపిచూర్చితి వదేమి న్యాయమయ్య!

ఘోషయాత్ర కంచుఁ గొంపోయి గంధర్వపతికిఁ బట్టియిచ్చి పైదొలఁగితి,
వాఁడు నతని సతులు నవమతిపాలైరి అదియు మిత్రకృత్య మగునె? కర్ణ!

అచట బందియైన యా మహారాజును విజయుఁ డేగ్గొ వచ్చి విడిచిపుచ్చె
నతఁడు రాకయున్న ఆ బందిఖానలో మ్రగ్గియుండుఁగాదె మనుజవిభుఁడు?

పరపరిభూతుఁడై నగచు పార్థుఁడు జయ్యనఁ జేరవచ్చి, "మా
యురె! నరనాథ! శాత్రవుల నోర్చియు నక్షతుఁడౌచు నొప్పు ని
న్నరసితి, సంతసించితిఁ, గృతార్థుఁడనైతి" నటంచు మెచ్చితి,
వెఱుఁగనియట్లు, ఇద్ది యవహేళనమా! నిజమా ప్రశంసయా?

"విరథుండవై వికర్ణుప యరదముపై నెక్కి నద్ద యాజికిఁ దొలఁగం
బఱచె" నని బొంకితివి, నవ్వరె ని యీ మాట విన్నవారలు? కర్ణా!

అరచ మ్రోలట కరిగిన నట కరుగునె విజయు మనరథికుఁ? డధిపుని దురమం
దిటకించి చల్లగ రణాజిరమున్ విడిపోతి వెట్టి చెట్టకనంబో!

"ప్రాంతపగలు మఱచి పాండునితోఁ బొత్తు చేసికొ"మ్మటంచు జెప్పె శకుని;
"పొత్తు తగదు నీకు పోరె మే" లంటివి, విర్వురందు స్వామిహితుఁ డెవండు?

"మఘవసూను నేను మర్దింతు, నరవాయు గొనక రాజసూయమునకుఁ గడఁగు"
మంటి, వందు సత్య మావంత యున్నదే? కేవలంబు మోసగింపు గాక!

బంధు సంక్షయంబు బహుజనప్రళయంబు పైఁప కార్యలెల్ల సంధి గోర,
"సంధి వలదు, వలయు సమర"-మంటివి; యెందు కాహవమ్ము మీఁద నాశ రంధి?

సంధి కొప్పియున్న సగభాగ మిమ్ముల నొందియుండు నల సుయోధనుండు,
నీవు కలను పెట్టి నిర్వహించిన దేది? భాగ మెడసె; నతఁడు ప్రాణ మెడసె.

అది యటు లుండనిమ్ము, మహితాస్త్ర విదుల్ జగదేక వీరు లా
నది తనయుండు ద్రోణుఁడు రణంబున ఫల్గును గెల్వ శక్తిచా
లదు తమకంచుఁ జెప్పఁగఁ, జలంబునఁ గెల్చెద నంటివీవు; రా
జది నిజమంచు నమ్మి చెడె నక్కట! వంచన మిత్రధర్మమే!

ధూర్జటి నొంచిన వీరుం డర్జునుఁ డచ్యుతుఁడు సాయ మతనికి; నతనిన్
నిర్జింతుననుట జిహ్వా ఖర్జువుగా కలవిమైన కర్జమె నీకున్?

ఉత్తరగోగ్రహణంబునఁ జిత్తైపోయితివి విజయుచేతనె, అట నీ
సత్తా బయలైనను రాజుత్త యమాయికుఁడు తెలియ కూబినిఁ బడియెన్.

గృహపదున కోడి, సాత్యకి నెదుర్కొనఁ జాలక వీఁగి, భీముచే
నపజితి నంది తీవు, నిను నాలములో నెదు రొడ్డఁ గ్రీడికిన్
న్నృపు; డది ముప్పదెచ్చునని నీవును జెప్పవు కుత్సితుండవై;
అపగతబుద్ధి యా దణియ; స్వార్థపరుండవు నీవు—చెల్ల రే!

గాండీవధనుఁ పటు దోశ్చండిమ దుర్ధర్షమనుట స్వాంతంబునకున్
ఖండితముగఁ దెలిసియు నృపు భండనమున దింపు టహితభావము గాదే!

భీష్మమీఁద నలిగి భీష్మించుకొని యుంటి
వాల ముజ్జగించి, అట్లు స్వామి
హితముఁగోరువార లెవ్వ రౌనర్తురు?
నీవె చెప్పవయ్య, నీతివిదుఁడ!

పాకవేయ పక్షపాతియై యింద్రుండు కోరె నిన్నుఁ గవచకుండలములు.
ఎఱిఁగి యెఱిఁగి యిచ్చితి; వది నృపతికిఁ జేటుగాక మేలుచేయ టగునె?

ఇతరాళక్య మహార్ఘదానముల నీ వెన్నెన్ని యేనాఁడొన
ర్చితివో, లోకము 'దానకర్ణు' డని కీర్తించున్ నినున్ నేఁటికిన్;
కృత కృత్యుండవె; కాని, ని ఘనవితీర్ణిన్ దెల్పు ఘట్టంబు భా
రత మందొక్కటియుం గనంబడదు కర్ణా కారణం బేమొకో!

శిబిదధీచుల సరిపంక్తిఁ జేర్చి నిన్నుఁ ద్యాగిగా నెన్నుదురు; దాని కరయ మూల
మితరదానమ్ము లేవియో యేమొగాని కవచకుండలదానమ్ము గాదు సుమ్మ!

ఇంద్రువలన శక్తి ముందుగాఁ గైకొని యవలఁ గుండలములుఁ గవచ మిచ్చి;
తదియు దాన మౌనె వ్యాపార సరళిలోఁ జేర్పఁదగిన కుండమార్పు గాక!

"ఆజి సుయోధనాది శత, మట్టులె నేను గతింతు, మర్వికిన్
రాజగు ధర్మజుం" డని జనార్దనుతో వచియించి, మత్సరో

త్తేజక వాక్కులన్ నరపతిం బురికొల్పితి వాజి; "కందు నీ
దే జయ" మంచు నొక్కి వచియించితి, వెంతటిమోస మక్కటా!

"పాండవులందఱిన్ దునిమి పట్టముగట్టెద నిన్నఖండ భూ
మండలి" కంచు రాజుకు ప్రమాణముచేసి వచించి, తల్లితో
"గాండివిఁ దప్పఁ దక్కొరులఁ గాచెద" నంటివి; నీకు నాలుకల్
రెండ? ఒకండ? ఆర్జవ ముళిక్కె గదా పరికింప నీయెడన్!

ఆ సుయోధనునకు నాయోధనపు మత్తు మందు త్రాపి త్రాపి మందఁ జేసి;
తతఁడు మేలు కీడు నరయు తెల్వినిగూడ కోలుపోయెఁ; దనువుఁ గోలుపోయె.

రవిపుత్రా! 'అనృతానులాపమును, మిత్రద్రోహమున్, పాపహే
తువు'లన్ పల్కు లెఱింగియున్ 'శమనపుత్రున్ రాజుఁగావింప దు
ర్వ్యవసాయం బయినం బొనర్చుటె యవశ్యం' బంచు భావించి యుం
దువు, కాకుండిన నేలపూన్తు వనికిన్ దుర్యోధనున్ వంచనన్.

తోడఁబుట్టువులను దురమున గెలిపింప బుద్ధిపూర్వకముగ ముందు నీవు
పొలిసి, పిదప నృపునిఁ బొలియించితివి. భ్రాతృరక్షణంబె త్వత్పరాయణంబు.

కౌరవరాజు కాఁపురము గగ్గులకా డయిపోయె, రాజ్యల
క్ష్మీరమణీ విలాసరుచి మించె యుధిష్ఠిరు కాఁపురంబు, గాం
ధారిసుతుం బ్రతారణ మొనర్చి నిగూఢ సహాయతన్ సము
ద్ధారముచేసినా వల పృథాసుతులన్—నిజమా? అబద్ధమా?

"నిను భ్రాతృ వత్సలుండని ప్రణుతింపఁగ దగునుగాని ప్రభుభక్తి పరుం
డనఁజెల్ల" దందు, నిది నీ కనుమతమో కాదో చెప్పవయ్యా, కర్ణా!

* * * *

కౌరవనాథునిం జెఱచి కర్ణుఁడు స్వామి హితుండటంచు కై
వారము లందినా; డతని బాగును గోరి శ్రమించి, సన్నుతో
దారచరిత్రులౌ గురుపితామహులో ఖలు లంచు దూఱుప
డ్డారు, వివేకశూన్య వికట ప్రతిభానుల దుర్విమర్శలన్.

కపటపుచెల్మి రాజును దగా యొనరించినవాని "భక్తుఁడం"
చుపకృతి సేయనెంచి హిత మొప్పఁగఁ జెప్పినవారి "ద్రోహులం"
చపలపనమ్ము లెవ్వరో వెలార్తురుగాక యథార్థ వృత్త మో
ట్లపచితి నొందు భారత కథార్థవివేకు లనేకు లుండఁగన్?

రాజనీతిజ్ఞులు - రచయితలు

శ్రీ జొన్నలగడ్డ సత్యనారాయణమూర్తి

ప్రపంచ సాహిత్య చరిత్రలను పరిశీలించినప్పుడు సమకాలీన చారిత్రక ప్రభావముసాహిత్యముపై ప్రసరించిన తెరగు గోచరించును జీవనదర్పణము సాహిత్యము జీవన మందలి ఒడుదుడుకులు, బ్రతుకులోని మిట్రు పల్లములు కవిదృష్టినుండి చెదరవు వాని గుండెను తాకని, హృదయమును స్పృశింపని అంతరంగమును కదలింపని పరిస్థితు లుండవు ఆతని చేతిలోని త్రవ్వ కోల ఆంతరంగమందలి యపరంజిని బయట బెట్టును లోని మణులను వెలుపల నిలుపును రాజకీయము లొక్కొక్కప్పుడు ఈటెలు చేబూని గుండెను గ్రుచ్చివేయును. తీవ్ర సంఘర్షణమున ఏరులై నెత్తురు ప్రవహించు టెరుగుదుము. నిరంకుశత్వము నేల గూల్చుటకై కంకణము గట్టుకొనిన ధృతి సాహసములు జగతిపై విజృంభించుట మన కవగతమే సమ బుద్ధితో బీజాక్షరములను పురశ్చరణ మొనరించి క్రోలు పులిని గంగగోవును చేసిన మహిమ కూడ అందందు లోచన గోచర మగుటయు జూతుము ఉదాత్త భావనావీథులం దెగసి, చుక్కలతో చెలిమి సలిపి, దివ్య సంస్కృతీ మాధురికి వీనులొగ్గి దిగంతములందు ప్రతిభాద్యుతులను వెదజల్లి పతిత పునరుద్ధరణమునకై పాంసువటలమ న నవతరించిన పరార్థ జీవులను గాంతుము కళావ్రతులై, సౌందర్యోపాసకులై, ఆనందారాధకులై తమ్ము దాము మరచి దివ్య బృందావనములో శ్యామసుందరునితో నొప్పుల కుప్పలాడి, రాసక్రీడ సలిపి అవిరళానందమును జుర్రి జుర్రి పృథ్వీ సాహితికి సుధాబంధుర భావశబలతను ప్రసాదించిన కవివతంసులను విలోకింతుము

ప్రజా జీవిత పురోభివృద్ధికై కృషి సలుపువారు రాజకీయ వేత్తలు సింహాసనమునుండి ప్రసన్న దృష్టి ప్రసరించువేళ పన్నీటి పయోధిలో వీరు క్రుంకులిడుదురు అందుండి ప్రచండ దృష్టి అనలరాశిని క్రక్కునపుడు మణిస్థగితమైన గద్దెను తలక్రిందు లొనరించి, నిరంకుశత్వమును ధూళ్యవలుంఠిత మొనరించి, క్రౌర్యమును భూస్థాపిత మొనరించి, స్వాతంత్ర్య భేరి మ్రోగించి, ప్రజా హృదయమందలి ధృతి సాహసములను చరచి లేపి నవచైతన్యమునకు సాహితి నాటపందిరి జేసి వీరు మురియుదురు

రాజకీయములకును, సాహితికిని అవినాభావ సంబంధమును చూపు చారిత్రక ఘట్టములు ప్రాచీ ప్రతీచీ సీమలందు గలవు చెప్పనేల ? తేజోమయమైన సాహిత్యసృష్టి సముజ్జ్వల రాజకీయ శక్తిని ఉద్వేగ ప్రచలిత రాజకీయ ప్రజ్ఞ ప్రభాకలితమైన సాహితిని సృజించు టెరుగుదుము ఈ సాహితి మహోపన్యాసములందును, మేలికృతు లందును వ్యక్తమగు చుండును

గ్రీస్‌లో డెమొస్తనీస్, ఇటలీలో సిసేరో, ఇంగ్లాండులో బర్కు ఫాక్సు పిట్, షెరిడన్, పీల్‌పామర్‌స్టన్, డిజ్ రేలీ, గ్లాడ్‌స్టన్ ప్రభృతులను తమతమ సీమలందు రాజకీయములను నడపిరి వాల్టేరు రూసోల కలములు ఫ్రెంచి విప్లవమును రేకెత్తించినవి రూసో సాహిత్య సృష్టియే ఫ్రెంచి రాజకీయములలో రిచ్యూ రాబిస్ పియరీల జీవితములను నడపినవి మొదటి ఎలిజబెత్ కాలములో ఇంగ్లాండులో తలసూపిన నవ్య జాతీయ చైతన్యము నుండియే ఆంగ్ల సాహిత్య స్వర్ణయుగము సృష్టియైనది. మిల్టన్ కవీంద్రుని కలము క్రామ్‌వెల్ కత్తి కంటె పదును కలదై (Vide Areopagatika) ఇంగ్లాండులో 1642 మొదలు 1649 వరకు భీషణ విప్లవమును ప్రేరేపించి 1649 జనవరి 30 వ తేదీనాడు మొదటి చార్లెసు కుత్తుక నుత్తరించినది అమెరికనుల స్వాతంత్ర్యేచ్ఛకు ఘనతర ప్రభావమును చేకూర్చినవి ఎడ్మండ్ బర్కు మహోపన్యాసములే కదా ! (Vide Concilation with America and American Taxation) ఇంగ్లాండులో మూడవ జార్జి ఎలిజబెత్ విక్టోరియాల కాలమందును ఫ్రాన్సులో పదునాలుగవ లూయీ (1638—1715) కాలమందును విజృంభించిన రాజకీయ వేత్తలు సాహిత్య సామ్రాట్టులైరని చరిత్ర పాఠకు తెరుగుదురు

పూర్వోక్త పాశ్చాత్య రాజకీయ మహోద్యమములే భారతదేశములో 1885 లో కాంగ్రెస్ మహోద్యమ సృష్టిని పురికొల్పినవి ప్రపంచ రాజకీయ సారస్వత ప్రభావము గత శతాబ్దములో జనించిన ప్రముఖ రాజకీయ వేత్తలకు ప్రజ్ఞా విభూతులను ప్రసాదించినది బొంబాయిలో సమావేశమైన మొదటి కాంగ్రెస్ మహా సభాధ్యక్షుడు డబ్ల్యు సి బెనర్జీ, దాదాభాయ్ నౌరోజీ (1825—1917) సురేంద్రనాథ బెనర్జీ (1848—1925), లాల్‌మోహన్ ఘోష్ (1849—1906), బాలగంగాధర తిలక్ (185—1920), బిపిన్‌చంద్రపాల్ (1858—1932), మదనమోహన మాలవ్యా (1861 — 1946), ఆశుతోష్ ముఖర్జీ (1864—1924), లాలా లజపత్ రాయ్ (1865—1928), గోపాలకృష్ణ గోఖలే (1866—1915), వి ఎస్ శ్రీనివాస శాస్త్రి (1869—1946), మహాత్మా గాంధి (1869—1948), అరవిందఘోష్ (1872—1950), మహమ్మదాలీ జిన్నా (1876—1948), సరోజినీదేవి (1879—1949), వీరేంద్రనాథ చటర్జీ (1880—1942), సత్యమూర్తి (1889—1943) మౌలానా అబుల్‌కలాం ఆజాద్ (1889—1958), సుభాస్‌చంద్రబోస్ (1897—1945), రాజేంద్రప్రసాద్, జె. బి కృపలానీ, రాజగోపాలాచారి, రామస్వామి అయ్యర్, రామస్వామి మొదలియార్, శ్యామసుందర చక్రవర్తి, భూపేంద్రనాథబాసు, మోతీలాల్ ఘోష్, వ్యోమకేశ చక్రవర్తి, పి సి రాయ్, ఆనందాచార్యులు, విజయరాఘవాచారి, పట్టాభి ప్రభృతులు భారత రాజకీయము లందు మహారథులు, సాహిత్య క్షేత్రమున వీరు అతిరథులు బంకించంద్ర రవీంద్రులు మహాకవులై తమ రచనల వలన, గేయములవలన భారతీయుల నుద్రేకించిరి శరచ్చంద్రుని "పథేర్ దావీ" రాజకీయభావ ప్రభాకలితమైనది జలియన్‌వాలాబాగ్ హత్యల అనంతరము సుబ్రహ్మణ్య అయ్యరు వలె రవీంద్రుడు తన సర్ బిరుదమును బ్రిటిష్ ప్రభుత్వమునకు తిరిగి సమర్పించెను ఇంగ్లాండులో వసించిన భారత పారసీక నాయక ప్రముఖులు భావ్‌నగర్ షాపుర్జీ షక్‌లత్‌వాలాలు మంచి వక్తలు వీరిలేఖినీరసనములు వాఙ్మయమునకును, రాజకీయ మహోద్యమములకును సమాన భావ శబలత జేకూర్చినవి వీరి జీవితములలో రాజకీయములు ముందు తలసూపినవో, లేక సాహితీసేవ తొలుత పొడసూపినదో, లేక రెండు రీతుల సేవ ఒకే పర్యాయము ప్రస్ఫుటించినదో తెలుపలేము ఒకే భూరుహమునుండి పెక్కు శాఖలు పలుదిశల వ్యాపించినట్లు ఒకే వ్యక్తిత్వము నుండి వివిధ రీతుల ప్రజ్ఞలు రాజకీయ, సాహితీ, సాంఘిక, ధార్మిక దిశలందు విస్తృతమగును.

గాంధి యుగములో రాజకీయవేత్తల దృక్పథమున కొంత పరివర్తనము గోచరించినది తాను రైతు నని, నేతకాడనని గాంధిజీ తెలుపుకొనెను టాల్‌స్టాయ్, రస్కిన్, థోరో లాయన గురువులు భగవద్గీత, బుద్ధ చరిత్ర, న్యూటెస్టామెంటులు గాంధిజీకి నిత్య భావోదనము ప్రసాదించినవి గాంధిజీ అనుచరులలో కొందరు నిక్కంపు అంతేవాసులైరి కలమును, రాట్నమును గాంధిజీ సమాన కౌశలముతో చేబూనెను కలమును, హలమును సమాన ప్రజ్ఞతో చేబూనినవా రెందరో లేరు రాజకీయ సాహిత్యములకిపు డవినాభావ సంబంధ మున్నదని ముక్తకంఠముతో తెలుపలేము.

పూర్వ గాంధియుగములో దేశసేవ ఆరంభించి, గాంధి యుగములో నవ్య దృక్పథముతో ఈ సేవను ధారాళముగా సాగించి అసిధారావ్రతమును నెరపి, అగ్నిపరీక్ష నెదుర్కొనినవారు కొంద రున్నారు గాంధి యుగములోనే భారత దిగ్వలయమున గోచరించి భారతాంబ నారాధించినవారు మరికొంద రున్నారు ప్రజాస్వామ్య ప్రభుత్వము మనదేశములో నెలకొనుట ముదావహము ప్రజ లందరికి వోటు హక్కు చేకూరుట సంతోషము వైదిక వాఙ్మయమున 'ఓం' కారమున కెంత ప్రభావ మున్నదో, రాజకీయ జీవితమున 'వోట్' కు అంత ప్రభావము కలదని గ్రహించినవా రెందరో మనలో లేరు చదువు సంధ్యలను బట్టి కాక వయసును బట్టి వోటు చేయు శక్తియున్నపుడు గణతంత్ర ప్రభుత్వము నిర్దుష్ట మూలబంధముపై నిలిచినదని తెలుప లేము చదువు లేనివాడు కోటి వోటులను ఒడిలో వేసుకొని మహామంత్రియై గద్దెపై కూర్చుండవచ్చును బుద్ధిబలములేని గద్దె వలన ముక్తి చేకూరునో లేక ముప్పు దాపురించునో ప్లేటో మహాశయుని "రిపబ్లిక్" (ప్రజా తంత్రము) చెప్పక చెప్పుచున్నది ప్రజాళిలో విద్య విస్తృతమైనపుడు, రాజకీయములకు వైదుష్యము చేదోడైనప్పుడు సారథ్యము చక్కగ సాగును ఒడుదుడుకులపాల బడక రథము సక్రమముగ నడుచును

ఈ సింహావలోకనము తరువాత తెలుగు నేలలో రాజకీయ నాయకు లలో రచయిత లెవ్వరో, రచయితలలో రాజకీయము లెట్లు పొడసూపినవో వివరింతును ఆంధ్రదేశమున నవయుగమున క్రొత్త తలపులెట్లు మొలక లెత్తి, నవనవోన్మేషములై పెంపొందినవో తెలుపుట నా యాశయము

సర్వస్థలములందు మంత్రద్రష్టయై నిలిచిన మహామనిషి రాధాకృష్ణ పండితుడు గంభీర వైదుష్య సింధువున నీతడు గంధ సింధురమై నిలిచి నాడు ప్రపంచ తాత్వికులందు సార్వభౌముడై సాహిత్య సమ్రాట్టయి, విశాల దృష్టిలో రాజ్యాంగ చరిత్రల నవలోకించుచు నేటి భారత ప్రభుత్వమున నీత డుపాధ్యక్షుడై నిలిచినాడు

సాహితీవల్లభుడైన రామలింగారెడ్డి, అర్థశాస్త్రవేత్తయై, ప్రముఖ రాజకీయశాస్త్ర పండితుడై కొంతకాలము రాజకీయములందు నిలిచి, మరల మైసూరు ఆంధ్ర, రాష్ట్రము లందలి విద్యాపీఠము నలంకరించినాడు

బందరు మండలములో ఎలకుర్రులో పుట్టి, మద్రాసులో విద్య ముగించి, బొంబాయిలో 1908 లో ఆంధ్రపత్రికను వార పత్రికగా స్థాపించి, అనంతరము చెన్నపురికి తిరిగివచ్చి, ఆంధ్రపత్రికను దిన పత్రిక జేసి, సాహితీమందిరములో "భారతి"తో దానిని స్థాపించి, "ఆంధ్రగ్రంథమాల" యందు పెక్కు తెలుగు కైసేతలను సమకూర్చి, ఉద్గ్రంథములను రచించి, గీతా వ్యాఖ్యానములో ఘన పాండితిని వ్యక్తీకరించి, ఆంధ్ర వాఙ్మయ చరిత్రయందు బహుళ సాహిత్యాంశములను తెలిపి, లనేక గ్రంథములకు పీఠి కలు వ్రాసి రాజకీయ సారస్వతములందు సమాన ప్రజ్ఞను చూపిన ప్రజ్ఞా ధురంధరుడు దేశోద్ధారకుడు శ్రీ నాగేశ్వరరావు

భోగరాజు, ముట్నూరు, కోపల్లె, వల్లూరి, అయ్యదేవర, చిట్టా, వేమ వరపు, కోలవెన్ను, ప్రభృతులు బందరులో సుశిక్షితులైన రాజకీయవేత్తలు. భోగరాజు శ్రీ గంజాం వెంకటరత్నము జామాత శ్రీరఘుపతి వేంకట రత్నము శిష్యుడు. ఇరువురి శక్తులు ఆతనిలో కేంద్రీకరింపబడినవి పట్టాభి రచించిన "కాంగ్రెసు చరిత్ర" ప్రపంచ ప్రశస్తి నందినది "ప్రపంచ రాజ్యాంగాలు", "భారతదేశ ఆర్థిక పరాజయము", "గాంధి సిద్ధాంతము— సామ్యవాద సిద్ధాంతము", "భారత జాతీయత", "భారతదేశములో భాషా ప్రయుక్త రాష్ట్ర పునర్విభజనము", "ఆరోగ్య విధులు" మున్నగు కృతుల కీతడు కర్త ఆంగ్లాంధ్ర హిందీ సంస్కృతములందు ఇతని ప్రజ్ఞ ఎల్లర కును విదితమే బందరు నుండి ఈతడు వెలువరించు చుండిన "జన్మ భూమి" ఆంగ్ల సాహిత్య ఖని నుండి త్రవ్వబడిన పసిడితునకలను వెద జల్లుచుండెడిది కలకత్తాలో నేను విద్యార్థిగా నుండిన కాలమున "జన్మభూమి"

లోని క్షైసేతం నేరుకొనుటకై ఆర్యభర్మ రీడింగు రూముకు ప్రతిదినము పోవుచుండువాడను

1905, 1906 వత్సరములలో వంగదేశమున నుదయించి సమస్త భారతావనియందు విస్తరించిన విప్లవోద్యమమున మూతన శక్తులు వ్యక్తమైనవి. నాటి యువకుల మూడ్కి క్రొత్త నవోదయము గోచరించినది సాహితీ సాంఘిక రాజకీయ వికాస మీ యుద్యమమున దృగ్గోచరమైనది (Renaissance, Revolution and Reformation) ఉద్యమముల సంయుక్త ప్రభావము ఒకప్పుడు గ్రీసు, ఇటలీ, ఫ్రాన్సు, ఇంగ్లాండ్, జర్మనీసీమ లందు వలె ఈ శతాబ్దారంభమున మన దేశమందు విజృంభించినవి వంగ మాతకు ఆంధ్ర జనయిత్రి చెల్లెలు వంటిది

ధార్మిక, సాంఘిక క్షేత్రములందు తొలుత బందరులో తన యంతే వాసులైన యువకులందు జాగృతిని సృజింపజాలిన మహనీయుడు రఘుపతి ఈతని నిర్మల జీవితము, గభీర పాండితి, ఆంగ్లమున వక్తృత్వ కౌశలము యువకులందు తన్మయత్వము కలిగించినవి రఘుపతి వలె మహా వక్తయైన బిపిన్‌చంద్రపాల్ ఆంధ్ర చరిత్రలో సింహరవ మొనరించినపుడు యువ ప్రతిభ ద్విగుణీకృత ప్రభావముతో ప్రజ్వరిల్లినది చిత్రలేఖనమున క్రొత్త రుచులను ప్రచురించిన వంగ కళాకారుడు బందరులో తన పీఠమును నెల కొల్పు కొనెను

యువకులైన పట్టాభి, కృష్ణారావు, హనుమంతరావులు త్రిమూర్తుల వలె సంయుక్త కృషి చేసిరి ఈ కృషియందే ఆంధ్ర జాతీయ కళాశాల నెలకొనినది నవయుగ సముద్భావ బహుళ శక్తుల కిది ఆటపందిరి యైనది పట్టాభి విశేషించి వక్తయై, హనుమంతరావు ఆచార్యుడై, కృష్ణారావు కృష్ణా పత్రికా జనకుడై కృషి సలిపిరి పట్టాభి రుద్రుడయి, హనుమంత రావు బ్రహ్మయై, కృష్ణారావు శ్రీవిష్ణువేయై నాడు వరలిరి బందరు నేలలో ఏదో ప్రత్యేక ప్రభావ మున్నదని తెలుప జెల్లును తరువాత చెళ్ల పిళ్ల మహాకవి అందుండియే కదా తెలుగు నేలలోని సాహితీస్యందనముపై అధివసించి రాజకీయ కురుక్షేత్రమునకు కవితా కళాక్షేత్రమును చేరువ జేసెను

ముట్నూరు మనీషి తరచుగా కలకత్తా పోవుచు, ముక్తారామ్‌బాబు వీథిలో మల్లిక్ భవన ప్రాంగణంలో వంగ నాయకులతో ఇష్టగోష్ఠి సలు పుచు తమ మానస సరోవరమును నవ్యభావలహరితో నింపుచుండెను కావు ననే ఆతని కలము నవ్యభావపూరమును వెలారించుచుండేది కృష్ణా పత్రికా సంపాదకీయ వ్యాస పరంపర నవవికసిత ప్రసూనవనమువలె నవనవోన్మేషమై యొప్పేది. గద్యలో కవిత్వము చెప్పు నేర్పు ఈతని కుండేది కృష్ణా పత్రికా సంపుటములు నవయుగ ప్రబంధములు

ముట్నూరి భోగరాజు కోపల్లె యారాధకులు భారతిని, భారతాంబను ఒకే వ్రత మండపమున నధివసించి ఆరాధించినను, ఆ తల్లుల నొకే యుయ్యాలలో నుంచి యూపి ఒండొరుల కంఠములు కలిపి మధుర గీతి కల నాలాపించినను ప్రత్యేక ప్రతిభలు కల మహా పురుష లగుటచే, వా రొండొరుల ఛాయా ప్రతిమలు కారు. విశ్వేశ్వరయ్య పాగా వలె కృష్ణారావు ఉష్ణీషము ఆతని వ్యక్తిత్వమును ప్రకటించేది. సౌమ్య గంభీర వదనము హృదయమందలి శాంతి ప్రాదయమును ప్రతిఫలింప జేసెడిది ఇక పట్టాభి? న్యాయవాది కాకున్నను కొమ్ములు తిరిగిన న్యాయవాదులకు నయితము శృంగ భంగ సన్మానముచేసి మాటల యీటెలతో ప్రత్యర్థుల నెదిరింప మక్కువ పడు మహారథుడు కోపల్లె కోటికోహినూరుల ముల్లె!

పాల్‌బాల్‌లాల్ (పాల్—బిపిన్‌చంద్రపాల్, బాల్—బాలగంగాధర తిలక్, లాల్—లాలా లజపతిరాయ్) ప్రభృతుల ప్రభావము, దైవీశక్తిగల అర విందుని రచనము, రఘుపతి ప్రబోధము ఆంధ్రధరిత్రిలోని మరికొందరు యువకుల హృదయమునందు సంయుక్తముగ హత్తుకొనెను అప్పటి బందరు యువకులలో శ్రీ వల్లూరి సూర్యనారాయణ, శ్రీ వేమవరపు రామదాసు, శ్రీ అయ్యదేవర కాళేశ్వరరావు లుండిరి.

సూర్యనారాయణ వకీలై, దేశభక్తుడై, దైవభక్తుడై, త్యాగమూర్తియై వరలినాడు. ఆత్మవిశ్వాసముగల మనీషి అతడు పెద్దలైన నాయకు లేమి పలికినను, వివేకముతో దానిని పరిశీలించి, విమర్శించి గ్రహించుట ఆతని యలవాటు ఆతని ఆత్మవిశ్వాసము అచల మహీధరము బోలునది. ఉదారాశయములచూపు నతడెన్నడు జరింపనీయలేదు తన యూహలను ధృతి సాహసములతో నతడు వ్యక్తీకరించువాడు తన యూహ లందలి గభీర తాత్పర్యమును గ్రహించి, తన యడుగుజాడల నంటి వర్తించు అర్ధాంగ లక్ష్మి లభించుట ఆతని యదృష్టము వయసు పడమటి దిశకు మరలు వేళ నతడు గోదావరీ సరిత్తిలకము నాశ్రయించి కొవ్వూరులో ప్రవేశించి వైజ్ఞానిక, ఆధ్యాత్మిక మహోద్యమములకు చేయూత ప్రసాదించి ధన్యజీవి యైనాడు తన పిల్లలకు సముచిత విద్యాబుద్ధులు గరిపి, తమ తమ శక్తులపై నాధారపడుడని హితవు ఒసగి, సొంత సంపాదనలో శేషించిన డెబ్బది యైదువేల రొక్కము నతడు సర్వతోముఖ ప్రజాకళ్యాణమునకై ధారపోసెను

శ్రీ వేమవరపు రామదాసు బందరులో వకీలై చెన్నపురి వచ్చి హైకో ర్టులో ప్రాక్టీసు సాగించి, దేశాభ్యుదయముపై చూపుంచి, కాంగ్రెసుకు భుజమొడ్డి కౌన్సిల్ ఆఫ్ స్టేటులో సభ్యుడై, సహకార మహోద్యమమును వలచి సర్వశక్తులను అందుకై వినియోగించెను ఎస్టేట్‌లేండ్ ఏక్టులోని క్లిష్టాంశములను స్పష్టీకరించి ప్రత్తిపాటి సత్యనారాయణరావుగారి సహకార మును గణించి ఆ చట్టపు నిర్వచనము ద్వారా ప్రముఖ న్యాయవాదులకును, న్యాయమూర్తులకును ఆతడు వాదోడై యుండెను జటిలములైన ఆర్థిక సమస్యలను అరటిపం డొలిచి చేతి కందించినట్లు సులభమైన ఆక లింతకు ప్రసాదించుటలో ఆత డందెవేసిన చేయి సాహిత్యముపై ఆతనికి ప్రీతి మెండు సనాతన సంప్రదాయము నారాధించిన తన సహధర్మచారిణి వలె ఆర్షమతముపై ఈతడు మిక్కిలి మక్కువ జూపువాడు విదేశముల కరిగి సహకారోద్యమం బెట్లు వర్ధిల్లుచుండెనో గ్రహించి మనదేశ మందలి యుద్యమమునకు ఘనతరసేవ జేసెను. శ్రీ నరసింహదేవర సత్యనారాయణ ప్రభృతు లీతనికి సన్నిహితులై గ్రంథరచనమందును, పత్రికా రచన మందును విశేష కృషి సలిపి భారతాంబ నారాధించిరి పంచాయతుల విస్తరణకు, పల్లె సీమల పురోభివృద్ధికి వీరు శతథా తపించిరి

బందరులో సుశిక్షితులైన దేశభక్తులలో శ్రీ అయ్యదేవర కాళేశ్వరరావు ప్రముఖస్థానము నలంకరించెను. రఘుపతి వేంకటరత్నమున కంతేవాసియై బహుళ గురుగుణముల నీత డలవరచుకొనెను ఆచార్యునివలె శాంతిసహన కారుణ్యములకు ఈతడు తన హృదయమును నెలవొనరించుకొనెను తన యుత్సాహమును, తన యుద్వేగమును తన హృదయమున చిక్కబట్టి అంత రంగ శక్తిని, క్రియలో వ్యక్తీకరించుటం దీతడు అందెవేసిన చేయి సింహ రవ మొనరింపక శాంతితారక మంత్ర పురశ్చరణ మొనరించు భక్తశిఖామణి ఈతడు ఉదారాశయజ్యోతిర్లింగంపై దృష్టి నిలుపును కాని తక్షణమే ఆశయ సిద్ధి కలిగితీరవలెనని ఈతడు పట్టుబట్టడు గీతామాధురిని, ఉపనిషన్మధు వును ఆపోశన మొనరించిన ఉపాసకుడు కావున, ఆత్మసంవరణమున ఆరి తేరిన మహనీయుడు కావున, నైపుణ్యసహిత కర్తవ్య నిర్వహణమే మహత్తర పూజయని నమ్మిన గీతాయోగి కావున, నిర్మల, నిర్దుష్ట జీవన నిర్వహణమే పరమ లక్ష్యమని యెంచిన స్థితప్రజ్ఞుడు కావున మహాపురుషులందు సయి తము కాళేశ్వరరావు ప్రత్యేక స్థానము నలంకరించెను రఘుపతి జీవన నీతి నికి మేలి మేలుబంతి యయ్యెను కావున సాంఘిక సారస్వత ధార్మిక రాజ కీయ మహోద్యమములపై ఈతని శక్తులు కేంద్రీకరింపబడినవి సంఘ మున తలయెత్తిన దురాచారములను దూషీకృత మొనరించి, పతితులను, వెనుకబడినవారిని ఉద్ధరించుటకై అర్ధశతాబ్దమునకు మున్నే ఈతడు ముందంజ వేసెను గాంధిజీ భారతీయ దిగ్వలయముపై తేజరిల్లుటకు మున్నే హరిజన సముద్ధరణమునకై ఈతడు చెవి గోసికొనెను స్త్రీజన పురోభి వృద్ధికై గ్రుక్కిళ్లు మ్రింగెను. 1905 నుండి ఈతడు బహువిధ మానవ సేవ యందు బద్ధదీక్షితుడై యుండెను

చరిత్ర యనిన ఈతనికి ప్రీతి మెండు ప్రపంచమందలి ప్రజా మహోద్యమముల యుదంత మీతడు గ్రహించి సముచిత జ్ఞానశక్తి నల

వరుచుకొనియే క్రియాంగణమున కాలుంచును సోవియట్ రష్యాను గురించి ఈత డేమీ వ్రాయక పోయినను ఆ దేశ చరిత్ర ఈతని యాకళింతలో నుండి యుండును. 1905 లో భారతదేశములో వలె రష్యా యందును ప్రజా విప్లవ మహోద్యమము లెనిన్ నాయకత్వమున ఆరంభమై, 1917 లో వించుక ముందంజ వేసెను. 1920 అక్టోబరులో విజయము సాధించెను భారతదేశమున 1905 లో అట్టి మహోద్యమము ఆరంభమై, 1917 లో మాంటెగూ భారతదేశ పర్యటన మొనరించినపుడు, మరింత బలమునంది 1920 సహకార నిరాకరణ ప్రణాళికలో మహత్తర ప్రభావమును పడసెను శ్రీ కాశేశ్వర మనీషికి ఈ యుదంత మవగతమై యుండును అటు చైనా నుండి ఇటు టర్కీ వరకు మానసిక సంచార మొనరించియే చరిత్ర గ్రంథ ములను ఇతడు రచించెను ప్రజాసేవకుడు కావున తన రచనలు ప్రజాళికి అవలీలగ బోధపడవలెనని ఈత డుద్దేశించెను కావున ఈతని కృతులందు వ్యర్థశబ్ద విజృంభణము కన్ను పొడుచుకున్నను కానరాదు ఈతని హృదయ మెంత నిర్మల మైనదో ఈతని రచనమును అంత నిర్మలమైనదే! శైలి రచయిత హృదయమునకు దర్పణము వంటిదే కదా!

భావ శబలత ననుసరించియే కదా క్రియా సఫలత యుండును సాంఖ్యయోగము నెరిగినవాడే జ్ఞానయోగ, కర్మయోగములందు సిద్ధహస్తుడు కాజాలును. జ్ఞానముపై నాధారపడని కర్మ ఒడుదుడుకు పని యగును ఒక్కొక్కప్పుడు భయంకర క్రియ యగును మహాత్ముల జీవనములు భాస్వదాశయ సందీపిత మహాగ్రంథములకు వ్యాఖ్యానములు కాశేశ్వరరావు ఉపనిషత్తులను జీర్ణము చేసుకొని, భావబంధుర వేదాంతగ్రంథమును రచించెను ఈతని గభీర వైదుష్యమును నిర్మల జీవిత లక్ష్యమును దృష్టాంతీక రించు ఉద్గ్రంథ మిది

గాంధిజీ తన పాంచజన్యమును పూరించినపుడు, ఈతని హృదయ మున శంఖారవము ప్రతిధ్వనించినది విశేషార్థమును చేకూర్చు తన న్యాయవాద వృత్తికి నీళ్లువిడిచి అతిరథులతో కలిసి ఈతడు సుఘోషమును పూరించెను నీన వేషములు లెక్కించు, సవాలుచేయు విపత్తులను గణించి, భావికాల స్వకీయ ప్రయోజనములను గుణించి ఈతడు తన కురుక్షేత్రమున ప్రవేశింపలేదు మోహరహిత ప్రజాసేవకు దశాబ్దులకు మున్నే ఈతడు శ్రీకారమును చుట్టెను కారాగారములు నోళ్లు తెరచుకుని ఆవులించిన దినములలో "ఆత్మార్పణ" మని ఈతడు కైదు గుండెలందు ప్రవేశించెను కిక్కురుమనక పెక్కు యిక్కట్టులను కౌగలించుకొనెను.

మహాత్ముని ఆదేశము నీత డెన్నడు కాదనలేదు. రాష్ట్రీయ స్వపరిపాలనము కొంత అవధియందు రాజాజీ నాయకత్వమున నిరువదిమూడేండ్లకు మున్ను మదరాసులో నెలకొనినపుడు ప్రధాన పార్లమెంటరీ కార్యదర్శి యగుట కీతడు సమ్మతించెను రెండవ ప్రపంచ యుద్ధము విజృంభించినపుడు భారత నాయకుల అనుజ్ఞ బడయక బ్రిటిష్ సింహము చెలరేగినది. తొల్లింటి పద్ధతి తొలగిపోలేదు ఆత్మగౌరవ పరిరక్షణము భారతీయుల ధర్మమాయెను రాష్ట్ర మంత్రివర్గములు తమ పదవులకు తిలతర్పణము విడువవలసి వచ్చెను తన పదవిని ఫోర్టు సెయింటు జార్జికి సమర్పించి కాశేశ్వరరావు అవిచలితచిత్తుడై, ఎప్పటివలె దేశారాధనమున దీక్షితుడై వెలసెను.

ఆంధ్రులందరు ఒక్క త్రాటిపై నిలువవలెనని ఈత డుద్దేశించెను. ప్రాచీనాంధ్ర వైభవము సంఘీభావముపై, ఏకైక ఆంధ్ర శక్తిపై నాధారపడి యుండెనని యెరిగి విశాలాంధ్రోద్యమమును సాగించెను ప్రతిఘటన మెరుగని ఉద్యమ మేమియు నుండదు కదా! యోధుడైన కాశేశ్వరరావు స్వరాష్ట్ర సంపాదనమున, విశాలాంధ్రాశయసిద్ధి నందెను ఆంధ్ర శాసన సభలో స్పీకరై చాకచక్యముతో తన కర్తవ్యము నతడు నిర్వహించుచున్నాడు.

ఈతని శక్తి సామర్థ్యములను గుర్తించియే భారత ప్రభుత్వము "పద్మభూషణ" బిరుదముతో నీతనిని సత్కరించినది ఆంధ్ర విశ్వకళా

పరిషత్తు సాహిత్యమున డాక్టరేటు నీతనికి ప్రసాదించినది సాహిత్యసేవ లోను, దేశసేవయందును ముగ్గి పండైన ఒక మహనీయు నిట్లు గౌరవించిన మహనీయులు తమ్ము తాము గౌరవించుకొనిరి.

ఇటీవల ఈ మహాపురుషుని 83 వ జన్మదినోత్సవము భాగ్యనగరమున విశేష వైభవముతో జరిగినది అచిరములో సహస్రపూర్ణోత్సవము నిర్వహింపబడునని విశ్వసించు చున్నాను

శ్రీ వెంకటప్పయ్య, నరసింహారావు, సీతారామశాస్త్రి, గోపాలకృష్ణయ్య, ఉన్నవదంపతులు మున్నగువారు దేశభక్తులును, విద్యావేత్తలును.

ఆంధ్రమహా పురుషులలో మహోన్నత స్థానము నలంకరించినవారు శ్రీ వేంకటప్పయ్య యని గాంధిజీ భారతదేశము యావత్తూ సహాయ నిరాకరణ మహోద్యమమ బోరుకలంగువేళ బలికెను ఆచార్య మిల్లరు ప్రభృతులెందరు యువకులకో ఉన్నత విద్యను గరపి, విద్వాంసులందు వారిని మణుల జేసిరి. దేశభక్తులందు శమంతకమణి వెంకటప్పయ్య మహా వక్త యని, మేలి రచయిత యని ప్రశస్తి నందకున్నను ఈతడు సారస్వత ప్రీతి గలిగిన విద్వాంసుడని మన మెరుగుదుము సహకార నిరాకరణోద్యమము దృగ్గోచరమగుటకు చాలకాలమునకు మున్నే ఈతడు తన న్యాయవాద వృత్తిని విరమించి ఆంధ్ర భారతి నారాధించెను 1923 లో కాంగ్రెసు మహాసభ కాకివాడలో సమావేశ మైనప్పుడు ఆహ్వానసంఘ నాయకుడై ఈత డొసగిన ఉపన్యాసము గంభీరభావ బంధురమై అప్పటి సభాధ్యక్షుడైన మహమ్మదాలీవి, తక్కిన నేతలను అలరించెను

శ్రీ నడింపల్లి నరసింహారావు దేశమాతను బహుభంగుల ఆరాధించిన విద్వాంసుడు.

శ్రీ గొల్లపూడి సీతారామశాస్త్రి మహాత్ముని అడుగుజాడలను 'తు' 'చ' తప్పక అనుసరించిన దేశభక్తుడు వినయాశ్రమమును స్థాపించి, తాను తురీయాశ్రమమును స్వీకరించి, ఆంధ్రరాష్ట్ర సిద్ధికై 35 దినము లుపవసించిన త్యాగమూర్తి. కాలక్రమమున ఈత డొసగిన ఉపన్యాసములందుపనిషత్తుల విభూతి యుండెడిది

సార్థకనామము గల అర్ధాంగలక్ష్మితో దేశమాతను స్వకీయ దృక్పథము ననుసరించి సేవించు మహనీయుడు శ్రీ గోగినేని రంగనాయకులు కృషికజన సముద్ధరణ మీతని ప్రధాన లక్ష్యము రైతు సోదరులకు సయితము బోధపడు గ్రంథముల నీతడు తెలుగున రచించెను

శ్రీ కల్లూరి చంద్రమౌళి దేశమాతను ఈశ్వరుని సమాన భక్తితో సేవించు మహనీయుడు దేవస్థాన పురోభివృద్ధికై కృషి సలుపుచు భద్రాద్రి స్వామిపై ప్రత్యేక భక్తిని చూపి, హిందూమత సముద్ధరణకై నడుము గట్టు వ్యక్తి ఈతడు

శ్రీ మాగంటి బాపినీడు అర్ధాంగిసహితుడై భారతాంబ నారాధించు భక్తుడు రచయితయై కొండొక ఆంధ్ర సర్వస్వమునకు సంపాదకుడై ఈతడు వాసిగాంచెను

శ్రీ మోటూరి సత్యనారాయణ హిందీ ప్రచారమున విశేష కృషి సలుపు దేశభక్తుడు ఈతనివలె హిందీ నభ్యసించిన ఆంధ్రు లెందరో లేరు. ఆంధ్రవాఙ్మయమున విశేష పరిశ్రమ చేసి, ఆంధ్ర విజ్ఞాన సర్వస్వ సృష్టి నాదర దృష్టితో వీక్షించు విద్వాంసు డీతడు

శ్రీ బెజవాడ రామచంద్రారెడ్డి మహోదారుడైన మనీషి ఈతని హృదయము దయాసముద్రము తన యుద్దేశము ననుసరించి పెక్కేళ్లనుండి భారతాంబ నీత డారాధించు చుండెను బ్రిటిషు పరిపాలనమందు మద్రాస్ కౌన్సిల్‌ను శ్రీ చింతలపాటి నరసింహరాజు వలె చాకచక్యముతో నడపెను అనాడు ఏటికొప్పాకు బుచ్చిరెడ్డిపాలెము మానసికముగ పొలిమేరలో నుండెను

శ్రీ సంజీవరెడ్డి చాల యదృష్టవంతుడు కళాశాలలో చదువుకొను వేళ గాంధిజీ పిలుపునకు వీనులొగ్గి, స్వాతంత్ర్య సంపాదనకై తప్పించి ఈ యాశయము సిద్ధించిన తరువాత ఆంధ్ర రాష్ట్రమున మంత్రియై, ప్రధాన మంత్రియై, ఇపుడు కాంగ్రెసు అధ్యక్ష పీఠము నలంకరించుచు, యశస్త్రులకు డాయెను తన కృషికవంశము నుల్లేఖించుచు తొలుత నధ్యక్షపీఠము నలంకరించువేళ అట్టి సన్మానము లభించుట తన భాగ్యమని ఆతడు తన ప్రధానోపన్యాసములో చెప్పుకొనెను. ఆత్మవిశ్వాసముతో, ధృతి సాహసములతో ఈతడు తన ధర్మమును నిర్వహించుచుండెను శ్రీ వుచ్చలపల్లి సుందరయ్య, శ్రీ కొత్తగడ్డ రాజగోపాలరావు, శ్రీ కంభంపాటి సత్యనారాయణ, శ్రీ తరిమెల నాగిరెడ్డి గారు తమ తమ భావానుగుణముగా దేశారాధనమున సిద్ధహస్తులు. వీరు ప్రజారంగకులగు వక్తలు, రచయితలూను, వీరితో శ్రీ రాజగోపాలరావు గారు సంస్కృత భాషయందును గొప్ప విద్వాంసుడు

నేడాంధ్ర ధరిత్రిలో ముఖ్యమంత్రియైన శ్రీ సంజీవయ్య, రాజకీయ పరిజ్ఞానముతో సమానముగ సాహితీ కౌశలమును వ్యక్తీకరింకపజాలిన మనీషి. కవుల సమావేశమున ప్రసంగించినను, వాఙ్మయ మాధురిని గురించి ఏ సభాంగణమున ప్రసంగించినను తన వైదుష్యము నీతడు ధృతి సాహసములతో వ్యక్తీకరించుచుండును శ్రీ రంగారెడ్డి, లక్ష్మణరెడి ప్రభృతులు హృదయములతో తెలుగుతల్లి నారాధించిరి.

తెలంగాణాణ కోటిరత్నాలవీణ ప్రధాన మత సమన్వయమునక వలసిన ఆధారములం దున్నవి కాకతీయ విభూతిని వ్యక్తీకరించు శిల్పము నేడును అందు కనుల పండు వొనరించుచుండును రామప్ప దేవాలయ మహిమ నెవ్వ రెరుగరు బమ్మెర, పాల్కురికి కవులును, అప్పకవియును, విద్యానాథుడును వరలిన తావున ధూళి సయితము భావ బంధురమై యుండును కావున తెలంగాణా ప్రముఖులు రాజకీయములందును, సాహిత్యమందును సమాన ప్రజ్ఞను ప్రకటించిన మహనీయులు. వీరి సేవ సాహిత్యమందారంభమైనదో, రాజకీయములం దారంభ మైనదో సరిగ తెలుపుట కష్టము

శ్రీ సురవరము ప్రతాపరెడ్డి సాంఘిక రాజకీయ సాహిత్యసేవయందు సిద్ధహస్తుడు సాహిత్య అకాడమీ ప్రధాన పారితోషికమును పడయజాలిన ఒకానొక గ్రంథమీతని సృష్టియని యెరుగుదుము విశేష నైపుణ్యముతో నీతడు గోల్కొండ పత్రికను నడిపెను దురదృష్టవశాత్తూ ఈతడస్తమించినను ఈతడు వెలిగించిన ప్రదీపము ఆ పత్రికాలయమున తేజరిల్లెను

శ్రీ మాడపాటి హనుమంతరావు సుమారు అర్ధ శతాబ్దమునుండి దేశమాతను, వాగ్దేవిని ఆరాధించుచున్నాడు ఈతడు బహు భాషావేత్త సంస్కృతాంధ్రములందువలెనే, ఉర్దూ పరిష్యను భాషలందును ఆంగ్లమందును నిర్దుష్ట రచన సాగింపజాలు మనీషి ఈతడు ప్రతికారచనమున నీత డందె వేసిన చేయి. నేడు ఆంధ్రదేశమందలి కౌన్సిల్‌కు అధ్యక్షుడై ఈతడు నిర్దుష్టముగ తన కర్తవ్యమును నిర్వహించుచుండెను అనురాగ శాంతసేవలకలయిక ఈ మహనీయుని జీవనమును మూడురీతుల పూలగుత్తివలె సౌరభాన్విత మొనరించుచుండెను

ఆంధ్ర పితామహునివలె డాక్టర్ బూర్గుల రామకృష్ణారావు బహు భాషావేత్త పరిష్యన్, ఉర్దూ భాషలను అభ్యసించు నవకాశములు హైదరాబాదు వరంగల్లు మున్నగు తెలంగాణా పట్టణముల గలవు సంస్కృతాంధ్రాంగ్లములందువలె శ్రీ రామకృష్ణరావు ఈ భాషలందు ఘన పాండితిని సంపాదించి, తన యుపన్యాసములందును, రచనలందును తన సాహితీ నైపుణ్యమును వ్యక్తీకరించుచుండును గాంధిజీ అనుచరులలో నొక్కడై, అగ్నిపరీక్షలను ధైర్య సాహసములతో నెదుర్కొనిన మహావీరుడు రామకృష్ణారావు తిరువాన్కూరులో గవర్నరై, తరువాత ఉత్తరప్రదేశ్ గవర్నరు పదవి నలంకరించెను శాసన సభ్యుల సమక్షమున తొలుత నీతడు హిందీలో నుపన్యసించినపుడు వారాశ్చర్యపడిరి

శ్రీ రామానందతీర్థ రాజకీయములందు పాల్గొని, తన యుపన్యాసములందు ప్రజా కల్యాణ కాంక్షను ప్రకటించుచుండెను

తెలంగాణా యువకులలో గాంధితత్త్వమును సమగ్రముగి గ్రహించి నిర్మల హృదయముతో, పవిత్ర ప్రవర్తనముతో దేశ మాత నారాధించిన

యువకులు శ్రీ ఎం. ఎస్ రాజలింగం, శ్రీ కోదాటి నారాయణరావు, శ్రీ సుగ్గల అక్షయలింగం ప్రభృతులు గ్రంథాలయోద్యమముతో కూడా వీరికి జోక్య ముండుటచే రాజకీయ సాహిత్యముల సంబంధము లెరిగిరి

ఆంధ్ర పార్లమెంటరీ సభ్యులు పంచాయతు పురోభివృద్ధికొరకును, సాహితీ ప్రబోధ ప్రచారమునకును విశేష కృషి సలుపు చుండుట సంతోష కరము

బరంపురం పర్లాకిమిడి మున్నగు పురములు నేడు ఒరిస్సాలో పడినవి సుప్రసిద్ధ ఆంధ్ర నాయకులు పల్వురందున్నారు. ఉన్నవ, వరహాగిరివారు బరంపురమున సుప్రసిద్ధులు. శ్రీ వి. జోగయ్యపంతులు సుప్రసిద్ధ న్యాయవాదియై, రాజకీయవేత్తయై, విద్యాధికుడై చూపిన మార్గమునే అతని తనయుడు శ్రీ వి వి. గిరి అనుసరించెను కార్మికదళముపై ఈతనికి ప్రీతి మెండు మదరాసులోను, కేంద్ర ప్రభుత్వమందును మంత్రియై సింహళమందు హై కమిషనరై, ఉత్తరప్రదేశ్‌లో గవర్నరై, నేడు కేరళమందు గవర్నరుపదవి నలంకరించుచు, శ్రీ శివానందస్వాములవారికి సన్నిహితుడై సారస్వతప్రీతి నీతడు వ్యక్తీకరించుచున్నాడు

శ్రీ తెన్నేటి విశ్వనాథము ఆంగ్లమందును, ఆంధ్రమందును విశేష పాండితిని సంపాదించియే, న్యాయవాదవృత్తినుండి దేశ సేవలో నడుముగట్టి ప్రవేశించెను శ్రీ ప్రకాశమున కీతడు సన్నిహితుడు. దేశాభ్యుదయమునకై ఈతడు తపించెను తెలుగువారి హక్కులకెట్టి ధక్కా తగులనీయని వీరుడు. కవిత్వము చెప్పగల విద్వాంసుడు కళోపాసకుల నాదరించిన సహృదయుడు గాంధి తత్త్వమును గ్రహించిన మనీషి పరార్థ జీవితమే జీవిత పరమావధియని యెంచిన ఆంధ్ర ప్రముఖు డీతడు

శ్రీ ఈడ్పుగంటి రాఘవేంద్రరావు, శ్రీ భూపతిరాజా వెంకటపతిరాజు బి ఎస్ శర్మ ప్రభృతులు, శ్రీ సి వై చింతామణి, శ్రీ మోచర్ల రామచంద్ర రావు ప్రభృతులు పూర్వ గాంధి యుగమునుండి సేవ జేసిన మహనీయులు శ్రీ కోరుకొండ లింగమూర్తి, శ్రీ కోరుకొండ బుచ్చిరాజు, శ్రీ కోరుకొండ సుబ్బరాజు ప్రభృతులు గాంధిజీ యనుచరులై భారత మాత నారాధించుచు అనకాపల్లిలో శారదా గ్రంథాలయమును నెలకొల్పి సాహితీ సేవయందు బద్ధదీక్షితులైరి

మధ్యప్రదేశమందలి ఆంధ్రులలో ప్రత్యేక స్థానము నలంకరించి న్యాయమూర్తియై, నాగపూర్ విశ్వ కళాపరిషత్తు న నుపాధ్యక్షుడై, రాజకీయవేత్తయైన మాచిరాజు భవానీ శంకరనియోగి దేశమునకును వాఙ్మయమునకును చేసిన సేవ గణనీయమైనది

ఆంగ్ల పత్రికా సంపాదకులై, రచయితలై, రాజకీయవేత్తలై విశేష యశస్సు నార్జించిన మహనీయులు శ్రీ పున్నయ్య శ్రీ కోటంరాజా రామారావు, శ్రీ కె ఈశ్వరదత్తు, శ్రీ హనుమంతరావు, శ్రీ రామ కోటేశ్వరరావు, శ్రీ ఖాసా సుబ్బారావు ప్రభృతులు ఆంధ్రులు గుర్తింతురు గాక! వీరివలె పత్రికా సంపాదకులై రాజకీయ సాహిత్యాది మహోద్యమ నాయకులై వరలినవారు శ్రీ కాశీనాథుని, శివలెంక, నార్ల, నీలంరాజా మనీషులని నొక్కి చెప్పనక్కరలేదు శ్రీ శంభుప్రసాద్, వేంకటేశ్వరరావులు రాజ్యసభలో సభ్యులై కీర్తిగడించిరి

రచయితలలో రాజకీయవేత్తలను పేర్కొనవలెననిన ఆంధ్ర దేశమున పరిఢవిల్లిన సాహితీ సరిత్తిలక నుపలక్షించి, ఈ తీర్థము నాశ్రయించి, ఇందు గ్రుంకులిడిన విజ్ఞాన యాత్రికులను, కవితారాధకులను, సముజ్జ్వలములైన వీరి జీవిత దృష్టాంతములను ఒజ్జబంతు లొనరించుకొని వాగ్దేవి నారాధించిన సాహిత్య వ్రతులను మనము విలోకింపవలెను.

గోదావరీ స్రవంతి ఇట్టి సాహితీ శైవలిని. ఋషి కుంజరులును, కవి వృషభులును ప్రాచీన కాలమునుండి ఈ ఝరీమతల్లి నాశ్రయించి రమణీయమైన అచటి ప్రకృతి నవలోకించి, తన్మయత్వానుభూతితో గంభీరభావ బంధుర కృతులను సృజించిరి కావేరీ జలము త్రాగిన సంగీతము, గోదావరీ సలిలము గ్రోలిన కవిత్వము అలవడునని పలువురు తెలుపుకొందురు. చరిత్రకాల ప్రశస్తి అందరికి విదితమే! తూర్పు చాళుక్య భూపతిరాజ రాజనరేంద్రుని కాలములో విది ఆరంభమైనది అదే కాలమున ఇంగ్లాండులో ఆక్స్‌ఫర్డ్ కేంబ్రిడ్జి విశ్వ విద్యాలయములు నెలకొనినవి రెండవ హెన్రీ కాలములో రాజనరేంద్రుని కాలమందువలె వైదుష్య లతలు నలుదెసల విస్తరించినవి రాజమహేంద్రవరమును ఆంధ్ర ఆక్సుఫర్డని తెలుపజెల్లును రెడ్డిరాజుల కాలములో గూడ నిది సాహితీ ప్రభావము నందినది. వీరి కాలమున శ్రీనాథుడు లిందు వసించి, నన్నయ నారాయణభట్టుల యడుగు జాడలందలి కవితా రేఖల గన్గొని వాని యందలి గంభీరార్థమును గ్రహించిరి

ఆధునిక యుగమందును తొల్లింటి సంప్రదాయము సచలమై సౌందర్య సంశోభితమై యొప్పుచున్నది. ఇందు విద్య నభ్యసించువారు ఏ విషయము నైనను కావ్య దృష్టితో నవలోకించుచుందురు. కందుకూరి, వడ్డాది, శ్రీపాద, చిలకమర్తి కవు లిచ్చటివారే. కొంతకాలము బందరులో వసించినను శ్రీ చెళ్లపిళ్ల కవీంద్రుల జన్మస్థలము రాజమహేంద్రవరమునకు ఆరు మైళ్ళ దూరమందలికడియము ఈ మహాకవుల యంతేవాసులు కొందరు రాజకీయవేత్తలైనను, వారిది కవితా దృష్టి యని అవలీలగా గ్రహింపజాలుదుము. వీరి సహచరుడు శ్రీ న్యాపతి సుబ్బారావు హిందూ మాతను ఆంధ్రమాతను సమాన భక్తితో ఆరాధించెను

శ్రీ కూర్మా వెంకటరెడ్డి శ్రీ వీరేశలింగ కవి శిష్యుడు ఆంధ్రమందును, ఆంగ్లమందును ఘన పాండితి నతడు రాజమహేంద్రవరమున బడసెను. తెలుగు ప్రబంధములందలి శ్లీలాశ్లీలములను గురించిన సమీక్ష ఏలూరు న్యాయస్థానమున జరిగిన సమయమున అందు వకీలై యుండిన శ్రీ రెడ్డి నాయుడు ఆంధ్ర కావ్యమునందలి తన పాండితిని వ్యక్తీకరించి, మహా కవుల తలలూపించెను ఈతని భక్తి శ్రద్ధలనుండియే మహా మహోపాధ్యాయ బిరుదము శ్రీపాద వారికి లభించెను ఈ కవి సార్వభౌముడు తిలక్—మహారాజా నాటకము వ్రాసి తన దేశభక్తిని వ్యక్తపరచెను శ్రీ బిపిన్ చంద్రపాల్ రాజమహేంద్రవర

ములో 1905, 1906 లలో మహోపన్యాసము లిచ్చినపుడు, ఆతని ఆంగ్లోప న్యాసములకు తీసిపోని ఆంధ్రోపన్యాసములిచ్చి శ్రీ లక్ష్మీ నరసింహము తన రాజకీయ వైదుష్యమును ప్రకటించెను "భరతఖండంబు చక్కని పాడి యావు" మున్నగు పద్యములను రచించి, అతడు విద్యార్థులందు చక్కని ప్రబోధ మొన రించెను. వెనుకటి జాతీయోద్యమమున రాజమండ్రి, కాకినాడ మున్నగు తావు లందు శ్రుతి గోచరములైన జాతీయ గీతికలవలె గాంధి యుగమున శ్రీ తుమ్మల సీతారామమూర్తి చౌదరి రాష్ట్ర గాన మొనరించెను శ్రీ బలిజేపల్లి లక్ష్మీకాంత కవి స్వరాజ్య రథమును గురించి భావ బంధుర పద్యములు రచించెను. శ్రీ పింగళి లక్ష్మీకాంతకవి రచించిన స్వాతంత్ర్యజ్యోతి ప్రభాతమున నే డెల్ల తావుల గోచరమగుచున్నది విశాల దృష్టి గల శ్రీ వేలూరి శివరామశాస్త్రి గాంధిజీ "ఆత్మకథ" నాంధ్రీకరించి, తన దేశభక్తిని వెల్లడించెను శ్రీ పైడిపాటి కవి సమ్రాట్ జాతీయ గేయము నాలపించుచుండెను శ్రీ గరిమెళ్ల సత్య నారాయణ రచించిన 'మా కొద్దు తెల్లదొరతన'మను పాట ఎల్లరకు విదితమే!

రాజమహేంద్రవరమున ఆర్ట్సు కాలేజీలో మార్కుహంటర్ శిష్యుడై యుండిన శ్రీ గజవిల్లి రామచంద్రరావు, శ్రీ గాడిచర్ల హరి సర్వోత్తమరావు ప్రభృతులు బిపిన్‌చంద్రపాల్ మహోపన్యాసములను విని యనంతరము కళా శాలనుండి వెలుపలికి వచ్చి జాతీయోద్యమ స్యందనము నారోహించి భావ బంధుర గీతిక లాలపించిరి శ్రీహరిసర్వోత్తమరావు ఆంధ్రమందును, శ్రీ రామచంద్రరావు ఆంగ్లమందును ఘన పాండితిని సంపాదించి తమ రాజకీయ పరిజ్ఞానమును తమ రచనలందును, ఉపన్యాసములందును వ్యక్తీకరిం చిరి. వీరికి సహపాఠులై యుండిన శ్రీ బండి శ్రీ హరిరావునాయుడు మున్నగు వారును సాహిత్య రాజకీయ పరిజ్ఞానమును తమ తమ జీవితాంగణములందు వ్యక్తీకరించిరి డాక్టర్ బ్రహ్మజోస్యుల సుబ్రహ్మణ్యము సీతానగర రాజ మహేంద్రవరములందు వసించి, గాంధి తత్త్వమును తన మహోపన్యాసములందు ప్రకటించి, కుటుంబ సహితముగ దేశ మాత నారాధించి, లజపతిరాయ్‌వలె బ్రిటిష్‌వారి లాఠీ దెబ్బలకు గుండె నప్పగించి తదనంతరము తన ప్రాణము లను సయితము తన వ్రత దీక్ష యందే సమర్పించెను

ఆంధ్ర కేసరి ప్రధాన కార్యస్థానము రాజమహేంద్రవరమే! వాగేశ్వర మహీశివలె పిన్ననాడు నాట్యకళయందు విశేష ప్రీతి జూపి, గాంధిగారి ప్రధాన సహచరులలో నొక్కడైన శ్రీ ప్రకాశం ఆంగ్ల దిన పత్రికయైన "స్వరాజ్య"ను స్థాపించి, దానికి సంపాదకుడై యుండెను ఈతని "స్వీయ చరిత్ర" ఈతని రచనా కౌశలమును ప్రకటించుచున్నది

శ్రీ పాల కోడేటి సోదరులు గురుమూర్తి సూర్య ప్రకాశరావులు, చిలక మర్తివారి శిష్యులు. శ్రీ సూర్యప్రకాశరావు 1917 జూలై మొదలు 1918 మార్చి వరకు రాధాకృష్ణని శిష్యుడై రాజమండ్రి కాలేజీలో చదువు కొనెను. ఈ అన్నదమ్ము లిరువురు గాంధిజీ యుద్యమమున పాల్గొని కారాగారము లందు ప్రవేశించి, భారత స్వాతంత్ర్యసిద్ధికై తపించిరి ప్రేమ, భరిత హృద యముగల శ్రీ సూర్యప్రకాశరావు "ప్రేమజ్యోతి"ని వెలిగించి, ఆంధ్ర మందును, ఆంగ్లమందును గల తన సాహితీ ప్రజ్ఞను వ్యక్తీకరించుచు, అర్ధాంగ లక్ష్మియైన శ్రీ శ్యామలాంబ వెలిగించిన అఖండమునుండి ప్రసరించు కిరణ గుచ్ఛశిఖలు సర్వ దిశలందు తేజరిల్లుటకై శతధా తపించుచుండెను. జగ జ్జనని ఈతని యారాధ్యదేవి బుద్ధ ఏసు గాంధీ మహాత్ము లీతని వ్రత మండపమున వరిఢవిల్లు ఆదర్శాచార్యులు పరివ్రాజకుడైనను ఆధునిక రాజకీయవేత్తలకు దేశభక్తి మంత్రోపదేశము జేసిన శ్రీ వివేకానందస్వామిపై ఈతనికి భక్తి మెండు త్యాగమూర్తియైన శ్రీ సుభాస్‌చంద్రబోసుపై ఈత నికిగల ప్రీతి నిరుపమానము బోసు మహాశయు డెందోయుండి, స్వామికు తిరిగి వచ్చునని ఈతడు విశ్వసించుచుండును బుద్ధుడు 'ఆసియా జ్యోతి' యైనట్లు శ్రీ వినోబా 'విశ్వ జ్యోతి' అని శ్రీ సూర్యప్రకాశరావు విశ్వసించుచుండును ఈ మహనీయుని వర్తమున జేరిన పరార్థ జీవులు సీతా రామ యోగియును శ్రీ వెంపటి నారాయణుడును. వీరి ప్రవర్తనపై ఎన్నడును ఈగ వ్రాల లేదు.

శ్రీ సూర్యప్రకాశము సుప్రసిద్ధ జాతీయవాదియై, ఇప్పుడు తన దృష్టిని అంతర్జాతీయ శాంతిభద్రతలపై నిబద్ధమొనరించెను ప్రపంచ శాంతిని కాంక్షించుచు, తరచుగ నితడు దీర్ఘోపన్యాసములు పలుపుచుండును. తనపై జగజ్జననికి అవ్యాజవాత్సల్యము కలదని విశ్వసించుచు, తన యాత్మ శక్తిని పురస్కరించుకొని ఈ పవిత్రజీవి కఠోరవ్రతములు నిర్వహించు చుండును ఆంధ్ర భీష్మునకు సన్నిహితుడై, తొల్లిటి భీష్మునివలె దృఢ వ్రతమున దీక్షితుడై యుండు భక్త శిఖామణి శ్రీ సూర్యప్రకాశరావు.

శ్రీ గాడేపల్లి సూర్యనారాయణ సుప్రసిద్ధ దేశభక్తుడై, రాజమండ్రిలో శ్రద్ధానంద ఘట్టమున జాతీయ మహోపన్యాసము లిచ్చువాడు సమీప మందలి గోదావరీ ఝరితో ఈతని వాగ్ఝరి పోటీచేసి, దానికి దీటై యుండె డిది

గాంధిజీ యనుచరులలో నొక్కడైన శ్రీ వెన్నేటి సత్యనారాయణ— తన దృష్టిని నేడు విశేషముగ నిర్మాణాత్మక కర్తవ్యముపై కేంద్రీకరించు చుండెను కాంగ్రెసు మహోద్యమమును ఆరంభించిన మహనీయులలో ఒకడై కొంతకాలము కాంగ్రెసు కార్యదర్శియై, నేటి పెద్దలకు సయితము పితా మహుడై యుండిన శ్రీ న్యాపతి సుబ్బారావు పంతులు శ్రీ వెన్నేటి ప్రభృతు లకు సన్నిహితుడు. ఈ వృద్ధ నాయకుని ఆశీస్సు పల్వురు రాజకీయవేత్తల శిరములమీదివూలై విలసిల్లెను.

సారస్వతోపాసనమున నారితేరి, నాట్యకళపై ప్రత్యేక ప్రీతి జూపి, కవుల సన్మానించుటకై మిక్కిలి మక్కువపడి, సుందర భాషలో నుపన్యసింప నేర్చిన శ్రీ వసల సూర్యచంద్రరావు ఆంధ్ర శాసన సభయం దుపాధ్యక్షుడై, ఒక్కొక్కపు డధ్యక్ష పీఠము నలంకరించి, చాక చక్యముతో కార్యక్రమము నడుపజాలినవాడు.

గోదావరీ మండలమందు విద్వాంసులైన రాజకీయవేత్తలు కొందరు కాకి నాడలో తమ జైత్ర యాత్ర నారంభించిరి. శ్రీ బులుసు సాంబమూర్తి పండిత వంశమున బుట్టిన మనీషి. ధైర్యసాహసములు ప్రదర్శింపవలసి వచ్చి నప్పుడు తారాబలము చూచుకొని ముందంజవేయుట ఈతని పనికాదు. సాంబ మూర్తి త్యాగమూర్తి. ఏకైక పుత్రుని మృత్యుదేవత కబళించినను, సొంత యూరిలో కాంగ్రెసు సమావేశమైనప్పుడు కర్తవ్య క్షేత్రమున లభించిన ధీరుడాతడు అప్పటి కాంగ్రెసు గద్దెపై శ్రీ సరోజినీదేవి ఈ విషయము నుల్లేఖించెను. ఈతనికి సన్నిహితులైన యువకులు నవవికసిత మనస్సులతో దేశ మాత నారాధించిరి. శ్రీ మొసలికంటి తిరుమలరావు వీరిలో నొకరు. స్వయం కృషి, ఆత్మ విశ్వాసము లీతని సొమ్ములు ఈ వైదుష్యార్థమును వినియో గించి ఈతడు కేంద్ర ప్రభుత్వమున డిప్యూటీ మంత్రియై, అనంతరము రివాలో లెఫ్టినెంట్ గవర్నరై తన శక్తి సామర్థ్యములను ప్రకటించెను. ఆధ్యాత్మిక దృష్టి గలిగి శ్రీ మెహెర్‌బాబా ప్రబోధమును హృదయంగ మము జేసికొని, ఆంధ్రీకరణమున ఆంతరంగిక పరిణతి నందెను ఈతని యువ న్యాస కౌశలము ప్రశంసనీయమైనది శ్రీ కళా వెంకటరావు కాంగ్రెసు సెక్ర టరీయై, మంత్రియై, మతిమంతుడని ప్రశస్తినందెను శ్రీ పళ్ళంరాజు ప్రజా సేవను పరమావధిజేసుకొని మంత్రియై, రాష్ట్రకాంగ్రెసు సంఘాధ్యక్షుడై సంఘీభావ మంత్రోపదేశ మొనరించుచు, సైదోడులకు సముచిత మార్గ మును జూపుచుండెను. శ్రీ బి యస్ మూర్తి కాకినాడలో సుశిక్షితుడైన వ్యక్తియే రఘుపతి ప్రబోధము, పిఠాపుర మహారాజా ప్రభృతుల సాహా య్యము, సంఘ సేవకుల ప్రోత్సాహము, సంయుక్త ప్రభావముతో రాజ మండ్రి, కాకినాడలలో సంఘ సముద్ధరణము సుసాధ్యమైనది శ్రీ జాషు వాకు కవిత్వము రాజమండ్రి వీధులలో నబ్బెను కాకినాడలో శ్రీ బి యస్. మూర్తికి మాతృభాషయందు సముచిత ప్రజ్ఞలభించినది. శ్రీ వీరేశలింగ వేంకట రత్నములకు కాంగ్రెసు రాజకీయములతో జోక్యము లేకపోయినను, సంఘ సముద్ధరణమును ప్రధాన జీవిత లక్ష్యము జేసికొనిన పరార్థజీవులగు వారి శిష్యులు పల్వురు సంఘసేవయందలి వేరొక శాఖయైన రాజకీయ సేవయందు తమ యనుభూతి సామర్థ్యములను ప్రయోగించి ప్రశస్తినందిరి గాంధిజీ యాధ్వర్యమున నగ్రేసరమైన మహోద్యమములందు మదరాసులో శివషణ్ము

ఖమునకు, ఆంధ్ర వసుంధరలో శ్రీ వేముల కూర్మయ్య, సంజీవయ్య, బి. యస్. మూర్తులకును ముందంజ వేయుటకు చక్కని అవకాశములు లభించెను

దేశసేవయందును, సంఘ సేవయందును, సాహిత్య సేవయందును ఆరితేరినవారు స్త్రీలందును గలరు వంగ దేశమున శ్రీ చిత్తరంజనుని ధర్మ పత్ని శ్రీమతి వసంతాదేవియును, సోదరి శ్రీమతి ఊర్మిళా దేవియును దాస విరచిత సాగర సంగీతమును వందేమాతర జనగణగేయముల నాలపించినట్లు విశే షోత్సాహముతో మధుర మంజులనిస్వనముతో పాడువారు. గాంధిజీ పూరించిన శంఖము వీరి హృదయములందు విశేషోద్వేగమును బుట్టించెను వీరు కలకత్తా వీధులలో పికెటింగ్ చేసిన వరక్షణమందే లాల్ బజారు పోలీసు స్టేషనుకు పోవలసి వచ్చెను అనాడు కారాగారములు స్త్రీల కొరకు సయితము తమ ద్వారములను తెరిచియుంచినవి శ్రీ సరళాదేవి చౌధురాణి రాంబుజ్ దత్తుని అడుగుజాడలనంటి భారతాంబ నారాధించెను. శ్రీ జ్యోతిర్మయి గంగులీ వీరి తెరువు ననుసరించెను

శ్రీమతి కస్తూరిదేవి, శ్రీమతి సరోజనీదేవి, శ్రీమతి కమలాదేవి చటోపాధ్యాయ, శ్రీమతి రాజకుమారి అమృతకౌర్ మున్నగువారి ననుసరించి ఆంధ్ర దేశములో శ్రీమతి అన్నపూర్ణాదేవి, శ్రీమతి ఈడ్పుగంటి రత్నమాంబ, శ్రీమతి గోగినేని భారతీదేవి, శ్రీమతి రుక్మిణి లక్ష్మీపతి, శ్రీమతి కొండా పార్వతీదేవి, శ్రీమతి దుర్గాబాయి, శ్రీమతి వేదాంతం కమలాదేవి, శ్రీమతి పొణకా కనకమ్మ, శ్రీమతి ఉన్నవ లక్ష్మీబాయమ్మ, శ్రీమతి ద్రోణంరాజు లక్ష్మీబాయమ్మ, శ్రీమతి పెద్దాడ కామేశ్వరమ్మ శ్రీమతి అమ్మన్న రాజా ప్రభృతులు బహుభంగుల భారత మాత నారాధించిరి నేడు సింహళములో శ్రీమతి భండార నాయకే ప్రధాన మంత్రిపదవి నలంకరించినట్లు ఆంధ్ర ధరిత్రిలో నిరువురు నారీమణులు డిప్యూటీ స్పీకర్లు స్థానమున శోభిల్లిరి

శ్రీమతి దుర్గాబాయ్ రాజకీయోద్యమమునకు భుజమొడ్డి సంఘ సేవ యందు-ముఖ్యముగ స్త్రీ జన సముద్ధరణమునకై శక్తివంచనలేక కృషి సలుపుచు, ఆంధ్ర విశ్వ కళా పరిషత్తులో ఉన్నత పట్టములను వడసి, మదరాసు హైకోర్టులో అడ్వకేటుగానుండి, ఆంధ్ర మహిళా సంస్థను నెలకొలిపి, మహిళా పత్రికను స్థాపించి, కేంద్ర శాసన సభలో ప్రవేశించి, ఒక్కొక్కప్పుడు సభా కార్యక్రమమును నడపి, ఢిల్లీ ఆంధ్రోన్నత పాఠశాలను నెలకొలికి, వెంకటేశ్వర కళాశాలకు శంఖుస్థాపన మొనరించి, సర్వతోముఖ భారత శ్రేయోభివృద్ధికై బహు భంగుల కృషి సలుపుచు, ఉదారాశయ సిద్ధికై ప్రభుత్వ సహాయమును పడయుచు కార్యసిద్ధి బడయుట లోక విదితము ఆంధ్రాంగ్ల రచనలందును, ఉపన్యాసములందును ఈ సోదరీమణికి విశేష కౌశలము కలదు

రాజకీయ సాహిత్య సేవలందు విశేష ప్రజ్ఞను ప్రకటించిన మహా పురుషులలో శ్రీ ఉన్నవ లక్ష్మీనారాయణ మనీషి యొకడు. గాంధిజీ సహచరులలో నొక్కడై, దేశ మాత నారాధించుచు. గుంటూరులో శారదా విద్యాలయమును స్థాపించి, అర్ధాంగి సహితుడై స్త్రీ విద్యకై పాడుపడి "మాలపల్లి" యను ఉద్గ్రంథమును రచించి ఈతడు తన సర్వతోముఖ ప్రజ్ఞను వ్యక్తీకరించెను. స్వతంత్ర నవలా రచనలు తెలుగులో మిక్కిలి తక్కువ. వీనిలో నిది యుత్కృష్టమైనది. గుంటూరు కృషికుల జీవితమును చిత్రించువట్లు కొన్ని మాండలిక శబ్దములను రచయిత ప్రయోగించెను

శ్రీ దుగ్గిరాల గోపాలకృష్ణయ్య రాజమండ్రి ట్రెయినింగ్ కళాలలో నధ్యాపకుడై, సంస్కృతాంధ్రములందు చక్కని కవితను జెప్పగల సుధీవరుడై ప్రజలను రంజింపగల మహోపన్యాసముల నిచ్చుటయందు ప్రముఖుడై, గోష్ఠి కర్తయై, గాంధిజీ యనుచరులలో అగ్రశ్రేణిలోనివాడై, సుప్రసిద్ధ రాజకీయ వేత్తయై, విమలధిషణా ధురంధరుడై యొప్పారెను శ్రీ రామకృష్ణపరమహంసకును, శ్రీ వివేకానందస్వామికిని ఎట్టి సంబంధముండెనో శ్రీ గోపాలకృష్ణయ్యకును, శ్రీ గుమ్మిడిదల సుబ్బారావు మనీషికిని అట్టి సంబంధముండెను దుగ్గిరాల ప్రముఖుని కలలు గుమ్మిడిదల యోధుని జీవనమున ఫలించుచున్నవి

దేశ సేవకులలో, మహా వక్తలలో శ్రీ చెరుకువాడ నరసింహంపంతులుకు ఉన్నత స్థానము కలదు శ్రీ ముదిగంటి జగ్గన్న శాస్త్రి ఈతనికి సన్నిహితుడై, నెహ్రూ ప్రభృతుల ఉద్గ్రంథముల నాంధ్రీకరించుచు స్వంత కృతులను సృజించుచు బహుళ సన్మానములను వడయుచున్నాడు

శ్రీ అనంతశయనం అయ్యంగారు మన మేధావులలో నొక్కడు లోక్ సభాధ్యక్షుడై, అపుడపుడు భగవద్గీతా ప్రబోధము చేయు ధన్యు డీతడు ఆంధ్ర ప్రబంధము లితనికి సుపరిచితములని ఈతని యుపన్యాసములు రూఢి చేయుచుండును

సుప్రసిద్ధ భాషా సేవకుడై, రాజకీయములందు ప్రవేశించిన విద్వాంసుడు డాక్టరు గిడుగు సీతాపతి తండ్రి పూజనీయుడైన శ్రీ వెంకట రామమూర్తివలె ఆంధ్ర స్వత్వములకై పర్లాకిమిడిలోనుండి విశేష కృషి సలిపెను. ఈ కృషినిర్వహణమున ఇంగ్లాండున కరిగి ఆత్మ జీవితమున అసిధారావ్రతమును నిర్వహించిన వీరు డీతడు

ఆంధ్ర జాతీయ కళాశాలలోను, రవీంద్రుని శాంతి నికేతనమందును సుశిక్షితులై, ఉదారాశయ జ్యోతిర్లలకు జేజేలుపాడి, సాహిత్య సేవయందును, దేశ సేవయందును ఆరితేరిన సోదరులు మనకెట్టెదుట కలరు

శ్రీ శివలెంక శంభుప్రసాద్ ఈ సంస్థలందు విద్యనభ్యసించి, దేశోద్ధారకుని మార్గము ననుసరించి అగ్రేసరుడై, ఆంధ్ర శారదను, భారత జనయిత్రిని ఆరాధించుచుండుట ఆనందకరము "ఆంధ్ర పత్రిక", "భారతి", "సచిత్ర వార పత్రిక"లకు ఆంధ్ర గ్రంథమాలకు సంపాదకుడై ఈతడొనరించు సారస్వత సేవ లోకవిదితము ఆధునికాంధ్ర వాఙ్మయ చరిత్ర, ఆంధ్ర

జనయిత్రీ చరిత్ర ఆంధ్ర పత్రికా చరిత్రయందు వ్యక్తమగుచున్నవి విశేష త్యాగముపై ఆధారపడిన ఈ పత్రికా రాజములు పౌరాణిక సాహిత్య సంప్రదాయమును నవయుగ వాఙ్మయ వికాసముతో సమన్వయించుచున్నవి శ్రీ శివలెంక రాధాకృష్ణ పితృపాదుడును, పూజ్య మాతామహుడును చూపిన భావ బంధుర పథమున ముందంజ వేయుచు, విజయధ్వజమును చేబూనుచుండుట మహత్తర విషయము

కవి సార్వభౌమ ప్రభృతుల కృతులను ప్రోత్సహించి శ్రీకృష్ణ భాగవతమునకు కృతి భర్తయైన శ్రీ సాగి సూర్యనారాయణరాజు దేశభక్తుడై, స్వరాష్ట్రము లభింపకున్నచో, ఆ రాష్ట్రాశయ సిద్ధి అలవడువరకు ప్రాయోపవేశ దీక్షను నిర్వహింతునని పలికి తనతపఃఫలమునంది, రాష్ట్ర శాసన సభలో సభ్యుడై వెలసిన ధీరుడు

మహత్తర సంప్రదాయము ననుసరించి ప్రజాసేవ చేయు మహావీయుడు శ్రీ అల్లూరి సత్యనారాయణరాజు. ఈతని దృష్టిలోని ఉదారాశయమీతని యారాధ్య దైవము ఎందరెంద రేమి చెప్పినను, తన లక్ష్యమునుండి చూపును నడలింపని ధీరోదాత్తు డీతడు భగీరథునకు గంగపై నెంత మక్కువయుండెనో గోదావరీ, కృష్ణా నదులపై ఈ మహనీయుని కంత మక్కువ కలదు స్థితప్రజ్ఞగల మహావీరులలో, మంత్రులలో ఈతడొక్కడు

సుప్రసిద్ధ రాజకీయవేత్తయై, విద్యామంత్రియై ప్రజాళియందు సముచిత విద్యను వ్యాపింపజేయుటకై తపించుచు, సాహితీ సమాదరణమున సిద్ధహస్తుడైన విద్వాంసుడు శ్రీ పట్టాభి రామారావు

దేశభక్తిని సారస్వతాను రక్తిని వ్యక్తీకరించిన పెద్దలలో శ్రీ ప్రభల లక్ష్మీనరసింహము, శ్రీ బి ఎన్. శర్మ, శ్రీ అవసరాలరామారావు ప్రభృతులు యశస్తిలకులై యొప్పిరి

బందరు జాతీయ కళాశాలలో విద్య నభ్యసించి, అచటి మహాపురుషుల ప్రబోధమునకు బాల్య కాలమున మానసాంజలినొడ్డి, పిదప శాంతి నికేతనమున విద్యార్థియై, వంగ భాష నభ్యసించి, పృథు కవీంద్రుడైన రవీంద్రుని బోధ గ్రహించి, విశేష సాహిత్య ప్రజ్ఞ నలవరుచుకొని, అనంతరము మహాత్ముని అనుచరుడై—స్వాతంత్ర్యసిద్ధికై శక్తివంచనలేక కృషి సలిపి, కారాగారములందు వాగ్దేవి నారాధించుచు, మేలి కృతులను సృజించిన విద్వాంసుడు శ్రీ బెజవాడ గోపాలరెడ్డి రాష్ట్ర మంత్రివర్గ మేర్పడినపుడు తానొక సచివుడై, తరువాత కూడ ఆ పీఠమునే అలంకరించి, నేడు కేంద్ర మంత్రులలో నొకడై, నిరంతర దేశ సేవయందును, పరిపాలనమందును, దీక్షితుడై యుండి, అనల్ప భక్తితో నీతడు ఆంధ్ర భారతి నారాధించుచుండెను మొదట మంత్రియైనపుడు రవీంద్రుడు పంపిన ఆశీస్సు నిరంతర మీతనిపై తన ప్రభావమును విస్తరింపజేయుచున్నది గురుదేవునిపై ఈతనికి గల భక్తి విశ్వాసములు నిరుపమానములు శ్రీ గురుదేవశత వార్షిక మహోత్సవ నిర్వహణకై నెహ్రూ పండితునివలె ఈతడు లక్ష రూకల విరాళ మొసగెను శ్రీ విశ్వనాథ, ముదిగంటి మున్నగు రచయిత లీతని ఆదరాను రాగములనందిన భాగ్యశీలురు

శ్రీ గోపాలరెడ్డి పెక్కు గ్రంథములు రచించి, ఆంధ్ర సాహిత్య పరిషత్తు అధ్యక్షుడై విస్తృత వాఙ్మయ సేవ చేయుచుంచుట ప్రసిద్ధ విషయము రవీంద్రుని కృతులు కాళిదాసు, మాలిని, ఊర్వశి, ప్రకృతి ప్రతీకారము, విసర్జన, దేవయాని—చిత్రాంగద ఆరు నాటికలు శ్రీ గోపాలరెడ్డిచే ఆంధ్రీకరింపబడినవి మాతృకలతో వీనిని పోల్చిచూచినపుడు రవీంద్రుని హృదయ మందలి స్రవంతి నిరాఘాటముగా వీనిలో ప్రవేశించినదని గ్రహింపగలము అనువాద, అనుకరణ, అనుసరణములని తోపక ఈయన యాంధ్ర కృతులు సహజ సౌందర్య విరాజితములై విలసిల్లుచుండును

“హృదయశక్తి, మేధాశక్తులు, భవనా శక్తి సంకల్పశక్తులు, చింతా శక్తి క్రియాశక్తులు అంతరంగ మహిమను మేల్కొలుపును మనన నిదిధ్యాసన ధ్యానసమాధు లంతరంగ దిగ్వలయమును విశాల మొనరించును ప్రతికూల పరిస్థితులను మార్కొనినపుడు నిహితశక్తి తల యెత్తును ఉద్దేశ సిద్ధికి వలసిన వజ్ర సంకల్పము, అవిరత తపస్సువలన, నిరంతర కృషివలన ఘనతరమగును. కర్మవీరుని కృషి, విజ్ఞాన భాస్కరుని భావదీప్తి, భక్తియోగి ఉద్వేగము కలిసినపుడే రసబంధుర సాహితి మహదాశయ ప్రదీపిత కవిత సృష్టియగును ప్రగాఢ భావశక్తి వీరునకు ధైర్య సాహసము ప్రసాదించును శూరుని త్యాగశక్తి, శౌర్య మహిమ కవి హృదయమునకు శక్తిని, లేఖినికి మహిమను ప్రసాదించును ప్రపంచమున వీరు లేకున్న యెడల సాహిత్యమే యుండును రసభరిత సాహితిలేకున్న మహత్తర క్రియానిర్వహణమే యుండదు

ప్రాచీన అర్వాచీన, ప్రాచీ ప్రతీచీ పురాణములను, కావ్యములను పరిశీలించినపుడు ఈ నిర్వచనమును రూఢి చేయు బహుళ దృష్టాంతములు మానస గోచరములగును స్థల కాలములనుబట్టి రాజకీయములందు మార్పులుండవచ్చును నామ పరివర్తనము లుండవచ్చును

సాహిత్యోపాసకులును, మతాచార్యులును, రాజకీయవేత్తలును, మహావీరులును ఒకే లక్ష్యము గలవారు మంత్రులైన మహర్షులును, ఏలికలైన రాజర్షులును అన్యోన్య సంబంధము గలవారే కదా! చాణక్యునివంటి మహాజ్ఞాని, రాజనీతిజ్ఞుడు లేకున్న చంద్రగుప్తుడొక డుండువాడుకాడు సరస్వతీ సామ్రాజ్య మందలి రాష్ట్రమేకదా రాజకీయ సామ్రాజ్యము ప్రఫుల్లబుద్ధి ప్రసూనము నుండి వెలారు సౌరభము ప్రజా కల్యాణమునకు తోడ్పడు రాజనీతియందు లీనమై గంధ బంధుర సంఘమును సృజించును ప్రజాతంత్రమెట్టిదైననేమి, ఏమి పేరు గలిగినదైననేమి వివేక విహీనమైనచో నూర్వురనుకనిన అభాగినీ గర్భము వలె భీషణకురుక్షేత్రమున, సంకుల సమరమున మానవ లోకమును పురి కొల్పును ఈ దురంత దుస్థితి తొలగవలెనని భావోపాసకులును, క్రియాదక్షులును జీవాత్మ పరమాత్మలవలె గలియవలెను

సాహితీ కళ రాజకీయ శాస్త్రముల కలయికను బందరు కళాశాలలో నధ్యాపకులై కళారాధకులై, దేశభక్తులైన శ్రీ కాటూరి శ్రీ అడవి, శ్రీకోల వెన్ను సోదరులు అనిర్వచనీయమైన శక్తితో వ్యక్తీకరించిరి శ్రీ కాటూరి వేంకటేశ్వరరావు తన మధుర కవిత్వమందును, శ్రీ అడవి బాపిరాజు తియ్యని తన గేయములందును, శ్రీరామ కోటేశ్వరరావు గంభీరాశయ బంధురములైన తన వ్యాసములందును భావ భాస్వద్రోచులను ప్రకటించిరి దురదృష్టవశాత్తు శ్రీ బాపిరాజు అస్తమించెను

దేశ మాతకును, తన ‘త్రివేణీ’ పత్రికకును సర్వస్వమును ధారపోసిన త్యాగమూర్తి శ్రీ రామకోటేశ్వరరావు దేశసేవయందు కాలక్రమమున పసుపు కుంకుమలను చేతులందు జేర్చుకొనిన అదృష్టవంతులు కొందరు కలరు త్యాగాగ్ని కుండమందలి భస్మమే ఈ మహనీయునకు దక్కినది

తొలుత తెలుగు పత్రికా నిర్వాహణమును బందరులో సాగించి, అనంతరము అస్మదాదులవలె ‘స్వరాజ్య’ పత్రికలో చేరి, ప్రాయోపవేశదీక్షతో శ్రీ ప్రకాశంతో పందెమువేసి, నిర్మల హృదయముతో నిష్కామ కర్తవ్యమును నిర్వహించిన సోదరుడు శ్రీ రామకోటేశ్వరరావు ఈతని హృదయము రసభరితము. కారుణ్య బంధురము ఆర్థికముగ నెట్టి యొడుదుడుకులకు తనయొడి నొడ్డినను, సాహిత్య సేవయం దీత డంతర్జాతీయ ప్రశస్తినందెను. “త్రివేణి”కి నేడు ప్రపంచ సాహిత్య పరిషత్తులలో స్థానము కలదు శ్రీ సుబ్రహ్మణ్యము అనుంగుసైదోడై పత్రికాధిపతికి తోడుపడుచుండుట ముదావహము

ఈ మహనీయులు చూపిన వెలుగుబాటలందు భావికాల కళోపాసకులును, విజ్ఞాన యాత్రికులును, వైతాళికులును, ఆనందవ్రతులును, సౌందర్యారాధకులును భారత జనయిత్రిని సేవించుచు “సకల సద్గుణ నికురుంబయైన శారదాంబను” కీర్తింతురు గాక!

శివ కారుణ్యము

శ్రీ కోట సుందర రామ శర్మ

నీకారుణ్యము సాటిచెప్పఁగల వాణీపూజ నేఁ జేయలే
దే! కానీ, కవిరాట్టులం దొకరు మున్నే పోలికల్ పల్కలే
దా కల్పించి! ఇకేమి తెల్పఁగల, దేవా, నీదుకారుణ్యరే
ఖాకారానుభవాత్త భావన వినాగా, బర్వతేశ ప్రభూ!

నీకారుణ్యము కల్గెనా కవితలో నీరంధ్ర శాంభోదమా
లాకల్పంబుగ మానసంబు వెలయున్; రాదేని దయారేఖ యే
దో, కన్పించును శుష్కజీవనపుఁగోతుల్; నీకృపాలేశ మా
లోకింతున్ లభియించుదాకను గృపాఖ్యా పర్వతేశ ప్రభూ!

నీకారుణ్యము కల్గెనా సురసరిన్నీరేజ సౌవర్ణరే
ఖాకాంతుల్ విలసించు నామనసులో, గాదేని నాగుండెలో
ఏకాలంబును దీపమే యిడని యిల్లే మేలుగా ఘూకరా
వాకీర్ణంబగు పాడుగహ్వరమె కాదా, పర్వతేశ ప్రభూ!

తోలగంజేయు సమేధమాన రవికాంతుల్ శైలశృంగాలు నా
వరియింపం బాగమంచు; కాని మదిలోఁ బర్వున్ మహామోహ ధూ
మల మాదర్శము స్వచ్ఛతం గనదు సుమ్మా, త్వత్ పదాబ్జ స్రవత్
కరుణా స్వర్ణది వారిధారలు వినాగాఁ బర్వతేశ ప్రభూ!

వినఁగా నచ్చిన నాల్గుముక్క లదుకుల్ వెట్టంగ నే నేర్పు చూ
పిన దో నయ్యది సత్కవిత్వమొకొ! నీ పేర్మిం ప్రకాశించి కా
క! నటత్తాండవ సాట్టహాస విగళద్ గర్జామహాభీల ని
స్వనిత స్ఫాటిత దిగ్విదిక్తట నటేశా, పర్వతేశ ప్రభూ!

కలముం బట్టిన మాత్ర నెవ్వఁడయినన్ గాఁగల్గునే కావ్యక
ర్త? లవంబేనియు నీ దయారసము చిందన్ దివ్యవాసంతికా
పరమోదార లతాంత మాధుకరరావ శ్రీక గంధానిం
మ్ములు వాసించుఁ గవిప్రబువుండుఁ బలుకం బోఁ బర్వతేశ ప్రభూ!

నడ సాగించుఁ గలంబు పద్యరచనన్ దానట్టుచుం గుంటుచు
న్నలఘుప్రస్తరితాధ్వగంబగు రథం బట్లేచు; నావైపు నీ
తలమొగ్గింపుమొకింత, తావకమృదూత్తంసాయితేందుప్రభో
చ్ఛలవారాన్నిధియౌను నాహృదయ మీశా, పర్వతేశ ప్రభూ!

పుట్టం బుట్టువు నాముహూర్తబలమేమో కావ్యగంగాపగా
ఘట్టాలంకరణక్రియాచణమతుల్ గాబుట్టిరీ క్షోణిపై,
గట్టంబుట్టువుసామి సత్కవులు; సాకల్యా సదయాలేశ మీ
మెట్టుం జేరి నుతింతు నేడు గడుపేర్మిన్ బర్వతేశ ప్రభూ!

నాకన్నన్ దురదృష్టవంతు డొకఁ డుండబోఁ డట్టిఁ జెల్లగన్
వాకొం ద్రీ శతపద్యకర్త, లోకులే పాటంచు పాటించి, దే
వా, కన్పట్టట మానదేమొ! యగువో నాకైతలే వీడదగ్
నాకేమీ మందయ్య నీదు దయకన్నన్ బర్వతేశ ప్రభూ!

“ఆలుంబిడ్డలు కూడుసీళ్ళ కొఱకై యారాటమైపోవు మా
కేలా ఈశ్వరభక్తి పుట్టునని చింతింపంగఁ బోకండి, యా
కారుణ్యాలయుఁ జొచ్చుఁడీ శరణ”నం గా విందునే గాని, నా
కౌరా పుట్టదు బుద్ధి యిందుకుక, దేవా, పర్వతేశ ప్రభూ!

నా పాపంబులు కొండగాఁ బెరిగెఁ గన్నారెవ్వరేన్ లేనటుం
చే పాటింపక విఱ్ఱవీగితిని గానీ నకుఁ దోచున్ మహో
కూపారంబుగ నిల్లు; తేల్చవె కృపాంకూరంబు నందించి, ఓ
శ్రీపుణ్యాంకపురీ నివేశన, నమస్తే, పర్వతేశ ప్రభూ!

ప్రాభాతానిలమట్లు, శారద నదీ పానీయమట్లుం, ధర
ణ్యాభోగంబువలెన్, నిరంతర మనంతాకాశముం బోలెనుం
శ్రీ భాస్వత్తరుణారుణ ప్రభలటుల్ చెన్నొందు నీ సత్కృపా
సౌభాగ్య మ్మొకయింత చాలు, పరమేశా, పర్వతేశ ప్రభూ!

లోకుల్ మెచ్చుట కేమిగాని, కవితాలోకంబులో గ్రుడ్డినా
నాకేరీతిని సాయముంగొలుపు నన్నా, చీకటుల్ గ్రమ్మవో
నీ కారుణ్య విశుద్ధకాంతి కలదేనిన్ వేతునే యెన్నడేన్
జీకాకై మఱికొన్ని తప్పటడుగుల్, శ్రీ పర్వతేశ ప్రభూ!

ఉత్తంసాయిత తావకీన తరుణేందూద్దామితాస్మన్మహో
మస్తైనఃపటలాంధకార సరణిన్ బ్రాకట్యముంగన్న నా
యెత్తుల్ పల్లములన్ సమస్థితికిఁ దెప్పింపంగ త్వత్సత్కృపా
పాశ్చ స్వర్ధునివా స్తరంగములు లేవా, పర్వతేశ ప్రభూ!

పారంబేదిన బుద్ధిహీనతను, దుర్వారానుగచ్ఛన్మనః
ప్రారంభంబుల, నైంద్రియేచ్ఛలను, నద్ఘ్రాణాది గంధాదులన్
బోరాటింపఁగ శక్తిలేక తలఁపుల్ మూర్ఛిల్లెనిందాక; పై
పీరాజత్కృప గల్గ నింక వెఱపున్నే పర్వతేశ ప్రభూ!

తృతీయపురుషార్థము: భిన్నదృక్పథాలు

శ్రీ పి. గణపతిశాస్త్రి

మన దేశంలో బ్రిటిష్ పరిపాలనా వ్యవస్థ పాదుకొన్నప్పటినుండి సాంఘిక నియమాలలోనేకాక వైవాహికపద్ధతులలో, స్త్రీ పురుష సంబంధాలలో అనేక పరిణామా లేర్పడ్డాయి. సహగమనాది దురాచారా లంతరించాయి బ్రహ్మసమాజము, ఆర్యసమాజము, మొదలయిన మతా లీవిషయంలో చేసిన, చేస్తున్నసేవ చిరస్మరణీయమైనది. విడాకులచట్టము, సివిల్ మారేజీ చట్టము ఈ విషయాలలో స్త్రీ పురుషుల కించుమించుగా సమానమయిన అధికారాలు కలిగిస్తున్నాయి

సహేతుకములయిన ఈ పరిణామాల కెన్నయినా కారణాలు పేర్కొనవచ్చును పాశ్చాత్య పరిపాలనతో, నాగరికతతో సంసర్గం దీని కొక ప్రముఖ కారణం కావచ్చును అయితే మనదేశంలో జరిగిన ప్రతి నూతన సంఘ సంస్కరణానికి ఆంగ్లేయసంబంధమే ప్రధానకారణమని వాదించే పాశ్చాత్యమానసపుత్రులు కొందరున్నారు వీరి దృక్పథం కొంతవరకు మాత్రమే యథార్థము

మహమ్మదీయప్రభుత భారతదేశంలో స్థిరపడిననాడే క్రమ క్రమంగా జాతి పతనావస్థ ప్రారంభమయింది బ్రిటిష్ పరిపాలన సుదృఢంగా నెలకొన్న నాటి కది ఒక అవధికి వెళ్ళిపోయింది అప్పటినించి జాతిలో క్రమక్రమంగా పునరుజ్జీవం మొలకెత్తింది స్వాతంత్ర్యోద్యమం ప్రారంభంతో, పెరకువతో తిరిగి వినూతన చైతన్యం క్రమక్రమంగా అన్ని రంగాలలోను అలముకొంటున్నది కొంచెం దూరదృష్టితో, సూక్ష్మదృష్టితో పరిశీలిస్తే ప్రపంచంలో అనేకదేశాల పతానాభ్యుదయా లొక చక్రనేమిక్రమంలో సాగిపోతున్నట్టు కనిపిస్తున్నాయి చరిత్రకారులు, రాజనీతిశాస్త్రజ్ఞులు వీటి కేవేవో తాత్కాలిక ప్రత్యక్షకారణాలు కొన్ని నిరూపిస్తారు ఆయాదేశాల చరిత్రగతి పరిశీలించినప్పుడు వాటి అభ్యుదయాలకంటె పతనాలే మహాశ్చర్యం కలిగిస్తాయి గ్రీసు, రోమన్ సామ్రాజ్యాల చరిత్రలే దీనికి ప్రబల నిదర్శనాలు భారతదేశం ప్రాచీనకాలంలో మహావైభవంతో వర్ధిల్లినదని ప్రఖ్యాత చరిత్రకారులు సప్రమాణంగా నిరూపిస్తున్నారు మనదేశం పతనానికి కూడా వీరు ప్రధానకారణాలు కొన్ని పేర్కొంటున్నారు అయితే ఈ దేశం కూడా పతనాభ్యుదయాలలో ప్రపంచదేశాలలాగే ఒక చక్రనేమిక్రమం అనుసరిస్తున్నదేమో ఎవరు చెప్పగలరు ?

ఒకవిషయం మాత్రం నిస్సందేహంగా నిర్ణయించవచ్చును ఒక దేశం అభ్యున్నతి ఆదేశంలో స్త్రీపురుషుల సంబంధాలలో ప్రతిఫలించిన సముచిత స్వాతంత్ర్యవికాసాలను బట్టి నిశ్చయించవచ్చును ఈ దృష్టితో పరిశీలించినప్పుడు మన పురాతన భారతీయచరిత్రలో కొన్ని ఘట్టాలు సముజ్జ్వలంగా భాసిస్తాయి

వాత్స్యాయన కామసూత్రము

గుప్తసామ్రాజ్యకాలం మనదేశ చరిత్రలో ఇటువంటి సుముజ్జ్వల ఘట్టమని చరిత్రకారు లందరు అంగీకరిస్తారు ఈ యుగంలో అవతరించిన వాత్స్యాయన కామసూత్రం దీని కొక చక్కని తార్కాణ. ఇంచుమించుగా క్రీస్తుశకం నాలుగవశతాబ్ద ప్రాంతంలో ఈ గ్రంథం రచించబడినదని చరిత్రకారు లూహిస్తున్నారు వాత్స్యాయనుడు తన కామసూత్రం 'అథాతః తృతీయం పురుషార్థం వ్యాఖ్యాస్యామ' అన్న సూత్రంతో ప్రారంభిస్తున్నాడు అతని దృష్టిలో కామపురుషార్థం ప్రతి మానవుడు సాధించుకోవలసిన పరమ ప్రధానప్రయోజనము. అయితే ఈ పురుషార్థసాధనం జీవితంలో మరి ఏ ఇతర ప్రవృత్తితోను సంబంధంలేని సర్వ స్వతంత్ర వ్యవహారం మాత్రం కాదు. ప్రాచీన ధర్మనిర్ణేత లీ పురుషార్థ సాధనతో ధర్మార్థ మోక్షాల కొక పరస్పరసమన్వితమయిన అవినాభావసంబంధం కల్పించారు. ధర్మార్థకామమోక్ష పురుషార్థాలు నాలుగు పరస్పర సమన్వయంతోనే సాధించుకోవలసి ఉన్నదనీ, దేనికది తీర్థం తీర్థం, ప్రసాదం ప్రసాదంగా చేసి చేజిక్కించుకోరాదనీ, అది అసాధ్యమనీ వారి నిర్ణయము.

కామపురుషార్థాని కొకవైపున ధర్మార్థాలు, రెండవ వైపున మోక్షము ఉన్నాయి అంటే వీటి పరిధిలోనే మానవుని కీ పురుషార్థసాధనలో స్వాతంత్ర్య మున్నదన్నమాట ! మిగిలిన పురుషార్థాల సాధనలో కూడా ప్రత్యేకంగా ఇదేవిధమయిన పరస్పర సమత్వము, అవధి మన ప్రాచీన ధర్మవేత్తలు నిర్ణయించారు అయితే వారి దృక్పథంలో ధర్మస్వరూపనిర్ణయంలో లనేకమయిన క్లిష్టసమస్య లేర్పడుతున్నమాట వాస్తవమే కాని కేవలం సంకుచిత దృష్టితో వారి ధర్మస్వరూప నిర్ణయం జరగలేదు ఆయా దేశ కాల పరిస్థితుల ననుసరించి ధర్మం మారుతున్నది. అలాగే ఆయా వర్ణాశ్రమాలలో కూడా ధర్మాచరణ భేదిస్తున్నది

ప్రాచీనుల దృష్టిలో కామపురుషార్థ సాధనలో కూడా ఇదేవిధమయిన విశాల దృక్పథం గోచరిస్తున్నది బ్రాహ్మము, దైవము, ఆర్షము, ప్రాజాపత్యము, ఆసురము, గాంధర్వము, రాక్షసము, పైశాచికము అని అష్టవిధాల వివాహపద్ధతులు మన ధర్మగ్రంథాలు పేర్కొంటున్నవి వీటిలో కేవల సాంప్రదాయికమయిన వివాహపద్ధతి మొదలుకొని మన మీనాడు కూడా అనుమతించలేని కొన్ని విపరీత పరిణయమార్గాలు ప్రాచీనులు తమ ధర్మశాస్త్రగ్రంథాలలో క్రోడీకరించారు అందరికీ కాకపోయినా కొంతమందికయినా ఇవి అనుసరణీయాలే అని అంగీకరించారు ఈ విధమయిన సువిశాలదృక్పథంతో స్త్రీ పురుష సంబంధా లనుమతించిన విదేశీయ నాగరికత ఇంకొకటి లేదు ఒక ఆదర్శదృష్టితో కాక కేవలం వాస్తవిక దృష్టితోనే పురాతను లీ క్రోడీకరణ కుపక్రమించారు అయితే సంఘంలో వ్యక్తులందరికి ఒకేఒక విధమయిన ఆచరణసూత్రం వా రెన్నడు విధించలేదు తిరిగి ఈ ఎనిమిది విధాలయిన వివాహాలలోను ఉత్తమాధమ భేదాలు రూపొందించారు

మహాభారతము

ఈ విషయవివేచనలో మహాభారతం మనకెంతో సహకరిస్తున్నది. ఈ మహాగ్రంథం కేవలం ఇతిహాసంగా పఠించవచ్చును అంతేకాదు సాంఘికార్థిక రాజకీయాది వివిధ దృక్పథాలతో పరిశీలించవచ్చును కామపురుషార్థ వివేచనలో భారతం మనకొక పెన్నిధివలె సాక్షాత్కరిస్తున్నది. గ్రంథాదిలోనే ఆ ప్రాచీనేతిహాసం విశాల లక్ష్యం గోచరిస్తున్నది

"ధర్మశాస్త్రజ్ఞులు ధర్మతత్త్వంబని
అధ్యాత్మ విదులు వేదాంత మనియు
నీతి విచక్షణుల్ నీతిశాస్త్రంబని
కవివృషభులు మహాకావ్యమనియు
లాక్షణికులు సర్వలక్ష్య సంగ్రహమని
యైతిహాసికు లితిహాసమ మనిం
పరమ పౌరాణికుల్ బహు పురాణ సముచ్చ
యం బని మహి గొనియాడుచుండ

వివిధవేద తత్త్వవేది వేదవ్యాసు-
డాదిముని పరాశరాత్మజుండు
విష్ణు సన్నిభుండు విశ్వజనీనమై
పరగుచుండ జేసె భారతంబు."

అంతేకాదు :

"ధర్మే చార్థే చకామేచ
మోక్షేచ భరతర్షభ !
యదిహాస్తి తదన్యత్ర
యన్నేహాస్తి నతత్ క్వచిత్ !"

"ధర్మార్థ కామ మోక్షాలలో మహాభారతంలో వ్యాఖ్యానించిన విషయాలే ఇతరత్ర గోచరిస్తున్నవి ఇచ్చట లేని వింకెక్కడ లేవు !" అని దీని తాత్పర్యము

కామ పురుషార్థ వివేచనలో కృష్ణద్వైపాయనమహర్షి దృక్పథంలో ఒక విశిష్టత గోచరిస్తున్నది మహాభారతంలో స్త్రీ పురుష సంబంధంలో విచిత్రమైన వైవిధ్యం గోచరిస్తున్నది ఆ మహర్షి జన్మమే దీని కొక తార్కాణ సత్యవతీదేవి—క్షత్రియ స్త్రీ. పరాశరుడొక విప్రవర్యుడు. మహర్షి ఇలాగే భారతంలో అనేకమైన వర్ణాంతరవివాహాలు గోచరిసున్నాయి అంతేకాదు ఆ మహాసంహితలో బహుభార్యాత్వము, బహు భర్తృకత్వము, దేవరన్యాయము, ధర్మసంతానంకోసం ఇతరుల అభ్యర్థన మొదలయిన వెన్నో విశిష్ట ధర్మాలు గోచరిస్తున్నాయి వీటి అభివర్ణనలో భారత సంహితలో ఎక్కడ రవంతయినా సంకోచం కానరాదు అదీగాక ఈ అపూర్వాచారాల కన్నిటికి ఆయా కాలాల పరిస్థితుల ననుసరించి ధార్మిక ముద్ర కూడా పడింది అత్యంత ప్రాచీనకాలంలో స్త్రీ పురుష సంబంధాల పరిణతిని గూర్చిన ఒక అత్యద్భుత గాథ మహాభారతంలో కనిపిస్తున్నది

ఇది ఆదిపర్వంలో పాండుమహారాజు కుంతీదేవికి చెప్పిన వృత్తాంతము పురాతనకాలంలో స్త్రీ పురుషు లందరు తమ చిత్తంవచ్చినట్లు యథేచ్ఛగా సంచరించేవారట ! ఆ కాలంలో అన్యపురుష సంపర్కం ఒక దోషంగానే పరిగణించేవారు కారట ఉద్దాలకునిభార్య మహాసాధ్వి శ్వేతకేతు వామె కుమారుడు ఒకనాడొక వృద్ధవిప్రు డతిథిగా విచ్చేసి పుత్రార్థమై సాంగత్యం అభిలషించాడట! శ్వేతకేతువది సహించలేక ఆనాటినుండి పరపురుష సాంగత్యం పరిణీతలయిన మహిళల కందరికి మహాపాతక హేతువని ఒక వినూతనధర్మం ప్రవచించాడుట ! ఆనాటినుండి ఆ ధర్మం లోకంలో మానవు లందరు శిరసావహించారట ! అయితే ఉత్తరకురుదేశంలో ప్రాచీన మర్యాద ఇప్పటికి లోకులందరు అనుసరిస్తున్నారని పాండుమహారాజు కుంతీదేవి కుపదేశిస్తున్నాడు స్త్రీ పురుష సంబంధంలో వ్యాసమహర్షి ప్రతిపాదించిన ధార్మికదృష్టి సువిశాల మయినది సహేతుక మయినది రామాయణానికి మహాభారతానికి ఈ విషయంలో ఎక్కడ పొత్తు కలియదు

వాల్మీకిమహర్షి సీతారాముల పునీతచరిత్రద్వారా ఆర్యజాతి కాదర్శ మయిన ధర్మం ప్రతిపాదించాడు కాని వ్యాసమహర్షి దృక్పథం కేవలం వాస్తవికము అత్యంత ప్రాచీనకాలంనుండి, ఆనాటివరకు ఆర్య సంఘంలో అనుస్యూతంగా వస్తున్న స్త్రీ పురుష సంబంధాల కొకవిధమయిన క్రోడీకరణము, సమన్వయము మాత్రమే మహాభారతంలో జరిగింది అయితే ఆకాలంలో మానవులందరికి ఒకేఒకవిధమయిన ధర్మప్రతిపాదన జరగ లేదు బ్రాహ్మణ క్షత్రియాదివర్ణాల స్త్రీపురుష సంసర్గాల నియమాలు వేరు. తిరిగి బ్రహ్మచర్య గృహస్థవానప్రస్థ సన్న్యాశ్రమాల ధర్మాలు వేరు బ్రాహ్మణుల కున్నన్ని కఠిన నియమాలు క్షత్రియులలో గోచరించవు పోనుపోను అగ్రవర్ణాలలో అసిధారావ్రతా లెక్కువగా విధించారు క్రమక్రమంగా క్రింది వర్ణాలవారి కీ నియమాలన్నీ పూర్తిగా సడలించివేశారు కనకనే మన దేశంలో ఈనాటికి క్రిందివర్ణాలలో మారు మనువు మొదలయిన వైవాహికాచారా లెక్కువగా కనిపిస్తున్నాయి

ఆధ్యాత్మిక దృష్టి

ఈ ధర్మ నిర్ణయాల కన్నిటికి ప్రధాన కారణం మన ప్రాచీనుల ఆధ్యాత్మికచింత. మోక్షమే పరమ పురుషార్థమని వారి నిర్ణయము. ఈ మోక్షనిర్ణ

చనం కూడా భారతీయవేదాంతులలో వేర్వేరువిధాలుగా సాగిపోయింది ఒకవిధంగా రాగద్వేష వాసనకూడా లేని పరిపూర్ణ నిర్లిప్తస్థితి మోక్షమని నిర్వచించవచ్చును ఇదే చరమలక్ష్యంతో మన పురాతనులు ధర్మార్థ కామ సమన్వయము సంకల్పించారని ఇంతకుమునుపే పేర్కొన్నాము. అయితే జీవితం విడిచిపెట్టి దూరదూరంగా పారిపోయే శుష్క వైరాగిధర్మం వారెన్నడు సర్వోత్తమమని నిర్దేశించలేదు. జీవన భోగబాహుళ్యంలోనే నిర్లిప్త స్థితి వారి పరమ ధ్యేయం. నిగూఢ వ్యంగ్యధోరణితో కాళిదాసమహాకవి అభిజ్ఞాన శాకుంతలములో ఇదేస్థితి అభివర్ణిస్తున్నాడు :

'ప్రాణానా మనిలేన వృత్తి రుచితా
సత్కల్ప వృక్షవనే
తోయేకాంచన పద్మరేణు కపిశే
ధర్మాభిషేకక్రియా !
ధ్యానం రత్నశిలాతలేషు విబుధస్త్రీ
సంనిధౌ సంయమః
యత్కాంక్షంతి తపోభిరన్య మునయః
తస్మిం స్తపస్యంత్యమీ '

కల్పవృక్షాలున్న వనిలో మారుతాహారంతోనే ప్రాణధారణ బంగారుతామర పూల పుప్పొడితో పసుపునిగ్గులు దేరుతున్న కొలనినీట ధర్మస్నానవిధి రత్న శిలాతలాలపై ధ్యాననిష్ఠ అమర సుందరీమణుల సాన్నిధ్యంలో ఆత్మసంయమనము. ఇతర మునీశ్వరు లభిలషించే పట్టులలోనే మారీచాశ్రమతపోధనులు తమ నిరంతరతపశ్చర్య కొనసాగిస్తున్నారు అదీ వారి తపోనిష్ఠ ధోరణి!

పాండురంగమహాత్మ్యంలోని ఈ క్రింది పద్యంకూడా ఇంచుమించుగా ఇదే వైఖరి వ్యక్తీకరిస్తున్నది !

"కీలారమునసుండి పాలిటి కేతేర
బహుధాన్యములు చేల బండి యొరగ
నెడనెడ బెండ్లిండ్లు వడుగులు వోడమ
కృతార్థులై యర్థించు నర్థులలర
పరిచారికా కోటి పనిపాటు వాటింప
జుట్టంపు సందడి నెట్టు కొనగ
గ్రామమంతయు నిజ ప్రాభవంబున మనె
సత్యనిష్ఠకు తన్ను సాక్షి గోర
నిత్య నైమిత్తికములు నిర్నిద్ర బుద్ధి
నాచరించుచు హరిభుక్త మాత్మ భార్య
భక్తి నిడ భుక్తి గొనుచున్కి ముక్తి గాని
నిదురవంటిది రాతివంటిదియు గాదు"

ఒక్క విషయం మాత్రం నిశ్చయం కామవ్యవహారాలలో మనవారి కెక్కడ అంతర్భీతి (Inhibition) ఉన్నట్టు కనబడదు ఇక ఈ విషయంలో పాశ్చాత్యుల దృక్పథం కొంచెం పరిశీలిద్దాము. పాశ్చాత్య నాగరికతపై క్రైస్తవమత సిద్ధాంతం చాలా గట్టిముద్ర వేసింది. ఈ క్రైస్తవ సిద్ధాంతాలలో యూదీయజాతి ఆచార సంప్రదాయాల ప్రభావం పాలెక్కువ అదేగాక క్రైస్తవ మతానికి సంబంధించిన ప్రాకృతిక పాతిత్య సిద్ధాంతం (Original Sin) పాశ్చాత్యుల స్త్రీ పురుష సంబంధాలలో విపరీతమయిన పాప శంక కలిగించింది ప్రొటెస్టెంటులలో కన్నా కాథలిక్కులలో ఇది మితిమీరింది

నిజాని కీనాడు పాశ్చాత్యదేశాలన్నీ ఈవిధమయిన అడ్డంకులన్నీ నడచివేసుకొన్నవి అయితే ఈవిధమయిన స్వాతంత్ర్యం రావడానికి వారి కించుమించుగా రెండువందల ఏళ్ల కాలం పట్టింది కొన్ని పాశ్చాత్య దేశాలలో ఇటీవలి కాలంలోనే స్త్రీలు కొందరికి వోటింగు హక్కు ప్రసాదించారంటే పారకు లాశ్చర్యపడ నక్కరలేదు

బ్రిటన్‌లో ఇటీవల డి హెచ్ లారెన్స్ నవల 'లేడీ చాటర్లీస్ లవర్'పై ఆంక్ష తొలగించారన్న వార్త వెలువడింది మన ప్రబంధాలతో పోలిస్తే ఈ నవలలో అంతగా విడ్డూరమైన పచ్చిశృంగార వర్ణన కనబడదు. మరి ఇంగ్లండువంటి దేశంలో ఇంత చక్కని రచనమీద చాలాకాలం నుంచి ఈ ఆంక్ష ఎందుకు విధించారో తెలియదు డి హెచ్ లారెన్స్ వంటి రచయితలు చాలామంది పాశ్చాత్యదేశాలలో ఈ విషయాలపై అంతకుపూర్వమున్న అపోహలు తొలగించడాని కెంతో తోడ్పడ్డారు ఫ్రాయిడ్, ఆడ్లర్, జంగ్‌ల వంటి విఖ్యాత మనస్తత్త్వశాస్త్రవేత్తల పరిశోధనలు కూడా దీని కెంతో దోహదం కలిగించాయి.

మత ప్రభావము

వాస్తవాని కీనాడు పాశ్చాత్యదేశాలలో స్త్రీపురుష సంబంధాల విషయంలో క్రైస్తవ మతప్రచారం చాలావరకు తొలగిపోయినదని చెప్పవచ్చును. కాని భారతీయ మతసంప్రదాయాలన్నీ మానవుని ఆధ్యాత్మిక పురోభివృద్ధికి కామప్రవృత్తి ఒక ప్రబలమయిన అంతరాయమని ప్రతిపాదిస్తున్నాయి పరమేశ్వర సాక్షాత్కృతికి కామినీ కాంచనాలు రెండు అధిగమించరాని అడ్డంకులని రామకృష్ణ పరమహంస మొదలుగాగల ప్రవక్తలనేకులు నొక్కి వక్కాణించారు విదేశీయములయిన క్రైస్తవాది మతాలలో కూడా ఈ అభిప్రాయం బాగా పాతుకొన్నది

ఇదేవిధంగా కళాసృష్టికి, మానవుని అంతరాంతరాలలో నిగూఢమయిన కామప్రవృత్తే ప్రధాన కారణమని పాశ్చాత్య మనస్తత్వవేత్తలు కొందరు ప్రతిపాదిస్తున్నారు ఇంతేకాదు. మానవుని ఏవిధమయిన బాహ్యప్రవృత్తికయినా నిగూఢమై లోలోపల అణగి మణగిఉన్న రాగాంకురాలే ప్రధాన కారణాలని నిరూపించే మనస్తత్వవేత్తలు కొందరున్నారు అయితే జంగ్ మొదలయిన అత్యధునాతన మనస్తత్వవేత్త లింతకంటె విభిన్నమయిన ప్రబల మానవిక ప్రవృత్తులుకొన్ని మానవుని బహిశ్చర్యలకన్నిటికి ప్రబలకారణాలని సిద్ధాంతీకరిస్తున్నారు ఈ సిద్ధాంతాల ప్రభావం పాశ్చాత్యదేశాలలో స్త్రీ పురుష సంబంధాల నిర్ణయాలలో కొంతవరకు ప్రతిఫలిస్తున్నది

ఇక మనదేశంలో ప్రాచీనకాలంలో మహిళ లొకప్పుడు మహోన్నతస్థితి అందుకొన్నా, పురోగామి పాశ్చాత్యదేశాలతో పోల్చినప్పుడు ప్రస్తుతం వారి స్థితి బాగా వెనకపడిఉన్నదని చెప్పక తప్పదు అయితే ఇటీవల కొంతకాలంనుంచి ఈ విషయంలో కొంత సుముఖత ఏర్పడుతున్నది ముఖ్యంగా ఆస్తిహక్కుల విషయంలో పురుషులతోబాటు స్త్రీలకందరికీ సమానమయిన భాగస్వామ్యం కలిగించవలసి ఉన్నది ఇంకా విద్యలో, వేర్వేరు వృత్తులలో ప్రవేశార్హతలలో మగవారితోబాటు సమానావకాశాలు కలిగించవలసి ఉన్నది. వివాహసంబంధాలలో, విడాకులచట్టాలలో ఇతోధికమయిన స్వాతంత్ర్యం అత్యావశ్యకము.

కాలానుగుణంగా ఇటువంటి మార్పులు జరగనప్పుడు సంఘంలో చాటుమాటు వ్యవహారాలే శరణ్యాలై కూర్చుంటాయి. పాశ్చాత్యదేశాల స్త్రీ పురుష సంబంధాలపై నిశితవిమర్శలు గుప్పించే పెద్దలు కొందరున్నారు. కాని ఇటువంటివా రందరు మన సంఘంలో చాటుమాటుగా మితిమీరిపోతున్న విడ్డూరాల మాటే పట్టించుకోరు ఎప్పుడో మన జాతి మహోజ్జ్వలమై విలసిల్లినదని గొప్పలు చెప్పుకున్నంతమాత్రాన ఒరిగేదేమి లేదు. కేవలం అంధప్రాయంగా పాశ్చాత్యసంప్రదాయాల అనుసరణ కూడా అభిలషణీయం కాదు — కాని చిరకాలానుగతమయిన మన విశాల సంప్రదాయం దృష్ట్యా ఆధునిక, సాంఘిక శాస్త్ర దృష్ట్యా స్త్రీ పురుష సంబంధాలలో చక్కని సమన్వయమార్గం రూపొందించుకోవలసిన ఆవశ్యకత ఎంతయినా ఉన్నది. దేశంలో ఉన్న జనాభాలో ఇంచుమించుగా సగం మంది మహిళలు కేవలం నిద్రాణమైనస్థితిలో ఉన్నప్పుడు జాతి ఎన్నటికి ముందంజ వేయలేదు.

యత్ర నార్యస్తు పూజ్యంతే
రమంతే తత్రదేవతాః
యత్రైతాస్తు న పూజ్యంతే
వ్యర్థా స్తత్రాఖిలాః క్రియాః ——మనువు.

చంద్రశేఖర మధ్యాక్కరలు

శ్రీ అవధానము చంద్రశేఖర శర్మ

శిరము క్రొన్నెలవంక దరియ సరిక్రొత్త చేమంతిబంతి
నురము నేనికతోలు కదియ దువ్వల్వ యోరపయ్యంట
కరముఁజుట్టిన నాగు తగుల రత్నాంక కంకణశ్రేణి
పురుడు లేనట్టి రసమూర్తి నిన్నెన్ని పులకించు దేవ!

ఇన్నిదినంబు లేరీతి నీ తత్త్వ మీక్షింప లేక
విన్న దేవతలెల్ల వేడి పాఱాడి వీటెండినైతి;
నిన్ను నాలోననేయుండ గుర్తించినను బట్టగలుగు
విన్నాణ మెపు డిత్తువోయి నా స్వామి! విశ్వేశ! యభవ!

తలఁచినంతనె యట్టె తలఁగిపోయెదవు దర్పకదమన!
వలచి నీ మేనిలో సగము రాపాడి వశపెట్టుకొనఁగ
గులగిరిపుత్త్రినో? గంగనో నెత్తిఁ గూర్చుండి కులుక!
గొలుతు నీ లెంకనయ్య; నాస్వామి! కూరిమి నేలు.

ఒకమాట నే విన్నవింతు నీలోన యోజింపు మభవ!
యొక నీవుదక్క నిజగతి నింకొక్కఁడోరుఁ డెవ్వఁడైన
సకల సంతాపకం బయిన గరళంబు సాపడి లోక
మొకలీలమై నేలు కడిమి నెందైన నున్నాఁడె దేవ!

కరుణాబ్ధి! వేఱొండు దిక్కు నే నెందుఁ గానంగలేక
శరణంటి నీ పాదములకు నాతండ్రి! నరగున నేలు;
కొఱగాని వానట్లు ద్రోయ నేపాడి గుణబంధ రహిత!
నిరుపాధిక కృపావతార! నన్ బ్రోవ నీకెంత బరువు?

అహిభూష! నిగమాంతరార్థ సంవేద్య! యాద్యంతరహిత!
మిహికాచలాత్మజాంతర సరోజ సంవృత్త మిళింద!
ద్రుహిణాదికామరార్చిత పదాంభోజరుద్ర నీకంటె
నహి యన్య శరణంబు నాకు శివ! కరుణామయా! స్వామి!

ఊహాపథాతీతమహిత దివ్యమహోమహోమూర్తి!
మోహోర్మి నిర్మగ్నజంతుసంతాన మోక్షైక రసిక!
నా హృదంతతమశ్చండ భాస్వంత! న న్నేలుమయ్య!
త్రాహి యంటి శివా! మహేశ్వరా! నీవె దైవంబ వంటి.

తలఁతు నయ్యా మహేశ! సంభ్రమద్వారదభ్ర గంగాఝు
ఝలుఝత్ కపర్ద సుధారోచి రమణీయ భంగి
విలసద్భుజాంచలోత్క్షిప్త దిగంత వీథీవిటంక
వలయాను పాతాంఘ్రి తాండవస్ఫూర్తి సర్వతోమూర్తి!

కుడి యెడమలకు వలచు కనులకులుకులకు జగములు
పొడమున? పొడవున నిలిచి పొలుచున? పొడ వఱి యడఁగి
మడఁగున యొకటిగ వెలుగు నిలువున మలసిన యపుడు?
కడ నడుమ మొదలనుచు నెఱుఁగక నెటు గనఁబడని వెలుఁగ!

వ్యాఖ్యాన మొనరింపలేవు వేదాది వాఙ్మయము లెల్ల
ముఖ్యార్థగతిఁ ద్రోచి నేతివచనముల ముడివెట్టుఁ గాని;
ఆఖ్యాన మాకార మదియు లేదయ్యెనఁట మనోఽగమ్య
సఖ్య మెట్టుల నీకు నాకు నొక్కెడ జతపడునయ్యా!

అధ్యాస మనినార లఖిల విశ్వంబు నాదిమమునులు!
నిధ్యాన గమ్యుండవయిన నీయందు, నిన్నెఱుంగనిదె
యధ్యాస ఖుదియంచు నెఱుఁగ నాకెట్టు లగునయ్యా! యాది
మధ్యాంత రహిత! నీ మది విడమలఁచి మా కెఱిఁగింపు.

అన్ని రూపము లీవె యనుట మాకెట్టు లర్థమా దేవ?
కన్న రూపము లెల్ల నియతి నెప్పుడో కడకుఁ బోయెడివ;
ఎన్నడును బోవు నీ; వెట్టులెఱుఁగుదు నీ విరుద్ధార్థ?
మున్నరూ పిదియంచుఁ దెలియ వివరింపుమోయి నాస్వామి!

కన్నప్ప కన్నిచ్చె నేమొ యతనికిఁ గానంగఁబడితి;
వన్నిత్తు నర్పణ నిపుడె కనరావు నాకేల స్వామి?
అన్నమాటను నమ్మవేమి? నీవాడు మన్ననే నంటి;
నన్నేల మోసగించెదవు మాటల నగజాకళత్ర?"

ఊపిరి బిగఁ బట్టి యూహాకే రాక యుఱికెడు మనసు
నోపిక నాఁపంగ నాకు సాధ్యమ? యూరక యేల
రాపాడ? నీ పాదములన యివ్వేళ వ్రాల్చితి నెడద;
నాపాలివేల్పు! పెక్కేల? కరుణించి నన్నేలు మభవ!

చేసితినా పాపములను? నేనేమి చేసితి? గర్మ
చేసెనో? దానికి వెనుక నివుండి చేయించినావా?
దాసుని తప్పు లెంతలుగఁ బ్రోవైన దండంబు తోడ
నే సరి; చేసరియుంటి; వేధింప కీక్షింపు గరుణ.

ఏకోట గుడిగుడి మునిగి వెదకితి నెందుఁ గన్పడవు;
కాటి కేగిననాఁడు కడకు నీయింటఁ గనవత్తువేమొ?
ఏటిమాటలు? నాఁడు కన్నులుగలుగు నీరీతిఁ గనఁగ?
టాటోటుఁ గథలతో మప్పి యేటికెడంద గమరింప?

నీఱూఁదఁ గనవచ్చు నిప్పునుం బోలె సన్నావరించు
కాఱుచీఁకటి నొత్తఁగనిన నీ రూపు గనవచ్చు నంద్రు;
నేరుపుమాట లిన్నియును జీఁకటి నిరూపు నెన్నఁ
జే రూపులో మున్న నెఱుఁగకేయుండ నేట్టు లీ యుపమ?

కనుపించునవి యెల్లఁ గడచుఁ గావునఁ గావు నీవంద్రు;
కనుపింపనట్టినిం గనుట యెట్లానో కానంగనేర;
కనువాఁడు కనుపించునదియును గనుట గనరాని నిన్నఁ
గను మంచుఁ గరుణించి కడకు నీవిడ్డఁగా కెట్లు గలుగు?

బావిలో మునిఁగి యూపరి విడువలేక పాఱాడు వాని
త్రోవ నేనుంటి నయ్యా! మహాస్వామి! ద్రుతగతి వచ్చి
కావు, మీవే కావకున్న నెవ్వాఁడు గావంగఁ గలుగు?
బోవిడుతువ శ్రిత కల్పకా! చిన్నఁబోవ నీకీర్తి?

ఎక్కుడుకన్నన్న నిన్న దర్పకుఁ డెదిరించి నిలిచి
స్రుక్కి నీఱయ్యును బోక తెక్కాని వోద్యంబుగాఁగ
నిక్కి నిన్ సతిఁగూర్చె; నాకాలందియే నిరసింప వాని?
చిక్కులు వెట్ట కింకయినఁ గరుణ నీక్షింపుము తండ్రి!

వాంఛ లూడువదేవ! యెందు నావంటి వానికి వశమొ?
యుంఛ వృత్తులకైన నవ్వి యొకమూఁ నుండకపోవు;
పించమట్టులు పలువన్నెల మెఱసి విప్పారు; దీప్తి
రింభోళికా ధూత సంతమస! సయిరింపుమీ కరుణ.

పంచకోశముల కావలన నివుందు పరమ కల్యాణ.
వించు నిట్లని శ్రుతి; విందునే గాని వీక్షింపనేర;
మించు మించిన వెల్గుమించు నీ రూపు మిఱుమిట్లు గొలువఁ
గాంచు నా వెరవుఁ గన్పించి నా మీఁద! గరుణింపు దేవ!

బురదలోఁ దిరుగుచుండినను గుమ్మరి పుర్వు కింతేని
బురద సోఁకని మేను నొనఁగి పుట్టించి పొగడికఁ గన్న
వెరవరి! నాకింకఁ బంకము నలమ వేసర వేల?
పురువుకన్నను బాడుబ్రదుకు నాదయ్య పున్నెంపుసామి.

పొగనుండియే యగ్ని పుట్టును నిజము; పొగసి రాజినను
పొగచూరునే గాని మది మథించినఁ బుట్టదు వెలుఁగు;
వగఁగూరి కూరి యీగతినే సంతాపవశత భ్రమందుదువో?
నిగమాంత వేద్య! రానీయవే, కరుణ నిచ్చలుఁ గొలుతు.

వెండికొండఁట యిల్లు! తలఁగ దేనాఁడు విశ్వేశ! పైఁడి
కొండ నీ చేతిలోఁ గుదిరి వెల్గొందు! కొదవింత లేదు;
ఉండియు నీదుకైవల్యపు ముదుపు నొక్కింత విడవు;
ఖండేందుధర! యార్తులగతిఁ గన వెంత కాలాంతకుఁడవు!

ఏలిన సరియే లేకున్న మాయమ్మకే విన్నవింతు;
నీ లాగు కాదు; చల్లని కనుంగల్వ నెలవు మా తల్లి;
కాలకాలుఁడ వీవు; సర్వమంగళ కరుణైకమూర్తి;
మూలమంత్రాత్మిక; నీకును మనసుఁ బుట్టింప నేర్చు

ఈవును జంద్రశేఖరుఁడ
వీశాన! యెందు నేకొఱలు
లేవ; నేమను జంద్రశేఖరుఁ
డయితి లే; నాకు మాత్ర
మే వేయిఱేకుల తమ్మి
యాదల నేటికి ముదుఁగ?
నీవు నేనుగఁ జేసి దాని విరి
యింపవే కొఱ లుదుఁగ.

జాతీయ విహంగము

శ్రీ శ్రీపాద లక్ష్మీనారాయణమూర్తి

అతి సౌందర్య విచిత్రవర్ణ రమణీయారావ సంపత్సమ
న్వితమై అంబుద దర్శన ప్రముదితోర్వీభృద్వనాంతఃప్రద
ర్శిత నాట్యోత్సవ వైభవమ్మయి ఖగశ్రేష్ఠత్వ మేపార భా
రత జాతీయ విహంగ పట్టమది సంప్రాప్తించె మా కేకికిన్.

సౌనాసీర ధనుఃప్రభా శబలితాంశాభాగ సౌందర్యముల్
నీ నాట్యమ్మున దోచి భూజనులకున్ నేత్రోత్సవం బయ్యెడిన్
మేనం బుల్కలు పుట్టు బర్హము విజృంభింపంగ నత్యున్నత
స్థానంబందున ఠీవిగా నిలుచు నీ చందంబు వీక్షించినన్.

యమునా తీర మనోజ్ఞ సైకతములం దాభీరశాతోదరుల్
తమ సర్వస్వము ధారవోయగ శరద్రాకా నిశాజ్యోత్స్నలం
గమనీయోజ్జ్వలరాస నర్తన కళా కౌశల్యముం జూపు భా
గ్యము చేకూరిన కృష్ణు మూర్ధమున బర్హం బెంత శోభిల్లెనో!

కాంచిన యంతనే జననికాయము కంపము నొందునట్లు బు
స్సంచు ఫణమ్ము నెత్తుచు రయమ్మున వచ్చెడు దందశూక మొ
క్కించుక నీస్వరమ్ము వినెనేని హుటాహుటిం బుట్టలోనికే
తెంచును ప్రాణభీతిని; నుతింపగ శక్యమె నీ మహత్త్వమున్.

పరపుష్టమను సప్రథ లేనిచో కోకి
లకు గల్గునేమొ అర్హత యొకింత
అప్పాల దేలు నం చపకీర్తి లేకున్న
రాయంచ పొందు నర్హత యొకింత
బానిసగా పంజరాన లేకున్న కీ
రము గాంచు నేమొ అర్హత యొకింత
కత్తుల దాల్చి రక్తము గార్చుకున్నచో
ప్రాప్తించు కోడి కర్హత యొకింత

ఇట్లు లొక్కొక్కటిని పరీక్షించి చూడ
పక్షు లన్నింటికేవో లోపములె తోచు;
నీలకంఠుడు లోకాల నేలు వేల్పు
నీలకంఠము పక్షులన్నింట మేటి.

శార్వరిలో సాహిత్య వికాసము

శ్రీ నిడదవోలు వేంకటరావు

ఆంధ్రపత్రికాధిపతులు సంవత్సరాది సంచికలయందు, ఆ సంవత్సరమున వెలువడిన సాహిత్యమునుగూర్చి సమీక్షలు ప్రకటించుట సారస్వతాభ్యుదయ హేతువని చెప్పవచ్చును "కొప్పుంటే ఏదెంపనైనా ముడుచుకోవచ్చును" అని సామెత ఆలాగే సాహిత్య సమీక్షకు ముద్రితమైన గ్రంధాలే పరమాధారాలు అట్టి ముద్రిత గ్రంధాల వివరణలు సమకూర్చుటకు ఆంధ్ర పత్రికవారు చేసిన సేవ అమూల్యమైనది ఇప్పటికి ముప్పదిరెండ్లేండ్ల క్రిందటనే వారు "ఆంధ్రవాఙ్మయ సూచిక"లను ప్రకటించిరి 1 ఆ వెనుక భారతీ పత్రికలో ప్రభుత్వమువారు ప్రతి మూడు నెలలకు వెలువరించే ముద్రిత గ్రంధముల నివేదికననుసరించి తెలుగు గ్రంధాలను వర్గీకరణముచేసి ప్రకటించినారు ఈ తరువాత సంవత్సరాది సంచికలలో సమీక్షలు చేయించుచున్నారు ఇది చాలా ప్రశంసనీయమైనది ఈ "శార్వరి సాహిత్యవికాసము"లో ప్రకటితములైన గ్రంధాలను సాధ్యమైనంతవరకు, సాహిత్య విభాగములతో, వ్యాసములతో ఆంధ్ర సారస్వత లోకమున కందించుచున్నాను

ప్రాచీన కవి కృతులు

కేయూర బాహు చరిత్రము (క్రీ శ 1260 ప్రాంతము) మంచెన కవి కృతమగు నీ ప్రబంధ మిప్పటి కరువదేండ్ల క్రిందట కీ శ 1902 లో సరస్వతీ పత్రికలో ముద్రితమైనది నేడా ముద్రిత ప్రతులు లభ్యమగుటలేదు ప్రాచీనాంధ్ర కృతులలో ప్రశస్తమైన వాటిలో నిది యొకటి కథా సాహిత్యమునకు సంబంధించిన దగుటయేగాక, నాటికా చంపూ పద్ధతిలో రచించిన తెలుగు కృతులలో నిది మొదటిది ఈ గ్రంధావతారిక వెలనాటి దుర్జయవంశ్యుల రాజుల చరిత్రకు మిక్కిలిగా నుపకరించునది ఆంధ్ర దేశ చరిత్రలో వెలనాటి చోడులను గూర్చి వ్రాసినప్పుడు దీని నుదాహరింపని చరిత్ర కారుడు లేడు నిర్దుష్టమును విసర్గమనోహరమును నీతి కథా విలసితమునగు నీ కృతియందుండి మూడు పద్యములను మడికి సింగన (క్రీ శ 1430) తన సకల నీతి సమ్మతము న నుదాహరించుటయే యీ కృతి ప్రాశస్త్యమును తెలుపును పూర్వ ముద్రిత ప్రతి వ్రాత ప్రతులతో సరిపోల్చిన పెక్కు పాఠ భేదములు కన్పట్టుచున్నవి మరియు నవతారికలోను ప్రథమాశ్వాసములోను నీ క్రింది రెండు పద్యములు ముద్రిత ప్రతిలో లేవు

> క. సొమ్ములలో ముప్పొర్పు జ
> గమ్మెల్లను సోడు ముట్టఁగాఁ జేయును శ్లా
> ఘ్యమ్మగు వస్తువు నగుటను
> కమ్మని కనకంబుగాదె కవిత దలంపన్

> చ. హృదయములుల్లసిల్లఁ బురినింతులు మేడలనుండి పాడఁగా
> నది విని గ్రోలుచుం బరవశాత్మకమై స్వప్నగంబు వెద్ద యుం
> గదలకయున్నఁ గుంటువడి కాదె మృగాంకుడు రేలుగొన్ని గొ
> ల్లి దిధులు నక్ష వీధి కన నిల్చుఁ బ్రభాతము డాసినప్పుడున్

అను మనోహర భావము గల పద్యములు లేవు అచ్చటచ్చట పద్యములలో యతిభ్రంశములును గలవు నేడు శ్రీ తిమ్మావజ్ఝల కోదండరామయ్య (ఎం ఏ బి ఓ ఎల్ గారు) దీనిని పూర్వ ముద్రణ ప్రతి ననుసరించి యధామాతృకముగ తిరిగి ముద్రించి యలభ్యమును సపురూపమును నగు నీ ప్రాచీన కృతిని మనకందజేసి నందులకు గృతజ్ఞత జూపదగును.

సిద్దేశ్వర చరిత్ర (క్రీ. శ 1370) తెలుగు వాఙ్మయమున కాకతీయ రాజుల చరిత్రను దెలుపు గ్రంధములలో తొలిది సిద్దేశ్వర చరిత్ర యను ద్విపదకృతి. కాసె సర్వప్పవిరచితము. ఇది కాకతీయుల చరిత్రకేకాక, ఆంధ్ర శైవ వాఙ్మయమునకు సంబంధించిన కృతి చరిత్రకారులును, వాఙ్మయ చరిత్రకారులును, దీనినుండి స్వల్పముగా ఎంతో ఉదాహరించిరి కాని గ్రంధము నేటివరకు నముద్రితముగనే యుండిపోయినది దీనికి పద్యానువాదమగు సోమదేవరాజీయము ముద్రితమైనది చారిత్రకమునను సాంఘికముగను విలువగల నీ గ్రంధమును ఉస్మానియా విశ్వ విద్యాలయాంధ్ర శాఖాధ్యక్షులైన శ్రీ ఖండవల్లి లక్ష్మీరంజనముగారు సుపరిష్కృతముగాముద్రించి విపుల పీఠికలతో నాంధ్ర లోకమున కందించి విద్వల్లోకమును కృతజ్ఞతా బద్ధము గావించినారు ఇందు నాంగ్లేయ భాషలో సుదీర్ఘమగు పీఠికతో కాకతీయుల చరిత్రమును ఈ గ్రంధ చరిత్రనే యాధారముగగొని రచియించియున్నారు సర్వప్ప శివకవి మార్గానుయాయి శ్రీ లక్ష్మీరంజనముగారు గ్రంధ పరిష్కరణ సందర్భమున వానిని పరిశీలించి, యట్టి విలక్షణ రూపములను వాడిన కవి కజ్ఞత నాపాదించుటకంటె, ఆతడు ప్రత్యేక కవితా సంప్రదాయమునకు జెందిన వాడని సహేతుకముగ నిరూపించియున్నారు అందునకు శ్రీ లక్ష్మీరంజనముగా రెంతయు నభినందనీయులు కేంద్ర ప్రభుత్వ సహాయమున ముద్రితమైన యీ గ్రంధమాంధ్ర సాహితీ చారిత్రక పరిశ్రామికులకు మిక్కిలి యుపయుక్తమైనది

క్రీడాభిరామము (క్రీ శ 1420) ముప్పదేండ్ల క్రిందట శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారి విపుల పీఠికతో నాంధ్ర సాహిత్య ప్రపంచము నలరించిన క్రీడాభిరామము వారి పుత్రులగు నానందమూర్తిగారిచే, విశేష విషయములతో, చిత్రములతో, పద్యానుక్రమణికతో బహు మనోహరముగ నేడు ముద్రితమైనది అమూల్య విషయ సంకలితమగు నీ ప్రసిద్ధ కృతి యాంధ్ర సాహిత్యోపాసకులందరి యామోదము బడయు నసుటలో సందియములేదు

భీమేశ్వర పురాణము (క్రీ శ 1430) శ్రీనాధ మహాకవి కృత భీమ ఖండము శ్రీ చిలుకూరి పాపయ్య శాస్త్రిగారి పీఠికా పరిష్కరణములతో పునర్ముద్రితమైనది ఇది సంస్కృతమగు ముద్రణము కాదనియు, పాఠ పరిష్కరణమున గ్రంధ సంపాదకు లేమాత్రము శ్రద్ధవహింపలేదనియు, పాఠభేదములనుగూర్చి చర్చించుచు విమర్శకాగ్రేసర శ్రీ దీపాల పిచ్చయ్య శాస్త్రిగారు స్రవంతి పత్రికలో నొక పెద్ద వ్యాసమును ప్రకటించియున్నారు. మొత్తముమీద నిది ప్రామాణిక ముద్రణము గాదు ఇంతకుముందే వావిళ్ల వారు శ్రీ బండారు తమ్మయ్యగారి పీఠికతో కొన్ని సాధు పాఠములతో ప్రకటించిరి ఈ సంవత్సరమే మరి యొకరు కూడ దీనిని ముద్రించిరి రాజమహేంద్రవరము అద్దేపల్లివారు దీనిని ప్రకటించిరి

మదరాసు ప్రాచ్య లిఖిత పుస్తక భాండాగారము వారి క్రింది పూర్వ కవి కృత గ్రంధములు ప్రకటించిరి

పతివ్రతా చరిత్ర ఇది యొక ప్రశస్త ద్విపదకృతి ఇందు డెబ్బది పతివ్రతల కథ లుండవలెను గాని లభ్యమైన ప్రతిలో 21 కథలు గలవు. శుకసప్తతి యను తెలుగు కృతిలో డెబ్బది కథలును, జారిణులగువారి కథలును ప్రపంచితమై యుండగా నీ గ్రంధ రచయిత (కర్త పే రిందు

---

1 ముద్రితాముద్రిత గ్రంధముల వివరణలు తెలుపు 'ఆంధ్ర వాఙ్మయ సూచిక' వంటి గ్రంధాలు ఈనాడు అత్యావశ్యకములై యున్నవి బహుముఖములుగా వాఙ్మయ సాహిత్య పరిశోధనలు జరుగుచున్నవి ఈ పరిశోధనకు వాఙ్మయ సూచికలు ఏకైకమైన 'ఆధారము' అంటే అందులో అతిశయోక్తి యుండదు. అందనావశ్యకములైన వానిని తొలగించి, నేటివరకు ముద్రితములైన వానిని చేర్చి తిరిగి ప్రకటించినచో, అది సారస్వత పరిశోధనకేకాక, సాహిత్య, విమర్శ, వాఙ్మయ చరిత్ర మొదలగు వాని వికాసమునకు అత్యధికముగా తోడ్పడగలదు ఆంధ్ర పత్రికాధిపతులు వాఙ్మయ సూచిక పునరుద్ధరించుటకు పూనుకొందురుగాక అని ఈ వ్యాసమూలముగా అభ్యర్థించుచున్నాను.

లేదు) దానికి ప్రతిగా డెబ్బది పతివ్రతల కథలు రచియించినాడు. ఇందు మొదటిదగు పుష్పదంతుని కథలో బృహత్కథనుగూర్చి క్షేమేంద్రుని గూర్చి యొక చారిత్రక వృత్తాంతమున్నది

యామున విజయ విలాసము. ఇది విశిష్టాద్వైత మత ప్రవర్తకులగు శ్రీరామానుజులవారి సమకాలికుడగు యామునాచార్యులవారి చరిత్రను దెలుపు ప్రబంధము. దీనిని విపుల పీఠికతో శ్రీ గన్నవరపు సుబ్బరామయ్యగారు అలంకరించుటయేగాక గ్రంధమును సమీచీనముగ బరిష్కరించిరి

ముక్తికాంతా విలాసము దక్షిణాంధ్ర వాఙ్మయమున దత్తాత్రేయ వాఙ్మయశాఖకు ప్రారంభకుడగు పరమానందతీర్థులు రచించిన తెలుగు నాటకమును, తంజావూరి సరస్వతీ మహలు పత్రికలో నచ్చట తెలుగు పండితులగు శ్రీ వీరబదేవుని సుందరశర్మగారు ప్రకటించిరి వేరుగా కూడ నిది లభ్యమగును ఇది సంస్కృత ప్రబోధ చంద్రోదయము ననుసరించి తెనుగున వ్రాయబడిన స్వతంత్ర నాటకము దీని ననుసరించి తరిగొండ వెంగమాంబ యొక ముక్తికాంతా విలాసము రచించినది జీవుడు ముక్తి కాంతను పెండ్లాడుట యిందలి యితి వృత్తము వేదాంత గ్రంధము

వేమన పద్యములు —వేమన పద్యములను నైదువేలు సేకరించి జానపద వాఙ్మయోద్ధారకులగు నేదునూరి గంగాధరంగారీసంవత్సరమున ప్రకటించిరి పూర్వము బందరులో పూర్ణయాచార్యులవారు ముద్రించిన వేమన పద్యములకన్న, యిప్పుడు ప్రచారములోనున్న వేమన పద్య గ్రంధములకన్న నిం దధికముగా నున్నవి వేమనగూర్చి యింతవరకు, వేదాంత విషయకమైన పరిశ్రమ జరిగినదిగాని, భాషా సాహిత్య విషయకమైన కృషి జరుగలేదు అట్టి కృషి చేయుట కీ గ్రంధము తోడ్పడును

సంకలన గ్రంధాలు

కావ్యమాల కేంద్ర సాహిత్య అకాడమీవారు ప్రకటించినది శ్రీ కాటూరి వేంకటేశ్వరరావుగారిచే సంపాదితము ఇందు నన్నయ మొదలుకొని నిన్నటి వరకు నాంధ్రమున వెలసిన కవుల కృతులనుండి పద్యములు సంగ్రహీతము లైనవి తెలుగులో క్రీ॥ 1430 నుండి ఈకాలము వరకు సకల నీతి సమ్మతము 2 ప్రబంధ రత్నాకరము ఉదాహరణ పద్యములు (1550 ప్రాంతము), ప్రబంధమణిభూషణము (17 వ శతాబ్ది), కృష్ణ లీలా విలాసము (అముద్రితము 18 వ శతాబ్ది) శృంగార పద్యావళి ఆంధ్ర కవితా రత్నాకరము (1898) ఋతువర్ణన శృంగారసుధాలహరి (1898) వర్ణన రత్నాకరము (1930) శృంగార కంఠాభరణము (1931), ప్రాచీన పద్యమంజరి (1952) మొదలైన సంకలన గ్రంధాలు వ్యాప్తిలో నున్నవి పూర్వ సంకలన గ్రంధము లన్నింటియందు కవుల కృతులనుండి యొకటి రెండు పద్యములేతప్ప యిప్పటి వానియందువలె కథాభాగము లుదాహరించు పద్ధతియే లేదు ఇవిగాక ప్రత్యేక కవితాశాఖా సంకలన గ్రంధములు చాటు పద్యమణి మంజరి, చాటు పద్య రత్నాకరము, శతక రత్నావళి, దండక రత్నావళి యనునవి గలవు తెలుగులో నీ సంకలన గ్రంధ శాఖ ప్రత్యేకముగా పరిశ్రమ చేయదగినది దానికి ప్రస్తుతము ప్రకటితమైన కావ్యమాల దోహదమిచ్చును పై వానిలో సకల నీతి సమ్మతము, ప్రబంధ రత్నావళి, ప్రబంధమణి భూషణము వాఙ్మయ చరిత్రకెంతో యుపయుక్తములైనవి తిరిగి ముద్రింపదగినవి నవీన సంకలనములలో శ్రీ దాసరి లక్ష్మణస్వామిగారి వర్ణన రత్నాకరము చాల ప్రసిద్ధమైనది

త్రివేణి ఆంధ్రప్రదేశ జానపద గేయాల సంకలనము. ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ (హైద్రాబాదు)వారు ప్రకటించినది దీనికొక సంపాదక వర్గమున్నను దీని ప్రధాన ముఖ్య సంపాదకులు డాక్టరు బి రామరాజుగారు ఈ సంకలనముచాల సక్రమముగ, శాస్త్రీయముగ నిర్వహింపబడినది ఏ గేయము నెవరు పాడి వినిపించిరో, వారి పేరులు, స్థలము గేయము చివర నీయబడినవి మరియు కొన్ని పదములకు నాయా స్థలములలో నర్ధమును కూడ నీయబడి యున్నది పాటలన్నీ పిల్లల పాటలనీ, వేడుక పాటలనీ, స్త్రీల పాటలనీ వర్గీకరణము కూడా కలదు.

పాటలను జాగరూకతతో మూలము లో వాడుకలో పాడినట్లుగా ముద్రించి పుట యడుగున, నేటి గ్రాంధిక భాషా రూపములు చూపుటవలన భాషా పరిశ్రమ చేసేవారికిది ఎంతో ఉపకరించగలదు.

పల్లెపాటలు — పిల్లల పాటలు, డాక్టరు రామరాజుగారే తెలంగాణాలోని పల్లె పాటలలోని పిల్లల పాటలను వేరుగా సంధానించినారు. ఇందును పూర్వ పద్ధతియే అనుసరింపబడినది ఇవి చిన్న పిల్లలకు సంబంధించినవి గాబట్టి ఆ యా పాటల చివర పాటను గూర్చిన వివరణ మున్నది ఈ పాటలలో "కొండమీద వెండిగిన్నె కొక్కిరాజు కాలు విరిగె" అన్న పాటలోను, "ఒప్పుల కుప్పా, ఒయ్యారిభామా సన్నా బియ్యం, ఛాయాపప్పు" అన్న పాటలోను, దేశీయ వైద్యమునకు సంబంధించిన విషయములెంతో మనోహరముగా సూచింపబడినవి అచ్చు, ముఖప్రతము పిల్లల కాకర్షణీయములుగా నున్నవి.

పసిడి పలుకులు తెలుగు భాషలోగల సామెతలు, నానుడులు, జాతీయములు, జంట పదములు కొన్నింటికి వివరణలతో శ్రీ నేదునూరి గంగాధరంగారు పసిడి పలుకులు అను పేర నొక గ్రంధమును సంధానించిరి ఇది ముద్రితమై ప్రకటితమైనది ఇందలి 'పలుకులు' బంగారమువలె విలువ గలవి గాన గంగాధరముగారీ పేరు పెట్టియుందురు

మహా కావ్యములు

అశ్వత్థ భారతము తెలుగున దండక వాఙ్మయశాఖలో ప్రధానమైన దండక రామాయణమును రచించి, యీ వరకే లబ్ధ ప్రతిష్ఠులైన 'కవి రాజ' కలుగోడు అశ్వత్థరావుగారు భారతమును నిర్వచన మహా కావ్యముగా రచియింపదలపెట్టి, ఆది సభా, ఆరణ్య, విరాట పర్వములను ప్రథమ సంపుటము నాంధ్రలోకమున కందించినారు ఇది పదునారాశ్వాసములు గలిగి 3223 పద్యములతో విరాజిల్లుచున్నది కవితా రచనలో కవిత్రయము వారి ననుసరించుచు, భారత కథను స్వచ్ఛంద సరళ శైలిని స్వతంత్రముగా నీకృతిని యశ్వత్థరావుగారు సంతరించిరి నన్నయకు నారాయణభట్టువలె, అశ్వత్థరావు గారికి కవి భూషణ కప్పగల్లు సంజీవమూర్తిగారు తోడ్పడుట విచిత్ర సన్నివేశము.

సంపాభారతము కల్యాణాత్మకములును, విశ్వశాంతి ప్రబోధకములును కమనీయ కవితా శోభితములునగు కృతి రచనలకే కవిత్వము మీదుగట్టినారు బోధర్షిందులైన కల్లూరి వేంకట నారాయణరాయ మహాశయులు అప్రతిమానమగు వీరి అశోకచరిత్ర యీ వరకు సప్తకాండయుత రామాయణముగా పరిణమించినది. నేడు ద్విపర్వయుతముగా పంపా భారతమును మన కందించిరి మొదటిది ఆర్యావర్తమునకు సంబంధించినది రెండవది దక్షిణాపథమునకు సంబంధించినది. పంపా భారతము జగత్ప్రసిద్ధమగు విజయనగర సామ్రాజ్య స్థాపనకు మూల పురుషుడై, వేద విజ్ఞానమును చిరస్థాయిగ నొనరించిన శ్రీ మాధవ విద్యారణ్యుల చరిత్రము—ఇం దాది సభా పర్వములలో నేడు ఖండము లున్నవి

శ్రీ గోవింద రామాయణము—సీతారామప్ సుప్రసిద్ధ దేశభక్తులు, రాజనీతి వేత్తలు, అద్భుత కవితా సంపన్నులు నగు శ్రీ ఆత్మకూరి గోవిందాచార్యులుగారు తమ నామాంకితముగ రామాయణము రచింప ప్రారంభించి మూడాశ్వాసముల బాలకాండ కృతిని మొదట వెలువరించినారు ఆచార్యులవారింతకుముందే యుత్తర కాండమును రచించిరి ఈ ఆశ్వాసములకు వీరు ప్రత్యేకముగ, లీలాకృపాశ్వాసమని, అవతారాశ్వాసమని, శరణాగతాశ్వాసమని పేరులుంచుట యెంతయు సమంజసమై యున్నది శైలి సులభమై, మనోహరమై యున్నది భక్తి, వేదాంతము, జ్యోతిషము మున్నగు విషయములందందు ప్రపంచితములై యున్నవి. ఆశ్వాసాంత పద్యములలో నాచార్యులవారొక యభినవ పథకము నవలంబించిరి.

మధూదయము పింగళి సూర్యనార్యుని కళాపూర్ణోదయమువలె విచిత్ర కథా సన్నివేశములు గలిగి, నవీన కాలమున వెలువడిన స్వతంత్ర కృతులలో

(2) దీనిని శ్రీ మానవల్లి రామకృష్ణ కవిమహోదయులు ప్రకటించిరి(1923) ఈ రెండింటిని సంధానించి కే. శే. ప్రభాకరశాస్త్రులవారు (ప్రబంధ రత్నావళి) (1918)

మధూదయము మున్నెన్నదగినది. గ్రంధకర్త శ్రీ ఉప్పాడ రాజారావు శ్రీకాకుళ మండల తలగాము (స్థలగ్రామ) వాస్తవ్యుడు

పద్య నవలయని చెప్పదగిన యీ కావ్యమున కధావస్తువు కల్పితమై వది మాలతి, మధుకుమారి, మాధవుడు మున్నగువా రిందు ప్రధాన పాత్రలు. కావ్య రచనమున ప్రాచ్య, పాశ్చాత్య కవితా సంప్రదాయములు గోచరించుచున్నవి. కథా నిర్మాణము, వర్ణనౌచిత్యము, రసపోషణము, భాషా ప్రయోగము అను నాల్గు విశిష్ట విషయములచే నీ కృతి నవ్యాంధ్ర వాఙ్మయమునకు నొక యలంకార ముగా వెలసినది. కవి స్థానిక వర్ణనలకు ప్రాధాన్య మొసగుట ప్రశంసింపదగినది.

గౌరీ కల్యాణము ప్రాచీన కవితా సంప్రదాయ పరిణతమైన ప్రశస్త కవితా సంపత్తిచేతనేగాక, ఆధ్యాత్మిక విద్యా సంపత్తిలో మిన్నలై వేదాంత విద్యా పారీణులైన మిన్నికంటి గురునాధశర్మగారి రచన మిది. రాఘవేశ్వరు చారిత్రము నెంద రెన్నిగతులన్ వర్ణింపగా జెల్లదే' అను రీతిని మహేశ్వరుని లీలా విలాసములను, కాళిదాసాది కవులు వర్ణించినను, తెలుగు కవులు నన్నె చోడ మహాకవినాటినుండి వర్ణింపుచునే యున్నారు ప్రస్తుత గౌరీ కల్యాణము, ప్రశస్త కవితా సమన్వితమై, సాహిత్యోపాసకులకు కరము నుపాదేయమై యున్నది

శ్రీ కృష్ణాతిమానుషతత్త్వము శ్రీ కృష్ణుని మహిమలను నవీన కాలమున బహు రీతుల విమర్శించిరి పై గ్రంధములో శ్రీ కృష్ణ చరిత్రమున నీ నాటి భావములు కొన్ని పొందుపడినవి వానికొరకు పౌరాణిక కధా సంవిధానము కొంత మార్పుచెందినది వైయక్తికమైన దృష్టి భేదము, రుచి భేదముకారణముగా నవత రించిన యీ మహాకావ్యమునందలి కవిత రసవత్తరముగా నున్నది

అ ను వా ద ము లు

గీత గోవిందము జయదేవుని యష్టపదులకు నాంధ్ర పద్యాను వాదమును, ఉప్పలూరి కనకయామాత్యులు రచించిరి సుప్రసిద్ధ విద్వన్మహా కవులు దాసు శ్రీరాములుగారు వీరికి మేనమామ కుమారులు కనకయ్యగారు క్రీ శ. 1872, 73 ప్రాంతములలో దీనిని రచించిరి వారి దౌహిత్రులు బందా కనక రాజుగారు దీనిని ముద్రించి ప్రకటించిరి గీత గోవిందము నింతకుమున్నే గద్వాల సోమభూపాలుడు, ఋగ్వేదికవి వేంకట నారాయణప్ప పద్యకృతులుగా రచింపించియున్నారు. అద్యతన కాలమున శ్రీ శ్రీ చల్లా పిచ్చయ్యశాస్త్రి గారును, ఉయ్యూరి రాజావారగు శ్రీ వేంకటాద్రి అప్పారావు బహద్దరు రాజా వారును దీనిని తెలుగున రచియించిరి లోకోత్తరమైన జయదేవుని కృతి యను వదించుట మిక్కిలి దుష్కరము—అయినను కనకయామాత్యులు సమర్థతతో, సరసముగా దెలిగించిరనుటలో సందేహములేదు

అమరుకము ఆంధ్ర వాఙ్మయమున పదునైదవ శతాబ్దినుండి వెలువడుచున్న అమరుకానువాదములలో నిది యొకటి కవి కిశోర శంకర ప్రసాదు కమనీయ రచన

తిరుప్పావు తమిళంలో విష్ణు భక్తి శృంగార వేదాంతాలు జాలువారు కృతులలో గోదారచితమైన తిరుప్పావు జగత్ప్రఖ్యాతమైనది సురపురం శ్రీనివాసాచార్యులు, శ్రీ మాడభూషిమ౯ం వేంకటాచార్యులు (తిరుపతి) మొదలగువారింతకుముందే దీనిని తెలుగులోనికి రచియించియున్నారు శ్రీ దామెర రాజ గోపాలరావుగారు తిరుప్పావును తేటయు, తేనెవలె మధురము నగు నొక క్రొత్త రీతిని అనువాదము అని యనిపించని స్వతంత్ర రచనతో ఆంధ్రుల కందిచ్చినార

స్తుతి విష్ణు పురాణాంతర్గతమగు శ్రీ స్తుతికి శ్రీ కొలకలూరి నారాయణరావు చేసిన యాంధ్రానువాదము సంస్కృత స్తుతులను సరసముగా దెలుగు చేయుగల నైపుణ్యముగల రచయిత కృతి మూలశ్లోకాంధ్ర పద్య, ప్రతి పదార్థ టీకా తాత్పర్యము లిందు గలవు

శ త క ము లు

ఆంధ్ర నలందా శతకము ఇది యొక కంద పద్య శతకము ఆంధ్ర నలందా అను మకుటము గలది గుడివాడలోని ఆంధ్ర నలందా సంక్రాంతి మహోత్సవ సందర్భమున రచితమైనది ఇందు తక్షశిలా నలందా వృత్తాంతమేకాక, ఆంధ్ర నలందా సమ్మానితులు—ప్రాచీన కవులు, పండితులు, నవీన కవ్యగ్రణులు విమర్శకులు, భాషా సాహితీవేత్తల గూర్చిన పద్యములు గలవు పూజ్యపాదులు శ్రీ వేలూరి శివరామశాస్త్రిగారి కంకితము

నతి శతి భారత జాతి పిత, గాంధి మహాత్ముని నతి శతక రూపము దాల్చినది "గణ్య శాంతిదూత గాంధి తాత" అనే మకుటముండుటచేత నిందు ఆటవెలదులే యున్నవని నిశ్చయింపవచ్చును గాంధి తత్త్వమీ శతకమున సరళముగా చిత్రితమైనది

ఆత్మవేదన — మృత్యుంజయ శతకము సరస రచయిత శ్రీ సామవేదము జానకిరామశర్మ యంతర్ముఖుడై పరమేశ్వరునికి తన యాత్మను నివేదించుచు మృత్యుంజయా అనుమకుటముతో నీ శతకము రచించిరి శతకము ధారాశుద్ధి గలది

కాశీ విశ్వేశ్వర శతకము విఖ్యాత రచయితలు శ్రీ బులుసు వేంకటేశ్వర్లు (ఎమ్ ఏ) గారు కాశీ విశ్వేశ్వరునిపై రచించిన శతకము శతకము ప్రౌఢమైన భావములతో నిండి యున్నది విశ్వేశ్వరా అనునది మకుటము

ద్వి ప ద

ఆంధ్ర మహా విష్ణువు ఈకాలమున ద్విపద కృతులంతగా వెలువడుట లేదు వెలువడినది పై కృతి యొక్కటియే ఆంధ్రుల పౌరుష దైవమగు శ్రీకాకుళాంధ్రదేవునిగూర్చినది ఆంధ్ర సచిత్ర వార పత్రిక స్వర్ణోత్సవ సందర్భములో బహుమతి నందినది ధారాళము, స్వాదు మనోజ్ఞమునైన యీ రచన వర్ఘిలి కాళిదాస కవిత్వము.

ఛందోరీతులు

మధ్యాక్కరలు అద్యతనకాలములో ప్రాచీనాంధ్ర చ్ఛందస్సునకు సంబంధిరచిన మధ్యాక్కరలను పునరుద్ధరించిన కీర్తి విశ్వనాథ వారిది వారు వేములవాడ రాజేశ్వర శతకము అను పేర మధ్యాక్కరలతో నొక శతకము రచించి 'భారతి'లో ప్రకటించినారు. వేములవాడ రాజరాజేశ్వరాస్వామి అని మకుటము.

ప్రాచీనులలో యుద్ధమల్ల శాసన రచయిత, నన్నయ, ఎర్రన మధ్యాక్కరలో రచించినారు మదికిసింగన అల్పాక్కర రచించినాడు విశ్వనాథవారి రచనలో మధ్యాక్కర లక్షణములలో కనబడుచున్న యతులు రెండును కాననగుచున్నవి అక్టోబరు సంచికలో మధ్యాక్కరలు అని శకటరేఫ ముద్రితమైనది కాని మధ్యాక్కరలోనిది శకటరేఫ గాదు సాధురేఫయే కన్నడ ఛందస్సునందీ మధ్యాక్కరలు గలవు అందును సాధురేఫయే కావున నట్లు ముద్రితముకానవసరము లేదు బ్ర. శ్రీ వఝ్ఝలవారు, మధ్యాక్కర సమాసము సంస్కృతాంధ్ర మిశ్రమమని దోషమున్నదని దానిని 'మధ్యాక్షరము'గా నుదాహరించినారు అదియు ననావశ్యకము.

ఖండకావ్యములు

శబరి • శ్రీ రామాయణ కథాంతర్గమై, సహజ భక్తిని నిరూపించు శబరి వృత్తాంతమును, సరస మధుర శైలితో శ్రీనివాస సోదర కవులీ 'శబరి' కృతిని సంతరించిరి ఇందు ఉపాసనము, ఫలశ్రుతి, నివేదనము అను మూడు భాగము లున్నవి ప్రపత్తి ప్రబోధకమును, రససమంచితమునగుటచే, నీ కృతి భక్తులకు, సాహితీవేత్తలకు నుపాదేయమైనది

సుధర్మ అతి నవీనమై, వైజ్ఞానిక జగత్తులో అద్భుత సంచలనము కలిగించిన రాకెటు వృత్తాంతమును, క్రొత్త ప్రాతల మేలి కలయికతో మనోహర పద్య రచనతో భట్టారం మల్లికార్జునంగారు 'సుధర్మ' యందు సంతరించినారు కేవల శాస్త్రీయ విజ్ఞాన విషయము నితివృత్తముగా గొని, ప్రాచీన కవితా సంప్రదాయములతో గ్రంథ రచనను గావించుటలో గ్రంథకర్తలు సిద్ధహస్తులైరి

తిక్కన : కవిబ్రహ్మయగు తిక్కనార్యుని జీవిత చరిత్ర యందలి కొన్ని ఘట్టములను గ్రహించి శ్రీ వేముగంటి నరసింహాచార్యులీ కావ్యమును రచించిరి ఇందు నాల్గు ఉల్లాసములున్నవి తిక్కన గణపతిదేవునివద్దకువెళ్లి అతని సహాయమున తన ప్రభువగు మనుమసిద్ధిని నెల్లూరి సింహాసన మెక్కించుట, భారత రచన పూర్తియగుట యందలి యితివృత్తము ఆదినుండి అంతమువరకు ప్రబంధఫణితితో నడచినది రచన రసవంతము

దాసీపన్నా చిలకమర్తివారి రాజస్థాన కథావళి చదివినవారికి పన్నా రాజభక్తి అప్రతిమానమని తెలియగలదు ప్రభువుకొరకు ప్రాణములనైన, బలిసేయు పన్నా జీవిత మీ చిన్నకావ్యమున ప్రసిద్ధ కవులైన షేక్ దావూద్ భావదీప్తముగ, చిత్రించియున్నారు

సూఫీసూక్తులు 'దోహా' అనుహిందీదేశిచ్ఛందములో కబీరు మున్నగు భక్తవరులు రచించిన గీతములను గోరక్‌పూరు, గీతాప్రెస్సువారి కల్యాణి 'సంతవాణి' వార్షిక సంచికలో ప్రచురించినారు వానిలో రమారమి 400 దోహాలకు షేకు దావూదు కవిగారు సరసఫణితిలో గీత పద్యములు రచించినారు ఇందు ముప్పదియైదు శీర్షిక లున్నవి విద్యార్థిలోకమున కవశ్య పఠనీయములు

పణవిపణి ఆశాజ్యోతుల బరణియైన యీ పణవిపణి అతి నవీన గేయకృతులలో నొకటి నళినీ కుమార రచితము నవసంఖ్యగల యాశ్వాసములు, నాలుగు వందల డెబ్బది గేయములు గల యీ కృతిలో నవ్య ప్రాచీన కవితా సంప్రదాయములు నాట్యమాడుచున్నవి

అమరశ్రీ : బౌద్ధమతమునందలి మహాయాన సంప్రదాయ సిద్ధాంతముల ననుసరించి రచితమైన యీ ప్రశస్త పద్య కృతి 'ప్రత్యూష' ప్రబంధ కర్తయు, సుకవియునగు కొమరవోలు సుబ్బారావు ప్రణీతము అశోక చక్రవర్తి పుత్రుడు మహేంద్రుడు అనుపమా కుమారిని వివాహమై, సింహళమున మహా యాన బౌద్ధమును ప్రచారము చేయుట యందలి యితివృత్తము. శ్రీ కుందూరి ఈశ్వరదత్తుగారి తొలి పలుకులుగల యీ కృతి ఉదారభావ సమన్వితము ప్రసన్న మధురమై యున్నది .

యుగళ గీతి పరాశరం గోపాల కృష్ణమూర్తి (ఏం ఏ) యొక్క ప్రాథమిక కృతి యుగళగీతి యనగా రెండు సర్గములు గీతిచ్ఛందస్సులో రచితమైనదని యర్థము చేసికొనవలెను. కవితా రచన మనోహరముగా నున్నది

క్రాంతి చక్రాలు : వివేకానందాది విశ్రుత కావ్యకర్తయైన ఉండేలుమాల కొండారెడ్డి రచితమైన యిరువదియారు ఖండికల సంపుటి వస్తువైవిధ్యము ప్రధానముగా గలది

సంధ్యాగీతము : ఈ ఖండ కావ్యమున కచదేవయానుల ప్రణయ వృత్తాంతము చిత్రమైనది రవీంద్రుని రచన ఆధారముగా నున్నను, స్వతంత్రతా స్ఫూర్తి గలది ప్రాచీనాధునాతన రచనా మార్గాలిందు కానిపించును వఝ్ఝల వేంకటేశ్వర కవి రచితము ఆంధ్రేతర రాష్ట్రముననున్న ప్రసిద్ధ ఆంధ్ర కవి.

వీరకంకణము స్వామి భక్తి పరాయణుడైన విశ్వనాథనాయకుని ధర్మదీక్ష, వీరత్వము విస్ఫుటము చేయు నీ వీర కంకణ కృతి రచయిత పాణ్యాం నరసరామయ్య కావ్యము పరిమాణమున చిన్నదియైనను, గుణమున పెద్దది

మహాశ్వేత సంస్కృత గద్య కావ్యములకు క్రమ శిరో భూషణమైన 'కాదంబరీ' మహాకృతినుండి మహాశ్వేతా పుండరీకుల ప్రణయ వృత్తాంతమును రసస్ఫూర్తితో 'స్ఫూర్తిశ్రీ' సంతరించినాడు "భావ విశ్రాంతి కల్పించి, సర్గబంధము, పంచసంధులు నిర్వహించి కథా కథనమున నైపుణ్యము వెలయించి పాత్రలను సత్యమూర్తులుగా "భాస్కరరావు (స్ఫూర్తిశ్రీ) మనోహర రచనతోనే చిన్న కబ్బమును దిద్దితీర్చినాడు

శ్రీ వేంకటేశ్వర విజయము, ప్రకాశ ప్రభ ఇందు మొదటిది పౌరాణికము. ఆబాల గోపాలము నేడాంధ్ర లోకమున నిలువేల్పుగా గొలుచుచున్న శ్రీ వేంకటేశ్వరుని మాహాత్మ్యమును దెలుపు మధుర కావ్యము రెండవది ఆంధ్ర కేసరియై, ఆంధ్ర జాతికేకైక నాయకుడై ప్రకాశించిన టంగుటూరి ప్రకాశము జీవితమునందలి ప్రభలను వెల్లడించు కృతి

ఈ కృతిద్వయ రచయితలు కోట సోదరకవులు. కవి చంద్రులు. ఈ వరకే త్యాగమూర్తి, ఆంధ్ర లక్ష్మి మొదలగు బహుకృతులు రచియించి పేరు గాంచినవారు అవధాన విద్యా నిపుణులు వీరి కవిత, నిసర్గ మనోహరమై తెలినీటి వాకవలె స్వచ్ఛమై, సౌలభ్యమధురమై ఆహ్లాద మొదవించును

త్యాగరాజీయము . నాదబ్రహ్మయైన త్యాగరాజస్వామి జీవిత కథను నే డాశ్వాసముల పద్యకృతిగా నల్లపెద్ది సుబ్బరామయ్య రచించిన కృతి యిది ప్రాచీనాంధ్ర కవుల పోకడ లిందు స్ఫురించును కథా నిర్వహణము, రచన సరసముగా మన్నవి.

కళావతి : స్కాంద పురాణము-కాశీఖండమునుండి సంగ్రహించిన 'కళావతి' కథను, సులభ సుందర శైలితో కమనీయ కవితా విశారదులగు విశ్వనాథ వరసింహము రచన— విద్యార్థినీ విద్యార్థులు చదువదగినది

సత్యనారాయణ వ్రత మాహాత్మ్యము ఇదియు పౌరాణికమే తెలుగు వారిలో ముఖ్యముగా ఉత్తర సర్కారులలో నాచరించు శ్రీ సత్యనారాయణ వ్రత కథ యిందలి యితి వృత్తము — పద్యకృతి గ్రంధకర్త ఉత్తరావిల్లి జగ్గ వాయుడు.

ఏడుకొండలు; మురళీరవం మధురమగు పై రెండు కావ్యములకు మడిపడగ బలరామాచార్యులు కర్త భక్తి రసప్రధానమైనవి ఈ రచనలు కృతికర్త సంగీతమున నిశితమైన విమర్శన జ్ఞానము కలవారు కావున నిందలి పద్యములు, పాటలు, సంగీత కళా రహస్యము గలవి

తరంగిణి • భావ కవిత్వపు ప్రారంభ దినము లోనముచిత స్థానాన్ని అలంకరించిన భమిడిపాటి రామసోమయాజుల ఖండికా రచనల కూర్పు రామసోమయాజులు రమణీయము ప్రౌఢమునైన రచన చేయగల మనిషి అయినను ఇతర ప్రవృత్తిచే నాయునకలమునుండి సమగ్ర కావ్యము వెలువడలేదు

కథా కదంబము సరస కవితారంధరులగు శ్రీ సన్నిధానమువారి కృతి చిన్న కథలు, పద్య రూపమున లేని లోటు కథా కదంబము తీర్చినది

శకుని రహస్యము : భారతమున కథలను, నవీన ఫక్కిని దిద్ది తీర్చిన సరస మధుర పద్య కృతులలో శకుని రహస్య మొకటి కథా సంవిధానములోను, మనస్తత్వ చిత్రణములోను 'మొగ్గ' చూపిన యీ కృతి మామిడివఝ్ఝల వేంకటకృష్ణశర్మగారి రచన కృతికర్త కడచిన శతాబ్దినిగల సాహిత్యవేత్తలతో సాహిత్య రచనలతో బహు పరిచయము గలవారు రాజకీయముగ స్వతంత్ర సమరమున పాల్గొన్నవారు

పూలదండ దేశ సేవలోను, భాషా సేవలోను 'భాషా భూషణ' బూదూరి రామానుజాలురెడ్డిగారు పేరు వహించినారు వినయము, వినీతి గలిగి అందరి మన్ననల నార్జించినవారు, ధారాశుద్ధి గల వీరి రచనలీ దండలో సువాసించుచున్నవి.

ప్రసన్నాంజనేయము ప్రసన్నాంజనేయము అను ప్రశస్త కృతిలో అంజనేయస్వామి కార్యసిద్ధికి ప్రధానములైన సుందర కాండ యుద్ధ కాండ ఘట్టములు వర్ణితము లైనవి కర్త విద్వాన్ తిరువాయి రాఘవసూరి

అభ్యుదయ రచనలు

మేల్కొన్న ఆకాశం మాదిరాజా రంగారావు రచన ఈతడు మనో భూమికలు, కిర్మీరం, అద్దంలో నీడలు మొదలైన కృతు లీవరకే వ్రాసిన యభ్యుదయ వాది వృత్తములలోకాక వచనము తోడనే కవిత్వము చెప్పగల రచయిత. మేల్కొన్న ఆకాశం కవిలో కలిగిన జాగృతిని మేల్కొలుపుతున్నది. అనుభవాన్ని పొదువుకొని రచన సాగించిన యింతకన్న గుణవత్తరముగా నీతిని కవితాశక్తి ప్రకాశింపగలదు.

యుగే యుగే . అభ్యుదయ కవులలో ప్రసిద్ధుడైన కుందుర్తి రచనల సంపుటి యిది. ఇందు వచన గేయ, గేయ, పద్య ఖండికలున్నవి. ప్రతిభాశాలి, ప్రశస్త రచయిత అయిన కుందుర్తి యీవరకే నవ్య సాహిత్య వీధులలో నాణ్యమైన స్థానము సంపాదించినాడు

సాగర సంగీతము అందరూ ఒక రకముగా కవిత్వము వ్రాసిన, సాగర సంగీత రచయిత మరియొక రకముగా వ్రాసే నేర్పరి పేరు పేర్వార జగన్నాథం అయితే యితడు మహారాష్ట్రుడు వక్రతలో కవిత్వమల్ల గలవాడు. ప్రసిద్ధ నవీన మహారాష్ట్ర రచయితలు సుమీనారాయణ్ రతన్‌కుమార్ బాప్పాగార్ల రచనలలోని ఛాయ లిందులో కనిపించును,

అంగార వల్లరి కె వి రమణారెడ్డి రచన. ఇందు శ్రీ శ్రీ కవితాచ్ఛాయ లున్నవి అంగారవల్లరియైనను సరళముగా నున్నది

జీవనరాగం . అభ్యుదయ సంప్రదాయానికి చెందిన రావెళ్ల వేంకట్రామారావు రచన. రచయిత కృషిచేసి కొంత కవితా సామగ్రిని సంపాదించిన అభ్యుదయ కవి కాగల లక్షణా లున్నవి

ప్రత్యేక పద్యశీర్షికలు

దశరథుని దేవేరులు మహాకవి సరస్వతీపుత్ర పుట్టపర్తి నారాయణాచార్యులుగారు కన్నడకవి శ్రీ కు. వెం. పు లాగ నవీన వృత్తాలతో వాల్మీకి రామాయణమును స్వతంత్రముగా అనువదించుచున్నారు పై శీర్షిక, ఆ మహా గ్రంధములోనిది.

గుడిగంటలు—అన్న వీరి అచ్చయిన కావ్యములో భాష నిర్దుష్టము—భావము గంభీరము—నేటి ప్రజా పరిపాలనలోని యవకతవకలిందు సూటిగ వర్ణితములు

గాలిబ్ గీతాలు కాళిదాసు, షేక్స్పియరు మహాకవుల కోవకుచెందిన ఉరుదూ మహాకవి గాలిబ్ గీతాలను ప్రఖ్యాత మహాకవి దాశరథి అనువదించినవి భారతి నాలుగు సంచికలలో ప్రకటితములైనవి శ్రీనాధుని అనువాద రీతులను పుణికిపుచ్చుకొన్న ఈ కమనీయ రచన నాలుగు గ్రంధ రూపముదాల్చిన నాంధ్ర సాహిత్యజగత్తులో సముజ్జ్వలముగా భాసించును.

వ చ న ము

శ్రీ మద్భాగవతము శ్రీమద్భాగవతము పోతన మహాకవి వలన సర్వాంధ్ర దేశీయులకు సమాదరణపాత్రమైన లోకోత్తర గ్రంధముగా పరిణమించినది అట్టి భాగవతము సంస్కృత మూలమున నెట్లున్నదో చూపుటకు, పౌరాణిక కథా కథన పూర్ణులగు పురాణపండ రామమూర్తిగారు మూల శ్లోకములతో వచన రూప వ్యాఖ్యానముతో మూడు స్కంధములను నాంధ్ర విద్వల్లోకమునకందిచ్చియున్నారు. వీరింతకు మున్ను భారతమును నట్లే రచించి కృతార్థులైనారు ఇప్పుడు భాగవత మూలమున తెలుగు వారిని తరింపజేయదలచినారు

సాహిత్య విమర్శనలు

తెలుగు మెరుగులు ప్రఖ్యాత పండితులు శ్రీ ప్రభాకరశాస్త్రిగారి పై కృతి తృతీయ ముద్రణ మీ సంవత్సరము వెలువడినది ప్రామాణికములైన సాహితీ విమర్శనము లంతగా వెలువడని యీ కాలమున తెలుగు మెరుగులవంటి కృతులు మనకు దివ్యజ్యోతులవంటివి అట్టి కృతిని మనోహరముగా మనకందించిన ప్రకాశకులకు నభినందనములు. పూర్వమువలె నిదియు బహుళ ప్రచారము బడయునమటలో సందేహములేదు.

తెంకణా దిత్య కవి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీవారి బహుమతి పొందిన "నన్నెచోడుని కవిత్వము (వేదము వేంకటరాయశాస్త్రి కృతము)" అను గ్రంధములోని భాషావాదమును విమర్శించు కృతి. నన్నెచోడనిగూర్చి చిరకాలము నుండి పరిశ్రమించుచున్న ప్రముఖ విమర్శకులలో నొకరై ప్రసిద్ధి వడిసిన

శ్రీ దేవరపల్లి వేంకట కృష్ణారెడ్డిగారు దీనిని రచించిరి ఈ విమర్శనమున బహుమతిపొందిన గ్రంథమునందలి భాషా విషయములేకాక, కృతిపతులు షష్ఠ్యంతములు, సప్త సంతానములు, అష్టాదశ వర్ణనలు—మున్నగు విషయములు విమర్శితములైనవి. పై సందర్భములనుబట్టి నన్నెచోడుడు పదునాల్గవ శతాబ్ది వాడని బహుమతి గ్రంథమున చూపబడిన యుపపత్తులన్నియు నీ గ్రంథమున ఖండితములైనవి. కుమార సంభవము క్రీ. శ. 1053 లో రచితమైనదని శ్రీ రెడ్డి గారింతకుమున్నే తమ గ్రంథమున నిరూపించియున్నారు.

కళాపూర్ణోదయ ప్రశంస నేటి తెలుగు విమర్శకులలో నెన్నిక గమచున్న శ్రీ తిమ్మావజ్ఝల కోదండరామయ్యగారు దీనికి గర్తలు ఇతివృత్తము ఉపాఖ్యానములు, సాంకేతిక పాత్ర చిత్రణము, సూరన స్వప్న జగత్తు అను నైదు శీర్షికల మూలమున కళా పూర్ణోదయ విశిష్టత తెలుపబడినది

చరిత్ర: వాఙ్మయ చరిత్రలు

'ఉషఃకిరణాలు . ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీవారి బహుమతి నందిన పందొమ్మిదవ శతాబ్ది ఆంధ్ర వాఙ్మయ చరిత్ర "ఉషః కిరణాలు" అని పేరితో ప్రకటితమైనది గ్రంథకర్తలు, ప్రసిద్ధ రచయితలు, విమర్శకులు "శ్రీ వాత్సవ" చిహ్నాంకితులు—ఎండమూరి సత్యనారాయణరావుగారు

ఆంధ్ర వాఙ్మయము, పాఙ్నన్నయ యుగము డాక్టరు దివాకర్ల వేంకటావధానిగారి (ఉస్మానియా విశ్వ విద్యాలయమున తెలుగు శాఖలో రీడరు) తత్త్వ విషయిక గ్రంథములో (Thesis) ప్రథమ భాగము ఆదినుండి నన్నయ యావిర్భావమువరకుగల భాగము ప్రకటితమైనది ఇందింతకుముందు పరిశోధకులు పరిశ్రమచేసి సంగ్రహించిన భాషా సారస్వత విషయములన్నియు నొక్కచో క్రోడీకరింపబడినవి

దక్షిణ దేశీయాంధ్ర వాఙ్మయము మద్రాసు విశ్వవిద్యాలయమువారింతకుముందు ప్రకటించిన పై గ్రంథమునకు ద్వితీయ ముద్రణ భాగ్యము లభించినది గ్రంథకర్త ప్రస్తుత వ్యాసకర్తయే

ఈ ద్వితీయ ముద్రణమున నాంగ్లేయ భాషలో, నాంధ్రేతరులకు గ్రంథ విషయ మవగాహన మగునట్లు 75 పుటల సమీక్ష గలదు తెలుగులో కూడ వాఙ్మయ సమీక్ష అనుపేర 154 పుటల వ్యాసము గలదు ఇందు కవితా విమర్శ, కావ్య విమర్శ, యక్షగాన నాటక చర్చ, మోహ శృంగారరస చర్చ, దక్షిణాంధ్ర కవుల భాషా విశేషములు, తంజాపురాంధ్ర నాయకులు, మత, సంస్కృతుల నుద్ధరించిన విధానము అను పెక్కు విషయములు విపులముగా చర్చింపబడినవి గ్రంథాంతమున అనుక్రమణికకుముందు అనుబంధమున గ్రంథ సూచి మొదలైనవి చేర్చబడినవి పూర్వ ముద్రణ లోపములు సవరింప బడుటయే గాక యనేక నూతనాంశము లిందు గలవు

సాంఘిక సంస్కృతి

హిందువుల పండుగలు—పర్వములు భారతీయ సంస్కృతి యీ నాటికి విచ్ఛిన్నము గాకుండ నిలుచుటకు మన పండుగులు, పర్వములు ఒకబలవత్తరమైన కారణము పండుగలనుగూర్చి తెలుగులో నింతకుముందే కీ శే సురవరము ప్రతాపరెడ్డిగారు వెలయించిరి ఆంగ్ల భాషలోను కొన్ని వెలయించిరి

కాని పైకృతి విశేష విశిష్టత గలది ప్రసిద్ధ రచయిత, భాషా లిపి వేత్త, పత్రికా సంపాదకుడు అయిన శ్రీ తిరుమల రామచంద్ర సంస్కృతములో హేమాద్రిదానఖండము మొదలగు గ్రంథములును, తెలుగున వాణీ విలాస గణేశ్వరీయాది గ్రంథములను పరిశీలించి, ప్రతి పండుగకును శాస్త్రీయమై, చరిత్రాత్మకమైన వివరణము వ్రాసి, తెలుగు శాస్త్ర వాఙ్మయమున కొక యమూల్యభూషణముగా సంతరించియున్నారు ఇది సజీవమైన సులభ శైలితో నున్నది నిత్యము మన మాచరించు వానిలో మనకు గోచరింపని యపూర్వ విషయము లిందు గలవు నేడు వెలువడిన రచనలలో నిది యగ్రశ్రేణి నలంకరించును.

చారిత్రకములు - శాసనములు

తెలంగాణా శాసనములు హైదరాబాద్ శ్రీ లక్ష్మణరాయ పరిశోధకమండలి వారు ప్రకటించిన శాసన సంపుటి. ఇది యిట్టి ప్రచురణములలో రెండవది. మొదటిది 1935 లో ప్రకటితమైనది.

శ్రీ గడియారం రామకృష్ణశర్మగారి సంపాదకత్వమున వెలువడిన యీ సంపుటిలో సంస్కృతాంధ్ర కర్ణాట శాసనాలు 85 ప్రకటితములైనవి. ప్రతి శాసనముగూర్చి వివరణములు సంగ్రహముగా తెలుపబడినవి అయిదు శాసనాల ప్రతిబింబాలు ప్రకటితములైనవి. దక్షిణాపథములో మధ్యయుగ చరిత్రకేకాక, ఆకాలమునాటి సంస్కృతాంధ్ర సాహిత్యములకు సంబంధించిన విషయములు కొన్ని తెలిసికొనుట కీ సంపుటి పరమ ప్రయోజనకారి.

వ్యాస మంజూష చరిత్రాత్మకములైన ఆరు వ్యాసముల సంపుటి యిది ఇందు నాలుగు వ్యాసములు దక్షిణ దేశమందలి మధుర, తంజావూరి తెలుగు నాయకులనిగూర్చి తెలుపునవి మిగిలినవి రెండింటిలో 'ఆంధ్రము, బౌద్ధము' అనే వ్యాసమును, 'చరిత్ర—పరిశోధన కావలి సోదరులు' అనే వ్యాసము ఉన్నవి ఈ వ్యాసములలో ముఖ్యముగా "కావలి సోదరులు" అనే వ్యాసము ఆంధ్రులందరకు అవశ్యపఠనీయము గ్రంథ శైలి సులభ సుందరము. చారిత్రక సాహితీ వర్ధమానులు చల్లా రాధాకృష్ణశర్మగారు యీ మంజూష కర్త.

మన ప్రాచీన కళలు—పుట్టుపూర్వోత్తరాలు ఆంధ్ర శిల్ప, సంగీత, నాట్య, చిత్ర కళలను గూర్చియేగాక, నాటక రంగము, తోలు బొమ్మలు, బుర్ర కథలు, పగటి వేషములు కొండపల్లి బొమ్మలు వీనిని గూర్చిన సంగ్రహ చరిత్రయిందు గలదు రచయిత 'ఎల్లోరా' అను సాంకేతిక నామముగల గొడవర్తి భాస్కరరావు వర్ధిష్ణువగు రచయిత

జీవిత చరిత్రలు

ఆకుండి వ్యాసమూర్తిశాస్త్రిగారి జీవిత చరిత్ర : ఇది కడచిన శతాబ్ది ఆంధ్ర లోకమున విశ్రుతి గాంచిన ఆకుండి వ్యాసమూర్తిశాస్త్రిగారి (1856—1916) జీవిత చరిత్ర వేదుల రామచంద్ర కీర్తి రచియించినది. వ్యాసమూర్తిశాస్త్రిగారాంధ్ర భారత నవనీతాది బహు గ్రంథకర్తలు. ఇందు వారి జీవిత విశేషములన్నియు గలవు.

అజ్జాడాదిభట్టనారాయణదాసు జీవిత చరిత్ర : ఆట పాటలమేటి, హరికథా పితామహుడు, చతుర్భాషా పండితుడు, లయబ్రహ్మ అగు ఆదిభట్ట నారాయణదాసు (1864—1945) జీవితచరిత్ర శ్రీ మరువాడ వేంకట చయనులు రచనము. ఇందు కేవల యీవరకు పరిచితమైన విషయములే తప్ప (అవియైన సరిగా లేవు) ఆంధ్ర భాషా చరిత్రలో ముఖ్యముగా అచ్చ తెనుగున ఆ మహా మహునికిగల పితామహస్థానము నిరూపితము కాలేదు. నన్నయనుండి నిన్నటివరకుగల తెలుగు వాఙ్మయములో అచ్చ తెలుగున నింత సాహిత్య సృష్టి చేసిన మహాకవి మరియొకడు లేడు. సంగీత సాహిత్య ప్రపంచమున యీ యుగమున వెలసిన లోకోత్తర పురుషుడు యుగకర్త నారాయణదాసు. ఆ మహనీయుని రచన లన్నింటివి కొన్ని సంవత్సరములు గాఢ పరిశ్రమ చేసినగాని, వానియందలి మహోత్కృష్ట ప్రతిభా వైశిష్ట్యము సర్వతోముఖ ప్రతిభ గోచరింపదు. ఒక్క అచ్చ తెనుగు రచనలనుగూర్చి మాత్రమే పరిశ్రమచేసి విశ్వ విద్యాలయములలో డాక్టరేటు బిరుదమును పొందవచ్చును.

నా స్మృతిపథంలో : నవ్య సాహిత్యమున నందరి యామోదమును బడసిన ప్రసిద్ధ రచయితలలో శ్రీ ఆచంట జానకిరామ్‌గారు ఎన్నికైన వ్యక్తి. "నా స్మృతిపథంలో" అనే వారి స్వీయ చరిత్ర మొదటి భాగంగా నేడు వెలువడినది. ఈనాటి మన స్వీయ చరిత్రలలో కేవలము చారిత్రకములై విసువు పుట్టించే వివరాలు మాత్రమే యుండును. జానకిరామ్‌గారి స్మృతిపథంలో వ్యక్తులు, సన్నివేశాలు, సంభాషణలు అన్నీ చైతన్యాలుతో తొణికిసలాడుచుందురు. జీవమూ, సరళమూ అయిన రచనా రామణీయకముతో యీ గ్రంథము మన స్మృతిపథములోనికి నవ్య సాహిత్యములోని ఏవో అపరిచిత విషయాలను మనస్తత్త్వములను వెలుగులోనికితెచ్చి మెదడును, హృదయమును కదిలించును.

దేశిరాజు పెద బాపయ్య జీవన స్మృతి — రచనా మంజరి : పెద బాపయ్యగారు వీరేశలింగపంతులుగారి శిష్యవర్గములో ప్రముఖులై వారి సంఘ, సంస్కరణోద్యమమునకు బహు విధములుగా సాయపడిరి. పెద బాపయ్యగారాత్మయోగి, ఆదర్శజీవి. వారి జీవితమువలెనే వారి రచనలు మన కారాధనీయము. శ్రీ కామరాజు హనుమంతరావుగారీ పవిత్ర జీవితము రచించి, రచనలను సమకూర్చిరి.

శ్రీ రామానుజ చరిత్ర : రామానుజ దాసకృతమగు నీరామానుజ చరిత్ర విశిష్టాద్వైత మత ప్రవర్తకులగు శ్రీ రామానుజుల చరిత్రమును సమగ్రముగ దెలుపునది. వైష్ణవ భక్తి ప్రపత్తు లిందు ప్రకాశ మానమగుచున్నవి.

భాష — వ్యాకరణము

బాల వ్యాకరణోద్ద్యోతము — ప్రసిద్ధమగు చిన్నయసూరి బాల వ్యాకరణమున లోపములు గలవని, ఆ లోపములను నివారించుటకు కళా ప్రపూర్ణ వజ్ఝల చిన సీతా రామస్వామిశాస్త్రిగారు ప్రత్యేకముగానే నీ ఉద్ద్యోత గ్రంథము రచించిరి. అది విద్వ ల్లోకమునకు గాని, విద్యార్థి లోకమునకుగాని యెంతవరకు నుపయుక్తము కాగలదో కొంత కాలమునకు కాని వ్యక్తముకాదు.

నా ట క ము లు

ఏకాంకికలే యెక్కడ జూచిన లెక్కకు మిక్కిలిగా కనుపట్టుచున్న యీ కాలమున పెద్ద నాటకములు, భాషాంతరీ కరణములు గాక, స్వతంత్ర రచనలు వెలువడుట హర్షింపదగినది. అందు పరాశరం వేంకట కృష్ణమాచార్యులు రచించిన కళాపూర్ణోదయము అను నాటకము ప్రశంసింపదగినది. కళా పూర్ణోదయ కథయంతయు నేడంకములలో గ్రంథకర్త రచించినాడు. ఇందు పదములున్నను నా పద్యములు పింగళి సూరన మూలకృతిలోనివే సంగ్రహింపబడుట, నీ నాటకమంతయు మనోహరమై యున్నది. 'పద్య నవల' యను పేరుగన్న కళా పూర్ణోదయము నాటకముగా కూడ వెలయవలెను గదా!

రాగవాసిష్ఠం : జ్ఞాన వాసిష్ఠం, యోగ వాసిష్ఠం ఉండగా రాగ వాసిష్ఠం కూడా ఉండడము సమంజసము, సహేతుకము. రసదృష్టితోడను, సాంఘిక ప్రయోజన దృష్టితోడను శ్రీ బోయి భీమనకవి వ్రాసిన యీ నాటకము ఈనాడు వెలువడిన నాటకములలో ఒక ప్రత్యేక విశిష్టత గలది. పౌరాణిక కాలమునాటి సాంఘిక, వర్ణ వ్యవస్థను నవీన సాంఘిక పరిణామ వ్యవస్థతతో సమన్వయము చేయు నుదాత్త రచన యిది. దీనికి ముప్పదిరెండు పుటల యుపోద్ఘాతమున్నది. అది సనాతనాధునాతన సాహితీ విమర్శకులందరును చదువదగినది.

ఇంకను శాంతిప్రియులు, శంఖారావం,—నాగమ నాయకుడు, అలెగ్జాండర్ అను నాటకములు వచ్చినవి. మొదటి రెండును పాటూర్లి రచనలు. మూడవది పెమ్మరాజు వేణుగోపాలకృష్ణమూర్తిది. నాల్గవది మధుర శ్రీ కె పిర రాజు విరచితము.

సంస్కృతనాటకాంధ్రీకరణములలో శ్రీ బులుసు వేంకటేశ్వర్లుగారి కుందమాల తృతీయముద్రణము వచ్చినది. మూడు ముద్రణములైనను నాటకమింకను సంస్కారాపేక్షితము.

ఒథెల్లో : ఆంగ్ల నాటకములలో షేక్స్పియరు రచితమైన యీ ప్రసిద్ధ విషాదాంత నాటకము, తెలుగులోనికి అఖండ సాహితీ విజ్ఞాన సంపన్నులైన జొన్నలగడ్డ సత్యనారాయణమూర్తిగారనువదించినారు. ఢిల్లీ సాహిత్య అకాడమీవారు దీనిని ప్రకటించినారు. నాటకమంతయు, వచనముగా రచితమైనను, మూడు నాల్గు చోట్ల, రసోల్బణము కొరకు పద్యములు నున్నవి.

సాహిత్య అకాడమీవారు ప్రకటించిన నేటి యాంధ్రానువాదమునకు ముందు తెలుగులో నీ క్రింది యనువాదములు వెలువడినవి.

1 1894 వల్లూరి పద్మనాభరాజు—పేరు జయద్రథ నాటకము.
2 1907 పరమహంస విద్యానందనాథస్వామి—పేరు అమృత హృదయ లేక ప్రళయాంతక రాజు
3 1909 చిల్లరిగె శ్రీనివాసరావు—పేరు పులిందా సుశీలము.
4 1915 ఆకెళ్ళ సత్యనారాయణ— పేరు. జయదేవు
5 1934 కర్లపాలెము లక్ష్మీనరసింహారావు—ముగ్ధప్రణయము.

పై నాటకముల ముఖ పత్రములలో Translated from Shakespear s 'Othello' అని యుండును.

ఈ సందర్భమున కేంద్ర ప్రభుత్వమువారు ప్రకటించిన శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారి పుస్తకము 'కల్కి లేక నాగరకతా భవిష్యత్తును' పేర్కొనదగినది. ఇది శ్రీ రాధాకృష్ణను గారి Kalki-The future of Civilisation అనే ఆంగ్ల గ్రంథానికి తెలుగు సేత.

[illegible]

ఉన్మత్తుడు : ఆంధ్రేతర రాష్ట్రములో వెలువడుచున్న ప్రవాసి ప్రచురణలోనిది యొకటి. భాగవతుల ఉమామహేశ్వరశర్మ నాలుగు రంగములుగా దీనిని రచించినాడు. సామాన్య మాధ్యమిక తరగతిలోని ఆర్థిక సంక్షోభము దీనిలో చిత్రితమైనది.

అభయ ముద్ర : సుప్రసిద్ధ నవ్య సాహితీ రచయితలు పోమంచి యజ్ఞన్న శాస్త్రిగారి నాటిక—రచనా విధానము మనోహరమైనది.

క థా ని క లు

పగడాలు : ఈ యేడు కథానికలు కోకొల్లలుగా వచ్చినవి. వానిలో పగడాలు అను కథానికా సంపుటి ప్రత్యేకముగా పేర్కొనదగ్గ రచన. జీవితములో లోతులు, అనుభవములో విలువలు ఆకట్టగల శ్రీమతి ఆచంట శారదాదేవిగార

స్త్రీ హృదయము స్త్రీ దృష్టికే విదితమని యందు నిరూపించినారు భాషలో చైతన్యము, వరళత తొణికిసలాడుచున్నవి అప్రయత్న శిల్పము, అంతర్వీక్షణ, భావ లాలిత్యము వీనిలో భాసించుచున్నవి రచయిత్రి నేటి కథానికా సాహిత్యములో ఉన్నతస్థాయి అందుకొనుటలో ఆశ్చర్యములేదు

దారి చూపిన దీప కళికలు : అనే గ్రంథములో శ్రీమతి కె. రామ లక్ష్మి భారతీయ సంస్కృతి వికాసమునకు తోడ్పడిన నవ నారీమణుల చరిత్ర చక్కగా చిత్రించినది ఇట్టి రచనలయందు దీమె సిద్ధహస్త

గేయ నాటికలు

పైరుపాట : ఈ నడుమ వచ్చిన నృత్య సంగీత గేయ రూపకము లలో శ్రీ బోయి భీమన్న పైరుపాట సుకుమారమైన భావాలతో, నైసర్గిక మైన భావోదాత్తతతో దిద్ది తీర్చిన తేనె యూట. శాకుంతల చతుర్థాంకము మనసులో పెట్టుకొని వ్రాసిన యీ రచన హృదయంగమమై స్పృహణీయమై యున్నది "ఓ దేవ నిను గనవు వేదాలు కూడ–చిరుగ గడ్డిపూలు నీ చిరు నవ్వులేనోయి—పచ్చగడ్డి కొయ్యడమూ, పరిపాలన చెయ్యడమూ దారులు వేరే గాని దూరం ఒక్కటె శివునికి చిత్తంలో ప్రతి దెబ్బ, సుత్తిదెబ్బగా మల చిన మానవమూర్తిని మించిన మహిత శిల్ప మేమున్నది" యిత్యాది లోకోత్తర రచన యందు నిండారి యున్నది శ్రీ వత్స అనే కులీనుడు చదువుగల యువ కుడు ఒక గడ్డి పిల్లను పెండ్లిచేసికొనుట యిందలి యితివృత్తము. నాట్య సుందరి నాట్యకళా చారిత్రక తత్త్వమును ననన్య సామాన్య కృషి సలిపిన నట రాజ రామకృష్ణకృతి

రామప్ప తెలుగు దేశమున శిల్ప సంపదతో రాణించుచున్న దేవాలయ ములలో రామప్ప దేవాలయ మొకటి. ఆముఖ మండపముమీద నాగినీమూర్తి నాధారముగా చేసికొని గేయ రూపక రచనయందు కీర్తిగన్న సిద్ధహస్తులు శ్రీ సి నారాయణరెడ్డి రచించిన సంగీత రూపకము ఆకాశవాణి ప్రసారమునకు మలచిన యీ రూపకము హిందీ భాషలోకేకాక, భారతీయ భాష లన్నింటి లోనికి భాషాంతరీకృతమై ప్రచారము బడసినది భావపూరిత రచన, నారా యణరెడ్డిగారి నవ్యకృతులలో వెన్నెలవాడ విశ్వనాథ నాయకుడు, అనుసరవత్ కృతిద్వయము. నీ యేడు వచ్చినవియే

నవలలు

ఈ సంవత్సరము నవలలో కొన్ని మంచివే వచ్చినవనవచ్చు వాటిలో శ్రీ భాస్కరభట్ల కృష్ణరావుగారి "వెల్లువలో పూచికపుల్లలు". శ్రీ పురాణం సూర్యప్రకాశరావుగారి "జీవనగంగ", శ్రీ విశ్వనాథవారి పురాణ వైరగ్రంథ మాలకింద ప్రకటించిన నవలలు చెప్పుకోదగ్గవి ఇవికాక వివిధ వారపత్రికలలో ధారావాహికంగా ఎన్నో నవలలు వచ్చాయి

వేదాంత గ్రంథములు

గీతా సప్తశతి శతావధానులును, తిరుపతి వేంకట కవుల శిష్యులును నగు శ్రీ చల్లా లక్ష్మీనారాయణశాస్త్రిగారు రచియించిన భగవద్గీతానువాదము పేరు నకు తగినట్లుగా నిందన్నియు తేటగీతలే యుండుట గమనింపదగినది మరియు పారాయణ కనుకూలమగునట్లుగా మూల శ్లోకముల నెదురుగా నీయబడి యున్నవి అచ్చటచ్చట కొన్ని పట్టుల యర్థములును నీయబడి యున్నవి భగవద్గీతార్థము తెలుగున గీతములలో తేటతెల్లము చేయబడినది

ఉపనిషత్సుధ : ఈ శీర్షికలో రెండవ యంజలి-కఠోపనిషత్తు. రచన శ్రీ చర్ల లక్ష్మీ గణపతిశాస్త్రి. ఆర్షగ్రంథమాలలో ప్రకటితమైన యీ రచన ఆ ముష్మిక సాధన చేయువారికి సహకారి

రాజయోగీయము పరిపూర్ణ రాజయోగము వేదాంత మార్గమున 'నచల' మార్గమును నిరూపించు పై రెండు కృతులును కడివేటి నరసా రెడ్డి కృతము గహనమైన వేదాంతవిషయమును సుగమము చేసినది కడివేటి వారి కవితా రచన "అంబికా శివయోగి వేమనకుపదేశించిన పరిపూర్ణ రాజ యోగ మిందొక ఆఖ్యానముగా నున్నది."

అమ్మతో ముచ్చటలు : శ్రీ శ్రీ యానందనాథావరనాములగు ఈశ్వర సత్యనారాయణశర్మగారి లోకోత్తరకృతి శ్రీ విద్యాతత్త్వము సంపూర్ణముగ నాకళించుకొన్న సిద్ధ పురుషులు శ్రీ శర్మగారు తమ యానందానుభవమును నమృతధారా ప్రవాహమగు కవితచే ఆధ్యాత్మ విద్యాపిపాసులగు నాంధ్రుల కెల్లరకు బంచి యిచ్చిన మహానుభావులు. అమ్మతో ముచ్చట లాంధ్రాధ్యా త్మిక వాఙ్మయమున నొక యమూల్యాంకారము

ఉపనిషత్సారములు ఆంధ్రదేశములో ప్రముఖ రాజకీయవేత్త అశీతి వృద్ధులూ అయిన అయ్యదేవర కాళేశ్వరరావుగారు ఉపనిషత్తులను పరిశీ లించి, వానిలోని సారమును తేట తెలుగున తెల్లము చేసినారు ఆ యా మూల భాగాలతోపాటు, తెలుగులో వివరణము ఆంగ్లములో వాని ముఖ్యాంశములు తెలుపబడియున్నవి

భక్తియోగము శ్రీ వియోగీహరి అనే ప్రసిద్ధ విద్వత్కవి హిందీలో రచించిన "భక్తియోగ్" అనే గ్రంథానికి పుత్తేటి సుబ్రహ్మణ్యాచార్యులుగారి ఆంధ్రానువాదము అను వాదములో మూలార్థము లన్నియు ప్రకాశమానము లగు చుండుటచేత భక్తితత్త్వము గ్రహించడమునకీ వచన కృతి చాలా సహక రించును

శాస్త్రీయ గ్రంథాలు

భారత దేశములో శిశు సంరక్షణ శ్రీమతి ఎ. సి కృష్ణారావుగారి యను వాదము దక్షిణ భారత పుస్తక సంస్థ ప్రకటితము మీకు అవసరమైన వైద్య వివేకం-అనునది యీ సందర్భమున పేర్కొనదగ్గది

రవీంద్రుని రచనలు కావ్య జగత్తు—సాహిత్య జగత్తు అను నీ రెండు రవీంద్రుని వ్యాస రచనల కనువాదములు అనువాదకుని పేరు లేదు విశ్వ సాహిత్యమాలలో, మహీధరజగన్మోహనరావుగారి సంపాదకత్వమున వెలువడినవి. మొదటి గ్రంథమున, రామాయణము, మేఘదూత, కుమార సంభవము, శాకుం తలము, కాదంబరీ చిత్రము, ధమ్మపదము, కావ్య ప్రపంచమున నుపేక్షితలు— అను నేడు వ్యాసము లున్నవి రెండవ గ్రంథమున సాహిత్యము, సాహిత్య సామగ్రి, సాహిత్య విచారకుడు సౌందర్యబోధము విశ్వసాహిత్యము సౌంద ర్యము—సాహిత్య సృష్టి సాహిత్యతత్త్వము అను వ్యాసము లున్నవి

విశ్వకవిరవీంద్రుని రచనలు, విశ్వ సాహిత్యమాలలో వెలువడుట విశేషమే గాక సమంజసమునై యున్నది ఇవి మంజులోదాత్తమగు ననువాదములు

'ఇది డాక్టరు జి. వి. కృష్ణారావుగారు కొన్ని యేండ్లక్రిందట ప్రకటించిన 'కావ్య జగత్తు' అను గ్రంథముకన్న భిన్నమని యెరుంగునది

వ్యాసములు

నేడు గ్రంథమూలముననేగాక, వ్యాసముల మూలమున యనేక విష యములు వ్యక్తమగుచున్నవి కావున వానిని యీ సమీక్షయందు జేర్చు చున్నాను ఈ శీర్షికలో నిది క్రొత్త పోకడ

సాహిత్యము—తాళపత్ర గ్రంథ శోధన ప్రాచీన తాళపత్ర గ్రంథము లను గూర్చి పరిశ్రమయే జరుగుటలేదు ఈ పరిశ్రమ నీనా డేకైకముగ, నహో రాత్రము కృషి చేయుచున్నవార శ్రీ డాక్టరు బి రామరాజుగారు వీరు "మరుగుపడిన మాణిక్యములు" అను పేర నీవర కపరిచితులైన బహిరీ పామన్నపాలుడు లయధారి గలుడాచలకవి, బారిగడపల ధర్మానాయకుడు, సాయప వేంకటపతి, చింతలపల్లి ఛాయాపతి, బోయినపల్లి కుమార వేంకట పతి మున్నగు కవుల, వారికృతుల పరిచయమును గోల్కొండ పత్రిక మూల మున వివరముగా కావించియున్నారు భారతి (సంపు 37 సం3) లో శ్రీ రంగ రాజా కేశవరావు గారినిగూర్చి వారి కృతి యింద్రద్యుమ్నీయమును గూర్చి ప్రశస్త వ్యాసము వ్రాసిరి సంస్కృతాంధ్రవసుచరిత్రల తారతమ్య పరిశీలన వ్యాసమొకటి వీరిలేఖినినుండి యిటీవల వెలువడినది అందసేక నూతనాంశ ములు గలవు ప్రవర్ధమానులగు భాషాసేవకులలో రామరాజుగారు ప్రథమ గణ్యులు వీరి వ్యాసములలో నేటి వాఙ్మయచరిత్ర కెక్కనివారెందరో కాన వత్తురు. వీరింకను నీ పరిశ్రమను సాగింతురుగాత.

సాహిత్యము—విమర్శ "తెలుగు మరుగులు" అని పేరుతో శ్రీ తిమ్మావజ్ఝల కోదండ రామయ్యగారు ప్రాచీనాంధ్ర కావ్యములలోని పాఠభేదములను గూర్చి చర్చించిరి. ఇట్టి రచన లీనా డావశ్యకములు తాళపత్రగ్రంథ పరిశీలనమువలె, నీ రీతి విమర్శనము సాగించు నలుగు రైదుగురలో తిమ్మావజ్ఝల వారొకరు ఈ వ్యాసమేకాక యీ క్రింది వ్యాసములు భారతిలో వచ్చినవి.

తిమ్మావజ్ఝలవారి తెలుగు మరుగులు—కళాప్రపూర్ణ రాళ్లపల్లి అనంత కృష్ణశర్మగారు

ఎఱ్ఱన ఉషాపరిణయములోని ఆంతర్యము. శ్రీ మల్లింపల్లి వీరేశ్వరశర్మ· అభినవ పండితరాయలు అవధాన ప్రతిభ—శ్రీ ని వేంకటరావు

అరణ్య పర్వశేషోన్నయము—వేటూరి శివరామశాస్త్రిగారు

కవులు—కాలము · వీరరాఘవకవి ఉద్యోగపర్వము-కేతవరపు రామకోటి శాస్త్రి.

అధ్వరణ కారికావళి కాలము. దేవరపల్లి వేంకటకృష్ణారెడ్డి.

సిద్ధేంద్రయోగి—పోణంగి శ్రీ రామఅప్పారావు

భాస్కర రామాయణకర్త—వాద ప్రతివాదాలు పాల్కురికి సోమనాథుడు శివకవికాడా? ఈ వ్యాసకర్త.

వ్యాకరణము : కాతంత్ర వ్యాకరణం—శ్రీ శ్రీనివాస సోదరులు.

ౕకార దీర్ఘం—శ్రీ శ్రీనివాససోదరులు

"ఎడు—తల" సంధి విచారణ—శ్రీ దీపాల పిచ్చయ్యశాస్త్రి.

కవిప్రయోగ పాఠ పరిశీలన · ద్విపద భారతము—వింత ప్రయోగములు— శ్రీకో జోగయశర్మ

శివతత్త్వసారము—శ్రీ వజ్ఝల చిన సీతారామస్వామిశాస్త్రి

ప్రయోగాల మార్పు తగునా. వ్యాసకర్త, పాఠాలు బండ్లపల్లి ఓబులరెడ్డి.

అలంకారము : విశ్వేశ్వరుని చమత్కారప్రస్థానము శ్రీమతి డి సరస్వతి.

శబ్దవిచారణ . సోరణగండ్లు—వేటూరి ఆనందమూర్తి.

కైవారము—శ్రీపాద గోపాలకృష్ణమూర్తి.

అచ్చెల్లి—మల్లెల నారాయణ.

శాసనములు—చరిత్ర కాకతి గణపతి కోలవెన్ను తామ్ర శాసనము : కె. హెచ్ వి శర్మ (6—4)

కాటయ వేముని అన్నవరదానశాసనము (10—4)

తప్పుల తడికె శాసనము : ఆరుద్ర

ఏక వీర కాకతమ్మ శ్రీపాద కృష్ణమూర్తి (11—56)

తెనుగు నేర్చిన తెల్లవారు · రాబర్ట్ డి నోబిలి—చల్లా రాధాకృష్ణశర్మ (6—59).

తెనుగు నేర్చిన తెల్లవారు . వీరమాముని చల్లా రాధాకృష్ణశర్మ (9—66)

తమిళ యుగ ప్రవక్త భారతి చల్లా రాధాకృష్ణశర్మ (10—75)

ద్రావిడ భాషా తత్త్వానికి దారిచూపిన ఇల్లిస్" (7—59)

ప్రకీర్ణకము కథా సరిత్సాగరమునకు మూలమేది? వేదం వేంకటరాయ శాస్త్రి. (6—65) తెలుగువారి ప్రాచీన సాహిత్యమునకు సబంధించిన బృహత్కథను గూర్చి యనేక నూతనాంశములను దెలుపు వ్యాసము

వీటి యన్నింటికన్న నెన్నికయైనది సాహితీ సుగతుని స్వగతం — శ్రీ రామచంద్ర గారిది ఉపజ్ఞాసహితము, ఉక్తి వైచిత్రి గలిగిన యిట్టి వ్యాఖ్య లీనా డుపాదేయములు. ఆకర్షణీయమైన భారతిలో యిది యొక ఆకర్షణీయమైన క్రొత్త శీర్షిక.

ఆంధ్ర సాహిత్యపరిషత్పత్రికలలో-ప్రకటితములగుచున్న వ్యాసములలో కుందూరి ఈశ్వరదత్తుగారి-ప్రాచీనాంధ్ర భూగోళము అను వ్యాసము చాల విలువ గలది చరిత్రకారులకేగాక, సాహిత్యోపాసకులకు చాల ప్రమాణికమైనది ఒక చిత్రము ఆంధ్ర సాహిత్య పరిషత్పత్రిక—జయంతి రామయ పంతులుగారి స్మారకసంచికలో రెండు వ్యాసములు ప్రకటితములైనవి

1. అర్ధ సమవృత్తములు 'భట్టాచార్య'
2 ఆంధ్ర వాఙ్మయములో హాస్యరసము, శిష్టా రామకృష్ణశాస్త్రి.

ఆంధ్ర సాహిత్య పరిషత్పత్రిక సం. 49. సం. 2 3 (25—11—60) ఛందోదర్పణము-అర్ధ సమవిషమ వృత్తపరిశీలనము . 65 భట్టాచార్య

మొదలు ఛందశాస్త్రములలో నన్నకవీయము తరువాత నెన్నదగిన యనంతుని ఛందోదర్పణమును శ్రీ వావిళ్ళవారు మూడవ పర్యాయము ముద్రించి సాహితీ లోకమున కదించిరి (పుట 1)

తుది . సహృదయ పండిత పరిత లోకము పై మా యభిప్రాయము లను బరిశీలించి తమ యభిప్రాయము లొసంగుదురని తలంచెద.

భారతి (సం 37 సం 8 76, 77 పుటలలో పుట 10) పై రీతిని వ్యాసమంతయు యథాతథముగా ముద్రితమైనది చివర తలంచెద అను మాటలకు భావించుచున్నాను అనునది మార్చబడినది భారతిలో శీర్షిక చందోదర్పణము "కొన్ని వృత్తములు శ్రీ భట్ట వేంకట సుబ్బయ్య" అని కలదు. భారతి ఆగస్టునెల 7 తేదీని వెలువడినది సాహిత్య పరిషత్పత్రిక 25—11—60 తేదీని విశ్వవిద్యాలయమునకు వచ్చినది

ఆంధ్ర కావ్యములు హాస్యరసము శ్రీ శిష్టా రాకమకృష్ణశాస్త్రి 67—101 అపారమగు ఆంధ్ర సారస్వతమున ఈ (హాస్య) రసము చాల గొలది. మృగ్యమని చెప్పుట కూడ సాహసము కాదేమో నవ్వుల హాస్యములో నొకే విధమైన తేలిక హాస్యముండును ఆద్యంతము గ్రంధము హాస్యప్రధానముగా నుండవలెనని యట్లుండక తప్పదు ఇందుచేతనే మన ప్రాచీనులట్టి హాస్యరస ప్రధాన గ్రంథ రచనకై ప్రయత్నింపక పోవుట

అన్నచోడదేవుని త్రిపురాంతక శాసనము కె హెచ్ వి శర్మ ఏరువ నాటిని పాలించిన తెలుగు చోళవంశీయులలో ప్రసిద్ధుడైన అన్నచోడ దేవుని శాసనము వివరములతో ప్రకటితమైనది. మూడు సంస్కృత శ్లోకము లున్నవి కవి జగన్నాధుడు—దానశాసనము పేరు కంచె పల్లి శాసనమున శాసన కాలము క్రీ శ 1388 (పుటలు 123—144)

ప్రాచీనాంధ్ర చారిత్రకభూగోళము · కుందూరి ఈశ్వరదత్తు 145, 160 పుటలు

Midutum Inscription of Jata Choda Maharajah H.K. Narasimhaswamy జటాచోడ భీముని శాసనము క్రీ శ 950 నాటిది నన్నయకు ముందున్న తెనుగు వచన శాసనములలో నిది యొకటి ఈ వరకు ప్రకటితము

సూరిలలితోక్తి చాతురి శ్రీ దువ్వూరి వేంకటరమణశాస్త్రి 24—48 పుటలు "అనయము లలితోక్తులతో అను సూరి వాక్యము దృష్టాంత పూర్వకముగా సమర్థింపబడినది వచన రచన కొరకు ప్రత్యేకముగా రచితమైనది.

ఈయేడు వెలువడిన మరికొన్ని పత్రికలయందును—గ్రంథములు, వ్యాసములు ప్రకటితములైనవి

ఇట్లు పత్రికలు, వ్యాసములు, గ్రంథములు యిందు పేర్కొనదగినవి యున్నవి కాని కాల స్థల సంకోచముచే విరమించితిని రచయితలు మన్నింతురుగాక తెలుగు సాహిత్యానికి గౌరవాస్పదమైన విషయములు రెండింటిని నుదాహరించుచున్నాను

చెన్నపురిలో అష్టమ తమిళ రచయితల మహాసభవారు సాహిత్య అకాడమీ ఉద్యోగులైన శ్రీ చల్లా రాధాకృష్ణశర్మగారిని తమిళసాహిత్యమునకై తెనగున సేవచేసినందులకు బంగారు పతకముతో సన్మానించినారు

ఈయేడు, కేంద్రసాహిత్య అకాడమీవారు తెలుగులో బహుమతి భరత నాట్య శాస్త్రమునకు నొసంగుట ముదావహము.

జీవన శరజ్జ్యోత్స్న

శ్రీ కొలకలూరి ఈనాక్

ఆమె మాట రసధ్వని
కనద్గగన గంగాధుని
ఆమె కనులు మయూఖాలు
నృత్య ద్వన మయూరాలు

ఆమె ఆశల అందాల
సుమాల నాట్య నందనం
ఆమె నవ్వుల ప్రహేళిక
గులాబి పూల మధూళిక

ఆమె తలపు భూగోళం
అనురాగం నవనీతం
ఆమె కాంతి ప్రగతి జగతి
ఆనందం ఆహ్లాదం

ఆమె తనూ సౌష్ఠవం
నవ్య శిల్ప నవజీవనం
అ మహిమోజ్జ్వల హృదయం
సాహిత్యం హిమాలయం

ఆమె మోము నిండి నింగి
సూర్య రశ్మి సోకుతుంది
ఆకాశం నుదుటి బొట్టు
చంద్రరేఖ తాకు తుంది

ఆశాంతరాళ ధ్వనులు
ఆమె నడక చూచి పొంగు
ఆశయాంతర్గత మురళి
ఆమె గొంతు వరలి మ్రోగు

జీవదేవి ఓంకారం
శ్రీకారం చిరంజీవి
మామకీన సింహాసన
సుధామధుర హృదయ భావి

నా గుండెలు నిండించిన
నవ్యామృత వర్షధార

నా భావన వెలిగించిన
నవజ్యోతి కాంతి జీర

దశావతార తోరణం
తారావతరణం ఆమె!
దశ దిగంత శాంతదీప
దృగంత దిక్సూచి ఆమె;

సెలమేటి జ్వాలా స్నిగ్ధత
నవలతా లీలా ముగ్ధత
క్రొందేనెల సుకుమారత
మీగడ తరగల నవ్యత

మల్లెమొగ్గ సౌభాగ్యం
మేఘమాల సౌజన్యం
పాలవెల్లి సౌందర్యం
కల్పవల్లి మాధుర్యం

మమతామయ యువతి యువ
జనతా దీపికా ప్రతీక
నవభావన నందన వన
నవరసాల నవ పతాక

భూత భవిష్యద్వర్తన
వర్తమాన యుగ పత్రిక
భూమాత పుత్రు గుండెలు
పూజించు దీప మాలిక

కాళిదాసు షేక్స్పియర్ల
కలం కేళి రస భావం
అరిస్టాటిల్ చాణక్యుల
ఆలోచన వాగ్జీవం

క్రీస్తు పసినవ్వుల తేట
బుద్ధుని చరణాల తేజస్సు
గాంధి హాసముఖ జ్యోతి
లింకన్ ప్రయత్నాల ఉషస్సు

నింగి సుధా వ్యథా రాత్రి
ధవళ కాంతుల జాబిల్లి
శాంత్యహింసల పూదోట
చిన్ని చెల్లి కన్నతల్లి

వెన్నముద్ద వన్నె సొగసు
వెన్నెల పన్నీటి సొబగు
నేలన నిద్రించెడి కల
లోక లాలిత లలిత కళ

చతుష్షష్టి కళా స్రష్ట
చేతనా చేతన ద్రష్ట
త్రిలోకాలోకిత తుష్టి
త్రిమూర్తుల భావ సృష్టి

రామారామ సామ్రాజ్య
రామాయణ మహీ జాత
భారత భాగవత భాని
భావగత తనూజ దూత

అనంతాంబరాంతర్గత
న్రమ కాంతిక్రమ రేఖ
అనంతాంబుధి రత్నాల
అర్ధాంత్య ప్రేమ లేఖ

కన్నతల్లి కనుల కాంక్షు
కాచగోళ శరీరక్షు
మాతృ భూమి మనస్సును
మధుర రజ స్నేహ దీక్షు

తెల్లదొరలు పాలనలో
నల్లజాతి ప్రభావిష్ట
జాతీయ విజాతీయత
సంధికథా పరాకాష్ఠ

తెలుపు నలుపు కలయికతో
వలపు చిమ్ము కళ్యాణం
గుడిదేవుడి గోడలతో
మసీద్ చర్చి మాంగళ్యం

క్రాసుతో మహమ్మదీయ యువతి
దివ్యవేద పరనాసక్తి

జందెంతో క్రీస్తుజనం
ఖురానులో వచించుశక్తి

ఆమె సృష్టి రహస్యాలు
అందించు వరాల సమత
ఆమె జోత్స్న అభినందన
మృదుల సుధాభిమత సమత

నింగి నీటి భావాంతర
అనురాగ సూత్రం జనత
పాలపుంత రేఖాంచల
ప్రభల నక్షత్రం సమత

మానవత్వ జయ ఘంటిక
ధ్వని పుష్పవాటిక మమత
మానవ కళ్యాణ రథం
నడచు మహా పథం సమత

సమత అంటె లోకంలో
నవసమాజ సంకల్పం
సమత అంటె తరతరాల
తరతమాల సన్న్యాసం

సమత అంటె సమభావం
సామరస్య సంకేతం
సమత శాంతి సందేశం
సహాకారం సహవాసం

నా భావం నా జీవం
నా ధ్యానం ఆమె సొత్తు
నాలోపలి ఆవేశం
ఆకాశం కన్న ఎత్తు

సమత జిగీష మనీషిని
సవరించెడి ఆలోచన
సమత నాకు సంతోషం
సంతరించెడి సులోచన

సమత జగదేక సుందర
కళా ఖండి కాను భూతి
సమత మామక సాహితీ
మనోజ్ఞ జీవ సరస్వతి

శార్వరి: ఆర్థిక సమీక్ష

శ్రీ బులుసు వేంకటసుబ్బారావు

జాతీయంగాను, అంతర్జాతీయంగాను కూడ శార్వరి సంవత్సరం అనేకములైన అసాధారణసంఘటనలతో కూడినదనే చెప్పవచ్చును. ఆర్థిక, రాజకీయ రంగాలలో ప్రపంచమంతటా చరిత్రాత్మకములైన పరిణామాలను తీసుకొని వచ్చి గొప్ప సంచలనాన్ని కలిగించింది శార్వరి పాశ్చాత్య సామ్రాజ్య శృంఖలాలనుండి ఆఫ్రికా ఖండం చాలవరకు విడివడి స్వాతంత్ర్యాన్ని సంపాదించింది జపాన్, లావోస్, టర్కీ, నేపాల్, సిలన్ మొదలైన అనేక దేశాలలో రాజకీయ విప్లవాలు, సంచలనాలు సంభవించాయి అమెరికా సంయుక్త రాష్ట్రాలలో ఎన్నికలమూలంగా ప్రభుత్వం రిపబ్లికన్ల హస్తాలనుండి డెమోక్రెట్ల చేతులలోనికి మారింది సమితి చర్చలు ఆరంభంలోనే అంతమై శాంతి ప్రతిపాదనలను వాయిదా వేసేయి. రష్యా, చైనాల నడుమ విభేదాలకు అంకురార్పణ జరిగింది ఈ నూతన సమస్యల నైజతత్వాన్ని అవగాహన చేసుకొని, సరియైన మార్గాలలో సుస్థిర శాంతి యత్నాలను చేయడానికి కొంత జాప్యం జరగవచ్చును దేశీయంగా కూడ జాతీయైక్యానికి భంగకరములైన కొన్ని సంఘటనలు సంభవించాయి చాలా రాష్ట్రాలలో ప్రభుత్వ పక్ష నాయకుల నడుమ విభేదాలు, రాష్ట్ర, భాషా, కుల, మత విభేదాలు, దురభిమానాలు, గోచరమై, అలజడి కలిగించాయి అయితే శార్వరి చివరి రోజుల్లో కొంతవరకు ఆశాజనకమైన వాతావరణం కల్పింపబడినదని చెప్పవచ్చును అమెరికాలో ప్రభుత్వం మారడం వలన, అంతర్జాతీయరంగంలో శాంతి యత్నాలకు తిరిగి కొంత సావకాశం కల్పించబడింది దేశీయంగా, అనేకగండాలు గడచి, ద్వితీయ పంచవర్ష ప్రణాళిక సంపూర్ణమైంది

ఆర్థిక రంగంలో రాజకీయ రంగములో సంభవించినంతటి గాఢమైన పరిణామాలు కలగనప్పటికి, గతించిన ఏడెనిమిది సంవత్సరాల వైఖరిలో ఒక విధమైన విస్పష్టమైన మార్పు గోచరమైనదని చెప్పవచ్చును శార్వరి నామ సంవత్సరంలో జాతీయాంతర్జాతీయ రంగాలలో ఈ వైఖరి ఏ విధమైన మార్పులు పొందినదో, నూతన వర్షారంభంలో స్థూలంగా సమీక్షింపవచ్చు

ద్వితీయ ప్రపంచ సంగ్రామానంతరం భగ్నమైన జర్మనీ ఆర్థిక వ్యవస్థ మార్షల్ ప్లాన్‌తో పునరుజ్జీవితమై, క్రమంగా పురోగమించి, శార్వరి వత్సరాంతానికి గొప్ప ఉన్నతిని పొందకలిగింది ఆర్థిక రంగంలో పశ్చిమ జర్మనీ సాధించిన ఈ అద్భుత పురోగమనము, నిజంగా చరిత్రాత్మకమైనది పశ్చిమ జర్మనీలో అనేక పరిశ్రమలు, యుద్ధానికి పూర్వపు స్థాయిని కూడ అధిగమించి, ఆ దేశపు ఆర్థిక పురోగమనాన్ని శీఘ్రతరం చేసేయి ముఖ్యంగా ఇనుము, ఉక్కు, బొగ్గు, మోటార్లు, ఓడల నిర్మాణం, యంత్ర పరికరాలు, విద్యుత్పరికరాలు మున్నగు పరిశ్రమలలో పశ్చిమ జర్మనీ అత్యున్నత ప్రమాణాలను అందుకొన కలిగింది వాణిజ్య, వ్యాపార, వ్యవసాయిక రంగాలలో కూడ శార్వరి సంవత్సరాంతానికి ఈ దేశంలో కలిగిన అభివృద్ధి, ప్రశంసనీయమైనది ఈ నిరంతరాయమైన పురోగమనంవలన, విదేశీయ ద్రవ్యమారకరంగంలో జర్మన్ 'మార్క్'కు పటిష్ఠమైన స్థానం సంప్రాప్తమైంది జర్మనీ ఆర్థిక రంగంలో కలిగిన ఈ విశేషమైన అభివృద్ధి, వివిధ దేశాలలో పలు రకముల అభిప్రాయాలకు దారి తీసింది శార్వరి సంవత్సరంలో ఆర్థిక మాంద్యంవలన కొంతవరకు అంతర్జాతీయ మారకపు విలువను 'డాలరు' కోల్పోయింది అమెరికా విదేశీయ ద్రవ్య మారక స్థితిలో ఆందోళనకరమైన సూచనలు గోచరం కాసాగాయి. ఈ పరిస్థితిని చక్కదిద్దుకొనడానికి, అమెరికా, జర్మన్ రిపబ్లిక్ సహాయాన్ని అపేక్షించింది. ఇది ఇలా ఉండగా, కామన్ మార్కెట్టు వ్యవస్థలో ఇతర దేశాలు, ముఖ్యంగా ఫ్రాన్స్, తమ రక్షణ వ్యయంలో జర్మనీ ఇప్పటికంటె అధికంగా భారం వహించాలని వత్తిడి చేయసాగేయి వెనుకబడిన దేశాలు జర్మనీనుండి ఇతోధికంగా కాంక్షింపసాగాయి. అయితే శార్వరి సంవత్సరం పొడుగునా, ఈ మూడు పక్షాల వారికి కూడా, పశ్చిమ జర్మనీ, తమ అభ్యర్థనలను తగు విధంగా పరిష్కరించడానికి, ఏ విధానాన్ననుసరిస్తుందో, భవిష్యత్తులో ఏ విధానాన్ని అనుసరింపగలదో, స్పష్టంగా తెలియలేదనే చెప్పాలి. నేటో దేశాల రక్షణ వ్యయంలో ఇతోధిక భాగాన్ని అంగీకరించేందుకు, పశ్చిమ జర్మనీ వ్యతిరిక్తతను ప్రదర్శించినప్పటికి, ఇతర అభ్యర్థనలను ఉదార వైఖరితో పరిశీలించడానికి వ్యతిరిక్తతను కనబరచలేదని భావింపవచ్చును అనుకొన్నంతగా కాకపోయినా, భారతదేశంవంటి దేశాల ఆర్థిక పురోగమన యత్నాలలో జర్మనీ సహాయం చేస్తూనే ఉంది క్రమంగా ఈ సహాయం పెంపొందగలదని మనం ఆశించవచ్చును ఇక అమెరికా విషయంలో కూడా, ఫెడరల్ బ్యాంకు రేటును కొంత తగ్గించడం ద్వారా, జర్మనీ సుముఖతను కనబరచింది. మొత్తంమీద పరిశీలిస్తే, శార్వరి నామ సంవత్సరంలో అంతర్జాతీయార్థిక రంగంలో జర్మనీ దేశానికి నూతన ప్రాధాన్యం కలిగిందని చెప్పవచ్చును ఆర్థికంగా, ద్వితీయ ప్రపంచ సంగ్రామానంతరం పశ్చిమ జర్మనీ, విశేషమైన ప్రగతిని సాధించిందనడానికి ఇదొక సూచన

శార్వరి నామ సంవత్సరంలో సంభవించిన మరొక ముఖ్యమైన మార్పు బ్రిటిష్ బ్యాంకురేటులో గోచరమవుతుంది ఈ రేటునకు బ్రిటిష్ ద్రవ్య రంగమందేకాక, అంతర్జాతీయ మారక రంగమంతటా అనల్పమైన ప్రభావం కలదు రేటును హెచ్చించడంవలన, అంతర్జాతీయ ద్రవ్యం బ్రిటన్‌కు తరలుతుంది తగ్గించడంవలన ఇతర దేశాలకు తరలుతుంది లేక కనీసం పై వైఖరి మారుతుంది బ్రిటన్ ద్రవ్య విధానంలో వాంఛితమైన రీతిగా ఈ రేటును హెచ్చించడం తగ్గించడం జరుగుతుంది 1960 వ సంవత్సరం జనవరి నాటికి బ్రిటిష్ బ్యాంకు రేటు 4 శాతము జనవరి 21 వ తేదీన దీనిని 5 శాతానికి, జూన్ 23 వ తేదీన 6 శాతానికి హెచ్చించడం జరిగింది అయితే అక్టోబరు నెలలో ఈ రేటును $5\frac{1}{2}$ శాతానికి తగ్గించారు డిసెంబరులో తిరిగి 5%కు తగ్గించారు ఈ చివరి తగ్గింపు ఉద్దేశ్యాన్ని వివరిస్తూ, $5\frac{1}{2}$ శాతము ఇతర కేంద్రముల రేట్ల దృష్ట్యా అనవసరముగా అధికముగా ఉందని, పరిస్థితులకు అనుగుణంగా లేదని బ్రిటిష్ అధికారులు వివరించారు ఈ మార్పు ఆంతరంగిక ద్రవ్య విధానంలో ఏ విధమైన సడలింపునకు సూచనగా గ్రహింత రాదు ఈ మార్పు చేయడంలో మూల కారణం అమెరికా విదేశీ ద్రవ్య పరిస్థితిలో సంభవించిన క్లిష్టతను కొంత ఉపశాంతపరచడమే అమెరికానుండి ద్రవ్యాన్ని బ్రిటన్‌కు తరలకుండా కొంతవరకు, ఈ తగ్గింపు నివారిస్తుంది. పశ్చిమ జర్మనీ బ్యాంకు రేటు తగ్గింపులో కూడా ఈ ఉద్దేశ్యం గోచరిస్తుంది.

ఈమార్పు కేవలం అమెరికా విదేశీ ద్రవ్య మారక స్థితిలో క్లిష్టతను తొలగించడానికి ఉద్దేశింపబడినప్పటికి, తత్ప్రభావంవలన ఒక విధంగా భారతదేశం కూడా లాభాన్ని పొందగలదని తెలుస్తుంది బ్రిటిష్ బ్యాంకు రేటును తగ్గించడంవలన స్టెర్లింగు ప్రాంత దేశాలనుండి గైకొన్న ఋణాలపై చెల్లింపవలసిన వడ్డీ మొత్తం, కొంతవరకు తగ్గుతుంది. ఈ విధంగా ఈ మార్పు మనకు లాభదాయకమైనదే.

శార్వరిలో అమెరికా ఆర్థిక వ్యవస్థ యందు గణనీయమైన మాంద్యము సంభవించింది తత్ప్రభావం అమెరికా ఆంతరంగిక వ్యవస్థయందు, విదేశీయ మారక ద్రవ్య స్థితియందు కూడ విస్పష్టంగా గోచరం కాగలదు ఈ మాంద్యతా సమస్య ప్లవ నామ సంవత్సరంలో మరింత తీవ్రం కాగలదని ఆర్థిక శాస్త్రజ్ఞులు భావిస్తున్నారు. అమెరికా నూతన ప్రభుత్వం, అధ్యక్షుడు శ్రీ కెన్నడీ, ఈ సమస్యను తగు విధంగా పరిష్కరింపవలసి వుంటుంది రక్షణ వ్యయం, వెనుకబడిన దేశాలకు సహాయం, అత్యవసరమవుతూన్న ఈ సమయంలో ఈ మాంద్యాన్ని శీఘ్రంగా అరికట్టవలసిన అవసరం ఎంతైనా కలదు ఒక వంక ఆంతరంగికంగా రక్షణ వ్యయాన్ని తగ్గించకుండా, నిరుద్యోగాన్ని పారిశ్రామిక మాంద్యాన్ని నివారించడం, అంతర్జాతీయార్థికరంగంలో డాలరు విలువను దిగజారిపోకుండా నిరోధించడం, నేటి ప్రభుత్వపు ముఖ్యకర్తవ్యాలు వీటిని సక్రమంగా నిర్వహించడానికి, అమెరికా ద్రవ్య రంగంలో విదేశీయులకు అనేక విధములైన పెట్టుబడుల రూపంగాఉన్న 19 బిలియన్ల డాలర్లను, దేశం వదలి ద్రవ్యరూపంలో తరలిపోకుండా నిరోధించగలగాలి పారిశ్రామిక, వ్యాపార రంగాలలో నేటి మాంద్యమును తగ్గించి నవ చైతన్యాన్ని పెంపొందింపచేస్తే, ఈ ఆశయం నెరవేరగలదు. ఈ విధంగా చేయడానికి అమెరికా బ్యాంకు రేటు ఉన్నత స్థాయిలో స్థిరంగా ఉండేట్లు జాగ్రత్త పడాలి అంతేకాక, ఎగుమతులను సాధ్యమైనంత వరకు పెంపొందించేందుకు తగిన కృషి చేయాలి అమెరికావంటి విస్తృతమైన పెట్టుబడిదారీ దేశాలలో ఈ సమస్యను పరిష్కరించడం, సామాన్యమైన విషయం కాదు వ్యక్తిగత పరిశ్రమలందు, ఏ మాత్రం జోక్యం కలిగించుకోనకుండా, కేవలం, ద్రవ్య — ఆర్థికవిధానాల ద్వారా ప్రభుత్వం ఈ ఘనకార్యాలను చేయగలగాలి రూజ్వెల్ట్ విధానాలను అవలంబింప దలచుకొన్న నూతన అధ్యక్షుడు కెన్నడీ, ఈ ఆర్థిక మాంద్యాన్ని నివారించడానికి తగిన ప్రభుత్వ విధానాన్ని ప్రభుత్వ ప్రమేయాన్ని అధికం చేయడం ద్వారా రూపొందించగలరని ఆశించవచ్చును అయితే ఈ మాంద్యం ఫలితంగా, బీద దేశాలకు, అమెరికాచేసే సాహాయ్యం తగ్గకపోవచ్చును ఈ ప్రభావం, ప్రభుత్వం అనుసరింపగల విధానంపై ఆధారపడి యుంటుంది అమెరికా ఆర్థిక వ్యవస్థ క్లిష్ట పరిస్థితిలో ఉందని అధ్యక్షుడు అంగీకరించారు నిరుద్యోగుల సంఖ్య 5½ మిలియన్లకుపైగా పెరిగింది కడచిన మూడు సంవత్సరాలలోను విదేశీమారకద్రవ్యంలో 5 బిలియన్ డాలర్ల బంగారం లోటు వచ్చింది శార్వరి సంవత్సరాంతానికి ఈ లోటు మరొక 2 బిలియన్ డాలర్లు పెరగవచ్చును వ్యవసాయాదాయంలో కూడా విశేషమైన తరుగుదల కనుపించింది ఈ మాంద్యం పరిష్కరించడానికి డాలరు విలువలో ఏ విధమైన తగ్గింపుకు సమ్మతించనని కెన్నడీ, ఆయన ఆర్థిక సలహాదారులు నిశ్చితమైన అభిప్రాయాన్ని వెల్లడించారు సాంఘిక ప్రయోజనకరమైన పథకాలపై విశేషంగా ద్రవ్యాన్ని వెచ్చించడం ద్వారా మాంద్యమును అరికట్టే విధానాన్ని వీరు అనుసరింపగలరు అంతర్జాతీయ రంగంలో అమెరికా ఆర్థిక పటిష్ఠతను కాపాడడానికి ఫ్రాన్సు, జర్మనీ, ఇంగ్లండు మున్నగు మిత్ర దేశాల సహాయం అత్యంతావశ్యకమైంది శార్వరినామ సంవత్సరంలో అతి క్లిష్టంగా తయారైన అమెరికా ఆర్థిక వ్యవస్థ ప్లవ సంవత్సరంలో తప్పక పూర్వపు పటిష్ఠతను సాధింపగలదని ఆశించవచ్చును. అమెరికా ఆర్థిక వ్యవస్థలో సంభవించిన మాంద్యం వలని నష్టం, కేవలం ఆ దేశీయులకేకాక, భారతదేశంవంటి పురోగమన మార్గంలో ఉన్న దేశాల వారికి సహితం అవాంఛనీయమైనది కనుక ఈవిషయంలో అన్ని దేశాలవారు అధ్యక్షుడు కెన్నడీ కృషిని ఆమోదించి సఫలం చేయగలరు.

భారత దేశంలో ద్వితీయ పంచవర్ష ప్రణాళిక సఫలమయ్యేందుకై శార్వరిలో, అనేక విదేశాలు ధన, ఋణ రూపంగా డిసెంబరు మాసాంతానికి విరివిగా సహాయం చేశాయి రెండు, మూడు ప్రణాళికలకై శార్వరిలో విదేశాల నుండి ఋణంగా రు 2,091 57 కోట్లు, సహాయంగా రు 636 21 కోట్లు లభించాయి. వీనియందు రు. 369.57 కోట్లు ప్రత్యేకంగా తృతీయ ప్రణా

లికకొరకు ఉద్దేశింపబడినాయి ఈ దేశాలలో ముఖ్యమైనవి అమెరికా సంయుక్త రాష్ట్రాలు, సోవియెట్ రష్యా, బ్రిటన్, కెనడా, ఆస్ట్రేలియా, న్యూజిలాండు, పశ్చిమ జర్మనీ, జపాన్ ఇవికాక జకోస్లవేకియా, యుగొస్లావియా, రుమేనియా నార్వే, పోలెండ్ దేశాలు కూడా సహాయం చేశాయి ప్రపంచబ్యాంకు ఐక్యరాజ్య సమితి ప్రత్యేక నిధి ఫోర్డు సంస్థ, రాక్ ఫెల్లర్ సంస్థ మున్నగు అంతర్జాతీయ సంస్థలు కూడా విశేషంగా తోడ్పడ్డాయి. సాంకేతికంగా కూడా అమెరికా, ఇంగ్లండు, పశ్చిమ జర్మనీ, సోవియెట్ రష్యా, కెనడా, జపాన్ దేశాలు అమూల్యమైన సహాయం చేశాయి


భారతదేశపు ఆర్థిక పురోగమనచరిత్రలో శార్వరి నామ సంవత్సరం బహు ప్రాధాన్యం కలది శార్వరితో ద్వితీయ పంచవర్ష ప్రణాళిక ఆఖరయింది ప్రారంభమైనది మొదలు అడుగడుగునకూ అవాంతరం సంభవించినప్పటికీ, చాలా విషయాలలో రెండవ ప్రణాళిక విజయవంతంగానే ముగిసిందని, విదేశీయ ఆర్థిక వేత్తలు సంతృప్తిని వెల్లడించారు. ధరలు, విదేశీ మారక ద్రవ్యం, ఆహార సమస్య మున్నగు అంశాలలో ఆందోళనకరమైన పరిణామాలు ఏర్పడినప్పటికీ, ప్రణాళికను మొత్తంమీద చూస్తే, కడపటికి విజయానికే దారి తీసిందని చెప్పవచ్చును. శతాబ్దాలుగా నిద్రాణ స్థితిలోఉన్న భారతదేశంవంటి విశాల, జన బహుళ దేశంలో ఈమాత్రం ప్రగతిని సాధించడం నిజంగా విశేషమే

విదేశీయ మారక ద్రవ్యం శార్వరిలో సంవత్సరం పొడుగునా లోపభూయిష్ఠంగానే ఉంది ఈ లోటు ఏప్రిల్ నెలనుండి క్రమంగా ఉధృతం కాజొచ్చింది 1960 ఏప్రిల్ 1 నుండి, నవంబరు 18 తేదీనాటికి మన విదేశీ ద్రవ్యపు నిల్వలు రు 50.19 కోట్లు తరగి పోయాయి దానితో మొత్తం నిలువ రు 139.63 కోట్లకు దిగజారింది ఈ లోటును భర్తీ చేయడానికి దిగుమతులను ఇతోధికంగా నిరోధించడం అత్యవసరమని ఆర్థిక మంత్రి శ్రీ మొరార్జీ దేశాయ్ వెల్లడించారు క్రిందటి సంవత్సరంలోకంటె కూడా ఈ సంవత్సరంలో ఈ లోటు అధికమైంది 1958 లో ఈ విషయమునందు ప్రమాదపరిస్థితికి లోనైనప్పటికీ, అదే విధమైన స్థితి తిరిగి ఈ సంవత్సరంలో కలగడానికి ప్రభుత్వం అవకాశమీయడం నిజంగా దురదృష్టకరమే ఈ విషయమై వాస్తవిక పరిస్థితుల కనుగుణంగా ముందే, సమగ్రమైన పథకమును రూపొందించి, మరింత జాగ్రత్తగా వ్యవహరించి ఉండవలసింది

పారిశ్రామికంగా అనుకొన్న ప్రగతిని శార్వరిలో సాధింపకలిగినాము జనుము, చక్కెర, పరిశ్రమలందు ఇతోధికమైన కృషి అవసరం. ప్రైవేటు రంగంలో కూడా అనేక పరిశ్రమలలో రెండవ ప్రణాళిక లక్ష్యాలు సాధింపబడినాయి ప్రభుత్వాధ్వర్యంలో నిర్వహింపబడే పరిశ్రమల ప్రగతిని ప్రఖ్యాత అమెరికన్ ఆర్థికశాస్త్రవేత్త జాన్ కెన్నత్ గాల్‌బ్రియత్ సమీక్షించి అనేక సూచనలు చేశారు ఈ సంస్థలందు, నిర్వహణ విశిష్ట స్థాయిలో లేదని, దాని మూలంగా వీనియందు తగిన అభివృద్ధి కలగడం లేదని ఆయన భావించారు. ప్రభుత్వ పారిశ్రామిక సంస్థలందు, క్రొత్త ఇంజనీర్లను స్థానిక శక్తి సంపదలను సరిగా వినియోగించుకొనడంలేదని ఆయన విమర్శించారు ప్రభుత్వ పారిశ్రామిక సంస్థలందు, ప్రభుత్వ ప్రమేయం హద్దు మీరి ఉండడంవలన కలిగే కష్ట నష్టాలను కూడా ఆయన వెల్లడించారు ఈ పరిశ్రమల విస్తరణకు, వీనియందు ఉత్పన్నమయ్యే లాభాలను వినియోగించాలి అయితే మన దేశంలో ప్రభుత్వ పరిశ్రమలందు, లాభాలను చేకూర్చే కృషి ఏమీ జరగటం లేదు ప్రభుత్వ సంస్థలలో అసలు లాభాలే అనవసరమన్న రీతిగా ఇక్కడ భావింపబడుతోంది కేవలం ప్రభుత్వం నూతన పరిశ్రమలను స్థాపించడంతో, కొన్నిటిని జాతీయం చేయడంతోనే కర్తవ్య నిర్వహణ ముగియదు. ప్రభుత్వాధ్వర్యంలో పని చేసే ప్రతి పరిశ్రమ, ఉత్తమ స్థాయిలో నిర్వహింపబడాలి. అప్పుడే ప్రభుత్వ రంగంలో సక్రమమైన పారిశ్రామిక పురోగమనం సాధ్యం కాగలదు ఈవిధంగా గాల్‌బ్రియత్ సూచనలను, ప్రభుత్వం తగు విధంగా గ్రహించి లోపాలను సరిదిద్దుకోవాలి

తృతీయ పంచవర్ష ప్రణాళిక స్థూలస్వరూపం శార్వరిసంవత్సర ప్రథమ భాగంలోనే ప్రణాళికా సంఘంవారిచే వెలువరించబడింది. ప్లవ సంవత్సరాదితో ఆరంభమయ్యే తృతీయ పంచవర్ష ప్రణాళిక ప్రధాని నెహ్రూచే, భారతదేశ భవిష్యత్తుకు జాతక చక్రంగా అభివర్ణించబడింది సుమారు రు 12,000 కోట్ల రూపాయల ఖర్చుతో నిర్వహింపబడే మూడవ ప్రణాళికయందు రెండవ ప్రణాళికతో పోల్చిచూస్తే మూడు ముఖ్యమైన విషయాలను గమనింపవచ్చును. ద్వితీయ పంచవర్ష ప్రణాళికలో పరిష్కృతంకాని ఆహార సమస్యను, తృతీయ ప్రణాళికయందు పరిష్కరించడానికి మహత్తరమైన కృషి జరుగుతుంది. ఈ అయిదు సంవత్సరాలలోను, మన అవసరాలకు కావలసినంతేకాక, పారిశ్రామిక విస్తరణకు కావలసిన దిగుమతులను చేసుకొనేందుకు అవసరమైన విదేశీయ మారక ద్రవ్యాన్ని సంపాదించేందుకు, విదేశాలకు ఎగుమతి చేసేందుకు కూడా చాలినంత ఆహారాన్ని ఉత్పత్తి చేయడానికి కృషి జరుగుతుంది. ఈ ఉద్దేశ్యంతో 1965-66 సంవత్సరానికి ఆహారోత్పత్తిని సుమారు 100 లేక 105 మిలియను టన్నులకు పెంచవలెనని లక్ష్యంగా ఉంచుకొనడం జరిగింది. మరొక ముఖ్యవిషయ మేమంటే రెండవ పంచవర్ష ప్రణాళికయందు ద్రవ్యోల్బణానికి కారణభూతమైన లోటు బడ్జెట్టు విధానానికి, మూడవ ప్రణాళికలో అత్యల్పమైన స్థానమొసగబడుతుంది. రెండవ ప్రణాళికలో ఈ విధానం ద్వారా రు. 1,175 కోట్లను సంపాదించారు. అయితే తృతీయ ప్రణాళికలో ఈ మొత్తాన్ని రు 500 కోట్లకు తగ్గించడానికి నిర్ణయం జరిగింది. మూడవ పంచవర్ష ప్రణాళికలో దేశీయార్థిక వ్యవస్థను, స్వయంపోషక సమర్థంగా చేయడానికి అన్ని రంగాలలోను మహత్తరమైన కృషి జరుగగలదు. ఈ విధంగా ఆర్థిక వ్యవస్థ పటిష్ఠమై స్వయం పురోగమన సమర్థమయే సమున్నత స్థాయిని, తృతీయ ప్రణాళికాంతానికి అందుకొన కలిగితే మన పంచవర్ష ప్రణాళికలు విజయాన్ని పొందాయని చెప్పవచ్చు.

నాగార్జునకొండ ప్రాక్షేత్ర ప్రాంతం



1. మొదటి ప్రాకారము
2 ప్రధాన గిరి దుర్గము.
3 మూడవ ప్రాకారము.
4 నాగార్జునుని కోట
5 మాచర్లకు పోవు బాట.
6 పెద్దకుందేళ్ల గుట్ట.
7 నాగార్జున గుట్ట.
8 తూర్పు వైపు ద్వారము.
9 పశ్చిమము వైపు ద్వారము.
10. ఉత్తరపు వైపు రహస్య ద్వారము.
11. అశ్వమేధయాగశాలాదికములు.
12 ఇక్ష్వాక రాజభవనములు.
13 సామాన్య గృహస్థుల నివాసము.
14 సైన్యాగారము; గజాశ్వాదిశాలలు.
15 ప్రేక్షక మందిరము
16 అష్టభుజస్వామి ఆలయము.
17 పుష్ప భద్రస్వామి ఆలయము.
18 సర్వదేవాలయము
19 కార్తికేయాలయము.
20 ధరణి విహారము.
21 సంఘారామము.
22 మహాచైత్యము.
23 ప్రస్తుత ప్రదర్శనశాల.
24 శ్మశాన వాటిక.
25 పెద్దవాగు.
26 ఏలేశ్వరము.
27 ఎద్దనబోడు.
28. ఫిరంగులబోడు.

⁝ ⁝ ⁝ 400 అడుగులు మించిన ఎత్తు.

- - - - 600 అడుగులు మించిన ఎత్తు.

○ స్తూపము

[దీనికి సంబంధించిన వ్యాసం 50—వ పుటలో]

Printed and Published for ageswaıa Rao Estates Private) l td by S Radhakrishna
at The Andhra Patrika Press, 6 & 7, Thambu Chetty Street, Madras-1.
Editor · S. Sambhu Prasad.

పదేళ్ళలో సాధించిన పురోభివృద్ధి

మన ప్రజల జీవన ప్రమాణాలను పెంపొందించి వారు ఆనందదాయకంగాను, సుసంపన్నంగాను జీవించడానికి కొత్త అవకాశాలను కలిగించడమే భారతదేశపు ప్రణాళికల ముఖ్యోద్దేశం. 1951 లో ప్రథమ పంచవర్ష ప్రణాళిక ప్రారంభింపబడడంతో యీ కృషికి నాంది ప్రస్తావన జరిగింది. ఆ తదుపరి సంవత్సరాలలో దేశ ఆర్థిక వ్యవస్థ క్రమాభివృద్ధి చెందుతూ వచ్చింది.

1958-59 నాటికి మనదేశ జాతీయ ఆదాయం సుమారు నూటికి 31 వంతులు, వ్యక్తిగతాదాయస్థాయి సుమారు నూటికి 18 వంతులు పెరిగాయి. వ్యవసాయోత్పత్తులు కూడా నూటికి 35 వంతులు అధికమయ్యాయి. ఆహారధాన్యాల ఉత్పత్తి 20 మిలియన్ టన్నులు పెరిగింది. 1959-60 లో కూడా యీ ఉత్పత్తులు ప్రోత్సాహకరంగానే వుండగలవని భావింపబడుతోంది. ప్రణాళికల అమలు ప్రారంభమైన తరువాత వ్యవసాయోత్పత్తులలో కానవస్తున్న అభివృద్ధి గమనం యిదివరటికంటే మిన్నగా వున్నది.

పారిశ్రామికాభివృద్ధి

పారిశ్రామికరంగంలో శక్తిసామర్థ్యాలు, ఉత్పత్తులు ఇంకా త్వరితగతిని అభివృద్ధి చెందాయి. 1959 సంవత్సరాంతం వరకి పారిశ్రామికోత్పత్తులు నూటికి 51 వంతులు పెరిగాయి. దేశ పారిశ్రామికాభివృద్ధి కార్యక్రమంలో అతి కీలకమైన మూలపరిశ్రమలు, వినియోగ వస్తువుల పరిశ్రమలు సాధించిన అభ్యుదయం గమనార్హమైనది. పబ్లిక్ రంగంలో మూడు ఉక్కు కార్ఖానాలు, ప్రైవేటురంగంలో రెండు ప్రధాన విభాగాలు నెలకొల్పబడడంతో పరిశ్రమల ఆర్థిక స్థితిగతులు మెరుగై, స్వయంపోషకత్వ సాధనకు పునాదులు ఏర్పడ్డాయి. యంత్ర నిర్మాణ పరిశ్రమలు కూడా మంచి అభివృద్ధిని సాధించాయి. వ్యవసాయక, పారిశ్రామిక రంగాలలోను, రవాణా రంగంలోను వుపయోగింపబడే వివిధ యంత్ర పరికరాలు, యంత్రాలు మనదేశంలో విరివిగా తయారుచేయబడుతూ వుండడం గమనార్హం. ద్వితీయ ప్రణాళిక సమాప్తమయ్యే నాటికి, రైల్వేలకు అవసరమైన యంత్రాలు, వస్తుపరికరాలలో అత్యధిక భాగం దేశంలోనే లభ్యమవుతాయి. వ్యవసాయరంగంలో మినహా, యితరత్రా ఉద్యోగావకాశాలు అధికమయ్యాయి.

నీటి పారుదల సౌకర్యాలు కూడా ఎక్కువైనాయి. ఈ దశాబ్దంలో అధికంగా మరో 3 కోట్ల ఎకరాల భూమికి నీటి పారుదల సౌకర్యాలు లభించాయి. విద్యుచ్ఛక్తి ఉత్పాదన సామర్థ్యం కూడా రెండింతలకు పెరిగింది. 1950-51 లో విద్యుచ్ఛక్తి సరఫరాగల నగరాలు, గ్రామాలు మొత్తం 3,687 మాత్రమే వుండేవి; నేడీ సంఖ్య 18,000 కు పెరిగింది. దేశ రవాణా సౌకర్యాలు, కమ్యూనికేషన్లు కూడా చెప్పుకోదగ్గ అభ్యున్నతిని సాధించాయి. సాంకేతిక విద్యాభ్యాసానికి సౌకర్యాలలోను, జాతీయ విజ్ఞానశాస్త్ర లేబరేటరీలు, పరిశోధనాసంస్థల సంఖ్యలోను క్రమాభివృద్ధి సాధింపబడుతోంది.

సంఘసేవా కార్యకలాపాలు

సంఘసేవా కార్యకలాపాలు కూడా ఎక్కువయ్యాయి. మునుపటికంటే ఇప్పుడు అనేకమంది పిల్లలు ప్రైమరీ, సెకండరీ పాఠశాలలకు పోగలుగుతున్నారు. ఆసుపత్రులు, చికిత్సా కేంద్రాలు అనేకం నెలకొల్పబడ్డాయి. మలేరియా, బోదకాలు, క్షయ మొదలైన వాటిని నిరోధించడానికి పెద్ద ఎత్తున కృషి జరుగుతోంది. కుటుంబ నియంత్రణ ఉద్యమం పట్ల ఎక్కువమంది ప్రజలు శ్రద్ధ చూపుతున్నారు. ఓషధులు, మందుల తయారీ రెండింతలకు పెరిగింది. వెనుకబడిన తరగతి ప్రజలు, మానసికంగాను, శారీరకంగాను వ్యాధులకు గురైనవారు, సమాజంలో నిలువ నీడలేక యాతనలకు, దురన్యాయాలకు గురైనవారు—మొదలైన వర్గాలకు చెందిన వ్యక్తుల సంక్షేమంకోసం కొన్ని ప్రత్యేక పథకాలు అమలుపరచబడుతున్నాయి.

ప్రణాళికకు సాధనసంపత్తులు

ప్రజలు సంపూర్ణమైన సహాయ సహకారాల నందించి, సమధికోత్సాహంతో పాల్గొన్నప్పుడే ప్రణాళికలను విజయవంతంగా అమలు జరపడానికి వీలుకలుగుతుంది. ప్రణాళికలోని వివిధ ప్రాజెక్టులు పథకాలకై విశేషంగా పెట్టుబడి కావాలి. ప్రతి ఒక్కరూ అవసరమైనంతగానే ఖర్చుచేసి, సాధ్యమైనంత ధనం పొదుపుచేసి జాతీయ నిర్మాణ కార్యకలాపాలకై పెట్టుబడి పెట్టినట్టయితే సత్ఫలితాలు కలుగుతాయి. అప్పుడే మనం ఆశించిన అభివృద్ధి సాధ్యపడుతుంది. పొదుపుచేసినది ఎంత చిన్న మొత్తమైనా, వాటిని ప్రభుత్వ చిన్న మొత్తాల పొదుపు పథకాలలో మదుపుపెట్టి, తద్వారా ప్రణాళికలకు ఆర్థిక సహాయం చేయడానికి అనేక అవకాశాలున్నాయి

12 ఏళ్ళ జాతీయ ప్రణాళిక పొదుపు సర్టిఫికేట్లు

ఈ సర్టిఫికేట్లు రూ 5, 10,50,100,500,1,000 విలువగలవి, 12 ఏళ్ళతరువాత రూ 8.25, 16.50, 82.50, 165, 825, 1650 వరకికి విలువ పొందుతాయి.

10 ఏళ్ళ ట్రెజరీ సేవింగ్స్ డిపాజిట్ సర్టిఫికేట్లు

ప్రతివ్యక్తి రూ 50 లు గాని, ఆ లెక్కలో రూ 25,000 వరకు డిపాజిటు చేయవచ్చు. సాలీనా వడ్డీ 4%

గడువు డిపాజిటు పొదుపు పథకం

5 లేక 10 ఏళ్ళపాటు, రూ 5,10,20,50 లేక 100 చొప్పున ప్రతినెలా డిపాజిటు చేయవచ్చును. ప్రతినెల పది రూపాయల చొప్పున డిపాజిటు చేసినట్లయితే, అయిదేళ్ళలో రూ 650 లు, పదేళ్ళలో రూ 1,450 లు అవుతాయి.

పోస్టు ఆఫీసు సేవింగ్సు బ్యాంకు అకౌంటు

ఈ అకౌంటులో డిపాజిటు చేయబడే మొత్తానికి 2½% వడ్డీ లభిస్తుంది.

బహుమతి బాండ్ల పథకం

రూ 5, రూ 100 విలువచేసే బహుమతిబాండ్లు దొరుకుతాయి. రిజర్వుబ్యాంకు, స్టేట్ బ్యాంకులకు చెందిన అన్ని కార్యాలయాలలోను, గవర్నమెంటు ట్రెజరీలలోను, పోస్టుఆఫీసులలోను యివి దొరుకుతాయి. రూ 5 విలువచేసే బాండ్లలో 278 బహుమతులు, రూ 100 విలువచేసే బాండ్లలో 40 బహుమతులు వున్నాయి రూ. 100 బాండ్లలో రూ 25,000, రూ. 5 బాండ్లలో రూ. 7,500 ప్రథమ బహుమతిగా చెల్లింపబడుతాయి. మూడు నెలలకొకసారి చీట్లు తీయబడుతాయి. అన్ని బాండ్లు—ఒకసారి బహుమతి పొందినవికూడా—ప్రతీసారి బహుమతిపొందడానికి అర్హత కలిగివుంటాయి బహుమతి ధనానికి ఆదాయపు పన్ను వర్తించదు. ఈ బహుమతులలావుండగా, 5 ఏళ్ళతరువాత ఆయా బాండ్ల విలువ మొత్తం తిరిగి చెల్లించేయబడుతుంది.

ఈ పథకాల వివరాలు కావలసిన వారు పోస్టు ఆఫీసులనుండి, నాగపూరులోని నేషనల్ సేవింగ్స్ ఆర్గనైజేషన్‌నుండి లేదా వివిధ రాష్ట్రాలలోని ప్రాంతీయ నేషనల్ సేవింగ్స్ ఆఫీసర్ల వద్దనుండి పొందవచ్చు.

ద్వితీయ ప్రణాళిక లక్ష్యాల దృష్ట్యా, యిప్పటివరకు సాధింపబడిన అభివృద్ధి సంతృప్తికరంగానే వున్నప్పటికీ, యీ ద్వితీయ ప్రణాళిక చివరి సంవత్సరంలో మన లక్ష్యాలను సాధించడానికి యింకా అధికంగా కృషి చేయవలసిన ఆవశ్యకత ఎంతైనా వున్నది. మనం ఎక్కడ ఉన్నప్పటికీ ఏ వుద్యోగంలో, ఏ హోదాలో వున్నప్పటికీ మనమంతా కలిసి మెలిసి యీ బృహత్తర కార్యక్రమంలో కాయకష్టులా కృషిచేయాలి. మన దేశం సిరిసంపదలతో అభ్యుదయపథంలో పురోగమించేటట్టు చేయడానికి దీక్ష బూనాలి

ప్రణాళిక ద్వారానే సంపద, శ్రేయస్సు. ప్రణాళికను విజయవంతం చేయండి.

ప్రణాళికకై పొదుపు చేయండి.

DA 60/416

మెట్రిక్ పద్ధతి తూకాలు, కొలతలు

మెట్రిక్ తూకాలు జమ్మూ-కాశ్మీర్‌లో తప్ప దేశంలోని అన్ని ప్రాంతాలలోను 1960 ఏప్రిల్ నుండి ప్రవేశపెట్టబడ్డాయి. మెట్రిక్ పద్ధతి తూకాలు, కొలతలు అనుసరించడానికి జరుగుతున్న కృషిలో యిదొక ముఖ్యఘట్టమని చెప్పవచ్చు.

ఈ సంస్కరణకు 1958 అక్టోబరులో నాందీ ప్రస్తావన జరిగినప్పుడు, భారతప్రభుత్వం మెట్రిక్ పద్ధతి ప్రకారం తూకాలు, కొలతలు ప్రమాణీకరిస్తూ ఒక చట్టాన్నేర్పరచి, కొన్ని నిర్ణీత ప్రాంతాలలో అమలులోనికి తీసుకొని వచ్చింది. ఈ ప్రాంతాలలో పాత తూకాలను కూడా వుపయోగించడానికి రెండేళ్ళ వ్యవధి యివ్వబడింది. 1960 సెప్టెంబరు నాటికి యీ వ్యవధి ముగిసింది. ఇప్పుడు చట్టరీత్యా మెట్రిక్ తూకాలనే వాడాలి.

మెట్రిక్ తూకాలు 1962 ఏప్రిల్ సరికి, దేశమంతటా నిర్బంధంగా అమలులోనికి వస్తాయి.

అనేక ముఖ్యపరిశ్రమలలో కూడా మెట్రిక్ పద్ధతి తూకాలు, కొలతలు వినియోగింపబడుతున్నాయి. జనపనార పరిశ్రమ 1958 జూలై నుండి, నూలువస్త్రాలు, ఇనుము, ఉక్కు, సిమెంటు, రసాయనాలు, ఇంజనీరింగు పరిశ్రమలు 1958 అక్టోబరు నుండి, పంచదార పరిశ్రమ 1958 నవంబరు నుండి యీ మెట్రిక్ పద్ధతిని అనుసరిస్తున్నాయి. 1959 అక్టోబరు 1 వ తేదీనుండి నార పరిశ్రమలో యీ పద్ధతి అమలులోనికి వచ్చింది. రెండేళ్ళ గడువు పూర్తి అయిన తరువాత, యీ పరిశ్రమ లన్నింటిలోను మెట్రిక్ పద్ధతి పూర్తిగా అమలులోనికి వస్తుంది.

నూనె పరిశ్రమలో 1960 ఏప్రిల్ నుండి ఒక్కపెట్టున మెట్రిక్ పద్ధతి ప్రవేశపెట్టబడడం గమనార్హం. పెట్రోలియం, తదనుబంధ సామగ్రి సరఫరా కూడా మెట్రిక్ యూనిట్లలోనే జరుగుతోంది. రైల్వేలకు చెందిన వాణిజ్య విభాగాలలో కూడా 1960 ఏప్రిల్ నుంచి యీ పద్ధతి వాడుకలోనికి వచ్చింది.

పార్లమెంటు చేసిన శాసనం ప్రకారం, 1966 నాటికి మెట్రిక్ పద్ధతి తూకాలు, కొలతలు దేశమంతటా అమలులోనికి రావాలి. అయితే సామాన్య వ్యవహారాలలో యీ పద్ధతి యింకా కొంత ముందుగానే వాడుకలోనికి రావచ్చునని భావింపబడుతోంది. వ్యాపారంలో వాడుకకై మెట్రిక్ తూకపు రాళ్ళు, కొలతలు దేశంలోని వివిధ ప్రాంతాలలో తయారు చేయబడుతున్నాయి. ఇవన్నీ ఖచ్చితంగా వుండేటట్టు ప్రభుత్వ ఇన్‌స్పెక్టరు పరిశీలించి, వాటిపై అధికార ఆమోద ముద్ర వేస్తారు. ఈ విధంగా తూకాలు, కొలతలలో ఏకైక, సులభమైన పద్ధతిని అనుసరించాలన్న నిర్ణీత లక్ష్యసాధనకై దేశం పురోగమిస్తోంది.

DA 60/417

శ్రీరస్తు - శ్రీ త్రిపురసుందరీ పరశివాభ్యాం నమః

శ్రీ ప్లవనామ సంవత్సర పూర్ణశాస్త్రీయ (ఆంధ్రపత్రికా) పంచాంగమ్

బ్రహ్మశ్రీ శ్రీమత్పిడపర్తి చినపూర్ణార్యసిద్ధాన్తినః ద్వితీయ పుత్రేణ సుబ్రహ్మణ్యశాస్త్రిణా ప్రణీతమ్

విఘ్నేశ విధిమార్తండ చంద్రేంద్రోపేంద్ర వందిత। నమో గణపతే తుభ్యం బ్రహ్మణాం బ్రహ్మణస్పతే.

వేదమయీం నాదమయీం పరపదోద్య బిందుమయీం

మంత్రమయీం తంత్రమయీం ప్రకృతిమయీం నౌమి విశ్వవికృతిమయీం.

గమనిక

ఈ సంవత్సరమున రాజు శుక్రుడు, మంత్రి గురుడు సర్వసస్యసముదాయమగు ౧౬ వీసములలో ౯ వీసములు పంట ఫలించును. శ్రీకృష్ణుడు పశుపాలకుడగుటచే పశువులు తృణ క్షీర సమృద్ధి గలవి యగును. రాత్రియం దార్ద్రాప్రవేశము 4 కుంచముల వర్షము. మాఘ బ ౫ శ॥ సింధునదీ పుష్కర ప్రవేశము. ఆంధ్రదేశమున కనుపడు గ్రహణములు లేవు.



మౌఢ్యములు

చైత్ర బ ౫ గు॥ ప్రా॥ బ ౧౩ గు॥ ప్రా॥ శుక్ర మౌఢ్యము. మార్గశిర బ ౫ బు॥ ప్రా॥ మాఘ బ ౭ మం॥ ప॥ తిగ్గి శుక్ర మౌఢ్యము. పౌష బ ౫ శు॥ ప్రా॥ మాఘ బ ౬ సో॥ ప॥ గురు మౌఢ్యం.

కల్యాద్యబ్దాః	౫౦౬౨
శాలివాహనశకః	౧౮౮౩
ఫసలీసన్	౧౩౭౦,౭౧
హిజరీసన్	౧౩౮౦,౮౧
క్రీస్తుశం	1961,62

శ్రీ శ్రీ శ్రీ

ఆంధ్రపత్రికా కార్యాలయము, మద్రాసు-1.

పంచాంగ పద్ధతి వివరణము

ఇందు కాలమానము తిథినక్షత్ర వర్జ్య మహాపాతలు ఘటికలలోను, గంటలలోను కూడ చూపబడినవి. యోగ-కరణ-అమృత గ్రహప్రవేశములు ఘటికలలో మాత్రము చూపబడినవి. శుభముహూర్తములు, దుర్ముహూర్తములు గంటలలో మాత్రం చూపబడినవి. భారత ప్రభుత్వముచే నియమింపబడిన కాలెండరు రిఫార్మ్సు కమిటీవారి నిర్ణయము ననుసరించి ప్రకటించబడిన ఇండియన్ ఎఫ్ మెరీసు-అందు నాటికల్ అల్మనాకుకు సరిపడునట్లు చూపబడినవి. నూతన వేధశాలల యందు కనుగొనబడిన భూకేంద్రమునకు సరిపడునా సనిక రవి చంద్రులచే సాధించబడిన తిథ్యాదికము-గ్రహసంచారము ఇందు ప్రాధాన్యముగ చూపబడినది. ఈ తిథ్యాది గ్రహసంచారములే పంచాంగమున వ్రాసినట్లు ఆకసమున సరిపడుచున్నది. పూర్వపద్ధతి పంచాంగము కూడ ఇందు సంగ్రహముగ చూపబడినది. ప్రతిదినమునకును లగ్నాంతకాలములును చూపబడినవి. నిరయన గ్రహస్ఫుటములును చూపబడినవి. ఇందు తిథ్యాది ఘటికలు - ఉదయాస్తమయములు - శుభముహూర్తములు విజయవాడకు చూపబడినవి. ఇందివ్వబడిన దేశాంతర చక్రముల ననుసరించి తత్తనగరవాసులు సంస్కరించుకొనినచో ఆచటకును సరిపడును-అట్లు గ్రహించగోరెదను. ఇందు వేదాంగజ్యోతిషమున సూచించబడిన అశ్వ్యాదిని గ్రహించి పంచాంగరచన చేయుటచే వైదికము. సనాతనముకూడ యగుచున్నది. శాస్త్రమునకు-ప్రత్యక్షమునకు సమ్మతిమై యొప్పు ఈ పంచాంగమును గ్రహించి శ్రౌతస్మార్తాది సత్కర్మల నాచరించగోరుచున్నాము.

దేశాంతర చక్రము

	చైత్ర మేష	వైశాఖ వృషభ	జ్యేష్ఠ మిథున	ఆషాఢ కర్కాట	శ్రావణ సింహ	భాద్ర కన్యా	ఆశ్వయ తులా	కార్తీక వృశ్చిక	అగ్రహా ధను	పౌష మకర	మాఘ కుంభ	ఫాల్గున మీన
మైసూరు	—౩౯	—౪౯	—౫౬	—౫౯	—౫౬	—౪౯	—౩౯	—౩౦	—౨౩	—౨౦	—౨౩	—౩౦
బెంగుళూరు	—౩౦	—౩౭	—౪౪	—౪౮	—౪౪	—౩౭	—౩౦	—౨౨	—౧౬	—౧౪	—౧౬	—౨౨
అనంతపురం	—౩౦	—౩౪	—౩౮	—౩౯	—౩౮	—౩౪	—౩౦	—౨౬	—౨౩	—౨౧	—౨౩	—౨౬
బళ్లారి	—౩౮	—౪౦	—౪౩	—౪౪	—౪౩	—౪౦	—౩౮	—౩౪	—౩౨	—౩౧	—౩౨	—౩౪
కర్నూలు	—౨౬	—౨౮	—౨౭	—౨౯	—౨౭	—౨౮	౨౬	—౨౪	—౨౩	—౨౨	—౨౩	—౨౪
హైదరాబాదు	—౨౧	—౨౦	—౧౭	—౧౭	—౧౭	—౨౦	౨౧	—౨౩	—౨౫	—౨౫	—౨౫	—౨౩
వరంగల్లు	—౧౦	— ౮	— ౪	— ౩	— ౪	— ౮	—౧౦	—౧౩	—౧౬	—౧౮	—౧౬	—౧౩
తిరుపతి	—౧౩	—౧౯	—౨౪	—౨౮	—౨౪	—౧౯	—౧౩	— ౮	— ౨	+ ౦	— ౨	— ౮
నెల్లూరు	— ౬	—౧౧	—౧౪	—౧౬	—౧౪	—౧౧	— ౬	— ౨	+ ౨	+ ౪	+ ౨	— ౨
కుంభకోణం	—౧౨	—౨౪	—౩౪	—౩౭	—౩౪	—౨౪	—౧౨	— ౦	+ ౯	+౧౩	+ ౯	— ౦
కాంచీపురం	— ౯	—౧౮	—౨౪	—౨౬	—౨౪	—౧౮	— ౯	— ౧	+ ౬	+ ౭	+ ౬	— ౧
మద్రాస్	— ౪	—౧౧	—౧౮	—౨౦	—౧౮	—౧౧	— ౪	+ ౪	+౧౦	+౧౨	+౧౦	+ ౪
భద్రాచలం	+ ౩	+ ౫	+ ౮	+ ౭	+ ౮	+ ౫	+ ౩	+ ౦	— ౨	— ౩	— ౨	+ ౦
బందరు	+ ౫	+ ౫	+ ౪	+ ౪	+ ౪	+ ౫	+ ౫	+ ౬	+ ౮	+ ౮	+ ౮	+ ౬
రాజమండ్రి	+౧౧	+౧౩	+౧౩	+౧౪	+౧౩	+౧౩	+౧౧	+౧౦	+ ౯	+ ౯	+ ౯	+౧౦
విజయనగరం	+౨౭	+౩౨	+౩౪	+౩౬	+౩౪	+౩౨	+౨౭	+౨౪	+౨౧	+౨౦	+౨౧	+౨౪
బరహంపురం	+౪౨	+౪౭	+౫౩	+౫౫	+౫౩	+౪౭	+౪౨	+౩౬	+౩౧	+౨౯	+౩౧	+౩౬

సూచన

విజయవాడనుండి భారత ప్రభుత్వము వారిచే నిర్ణయింపబడిన చైత్రాది మాసారంభము (అనగా మేషాది సాయన మాసారంభము) లయందు కలుగు దేశాంతర విఘటికలు యీ పై చక్రమునందు చూపబడినవి. స్వగ్రామమునకు సమీపమందున్న పట్టణమునకు అభీష్ట మాసాదియందు గల విఘటికలను యీ చక్రమునను సరించి విజయవాడకు పశ్చిమదేశములయందుండువారు యీ పంచాంగమందలి తిథ్యాదులలో తీసివేయగాను, ప్రాగ్దేశములవారు కలుపగాను స్వస్థానమునకు సూర్యోదయాది తిథ్యాదికాలము లగుచున్నవి. యీ విజయవాడ యామ్యోత్తర రేఖకు సమీపమందుగల దక్షిణోత్తర దేశములవారు ఇందు ఆయామాసములలో చూపిన +,— ధనర్ణ చిహ్నము గుర్తించి సంస్కరించుకొన వలయును - ఇందుచూపిన విఘడియలు మాసాదియందు చూపబడినవి. మాసమధ్యయందు త్రైరాశికముచే దేశాంతరమును గ్రహించి సంస్కరించినచో సూర్యోదయాది స్ఫుటతిథ్యాది కాలములగును. ఇష్టగ్రామమునకు సూర్యోదయ గంటలు పై ప్రకారము దేశాంతర విఘటికల కగు నిమిషములను ఈ విజయవాడ కగు సూర్యోదయ గంటలలో ధనర్ణ చిహ్నముకు వ్యత్యస్తముగా (అనగా విజయవాడకు పశ్చిమదేశమందుండువారు కలుపగను, ప్రాగ్దేశవాసులు తీసివేయగను) సంస్కరించినయెడల స్టాండర్డ్ టైము ననుసరించి ఇష్టగ్రామమునకు సూర్యోదయ గంటలగును; ఈ ప్రకారము సూర్యాస్తమయ కాలమును చేయదగును.

లగ్నాంతసారణియందు దేశాంతరచక్రము

	మీన	మేష	వృష	మిథు	కర్క	సింహ	కన్య	తుల	వృశ్చి	ధను	మక	కుంభ
మైసూరు	+19	+22	+24	+23	+20	+17	+18	+10	+ 8	+ 9	+11	+15
బెంగుళూరు	+14	+17	+19	+18	+16	+18	+10	+ 7	+ 5	+ 6	+ 8	+11
అనంతపురం	+18	+15	+15	+15	+14	+12	+11	+ 9	+ 9	+ 9	+10	+12
బళ్లారి	16+	+17	+17	+17	+16	+15	+14	+18	+12	+18	+18	+15
కర్నూలు	+11	+11	+12	+11	+11	+10	+10	+ 9	+ 9	+ 9	+10	+10
హైదరాబాదు	+ 8	+ 7	+ 7	+ 7	+ 8	+ 8	+ 9	+10	+10	+10	+ 9	+ 9
వరంగల్లు	+ 8	+ 2	+ 1	+ 1	+ 2	+ 4	+ 5	+ 6	+ 7	+ 6	+ 5	+ 4
తిరుపతి	+ 7	+ 9	+11	+10	+ 8	+ 6	+ 8	+ 1	— 0	+ 0	+ 2	+ 5
నెల్లూరు	+ 4	+ 5	+ 6	+ 6	+ 5	+ 8	+ 1	— 1	— 1	— 1	+ 0	+ 2
మదరాస్	+ 4	+ 6	+ 8	+ 7	+ 5	+ 2	— 1	— 4	— 5	— 4	— 2	+ 1
కుంభకోణం	+ 9	+18	+15	+14	+11	+ 6	+ 1	— 8	— 5	— 4	— 1	+ 4
కాంచీపురం	+ 6	+ 9	+10	+10	+ 7	+ 4	+ 1	— 2	— 8	— 8	— 0	+ 8
భద్రాచలం	— 2	— 8	— 8	— 8	— 2	— 1	— 0	+ 1	+ 1	+ 1	+ 0	— 1
బందరు	— 2	— 2	— 2	— 2	— 2	— 2	— 2	— 8	— 8	— 8	— 8	— 2
రాజమండ్రి	— 5	— 5	— 5	— 5	— 5	— 5	— 4	— 4	— 4	— 4	— 4	— 4
విజయనగరం	—12	—14	—14	—14	—18	—12	—10	— 9	— 8	— 8	— 9	—11
బర్హంపురం	—19	—21	—22	—22	—20	—17	—15	—18	—11	—12	—14	—16

ఇందు చూపబడిన లగ్నాంతకాలములు స్టాండర్డు టైము ననుసరించి విజయవాడకు లగ్నాంతకాలము లగుచున్నవి. ఇతరదేశములవారు, ఈ చూపబడినదేశాంతర చక్రము ననుసరించి, ఆయాలగ్నాంత కాలములకు చూపబడిన నిమిషములను, విజయవాడకు పశ్చిమదేశమున నుండు వారలు ఆయా కాలములలో కలుపగాను, ప్రాగ్దేశములయందుండువారు తీసివేయగను, స్టాండర్డు టైము ననుసరించి ఇష్టమగు వారి యా నగరములకు లగ్నాంత కాలము లగును.

విజయవాడ ప్రాంతములకు
మేషాది నిరయన లగ్నప్రమాణములు—పుష్కరలు

లగ్న ప్రమాణములు			పుష్కర ప్రమాణములు		
మేషము	౪-౨౩	గం 1-45	మేషము	౩-౪	గం 1-14
వృషభము	౫-౨	గం 2-1	వృషభము	౨-౨౦	గం 0-56
మిథునము	౫-౩౦	గం 2-12	మిథునము	౪-౨౪	గం 1-46
కర్కాటకము	౫-౩౧	గం 2-12	కర్కాటకము	౧-౧౮	గం 0-31
సింహము	౫-౧౬	గం 2-6	సింహము	౩-౪౧	గం 1-28
కన్య	౫-౧౨	గం 2-5	కన్య	౨-౨౬	గం 0-58
తుల	౫-౨౪	గం 2-10	తుల	౪-౧౯	గం 1-44
వృశ్చికం	౫-౩౪	గం 2-14	వృశ్చికం	౧-౧౭	గం 0-31
ధనుస్సు	౫-౧౭	గం 2-7	ధనుస్సు	౩-౪౩	గం 1-29
మకరం	౪-౪౦	గం 1-52	మకరము	౨-౧౧	గం 0-52
కుంభం	౪-౭	గం 1-39	కుంభము	౩-౧౭	గం 1-19
మీనం	౪-౨	గం 1-37	మీనము	౦-౫౬	గం 0-22

గత లగ్నాంతకాలములో ముహూర్తలగ్న సంబంధమైన పుష్కర గంటలను కలిపిన శుభముహూర్త లగ్నమందు పుష్కర సమయము వచ్చును.

రాజమండ్రి ప్రాంతములకు మేషాది నిరయన రాశిప్రమాణములు

మేషస్య	౪-౨౨	తులాయాః	౫-౨౪
వృషభస్య	౫-౧	వృశ్చికస్య	౫-౩౫
మిథునస్య	౫-౩౧	ధనుషః	౫-౧౯
కర్కాటకస్య	౫-౩౧	మకరస్య	౪-౩౯
సింహస్య	౫-౧౮	కుంభస్య	౪-౭
కన్యాయాః	౫-౧౩	మీనస్య	౪-౧

విజయనగర ప్రాంతములకు మేషాది నిరయన రాశిప్రమాణములు

మేషస్య	౪-౨౦	తులాయాః	౫-౨౮
వృషభస్య	౫-౦	వృశ్చికస్య	౫-౩౬
మిథునస్య	౫-౩౧	ధనుషః	౫-౧౮
కర్కాటకస్య	౫-౩౩	మకరస్య	౪-౩౭
సింహస్య	౫-౧౯	కుంభస్య	౪-౫
కన్యాయాః	౫-౧౬	మీనస్య	౩-౫౭

అయనాంశలు 23°-18'-49'' చైత్రపక్షాయనాంశలు 23-18-3 గతి 50''-25

దేశగోచారచక్రం

మి వృ మే మీ

కు		శు	ర చ
	వర్ష లగ్నం		బు కే
రా			గు శ
	●		

మి వృ మే మీ

కు		ర	బు చ శు (వ)
	జగల్లగ్నం		కే
రా			గు శ
●	।		

జగల్లగ్నాధిపతి లాభాధిపతియగు చంద్రునితోను ధన భాగ్యాధిపతియగు శుక్రునితోను కలిసి నీచయగు సప్తమమందుండి లగ్నమును చూచుచుండెను. మరియు జగల్లగ్నమునకు వాహన పంచమాధిపతులు గురు శనులు కలసి పంచమమునందుండెను. జగల్లగ్నమునకు తృతీయాష్టమాధిపతియగు కుజుడు రాజ్యమందుండెను- జగల్లగ్నమునకు వ్యయాధిపతియగు రవికి అష్టమస్థితి. జగల్లగ్నమునకు ఆరింట కేతువు. ఇట్లు విచారణ చేయగ భారతదేశమునందు ప్రజాపాలికలు ఫలవంతమై పురోభివృద్ధిని చేబట్టును. కొన్ని నూతనాభివృద్ధి విషయమున ఇన్వెస్టిగేషను (అన్వేషణ) నందభిప్రాయ భేదములు హెచ్చగుట వలన కొంతమంద గమనము ఏర్పడును. ఇరుగుపొరుగులతో స్నేహానుబంధములు కలుగును. తోటి రాజ్యములలో పాటిలేని కీర్తి ఘటిల్లును-రాజ్యమునందు కొన్ని మార్పులు చేయు సూచనలు కలవు. వర్షలగ్నమున వాహన పంచమాధిపతియగు శనితో తృతీయ వ్యయాధిపతియగు గురుడు కలిసియుండెను. భాగ్యాధిపతి బుధుడు పంచమమునందు కేతువుతో యుండెను. ధన సప్తమాధిపతి కుజునకు భాగ్యస్థితి-లగ్నాధిపతి సప్తమమునుండి లగ్నమును చూచుచుండెను. లాభమందు రాహుస్థితి. విమర్శించగ స్వవర్గమునందు పురోభివృద్ధికి ఆటంకముమాపు కొన్ని ప్రతిబంధకములు కనుపడుచున్నవి. రాజ్యాధిపతి చంద్రునకు వక్రస్థితి యగుటచే భారతప్రభుత్వమునకు రాష్ట్రములందుగల ఆదరాభిమానములు తారుమారగునని పించుచున్నది. మొత్తము విశేషించి మార్పులేక యథాప్రకారముగ నుండును—

సంవత్సరఫలము

ఈ సంవత్సరమున రాజును ధాన్యాధిపతియు శుక్రుడు-మంత్రి గురుడు-సేనాధిపతి-అర్ఘాధిపతి-మేఘాధిపతియు బుధుడు సస్యాధిపతి. నీరసాధిపతియు సూర్యుడు. రసాధిపతి కుజుడు. ఇట్లు నవనాయకులలో ఆరు ఆధిపత్యములు శుభులకైనవి. శ్రీకృష్ణుడు పశుపాలకుడు, రాత్రియందార్ద్రాప్రవేశము 4 కుంచముల వర్షము. సంవత్సరాది మొ॥ భాద్రపద శు ౩ ఆదివరకు బాలగోపకుని హస్తమందు పిమ్మట యుం బ ౧౩ శనివార పర్యంతం వృద్ధబ్రాహ్మణుని హస్తమందును, పిమ్మట వత్సరాంతమువరకు గోపయువకుని హస్తమందును కుంచముండును. సర్వసస్య సముదాయము ౧౬ విసములలో ౯ విసములు పంట ఫలించును — ఈ వత్సరము నదీమాతృకలు విశేషముగ ఫలించును—

వర్షఫలసారాంశము

ఈ సంవత్సరమున చైత్ర వైశాఖములందు ఎండలు తీవ్రముగ నున్నను మధ్య మధ్య ఖండ ఖండములందు నదీ నద తటాకాదులు నిండునట్లు వర్షించును. అధిక జ్యేష్ఠమున అనావృష్టి దోషము వలన సస్యహానియు కలుగును. మొత్తము పూర్వకార్తులకంటె ఉత్తరకార్తులయందు వర్షము కలుగునని పించుచున్నది. కార్తికపూర్ణిమా ప్రాంతముల కొన్నిట తుఫానులు సంభవించును. మాసవారీ తేదీలువారీగ వర్షయోగములు లోపల చూడనగును.

అష్టగ్రహకూటము

మొత్తము పౌష శు ౧౧ లగాయతు మాఘ బ ౫ వరకు-పంచ-షట్-సప్త-అష్టగ్రహకూటములు సంభవించినవి. ఇవి శనిక్షేత్రమున సంభవించుటచే వ్యాధులు, కరువు-ఒకరికొకరి కపహానములు-ఈతిబాధలు కలుగునని పించుచున్నది - గాని ఇదివరకు ఇట్లు అష్టగ్రహకూటము వచ్చినప్పుడు ఏమి జరిగినదో అనుభవము తక్కువగాని శాస్త్రప్రమాణము ననుసరించి పౌష శు ౧ లగాయతు శివరాత్రి వెళ్ళువరకు ప్రతి గ్రామమునందు సంఘములుగా కలసి శాంతి చేయుట వలన ఉపద్రవములు రానేరవని శాస్త్రనిర్ణయము. అంతియేగాని సర్వనాశమని యనుట అనుచితమని యెరుంగగోరెదము.

బహ్వృచోపాకర్మ

శ్రావణ శు ౧౪ శుక్రవారమున శ్రవణము సూర్యోదయము లగాయతు రెండు ఘటికలు వరకు యుండుటచే ఋగ్వేదులకుపాకర్మ శాస్త్రవిహితము.

భాద్ర శు ౧౦ బు॥ వా॥ లక్ష్మీనారాయణయోగము

భాద్రపద శు ౧౦ బు॥ వా॥ ఏకాదశి బుధవారం శ్రవణం - అతిగండ-ఈ నాల్గింటి సమ్మేళనము రాత్రిగాని పగలుగాని అరు ఘటికలు త్రిముహూర్తకాలము కలిగిన లక్ష్మీనారాయణ

యోగమును అలభ్యయోగముగావున ప్రస్తుతం రాత్రి 7.45 దాటిన తరువాతయిని నట్లుటచే విష్ణు పూజ మొదలగునవి చేసి తరించవలెను.

హరిశంకర యోగము-భాద్రపద బ ౮ మంగళవారము

పగలుగాని రాత్రికాని ఎప్పుడైనను ఎనిమిది ఘటికల కాలములో పునర్వసు, పుష్య యోగము. నవమి, దశమియోగము శివయోగము. గరజకరణము కలసిన హరిశంకరయోగమును అలభ్యయోగము-ఇందు విష్ణుమూర్తిని, ఈశ్వరుని పూజించవలయును. ఉదయము 8-30 లగాయతు 12 గంటలవరకు ఈ పుణ్యకాలము సత్కర్మల నాచరించి తరించవలెను.

కార్తికపూర్ణిమనాడు చంద్రు నుద్దేశించిచేయు వ్రతము

కార్తిక శు ౧౪ మంగళవారం సూర్యాస్తాత్పూర్వమే పూర్ణిమ ప్రవేశించుటవలన చంద్రుని ఉద్దేశించి చేయుస్త్రీల వ్రతములను పూర్ణిమరాత్రియందుగల మంగళవారముననే చేయవలెను. కొందరు పూర్ణిమకు చతుర్దశీ వేధ నిషేధమని పరదినమున చేయవలెననుచుండిరి. అట్లు చెప్పుట శాస్త్రవిరుద్ధము - లోకాచారవిరుద్ధము. అయియున్నది. ఇందుకు జ్యోతిషదర్పణమున ఇట్లు గలదు - "సూర్యాస్తమనాత్పరతః చతుర్దశీకలార్ధమాత్రాం స్పృశతే యదిస్యాత్ । తత్పూర్వ చేందుం న విలోకయంతి పరేహ్ని కుర్యాద్ద్విజజనదర్శనమ్. ఈ ప్రమాణమువలన ప్రత్యేకముగ చంద్రుదేవతాకవ్రతము ఏ రోజున సూర్యాస్తసమయమునకు పూర్ణిమయుండునో ఆ రోజున చేయవలెనని స్పష్టముగున్నది. ఈ చంద్రవ్రతమునకు చతుర్దశీవేధ పనికిరాదను వచనము ఇంత వరకు ఎచటనులేదు. పూర్ణిమకు చతుర్దశీవేధ పనికిరాదనిన ఈ చంద్రవ్రతమునకుకాక "మహా కార్తీకీ-ధాత్రీపూజా తులస్యుద్యాపనాదులకు" అని స్పష్టముగున్నది. గాన పూర్ణిమరోజున చేయతగిన వ్రతములలో కొన్ని పూర్వవిద్ధప్రధానమైనవి కొన్ని పరవిద్ధప్రధానమైనవి. ఈ చంద్రదేవతాకవ్రతము సూర్యాస్తమయవ్యాప్తి ప్రధానమైనదని స్పష్టము. గావున పూర్ణిమ నిమిత్తము చంద్రదేవతాక వ్రతముకొరకు మంగళవార ముపవాసముచేసి సాయంత్రం చంద్రోదయమప్పుడు పూజచేసి మరునాటి రోజున బుధవారమున పారణచేయవలయును.—

అమకల్పముగ అర్ధోదయ మహోదయములు

పౌష బ ౧౪ ఆదివారము మధ్యాహ్నము లగాయతు అమావాస్య-శ్రవణము-వ్యతీపాతలు కలియుటచే అర్ధోదయమను అలభ్యయోగ పుణ్యకాలము సోమవారమున సూర్యోదయమునకు పూర్వమందు ఉషఃకాలమున అమావాస్య శ్రవణ వ్యతీపాతలయొక్క యోగమువలన మహోదయమను అలభ్యయోగ పుణ్యకాలము. సూర్యోదయమునకు అమావాస్య పూర్వభాగ, శ్రవణ మధ్యభాగ, వ్యతీపాతాంత్యభాగములుగాని, అమాంత్యభాగ, శ్రవణ మధ్యభాగ, పాత పూర్వ భాగములుగాని లేకపోవుటచే అమకల్పమని తాత్పర్యము.—

శ్రీరస్తు - శ్రీమాయ శ్రీవాణ్యనమః.

శ్రీ ప్లవనామ సంవత్సర పంచాంగ పీఠికా

అచింత్యావ్యక్తరూపాయ నిర్గుణాయ గుణాత్మనే। సమస్త జగదాధారమూర్తయే బ్రహ్మణే నమః ॥౧॥ లంబోదరాంఘ్రి ద్వయమంబుజ శ్రీ సర్వస్వహారిత్యస్వహ మర్పయామః। య దర్పణా బ్రహ్మముఖామరేశా నిరంతరాయం సఫలీకృతార్థాః ॥౨॥ ప్రావృట్చర న్మేఘ నిభా భుజంగశయ్యావిభూషా విహగేంద్రవాహనా। గోపాలమల్లేశ్వర దేవకేనా భజే ప్రియాదత్త హృదర్ధదేహా ॥3॥ వేదమయీం నాదమయీం। బిందుమయీం పరపదోద్యదిందుమయీం। మంత్రమయీం తంత్రమయీం ప్రకృతిమయీం నౌమి విశ్వవికృతిమయీం ॥౪॥

గురుస్తుతిః॥ ఉచ్చైరాగ్రహ విగ్రహం ప్రవితత జ్యోతిః పదైకాశ్రయం విద్యాగోచర మాహాత్మ్య తిమసంత్ర యాత్మికం నిస్సమం। శ్రీవసిష్ఠ రి కులాగ్రణీ మణిమిమం శ్రీ సూర్య నారాయణం విద్వాంసం తి మిపేవయం శుభధియా నిర్విఘ్న మారాధ్నుమః ॥౫॥ శబ్దాలంకర ణాది శాస్త్రవిణ మస్యద్దేశీయజ్యోతిషాచార్యం, శ్రీ మురళీధరాఖ్య సుమహోపాధ్యాయవిద్వ ద్వరం। సిద్ధాంతార్థ విశేషశోభన విధా ప్రజ్ఞాత్తమం సత్కృపం। శిష్యైషు ప్రతిభా విశేష సుహితం। భక్త్యాసదాఽఽరాధ్నుమః ॥౬॥ దర్శావ్యయాబ్ధి శశినం సత్సాహిత్యామృత ప్రదం। వైరాగ్య శాస్త్రాణంతండేఽ స్మద్గురుం శ్రీశుకోపమమ్ ॥౭॥ చిలుకూర్తి వ్యయాబ్ధిందుం శబ్ద శాస్త్ర గురూత్తమ్। ప్రక్రియా శేషమర్మజ్ఞం వందే కొండయ్య శాస్త్రిణం ॥౮॥

స్వీయ వంశక్రమః॥ శ్రీకౌండిన్యసగోత్రే పిడపర్త్యాఖ్యాన్వయే ప్రసిద్ధతమే। త్రిస్కంధ శాస్త్ర కృతినోభవంతి శిష్యద్భుహోః కౌలాత్ ॥౯॥ చలమాఖ్య వేంకటచలాఖ్యా స్తత్రాభవ ద్విబుధః। యో లు ప్తమాన వినయకవాదే వాగణయ దపి చ విశ్వపతిం ॥౧౦॥ తస్యాసు త సత్య ద్భుత శ్రీపాచల దైవవిత్ప్రవరః। జజ్ఞాతే తస్య సుతా పూర్ణా విద్యాసుపరిపూర్ణా ॥౧౧॥ తయోర్ద్వితీయోఽ ద్వితీయ ప్రతిభావా న్బుధోత్తమః। శ్రీపూర్ణార్యః పుష్కరాది సంప్రాప్త జ్యాలద్యగాః ॥౧౨॥ తదనుగ్రహాత్ విద్యాః పంచసుతాస్తస్య శంభుకృత్వపరాః। శ్రీసుబ్రహ్మణ్య శాస్త్రీవ్యయోద్వితీయోఽహం మేషుమంరా ॥౧౩॥ సుగణకగణాశిత సిద్ధాంత కృత్య విభిల సంసత్సు। స్వమతం, తథాద్య క్రియతే పంచాంగం ధర్మశాస్త్రార్థం ॥౧౪॥

సంవత్సరాదికృత్యం

అభ్యాదౌ మిత్రసంయుక్తో మంగళ స్నానమాచరేత్। అలంకృతో గణాధ్యక్షం వాణీ దైవ విదంగ్రహాన్ ॥౧॥ గురూన్విప్రాంశ్చ సంపూజ్య ముదితో బ్రహ్మ జన్మతః। సంవత్సర ఫలంశ్రుత్వా సుకృతానాం ఫలంలభేత్ ॥౨॥ యద్వర్షాదౌ నింబసుమం శర్కరామ్ల ఘృతైర్యుతం। భక్షితం పూర్వయామే స్యాత్తద్వర్షం సౌఖ్యదాయకం ॥౩॥

బ్రహ్మాయుః ప్రమాణాదికం

బ్రహ్మణ సౌరమానేన త్రుటికాల ప్రమాణం మా ౫ దిన ౨౪ ఘ ౪౭ వి ఘ ౪౦ లవకాల ప్రమాణం సం ౪౯ మా ౪ దిన ౧౪ ఘ ౪౭ వి ఘ టి ౪౦ నిమేషకాల ప్రమాణం సం ౧౪౭౧ మా ౫ దిన ౨౩ ఘ ౨౦ గుర్వక్షరోచ్చార కాలప్రమాణం సం ౪౦ సహ ప్రాణి॥ ప్రాణకాల ప్ర॥ సం ౪ లక్షః విఘటికా ప్ర॥ సం॥ ౨౪ లక్షః ఘటీ ప్ర॥ సం॥ ౧౪ కో ౪౦ ల॥ దిన ప్రమాణం సం॥ ౪౩౨ కోటయః॥ అనేన బ్రహ్మాయుః ప్రమాణ సౌరాబ్దాః 3,౧౧,౧౪,000 కోటయః వర్తమానస్యాస్య బ్రహ్మణః పరాఖ్యస్యాయుషోర్థం గతం॥ ద్వితీయపరార్థే ప్రథమ వర్షే ప్రథమవాసరే గత ఘట్యాదయః ఘ ౧౩ విఘ ౪౨ ప్రాణ (౦) గుర్వ (౩) నిమేష ౧౯ లవ ౧౭ త్రుటయః ౫౦ సంప్రత్యేక పంచాశత్తమే త్రుటికాలే గత సౌరమానాదయః మా 3 ఘ ౪౭ విఘ ౪౦॥ బ్రహ్మణ సౌరమానేన వయోగత వత్సరాః ౧౫౫౫౨౧౯౩ కో, ౭౨ ల ౪౯ సహ ౭౨ ఇదానీం తన శ్వేతవరాహ కల్పే స్వాయంభువా ద్యాషణ్మన వోగతాః॥ సప్తమే వైవస్వత మన్వంతరే సప్తవింశతి మహాయుగాగతాః సప్తవింశతిమహాయుగాంతే అష్టావింశ చతుర్యుగే కృతత్రేతా ద్వాపరాః యుగాగతాః, కలియుగే ప్రథమ పాదే కలిగతాబ్దాః ౫౦౪౩ ... [illegible]

వ్యవహారమాన నిరూపణం

అథాస్మిన్దేశే లోకవ్యవహారార్థం చాంద్రమానాబ్దో గ్రాహ్యః॥ వింధ్య స్యోత్తరదేశే బార్హస్పత్య మానాబ్దో గ్రాహ్యః॥ అయ మేవ ఫల ప్రదర్శనార్థం మాసనామ్నా గ్రాహ్యః॥ చాంద్రమాన వశాదయం ప్లవనామ సంవత్సరః॥ బార్హస్పత్యమానవశా దయమానంద నామ సంవత్సరః॥ అయ మేవ శ్రావణాబ్ద ఇత్యుచ్యతే ప్రభవాది షష్టి సంవత్సరేషు ద్వాదశయుగాని తత్ర పితృదేవతాకం సప్తమయుగం। తత్రచ రుద్రదేవతాకద్వత్సరః॥ అస్మిన్పరజలదానం విశేషతః ఫలం॥ ఇద్వత్సరఫలం॥ స్వల్పోదకం పంచమ ముద్ధముక్తం॥ ప్లవ ఇతి తతోన్యథనో భూరితోయః॥ ఇతిచ॥ బార్హస్పత్యమానేన ఆనందనామ సంవత్సరస్య ఫలముక్తం. వరాహ సంహితాయాం। "విశ్వమస్సకల లోకనందనః"

ప్లవనామ సంవత్సర ఫలం

మేదినీ జలసంపూర్ణా సుభిక్షం ధనధాన్యదా
క్రిమిబాధాకులం సస్యం ప్లవాబ్దే వైరిణః ప్రజాః

శార్వరి స్వత్యమానాబ్ద ఫలం

ఆనంద వత్సరే సర్వే జంతవః పశవస్సదా
ఆనందయంతి చాన్యోన్యం న క్షుధాతు క్వచిత్క్వచిత్.

గురూదయాబ్ద ఫలం

శ్రావణర్క్షే క్షేమం సమ్యక్సస్యా పాకముపగచ్ఛంతి
క్షుద్రాయే పాషండాః పీడ్యంతే యేచ తద్భక్తాః

తా॥ ఈ సంవత్సరమునకు ఇద్వత్సరమనియు ప్లవయనియు పేరు. ఇందు గజకేసరీయోగము మహాఫలము. పితృదేవతాకమగు నీ సప్తమయోగమువలన వదియగు యీ ప్లవసంవత్సరము నస్వల్పముగా వర్షించుచుండును. విశేషించి వర్షములు కురియుచుండును. శుభప్రదముగ నుండును. ఈ ప్లవ సం॥ న॥ భూమి యంతయు జలసంపూర్ణముగనుండి ధనధాన్యాభివృద్ధిగలిగి సుభిక్షముగ నుండును. సస్యములకు క్రిమిబాధ కలుగుచుండును. ప్రజల కన్యోన్యము వైరము గలవారగుదురు. శార్వరి స్వత్యమానముచే నీయానందనామ సంవత్సరమున సమస్తజనులు పశువులును ఎల్లప్పుడును అన్యోన్యము ఆనందమును గలుగజేసుకొనుచుందురు. అక్కడక్కడ సుభిక్షముగనుండును. ఈ శ్రావణాబ్దమున అంతటను క్షేమము. సస్యములు బాగుగ ఫలించును. దుర్మార్గులు పాషండులును తదనుయాయులును పీడింపబడుదురు.

రాజాది నిర్ణయము

రాజా శుక్రః	గణకశ్చంద్రః	గ్రామనాయక శ్శనిః
మంత్రీ గురుః	గ్రామపాలకో గురుః	వస్త్రాధిపతిః కుజః
సేనాధిపతి ర్బుధః	దైవజ్ఞో బుధః	రత్నాధిపతి ర్గురుః
సస్యాధిపతి స్సూర్యః	రాష్ట్రాధిపతి శ్శుక్రః	వృక్షాధిపతి శ్శుక్రః
ధాన్యాధిపతి శ్శుక్రః	సర్వదేశోద్యోగాధి	జంగమాధిపతి స్సూర్యః
అర్ఘాధిపతి ర్బుధః	పతిర్గురుః	సర్పాధిపతి శ్చంద్రః
మేఘాధిపతి ర్బుధః	అశ్వాధిపతిర్గురుః	మృగాధిపతి ర్బుధః
రసాధిపతిః కుజః	గజాధిపతి స్సూర్యః	శుభాధిపతి శ్శుక్రః
నీరసాధిపతి స్సూర్యః	పశూనామధిపతి స్సూర్యః	స్త్రీణామధిపతి ర్బుధః
పురోహిత స్సూర్యః	దేవానామధిపతి స్సూర్యః	
పరీక్షక శ్శనిః	నరాధిపతి ర్బుధః	

సూర్యుడు :—సస్యాధిపతి, నీరసాధిపతియు నయ్యెను - మరియు పురోహితుడు, గజాధిపతి, పశువులకధిపతి, దేవతలకధిపతి, జంగమాధిపతియు నయ్యెను.

కుజుడు :—రసాధిపతియు మరియు వస్త్రాధిపతియు నయ్యెను.

బుధుడు :—సేనాధిపతి, అర్ఘాధిపతి, మేఘాధిపతి, మరియు దైవజ్ఞుడు, మనుష్యులకధిపతి, మృగములకు, స్త్రీలకు అధిపతి యయ్యెను.

గురుడు :—మంత్రియు మరియు, గ్రామపాలకుడు, సర్వదేశోద్యోగాధిపతి, అశ్వాధిపతి, రత్నాధిపతి కూడ నయ్యెను.

శుక్రుడు :—రాజు, ధాన్యాధిపతి, మరియు రాష్ట్రాధిపతి, వృక్షాధిపతి శుభాధిపతియు కూడనయ్యెను.

శని :—పరీక్షకుడు, గ్రామనాయకుడు, యయ్యెను.

చంద్రుడు :—గణకుడు సర్పాధిపతియయ్యెను.

ఈ వత్సరము అన్ని గ్రహములకు ఆధిపత్యము కలదు—

నవనాయక ఫలములు : రాజు శుక్రుడు—ఫలము

వేపీ కూపే మధుమధానా కామినీభిః శేగీయం శ్రవణహారిశవేణువీణం।
భోభుజ్యతేతిథి సుహృత్స్వజనైస్సహాన్నమబ్దే సితిస్యమదవస్యజయావభూపః॥

తా॥ భూమియందంతటను వసంతకాలమున ప్రియురాండ్రతో తేనెను పానము చేయుదురు. పిల్లంగ్రోవి వీణలతో గూడ ఇంపుగ గానము చేయబడును. అతిథులు మిత్రులతోగూడ అన్నమును భుజింతురు-మన్మథుని జయశ్శ్రీలు వ్యాపించును.

మంత్రి గురుడు - ఫలము

జీవేత్యమాత్యే బహుధాన్యసంపదః ప్రభూతవర్షాశ్చభవంతిలోకే।
ఫలంతివృక్షా బహుసస్యవృద్ధి ర్ధరా ప్రజా గోకుల సంకులాసదా॥

తా॥ విశేషముగ ధాన్యసంపత్తులు, అధికముగ వర్షములు కలుగును. వృక్షజాతులు ఫలించును. సస్యవృద్ధి, భూమి ప్రజలతోను గోసంఘములతోను వ్యాపించియుండును.

సేనాధిపతి బుధుడు - ఫలము

వాతాహతా వారిధరాః కదాచి ద్వర్షంతి, సస్యాని, ఫలాన్వితాని।
లోకాస్సదా పీడితకామచారా స్సైన్యాధిపత్యే శశిచంద్రజస్య॥

తా॥ మేఘములు వాయువులచే కొట్టబడును. అయినను అప్పుడప్పుడు వర్షించుచుండును. సస్యములు ఫలించును. జనులు కామపీడితులగుదురు.

సస్యాధిపతి సూర్యుడు - ఫలము

సస్యాధీశే భాస్వతి విరలానిచ సర్వసస్యాని।
అతివిపులం త్వీతిభయం కులుత్థచణకాది సంపూర్ణం.

తా॥ సమస్త సస్యములు సామాన్యముగ ఫలించును. ఈతిభయ మధికముగ నుండును. ఉలవలు, సెనగలు మొదలగునవి బాగుగ ఫలించును.

ధాన్యాధిపతి శుక్రుడు - ఫలము

అతివృష్టి స్సుభిక్షంచ ఫలితా స్సస్యజాతయః।
భవంతి నిరుజస్సర్వే శుక్రే ధాన్యాధిపే సతి॥

తా॥ అతివృష్టి, సుభిక్షము, సస్యజాతులన్నియు ఫలించును. ప్రజలు రోగములేనివారగుదురు.

అర్ఘాధిపతి బుధుడు - ఫలము

అర్ఘాధినాథే రజనీకరాత్మజే వృష్టిర్మహర్ఘ్యా సస్యాని బహూని చస్యుః।
చోరాంశ్చపాషండ జనేంద్రజాలికాః ప్రభూతయస్స్యుర్వ్రతరేవతాద్భుతాః॥

తా॥ వర్షములు, ధరలు, సస్యములు అధికముగనుండును. చోరులు పాషండులు ఇంద్రజాలికులు అభివృద్ధిగ నుందురు.

మేఘాధిపతి బుధుడు - ఫలము

గర్జితాశని పాషాణ వాతాన్వితపయోధరాః।
మధ్యదేశే మహద్వర్షం బుధే మేఘాధిపే సతి॥

తా॥ మేఘములు, ఉరుములు, పిడుగులు, వడగండ్లు, వాయువులతోను వర్షించును మధ్యదేశమున (ఆర్యావర్తము) అతివృష్టి గలుగును.

రసాధిపతి కుజుడు - ఫలము

క్షీరకాలవణం సర్పిస్తైలగుడాదయః।
యాంతి కూణ్యార్ఘ్యతాంసర్వే భౌమే యది రసాధిపే॥

తా॥ జిలకర, ఉప్పు, నెయ్యి, నువ్వులు - మాడి, బెల్లము మొదలగు రసవస్తువులకు ధర వివృద్ధిగను సుండును.

నీరసాధిపతి సూర్యుడు - ఫలము

నీరసాధిపతౌ సూర్యే తామ్రచందనరోహితే।
రక్తమాణిక్యముక్తానాం జాయతే వృద్ధిరుత్తమా॥

తా॥ రాగి, చందనము, ఎర్రని మాణిక్యములు, ముత్యములు అభివృద్ధిగనుండును.

పురోహితాద్యధిపతి — ఫలము

క్రూరగ్రహాఫలం, క్రూరం శుభగ్రహాఫలం శుభం।
పురోహితాది సర్వేషాం భవేదితి సముద్భవం॥

తా॥ పురోహితాదులు క్రూరులుచో క్రూరము, శుభులుచో శుభమును చేయును.

మేఘాది నిర్ణయము — ఫలము

వరుణనామక మేఘము—అధిక వర్షములు నైరృతిదిక్కున మేఘోత్పత్తి-చతుర్థ్యుపక్షమున పుష్కరమను మేఘము—దక్షిణదిశనుండి వర్షములు వివహానామకమనువాయువు—అనావృష్టి, అపతమను మేఘము—సువృష్టి, వివర్తమను మేఘము — స్వల్పవృష్టి, క్షీరనామకమను సముద్రము — బహు స్వల్పవృష్టి, శంఖనామక శేషుడు భూమిని వహించును. భూమియందంతటను సుభిక్షముగనుండును.

అధిక జ్యేష్ఠ శు ౪ గురు (18-5-1961) సాయన వర్షారంభః సాయన వర్షాధిపతి గురుడు — "బహుయజ్ఞోతి సస్యర్ద్ధి గో గజాశ్వహిత సదా" పురందర గురోర్వర్షే బహుసస్య ప్రదస్మృతః.

తా॥ అధికముగ యజ్ఞములు, సస్యవృద్ధి, గోవృద్ధి, గజవృద్ధి అశ్వవృద్ధి నానావిధ సస్యవృద్ధి గలుగును. శుభముగనుండును.

పశుపాలకాది నిర్ణయము — ఫలము

ఈ సంవత్సరమున శ్రీకృష్ణుడు పశుపాలకుడు-గోవ్రాపకుడును అయెను. బలరాముడు గోష్ఠ బహిష్కారకుడు అయ్యెను. శ్రీకృష్ణాధిపత్యముచే సుభిక్షము - పశువృద్ధి సస్యవృద్ధి పశువులకు క్షీరసమృద్ధియును గలుగును. బలరామాధిపత్యముచే వర్షములు సస్యములు బాగుగనుండును. గాని మధ్యదేశమున మంచి వానలు కలుగును.

వర్ష పరిమాణము

నాలుగుకుంచ (ఆఢక)ములు వర్షము—మధ్యవృష్టి "అష్టాభాగా స్సముద్రేషు పర్వతేషు తథానవ। త్రిభాగా భువిపర్జన్య స్త్వేవం వర్షతి చత్రిధా" "సముద్రములం దెనిమిదిభాగములు, పర్వతములందు తొమ్మిది భాగములు, భూమియందు మూడు భాగములు ఇట్లు వర్షించును.

అఢక ప్రమాణము — షష్టియోజన విస్తీర్ణం శతయోజనమున్నతం। ఆఢకస్య ప్రమాణంతు దేవమానేనగణ్యతే॥

అధిక స్థితి—వత్సరాది లగాయతు భాద్రపద శు ౬ అదివారపర్యం బాలగోప హస్తమందును- అది లగాయతు యీ బ ౧౩ శనివార పర్యంతం వృద్ధబ్రాహ్మణ హస్తమందును తత్ప్రభృతి పౌష బ ౧౦ బుధవార పర్యంతం తిరిగి గోపబాలుని హస్తమందును - అది మొదలు వత్సరాంతము గోపయువకుని హస్తమందును కలదు. బ్రాహ్మణ హస్తమగుచో దుర్భిక్షము-సస్యనాశనము-గోపహస్తమగుచో సుభిక్షము, ఆరోగ్యము-బాల్యమందు ధర్మ నాశనము. యౌవనమున సువృష్టి-వార్ధక్యమున సుభిక్షము.

వర్ష ధాన్యాది ప్రమాణములు (వింశోపకములు)

వర్షం ౧౯ ధాన్యం ౧౧ శీతం ౧౬ తృణం ౧౯ ఉష్ణం ౧౩ మారుతః ౬ ప్రజావృద్ధి ౧౫ నా ౫ రాజవిద్వరం ౧౧ ఉగ్రం ౫ పుణ్యం ౫ పాపః ౫ (౧౯) వ్యాధయః ౧౬ ఉపశమనం ౫ చారః ౧౬ అనాచారః ౬ మరణాని ౧౩ జన్మాని ౯ దేశోపద్రవః ౨౧ దేశస్వాస్థ్యం ౧౩ చోరభయం ౧౬ నాశః ౧౯ అగ్నిభయం ౨౧ నాశః ౬ మృగోపద్రవః ౧౩ నా ౬ కీటకభయం ౯ నా ౧౫ మూషకవృద్ధి ౧౫ నా ౬ సర్వవృద్ధి ౯ నా ౫ కామః ౧౩ లోభః ౧౬ మోహః ౧౬ మదః ౧౩ మత్సరః ౫ సుఖం ౧౧ దుఃఖం ౧౫ శోకః ౧౬ విదంబః ౧౬ మనోవ్యథా ౧౫ ద్వేషః ౧౧ ప్రతిష్ఠా ౫ అప్రతిష్ఠా ౧౫ ద్యూతః ౬ ప్రమాదః ౧౫ నరోత్పత్తిః ౫ స్త్రీజనోత్పత్తిః ౧౧ (౨౧) గోమాయువృ ౯ నా ౫ కులీరవృ ౯ నా ౧౧ మశకవృ ౬ నా ౬ మత్కుణవృద్ధి ౧౧ నా ౧౧ వృశ్చికవృద్ధి ౧౧ నా ౧౧ వ్యాఘ్రవృ ౩ నా ౬ (౧౧) సర్పవృ ౫ నా ౫ శుకవృ ౬ నా ౯ పికవృద్ధి ౯ నా ౫ కుక్కుటవృ ౯ నా ౯ (౯) భృంగవృ ౪ నా ౭ గోవృద్ధి ౭ నా ౫ మహిషవృ ౪ నా ౪ మృగవృ ౬ నా ౭ ధాన్యవృ ౪ నా ౪ అశ్వవృ ౫ నా ౪ గజవృ ౬ నా ౬ ఉష్ట్రవృ ౬ నా ౬ (౬) అండజవృ ౧౯ నా ౧౧ స్వేదజవృ ౧౯ నా ౧౫ ఉద్భిజవృద్ధి ౧౩ నా ౬ జరాయుజవృద్ధి ౧౫ నా ౧౫ స్థావరవృ ౧౧ నా ౫ జంగమవృద్ధి ౫ నా ౫ (౧౯) వ్రీహివృద్ధి ౧౪ శాలివృద్ధి ౧౬ కులుత్థవృ ౧౯ తిలవృ ౬ మాషవృ ౬ ముద్గవృ ౧౭ సర్షపవృ ౧౦ చణకవృ ౧౬ ఆఢకవృ ౧౦ గోధూమవృ ౧౯ కోద్రవృ ౧౮ ప్రియంగువృ ౧౬ యావనాళవృ ౧౯ శ్యామాకవృ ౧౯ రాజమాషవృ ౬ నీవారవృ ౧౬ కంబిధాన్యవృ ౧౭.

రవివార ఫలము

చైత్ర బ ౧౩ శు॥ అశ్వని మేషరవిః ౫౮-౩౯ చతుర్దశి వృష్టినాశనము - గురువారము అర్ఘవృద్ధి - ఉత్తరాభాద్ర సువృష్టి - ఇంద్రయోగము - ఈతిభయము వృష్టి అనావృష్టి - కన్యాలగ్నము మధ్యవృష్టి - సాయంకాలము వర్షవృద్ధి పూర్వాషాఢ దిన వశము శుభము.

ఆర్ద్రాప్రవేశము—నిజజ్యేష్ఠ శు ౯ బుధవారము ఆర్ద్రా౧ర్క్క॥ ౩౬-౩౯ అష్టమి అల్పవృష్టి, బుధవారము సౌఖ్యము, ఉత్తర ఫల్గుని అతివృష్టి వ్యతీపాత దుఃఖము బ ౩ తదియసుఖము మకరలగ్నము రోగభయము, రాత్రియందు సస్యవృద్ధి - మఘాది పంచకముగాన దుర్భిక్షము, అనావృష్టి, ప్రవేశకాలమందు చంద్రుడు శుభవీక్షిత దగుటచేతను శుక్రుడు కేంద్రమందుండుటచేతను సువృష్టియని చెప్పతగియున్నది.

చంద్రవార ఫలము

జ్యేష్ఠ శుక్ల ప్రతిపత్ సోమవారము- సుభిక్షము- క్షేమము, ఆరోగ్యము- సువృష్టి- సస్యవృద్ధి గలిగి ఆనందముగ నుండును- ఆషాఢ శుక్ల పంచమి సోమవారము- చక్కటి సువృష్టి గలుగును. ఈ శుక్లపక్షమున స్వాతీనక్షత్రము నవమితో కూడియుండెను. అధికముగ గాలివలన భూమియందు విత్తనముల పంటనివ్వదు. ఈ కృష్ణపక్షమున రోహిణి దశమితో కూడినది- గాన సర్వ సస్యములు అభివృద్ధిగ నుండును ఏకాదశితోను-కలియుటచే సస్యవృద్ధి మధ్యమము.

మరియు - చైత్రమున ౫ శనివారములు, వైశాఖమున ౫ ఆదివారములు. అధిక జ్యేష్ఠమున ౫ మంగళవారములు, శ్రావణమున ౫ శనివారములు. ౫ ఆదివారములుగూడ వచ్చెను. ఆశ్వయుజమున ౫ మంగళవారములు. మార్గశిరమున ౫ శనివారములు పౌషమున ౫ ఆదివారములు మాఘమున ౫ మంగళవారములు వచ్చెను—

శనివారము లైదగుచో జననాశము- దుర్భిక్షము- భూకంపము మొదలగు నుపద్రవములు కలుగును - ఆదివారము లైదగుచో దుర్భిక్షము - మంగళవారము లైదగుచో యుద్ధభయము కలుగును—

సార్ఘ్యములు

మేష, తుల, ధనుస్సు, కుంభమాసములయందు యావనాళ, శాలి - కుంకుమ- హింగు- కాంస్య- తైల ఎరండ గోధూమ కస్తూర్యాదులకు సమర్ఘము- ధాన్యాజ్య చణక వస్త్ర కర్పూర లవణ తామ్ర కులుత్థ లవంగ పుష్ప సీసాదులకు మహార్ఘము - సువర్ణ - రజత కార్పాస- ముద్గ - మరిచ- నాగవల్లీదళ - తిల జీర- జాజి - పిప్పలి పటవికాయస త్రిగంధ క్రముక శర్కరాదులకు అర్ఘము- వృషభ మిథున, మీనమాసములయందు యవనాళాదులకు అర్ఘము.

ధాన్యాగులకు సమార్ఘము - సువర్ణాగులకు శూన్యార్ఘము - కన్యా వృశ్చిక మకరమాసముల యందు యావనాళాదులకు శూన్యార్ఘము- ధాన్యాదుల కత్యర్ఘము- సువర్ణాదులకు సమార్ఘము.

చాంద్రార్ఘలు

చైత్ర. అధిక జ్యేష్ఠ. భాద్రపద- పౌష- ఫాల్గున మాసములయందు యావనాళాదులకు సమార్ఘము- ధాన్యాదులకు శూన్యార్ఘము. సువర్ణాదుల కత్యర్ఘము. వైశాఖ- నిజజ్యేష్ఠ- మాసములయందు యావనాళాదుల కత్యర్ఘము. ధాన్యాదులకు సమార్ఘము- సువర్ణాదులకు శూన్యార్ఘము - ఆషాఢ. శ్రావణ. ఆశ్వయుజ. కార్తిక మార్గశిర - మాఘమాసములయందు యావనాళాగులకు శూన్యార్ఘము- ధాన్యాదుల కత్యర్ఘము. సువర్ణాదులకు సమార్ఘము.

మౌఢ్య నిర్ణయము

చైత్ర బ ౫ గు॥ ప్రభృ (ది 6-4-1961) బ ౧౩ గురు పర్యం (ది 18-4-1961) శుక్రమౌఢ్యం మార్గశిర బ ౫ బుధ ప్ర॥ (ది 27-12-1961) మాఘ బ ౭ మం (ది 27-2-1961) పర్యం॥ మరల శుక్రమౌఢ్యం పౌష బ ౫ శుక్రవార ప్ర॥ (ది 26-1-1962) మాఘ బ ౬ సోమ (దివి 26-2-1962) వరకు గురుమౌఢ్యం. మిగిలిన మాసములు శుద్ధములు.

మకరసంక్రాంతి పురుష లక్షణము

అష్టకర్ణో విశాలాక్షో లంబభ్రూర్దీర్ఘ నాసిక । అష్టబాహు శ్చతుర్వక్త్రి స్సంక్రాన్తి పురుష స్మృతః॥ శతయోజన మౌన్నత్యం విస్తీర్ణం ద్వాదశస్స్మృతః। ఏవం రూపంహివిజ్ఞేయం సంక్రాన్తి పురుషాకృతేః॥



ఈ మకరసంక్రాంతి పురుషునకు ఘోర నామధేయము. శూద్రుల కరిష్టము - అగరు జల స్నానము - శుభముగను - ప్రియంగ్వక్షతధారణము- ప్రియంగు ధాన్యనాశనము - ఎర్రని వస్త్రము-యుద్ధముగను-చందనగంధము-ఆరోగ్యము- జాజిపుష్పము యశోవృద్ధి - నీలాభరణము-క్షేమము - రజతపాత్ర యందు పాయసభోజనము - రజత నాశనము, దుర్భిక్షము-కదలీఫలము-ఆరోగ్యము- వ్యాఘ్రవాహనము మృగములకు నాశనము భిండివాలాయుధం - రాజులకు అరిష్టము రక్తచ్ఛత్రము - యుద్ధము-ఖడ్గధారణము గదాయుద్ధము. దక్షిణదిగ్గమనము-ఆ దేశముల కరిష్టము-క్రోధముఖముగలచేష్ట-ప్రజలకు నాశనము నివిష్టసగుణ - సస్యవృద్ధి-పక్షఫలము - "శుక్ల పక్షే యదాకాలే మకరస్థో దివాకరః" ప్రజానాం వ్యాధిపీడాచ నృపాణాం సమరంభవేత్, శ్రీ॥మకర సంక్రాంతి శుక్లపక్షమున నగుటచే ప్రజలకు వ్యాధులు ప్రభువులకు యుద్ధభయము కలుగును. తిథ్యాదిఫలములు - నవమి ప్రభువులకు యుద్ధము - ఆదివారము దుర్భిక్షము-అశ్విని-వైశ్య హాని - సిద్ధియోగము సుభిక్షము - బాలువ సుభిక్షము-సమర్ఘ్యము పరిపూర్ణ ఫలము-20 ముహూర్తము క్షేమము-ప్రభాత కాలము-గోహానియు కలుగును.

సస్య విచారము

కాయకులవలన ఆలోచించ పూర్వసస్యముల కభివృద్ధి-సస్యజాతకరీత్యా విచారణచేయగ పూర్వసస్యములకు మంచి అభివృద్ధియు-శరత్కాల సస్యములకు సామాన్యములో మంచి అభివృద్ధి కనుబడుచున్నది-మొత్తము సర్వసస్యసముదాయమునకు ౧౩. వీసములలో ౯ వీసములు (అర్ఘా

ఆదాయ వ్యయములు

మేష వృశ్చికయోః	ఆ ౨ వ్య ౮	సింహస్య	ఆ ౧౧ వ్య ౫
వృషభ తులయోః	ఆ ౧౧ వ్య ౧౪	ధనుర్మీనయోః	ఆ ౫ వ్య ౧౪
మిథున కన్యయోః	ఆ ౧౪ వ్య ౧౧	మకర కుంభయోః	ఆ ౮ వ్య ౮
కర్కాటకస్య	ఆ ౮ వ్య ౧౧	సర్వాదాయః	౫౯ సర్వవ్యయః ౭౧

రాజపూజ్యావమానములు

మేషస్య	రా ౧ అ ౭	సింహస్య	రా ౬ అ ౩	ధనుషః	రా ౪ అ ౨
వృషభస్య	రా ౪ అ ౭	కన్యాయాః	రా ౨ అ ౬	మకరస్య	రా ౭ అ ౨
మిథునస్య	రా ౭ అ ౭	తులాయాః	రా ౫ అ ౬	కుంభస్య	రా ౩ అ ౫
కర్కాటకస్య	రా ౩ అ ౩	వృశ్చికస్య	రా ౧ అ ౨	మీనస్య	రా ౬ అ ౫

కందాయ ఫలములు

అశ్వి	భర	కృ	రో	మృగ	ఆర్ద్ర	పున	పుష్య	ఆశ్రే	మఘ	పూఫ	ఉఫ	హస్త
౭	౨	౫	౦	౩	౬	౧	౪	౭	౨	౫	౦	౩
౦	౧	౨	౦	౧	౨	౦	౧	౨	౦	౧	౨	౦
౩	౦	౨	౪	౧	౩	౦	౨	౪	౧	౩	౦	౨

చిత్ర	స్వా	విశా	అనూ	జ్యే	మూ	పూషా	ఉషా	శ్రవ	ధని	శత	పూభా	ఉభా	రే
౬	౧	౪	౭	౨	౫	౦	౩	౬	౧	౪	౭	౨	౫
౧	౨	౦	౧	౨	౦	౧	౨	౦	౧	౨	౦	౧	౨
౪	౧	౩	౦	౨	౪	౧	౩	౦	౨	౪	౧	౩	౦

మూడు కందాయములను వరుసగా నాలుగేసి మాసములకు ఫలమును తెలియజేయును. మూడింటియొక్క మొత్తము సంవత్సరపు మొత్తమును తెలియజేయును. శేషించుటచో లాభము-సరియగుటచో సమము-శూన్యమైన నష్టము-మొదట నున్న ఉన్నచో వ్యాధి-రెండులో నున్న భయము-మూడవ కందాయములో నున్న హానిని చేయును.

సంవత్సర ఫలము

అశ్విని	పుష్య	స్వాతి	అభిజిత్తు వారలకు		ఆయుర్వృద్ధి
భరణి	ఆశ్రేష	విశాఖ	శ్రవణం	,,	అర్థలాభము
కృత్తిక	మఘ	అనూరాధ	ధనిష్ఠ	,,	మనస్తాపము
రోహిణి	పూఫ	జ్యేష్ఠ	శతతా	,,	రాజపూజ్యం
మృగ	ఉఫ	మూల	పూ. భా	,,	యుద్ధభయం
ఆర్ద్ర	హస్త	పూ. షా	ఉ. భా	,,	అలంకారం
పునర్వసు	చిత్త	ఉ. షా	రేవతి	,,	రోగభయం

కుజచార ఫలము

ఈ సంవత్సరము మృగశిర లగాయతు - పూర్వాభాద్రవరకు కుజుడు సంచరించును. మృగశిర -చిత్త-విశాఖనక్షత్రములయందు సంచరించిన వర్షములు కలుగును. ఆర్ద్ర-ఆశ్రేష-మఘ పూఫ-ఉత్తర-స్వాతి-జ్యేష్ఠ - మూల - ఉత్తరాషాఢ శ్రవణములయందు కుజసంచారము అనావృష్టిని చేయును-మరియు మాఘ బ ౧ నాడు శ్రవణ నక్షత్రమందుండి ఉదయించుటచే ఉదయానంతరము సుభిక్షముగనుండును.

బుధచార ఫలము

1 వైశాఖ బ 30 ఆ. రోహిణియందు బుధునకు పశ్చాదుదయము - 2 నిజజ్యేష్ఠ బ ౮ బు ఆర్ద్రయందు ప్రాగుదయము 3 శ్రావణ బ ౫ బు. ఉత్తర ఫల్గునియందు పశ్చాగుదయము 4 అశ్వ

... ... యందు ప్ర ... ... ఉత్తరాషాఢ
శ్రవణములయందు పశ్చాదుదయము - మాఘ శు 2 ఆదివారమున శ్రవణమందు ప్రాగుదయము
ఈ మాసములయం దుదయించుటచే చోరభయము శస్త్రభయము అగ్నిభయము కలుగును. రోగ
భయము-జలభయము అతివృష్టియుకూడ కలుగును. ఎప్పుడైన బుధోదయానంతరము ఏదేని విపరీత
ఫలములు కలుగును-వర్షమున్న - అనావృష్టి. అనావృష్టియున్న వర్షము-సుభిక్షమున్న-దుర్భి
క్షము దుర్భిక్షమున్న సుభిక్షము. భయమున్న క్షేమము క్షేమమున్న భయము కలుగును. ఉత్పా
తములేని బుధదర్శనము కాదని నిశ్చయము 1-5-6 బుధదర్శనములవలన అనావృష్టి-వ్యాధి-భయము
కల్గును 2 వ దర్శనమువలన ఎండవేడిమవులచే వాపీకూప తటాకములు శుష్కించును - 3 దర్శనము
వలన సమస్త ప్రాణికోటియొక్క ధాతువులకు అమయ బాధకలుగును. 4-వ దర్శనములవలన మను
ష్యులకు సుభిక్షము ఆరోగ్యము కలుగును.

గురుచారము—ఫలము

వత్సరాది లగాయతు మాఘ బ 14 వరకు మకరరాశియందు. అది లగాయతు ఆ
వత్సరాం తంవరకు కుంభరాశియందు గురుసంచారము గావున॥ కుంభ రాశియందు సంచరించు కాలమున-
మేఘములు- చెరువుబావులు చెరువులు నిండునట్లధికముగ వర్షము కలుగును. దేవాధారులక
స్థావర జంగములకు ఆనందము కలుగును. కుంభరాశియందు సంచరించు కాలమున సమస్త
భూపాలకులు వైరము లేనివారగుదురు పాపాత్ములకు- కళింగ- గౌడ- దేశవాసులకు పీడకలుగును.
భూమి పుష్పములతోను ఫలములతోను నిండియుండును. ఉత్తర సస్యముల అభివృద్ధియు
కలుగును. చాల ప్రకృతి సౌందర్యము కలుగును.

శుక్రచారము—ఫలము

ఈ సంవత్సర చైత్ర బ 14 గురువాసరమున అశ్వినీ నక్షత్రమందు మధ్యమ మార్గమందున్న
గోవీధియందు పశ్చిమదిక్కున అస్తమించి బ 13 గురువారం- రేవతి నక్షత్రమందు ఆ మార్గ
విధులయందే తూర్పుదిశను ఉదయించెను- తిరిగి మార్గశిర బ 14 బుధవాసరమున మూల నక్షత్ర
మందు దక్షిణ మార్గమందున్న మృగవీధియందు తూర్పుదిక్కున అస్తమించి మాఘ బ 2 మంగళ
వారమున మధ్యమ మార్గమందున్న గోవీధియందు పశ్చిమదిశయం దుదయించెను॥ఫలము॥శుక్రుడు
మధ్యవీధులయం దుదయాస్తమయముల నొందుటచే మధ్యమఫలము నొసంగును- గోవీధియందు
సస్యములకును గోవులుగల వారలకును హాని. మృగవీధియందు మృగములకు వ్యాధి సస్యములకును
తపస్వులకును రోగములు జనించును. కృష్ణపక్షమం దుదయాస్తమయములు గలుగు వలన వీను
ములకును- గుర్రములకును రాజపుత్రులకును వృద్ధిని గలుగజేయును. షష్ఠ్యాది పక్షమంటలయం
దుదయాస్తమయములు గలుగుటవలన విశేషగమనము తోనే, రోగములతో అధికముగ ధాన్య
ము లతోను వ్యాపించియుండును. ఒక్కొక్కచోట భయము కలిగియుండును. జ్యేష్ఠాది
మండలమం దస్తమించుటవలన కాశ్మీర- అశ్మక- నర్మదా- చారు దేశీయులకు సజ్జయినివాసు
లకు వరిషములు సంభవించును.

శనిచారము—ఫలము

వత్సరాది ప్రభృతి. భాద్రపద శు 2 ఆదివార పర్యంతం మకరరాశియందు అటుతర్వాత
బ 13 శనివార పర్యంతం ధనూరాశియందు తిరుపటి వత్సరాంతము తిరిగి మకరరాశియందు
సంచారము వత్సరాది లగాయతు పౌష బ 10 బుధవార పర్యంతం ఉత్తరాషాఢా నక్షత్రమందు
అది లగాయతు ఆ వత్సరము శ్రవణ నక్షత్రమందును శని సంచారము. ఫలము- మకరరాశియం
దుండునపుడు శత్రువులవలన భయము. ధరలు తగ్గుట- అధికవర్షములు కలుగును. దశార్ణ దేశము
యవనులకు పురోహితులకు- బ్రాహ్మణులకు- వైద్యులకు హానిచేయును. ధనూరాశియం
దుండునపుడు. అనావృష్టి భూపాలకులకు కలహములు- ధర అధికముగుట పాంచాల- కాశీ-
కురు- కోసల- కాశ్మీర- కళింగ వంగదేశములకు హానిగలుగును. ఉత్తరాషాఢయం దుండు
నపుడు దశార్ణదేశములు యవనులు, ఉజ్జయిని- శబరులు, పారియాత్ర పర్వతవాసులు, కుంతి
భోజులును పీడింపబడుదురు. శ్రవణనక్షత్రమం దుండునపుడు రాజ్యశేషులకును- బ్రాహ్మణ
శ్రేష్ఠులకు వైద్యులకు ... ... కలింగదేశవాసులకు అరిష్టము సంభవించును. ధనిష్ఠానక్ష
త్రములయందు సంచారము మధ్యమముగ నుండును.

కూర్మచక్రముచే ఘూర్జర- మరుదేశ సారస్వత- జాలంధరం మొదలగు వాయవ్యదేశముల
కరిష్టము.

దేశారిష్ట యోగములు

1 శార్వరి సంవత్సర భాద్రపద బ 3 శు ప్ర॥ ప్లవ సంవత్సర వైశాఖ శు 2 శ-ప మిథున
మందు కుజ స్తంభ దోషము- రాజును- రాజ్యమును నశింపచేయును.

2. వత్సరాది ప్ర. భాద్రపద శు 2 ఆ॥ పర్యం॥ మకరరాశియందు శనిసంచారము వంగ,
అంగ కళింగ- కాశ్మీర- గౌడసౌరాష్ట్ర దేశములయందు హానిచేయును.

3. వైశాఖ శు 2 శ ప్ర॥ నిజజ్యేష్ఠ శు 8 శ॥ ప॥ కుజ గురు శనులకు సమసప్తక స్థితి
అయోధ్య లంకా పట్టణముల మధ్యదేశములయందు దుర్భిక్షము-శస్త్రభయమును కలుగును.

4 అధిక జ్యేష్ఠ శు 10 గు ప్ర॥ నిజజ్యేష్ఠ శు 1 బు॥ ప॥ గురు శని గ్రహద్వయ వక్రం
రెండుగ్రహము లొకమారు వక్రించినచో ప్రభువులకు సంతోషము కలుగును.

5. నిజజ్యేష్ఠ శు 1 బు ప్ర. బ 11 శ. ప. బుధ- గురు-శనిగ్రహత్రయ వక్రం॥ 3 గ్రహము
లొకమారు వక్రించిన యుద్ధభయము- అనావృష్టిభయము కలుగును.

6. నిజజ్యేష్ఠ శు 8 శ. ప్ర. ఆషాఢ బ 10 ఆ. ప. కుజరాహుయుతి- అంగవంగ కళింగ
దేశములయందు సస్యహాని- భూకంపము- ప్రభువులకు యుద్ధములును సంభవించును.

7 నిజజ్యేష్ఠ బ 11 శ. ప్ర. భాద్రపద శు 14 శ. ప. గురు శనిగ్రహద్వయ వక్రం
(4 యో.మా)

8. ఆషాఢ శు 3 ఆ ప్ర. శ్రావణ శు 14 బు॥ప॥రవి శుక్రౌ శని రవోర్వాప్ర సమసప్తక రాశి
స్థితి అనావృష్టిభయము.

9 శ్రావణ శు 15 బు ప్ర. భాద్రపద శు 7 సో. ప. గురు శుక్రులకు సమసప్తకస్థితి ప్రజ
లకు జలమువలనను, అగ్నివలనను, రోగములవలనను- శస్త్రముల వలనను, చోరులవలనను- సర్ప
ముల వలనను రాజుల వలనను భయమును గలుగజేయుదురు.

10. భాద్రపద శు 2 ఆ. ప్ర. బ 13 శ. ప. ధనూరాశౌ శని సంచారః (2 యో.మా)

11 భాద్రపద శు 2 ఆ. ప్ర. బ 3 బు-ప ధనూరాశౌ శనివక్రం॥ భూమియందు గుర్ర
ములు- ఏనుగులు-మనుష్యులు రోగములు మొదలవంతు మిగులును.

12 భాద్రపద శు 2 ఆ ప్ర. శు 11 గు ప. ధనుస్సునందున్న శనికి కుజదృష్టి ఫలము-
దుర్భిక్షము శస్త్రభయము రోగములు చోరభయమున్ను కలుగును.

13. భాద్రపద శు 13 ప్ర. వ్యావత్సరము మకరరాశియందు శనిసంచారము (2వ యో.మా)

14. భాద్రపద శు 10 బు ప్ర. పౌష శు 15 ప కాల సర్పయోగము- సస్యములకు ప్రభు
వులకు నష్టముచేయును.

15. ఆశ్వయుజ బ 2 సో ప్ర॥వ్యావత్సరం శనికేతువులకు ఏకరాశిస్థితి॥ చోరుల వలనను,
భటుల వలనను, అగ్నివలనను మరణములు గలుగును. దేశక్షోభము - ప్రభుమరణము సస్యనాశన
మున్ను కలుగును.

16. మార్గశీర్ష బ 15 బు. ప్ర॥ పౌష శు 7 శనివారపర్యంతం మకరమందు- బుధ- గురు
శనికేతువులు- సామంతరాజులకు ఎడతెగని విరోధము కలుగును.

17. పౌ ష. శు 7 శని. ప్ర. శు 11 మం. ప మకరమందు బుధ గురు-శుక్ర శని కేతువుల
పంచగ్రహ కూటమువలన సమస్తరాజులకు హాని.

18. పౌ ష. శు 11 మం. ప్ర బ 3 బు. ప మకరమందు రవి- బుధ-గురు- శుక్ర శనికేత
వుల - షడ్గ్రహకూటము సమస్తదేశములకు హాని.

19 పౌ ష. బ 3 బు ప్ర. మాఘ శు 14 శు. ప మకరే రవి. కుజ. బుధ- గురు- శుక్ర. శని
కేతవః ఈ సప్తగ్రహకూటము సమస్త లోకములకు హాని.

20 పౌ ష బ ౧౪ శ రాది దినత్రయమునందు చం ద్రునితో కూడుకుని మకరమం దష్టగ్రహ కూటము- నిర్మాణమ్మును జేయును.

21 పౌ ష బ 3 బు ప్ర॥ మాఘ ౧౨ బు ప కుజశనోర్వ్యే కరాశ్యాంశ యుతిః॥ గాలివలన- అగ్నివలన- శ(స్త్ర)ు వలన భయము కలుగును.

22. మాఘ శు ౫ స్ప్ర ౮ సో పర్యం నకరమందు షడ్గ్రహకూటము (18 యో మా)

23 మాఘ శు ౮ సో. ప్ర బ ౫ శ మకరకుజ- బుధ- గురు- శని- కేతు పంచగ్రహ కూటము (17 యో మా.)

24 మాఘ శు ౮ మం ప్ర బ 3౦ మంప శని కుజ మధ్యే బుధః॥ అనావృష్టి భయము యుద్ధభయము కలుగును. చతుర్గ్రహ-పంచగ్రహ- షడ్గ్రహ- సప్తగ్రహ- అష్టగ్రహ కూటముల ప్రారంభించి- విడిపోవుటకు 2½ మాసములు పైగా పట్టినది- అందు నిరయనమానమునే మకరము సాయనమానముచే కుంభములోను సంభవించినవి-శనిక్షేత్రమున వ్యాధిభయమని గ్రంథప్రమాణం

శు భ ము హూ ర్త ము లు

(2) ఈ నెంబరులేని ముహూర్తములు ప్రశస్తములు

